బిల్వమంగళ లీలాశుకుని

శ్రీకృష్ణకర్ణామృతము

మల్లంపల్లి శరభయ్య

YRKA106B162

శ్రీకృష్ణకర్ణామృతము

శ్లో. అంసాలంబిత వామకుండల భరం, మందోన్నత భ్రూలతం,
కించిత్కుంచిత కోమలాధర పుటం, సాచిప్రసారేక్షణమ్ ।
ఆలోలాంగుళి పల్లవైర్మురళికా మాపూరయంతం ముదా,
మూలే కల్పతరో, స్త్రిభంగి లలితం, జానే, జగన్మోహనమ్ ॥

వేణువు నూదుతున్న శ్రీకృష్ణుణ్ణి కల్పవృక్షం మూలలో ఉన్నట్లు తెలుసు కుంటున్నాను. ఆ మురళీకృష్ణుడు ఎలా ఉన్నాడంటే -

ఎడమప్రక్కగా తల వంచడంచేత ఆ ప్రక్కనున్న చెవి పోగు మూపుపై ఆనింది.

ఒక కనుబొమ వంగింది; మరొక కనుబొమ పొడవుగా ఉంది.

కొంచెం ముడిచిన మృదువైన పెదవులు కలవాడు. (పిల్లనగ్రోవిని ఊదేటప్పుడు మృదువైన పెదవులు కొంచెం ముడిచాడు).

చూపులు అడ్డంగా వ్యాపిస్తున్నాయి. (తల కొంతవంచి ఒక ప్రక్కకు వాల్చి, వేణువును ఊదేటప్పుడు, చూపులు అడ్డంగా నిగుడుతున్నాయి).

చలిస్తున్న (అంటే మురళిపై రంధ్రాల మీదుగా సంచరిస్తున్న) చిగుళ్ళవంటి వ్రేళ్ళచేత వేణువును సంతోషంతో పూరిస్తున్నాడు.

మూడువంపుల (త్రిభంగి) చేత సుందరమైనవాడు. (పాదాల నుండి కటివరకు ఒక వంపు; కటినుండి మెడవరకు ఒక వంపు; తల ఒక వంపు).

జగన్మోహనుడు (లోకాలను మోహింపజేసేవాడు).

శ్రీ హిమవద్ వేణుగోపాలస్వామి
గోపాలస్వామికొండ (గుండ్లుపేట - మైసూరు జిల్లా)

బిల్వమంగళ లీలాశుకయోగీంద్ర విరచిత

శ్రీకృష్ణకర్ణామృతము

తెలుఁగు టీకాతాత్పర్య సహితము

వ్యాఖ్యాత

శ్రీ మల్లంపల్లి శరభేశ్వర శర్మ

సంపాదకుడు

ఆచార్య తంగిరాల వేంకట సుబ్బారావు

శ్రీరస

శ్రీ కృష్ణ దేవరాయ రసజ్ఞ సమాఖ్య

బెంగుళూరు

SRI KRISHNA KARNAMRUTHAMU (Sanskrit Slokas) - written by Bilvamangala Leelasuka (11th c.a.d.) with Telugu commentary by Sri Mallampalli Sarabheswara Sarma and edited by Prof. Tangirala Venkata Subba Rao.

First Edition : 25th August, 1997 (Sri Krishna Janmashtami)

Copies : 1000

Price : **Rs. 200.00**

© : **Prof. T.V. SUBBA RAO**

Cover Page : **Sri 'BAPU' (Madras)**

Published by : **Prof. TANGIRALA VENKATA SUBBA RAO**
' SRI. RA.SA.'
Sri Krishnadevaraya Rasajna Samakhya
No. 40/12-7, 'Saurabha' (upstairs)
22nd Cross, Govindaraja Nagar,
Vijayanagar, Bangalore - 560 040.

Sole Distributers : **M/s. VISALAANDHRA PUBLISHING HOUSE**
4-1-435, 'Vignana Bhavan'
Bank Street, Hyderabad-500 001.

Copies can be had from : **M/s VISALAANDHRA BOOK HOUSE**
Hyderabad, Vijayawada, Guntur,
Anantapur, Hanamkonda, Turupati,
Kakinada & Visakhapatnam.

D.T.P : **SRI DATTA SAI GRAPHICS**
'Sri Vani' 1-8-702/105, Nallakunta,
Hyderabad - 500 044
Ph : 7633275

Printing : **PRINTEK PRINTERS**
Magadi Main Road,
Basaveswara Nagar,
Bangalore - 560 079.
Phone: 3357763

అంకితం

సరసులు

సహృదయులు

సాహిత్య రసికులు

వదాన్య శేఖరులు

అయిన

శ్రీ బి.వి.యస్.యస్. మణి గారికి

(శ్రీ బులుసు వేంకట సూర్యసుబ్రహ్మణ్యం గారికి)

సప్తతి మహోత్సవ సందర్భంగా

ఆయురారోగ్య సంపత్పరంపరాభివృద్ధిని కాంక్షిస్తూ...

- తంగిరాల వెంకటసుబ్బారావు

25-10-1997

వెన్నెల మీసాల బ్రహ్మతేజస్సు

పాత్రులు
నిత్యాగ్నిహోత్రులు
'వేదాలు పోసిన గాదెలు'
'అవిరళ జపహోమ తత్పరులు'
'వివిధాధ్వర నిర్మల ధర్మ కర్మ దీక్షాపరతంత్రులు'
ఉభయ గోదావరీ నివాసులు
'బులుసు' వంశ విద్వాంసులు!

కృష్ణవేణీ తరంగిణీ తీరవాసులు
తీర్థసంవాసులు
శ్రీ 'కౌతా' వారు వదాన్యశేఖరులు
కవిపండిత పోషకులు
శ్రీకృష్ణ పరమాత్మ పాదారవింద భ్రమరాయమాణులు
దశదిశా పరివ్యాప్త కీర్తికిరణ నభోమణులు!

ఈరెండు క్షీరసాగరాల జలసంధిలో
ఉదయించిన శరత్కాల శీతమయూఖుడు
శ్రీ బి.వి.యస్.యస్. మణి
సుబ్రహ్మణి
విద్వన్మణి
రసజ్ఞతాఖని
కవిపండిత చింతామణి
రమణీమణి 'లలితారత్న' ఘృణి!

ఈ 'మద్రాసుమణి'
'బులుసు' వారి పౌత్రుడు
'కౌతా' వారి దౌహిత్రుడు
'ప్రేమేశ్వరీ-రామలింగేశ్వరు'ల పుత్రుడు
సకలజగన్మిత్రుడు
సంతత వేదధర్మ పరిరక్షణ క్షాత్రుడు!

సంస్కృతాంధ్ర సాహిత్య రసజ్ఞుడు
సాంకేతిక వాణిజ్య విద్యాప్రాజ్ఞుడు
సమస్త జ్ఞాన సమన్వయ సవ్యసాచి
ప్రాచ్యశిఖ
పాశ్చాత్య 'క్రాపు'
చిరునవ్వుల వెన్నెల మీసాలలో
చిక్కుకున్న బ్రహ్మతేజస్సు!
ఏకాంత విశ్రాంత ప్రశాంత సరస్సు!
శరన్నవరాత్రుల కనకదుర్గ సన్నిధిని
వేదపండిత సదస్సు!
అజ్ఞానాంధకారానికి
దేదీప్యమాన ఉషస్సు!!

వేదాలను పోలిన
నలుగురు పుత్రికల
సన్నజాజి పందిరులు
'లక్ష్మీ, భువనేశ్వరీ, మాధవీ,

త్రిపురసుందరులు';
అశ్వనీ దేవతలకు చాలిన
ఇద్దరు పుత్రులు -
'కృష్ణకిశోర - రామలింగేశ్వరులు'.
వసంతంలో
విరబూచిన
నందనవనంలా
వైశాఖంలో
ఫలభారంతో
వంగిన రసాలంలా
సిరిసంపదలతో తూలదూగే
ఈ చల్లని సంసారాన్ని
బిల్వమంగళ లీలాశుని
బాలకృష్ణతేజస్సు
సదా రక్షించుగాక!
ఆయురారోగ్య
సంపత్పరంపరాభివృద్ధిని
ప్రసాదించుగాక!!

- తంగిరాల సుబ్బారావు

మద్రాసు మణి

మణిగల దుపేంద్రునురమున,
మణిగల దల స్వర్గమందు, మహిఁగలవెన్నో
మణు లవి రాళ్లను రప్పలు
మణియన మద్రాసులోని "మణి" యే నయ్యా!

పదిమంది నొక మంచిపనిచేయఁదలపోయ
నుత్సాహమిచ్చి ముందుండువాడు
తెలిసియైనను లేక తెలియకైనను నేరి
కపకారమును చేయనట్టివాఁడు
ఈ చేయి యిచ్చిన దాచేయి యెఱుఁగని
యట్లు దానము లిచ్చునట్టివాఁడు
కవులను రప్పించి కమనీయ కవిత లా
లించి మేలెంచి పాలించువాఁడు

పుడమి నెవ్వాఁడటంచును పొడుపుకథలు
వేసికొనుచును "మణి" యంచు విప్పుకొనుచు
చెప్పికొనుచుందు రింటింట చెన్నపురిని
ఆంధ్ర జనయిత్రి పూర్వపుణ్యమ్ము గూర్చి.

- దుగ్గిరాల రామారావు.

సుబ్రహ్మణ్య మణిగారు

దక్షిణోత్తర ధ్రువాల వంటి ఆర్షధర్మ పరాయణత వ్యాపార దక్షత ఒకచోట కలియడం విడ్డూరంగా తోచవచ్చు. కాని యీ రెంటినీ తనలో జీర్ణించుకున్న విశిష్టులు శ్రీ బి.వి.యస్.యస్.మణిగారు. వేదాధ్యయనంలోను యజ్ఞనిర్వహణలోను తనకు తానే సాటిగా ప్రసిద్ధికెక్కిన బులుసు పాపయ్యశాస్త్రిగారికి అయిదవ తరంవారైన మణిగారు ఈ అద్భుతాన్ని సాధించడం ఒక వింత కాదు. 'బులుసులేని యజ్ఞమా!' అన్నది ఆనాటి జనశ్రుతి! జనశ్రుతి సత్యసూక్తి.

మణిగారు విజయవాడలో 1927లో ప్రభవించారు. సంస్కృతాంధ్ర పండితులు. మెకానికల్ ఇంజినీరింగ్, వాణిజ్య విషయాలు మొదలైన వాటిలో సుశిక్షితులు, ఇండియన్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ కంపెనీ నిర్వాహక డైరెక్టరుగా 11 యేండ్లు పనిచేశారు. మరికొన్ని కంపెనీలతోను ఆయనకి సన్నిహిత సంబంధమున్నది. స్వధర్మ స్వారాజ్య సంఘ సంచాలకులుగా ఉన్నారు. హిందూస్తాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (మదరాసు), టమిల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మొదలైన ప్రసిద్ధ వాణిజ్య సంస్థలకు ఆయన సన్నిహితులు. రోటరీ క్లబ్, కాస్మొపాలిటన్ క్లబ్ మొదలైన వాటిలో సభ్యులు. మదరాసు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాలలో శ్రీ వైష్ణవ, అద్వైత పీఠాలకు భూరివిరాళాలు సమర్పించారు. రామేశ్వరం, వారణాసి మొదలైన చోట్ల కుటీరాల నిర్మాణం, కూచిపూడి, అమలాపురం మొదలైన ఊళ్లలో ఆలయగోపుర నిర్మాణం వంటి ధర్మకార్యాలు నిర్వర్తించారు. వేదపండితులనేకాక సంస్కృతాంధ్ర పండితుల గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయం చేశారు. ప్రచార వాంఛలేకుండ దానధర్మాలు కావించిన సహృదయులు. చెన్నపురి ఆంధ్ర మహాసభ, శ్రీకృష్ణ గానసభ వంటి సాంస్కృతిక సాహిత్య

సంస్థలకు కొంత కాలం అధ్యక్షులుగానో ఉపాధ్యక్షులుగానో వ్యవహరించారు. ఇలా వ్రాసుకుంటూ వస్తే, ఒక గ్రంథం తయారవుతుంది.

ఆర్ష మనిన ఎంత ఆదర భావమో
యంత్రవిద్య అనిన అంత ప్రీతి
భేదబుద్ధి లేక ఆదరింతువు నీవు
నీ విశాలదృష్టి నీకె తగును.

హిత మిత వచనుండు, వితరణశీలుండు,
పైకి కానరాని పండితుండు,
సుగుణభూషణుండు, సూరిజనుల మణి
శ్రీ మణి చెలిమి యగు నోముపంట!

- చల్లా రాధాకృష్ణ శర్మ

శిఖి పింఛం

(అనుక్రమణిక)

1. కృతజ్ఞతలు xv

2. పీఠిక : సువర్ణచషకం (శ్రీకృష్ణకర్ణామృత వైశిష్ట్యం)
- తంగిరాల వెంకట సుబ్బారావు xxi

3. శ్రీకృష్ణకర్ణామృతము - ప్రథమాశ్వాసము - మల్లంపల్లి శరభయ్య 1

4. శ్రీకృష్ణకర్ణామృతము - ద్వితీయాశ్వాసము - మల్లంపల్లి శరభయ్య 82

5. శ్రీకృష్ణకర్ణామృతము - తృతీయాశ్వాసము - మల్లంపల్లి శరభయ్య 164

6. అనుబంధము - 1
అమృతచ్ఛందస్సు - ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య 235

7. అనుబంధము - 2
శ్రీకృష్ణునిజీవితము - కీ.శే. చర్ల గణపతిశాస్త్రిగారు 263

8. అనుబంధము - 3
శ్రీహిమవద్-గోపాలస్వామికొండ (స్థలపురాణం)
- వై. సి. భానుమతి (డా॥ దివాకర్ల రాజేశ్వరి) 285

9. అనుబంధము - 4
కీ.శే. కౌతా సూర్యనారాయణరావుగారు (1877-1964) 295

10. అనుబంధము - 5
స్వధర్మ స్వారాజ్య సంఘము 297

11. అనుబంధము - 6
శ్రీ బి.వి.యస్.యస్. మణిగారి జీవనరేఖలు 301

శ్రీకృష్ణ శ్శరణం మమ

బిల్వమంగళ లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృత దివ్యకావ్యాన్ని తెలుగు టీకాతాత్పర్యాలతో ప్రచురించటానికి ధన సహాయం చేసిన మహానుభావులు:-

1. స్వధర్మ స్వారాజ్య సంఘం, మద్రాసు రూ. 20,000=00

2. శ్రీహిమవద్ గోపాలస్వామి టెంపుల్ ట్రస్ట్, బెంగుళూరు రూ. 10,000=00

3. శ్రీమతి వి. బాలాత్రిపురసుందరి
   W/o కీ.శే. వి. నారాయణరావు,ఐ.ఏ.ఎస్.,
   హైదరాబాదు రూ. 5,000=00

4. శ్రీ జి. పుల్లారెడ్డి (నేతి మిఠాయి వ్యాపారం),
   హైదరాబాదు రూ. 5,000=00

5. తంగిరాల బ్రదర్స్ అండ్ సిస్టర్స్,
   (చిరంజీవులు: కాళి, రాము, సీత, శీను, శశి),
   బెంగుళూరు రూ. 5,000=00

6. డా॥ కె. ఆశాజ్యోతి, డా॥ కె. జనార్దనం దంపతులు,
   బెంగుళూరు రూ. 2,000=00

This book is published with the financial assistance of Sri Tirmula Tirupathi Devasthanams, Tirupathi, A.P., under the Scheme "Aid to Religious Books".

'దానకర్ణుడు'

శ్రీ దళవాయి కృష్ణస్వామి ఆదికేశవులుగారు

బెంగుళూరు

దళవాయి దానకర్ణుడు

ఎవ్వాడు 'రుక్మిణీ' -- 'కృష్ణము నాయక'
పున్నెంపు పంటయౌ ముద్దుబిడ్డ!
ఎవ్వాడు 'సత్యప్రభే' శ్వరి మానస
సరసిలో విహరించు జాతిహంస
ఎవ్వాడు 'కల్ప' 'తేజేశ్వరి' 'శ్రీనివాస్'
ఘనులను గన్న బంగారు తండ్రి!
ఎవ్వాడు శ్రీ వేంకటేశ్వర స్వామికి
అంకితమైన భక్తాగ్రగణ్యు
డతడు శృంగేరి కంచి పీఠాధిపులకు
సాయిబాబాకు భక్తుడు! సన్నిహితుడు!
కీర్తికెక్కిన 'దళవాయి కృష్ణసామి
ఆదికేశవు' లాతడు త్యాగమూర్తి!!

-తంగిరాల సుబ్బారావు

కృతజ్ఞతలు

నాకోరికను మన్నించి ఎంతో ఓర్పుతో ఈ శ్రీకృష్ణకర్ణామృతానికి తెలుగులో అర్థతాత్పర్యాలు రచించిన మాన్యమిత్రులు శివశ్రీ మల్లంపల్లి శరభయ్యగారికి మిక్కిలి కృతజ్ఞుణ్ణి. 'పూర్వం రచించిన వ్యాఖ్యలు ఎన్నో ఉండగా మళ్ళీ ఈ వ్యాఖ్య ఎందుకు?' అంటే, 'మరల ఇదేల రామాయణంబన్నచో' అన్న విశ్వనాథవారి సమాధానమే నా సమాధానం. శ్రీ కృష్ణకర్ణామృతాన్ని రచించిన బిల్వమంగళ లీలాశుకుడు నిత్యం పంచాక్షరీ మంత్రాన్ని జపించే పరమశైవుడు. అందువల్ల ఒక వీరశైవునిచేత కృష్ణకర్ణామృతానికి వ్యాఖ్య వ్రాయించడం అత్యంత సమంజసంగా ఉంటుందని నేను భావించాను. పైగా ఆయన ఇంతకు పూర్వమే శ్రీకృష్ణుని గురించి ఒక గొప్ప శతకాన్ని రచించి ఉన్నారు. అంతేకాదు, ఆంధ్రదేశంలో ఈనాడు సంస్కృతాంధ్రాలు క్షుణ్ణంగా చదువుకుని, స్వతహా కవియై విమర్శకుడు కూడా అయిన పండితులలో శ్రీశరభయ్యగారు 'కనిష్ఠికాధిష్ఠితులు'. అందువల్ల ఆయన పాండిత్యాన్ని ఉపయోగించుకోవాలనే కోరిక కూడా ఈ వ్యాఖ్య వ్రాయించడానికి గల ముఖ్య కారణాలలో ఒకటి.

శరభయ్యగారి కేవలం 13 ఏండ్ల బాలుడుగా ఉన్నప్పుడే శ్రీముట్నూరి కృష్ణారావుగారి భార్య శ్రీమతి రుక్మిణమ్మగారి ప్రోత్సాహంతో శ్రీకృష్ణకర్ణామృతాన్ని మొట్టమొదటిసారిగా చదివి తన్మయులైపోయారట. ఆ తన్మయత్వంలో వాల్మీకి వ్యాస కాళిదాసాది మహాకవుల్ని కూడా మరిచిపోయారట. ఎంతో ప్రయత్నంమీద మళ్ళీ మామూలు మనిషి అయ్యారట. ఇప్పుడు ఆయన వృద్ధాప్యంలో, బాల్యంలోనే ఆయన్ని పరవశుణ్ణి చేసిన ఉత్తమ కావ్యానికి వ్యాఖ్య వ్రాయించాను నేను.

శరభయ్యగారి వ్యాఖ్యను గురించి ఒక మాట - వీరి వ్యాఖ్యానశైలి తత్సమ పదబహుళంగా సరళంగా సులభగ్రాహ్యంగా కొనసాగింది. పూర్వవ్యాఖ్యాతలు మిశ్రశైలిని, దేశిశైలిని పాటించారు. తెలుగువారు తత్సమశైలినే ఆదరిస్తారు; అర్థం చేసుకుంటారు. (ఉదాహరణ: నన్నయ, శ్రీనాథుడు, పోతన, పెద్దనల కావ్యాలు). మిశ్రశైలి కొంతవరకూ పరవాలేదు. దేశిశైలి మాత్రం తెలుగువారికి అర్థంకాదు. తెలుగువాడు తిక్కన కవిత్వం సులభంగా గ్రహించలేక పోవడానికి గల ముఖ్యకారణం ఆయన అచ్చతెలుగు శైలే. కాబట్టి మల్లంపల్లి వారి తత్సమశైలిని పాఠకులు సులభంగా అవగాహన చేసుకోగలరని నేను భావిస్తున్నాను.

మల్లంపల్లి వారు తమ వ్యాఖ్యానంలో అనేక సందర్భాలలో ఎన్నో నూతన విషయాలను ఆవిష్కరించారు. 'కరారవిందేన పదారవిందం....' (2-58) అనే సామాన్య శ్లోకంలో సృష్టి స్థితి లయల సంకేతాలను చూపించడం. 'అనన్యభక్తి' (2-99)ని అపూర్వంగా నిర్వచించడం, 'కస్తూరీ తిలకం లలాటఫలకే...' (2-109) అనే ప్రసిద్ధ శ్లోకంలో 'కలయన్' అనే పదానికి 'ధరించుచు' 'తాల్చుచు' అనే చప్పిడి అర్థాలు వ్రాయకుండా 'అందగింపజేయుచు' అనే విశిష్టమైన అర్థాన్ని వ్రాసి, తాత్పర్యంలో '(వివిధ ఆభరణాలను) తాను తాల్చుటచేత వానికి ఒక వినూత్న శోభను గలిగించుచు' అని వివరించడం - ఇత్యాది సందర్భాలలో పాఠకులు గమనింపగలరు.

పూర్వ వ్యాఖ్యానాలను ఎక్కువగా సంప్రదించకుండా కేవలం తన పాండిత్య ప్రకర్షతో మల్లంపల్లి వారు ఈ వ్యాఖ్యానాన్ని సృష్టించారు. అందువల్ల కొన్ని ప్రసిద్ధ సన్నివేశాలలో ఈ వ్యాఖ్యానానికి పూర్వవ్యాఖ్యానాలకీ భేదం కనపడుతుంది. ఈ భేదం మరీ ఇబ్బందిగా ఉన్న సందర్భాలలో నేను కొంత సమన్వయం చేయడానికి ప్రయత్నించాను.

శరభయ్యగారు సాంసారికమైన అనేక కష్టాలలో ఉండి కూడా ఈ వ్యాఖ్యానాన్ని సకాలంలో పూర్తిచేశారు. ముఖ్యంగా తృతీయాశ్వాసం వ్రాసేటప్పుడు వారి మనస్సుకు ప్రశాంతత తక్కువయింది. అయినా పట్టుదలతో, నామీది వాత్సల్యంతో, నా ఒత్తిడిని తట్టుకొని పని పూర్తిచేశారు. త్వరగా వ్యాఖ్య పూర్తిచేసే హడావిడిలో వారు కొన్నిచోట్ల అన్వయాలు, అర్థాలు వ్రాయలేదు; మరికొన్నిచోట్ల తాత్పర్యాలు వ్రాయలేదు; ఇంకాకొన్నిచోట్ల అర్థతాత్పర్యాలు రెండూ వ్రాయలేదు (ఆయా శ్లోకాలు లీలాశుకుని రచన కాదని వారు అభిప్రాయపడడమే దీనికి కారణం). గ్రంథానికి ఒక సమగ్రతను సాధించడంకోసం నేను ఆయా సందర్భాలలో ఇతరవ్యాఖ్యానాలు ఆధారంగా చేసికొని ఆ ఖాళీల ను పూర్తిచేశాను. ఇలా నేను పూర్తి చేసిన అన్వయాలు, అర్థాలు, తాత్పర్యాలు పాఠకులకు ప్రత్యేకంగా తెలియడం కోసం కుండలీకరణాలలో ఉంచాను.

ఒక ముఖ్య విషయం - తృతీయాశ్వాసంలో "జిహానం జిహానం సుజానేన మౌగ్ధ్యం" అనే 68వ శ్లోకానికి అర్థం కుదరలేదు, శరభయ్యగారు దీనికి వ్యాఖ్య వ్రాయలేదు. పూర్వవ్యాఖ్యాతలు వ్రాసిన అర్థాలు సరిగాలేవని శరభయ్యగారు అభిప్రాయపడ్డారు. 'జిహానం' అనే పదం ఎలా ఏర్పడిందో ఇతర పండితులను అడిగి కనుక్కోవలసిందిగా నన్ను

ఆదేశించారు. నేను బెంగుళూరులో ఉన్న గొప్ప సంస్కృత విద్వాంసులైన శ్రీరంగనాథశర్మగారనే వయోవృద్ధుణ్ణి (80 సం.లు) కలిసి చర్చించాను. వారు ఈ క్రింది విధంగా సెలవిచ్చారు:

"త్యాగార్థక 'హా' ధాతువు పరస్మైపది. దీనికి తాచ్ఛీల్యార్థంలో 'చానశ్' ప్రత్యయం వస్తుంది. అప్పుడు 'జిహానం' అనే రూపం ఏర్పడుతుంది. దీనికి 'వదలిపోవు' అని అర్థం. వ్యాకరణరీత్యా పరస్మైపదం అయిన ఈ 'జిహానం' శబ్దాన్ని లీలాశుకుడు ఆత్మనేపదంగా ప్రయోగించాడు. అందువల్ల అయోమయం ఏర్పడింది. కాబట్టి, 'జిహానం జిహానం సుజానేన మౌగ్ధ్యం' అంటే 'నీ బాల్య సౌందర్యం వదలి పోయిందని నేను తెలుసుకోవడం లేదు' అని అర్థం. (నీవు యౌవనంలో ప్రవేశించినా నీబాల్య సౌందర్యం ఇంకా మిగిలే ఉంది అని భావం)"

లీలాశుకుని కవితా వైశిష్ట్యాన్ని పాఠకులు సులభంగా గ్రహించడంకోసం 'సువర్ణచషకం' పేరుతో ఒక విపులమైన పీఠిక వ్రాశాను నేను. ఈ పీఠిక వ్రాయడంలో నాకు కలిగిన అనేక సందేహాలను శరభయ్యగారు తీర్చారు. వీరికి మిక్కిలి ఋణపడిఉన్నాను. అలాగే కర్ణామృతంలోని ఛందస్సుల వైవిధ్యాన్ని సౌందర్యాన్ని తెలుసుకోవడంకోసం 'అమృతచ్ఛందస్సు' అనే పేరుతో ఆచార్య కోవెల సంపత్కుమారాచార్యగారి చేత ఒక చక్కని వ్యాసాన్ని వ్రాయించి అనుబంధంగా చేర్చాను. వీరికి మిక్కిలి కృతజ్ఞుణ్ణి. మొత్తం శ్రీకృష్ణ భగవానుని దివ్యచరిత్రను అవగాహన చేసుకోవడం ముఖ్యమని భావించి కీ.శే. చర్ల గణపతి శాస్త్రిగారు తాను అనువదించిన 'తెనుగు గీత'లో పీఠికగా ఇచ్చిన 'శ్రీకృష్ణుని జీవితము'ను కూడా అనుబంధంగా ఇచ్చాను. స్వధర్మ స్వారాజ్య సంస్థ పరంగా ఈ కావ్య ముద్రణకోసం రూ.20,000=00 దానంచేసిన శ్రీ బి.వి.యస్.యస్. మణిగారి జీవనరేఖలతో పాటు వారి మాతామహులైన కీ.శే. కౌతా సూర్యనారాయణరావుగారి జీవిత చరిత్ర, వారు స్థాపించిన స్వధర్మ స్వారాజ్య సంస్థ చరిత్ర కూడా అనుబంధాలుగా ఇచ్చాను.

శ్రీహిమవద్ గోపాలస్వామి టెంపుల్ ట్రస్టు (బెంగుళూరు-గుండ్లుపేట) మేనేజింగ్ ట్రస్టీ అయిన ప్రియమిత్రులు శ్రీ కె.ఎం. శ్రీనివాసమూర్తి గారు తమ ట్రస్టు పరంగా ఈ పవిత్ర కావ్యముద్రణకు రూ 10,000/-ల ధన సహాయం చేశారు. శ్రీహిమవద్ గోపాలస్వామి ఫోటోలను ప్రచురించుకునేందుకు అనుమతించారు. ఈ దేవాలయ వివరాలు తెలిపే చిన్న అనుబంధం కూడా ఈ కావ్యంలో చేర్చాను.

బిల్వమంగళ లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృతాన్ని తెలుగు టీకాతాత్పర్యాలతో ప్రచురించాలనే నా చిరకాల వాంఛ సఫలీకృతం కావడానికి ఈ క్రింది మహానుభావుల సహాయ సహకారాలు - ప్రధానంగా ధనసహాయం ముఖ్యకారణం :-

1. శ్రీమతి లలితారత్నం, శ్రీ బి.వి.యస్.యస్. మణి దంపతులు, మద్రాసు.
2. శ్రీమతి తేజేశ్వరి, శ్రీ కె.ఎం. శ్రీనివాసమూర్తి దంపతులు, బెంగుళూరు.
3. శ్రీమతి లలితాంబిక, శ్రీ పి.యస్.వి. అనంతనారాయణ దంపతులు, బెంగుళూరు.
4. శ్రీ జి. పుల్లారెడ్డి (నేతి మిఠాయి వ్యాపారం), హైదరాబాదు.
5. తంగిరాల బ్రదర్స్ అండ్ సిస్టర్స్ (మా చిరంజీవులు), బెంగుళూరు.
6. డా॥ కె. ఆశాజ్యోతి, డా॥ కె. జనార్దనం దంపతులు, బెంగుళూరు.

నా యిష్టదైవం శ్రీకృష్ణపరమాత్మ. నేను ఎన్నోఏండ్లుగా నిరంతరం ఆయన్ని ధ్యానిస్తున్నాను. మద్రాసు ట్రిప్లికేన్‌లో వేంచేసియున్న శ్రీపార్థసారథిస్వామివారు శ్రీ బి.వి.యస్. యస్. మణిగారి ద్వారాను, మైసూరుజిల్లా గుండ్లుపేట దగ్గర కమలాచలంపై వేంచేసియున్న శ్రీ హిమవద్ వేణు గోపాలస్వామి శ్రీ కె.ఎం. శ్రీనివాసమూర్తిగారి ద్వారాను నాకు ధన సహాయాన్ని అందించారని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను.

కోరిన వెంటనే, తమకు ఎన్నో పనులు ఉన్నప్పటికీ, ఈ పుస్తకానికి అందమైన ముఖచిత్రం వ్రాసి ఇచ్చినవారు ప్రముఖ చలన చిత్రదర్శకులు, 'కళాప్రపూర్ణ' శ్రీ బాపుగారు (మద్రాసు). డి.టి.పి. చేసిన వారు శ్రీ దత్తసాయి గ్రాఫిక్సు, హైదరాబాదు. ముద్రించిన వారు శ్రీప్రింటెక్ ప్రింటర్స్, బెంగుళూరు.

- ఈ అందరినీ బిల్వమంగళ లీలాశుకుని బాలకృష్ణదేవుడు ఆయురారోగ్య సంపత్పరంపరాభివృద్ధిని ప్రసాదించి రక్షించుగాక!

"సౌరభ"
బెంగుళూరు
25-8-1997 (శ్రీకృష్ణ జన్మాష్టమి) **- తంగిరాల వెంకట సుబ్బారావు**

వ్యాఖ్యాత

శివశ్రీ మల్లంపల్లి శరభేశ్వర శర్మగారు

తిరుపతి

సుహృల్లేఖ

మాన్యమిత్రులు శ్రీమల్లంపల్లి శరభయ్యగారుకూడా "జిహానం జిహానం సుజానేన మౌగ్ధ్యం" (3-68) అనే ఈ శ్లోకార్థాన్ని గురించి ఆలోచిస్తూనే ఉన్నారు. ఇటీవల (ఆగష్టు 1997లో) శ్రీ శరభయ్యగారు కాశీవెళ్ళి నెలరోజులు ఉండివచ్చారు. వారు కాశీలో ఉండగానే నేను బెంగుళూరులో ఉన్న శ్రీ రంగనాథశర్మగారితో చేసిన చర్చను గురించి వారికి తెలియజేశాను. కాశీనుంచి తిరుపతికి తిరిగివచ్చాక 28-10-1997 నాడు శరభయ్యగారు నాకు ఒక లేక వ్రాస్తూ ఈ క్లిష్టమైన శ్లోకాన్ని గురించి యిలా తెలియజేశారు :-

"ఆ శ్రీకృష్ణకర్ణామృత శ్లోకార్థానికి మీరు చేసిన ప్రయత్నం చాలా ఆనందాన్ని కలిగించింది. "జిహానం జిహానం" అది గమనార్థక ధాతువే. అందుకనే ఆత్మనేపదం. త్యాగార్థకం కాదు. "ఓహాక్" కాదు; "ఓహాఙ్" అనే. "సుజానేన" కాదు; "సుజాతేన" అనే పాఠం. "సుజాతేన వపుషా మౌగ్ధ్యం జిహానం జిహానం" అని అన్వయం. "మిక్కిలి సౌందర్యమును పొందుచున్నవానిని" - "మంచి పుట్టువుగల నెమ్మేనితో మిక్కిలి అందమును పొందుచున్న" - "మహానంద స్వరూపము". రెండవ పాదంలో "వేణునాదేన" (తృతీయ); మూడవపాదంలో "అపాంగైః" (తృతీయ); మొదటిపాదంలో "సుజాతేన" (తృతీయ). ఈ విధంగా ప్రక్రమం సరిపోతున్నది. "సుజానే" క్రియాపదం కాదు. క్రియాపదానికి ముందు ఉపసర్గ ఉండదు. "న" అనే అక్షరం అన్వయం కుదరకుండా చిక్కుపెట్టింది. "సుజాతేన వపుషా మౌగ్ధ్యం జిహానం జిహానం"; వీప్స. "అత్యంతం గచ్ఛంతం". ఆరీతిగానే "లిహానం లిహానం", "దుహానం దుహానం" అనేవి కూడా వీప్సలే. ఇప్పుడు నల్లుల బాధ తీరి మనస్సు ఎంతో హాయిగా ఉన్నది. (పద్యంలోకాని శ్లోకంలోకాని అర్థం విషయంలో అన్వయంలో అనుమానంవస్తే నల్లుల మంచంపై పడుకున్నట్లుగా ఉంటుందని శరభయ్యగారు తరచుగా అంటూ ఉంటారు). మీశ్రద్ధకు చాలా ఆనందం కలిగింది. మిగిలిన వ్యాఖ్య అంతా ఒక ఎత్తు, ఇదొక్కటీ ఒక ఎత్తు. మీకు ఎన్నివేల ఆశీస్సులో చెప్పలేను".

మీ

శరభయ్య

ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు

పీఠిక :

సువర్ణచషకం

(శ్రీకృష్ణకర్ణామృత వైశిష్ట్యము)

- ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు

'శ్రీకృష్ణకర్ణామృతం' అతి ప్రసిద్ధమైన మిక్కిలి జనప్రియమైన మధురాతిమధురమైన సంస్కృత కావ్యం. దీనిని క్రీ.శ. 11వ శతాబ్దానికి చెందిన 'లీలాశుకుడు' లేక 'కృష్ణలీలాశుకుడు' లేక 'బిల్వమంగళుడు' అనే మహాకవి రచించాడు. నిత్యం శ్రీకృష్ణ భక్తిరస తరంగిణిలో ఓలలాడే ఈ కవి రచించిన ఈ దివ్యకావ్యంలోని ప్రతిశ్లోకమూ శ్రోతల కర్ణాలకు అమృతప్రాయంగా ఉంటుంది కాబట్టి ఇది 'శ్రీకృష్ణకర్ణామృతం'. 'లీలాశుకం' అంటే 'విలాసపు చిలుక'. శ్రీకృష్ణుని కీర్తి ఒక పూలగుత్తిలాంటిది. ఆ పూలగుత్తిని ఆశ్రయించుకొని ఈ చిలుక కూర్చుంది - ఆ పూలగుత్తి ఎప్పుడు పండుగా మారుతుందా, ఎప్పుడు తిందామా అని ఎదురు చూస్తోంది ఈ విలాసపు చిలుక. ఆ పూలగుత్తిని అందుకుందామని ఎగురుతోంది. ఇలా మోక్షాన్ని కాంక్షించి శ్రీకృష్ణుని ధ్యానిస్తున్న ఈ కవి 'లీలాశుకుడు' అయ్యాడు. ఇతడు మూర్తీభవించిన కృష్ణభక్తి కాబట్టి, ఇతనిని 'కృష్ణ లీలాశుకుడు' అని పిలవడం కూడా కద్దు. ఇతనికి 'బిల్వ మంగళుడు' అనే మరోపేరు కూడా ఉంది. ఇతని యింటిలో మంగళకరమైన ఒక బిల్వవృక్షం (మారేడుచెట్టు) ఉండేది కాబట్టి ఇతనికి 'బిల్వ మంగళుడు' అనే పేరు వచ్చిందని చెపుతారు ఓద్రులు.

కవి దేశకాలాదులు :-

లీలాశుకుని తల్లిదండ్రులు నీవీదేవి (నీలీదేవి) - దామోదరుడు. ఇతని విద్యాగురువు 'తంత్రపద్ధతి' గ్రంథకర్తయైన 'ఈశానదేవుడు'. భాగవతవ్యాఖ్యాన కర్తయైన 'రాఘవేశానయతి' లీలాశుకుని మిత్రుడు. (ఇతనికి 'కీర్తి' అనే చెల్లెలు కూడా ఉందనీ, వీరు కవలపిల్లలనీ మానవల్లివారు వ్రాశారు). దక్షిణ కైలాసమని ప్రసిద్ధి కెక్కిన శ్వేతారణ్యక్షేత్రంలో వెలసిన

మృత్యుంజయస్వామికి లీలాశుకుడు భక్తుడు. (తాను పంచాక్షరీ మంత్రాన్ని జపించే మహాశివభక్తుడనని శ్రీకృష్ణకర్ణామృతంలో లీలాశుకుడు స్పష్టంగా చెప్పుకొన్నాడు). కేరళలో మలబారు ప్రాంతంలో 'భారతీ' నదీ తీరంలో ఈనాడు 'ముక్కుత్తలై' గా ఉన్న 'ముక్తిస్థలం' లీలాశుకుని జన్మస్థలం అని కొందరు చెపుతారు. ఆంధ్రదేశంలోని కృష్ణానదీ తీరంలో (శ్రీకాకుళంలో) నివసించాడని మరికొందరు భావిస్తున్నారు.

మహర్షిగా మారిన లీలాశుకునకు 'బిల్వమంగళుడు' అనే పేరు ప్రసిద్ధిలోకి వచ్చింది. ఇతడు 'తిరుచ్చూరు'లో 'నాతువిలే మఠం' అనే ఒక మఠాన్ని స్థాపించాడు. ఈ మఠాధిపతులందరికీ 'బిల్వమంగళ' అనేపేరు ప్రసిద్ధంగా ఉంటుంది. ఈ లీలాశుక బిల్వమంగళుని గురించి 'సంప్రదాయ కులదీపిక' అనే గ్రంథంలో ఇలా ఉంది:-

"బిల్వమంగళ - అను పేరుగల భక్తులు కొందఱు ఉండిరి. వారిలోనొకడు తమిళ దేశమునందు, మఱియొకడు వారణాసియందు, మూడవ బిల్వమంగళుడు ఒరిస్సాదేశమునందు నుండిరి. బిల్వమంగళుడు నూట ఎనిమిది శ్లోకములుగల ఒక స్తోత్రమును రచించెను. ఈ బిల్వమంగళ నామధేయు లందఱును విష్ణుభక్తులుగా నుండిరి. కాశిలో జన్మించిన బిల్వమంగళుడు మొదటి జన్మములో 'మాధవ నలుడు' అను పేరుతోను, రెండవ జన్మములో 'బిల్వాణుడు' అను పేరుతోను, మూడవ జన్మములో 'బిల్వమంగళ' నామముతోను, నాల్గవ జన్మములో గీత గోవింద గ్రంథకర్తయగు 'జయదేవ' నామముతోను ప్రసిద్ధుడయ్యెను. విష్ణుభక్తిని ప్రచారము చేయుచున్న బిల్వమంగళునకు శిష్యులు అనేకులుండిరి".

దీనిని బట్టి లీలాశుకుడు క్రీ.శ. 11వ శతాబ్ది వాడని తెలుస్తోంది. కొందరు ఇతనిని 12వ శతాబ్దివాడుగా భావిస్తున్నారు. కాని ఈతని శ్లోకాలు 12వ శతాబ్దినుండి సూక్తిసంగ్రహ గ్రంథాలలో సంగ్రహింపబడుతూవచ్చాయి. క్రీ.శ. 1206 నాటి శ్రీధరదాసు తన 'సదుక్తి కర్ణామృతం'లో లీలాశుక బిల్వమంగళుని శ్లోకాలు గ్రహించాడు. కాబట్టి ఇతడు 1206కి ముందువాడే. క్రీ.శ. 1150-1250 మధ్యకాలంలో లీలాశుకుడు జీవించి ఉంటాడు. లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియం లైబ్రరీలో బిల్వ మంగళునిపేరుతో 'సుమంగళస్తోత్రం' అనేవ్రాతప్రతి ఉంది. దాని చివర ఒక శ్లోకం ఉంది:

"యం, శైవాః సముపాసతే శివ ఇతి, బ్రహ్మేతి వేదాంతినో,
బౌద్ధా బుద్ధ ఇతి, ప్రమాణ పటవః, కర్తేతి నై యాయికాః ।

అర్హన్నిత్య థ జైన శాసన రతాః, కర్మేతి మీ మాంసకాః,
సోzయం, నో విదధాతు, వాంఛిత ఫలం, శ్రీదేవకీనందనః ॥ ”

ఈ శ్లోకం బేలూరు చెన్నకేశవాలయ మండపంలో చెక్కబడింది. ఆ దేవాలయాన్ని క్రీ.శ. 12 వ శతాబ్దిలో హొయసల విష్ణు వర్ధనుడు నిర్మించాడు. ఇదే శ్లోకం 'హనుమన్నాటకం' (1-3)లో కూడా కనిపిస్తుంది. ఆ నాటకం 11వ శతాబ్దంలో భోజుని కాలంలో సంగ్రహించినది. ఈ సాక్ష్యాలన్నీ ఈ కవిని 11-12 శతాబ్దాల వాడుగానే నిరూపిస్తున్నాయి. కీథ్ అనే సాహిత్యా చరిత్రకారుడు లీలాశుకుణ్ణి క్రీ.శ. 11వ శతాబ్ది వాడుగా నిర్ణయించాడు.

'బిల్వమంగళ' శబ్దం లీలాశుకుని ఇంటి పేరని శ్రీముట్నూరి సంగమేశంగారు భావిస్తున్నారు. అసలు ఈ కవి పేరేమిటో సరిగా తెలియడం లేదు. 'లీలాశుకుడు' అనేది కవి తానుగా పెట్టుకున్న పేరో, లేక గురువుగారు పెట్టిన పేరో తెలియడం లేదు. మొదటిపేరు బిల్వమంగళుడనీ, తరువాత వచ్చినపేరు లీలాశుకుడనీ కొందరు అంటారు. 'బిల్వమంగళ' అనే పేరునే లీలాశుకుని శిష్యుడు దుర్గాప్రసాదయతి “కోదండమంగళ” అనీ “చాప మంగళ” అనీ వ్రాశాడు. 'కోదండ' 'చాప' అనే శబ్దాలు మలయాళంలోని “విల్వ” శబ్దానికి పర్యాయపదాలనీ, 'విల్వ మంగళ' అనే పేరే క్రమంగా 'బిల్వమంగళ'గా మారిందనీ ('వబయోరభేదః') మానవల్లి రామకృష్ణ కవిగారు వ్రాశారు. ఈ బిల్వమంగళ లీలాశుకుడు కేరళదేశానికి చెందినవాడని కూడా మానవల్లివారు ఊహించారు. కాని ఇతడు ఆంధ్రుడని చెప్పడానికి చాలా ఆధారాలున్నాయి.

శ్రీకృష్ణ కర్ణామృతానికి వ్యాఖ్యవ్రాసిన కృష్ణదాస్ కవిరాజుగారి వ్యాఖ్యలో లీలాశుకుణ్ణి గురించి “శ్రీకృష్ణవేణ్యాః పశ్చిమ తీరవాసీ, పండితకవిః బిల్వమంగళ నామాకశ్చిద్బ్రాహ్మణః” అనే పంక్తులున్నాయి. ఎస్.కె.డే గారు ఈ కవి బాల్యంలోనే సన్యసించి, కృష్ణాప్రాంతంలో వేదాద్రి అనేచోట నివసించినట్లుగా ఇతిహ్యముందని వ్రాశారు. అమరావతి, శ్రీకాకుళం మొదలైన కృష్ణానదీ తీరభూములు లీలాశుకుని నివాసభూములుగా పరంపరగా వచ్చేకథలు చెపుతున్నాయి. శ్రీకృష్ణచైతన్య ప్రభువుల వారికి శ్రీకృష్ణకర్ణామృతప్రతి కృష్ణానదీ తీరంలోనే లభించిందని 'చైతన్యచరితామృతం' అనేగ్రంథం సాక్ష్యమిస్తోంది. మొట్టమొదటిసారిగా కృష్ణకర్ణామృతానికి వెలసిన వ్యాఖ్యలు, అనువాదాలు అన్నీ ఆంధ్రులు వ్రాసినవే; ఆంధ్రదేశంలో బహుళ ప్రచారం పొందినవే. ఈ కృష్ణకర్ణామృతానికి ఆంధ్రదేశంలో తప్ప ఇతర ప్రాంతాలలో అంతగా ప్రచారంలేదు. బెంగాలులో చైతన్యులవారి ద్వారానే

ప్రచారానికి వచ్చింది. - అదికూడా ప్రథమాశ్వాసం మాత్రమే. (చైతన్యప్రభువునకు లభించినది ఈ ఒక్క ఆశ్వాసం మాత్రమే). దీనికి అక్కడ మూడువ్యాఖ్యలు, ఒక అనువాదం వెలిశాయి. ఈ చైతన్యునికి ముందు రెండువందల ఏళ్లలోగా ఆంధ్రదేశంలో కర్ణామృతానికి రెండువ్యాఖ్యలు, ఒక పద్యానువాదం వచ్చాయి. ఈ ప్రథమ వ్యాఖ్యాతలైన పిసుపాటి యల్లయసూరి, పాలంకి బ్రహ్మభట్టు ఆంధ్రులు. 15-16 శతాబ్దాలనాటి వెలగపూడి వెంగయామాత్యుడు వేంకటేశ్వరాంకితంగా తెలుగు పద్యానువాదం చేశాడు. (రావుల పురుషోత్తమకవి, వీరవల్లి వెంకన్న అనే కవులు కూడా శ్రీకృష్ణకర్ణామృతాన్ని అనువదించారు. కాని ఈ కవుల కాలం సరిగా తెలియదు. 19వ శతాబ్దంలో కాని, 20 వ శతాబ్ది ప్రారంభంలోకాని వారు ఉండి ఉండవచ్చు). చైతన్యుని కాలంనాటి వ్యాఖ్యాతలలో మొదటివాడు గోపాలభట్టు కూడా దాక్షిణాత్యుడు - ఆంధ్రుడు. లీలాశుకుని ఇంటిపేరు 'బిల్వమంగళ' అయినట్లయితే - ఇది కూడా అతని ఆంధ్రత్వాన్నే నిరూపిస్తోంది. ఇంటిపేర్లు ఆంధ్రులకు మాత్రమే ఉంటాయి; ఆంధ్రేతరులలో ఉండవు. లీలాశుకుని కవిత్వంలో తరచుగా దొర్లే యతిప్రాసలు అక్షరరమ్యత, శబ్దాలంకారాలు, అనుప్రాసలు, అంత్యప్రాసలు, కావ్యాన్ని సర్గలుగా కాకుండా ఆశ్వాసాలుగా విభజించడం - ఇత్యాదులన్నీ ఇతడు ఆంధ్రుడనడానికి ప్రబల నిదర్శనాలుగా ఉన్నాయి. (సంస్కృతంలో యతిప్రాసలు లేవు. పెక్కు ఇతరభాషలలోనూ లేవు. తెలుగు మధురమైన భాషగా ప్రసిద్ధి చెందటానికి ఈ యతిప్రాసల బిగింపే కారణం కావచ్చు). లీలాశుకుడు సన్యాసాశ్రమాన్ని స్వీకరించిన తర్వాత దేశంలో అనేక ప్రాంతాలకు వెళ్లి ఉండవచ్చును. కేరళలోని ముక్తీశ్వరపీఠానికి ఇతడు గురువు కూడా అయి ఉండవచ్చును. (ఆంధ్రులెందరో శృంగేరీ, ద్వారక వగైరా శంకరపీఠాలను అలంకరించారు కదా!). ఆ పీఠాధిపతి అయినంత మాత్రాన ఇతడు కేరళీయుడు కానక్కరలేదు. ఇతడు గంగా బృందావన ప్రాంతాలలోను, పండరీక్షేత్రంలోను, పూరీ జగన్నాథంలోనూ సంచరించాడని తెలుస్తోంది.

జనశ్రుతి :-

బిల్వమంగళుడు కృష్ణభక్తుడుగా మారటానికి జనశ్రుతిలో ఒక ప్రసిద్ధ కథ ఉంది. మొదట బిల్వమంగళుడికి 'చింతామణి' అనే ఒక ఉంపుడు కత్తె ఉండేది. ఆమె చాలా నిష్ఠాపరురాలు. కృష్ణభక్తురాలు. ఒక రోజు ఆమె తండ్రి శ్రాద్ధదినం వచ్చింది. ఆ రోజు బిల్వమంగళుడు తనను చూడటానికి ఆమె అంగీకరించలేదు. కాని బిల్వమంగళుడు

ఆమెపై అత్యంతప్రేమగలవాడు. ఆమెను చూడకుండా ఒక్క క్షణమైనా ఉండలేడు. ఆ శ్రాద్ధం నాటి అర్ధరాత్రివేళ అతడు ఆమెయింటి గోడకు వ్రేలాడుచుండిన సర్పంతోకను పట్టుకొని మేడపైకి ప్రాకుతూఉంటే, ఆ సర్పం ఆతణ్ణి కరిచింది. అతడు స్మృతి తప్పినేలమీద పడ్డాడు. అది చూచి చింతామణి వెంటనే వచ్చి అతనికి ఉపచారం చేసింది. అతనికి విషం దిగిపోయింది. అప్పుడు చింతామణి అతి వికృతమైన వేషంతో అతని ఎదుట నిలిచి, ఇటువంటి తుచ్ఛమైన శరీరంపై గ్రుడ్డి ప్రేమతో జీవితాన్ని వ్యర్థం చేసికోవద్దు. ఈ నీ ప్రగాఢమైన ప్రేమను శ్రీకృష్ణునిపై నిలుపుకో" అని అతనిని కృష్ణభక్తిని ఉపదేశించింది. దీనితో బిల్వమంగళుడికి జ్ఞానోదయమయింది. అక్కడినుండి పోయి 'సోమగిరి' అనే గురువును ఆశ్రయించి, ఆ గురువునుండి శ్రీకృష్ణమంత్రోపదేశాన్ని పొంది, ఒక మునీశ్వరుడుగా మారిపోయాడు. శ్రీకృష్ణునిపై వందలాది శ్లోకాలు అల్లాడు. ఆ కృష్ణభక్తి శ్లోకాలను శిష్యులు గ్రహించి భద్రపరిచారు. తరువాత కొన్నాళ్లకు బిల్వమంగళుడు బృందావనక్షేత్రంలో తనభౌతిక దేహాన్ని విడిచిపెట్టాడు.

ఈ జనప్రియమైన బిల్వమంగళుని కథను ఆధారంగా చేసికొని, కీ.శే. కాళ్లకూరి నారాయణరావుగారు, వేశ్యావృత్తిని నిర్మూలించే సాంఘిక ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని తెలుగులో "చింతామణి" అనే గొప్ప రంగస్థల నాటకాన్ని రచించారు. చింతామణి, బిల్వమంగళులే ఇందులో నాయికా నాయకులు. ఇది మిక్కిలి జనరంజకమైన సాంఘిక నాటకం. ఇది ఈనాటికీ ఆంధ్రదేశమంతటా ప్రదర్శింపబడుతూఉంది. యోగివేమనను గురించీ, తులసీదాసును గురించీ, కూడా ఇటువంటి కథలే వ్యాప్తిలో ఉన్నాయి. మొదట రక్తిలో పడి, తెలివి వచ్చి, విరక్తిలోకి మారడం ఈ కథల మూలాంశం (motif). అందుకే "కామిగాక మోక్షగామికాడు" అన్నాడు వేమన.

మహాకవి - మహాపండితుడు :-

లీలాశుకుడు కేవలం కవిమాత్రమేకాడు, వ్యాకరణంలోనూ వేదాంతంలోనూ గొప్పపండితుడుకూడా. అతడు పాణిని అష్టాధ్యాయికి వ్యాఖ్యవ్రాశాడు.భోజుని సరస్వతీ కంఠాభరణానికి వ్యాఖ్యానం వ్రాశాడు. 'పురుషకారం' అనే వేదాంత గ్రంథాన్ని రచించాడు. అతడు వ్రాసిన మరికొన్ని గ్రంథాలు:

1. త్రిభువన
2. కర్కోటక స్తుతి
3. రామచంద్ర స్తుతి
4. అభవ స్తుతి

5. కృష్ణ స్తుతి
6. విశ్వాధిక స్తుతి
7. సుమంగళ స్తోత్రము
8. కృష్ణ చరితము
9. కృష్ణ బాలక్రీడ
10. అభినవ కౌస్తుభమాల
11. క్రమదీపిక
12. శంకర హృదయాంగణము
13. బృందావన స్తుతి (రాసక్రీడను శ్లోకాలలో అభివర్ణించాడు)
14. కాలవధ (మార్కండేయుని కథను శ్రీకృష్ణుడు గోపికలకు చెప్పినట్టుగా)
15. శ్రీకృష్ణ కర్ణామృతము.

ఈ గ్రంథాలన్నింటిలోను లీలాశుకునకు బ్రహ్మాండమైన కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన కావ్యం శ్రీకృష్ణ కర్ణామృతం మాత్రమే. దీంట్లో కవితా సౌందర్యం అత్యున్నతంగా ఉంది. ఇది శ్రీకృష్ణుని జీవిత గాథా విశేషాలను గానం చేసింది. నటకులిందులోని భావాలను అభినయిస్తూ నాట్యం చేస్తారు; గాయకులు గానం చేస్తారు; భక్తులు భజనచేస్తారు; శాస్త్రజ్ఞులు తత్త్వరహస్యాలను తెలుసుకుంటారు. వీరందరికీ అనుకూలమైన శ్లోకాలు ఇందులో ఉన్నాయి. దీనిని ప్రతిదినం భక్తితో పారాయణం చేసేవారు కూడా ఉన్నారు. లీలాశుకుని శ్రీకృష్ణ కర్ణామృత కవితా వైశిష్ట్యాన్ని గురించి ప్రసిద్ధ విమర్శకులు శ్రీ ముట్నూరి సంగమేశంగారు ఇలా అంటున్నారు:-

"ఇతడు భావుకుడైన కవి. కోమలార్ద్ర నవనీత సదృశమితని హృదయం. సరస మధుధారా స్నిగ్ధమైన వచోగుంభన మితని ఫణితి. జయదేవునివలె 'యది హరిస్మరణే సరసం మనో, యది విలాస కలాసు కుతూహలం' అని యితడనడు. కృష్ణ లీలా విలాసమే యితని కవితా విలాసం. 'వేణువాది ముఖేందునా' వినిర్గతామృత శీతల వచోవిన్యాస మితని కవిత. లీలారస ఫలాస్వాదన లోలుడైన యీ కవికి లీలాశుకనామ మన్వర్థాభిధానం. 'శ్రీకృష్ణపరమభావావిష్టః పరమభాగవతో లీలాశుకాభిదానః కవీంద్ర!' అనీ, 'లీలాశుకవ ద్వర్తమానేన లీలాశుకేన' అనీ, 'గురుణా లీలాశుక ఇతిఖ్యాపితోఽభూత్' అనీ వ్యాఖ్యాత లితనిని గూర్చి వ్రాసిన వ్యాక్యాలు అక్షరశః సత్యవచనాలు. లీలా భావనలోగాని, వాటిని

మనఃఫలకముపైన ప్రత్యక్షం చేసికొని, దర్శించి, తన్మయుడై వర్ణించి పాడుకొనుటలోగాని, యితని కితడే సాటి. అప్రయత్నముగా అనుప్రాసరసమై భావానుకూలంగా వెలువడే పద గుంఫన మితని కవితకు సహజాలంకారం". ('శ్రీకృష్ణకర్ణామృతము' సాహిత్యసమితి వ్యాసావళి, తిరుపతి, 1972, పుట 148).

శ్రీకృష్ణకర్ణామృతము - రెండుపాఠాలు :-

లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృతానికి రెండుపాఠాలున్నాయి. దాక్షిణాత్యపాఠం, వంగీయపాఠం. దాక్షిణాత్య పాఠంలో మూడు ఆశ్వాసాలున్నాయి. మొదటి ఆశ్వాసంలో 107 శ్లోకాలు, రెండవ ఆశ్వాసంలో 110 శ్లోకాలు, మూడవ ఆశ్వాసంలో 102 శ్లోకాలు - మొత్తం 319 శ్లోకాలున్నాయి. ఈ దాక్షిణాత్యపాఠానికి పిసుపాటి యల్లయసూరి అనే ఆంధ్రపండితుడు 'సువర్ణ చషకం' అనే వ్యాఖ్య వ్రాశాడు. ఇతడు మల్లినాథసూరికి తరువాత 14వ శతాబ్దంలో ఉన్నవాడు. మరొక పండితుడు 'కర్ణానంద ప్రకాశని' అనే వ్యాఖ్య వ్రాశాడు. పాలంకి బ్రహ్మభట్టు, గోపాలుడు, బృందావన దాసుడు, శంకరుడు, ఆవంచ చంద్రుడు - అనేవారు రచించిన వ్యాఖ్యలు కూడా వున్నాయి. ఇతర వ్యాఖ్యలు కూడా ఎన్నో ఉన్నాయి. కాని ఆ వ్యాఖ్యాతల పేర్లు తెలియడం లేదు. కర్ణామృతాన్ని తెలుగులో వెలగపూడి వేంగ నామాత్యుడు (15 లేదా 16వ శతాబ్ది) వృత్తపద్యాలలో అనువదించాడు. రావులపురుషోత్తమకవి, వీరవల్లి వెంకన్న అనే మరొక యిద్దరు కవులు కూడా శ్రీకృష్ణకర్ణామృతాన్ని తెలుగులోకి అనువదించారు. ఇవి అముద్రితాలు. కంద పద్యాలలో ఉన్న ఈ వ్రాతప్రతులు తిరుపతిలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఉన్న శ్రీవేంకటేశ్వర ప్రాచ్య లిఖిత పుస్తకభాండాగారంలో ఉన్నాయి. రావుల పురుషోత్తమకవి, తాళపత్రప్రతులు, సంఖ్య 7638, R 49; కాగితపుప్రతి R 576. వీరవల్లి వెంకన్న, తాళపత్రప్రతి, సంఖ్య 7(a). ఈ ఆంధ్రానువాదాలలో వెలగపూడి వేంగనామాత్యుని అనువాదానికే పేరుప్రఖ్యాతులున్నాయి. శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారంలో దీనికి నాలుగు తాళపత్రప్రతులున్నాయి : 7690, 7606, 7615 (a), 6795 (a). దీనిని మొట్టమొదటిసారిగా వేమూరు వేంకటకృష్ణమశెట్టిగారు 1910లో ముద్రించారు; ఈ గ్రంథంలో మూలశ్లోకాలకు తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్యగారిచేత టీకాతాత్పర్యాలు వ్రాయించారు (ఆనందా ప్రెస్సు, మదరాసు). రాజమండ్రినుండి కొండపల్లి వీరవెంకయ్యగారు కూడా కర్ణామృతానికి మద్దూరి శ్రీరామమూర్తిగారిచేత వివరణ వ్రాయించి వెంగనామాత్యుని పద్యాలు చేర్చి 1935లో ప్రకటించారు. మూలశ్లోకాలకు తంజనగరంవారి

వ్యాఖ్య వేంగనామాత్యుని పద్యాలు చేర్చి ఏలూరు రామా అండ్‌కోవారు కూడా 'ఆనందాశ్రమగ్రంథమాల' పేరుతో 1950 ప్రాంతంలో ప్రచురించారు. వావిళ్ళ వారు కూడా ఈ గ్రంథాన్ని 1958లో వెలువరించారు. దీనిలో మూల శ్లోకాల వ్యాఖ్యాత పేరు లేదు. (ఇటీవల హైదరాబాదులోని సురభారతీసమితి వారు కూడా శ్రీకృష్ణకర్ణామృతాన్ని తెలుగు టీకాతాత్పర్యాలతో ప్రచురించినట్లు తెలుస్తోంది).

వంగీయ పాఠంలో ఒక్క ఆశ్వాసం మాత్రమే ఉంది. అది ప్రథమాశ్వాసం. దీంట్లో 112 శ్లోకాలున్నాయి. గౌడీయ వైష్ణవ సంప్రదాయానికి చెందిన ముగ్గురు ఆచార్యులు ఈ వంగీయ పాఠానికి మూడు వ్యాఖ్యలు వ్రాశారు. శ్రీగోపాలభట్ట గోస్వామి - 'కృష్ణవల్లభ' వ్యాఖ్య; శ్రీచైతన్యదాస గోస్వామి - 'సుబోధిని' వ్యాఖ్య; శ్రీకృష్ణదాస కవిరాజ గోస్వామి - 'సారంగ రంగద' వ్యాఖ్య. యదునాథుడు దీనికి బెంగాలీభాషలో పద్యానువాదం చేశాడు.

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు (క్రీ.శ. 1485-1533) :-

శ్రీకృష్ణకర్ణామృతం (ప్రథమాశ్వాసం మాత్రం) వంగదేశంలో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు వల్ల ప్రచారంలోకి వచ్చింది. చైతన్యుడు దక్షిణదేశపర్యటన చేస్తున్నప్పుడు, కేరళలో ఒక దేవాలయంలో కొందరు భక్తులు శ్రీకృష్ణకర్ణామృతాన్ని పఠిస్తూంటే విన్నాడట. ఆ శ్లోకాలు వినగానే చైతన్యుడు తన్మయుడై ఆనందంతో మూర్ఛపోయాడట. తరువాత ఆ కావ్యాన్ని సేకరించి, పూరి జగన్నాథక్షేత్రానికి తీసికొనిపోయి, అక్కడి భక్తులకు పండితులకు పంచినాడట. ఆ భక్తులు దీనికి ప్రతిలిపి చేసి, కేవలం కంఠస్థం చేయడమే కాకుండా హృదయస్థం కూడా చేసుకున్నారట. (కర్ణామృతం చైతన్యులవారికి, కేరళలో కాకుండా కృష్ణానదీ తీరంలో లభించినట్లుగా 'శ్రీచైతన్యచరితామృతం'లో ఉంది). చైతన్యునకు ప్రథమాశ్వాసం మాత్రమే లభించింది కాబట్టి, ద్వితీయ తృతీయాశ్వాసాలు 16వ శతాబ్దం తరువాత ఇతరులచే వ్రాయబడి ఉండవచ్చునని ఒకవాదం ఉంది. కాని ఈ వాదం సరికాదు. కృష్ణకర్ణామృతానికి మొట్టమొదటి వ్యాఖ్యాతయైన పిసుపాటి పాపయల్లయసూరి (14వ శతాబ్ది) మూడు ఆశ్వాసాలకూ వ్యాఖ్య వ్రాశాడు. ఈ వ్యాఖ్యలో లేని నాలుగైదు శ్లోకాలకు కూడా 15వ శాతాబ్దికి చెందిన వెంగనామాత్యుని పద్యానువాదాలు లభిస్తున్నాయి. చైతన్యులవారు కర్ణామృతప్రతిని హడావిడిగా వ్రాయించి ఉంటారు. ఆ వ్రాయసకాడు ప్రథమాశ్వాసం మాత్రమే వ్రాసి ఇచ్చిఉంటాడు.

శ్రీకృష్ణదాస కవిరాజ గోస్వామి 'శ్రీచైతన్య చరితామృతం' అనే గ్రంథాన్ని వ్రాశాడు. అందులో చైతన్యప్రభువుకు శ్రీకృష్ణకర్ణామృతకావ్యం లభించడం, దాని వైశిష్ట్యం, జనశ్రుతిని అనుసరించి లీలాశుకుని వృత్తాంతం మొదలైన విషయాలు తెలియజేశాడు:

"కృష్ణ కర్ణామృత శుని ప్రభుర ఆనన్దహ ఈల ।
ఆగ్రహ కరియా పూంఖి లేఖాఇగాల ఈల ॥
కర్ణామృత సమవస్తు నాహి త్రిభువనే ।
యహాహైతే హయకృష్ణే శుద్ధప్రేమ జ్ఞానే ॥
సౌన్దర్య మాధుర్య కృష్ణ లీలార అవధి ।
సే ఈ జ్ఞానే యే కర్ణామృత పఢే నిరవధి ॥ "

(శ్రీకృష్ణకర్ణామృతాన్ని విని శ్రీచైతన్యమహాప్రభువు చాలా ఆనందించాడు. ఆదరంతో దాన్ని వ్రాయించి తెచ్చాడు. కర్ణామృతంతో సమానమైన గ్రంథం ముల్లోకాల్లోనూ లేదు. దానివల్ల కృష్ణునిపై శుద్ధప్రేమ జ్ఞానం కలుగుతుంది. ఈ శ్రీకృష్ణకర్ణామృతాన్ని నిరంతరం పఠించిన వారికి శ్రీకృష్ణుని సౌందర్య మాధుర్య లీలల యొక్క హద్దులు తెలుస్తాయి!)

జనశ్రుతి ననుసరించి బిల్వమంగళుడు ఆంధ్రదేశంలోని కృష్ణానదీ తీరవాసి అనీ, బ్రాహ్మణ పండితుడనీ, ఇతని తల్లి 'నీవి' అనీ, తండ్రి 'దామోదరు'డనీ, బిల్వమంగళుడు మొదట విషయలోలుడనీ, పిమ్మట బ్రహ్మజ్ఞాని అయ్యాడనీ, చివరకు కృష్ణభక్తుడయ్యాడనీ, లీలాశుకుడుగా మారి శ్రీకృష్ణకర్ణామృతాన్ని రచించాడనీ ' శ్రీచైతన్య చరితామృతం'లో ఉంది.

త్రివిధ జీవులు :-

జగత్తులో జీవులు మూడు విధాలుగా ఉంటారు: పాకృత జీవులు, ఆధ్యాత్మిక జీవులు, అప్రాకృత జీవులు. మొదటిదశ అయిన ప్రాకృత దర్శనంలో అహంకారం, మమకారం, కామక్రోధాదులైన షడ్వికారాలు, సంకల్ప వికల్పాలు, ద్వంద్వబుద్ధి, సుఖదుఃఖాలు, సంసారబంధాలు ఉంటాయి. అంటే ఈ దశలో ఉన్న మానవులు అజ్ఞానులుగా ఉంటారు. మనలో ఎక్కువ మంది ఇలాగే ఉంటాం. రెండవదియైన ఆధ్యాత్మిక దర్శనంలో - మొదటిదశలోని వన్నీ తుచ్ఛములనే జ్ఞానంకలిగి వైరాగ్యం ఉదయిస్తుంది. మూడవదశమైన

అప్రాకృత దర్శనంలో శుద్ధజ్ఞానం కలిగి భక్తులతో సాంగత్యం చేయాలనే కోరిక పుడుతుంది. ఈ అప్రాకృత దర్శనంలో శుద్ధకృష్ణభక్తి లభిస్తుంది. ఇదే జీవుని మహిమ.

బిల్వమంగళుడు ఈ మూడు దశలలోనూ ప్రయాణం చేశాడు. మొదట చింతామణి అనే వేశ్య మోహంలోపడి, కామాన్ని ఎక్కువగా ఆరాధిస్తూ ప్రాకృతదర్శనంలో ఉండిపోయాడు. ఒకనాటి అర్ధరాత్రి హోరున వర్షం కురుస్తుంటే, ఉరుములతో మెరుపులతో ఆకాశం దద్దరిల్లిపోతుంటే, కృష్ణానది భయంకరంగా పొంగిపొర్లిపోతూఉంటే, తన ప్రియురాలు వేశ్య ఏమయి పోయిందో అని, చీకటిలో తెలియక ఒక శవాన్ని తెప్పగా చేసికొని, కృష్ణానదిని దాటి, చింతామణి సౌధాన్ని సమీపించి, గోడ బొరియలో నుండి వ్రేలాడుచున్న ఒక త్రాచుపామును త్రాడుగా భావించి, దానిని పట్టుకొని గోడ ఎక్కిదుమికి, చింతామణి ఇంటిలో ప్రవేశిస్తాడు. కామంకోసం అతడు పడుతున్న పాట్లు చూచి, చింతామణి అతనికి వైరాగ్యాన్ని బోధిస్తుంది. "ఈ తుచ్ఛమైన శరీరంకోసం, ఈ అల్పమైన సుఖంకోసం ఇంతకష్టపడుతున్నావే, దీంట్లో వెయ్యోవంతుకృషిని భగవంతునికోసం చేస్తే నీకు మనశ్శాంతి కలుగుతుంది కదా! మోక్షం వస్తుంది కదా!" అని అంటుంది. అప్పుడు బిల్వమంగళునిలో వైరాగ్యం ఉదయిస్తుంది. రెండవదియైన ఆధ్యాత్మిక దర్శనంలో ప్రవేశిస్తాడు. చింతామణి ప్రోత్సాహంతో 'సోమగిరి' అనే గురువును ఆశ్రయిస్తాడు. ఆయన ఇతనికి గోపాలమంత్రాన్ని ఉపదేశిస్తాడు. ఆ మంత్రాన్ని జపించి గొప్ప కృష్ణభక్తుడుగా మారిపోతాడు. మూడవ దశయైన అప్రాకృత దర్శనంలోకి చేరుకుంటాడు. బిల్వమంగళుడు లీలాశుకుడుగా పరిణామం చెందుతాడు. బిల్వమంగళుడు గోడ ఎక్కి క్రిందికి ఉరికినప్పుడు, త్రాచుపాము పడగ మీద అతని కాలుపడిందనీ, ఆ దెబ్బకు అది చచ్చిపోయిందనీ, కృష్ణసర్పాన్ని చంపాడు కనుక విరక్తిచెందిన బిల్వమంగళుడు లీలాశుకనామంతో కృష్ణభక్తుడయ్యాడనీ ఆంధ్రదేశంలో ప్రతీతి.

ఈ అప్రాకృత దర్శనంలో కూడా మళ్లీ మూడు అంతర్దశలుంటాయి: 1 సాధకదశ, 2 భావదశ, 3 ప్రేమదశ. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం - అనే నవవిధభక్తి 'సాధక దశ' అవుతుంది. ఈ సాధక దశలో మళ్లీ రెండు రకాలున్నాయి: 'వైధము', 'రాగానుగము'. బిల్వమంగళునకు వైష్ణవ సాంగత్యం చేత, వైష్ణవోపదేశం చేత రాగానుగాభక్తిపైనే ఆశ కలిగింది. అతడు క్రమంగా సాధనచేసి భావదశనూ, ప్రేమదశనూ కూడా చేరుకున్నాడు. తన మధుర భక్తితో శ్రీకృష్ణుని నామ గుణ లీలా స్వరూపాలను వర్ణిస్తూ భావసమాధిస్థితిలోకి వెళ్లి పోయాడు. అలా భగవంతునిలో లీనమైన ఆ స్థితిలోనే శ్రీకృష్ణకర్ణామృతం వంటి దివ్యస్తోత్ర కావ్యాన్ని

రచించాడు. (ఈ లీలాశుకుడే మరుసటి జన్మలో జయదేవుడుగా జన్మించి గీతగోవింద కావ్యాన్ని రచించాడని ప్రజలు చెప్పుకుంటారు).

ఈ బిల్వమంగళ లీలాశుకుని పేరుతో 'సుమంగళ స్తోత్రం' అనే 383 శ్లోకాల గ్రంథం ఇంకొకటి ఉంది. (చూ. లండన్ లైబ్రరీ, సంస్కృత అముద్రిత గ్రంథపట్టిక, Vol .VIII). దీంట్లో కృష్ణకర్ణామృతంలోని శ్లోకాలు కూడా కొన్ని ఉన్నాయి. ఈ కావ్యంలో కూడా కృష్ణుని కౌమార కైశోర తారుణ్యాదుల వర్ణనతో నిండిన శ్లోకాలే ఉన్నాయి. దీనికి "భట్టవనమాలి" అనే పండితుడు "భక్తవల్లభవ్యాఖ్య" రచించాడు.

ఆంధ్రదేశంలో కృష్ణభక్తి :-

ఆంధ్రులు ఎక్కువగా రామభక్తులు. రామాలయం లేని గ్రామం ఆంధ్రదేశంలో సాధారణంగా ఉండదు. కాని 15వ శతాబ్దిలో బమ్మెరపోతనగారి భాగవతంవల్ల, 16వ శతాబ్దిలో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువువల్లా ఆంధ్రదేశంలో కృష్ణభక్తి వ్యాపించింది. ఒకవేళ లీలాశుకుడు ఆంధ్రదేశానికే చెందినవాడైతే క్రీ.శ. 11-12 శతాబ్దాలలోనే ఆంధ్రదేశం కృష్ణభక్తిలో ఓలలాడిందని చెప్పవచ్చు. ఈనాడు కృష్ణభక్తి ప్రపంచమంతటా వ్యాపించడం భారతీయులకు గర్వకారణం. పాశ్చాత్యులనేకులు నేడు కృష్ణభక్తులుగా మారిపోయారు. "International Sri Krishna Consciousness" అనే పెద్ద భక్తసమాజం ఏర్పడి ప్రపంచం నలుమూలలా కృష్ణభక్తిని ప్రచారం చేస్తోంది.

కృష్ణావతార వైశిష్ట్యం :-

రాముడికి తాను విష్ణుమూర్తినని తెలియదు; కృష్ణుడికి తెలుసు. తన గొప్పతనాన్ని చాలాసార్లు విశ్వరూపప్రదర్శనం ద్వారా తెలియజేశాడు శ్రీకృష్ణ భగవానుడు - అంతేకాదు, కృష్ణుడు తన భక్తులందరికీ ప్రత్యక్షమైన అనుభూతి (Direct experience) ని కలిగిస్తాడు. అందువల్ల శైవులు కూడా కృష్ణునివైపు ఆకర్షింపబడ్డారు[1]. లీలాశుకుడు పంచాక్షరీ మంత్రాన్ని జపించే శివభక్తుడు. పోతనగారు శైవుడు.

మానవుడికి భార్యాపుత్రాదులమీద నిజమైన ప్రేమ ఉండదు. తన ఆత్మను మాత్రమే తాను ప్రేమిస్తాడు. ఆ ఆత్మ ఎవరోకాదు - శ్రీమన్నారాయణుడే! కాబట్టి తన ఆత్మను తాను ప్రేమించుకోవడం అంటే శ్రీమహావిష్ణువును ప్రేమించడమే;

శ్రీకృష్ణపరమాత్మను ప్రేమించడమే. శ్రీకృష్ణుడు తాను ఆత్మస్వరూపుడనని బృందావనంలో నిరూపించాడు.[2] శ్రీకృష్ణుని దైవత్వాన్ని పరీక్షిద్దామని బ్రహ్మదేవుడు గోవుల్ని గోపాలుర్ని మాయం చేసివేశాడు. వెంటనే కృష్ణుడు తానే అన్ని రూపాలు ధరించి విహరించాడు. అప్పుడు గోవులకు తమ దూడలపైన, గోపస్త్రీలకు గోపాలురపైన వాత్సల్యం అధికమయిందట. కారణం సాక్షాత్తు పరమాత్మయే ఆ రూపాలలో ఉండడం. ఇలా మూడేండ్లు గడిచాయి. అప్పుడు బ్రహ్మవచ్చి, కృష్ణుని గొప్పతనాన్ని ప్రశంసించి, అతని కాళ్లమీదపడ్డాడు.

కృష్ణావతారంలో ఒక గొప్ప వైశిష్ట్యం ఉంది. అరిషడ్వర్గాలను మోక్షమార్గాలుగా చేసినవాడు కృష్ణుడు మాత్రమే.[3] కామ-క్రోధ-లోభ-మోహ-మద-మాత్సర్యాలను మార్గాలుగా చేసికొని శ్రీకృష్ణుని చేరి మోక్షాన్ని పొందడం భాగవత కథలలో మనం చూస్తాం. అరిషడ్వర్గాలకు కృష్ణుని ఆలంబనంగా చేసుకుంటే తప్పక మోక్షం వస్తుంది. మహాభాగవతం ఈ విషయాన్ని స్పష్టంగా చేపుతోంది. భాగవతం సప్తమస్కంధంలో నారదుడు ధర్మరాజుతో ఇలా అంటాడు:

"కామోత్కంఠత గోపికల్, భయమునం గంసుండు, వైరక్రియా
సామగ్రిన్ శిశుపాల ముఖ్య నృపతుల్, సంబంధులై వృష్ణులున్,
ప్రేమన్ మీరలు, భక్తినేము, నిదె చక్రింగంటి, మెట్టైన ను
ద్దామ ధ్యాన గరిష్ఠుఁడైన హరిఁజెందన్ వచ్చు, ధాత్రీశ్వరా!"

అయితే ఇక్కడ గోపికల కామం శరీరసంయోగంచేత తృప్తిపొందే తుచ్ఛమైన కామంకాదు. అది మధురభావంతో కూడిన భక్తి. గోపికలు భగవంతుడైన కృష్ణుణ్ణి ఆత్మేశ్వరుడుగా భావించి, అనిర్వాచ్యమైన నిర్మలభక్తిని ప్రదర్శించారు:

"విష జలంబు వలన, విషధర దానవు
వలన, జూలవాన వలన, వహ్ని
వలన, నున్న వాని వలనను రక్షించి
కుసుమ శరుని బారిఁగూల్పఁ దగునె!" అంటారు.

1,2,3. మాన్యమిత్రులు శ్రీమల్లంపల్లి శరభయ్యగారితో చర్చించటంవల్ల తెలుసుకున్న విషయాలు.

శృంగార మిశ్రితమైన ఈ మధురభక్తి మోక్షకామానికి సంబంధించినవి. భరతుడు తన నాట్యశాస్త్రంలో నాలుగు పురుషార్థాలకూ సంబంధించిన నాలుగు రకాల కామాన్ని గురించి చెప్పాడు:

"ధర్మకామోఽర్థ కామశ్చ మోక్షకామ స్తథైవచ
స్త్రీపుంసయోస్తు సంయోగో యః కామస్సతు సంస్మృతః"

ధర్మానికి సంబంధించిన కామం, అర్థానికి సంబంధించిన కామం, స్త్రీ పురుష సంయోగానికి సంబంధించిన కామం, మోక్షానికి సంబంధించిన కామం - అని కామం నాలుగు రకాలుగా ఉంటుంది. గోపికల మధురభక్తి మోక్షానికి సంబంధించిన కామం. అసలు 'కామం' అంటే 'ఆసక్తి', 'కోరిక', 'పొందాలనే కోరిక' అని మాత్రమే అర్థం. మోక్షాన్ని పొందాలనే కోరికయే భరతుడు చెప్పిన మోక్షకామం. ఈ మోక్షసంబంధి శృంగారమే 'భక్తిశృంగారం' లేక 'మధురభక్తి'. మహాభాగవతం దశమస్కంధంలో వర్ణితమైన గోపికాకృష్ణుల శృంగారం అటువంటి దివ్యశృంగారమేకాని, స్త్రీపురుష సంయోగానికి సంబంధించిన లౌకిక శృంగారం మాత్రంకాదు. లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృతంలో కూడా ఇటువంటి దివ్య శృంగారమే వర్ణింపబడింది. పైగా ఈ సందర్భంలో లౌకికమైన స్త్రీపురుషసంబంధం ఉండటానికి ఆస్కారంలేదు. గోపికలు యువతులు, కృష్ణుడు బాలుడు మాత్రమే. కాబట్టి వారిమధ్య వివిధ జీవాత్మలు పరమాత్మలో లీనం కావడానికి పడే బాధ వేదన గోచరిస్తాయి ఈ సన్నివేశంలో. గోపికలందరూ కృష్ణుణ్ణి ప్రేమించారు. అందరికీ కృష్ణుడు ఆనందాన్ని ఇచ్చాడు. కాని తానుమాత్రం ఎవరినీ ప్రేమించలేదు. అతడు 'మనస్సన్యాసి'! కృష్ణుడు 'వెన్నదొంగ' మాత్రమే కాదు, 'మనసు దొంగ' కూడా! మన మనసును దొంగిలిస్తాడు కాని, తన మనసును ఎవరికీ ఇవ్వడు. అతడు 'ఆజన్మ బ్రహ్మచారి'!

రాధాకృష్ణతత్త్వం :-

సాహిత్యంలో, శిల్పంలో, చిత్రకళలో అతిప్రాచీనకాలంనుండీ కూడా రాధ ఉన్నది. కాని తెలుగు సాహిత్యంలో పోతన భాగవతంలో లేదు. పోతన తరువాత వచ్చిన కవులలో కొందరు మాత్రం రాధాకృష్ణతత్త్వంతో కావ్యాలు వ్రాశారు. చింతలపూడి ఎల్లనార్యుడు 'రాధామాధవము'లోనూ, తెనాలి రామకృష్ణుడు 'పాండురంగ మాహాత్మ్యము'లోనూ రాధను ఉన్నతంగా చిత్రించారు. కాని ధరణిదేవుల రామయమంత్రి 'దశావతార చరిత్రము'లోను

వెలిదండ్ల వేంకటపతి 'రాధామాధవ సంవాదము'లోను, ముద్దుపళని 'రాధికా సాంత్వనము' లోను రాధను సాధారణమైన కాముకిగా చిత్రించారు. జానపద సాహిత్యంలో కూడా రాధ ప్రముఖంగా ఉంది.

ప్రాచీనపురాణాలలో రాధావృత్తాంతం ప్రసిద్ధం. దేవీ భాగవతంలో రాధను గురించిన విషయం విస్తారంగా ఉంది. మత్స్యపురాణంలో రాధకు దాక్షాయణితో అభేదం కల్పింపబడింది. ద్వారకకు రుక్మిణిలాగ, బృందావనానికి రాధ అధీశ్వరి - అని చెప్పబడింది. వామన పురాణంలోను, బ్రహ్మ-బ్రహ్మాండ-బ్రహ్మవైవర్త-పద్మ పురాణాలలోను, గర్గసంహితలోను రాధావృత్తాంతం విపులంగా ఉంది. (హరివంశంలో కాని, విష్ణుపురాణంలోకాని, భారత భాగవతాలలో కాని, రాధావృత్తాంతం కనబడదు). సంస్కృత ప్రాకృతసాహిత్యాలలోను, హాలుని గాథాసప్తశతిలోను, వరాహమిహిరుని బృహత్సంహితలోను, ప్రాచీన తమిళ పురాణాలలోను, శిలప్పదికారంలోను, పంచతంత్రంలోను, వేణీసంహారాది నాటకాలలోను, వంగసాహిత్యంలోను, రాధాకృష్ణతత్త్వం ప్రసిద్ధంగా ఉంది. భారతీయ సంస్కృతి నంతటినీ మహోజ్జ్వలమార్గంలో ఉత్తేజపరచినది ఈ రాధాతత్త్వమే!

ఈ రాధాకృష్ణతత్త్వంలో రెండు భిన్నాంశాలున్నాయి:

(1) పురాణప్రోక్తమైన మార్గం : ఇది పరమతాత్త్వికమూ, దర్శనాత్మకమూ అయినది. సర్వసృష్టికీ కేంద్రమైన గోలోకంలో ఉంటుంది రాధ. ఆమె కృష్ణుని హ్లాదినీశక్తి; మూల ప్రకృతి స్వరూపం; రాసమండలేశ్వరి; సర్వజగన్మాతృ స్వరూపిణి.

(2) లౌకికమైన అర్వాచీన వాఙ్మయమార్గం : ఇందులో రాధ శృంగారైక స్వరూపిణి. కృష్ణునితో రకరకాల చుట్టరికాలు కలిగినది. కొన్నింటిలో వివాహిత. ఈమె భర్తపేరు 'రాయణ'. కొన్నింటిలో స్వైర విహారధీర. మరికొన్నింటిలో కృష్ణుని భార్య. ఇంకా కొన్నింటిలో, ముఖ్యంగా జానపద సాహిత్యంలో కృష్ణుని మేనత్త (నందుని చెల్లెలు). కొన్ని కావ్యాలలో (పాండురంగ మాహాత్మ్యంలో) ఈమె నందుని మరదియైన శతగోపుని పుత్రిక.

రాధ, కృష్ణుని హ్లాదినీ శక్తికి - అంటే ఆనందానికి ఒక సంకేతం మాత్రమే. కృష్ణుడు పురుషుడు, రాధప్రకృతి. ఈ ప్రకృతి గొప్ప తృష్ణకలది. ఆ తృష్ణను తృప్తిపొందించటానికి కృష్ణుడు ప్రయత్నిస్తూ ఉంటాడు. కాని ఆమె ఎప్పుడూ అసంతృప్తితోనే బాధపడుతూ వుంటుంది - అంటారు ప్రసిద్ధ పండిత విమర్శకులు మల్లంపల్లి శరభయ్యగారు.

తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యంలో రాధ, కృష్ణుని మనఃప్రీణనం కోసం బ్రహ్మచేత సృష్టింపబడిందని ఉంది. ఈమె ప్రకృతి స్వరూపిణి. తపోమార్గంలో కృష్ణునితో ఐక్యాన్ని సాధించిన మహాతత్త్వానికి రాధ ప్రతీక. ఆమె నిఖిల భువనైక మోహిని, శక్తిస్వరూపిణి. ఆ శక్తి భువనంలోని మోహినీశక్తి. ఇది ప్రకృతి శక్తులలో ఒకటి. (ఇంకా వివరాలు కావలిస్తే చూడండి డా॥ ధారా రామనాథశాస్త్రిగారి 'ఆంధ్రవాఙ్మయము - కృష్ణకథ,' ఆరవప్రకరణం: 'రాధాకృష్ణసాహితి').

బ్రహ్మవైవర్త పురాణంలోని 'గర్గసంహిత'లో రాధాకృష్ణుల పుట్టుకను తెలిపే కథ ఒకటి ఉంది. పార్వతీ పరమేశ్వరుల అర్ధనారీశ్వరతత్త్వం దాంపత్యశృంగారానికి పరాకాష్ఠ ఈ పార్వతీపరమేశ్వరులు తమ తమ స్థానాలు మార్చుకొని దంపతులు కావాలని కోరుకున్నారట. అంటే పార్వతి పురుషుడుగానూ, పరమేశ్వరుడు స్త్రీగానూ మారాలని నిర్ణయించుకున్నారు. పార్వతి శ్రీకృష్ణునిగా జన్మించింది; పరమేశ్వరుడు రాధగా పుట్టాడు. కాబట్టి రాధాకృష్ణుల ప్రణయం అర్ధనారీశ్వర ప్రణయమంత గాఢమైనది. పార్వతీ పరమేశ్వరులలాగే వీరు కూడా ఒకరినొకరు విడిచి క్షణకాలమైనా ఉండలేరు. వీరి శరీరాలు వేరైనా ప్రాణం మాత్రం ఒక్కటే. అగ్నిలో దాహకత్వంలాగ, చంద్రునిలో వెన్నెలలాగ, రాధాకృష్ణతత్త్వాలు పరస్పర అవిభాజ్యాలు - అని బ్రహ్మవైవర్త పురాణంలో ఉంది. ఈ రాధాకృష్ణుల అపరావతారమే 15-16 శతాబ్దాలలో బెంగాలులో పుట్టిన శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు. అలాగే రాధయొక్క అపరావతారమే 19వ శతాబ్దిలో ఉన్న రామకృష్ణ పరమహంస (1836-1886). అతడు రాధాతత్త్వాన్ని జీర్ణించుకున్న మహాభక్తుడని మల్లంపల్లి శరభయ్యగారి అభిప్రాయం.

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువుకు 'గౌరాంగు' డని పేరు. ఆయన చాలా తెల్లగా అందంగా ఉండేవాడట. గౌరాంగుడు తర్కంలో మహాపండితుడు. బెంగాలు దేశానికి ప్రాచీనకాలంలో 'నవద్వీపం' అనిపేరు. వ్యాకరణానికి కాశీపట్టణం, తర్కానికి నవద్వీపం ప్రసిద్ధి. గౌరాంగుడు 'నవీనతర్కం' అనే గొప్పగ్రంథాన్ని వ్రాశాడట. శ్రీకృష్ణరసానుభవానందం కలిగిన తర్వాత తానురచించిన శాస్త్రగ్రంథం నిరుపయోగమైనదని భావించి, దానిని గంగలో పారవేశాడట! అతడు తన అవసాన దశలో పూరీ జగన్నాథ క్షేత్రాన్ని దర్శించాడు. అక్కడి సముద్రం ఆ మహాభక్తునికి శ్రీకృష్ణునికి రాసక్రీడలా కనబడిందట! వెంటనే దానిలో ప్రవేశించి శరీరత్యాగం చేశాడట. ఈ గౌరాంగుడు రాధాకృష్ణుల అంశతో పుట్టిన మహాకృష్ణభక్తుడు! ఇతడు శ్రీకృష్ణరససముద్రంలాంటివాడు.

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువుకు అనేక శిష్యులుండేవారు. వారిలో రూపగోస్వామి ముఖ్యుడు. అతడు కృష్ణుణ్ణి ఆధారంగా చేసికొని "ఉజ్జ్వల నీలమణి" అనే అలంకార శాస్త్రగ్రంథాన్ని రచించాడు. ఇక్కడ "ఉజ్జ్వల" అంటే "శృంగార రసం" అని అర్థం. "నీలమణి" అంటే "శ్రీకృష్ణుడు". ఈ రూపగోస్వామి "షట్సందర్భం" అనే మరొక గ్రంథం కూడా వ్రాశాడు. దాంట్లో కృష్ణభక్తికి సంబంధించిన ఆరు 'సందర్భాలు' - అంటే ఆరు 'సంప్రదాయాలు' చెప్పాడు. ఈ ఆరూ ఆరు రససందర్భాలు - అంటే - ఆరు ఆరాధనా పద్ధతులు:

1. శాంతం - దీనికి ఉదాహరణం - రుక్మిణి

2. వాత్సల్యం - దీనికి ఉదాహరణం - యశోద

3. దాస్యం - దీనికి ఉదాహరణం - గోపాలకులు

4. సఖ్యం - దీనికి ఉదాహరణం - ఉద్ధవుడు. (అర్జునుడు కాదు. అతడు రాజకీయ మిత్రుడు మాత్రమే. అసలు మిత్రుడు ఈ ఉద్ధవుడే. భాగవతం ఏకాదశ స్కంధంలో కృష్ణుడు చనిపోయేముందు తాను ఇతనికి అనేక ఆధ్యాత్మిక రహస్యాలు చెప్పాడు).

5. మాధుర్యం - దీనికి ఉదాహరణం - గోపికలు

6. మహాభావం - దీనికి ఉదాహరణం - రాధ.

మనకు కృష్ణానుభవం ఈ రాధవల్లనే కలుగుతోంది.[4]

మహాభాగవతంలో ప్రహ్లాదుడు నవవిధభక్తిని గురించి చెపుతాడు.

"శ్రవణం, కీర్తనం, విష్ణోఃస్మరణం, పాదసేవనమ్
అర్చనం, వందనం, దాస్యం, సఖ్య, మాత్మనివేదనమ్!" (7-5-23)

ఈ నవవిధభక్తితో పాటు శాంతం, వాత్సల్యం, మాధుర్యం, శరణాగతి, శత్రుభావం అనేవికూడా ఉన్నాయి.

---

4 రాధాకృష్ణతత్త్వాన్ని గురించిన ఈ విషయాలు ప్రముఖ పండితులు, కవి శేఖరులు, పరిశోధకులు, ఉత్తమ విమర్శకులు అయిన శ్రీమల్లంపల్లి శరభయ్యగారు నాకు తెలియ జేశారు. వారికి మిక్కిలి కృతజ్ఞుణ్ణి.

భగవంతునిపై గల భక్తి వివిధ భావాలతో వ్యక్తం చేయబడుతూ ఉంటుంది. వాటిలో శాంతం, దాస్యం, సఖ్యం, వాత్సల్యం, మాధుర్యం - అనే భావాలు ముఖ్యమైనవిగా చెపుతారు.

శాంతభక్తి - తపోనిధులు, వీతరాగులు అయిన నారదాది మునీంద్రులు

దాస్యభక్తి - హనుమంతుడు, కుబ్జ

సఖ్యభక్తి - సుగ్రీవుడు, కుచేలుడు, అర్జునుడు, ఉద్ధవుడు

వాత్సల్యభక్తి - దేవకీవసుదేవులు, యశోదానందులు

మాధుర్యభక్తి - గోపికలు

ప్రహ్లాదుడు, ధ్రువుడు, గజేంద్రుడు మొదలైనవారు శరణాగతికీ; రావణుడు శిశుపాలుడు మొదలైనవారు శత్రుభావం లేక వైరభక్తికీ ఉదాహరణాలు.

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు ద్వారా, అతని శిష్యుల ద్వారా కృష్ణకర్ణామృతానికి ఉత్తర హిందూ దేశంలో ప్రచారం లభించిన మాట నిజమే. కాని ఆర్యావర్తంలో రాధాకృష్ణతత్త్వం, రాధాభక్తి మిక్కిలి ఎక్కువ. కాని ఈ రాధాభక్తి లీలాశుకునిలో చాలా తక్కువ. అతనిది గోపీభక్తి, బాల గోపాలభక్తి, రాసలీలాభక్తి. అతడు గోపాలమంత్రోపాసకుడు. కృష్ణుడే అతని సర్వస్వం. శ్రీరామచంద్రమూర్తిని కూడా కృష్ణునిలాగే దర్శించాలని తహతహలాడుతాడు లీలాశుకుడు (చూ. 3-94).

లీలాశుకుని భక్తితత్త్వం విష్ణుస్వామి సంప్రదాయానికి చెందినదా?

లీలాశుకుడు విష్ణుస్వామి సంప్రదాయానికి చెందిన శుద్ధాద్వైతి అని ముట్నూరి సంగమేశంగారు నిరూపిస్తున్నారు: "ఫర్క్యూహర్ వ్రాసిన Outlines of Hindu Religious Literature లో లీలాశుకుడు విష్ణుస్వామి సంప్రదాయానికి చెందిన వాడనీ, శుద్ధాద్వైత పీఠ మలంకరించిన వాడనీ చెప్పబడింది. వల్లభ సంప్రదాయానికి చెందిన 'సంప్రదాయ ప్రదర్శిని' అనే గ్రంథంలో, వల్లభాచార్యుల వారికి హంపీ విజయనగరంలో ఉండగా ఒకనాటి రాత్రి కలలో లీలాశుకుడు కనపడి, విష్ణుస్వామి సంప్రదాయానుసారంగా శుద్ధాద్వైతాన్ని ప్రచారానికి తేవలసిందిగా ప్రోత్సహించినట్లు వ్రాయబడింది. విష్ణుస్వామి కాలమేదో నికరంగా తెలియదు. 13వ శతాబ్ది కావచ్చునని శ్రీ భండార్కర్‌గారి నిర్ణయం. అతడు గోపాల మంత్రోపాసి. శ్రీధరవ్యాఖ్యలో ఉదాహరించిన వాక్యాలనుబట్టి అతడు శుద్ధాద్వైత ప్రవర్తకుడు. కాని లీలాశుకుడతని శిష్యుడని సంప్రదాయ ప్రదర్శినిలో స్పష్టంగా చెప్పలేదు (సం.ప్ర.87).

అతడు విష్ణుస్వామి పద్ధతిని అభిమానించినట్లున్నది. బాలగోపాలభక్తిలో వీరికి 'సమాన శీలవ్యసనేషు సఖ్యం' అన్నన్యాయం వర్తిస్తుంది." (సాహిత్య సమితి వ్యాసావళి - 3, 'శ్రీకృష్ణకర్ణామృతము', పుట 143)

లీలాశుకుని ప్రభావం ప్రత్యక్షంగా వల్లభాచార్యుల వారిపైనా, పరోక్షంగా సూరదాసుపైనా కనబడుతుంది.

ఇష్టదేవతా ప్రార్థన - (కర్ణామృత కావ్యానికి నాంది) - గురువు ఎవరు? :-

బిల్వమంగళ లీలాశుకుడు తన శ్రీకృష్ణ కర్ణామృత కావ్యాన్ని ప్రారంభిస్తూ ఇష్టదేవతా ప్రార్థనా చేశాడు. కావ్యానికి నాందివంటి ఈ మొట్టమొదట శ్లోకంలో లీలాశుకుడు తన ఇష్టదైవమైన శ్రీకృష్ణునికన్నా ముందుగా, ప్రప్రథమంగా తన కామాంధకారాన్ని పోగొట్టి జ్ఞానమార్గం వైపు మళ్లించిన 'చింతామణి' అనే వేశ్యను స్మరిస్తాడు. తరువాత తనకు గోపాలమంత్రాన్ని ఉపదేశించి, తనను కృష్ణభక్తిలోకి మళ్ళించిన గురువు సోమగిరిని స్మరిస్తాడు. ఈ ఇద్దరినీ స్మరించిన తరువాతనే, తన ఇష్టదైవమైన - తనకు మంచినడవడిని అలవడజేసిన శిఖిపించమౌళియైన శ్రీకృష్ణమూర్తిని 'వసంతతిలకం' అనే ఛందస్సులో ఇలా ధ్యానిస్తాడు:

"చింతామణిర్జయతు సోమగిరిర్గురుర్మే
శిక్షాగురుశ్చ భగవాన్ శిఖిపించమౌళిః ।
యత్పాద కల్పతరు పల్లవ శేఖరేషు
లీలాస్వయంవర రసం లభతే జయశ్రీః ॥"

(నా జీవనమార్గాన్ని మళ్లించిన) చింతామణి (అనేవేశ్య) జయించునుగాక! - సర్వోత్కృష్టురాలై ఉండునుగాక (నాకు గోపాల మంత్రాన్ని ఉపదేశించిన) నా గురువైన సోమగిరి జయించునుగాక! - సర్వోత్కృష్టుడై ఉండునుగాక నాకు మంచి నడవడిని అలవడజేసిన గురువూ, షడ్గుణైశ్వర్యయుక్తుడూ, నెమలిపురిని శిరమున ధరించిన వాడూ అయిన శ్రీకృష్ణమూర్తి జయించునుగాక! - సర్వోత్కృష్టుడై ఉండునుగాక! కల్పవృక్షపు చిగుళ్లవంటి ఆ శ్రీకృష్ణుని పాదాలను ఎవరైతే తలదాలుస్తారో వారి దగ్గరకు జయలక్ష్మి ఒయ్యారంతోవచ్చి, స్వయంవరంలో వరించినట్టుగా వరిస్తుంది!

జనశ్రుతిలో ప్రబలంగా ప్రచారంలో ఉన్న 'చింతామణి' అనే వేశ్యకథను కొందరు పండితులు వ్యాఖ్యాతలు అంగీకరించడంలేదు. 'భక్త చింతామణియైన శ్రీకృష్ణుడు' అని ఈ 'చింతామణి' శబ్దాన్ని వ్యాఖ్యానిస్తున్నారు. మరికొందరు ఈ 'చింతామణి' శబ్దాన్ని సోమగిరి అనే గురువుకు విశేషణంగా భావించారు. ప్రథమాశ్వాసం చివరలో ఉన్న శ్లోకంలో "ఈశానదేవ చరణాభరణేన" అనే పాదాన్ని బట్టి కొందరు లీలాశుకుని గురువు 'ఈశానదేవుడు' అంటున్నారు. లీలాశుకుడు పంచాక్షరీ మంత్రాన్ని జపించే శైవుడు కాబట్టి 'ఈశానదేవుడు' అంటే ఫాలాక్షుడైన శివుడే అని అంటున్నారు మరికొందరు. ఇంకా కొందరు 'చింతామణి', 'సోమగిరి', 'ఈశానదేవుడు' - ఈ మూడు సమాసాలూ కూడా ఈ కావ్యనాయకుడైన కృష్ణునికి విశేషణాలే అంటున్నారు. మానవల్లి రామకృష్ణ కవిగారి ఉద్దేశంలో 'ఈశానదేవుడు' లీలాశుకుని గురువు, తాంత్రికుడు; ఆతని శిష్యరికంలో మెలగి లీలాశుకుడు 'క్రమదీపిక' అనే కృష్ణాహ్నికతంత్ర మొకటి వ్రాశాడు. మానవల్లివారు 'చింతామణి'ని మాత్రం 'భక్తచింతామణి'గానే భావించారు. యల్లయసూరి, గోపాలభట్టు అనే వ్యాఖ్యాతలు కూడా 'భక్తచింతామణి' వాదులే. కృష్ణదాసాదులైన వంగీయ వ్యాఖ్యాతలు మాత్రం చింతామణి వేశ్యకథను విశ్వసించారు. 'చింతామణి', 'సోమగిరి', 'ఈశానదేవుడు' మొదలైనవన్నీ 'భగవాన్ శిఖిపింఛమౌళిః' అన్నదానికే అన్వయించుకొని, లీలాశుకుని గురువు పరమాత్ముడైన శ్రీకృష్ణుడే అని భావించడం మంచిదంటారు ముట్నూరి సంగమేశంగారు (చూ. సాహిత్యసమితి వ్యాసావళి -3, పుట 143). నేను మాత్రం వేశ్యాగాథను నమ్ముతున్నాను. పూర్వకాలంలో వేశ్యా సంపర్కం వ్యక్తి ఔన్నత్యసూచకమేకాని అపప్రథకు ఆధారం కాదు. రసికుడు కాని కవి ఇంతగొప్ప శృంగార వర్ణనలు చేయలేడు.

శ్రీకృష్ణకర్ణామృతము - శ్లోకసంఖ్య :-

1950 ప్రాంతంలో ఏలూరునుండి రామాఅండ్‌కోవారు 'ఆనందాశ్రమ గ్రంథరత్నమాల'గా శ్రీలీలాశుక యోగీంద్ర విరచిత శ్రీకృష్ణకర్ణామృతాన్ని ప్రచురించారు. దీంట్లో వెలగపూడి వెంగనామాత్యుని పద్యాలున్నాయి. మూల శ్లోకాలకు తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్యగారు వ్రాసిన టీకాతాత్పర్యాలున్నాయి. ఈ వ్యాఖ్యానం బుక్కపట్టణం రామానుజయ్యగారిచేత పరిశోధింపబడింది. ఈ గ్రంథంలో ప్రథమాశ్వాసంలో 112 శ్లోకాలు, ద్వితీయాశ్వాసంలో 111 శ్లోకాలు, తృతీయాశ్వాసంలో 108 శ్లోకాలు - మొత్తం 331 శ్లోకాలు ఉన్నాయి.

ఈ శ్రీకృష్ణకర్ణామృతాన్ని 1958లో మద్రాసునుండి వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్‌వారు కూడా ఆంధ్ర టీకాతాత్పర్య సహితంగా ప్రచురించారు. దీంట్లో వెలగపూడి వెంగనామాత్యుని పద్యాలు కూడా ఆయా శ్లోకాల క్రింద ఇచ్చారు. రామా అండ్‌కో వారి గ్రంథానికీ దీనికీ శ్లోకసంఖ్యలో ఏమీ తేడాలు లేవు. మూడు ఆశ్వాసాలలోనూ అందులో ఎలా ఉన్నాయో ఇందులోనూ అలాగే ఉన్నాయి శ్లోకాలు, వాటి సంఖ్య, వాటి వరుసక్రమం.

13-7-1991నాడు గుంటూరులోని శ్రీగౌడీయమఠంవారు శ్రీజొన్నాభట్ల వాసుదేవశాస్త్రిగారి టీకాతాత్పర్యాలతో శ్రీకృష్ణకర్ణామృతం - ప్రథమాశ్వాసాన్ని ప్రచురించారు. దీంట్లో రామా అండ్‌కో వారి గ్రంథంలోను, వావిళ్ళవారి గ్రంథంలోను ప్రసిద్ధంగా ఉన్న "మందార మూలే మదనాభిరామం...." (1-100) అనే శ్లోకం లేదు. దీనికి బదులుగా 72వ శ్లోకంగా మాలినీ ఛందంలో ఒక క్రొత్తశ్లోకం ఉంది. అది యిది:

"కిమిద, మధర వీథీ క్లుప్త వంశీ నినాదం,
కిరతి నయనయోర్నః కామపి ప్రేమధారామ్ ।
తదిద, మమర వీథీదుర్లభం, వల్లభం నః
త్రిభువన కమనీయం, దైవతం జీవితం చ ॥ "

(ఈ విలక్షణమైన వస్తు వేమిటి? ఇది అధరవీథిలో వంశీనాదాన్ని చేస్తోంది. ఇది మా నేత్రాలలో అనిర్వచనీయమైన ఒకానొక ప్రేమధారను కురిపిస్తోంది. ఇది దేవతలకు కూడా దుర్లభమైనది. ఇది ముల్లోకాలలోనూ మనోహరమైనది. ఇది మాకు ఇష్టమైనది; దైవమైనవి; జీవితమైనది).

నూతనంగా ప్రవేశించిన ఈ 72వశ్లోకమూ, ప్రసిద్ధమైన 100వ శ్లోకమూ తప్పిస్తే తక్కిన శ్లోకాలన్నీ మూడుగ్రంథాలలోనూ సమానంగానే ఉన్నాయి. గౌడీయ మఠప్రతిలో ఒక శ్లోకం పోయి మరొక శ్లోకం చేరడంవల్ల మొత్తం శ్లోకసంఖ్య 112లో మార్పులేదు. అయితే ఈ ప్రతిలో నూతనంగా ఉన్నశ్లోకం తక్కిన రెండు ప్రతులలోను లేదు కాబట్టి, దీనిని ఆ ప్రతులలోకి చెర్చుకుంటే ప్రథమాశ్వాసంలో శ్లోకసంఖ్య 113 అవుతుంది. అప్పుడు కర్ణామృతంలోని మొత్తం శ్లోకాల సంఖ్య 113+111+108=332 అవుతుంది.

ఆశ్వాస విభజన :-

శ్రీ కృష్ణకర్ణామృతంలో ఒక్కొక్క శ్లోకంలో కవి మధురభక్తికి చెందిన ఒక్కొక్క భావం ఉంది. ఈ కావ్యం భర్తృహరి 'సుభాషిత త్రిశతి' లాగే ముక్తక పద్యాల సంపుటే అయినప్పటికీ, 332 శ్లోకాలలోనూ బాలగోపాల రూపుడైన శ్రీ కృష్ణపరమాత్మ యొక్క సౌందర్య మాధుర్య లీలా వర్ణన అనుస్యూతంగా ఉంది. ప్రథమాశ్వాసంలో ఇష్టదేవతా ప్రార్థన అయిన తరువాత, కృష్ణుడు మొదట ఒక వస్తువుగా, తరువాత ఒక దివ్యతేజస్సుగా, పిమ్మట బాలకృష్ణమూర్తిగా కవి మనోనేత్రానికి గోచరిస్తాడు. ఆ రూపాన్ని తన బాహ్యనేత్రాలతో చూడాలని తహతహలాడి పోతాడు లీలాశుకుడు:

"హే దేవ! హే దయిత! హే జగదేక బంధో!
హే కృష్ణ! హే చపల! హే కరుణైక సింధో!
హే నాథ! హే రమణ! హే నయనాభిరామ!
హా! హా! కదాను భవితాసి పదం దృశోర్మే." *(1-40)*

(ఓ దేవుడా! ఓ ప్రియుడా! లోకాలకు ముఖ్యబంధువైనవాడా! ఓ నల్లనివాడా! ధ్యానానికి అందకుండా కదలిపోయేవాడా! దయకు ముఖ్యమైన సముద్రమా! ఓ దొరా! క్రీడించువాడా! ఓ కన్నులకింపైనవాడా! అయ్యయ్యో! ఎప్పుడు నీవు నాకన్నులకు కనపడతావోకదా!)

"చికురం బహుళం, విరళం భ్రమరం,
మృదులం వచనం, విపులం నయనమ్ ।
అధరం మధురం, వదనం లలితం,
చపలం చరితన్నుకదాzనుభవే ॥" *(1-61)*

(శ్రీ కృష్ణుని దట్టపు జుట్టును, పలుచని జులపాలను, నెమ్మది మాటలను, పెద్ద కన్నులను, తీయని మోవిని, అందమైన మొగమును, గోపికలయందు లోలమైన చరిత్రమును, ఎప్పుడు అనుభవిస్తానో కదా!)

లీలాశుకుడు మహాభక్తుడు మహాకవి కాబట్టి ఆతని మృదుమధుర భక్తి కవిత్వానికి

ముగ్ధుడై, ఎవరికీ లభించని శ్రీకృష్ణపరమాత్మ అతనికి పట్టుబడతాడు. ఆ ఆనందంతో కవి ఇలా అంటాడు:

"సోऽయం మునీంద్ర జన మానస తాపహారీ
సోऽయం మద వ్రజవధూ వసనాపహారీ ।
సోऽయం తృతీయ భువనేశ్వర దర్పహారీ
సోऽయం మదీయ హృదయాంబురుహాపహారీ ॥" *(1-81)*

(యోగుల మనస్సుల్లోని తాపాన్ని పోగొట్టేవాడైన ఆ దేవుడు వీడే! దొరికాడు! మత్తిల్లిన గోపికల కట్టుకోకలు దొంగిలించిన వాడు వీడే! దొరికాడు! స్వర్గలోకానికి ప్రభువైన ఇంద్రుని గర్వం అణిచినవాడువీడే । దొరికాడు! నా హృదయపద్మాన్ని దొంగిలించిన శ్రీకృష్ణుడు వీడే! దొరికాడు!)

ఇలా తనకు లభించిన త్రిలోక సుందరమూర్తియైన కృష్ణుని దివ్యమంగళ విగ్రహాన్ని చూచి కవి ఆశ్చర్యపోతాడు :

"చిత్రం తదేతచ్చరణారవిందం
చిత్రం తదేతన్నయనారవిందమ్ ।
చిత్రం తదేతద్వదనారవిందం
చిత్రం తదేతత్పునరంబ చిత్రమ్ ॥" *(1-88)*

(తామర పూలవంటి ఈ పాదాలు ఒక వింత - ఒక అద్భుతం!
తామరపూలవంటి ఈ కన్నులు ఒక వింత - ఒక అద్భుతం!
తామరపూవువంటి ఈ మొగము ఒక వింత - ఒక అద్భుతం!
అమ్మ! ఈ మొత్తం రూపమే ఒక వింత, మరీ వింత! - ఒక అద్భుతం, మరీ అద్భుతం!)

ఇక్కడ నాల్గవపాదానికి "చిత్రం తదేతద్వపురస్య చిత్రమ్" అనే పాఠం వంగీయ ప్రతిలో ఉంది. అప్పుడు "అమ్మ! ఈ మొత్తం శరీరమే ఒక వింత, మరీ వింత - ఒక అద్భుతం, మరీ అద్భుతం!" అని అర్థం చెప్పుకోవాలి.

ఇటువంటి ఆశ్చర్యంతో, మధుర భక్తిలోని తన్మయత్వంతో లీలాశుకుడు అనేక విధాలుగా శ్రీకృష్ణపరమాత్మను స్తుతిస్తాడు. అదే మూడు ఆశ్వాసాల కావ్యంగా విస్తరిల్లింది.

ప్రథమాశ్వాసం :-

ప్రథమాశ్వాసంలో ఈక్రింది అంశాలు వర్ణించాడు లీలాశుకుడు: బాలరూపం దాల్చిన ఒకవస్తువు - సౌందర్య రాశియైన నల్లని గోపాలబాలుడు - ఆశ్చర్యకరమైన ఒకానొక వెలుగు - చిరునవ్వుతో అందమైన మొగము - నెమలిపురిచుట్టిన సొంపైన కురులు - విశాలనేత్రాలు, దయారసమొలికే చల్లని చూపులు - వేణుగానామృతంతో నిండిన అద్దాల వంటి చెక్కిళ్లు - ప్రకాశిస్తున్న అందమైన క్రింది పెదవి, తేనెలొలుకు చిరునవ్వు - పిల్లన గ్రోవిపాటలు - బాలసుందర రూపం - ముద్దులుగులుకు మోహనాకృతి - చిగురుటాకులవలె ఎఱ్ఱనైన పాణి పద్మాలు - పూచిన కలిగొట్టు పూవుల ఎరుపును నిరసిస్తున్న పాదకమలాలు - అందెల చప్పుడు - యౌవనోదయంతో కూడిన బాల్యరూపం - గోపికల కుచకుంకుమ పంకంచే నిండిన ఒడలు - అమృత స్వరూపుడైన శ్రీకృష్ణ పరమాత్మ, అతని శృంగార చేష్టలు - త్రిలోక మోహనమైన కృష్ణ తేజస్సు - అమృత ప్రవాహముల వంటి మాటలు - కృష్ణదర్శనం కోసం కవిపడే బాధ - కృష్ణుడనే ఒక దివ్య మాధుర్యంలో ఐక్యం అయిపోవాలనే కవి తహతహ - సర్వాంతర్యామియైన కృష్ణరూపం - మనోహరాకారం, దివ్యతేజస్సు, కృష్ణసాక్షాత్కారం - సంపూర్ణ రూపం, మధురరూపం, దివ్యసౌందర్యం - శ్రీకృష్ణుని సాన్నిధ్యం, సేవ, స్తుతి - యాదవుల యిండ్లలో జార చోర వ్యాపారం - ముల్లోకాలకూ అలంకారమైన కస్తురి బొట్టు - చతుర్విధ పురుషార్థ సాధనమైన కృష్ణభక్తి - కవి కృష్ణుని ప్రార్థించడం - శ్రీకృష్ణుని దివ్యమంగళ విగ్రహం - ఎక్కడ చూస్తే అక్కడ తనకు కృష్ణరూపమే కనపడాలనే కవి కోరిక - శివభక్తుడైన కవి, పండుకోసం పూలగుత్తి నాశ్రయించిన చిలుకలాగ, మోక్షకోసం కృష్ణుని కీర్తియందు వాసన కలవాడు కావడం.

ద్వితీయాశ్వాసం :-

బిల్వమంగళ లీలాశుకుడు తన కావ్యంలోని రెండవ ఆశ్వాసంలో - బాలకృష్ణుని శరీరం, దాని కాంతి, తనభక్తి, స్వప్నంలో తనకు కలిగిన శ్రీకృష్ణ సాక్షాత్కారం (2-7), వేణుగానం, గోపికలు, 'సంజగౌ వేణునా దేవకీనందనః" అనే మకుటంతో రాస క్రీడాష్టకం, రాధాకృష్ణుడు, వరాహావతారప్రసక్తి, కృష్ణభక్తివల్ల తనకు మరణభయం లేకపోవడం, కృష్ణభక్తి

సంసార రోగానికి దివ్యౌషధం కావడం, కృష్ణుని అనిర్వాచ్య లావణ్యం, పాండురంగని ప్రసక్తి, గోపాలకృష్ణుడు, గోపీకృష్ణుడు, మురళీకృష్ణుడు, పార్థసారథి కృష్ణుడు, వెన్నదొంగ, మన్నుదొంగ, పెరుగుదొంగ, వటపత్రశాయి, యశోదాతనయుడైన చిన్నికృష్ణుడు, రుక్మిణీ కల్యాణం, కృష్ణావతార వైశిష్ట్యం, "నౌమి గోపాలబాలమ్" అనే మకుటంతో ఐదుశ్లోకాలు, యౌవన కృష్ణుడు, ప్రౌఢకృష్ణుడు, కృష్ణధ్యానమహిమ - మొదలైన విషయాలు వర్ణించాడు.

తృతీయాశ్వాసం :-

ప్రథమాశ్వాసంలో లాగానే తృతీయాశ్వాసంలో కూడా కవి బాలకృష్ణుని మొదట ఒక వస్తువుగాను, తరువాత ఒక దివ్యతేజస్సుగాను భావిస్తాడు. పిమ్మట కృష్ణుని వివిధ రూపాలు వర్ణిస్తాడు. నూత్నయౌవన కృష్ణుడు, చిన్నికృష్ణుని ముద్దుమొగము, చూపు, బాల రూపు, సొబగు, పాదాలు, బృందావన కృష్ణుడు, కృష్ణుని దివ్యమంగళ విగ్రహం, రాధాకృష్ణుడు, రుక్మిణీనాథుడు, మురళీకృష్ణుడు, బాలగోపాలవేషం, విలాసం, కృష్ణభక్తి, కృష్ణతేజస్సు, అత్యంత సుందరమైన ఆకారం, గోపీకృష్ణుడు, కృష్ణుని మందహాసం, వక్షస్థలం, పాదం, కృష్ణావతార ప్రాశస్త్యం, కృష్ణుని త్రిలోకేశ్వరత్వం, ఆశ్చర్యకరమైన అతని రూపం, మొత్తం రూపాన్ని నఖశిఖపర్యంతం వర్ణించడం, నమస్కరించడం, కృష్ణదర్శనం, మోక్షప్రాప్తి, పురుషార్థాలు, గోపికల చూపులు, వెన్నదొంగ, రాముణ్ణికూడా కృష్ణునిగా మారనుని కవి కోరడం, గోపికల విరహం, కృష్ణసాన్నిధ్యం కోసం తహతహ, మన్మథ వేషం ధరించిన కృష్ణుడు, వశ్యగోపాల కృష్ణుడు, ప్రాతఃకాల-మధ్యాహ్న-సాయంకాలాలలో పూజ చేయవలసిన కృష్ణరూపం, గోపి-కృష్ణ సంవాదం, పాపహరణమైన కృష్ణ స్మరణం - ఇత్యాది విషయాలు తృతీయాశ్వాసంలో చెప్పాడు లీలాశుకుడు.

పై అంశాలను బట్టి బిల్వమంగళ లీలాశుకుడు శ్రీకృష్ణకర్ణామృతం ప్రథమాశ్వాసంలో బాలకృష్ణ సాక్షాత్కారంకోసం తాను చేసిన తపస్సును గురించి; ద్వితీయాశ్వాసంలో తనకు ప్రత్యక్షమైన బాలకృష్ణదేవుని భావ చిత్రాలను గురించి; తృతీయాశ్వాసంలో శ్రీకృష్ణపరమాత్మను పొందే ఉపాసనామార్గాలను గురించి, మంత్రాలను గురించి అత్యద్భుతంగా వర్ణించాడని నిర్ణయించవచ్చు.

లీలాశుకుని శ్రీకృష్ణ వర్ణనల వైశిష్ట్యం

శ్రీకృష్ణుని జీవితంలో మూడు ప్రధాన ఘట్టాలు కనబడతాయి : బృందావనం,

మధుర, ద్వారక. ఈ మూడు ఘట్టాలలోనూ మూడు ప్రయోజనాలు సాధించాడు కృష్ణుడు. బృందావనంలో ఆనందమయమైన బాల్య జీవితాన్ని గడిపాడు. మధురలో రాజకీయ జీవితాన్ని గడిపాడు. ద్వారకలో గార్హస్థ్యజీవితాన్ని గడిపాడు. లీలాశుకుడు మొదటి ఘట్టాన్నే ఎక్కువగా వర్ణించాడు.

అసలు, ప్రతి మానవుని జీవితంలోనూ ఆరు అవస్థలు కనబడతాయి: శైశవం, బాల్యం, కౌమారం, యౌవనం, ప్రౌఢత్వం, వృద్ధాప్యం. శ్రీకృష్ణ పరమాత్మకూడా, మానవ జన్మఎత్తిన కారణంగా, ఈ క్రమంలోనే పెరిగాడు. గోకులంలో శైశవదశను, బృందావనంలో బాల్యదశను, మధురలో కౌమారదశను, ద్వారకలో యౌవన, ప్రౌఢ, వృద్ధాప్యదశలను గడిపినట్లు మనకు గోచరమవుతుంది. కాని మహాభక్తుడైన బిల్వమంగళ లీలాశుకుడు శ్రీకృష్ణుని శైశవరూపాన్ని, బాల్యరూపాన్ని మాత్రమే ఎక్కువగా వర్ణించాడు. కౌమారకృష్ణుణ్ణి, యౌవన ప్రౌఢ దశలలో కృష్ణుణ్ణి మిక్కిలి తక్కువగా వర్ణించాడు. బాలకృష్ణుడే తన ప్రధానదైవమని స్పష్టంగా చెప్పుకున్నాడు కవి :

"వయమేతే విశ్వసిమః
కరుణాకరమూర్తి కిం వదన్త్యంగే ।
అపిచ విభో తవ లలితే
చపలతరా మతిరియం బాల్యే ॥ *(3-25)*

("కృష్ణా! నీవు పెద్దవాడవై ఎందరినో రక్షించి కీర్తిని పొందినప్పటికీ, అటువంటి నీ పెద్దరికం కన్నా, మిక్కిలి ముద్దులు గుల్కే నీ బాల్యంపైనే నామనస్సు ఎక్కువ మక్కువ చూపుతోంది").

అసలు శ్రీకృష్ణకర్ణామృత కావ్యం కృష్ణుని కిశోరాకృతి వర్ణనతోనే ప్రారంభమవుతుంది. మొట్టమొదటి శ్లోకంలో చింతామణిని, గురువు సోమగిరిని, శిక్షాగురువు శ్రీకృష్ణుని స్తుతించిన తర్వాత, తన కావ్యాన్ని ఈ క్రింది శ్లోకంతో ప్రారంభిస్తాడు:

"అస్తి స్వస్తరుణీ కరాగ్ర విలస త్కల్ప ప్రసూనాప్లుతం
వస్తు ప్రస్తుత వేణునాద లహరీ నిర్వాణ నిర్వ్యాకులమ్ ।
స్రస్తస్రస్త నిరుద్ధ నీవి విలస ద్గోపీ సహస్రావృతం
హస్తన్యస్త నతాపవర్గ మఖిలోదారం కిశోరాకృతి ॥"

(ఎల్లదేవతలలోనూ గొప్పదియైన, బాలరూపం దాల్చిన ఒక వస్తువు ఉంది. అది అప్సరసలు పూజించిన పుష్పాలలో మునిగిపోయింది. ఇంపైన వేణుగానంవల్ల సుఖపారవశ్యాన్ని పొందుతోంది. తేపతేపకు (పదే పదే) జారిపోతూ కాళ్లకు అడ్డుపడుతున్న కోకలతో అందగించిన వేనవేల గోపికలతో చుట్టుకోబడి ఉంది. తనకు మ్రొక్కే భక్తులకు అరచేతిలో వైకుంఠాన్ని ప్రసాదిస్తుంది. అంటే అంత సులభంగా మోక్షాన్ని ప్రసాదిస్తుందని అర్థం. ఇంతటి సమర్థమైనది ఆ బాలకృష్ణమూర్తి).

మాటలాడే చిత్రపటాలు :-

'కవి' అంటే 'వర్ణించేవాడు' అని అర్థం. ఈ మాట లీలాశుకుడికి బాగా అన్వయిస్తుంది.. అతడు శ్రీకృష్ణమూర్తి యొక్క వివిధ రూపాలను లోకోత్తరంగా, 'నభూతో నభవిష్యతి' అనే విధంగా కళ్లకు కట్టినట్టుగా వర్ణించాడు. గొప్పచిత్రకారుడులా వర్ణించాడు. 'వర్ణము' అంటే 'రంగు', 'అక్షరము' అని రెండర్థాలున్నాయి. చిత్రకారుడు కుంచెతీసికొని, పలురంగులలో ముంచి, సుందరమైన చిత్రాన్ని గీస్తాడు. మనం దానిని బాహ్యనేత్రాలలో చూచి ఆనందిస్తాం. కవి కూడా చిత్రకారుడు లాంటివాడే. ఘంటంతోనో, లేదా కలంతోనో అక్షరాలు వ్రాస్తూ, పదాలు కూరుస్తూ, ఒక వస్తువును లేదా ఒక భావాన్ని చిత్రిస్తాడు. అది మన బాహ్యనేత్రానికి కనపడదు. మన మనోనేత్రానికి మాత్రమే కనిపిస్తుంది. దీనినే ఆంగ్లంలో "Image" అంటారు. తెలుగులో 'శబ్దచిత్రం/పదచిత్రం/భావచిత్రం' అని పిలుస్తున్నారు. కాబట్టి కవి భావచిత్రకారుడు. డా॥ జి.యస్. శివరుద్రప్ప అనే ప్రముఖ కన్నడ కవి, విమర్శకుడు, ఆచార్యుడు కన్నడ కవుల చిత్రాలతోనూ కవితలలోనూ కూడిన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తూ ఒక కవితను ఒక చిత్రపటాన్ని పోలుస్తూ ఇటీవల ఒకసభలో ఇలా అన్నారు: "Painting is a silent poem and a poem is a talking picture!" (చిత్రపటం నిశ్శబ్దకవిత; కవిత మాటలాడే చిత్రపటం). లీలాశుకుని కవిత్వంలో ఇటువంటి మాటలాడే చిత్రపటాలు కోకొల్లలుగా ఉన్నాయి.

గోపాల కృష్ణుని వర్ణన :-

లీలాశుకుడు మహాభక్తుడు. అతనికి యమునానదీ తీరంలో గోవుల్ని మేపుతున్న బాలకృష్ణుడు ప్రత్యక్షమయ్యాడు. తనకు ప్రత్యక్షమైన ఆబాలగోపాలకృష్ణుడు ఎలా ఉన్నాడో

ఒక భావచిత్రంగీసి మన మనోనేత్రం ముందు ఉంచుతున్నాడు లీలాశుకుడు: "యమునానదిలో ఇసుకతిన్నెలు. ఒడ్డున కానుగు చెట్ల దట్టమైన నీడ. ఎదురుగా ప్రవహిస్తున్న నదీ జలాలు. బాలకృష్ణుడు తన కుడిచేతిలో తామరాకు అనే కంచంలో పెరుగన్నం పెట్టుకున్నాడు. ఆ చెట్లనీడలో ఆ ఇసుకతిన్నెల మీద కూర్చుని తింటున్నాడు. ఎడమ అరచేతితో అందమైన పిల్లనగ్రోవిని పట్టుకున్నాడు. మొలలో ఊదే కొమ్మును చెక్కుకున్నాడు. ప్రతిక్షణం గోవుల్ని చూస్తున్నాడు. అటువంటి బాలకృష్ణుణ్ణి నేను చూస్తున్నాను."

"కాళిందీ పులినే, తమాల నిబిడచ్ఛాయే, పురస్సంచర
త్తోయే, తోయజ పత్రపాత్ర నిహితం దధ్యన్న మశ్నాతి, యః ।
వామే పాణితలే నిధాయ మధురం వేణుం, విషాణం కటి
ప్రాంతే, గాశ్చ విలోకయన్ ప్రతికలం, తం బాల మాలోకయే ॥ (3-82)

పార్థసారథి కృష్ణుని వర్ణన :-

పార్థసారథియైన శ్రీకృష్ణుడు అర్జునుని రథాశ్వాలను ప్రతిదినం ఎంతశ్రద్ధగా కడుగుతున్నాడో ఈ క్రింది శ్లోకంలో లోకోత్తరంగా వర్ణించాడు లీలాశుకుడు. (గ్రామాలలో దుక్కిటెద్దుల్ని రైతులు నీళ్ళల్లో నిలబెట్టి శ్రద్ధగా కడగటం మనలో చాలామంది చూచే ఉంటాము). ఈ చిత్రాన్ని సూక్ష్మాతి సూక్ష్మంగా మన మనోనేత్రం ముందు ఉంచుతున్నాడు మహాకవి.

"అర్జునుని రథసారథియైన శ్రీకృష్ణుడు గుఱ్ఱాలను నీళ్లల్లో నిలబెట్టి ప్రతిదినం కడుగుతున్నాడు. ఎలాగంటే - గుఱ్ఱాలను తోలే కొరడా తలకి చుట్టుకున్నాడు. పగ్గాలు తన పళ్లతో కరిచి పట్టుకున్నాడు. ఒళ్లు నిగిడించాడు. గోళ్లతో గుఱ్ఱాల వీపులు గోకుతున్నాడు. దోసిలితో నీళ్లు పట్టుకొని వాటిని కడుగుతున్నాడు. ఆయన దేవకీదేవి పుణ్యాలరాశి! అటువంటి పార్థసారథి మమ్మల్ని కాపాడుగాక!"

"నఖనియమిత కండూన్ పాండవ స్యందనాశ్వాన్
అనుదిన మభిషించన్ అంజలిస్థైః పయోభిః ।
అవతు, వితత గాత్రః తోత్ర నిష్యూత మౌళిః
దశన విధృత రశ్మిః దేవకీపుణ్యరాశిః ॥ " (2-47)

ఇటువంటి మాటలాడే చిత్రపటాలను చిత్రించగలిగిన సామర్థ్యంతో ఆ మహాకవియైన లీలాశుకుడు గోకులంలోని శైశవ కృష్ణుణ్ణి, బృందావనంలోని బాలగోపాలకృష్ణుణ్ణి, మధురలోని కౌమారకృష్ణుణ్ణి, ద్వారకానగరంలోని యౌవనకృష్ణుణ్ణి, కురుక్షేత్రంలోని పార్థసారథి కృష్ణుణ్ణి తనవితీరా వర్ణించాడు. (వీటిలో మొదటి రెండురకాల కృష్ణుల వర్ణనలే ఎక్కువ, తక్కినవి మిక్కిలి తక్కువ). అర్థాలంకారాల వంక కన్నెత్తి చూడకుండా, అత్యంత మనోజ్ఞమైన శబ్దచిత్రాలు కూర్చి వర్ణించగలడు లీలాశుకుడు. ఈతని శబ్దచిత్రాలకు అనురూపమైన వర్ణచిత్రాలు గీసిన వ్రాతప్రతి ఒకటి "బాలగోపాలస్తుతి" అనే పేరుతో పూనాలోని భండార్కర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉంది. లీలాశుకుని కవిత్వంలోఉన్న ఈ చిత్రాత్మకతాగుణంవల్ల అనేక కర్ణామృతశ్లోకాలు, గోపాలకృష్ణ మంత్రాలకు ధ్యానశ్లోకాలుగా స్వీకరింపబడ్డాయి. (చూ. సనత్కుమార సంహిత, గోపాలకల్పం - 13 వ శతి).

I గోకులంలోని శైశవ కృష్ణుడు :-

ఈ శైశవకృష్ణుణ్ణే 'చిన్నికృష్ణుడు', 'ముద్దుకృష్ణుడు', 'కిశోరకృష్ణుడు' అనికూడా పిలువవచ్చు. ఈ చిన్ని కృష్ణుణ్ణి వివిధ రూపాలలో వర్ణించాడు లీలాశుకుడు.

1.1 వటపత్రశాయి అయిన శైశవ కృష్ణుడు (2-58)

1.2 తల్లిపాలు త్రాగుతున్న బుల్లికృష్ణుడు (2-63)

1.3 నేలమీద ప్రాకుతున్న ముద్దుకృష్ణుడు (2-76, 3-92)

1.4 దిస్సమొలతోనున్న చిన్నికృష్ణుడు (2-74, 2-75)

1.5 కాలి అందెలు చప్పుడు చేసుకుంటూ వ్రేపల్లెలో నడుస్తున్న కిశోర కృష్ణుడు (1-16, 17)

1.6 వెన్నదొంగ కృష్ణుడు (3-87, 3-88)

1.7 మన్నుదొంగ కృష్ణుడు (2-65)

1.8 పెరుగుదొంగ కృష్ణుడు (2-98)

1.9 సాయంకాలం ఇంటింటికి వెళ్లి లేగదూడల్ని కట్టివేస్తున్న చిన్నికృష్ణుడు (2-44)

1.10 యశోదా కృష్ణుడు - ఇతడు రెండు రకాలుగా ఉన్నాడు:

1.10.1 ఆవులపాలకోసం ఆవుకోర ఇమ్మని తల్లితో వాదించే ముద్దు కృష్ణుడు (2-60)

1.10.2 తల్లిచేతికి దొరకకుండా ఆల మందల మధ్య పరుగులు పెడుతూ ఒళ్లంతా బురద చేసుకున్న బుల్లి కృష్ణుడు. (2-77).

1.11 పాండురంగడు (2-34)

ఉదాహరణాలు :

1.1 వటపత్రశాయియైన శైశవ కృష్ణుడు:

"కరారవిందేన పదారవిందం
ముఖారవిందే వినివేశ యంతమ్ ।
వటస్య పత్రస్య పుటేశ యానం
బాలం ముకుందం మనసా స్మరామి ॥" *(2-58)*

(తామరపూవు వంటి మృదువైన చేతితో, తామరపూవు వంటి మృదువైన పాదాన్ని పట్టుకొని, తామరపూవు వంటి మృదువైన నోట్లో పెట్టుకుంటున్నాడు. మఱ్ఱిఆకు దొప్పలో పండుకున్నాడు. అటువంటి బాలుడైన కృష్ణుణ్ణి నా మనస్సులో తలచుకుంటాను) ఇది మిక్కిలి సరళమైన శ్లోకంలా కనబడుతున్నా లోపల గంభీరమైన అర్థం ఇమిడిఉందని వ్యాఖ్యాత శ్రీమల్లంపల్లి శరభయ్యగారు సూచించారు. వటపత్రశాయి చేయి సృష్టికి, పాదం స్థితికి, నోరు లయకి ప్రతీకలని చాలా చక్కగా నిరూపించారు.

1.4 దివ్వమొలతోనున్న చిన్నికృష్ణుడు:

"బాలాయ, నీల వపుషే, నవ కింకిణీక
జాలాభిరామ జఘనాయ, దిగంబరాయ ।
శార్దూల దివ్య నఖభూషణ భూషితాయ,
నందాత్మజాయ, నవనీతముషే, నమస్తే ॥" *(2-74)*

(బాలుడూ, నల్లని శరీరం కలవాడూ, మొలచుట్టూ అందమైన క్రొత్త చిరుగంటలు కలవాడూ, దిగంబరుడూ, మెడలో గొప్పపులిగోరు గొలుసుతో అలంకరింపబడినవాడూ, నందుని కుమారుడూ, - అయిన చిన్నికృష్ణునికి నా నమస్కారం!)

1.9 సాయంకాలం ఇంటింటికీ వెళ్లి లేగదూడల్ని కట్టివేస్తున్న బల్లికృష్ణుడు:

"గోధూళి ధూసరిత కోమల గోపవేషం
గోపాల బాలకశతై రనుగమ్య మానమ్ ।
సాయంతనే ప్రతిగృహం పశుబన్ధనార్థం
గచ్ఛంత మచ్యుత శిశుం ప్రణతోఽస్మి నిత్యమ్ ॥" *(2-44)*

(కపట గోపాల బాలరూపంలో ఉన్న విష్ణుమూర్తికి నేను ఎల్లప్పుడూ నమస్కరిస్తాను. ఆ బాలగోపాలుడు ఎలా ఉన్నాడంటే - ఆవుల కాలిగిట్టలనుండి లేచిన దుమ్ముతో ఒళ్లంతా బూడిదరంగు పడివున్న సొంపైన పసులకాపరి వేషంలో ఉన్నాడు. వందలాది గొల్లపిల్లకాయల్ని వెంట వేసుకొని తిరుగుతున్నాడు. మేపి తోలితెచ్చిన పశువుల్ని సంజవేళ కట్టివేయడం కోసం ఇంటింటికీ తిరుగుతున్నాడు. అటువంటి బాలగోపాలునికి నమస్కరిస్తాను).

1.10 యశోదా కృష్ణుడు :

1.10.1 పగటిపూట ఆవుపాలకోసం తల్లిదగ్గర మారాం చేస్తున్నాడు బాలకృష్ణుడు:

తల్లి యశోదకీ ముద్దుకృష్ణుడికీ ఈ క్రింది విధంగా సంభాషణ జరుగుతోంది :

కృష్ణుడు : "ఓ అమ్మా!"

యశోద : "ఏమిరా, నా యాదవరాజా?"

కృష్ణుడు : నా ఆవుకోర (పాలగిన్నె) తీసుకురా!"

యశోద : "దానితో ఏంపని?"

కృష్ణుడు : "పాలు త్రాగడం కోసం"

యశోద : "పాలు ఇప్పుడులేవు"

కృష్ణుడు : "మరి ఎప్పుడు ఉంటాయి.?"

యశోద : "రాత్రివేళ"

కృష్ణుడు : "రాత్రి అంటే ఏమిటి?"

యశోద : "చీకటి పడటం"

- తల్లి ఇలా అనగానే ఆ బాలకృష్ణుడు తన రెండు కన్నులూ గట్టిగా మూసుకొని, "అమ్మా! రాత్రి వచ్చేసింది! నా పాలగిన్నె తీసుకురా!" - అంటూ, తల్లి అయిన యశోద పైట

కొంగు చేతులతో పట్టి లాగుతున్నాడు. అటువంటి ముద్దుకృష్ణుడు మమ్మల్ని కాపాడుగాక!

"మాతః, కిం యదునాథ!, దేహిచషకం, కింతేన, పాతుం పయః,
తన్నాస్త్యద్య, కదాస్తివా, నిశి, నిశాకా, వాఽన్ధకారోదయః, ।
ఆమీల్యాక్షియుగం, నిశాప్యుపగతా, దేహీతి, మాతుర్ముహుః
వక్షోజాంశుక కర్షణోద్యత కరః, కృష్ణస్సపుష్ణాతునః ॥" (2-60)

యశోదాకృష్ణుల రమ్యమైన సంభాషణతో కూడిన ఈ అందమైన శ్లోకాన్ని వెలగపూడి వెంగన్న రమణీయంగా అనువదించాడు :

"అమ్మ, అదేమిరా యదుకులాగ్రణి, గిన్నెయొసంగు, మేల, పా
లిమ్ముగఁద్రావ, లేదిపు, డదెప్పుడు, రే, యది యెట్టి, దంధకా
రమ్మగు నన్నఁ, గన్మొగిచి, రాతిరి వచ్చెను. వేగపాలు తే
తెమ్మని, తల్లిపైట వడిదీయు ముకుందుఁడు, నన్ను బ్రోచుతన్."

1.10.2 యశోదా కృష్ణుడులో రెండవరకం: తల్లిచేతికి దొరక్కుండా ఆలమంద మధ్య పరుగులు పెడుతూ ఒళ్లంతా బురద చేసుకుంటున్న బుల్లికృష్ణుడు:

"సంబాధే సురభీణా, మంబా మాయాసయన్త మనుయాంతీమ్ ।
లంబాలక మవలంబే, తంబాలం తనువిలగ్న జంబాలమ్ ॥ " (2-77)

మందలో ఆవులమధ్య మట్టిలో ఆటలాడుతున్నాడు చిన్నికృష్ణుడు. పశువులనడుమ పిల్లాడు ఏమైపోతాడో అనే భయంతో తల్లి యశోద పరుగెత్తుకొని వస్తోంది. చిన్ని కృష్ణుడు ఆమె చేతికి దొరక్కుండా ఆలమందమధ్య గునుకు పరుగులు పెడుతున్నాడు. తల్లిని తిప్పలు పెడుతున్నాడు. అతని వెనుక పరుగెత్తలేక యశోద ఆయాసపడుతోంది. అలా తల్లిని అలసి పోయేలా చేస్తూ, ముంగురులు వ్రేలాడుతుండగా తలవిరబోసుకుని, ఒళ్లంతా బురద చేసుకుని ఆడుకుంటున్న చిన్ని కృష్ణుణ్ణి ఆశ్రయిస్తాను - అంటున్నాడు లీలాశుకుడు. ఇక్కడ కవి బిందుపూర్వక దీర్ఘబకారం ప్రయోగించడంవల్ల ఆలమందలోని ఆవులు "అంబా అంబా" అని అరుస్తూ కృష్ణసాన్నిధ్యంలో తమ సంతోషాన్ని వెల్లడిస్తున్నట్టుగా శ్రోతకు అనుభూతి కలుగుతుంది!

II బృందావనంలోని బాలకృష్ణుడు లేదా గోపాలకృష్ణుడు :-

కవులు మానవులను శిరస్సునుండి సిరిపాదం వరకూ వర్ణిస్తారు. దేవతలను సిరిపాదంనుండి శిరస్సువరకూ అంటే నఖశిఖపర్యంతం వర్ణిస్తారు. శ్రీకృష్ణుడు సాక్షాత్తు విష్ణుమూర్తి అవతారం కాబట్టి పాదాలనుండి శిరస్సువరకూ వర్ణించడమే ఈకావ్యంలో కనబడుతుంది. (చూ. 3-67). గోపికల చూపులు శ్రీకృష్ణునిపై ప్రసరించిన సందర్భాన్ని వర్ణించేటప్పుడు కూడా ఈ నఖశిఖ పర్యంతపద్ధతే పాటించబడింది (చూ.3-86).

లీలాశుకుడు తన మొట్టమొదటి ఇష్టదేవతాస్తుతి శ్లోకంలోనే శ్రీకృష్ణుని సిరిపాదాలు వర్ణించాడు. శ్రీకృష్ణుని "భగవాన్ శిఖిపింఛమౌళి:" అని సంబోధించాడు. "సిరిపాదములనుండి శిఖిపింఛము వరకుగల బాలకృష్ణమూర్తి యొక్క దివ్యమంగళ విగ్రహ వర్ణనమే నా కావ్యేతివృత్తం సుమా" అని సూచించినట్లుగా ఉంది ఈ నాందీశ్లోకం. అంటే పాదములు - శిరస్సుమీది నెమలిపురి: ఈ రెండింటి మధ్యగల బాలకృష్ణ రూపాన్ని శ్రీకృష్ణకర్ణామృత కావ్యంలో చిత్రవిచిత్రంగా, పరమభక్తి తన్మయత్వంతో, సాంద్రమైన అనుభూతి (Intense Feeling) తో స్పష్టమైన భావచిత్రాలతో వర్ణించి చెప్పాడు లీలాశుకుడు. శ్రీకృష్ణ పరమాత్మయొక్క స్వరూపాన్ని మన కళ్లకు కట్టినట్లు ప్రత్యంగవర్ణనం చేశాడు. ముఖ్యంగా నెమలి పింఛం, దయారస భరితములైన కన్నులు, చల్లని కంటిచూపులు, మధురమైన అధరం, శ్రావ్యమైన వేణుగానం, మధురభక్తి నిధానలైన గోపికలు - వారి అచంచలమైన శుద్ధ ముగ్ధ కృష్ణభక్తి, ప్రతిశ్లోకంలోనూ స్పృశించాడు కవి.

లీలాశుకుని బాలగోపాలకృష్ణ వర్ణనలో మూడుపద్ధతులు కనబడతాయి :

(1) బాలకృష్ణుని సుందర రూపంలోని ఒక్క భాగాన్ని లేదా ఒక్క అంశాన్ని మాత్రమే వర్ణించడం :

ఉదాహరణానికి -

కేవలం కన్నుల్ని మాత్రమే వర్ణించడం (1-13,1-45),

కేవలం చిరునవ్వును మాత్రమే వర్ణించడం (1-98),

కేవలం పాదాలను మాత్రమే వర్ణించడం (1-12, 1-16, 1-80, 3-72),

కేవలం కాలి అందెల మ్రోతను మాత్రమే వర్ణించడం (1-17),

కేవలం వక్షస్థలాన్ని మాత్రమే వర్ణించడం (3-46),

కేవలం ముఖాన్ని మాత్రమే వర్ణించడం (3-56),

కేవలం శరీర శ్యామకాంతిని మాత్రమే వర్ణించడం (2-1, 2-2, 3-83),

కేవలం వేణువును మాత్రమే వర్ణించడం (2-9, 2-11),

కేవలం వేణుగానాన్ని మాత్రమే వర్ణించడం (2-5, 2-102) ఇత్యాదులు.

బాలకృష్ణుని పాదాలు మాత్రం వర్ణించిన శ్లోకం :

"రాగాంధ గోపీజన వందితాభ్యాం
యోగీంద్ర భృంగేంద్ర నిషేవితాభ్యామ్ ।
ఆతామ్ర పంకేరుహ విభ్రమాభ్యాం
స్వామిన్పదాభ్యాం అయమంజలిస్తే ॥ " *(3-72)*

(స్వామీ! నీపాదాల కోసం ఈ నా అంజలి - నీ పాదాలకు నేను మ్రొక్కుతున్నాను. ఆపాదాలు ఎటువంటి వంటే - మిక్కిలి ప్రేమచేత కన్నుగానని గోపికల సమూహంచేత వందనం చేయబడినవి. యోగీశ్వరులనే తుమ్మెదలచేత మిక్కిలిగా సేవింపబడినవి. అంతటా ఎఱ్ఱగా ఉన్న పద్మముయొక్క విలాసం కలవి).

(2) బాలకృష్ణుని దివ్యసౌందర్యంలోని మూడు నాలుగు భాగాల్ని లేదా అంశాల్ని కలిపి ఒకే శ్లోకంలో వర్ణించడం:

ఉదాహరణానికి -

రెండు అంశాల వర్ణన : శరీరం, ముఖం : (1-91)

మూడు అంశాల వర్ణన : మోవి, వేణుగానం, మోము : (2-13)

నాలుగు అంశాల వర్ణన : పాదాలు, కన్నులు, ముఖం, శరీరం : (1-88)

ఆరు అంశాల వర్ణన : ఒత్తైన జుట్టు, నెమలి పింఛం, కన్నులు, అధరం, మందహాసం, ఒయారపునడక - అనే ఆరు అంశాలతో కూడిన ముద్దు రూపం (1-46)

విశాలములైన బొమ్మ, కన్నులు; కోమలములైన చిరునవ్వు, మోహన వాక్కులు;

కమ్మని పెదవి, వేణునాదం;- ఈ ఆరింటితో చక్కదనపు నిక్కమైన బాలుడు (1-66).

ఒకే ఒక చిన్న శ్లోకంలో బాలకృష్ణుని రూపంలోని ఏడుఅంశాలు వర్ణించిన సందర్భాలు కూడా ఉన్నాయి. దట్టమైన జుట్టు, పలుచని జులపాలు, నెమ్మది మాటలు, పెద్దకన్నులు, తీయని మోవి, అందమైన మొగము, లోలమైన చరిత్ర - అన్ని కలిపి చెప్పాడు ఒక చిన్న శ్లోకంలో లీలాశుకుడు (1-61)

ఈ క్రింది శ్లోకంలో బాలకృష్ణుని అధరం, మందహాసం, మాటలు, చూపులు, కన్నులు, వేణునాదం, శరీరవర్ణం (వన్నె) - ఇవన్నీ కలిపి చెప్పాడు కవి :

"మధుర మధర బింబే, మంజులం మందహాసే,
శిశిర మమృతవాక్యే, శీతలం దృష్టిపాతే ।
విపుల మరుణ నేత్రే, విశ్రుతం వేణునాదే
మరకతమణి నీలం, బాల మాలోకయేను ॥" *(1-64)*

(దొండపండు వంటి క్రిందిపెదవి యందు తీయని వాడును,
చిరునవ్వునందు మనోజ్ఞమైన వాడును,
చూపునందు చల్లని వాడును,
ఎఱ్ఱని కంటియందు విస్తారమైన వాడును,
ప్రిల్లనగ్రోవి నూదుటలో పేరువడసిన వాడును,
మరకతమణివలె నల్లనైన వాడును,
- అయిన బాలుని ఎప్పుడైనా చూస్తానా?)

(3) మధుర మంజులమైన మొత్తం బాలకృష్ణ రూపాన్ని ఒక శ్లోకంలో వర్ణించడం: (2-7, 2-12, 2-87, 2-109, 3-84)

మొత్తం బాలకృష్ణ రూపాన్ని మనోజ్ఞంగా వర్ణించిన శ్లోకాలకు ఉదాహరణంగా ప్రసిద్ధమైన 'కస్తూరీతిలకం లలాట ఫలకే.." అనే శ్లోకాన్ని చెప్పవచ్చు.

"కస్తూరీ తిలకం లలాటఫలకే, వక్షస్థలే కౌస్తుభం,
నాసాగ్రే నవమౌక్తికం, కరతలే వేణుం, కరే కంకణమ్ ।

సర్వాంగే హరిచందనంచ, కలయన్, కంఠేచ ముక్తావళిం,
గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాల చూడామణిః ॥" (2-109)

దీనికి వెలగపూడి వెంగన్న చేసిన అనువాదంకూడా చక్కగా వచ్చింది.

మ. "నుదుటం గస్తురి బొట్టు, నాసికతుదన్ముత్తెంబు, శ్రీగంధ సం
పద నెమ్మేనఁ, గరంబులం గటకముల్, వంశంబు హస్తాగ్రమం,
దెదపై నిస్తుల కౌస్తుభంబు, నఱుతన్ శృంగార హారంబు, నిం
పొదవం, గృష్ణుఁడు, గోపికావృతుఁడు సర్వోత్కృష్టుఁడై వర్తిలున్."

అయినా, అనువాదం ఎంతబాగున్నా, మధుర మంజులమైన మూలశ్లోకమే ఆబాలగోపాలానికీ నోటికి వచ్చును కాబట్టి, అనువాదం సూర్యుని ముందు దివిటీగా అయిపోతోంది.

ఈ క్రింది శ్లోకంకూడా బాలకృష్ణమూర్తి సంపూర్ణ వర్ణనకు మంచి ఉదాహరణం :

"ఫుల్లేందీవరకాంతి, మిందువదనం, బర్హావతంసప్రియం,
శ్రీవత్సాంక, ముదార కౌస్తుభధరం, పీతాంబరం, సుందరమ్ ।
గోపీనాం నయనోత్పలార్చిత తనుం, గోగోప సంఘావృతం,
గోవిందం, కలవేణునాద నిరతం, దివ్యాంగ భూషం భజే ॥" (3-84)

(నేను శ్రీకృష్ణుణ్ణి సేవిస్తున్నాను. అతడు ఎటువంటి శ్రీకృష్ణుడంటే -
వికసించిన నల్లకలువల కాంతి వంటి శరీర కాంతి గలవాడు,
చంద్రునివంటి మోముగలవాడు,
నెమలిపింఛమనే శిరోభూషణమే ఇష్టపడేవాడు,
శ్రీవత్సమనే పుట్టుమచ్చ గలవాడు,
గొప్పదియైన కౌస్తుభమనే మాణిక్యాన్ని ధరించినవాడు,
పసుపుపచ్చని పట్టుబట్ట కట్టుకున్నవాడు,
అందమైనవాడు,
గోపికల నేత్రాలనే కలువపువ్వులచేత పూజింపబడిన దేహం కలవాడు,
గోవుల - గోపకుల సమూహాలచేత చుట్టుకొనబడినవాడు,

సువర్ణచషకం

అవ్యక్త మధురమైన వేణునాదం మీద ఆసక్తిగలవాడు,

సర్వోత్తమాలైన అవయవాలకు ఆభరణాలు కలవాడు,

- అటువంటి గోవిందుణ్ణి సేవిస్తున్నాను).

లీలాశుకుని ఈ బాలకృష్ణమూర్తి వర్ణనలో ఒకే అంశాన్ని వర్ణించిన మొదటి పద్ధతి శ్లోకాలు తక్కువగా ఉన్నాయి. రెండు మూడు అంశాలను కలిపి వర్ణించిన రెండవ పద్ధతి శ్లోకాలూ, మొత్తం రూపాన్ని మనోజ్ఞంగా వర్ణించిన మూడవ పద్ధతి శ్లోకాలూ ఎక్కువగా ఉన్నాయి కర్ణామృతంలో.

లీలాశుకుడు వర్ణించిన బాలకృష్ణుని దివ్యసౌందర్యంలోని వివిధ భాగాలను ఈ క్రింది విధంగా గుర్తించవచ్చు :

1. నెమలిపురి	2. కురులు-ముంగురులు
3. ముఖము-కస్తురిబొట్టు	4. కన్నులు-కంటిచూపులు
5. అధరం-చిరునవ్వు	6. వేణువు-వేణుగానం
7. తియ్యని మాటలు	8. వక్షస్థలం
9. హస్తములు-వ్రేళ్ళు	10. పాదములు-వ్రేళ్ళు
11. శరీరం (తనువు) (2-1) - శరీరకాంతి (2-2)	12. పీతాంబరం
13. అలంకరణలు	14. ముగ్ధవేషం (1-46)
15. ఆశ్చర్యకరమైన సంపూర్ణరూపం (పూర్తి అకారం) (1-88)	16. దివ్యసౌందర్యం (సొబగు) (3-12)
17. దివ్యమంగళ విగ్రహం (1-108)	18. త్రిలోక సుందరమూర్తి (3-99)
19. మూర్తి మాధుర్యం లేక మధురరూపం (1-91) మధురాద్వైతం ('మధురిమణి లీయే') (1-51, 1-52, 1-53)	20. అమృతరూపం (1-18)
21. కృష్ణతేజస్సు లేక దివ్యతేజస్సు (1-73)	22. కృష్ణావతారప్రాశస్త్యం

పై వర్ణనలనుబట్టి కవి బాలకృష్ణునిలో ఈ క్రింది కృష్ణరూపాలను దర్శించాడని చెప్పవచ్చు :-

1. మురళీ కృష్ణుడు (2-102)
2. గోపాల కృష్ణుడు
3. గోపీ కృష్ణుడు
4. మోహన కృష్ణుడు
5. రాధా కృష్ణుడు
6. గోకుల పూర్ణ చంద్రుడు (1-100)
7. బృందావన కృష్ణుడు
8. రాసక్రీడా కృష్ణుడు (2-35 నుండి 42 వరకు)
9. మదన గోపాలుడు (3-104)
10. మన్మథ రూపుడు (3-98)
11. వశ్య గోపాలుడు (3-99)
12. అవతారమూర్తి (2-72)
13. పరబ్రహ్మ స్వరూపుడు లేదా పరతత్త్వ రూపుడు (3-66)

ఉదాహరణాలు:-

(1) శ్రీకృష్ణుని అమృతరూపం : (లలితగతి ఛందం)

"తరుణారుణ కరుణామయ విపులాయత నయనం
కమలాకుచ కలశీభర విపులీకృత పులకమ్ ।
మురళీరవ తరళీకృత మునిమానస నలినం
మమ ఖేలతి మద చేతసి మధురాధర మమృతమ్ ॥" *(1-18)*

(శ్రీకృష్ణ పరమాత్మయొక్క అమృత రూపం నా మత్తచిత్తంలో క్రీడిస్తోంది. ఆ అమృతరూపం ఎలా ఉందంటే - కొంచెం ఎఱ్ఱగా వున్న విశాలమైన దయగల నేత్రాలు కలిగి ఉంది. లక్ష్మీదేవియొక్క కలశాల వంటి స్తనభారంమీద మిక్కిలిగా రోమాంచం కలిగిస్తోంది. తవ వేణునాదం చేత మునుల మనస్సులనే కమలాలనుకూడా చపలంగా చేయగలుగుతోంది. కమ్మని మోవి కలిగిఉంది - బాలకృష్ణుని అమృతరూపం!)

(2) బాలకృష్ణుని మధురరూపం : (తోటక ఛందం)

"మధురం మధురం వపురస్య విభోః
మధురం మధురం వదనం మధురమ్ ।

మధుగంధి మృదుస్మిత మేతదహో
మధురం మధురం మధురం మధురమ్ ॥" (1-91)

(ఈ ప్రభువైన శ్రీకృష్ణునియొక్క శరీరం మిక్కిలి మధురమైనది. మకరందపు వాసనతోను, సుకుమారమైన నవ్వుతోను కూడి వుండడంవల్ల ఈ కృష్ణుని ముఖం అంతకన్నా మధురమైనది; మధురాతి మధురమైనది. ఆహా! కృష్ణునిలో అంతా మధురమే!)

(3) బాలకృష్ణుని దివ్యతేజస్సు : (వసంతతిలకం ఛందం)

"చాపల్యసీమ చపలానుభవైక సీమ
చాతుర్యసీమ చతురానన శిల్పసీమ ।
సౌరభ్యసీమ సకలాద్భుత కేళిసీమ
సౌభాగ్యసీమ తదిదం వ్రజభాగ్యసీమ ॥ " (1-73)

(బాలకృష్ణుని దివ్యతేజస్సు ఇదిగో! నాకు కనబడుతోంది. అది చాంచల్యానికి పొలిమేర. లక్ష్మీదేవి అనుభవానికి ముఖ్యమైన నెలవు. నేర్పునకు చోటు. బ్రహ్మయొక్క పనితనానికి హద్దు. పరిమళానికి స్థానం. ఎల్ల చిత్రాలకూ క్రీడాస్థానం. సౌందర్యనిధి. యాదవుల అదృష్టఫలానికి పరమావధి!)

(4) గోకుల పూర్ణచంద్రుడైన బాలకృష్ణుడు :

"మందార మూలే మదనాభిరామం
బింబాధరాపూరిత వేణునాదమ్ ।
గోగోప గోపీ జన మధ్య సంస్థం
గోపం భజే గోకుల పూర్ణచంద్రమ్ ॥" (1-100)

(కల్పవృక్షం మొదట్లో నిలుచున్న వాడూ, మన్మథునివలె అందమైన వాడూ, దొండపండు వంటి పెదవితో ఒత్తి వేణువును ఊదుతున్నవాడూ, గోవులు - గోపాలురు - గోపికలు : వీరి నడుమ ఉండేవాడూ, గోకులానికి పూర్ణచంద్రుని వంటి వాడూ అంటే వ్రేపల్లెలోని వారికందరికీ ఆహ్లాదాన్ని కలుగజేసేవాడూ అయిన - గోపరూపంలో ఉన్న బాలకృష్ణుణ్ణి - మాయాగోపాలుడైన శ్రీకృష్ణుని నేను సేవిస్తున్నాను).

(5) వేణుగోపాలుడు లేక మురళీకృష్ణుడు :-

"అంసాలంబిత వామ కుండలభరం, మందోన్నతభ్రూలతం,
కించి త్కుంచిత కోమలాధరపుటం, సాచిప్రసారేక్షణమ్ ।
ఆలోలాంగుళి పల్లవైర్మురళికా, మాపూరయంతం ముదా,
మూలేకల్పతరో: త్రిభంగిలలితం, జానే జగన్మోహనమ్॥" (2-102)

మురళీగానం చేస్తున్న కృష్ణుణ్ణి కల్పవృక్షం మూలలో ఉన్నట్లు తెలుసుకుంటున్నాను. అతడు ఎలా ఉన్నాడంటే - ఎడమప్రక్కగా తల వంచడంచేత ఆ ప్రక్కనున్న చెవికుండలం బరువు మూపుపై ఆనింది. ఒక కనుబొమ వంగింది; మరొకటి పొడవుగావుంది. కొంచెం ముడిచిన మృదువైన పెదవులు కలిగిఉన్నాడు. (పిల్లనగ్రోవిని ఊదేటప్పుడు పెదవులు కొంచెం ముడిచాడు). చూపులు అడ్డంగా వ్యాపిస్తున్నాయి. (తల కొంత వంచి, ఒక ప్రక్కకు వాల్చి, వేణువును ఊదేటప్పుడు, చూపులు అడ్డంగా నిగుడుతున్నాయి). చలిస్తున్న - అంటే మురళిపై ఉన్న రంధ్రాల మీదుగా సంచరిస్తున్న - చిగుళ్లవంటి వ్రేళ్ళచేత వేణువును సంతోషంతో పూరిస్తున్నాడు. 'త్రిభంగి' చేత - అంటే మూడు వంపులచేత - సుందరమైనవాడు. (పాదాలనుండి కటివరకు ఒక వంపు, కటినుండి మెడవరకు ఒక వంపు, తల ఒకవంపు - ఈ మూడు వంపులకు 'త్రిభంగి' అనిపేరు).

(6) రాసక్రీడా కృష్ణుడు :

శ్రీకృష్ణకర్ణామృతంలోని ద్వితీయాశ్వాసంలో, గోపికలతో కలిసి రాసక్రీడ ఆచరిస్తున్న కృష్ణుణ్ణి, లీలాశుకుడు ఎనిమిది శ్లోకాల్లో చాలా అందంగా వర్ణించాడు. వీటిని 'రాసక్రీడాష్టకం' అని పిలుస్తారు. వీటిలో మొదటి శ్లోకం - మిక్కిలి జనప్రియమైన శ్లోకం.

"అంగనా మంగనా మంతరే మాధవో
మాధవం మాధవం చాంతరేణాంగనా ।
ఇత్థమా కల్పితే మండలే మధ్యగః
సంజగౌ వేణునా దేవకీనందనః ॥" (2-35)

(ఇద్దరు గోపికా స్త్రీల నడుమ ఒక కృష్ణుడు ఉన్నాడు. ప్రతి ఇద్దరు కృష్ణుల నడుమా

ఒక గోపిక ఉన్నది. ఇలా రచింపబడిన గోపికా కృష్ణుల వలయంలో గుంపు నడుమ చేరిన వాడై దేవకీ నందనుడైన కృష్ణుడు పిల్లనగ్రోవితో సొగసుగా పాడాడు).

(7) రాధాకృష్ణుడు :

రాధాకృష్ణుల ప్రణయాన్ని వర్ణించే శ్లోకాలు ఈ కావ్యంలో నాలుగైదు ఉన్నాయి. వాటిలో ఒక చమత్కారయుతమైన శ్లోకాన్ని దిగువ ఇస్తున్నాను :

"రాధా పునాతు జగ దచ్యుత దత్త చిత్తా
మన్థాన మాకలయతీ దధిరిక్త పాత్రే ।
తస్యాః స్తన స్తబక చంచల లోల దృష్టిః
దేవోఽపి దోహనధియా వృషభం నిరుంధన్ ॥" *(2-25)*

(తన చిత్తమంతా శ్రీకృష్ణునియందు చేర్చినదై పెరుగులేని బానలో కవ్వాన్ని ఉంచుతున్న రాధ లోకాన్ని పావనం చేయుగాక! ఆ రాధయొక్క పూలగుత్తుల వంటి పాలిండ్లయందు మాటిమాటికి ప్రవర్తిస్తున్న ఆసతో కూడిన చూపుగలవాడై, పాలుపితకడం కోసం ఎద్దుకు బందంవేస్తున్న కృష్ణుడు కూడా జగత్తును పవిత్రం చేయుగాక!)

III మథురానగరంలోని కౌమార కృష్ణుడు :-

ఇతనినే 'ప్రథమ యౌవన కృష్ణుడు' అనీ, 'లేత్రాయపు కన్నయ్య' అనీ, 'నూనూగు మీసాల నూత్నయౌవన కృష్ణుడు' అనీ కూడా పిలువవచ్చు.

బాలకృష్ణుడికి యౌవనం వచ్చింది. కాని బాల్యం పూర్తిగా పోలేదు. ఈ సంధి వయస్సు విషయం కవే స్వయంగా చెప్పాడు. ఇటువంటి మధురానగరిలోని నూత్నయౌవన కృష్ణుణ్ణి వర్ణించిన శ్లోకాలు ఈ కావ్యంలో రెండుమూడు మాత్రమే ఉన్నాయి. (1-57, 3-19)

"మధురైక రసం వపుర్విభోః
మధురావీథి చరం భజామహే ।
నగరీ మృగశాబలోచనా
నయనేందీవరవర్ష వర్షితమ్ ॥" *(3-19)*

(శ్రీకృష్ణుని శరీరాన్ని సేవిస్తున్నాం. ఆ శరీరం ఎటువంటిదంటే - సౌందర్యంయొక్క ముఖ్యమైన సారం లాంటిది (the important essence of beauty). మధురానగర వీథుల్లో సంచరించేటువంటిది. మధురానగరంలో, లేడి పిల్లల కన్నుల వంటి కన్నులు కలిగిన యువతులయొక్క కన్నులనే నల్లకలువల వర్షంచేత తడిసిపోతున్నటువంటిది).

IV ద్వారకానగరంలోని యౌవనకృష్ణుడు లేక రుక్మిణీకృష్ణుడు :-

ఈ యౌవన కృష్ణుణ్ణి గురించి శ్రీకృష్ణకర్ణామృతంలో రెండుమూడు శ్లోకాలు మాత్రమే కనబడతాయి (2-64, 2-71.) వీటిలో రుక్మిణికి లక్ష్మీదేవికి అభేదం కనబడుతుంది (2-91).

రాత్రివేళ రహస్యక్రీడలో ఉన్నప్పుడు రుక్మిణీదేవి శ్రీకృష్ణుణ్ణి ఇలా పరిహాసిస్తూ వారిస్తోందట :

"ఓకృష్ణా! నా పెదవిని కరవకు. నాకు భయం వేస్తోంది. నువ్వు వెనకటికి పూతన పాలిండ్లు పెదవులతో చీకి ఆమెను చంపివేశావు. నామెడను కౌగిలించుకోకు. పూర్వం నువ్వు కౌగిలించుకుంటే మద్దిచెట్లు రెండు కూలిపోయాయి. నన్నుగిల్లకు. పూర్వం నువ్వు హిరణ్యకశిపుణ్ణి గోళ్లతో చీల్చిచంపేశావు." - ఇలా పరిహాసంతో రాత్రికేళిలో రుక్మిణిచేత వారింపబడిన కృష్ణుడు మమ్మల్ని కాపాడుగాక! - అంటాడు లీలాశుకుడు.

"ఓష్ఠం ముంచ హరే బిభేమి భవతా పానైర్హ్వతా పూతనా
కంఠాశ్లేష మముం జహీహి దళితౌ చాలింగనే నార్జునౌ ।
మాదేహిచ్ఛురితం హిరణ్యా కశిపుర్నీతో నఖైః పంచతాం
ఇత్థంవారిత రాత్రికేళి రవతా ల్లక్ష్మ్యుపహాసాద్ధరిః ॥" *(2-71)*

వెలగపూడి వెంగన్న ఈ శ్లోకాన్ని అనువదిస్తూ చివర్లో అర్థాన్ని కొంచెం శృంగార రసాత్మకంగా మార్చి వేశాడు. "ఈ విధంగా రుక్మిణిచేత వారింపబడిన కృష్ణుడు మమ్మల్ని కాపాడాలి" అని లీలాశుకుడంటే - వెంగన్న " ఈవిధంగా వారిస్తున్న రుక్మిణిపైన పడి రమించిన కృష్ణుణ్ణి నేను పూజిస్తాను" అని లీలాశుకుడి భావాన్ని రసవంతం చేస్తూ, దానికి కొంత వాస్తవికతను సంతరించాడు. ఇతడు 'కౌగిలింత' ను 'బల్మిని తొమ్ము క్రుమ్మడం' గా కూడా మార్చివేశాడు.

ఉ. "అమ్మకచెల్ల మోవి చవి యానకు - పూతన సోలెఁ గ్రోలఁగా,
గ్రుమ్మకు జొమ్ముబల్మిన - ధరంబడె మద్దులు కాన, గోటిచేఁ
జిమ్మకుమీ - హిరణ్యకథచే మది భీతిలె, నంచుఁదచ్చునల్
బ్రమ్మచుఁ, గేళిమాన్పు రమఁబైకొని కూడిన శౌరిఁగొల్చెదన్."

ప్రబంధాలు చదివి లొట్టలువేసే తెలుగు రసికులకు ఈ మార్పులు బాగా నచ్చుతాయి.

V ప్రౌఢ కృష్ణుడు/కురుక్షేత్ర కృష్ణుడు/వీర కృష్ణుడు/శౌరి/పార్థసారథి కృష్ణుడు :-

ఇక్కడ 'శౌరి' అంటే 'శూరుని వంశంలోని వాడు' అని మాత్రమేకాదు; తాను స్వయంగా మహావీరుడు. అనేక శత్రురాజుల్ని చంపినవాడు. భీష్ముని మీదికి చక్రాన్ని ప్రయోగింపబోయినవాడు. మహావీరుడైన ఈ పార్థసారథిని గురించి రెండుశ్లోకాలు మాత్రమే ఈ కావ్యంలో ఉన్నాయి (2-46, 2-47). వాటిలో ఒక మహాద్భుతమైన శ్లోకాన్ని ఇంతకుముందే వివరించాను. పార్థసారథి, అర్జునుని రథాశ్వాలను ప్రతిదినం నీళ్లతో కడగటం అందులో చక్కగా వర్ణించాడు కవి. ఇంకొక శ్లోకాన్ని గురించి ఇక్కడ వివరిస్తున్నాను.

"అందమైన పగ్గాలను, ఎఱ్ఱతామరవంటి చేతితో పుచ్చుకొని, హారాలు మణికుండలాలు కదులుతూ ఉండగా, బంగారు మొలనూలు మెరుస్తూ ఉండగా, ఒళ్లు చెమర్చుచుండగా, అర్జునుని రథాశ్వాలను తోలుతున్నదీ, లోకాలకు ఆదియైనదీ, అర్జునుని రథానికి అలంకారమైనదీ, మేఘంలా నల్లనైనదీ అయిన వెలుగు మమ్మల్ని కాపాడుగాక!"

"ఆతామ్రపాణి కమల ప్రణయ ప్రతోదం
ఆలోల హార మణి కుండల హేమసూత్రమ్ ।
ఆవిశ్రమాంబుకణ మమ్బుద నీల మవ్యాత్
ఆద్యం ధనంజయ రథాభరణం, మహోనః ॥" (2-46)

లీలాశుకుని ప్రగాఢమైన కృష్ణభక్తి

1. నమస్కారం :

లీలాశుకుడు శ్రీకృష్ణునికి నమస్కరిస్తున్నాడు. ఎటువంటి శ్రీకృష్ణుడికి అంటే - పుట్టుకతోనే అత్యంత సౌందర్యం - 'జిహానం జిహానం' - మిక్కిలిగా పొందుచున్న వానికి

(శ్రీకృష్ణునికి బాల్యంలోని ముగ్ధసౌందర్యం ఇంకా వదలిపోలేదు); అమృతంలా ఆస్వాదించడానికి వీలైన వేణునాదం - 'దుహానం దుహానం' - మిక్కిలిగా కలిగించుచున్నవానికి (సృష్టించుచున్నవానికి); గోపికల చక్కదనాన్ని మిక్కిలి ఆశతో - లిహానం లిహానం - పలుమార్లు చూచుచున్నవానికి, నందుని పుణ్యాతిశయంవల్ల అతనికి పుత్రుడైన వానికి; నందుని సకలసంపదలూ తానే అయిన వానికి - నమస్కరిస్తున్నాడు.

"జిహానం జిహానం సుజానేన మౌగ్ధ్యం
దుహానం దుహానం సుధాం వేణు నాదైః
లిహానం లిహానం సుదీర్ఘై రపాంగైః
మహానంద సర్వస్వ మేతన్నమస్తాత్." *(3-68)*

2. శ్రీకృష్ణుడే తన సర్వస్వం :-

లీలాశుకునకు శ్రీకృష్ణుడు తప్ప వేరే దైవం లేడు. అతడు పూర్తిగా కృష్ణుణ్ణే నమ్ముకున్నాడు. "నీవే తప్పనితః పరంబెరుగ" అంటున్నాడు గజేంద్రుడులాగే. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ" అని గీతాకృష్ణుడు చెప్పినదానిని అక్షరాలా ఆచరిస్తున్నాడు లీలాశుకుడు :

"ఓ కృష్ణా! నాకు సంతోషాన్ని ఇచ్చినా, నాకోరికలు తీర్చినా, నాకు జ్ఞానాన్ని ప్రసాదించినా, నాకు ఐశ్వర్యాన్ని ప్రాణాన్ని బ్రదుకును ఇచ్చినా, నాకు ఇష్టదైవమైనా - అన్నీ నీవే. నీవు తప్ప నాకీ ప్రపంచంలో మరొకరు లేరు" అంటున్నాడు లీలాశుకుడు :

"ప్రేమదంచ మే కామదంచ మే
వేదనంచ మే వైభవంచ మే ।
జీవనంచ మే జీవితంచ మే
దైవతంచ మే దేవనాపరమ్ ॥" *(1-104)*

3. అయితే ఈ కృష్ణుడు ఎక్కడ ఉంటాడు?

లీలాశుకుని దృష్టిలో ఈ ప్రపంచంలో శ్రీకృష్ణుడు ఉండేచోట్లు మూడేమూడు. ఏనుగుగున్నలాంటి అతణ్ణి వశపరచుకుందామంటే ఎవరికీ శక్యంకాదు - అతణ్ణి ఎవరూ

బంధించలేరు. కాని అటువంటి కృష్ణునికి కూడా మూడు బంధనాలు (కట్రాడులు) ఉన్నాయి : (i) యశోద యింటిలోని రోలు (ii) యోగుల చిత్తము (iii) గోపికల చనుమొగ్గలు - ఈ మూడూ శ్రీకృష్ణుడనే ఏనుగు గున్నను కట్టిపడవైచే కట్టుకంబాలు లేదా కట్రాడులు.

"ఉలూఖలం వా, యమినాం మనో వా,
గోపాంగనానాం కుచకుట్మలం వా ।
మురారి నామ్నః కలభస్య నూనమ్
ఆలాన మాసీ త్త్రయమేవ భూమౌ ॥" (2-57)

4. నాలుకను ప్రార్థించడం :

ప్రగాఢమైన కృష్ణభక్తి కలిగిన లీలాశుకుడు, "ఎల్లప్పుడూ శ్రీకృష్ణుని మాత్రమే స్మరిస్తూ ఉండు"మని తన నాలుకను ప్రార్థించడం రమణీయమైన కల్పన :

"ఓ నాలుకా! నీవు ఎప్పుడూ కృష్ణుణ్ణే కీర్తిస్తూ ఉండు. ఎటువంటి కృష్ణుణ్ణి అంటే - మెల్లగా పిల్లనగ్రోవి ఊదుతున్న వాణ్ణి; తులసి తోటలో గోవుల్ని మేపుతున్నవాణ్ణి; వేదాలలో వర్ణింపబడిన వాణ్ణి; దేవేంద్రుని యాగాన్ని పాడుచేసిన రాక్షసుల్ని సంహరించిన వాణ్ణి; గోపికలతో తిరిగే వాణ్ణి - కీర్తించు!"

"మందం మందం మధుర నినదైః వేణు మాపూర యంతం,
బృందం బృందావనభువి గవాం చారయంతం, చరంతమ్ ।
ఛందోభాగే, శతమఖ మఖ ధ్వంసినాం దానవానాం
హంతారంతం, కథయ రసనే! గోపకన్యా భుజంగమ్ ॥" (2-6)

5. మనస్సును కోరడం :

ఒక్కనాలుకే కాదు, తన మనస్సు (చిత్తం) కూడా ఎల్లప్పుడూ నందకుమారుని పాదపద్మముల అధీనమై మాత్రమే ఉండాలని కవి కోరుకుంటున్నాడు.

ఆ నందకుమారుడు ఎటువంటి వాడంటే -
గోపికలే తోడుగా గలవాడు
యౌవనంతో మెరిసి పోతున్న శరీరం కలవాడు

సకల శుభములతో కూడిన విలాసం కలవాడు
మల్లెల వంటి, పారిజాతలవంటి నవ్వుకలవాడు
మునుల హృదయ కమలాలకు సూర్యుని వంటివాడు
ఆ నందయాదవుని కుమారుడు !

"వ్రజయువతి సహాయే, యౌవనోల్లాసి కాయే,
సకల శుభ విలాసే, కుంద మందార హాసే ।
నివసతు మమ చిత్తం, తత్పదాయత్తవృత్తం,
మునిసరసిజ భానౌ, నందగోపాల సూనౌ ॥" (2-48)

6. కవి కోరికలు రెండు :

6.1 మహాభక్తుడైన లీలాశుకుని ఒక కోరిక ఏమిటంటే - తాను ఏవైపు చూస్తే ఆ వైపు శ్రీకృష్ణుడు కనపడాలట.

"కృష్ణా! నేను ఏయే వైపుల నా చూపులు నిగిడిస్తానో, ఆయాచోటుల్లో, దయారసంచేత విపులమైన కన్నులతోనూ, శ్రవణ మధురములైన అమృతగానములతోను నీరూపమే గోచరించుగాక!" - అని అంటున్నాడు.

"అనుగ్రహ ద్విగుణ విశాల లోచనైః
అనుస్వన ద్విగుణ గళద్రవామృతైః ।
యతో యతః ప్రసరతి మే విలోకనం
తతస్తతః స్ఫురతు తవైవ వైభవం ॥" (1-110)

6.2 మహాభక్తుడైన లీలాశుకుని మరొక కోరిక ఏమిటంటే - ప్రాణంపోయే సమయంలో కూడా వేణుగోపాలుడనే తేజస్సు తన యెదుట సాక్షాత్కరించాలి. ఆ తేజస్సు ఎలాంటిదంటే - "కుడిపాదం ఎడమప్రక్కగాను, ఎడమపాదం కుడిప్రక్కగాను పెట్టుకొని ఉంటుంది. నెమలిపురిని శిరోభూషణంగా చేసికొని ఉంటుంది. ఒరగా చేయబడిన మొగములో (పెదవిపై) పిల్లనగ్రోవి రంధ్రాన్ని ఉంచుకొని ఉంటుంది. మిక్కిలి దయాళువై ఉంటుంది. ఉత్కృష్టమైనదిగా ఉంటుంది. అటువంటి తేజస్సు నా మరణకాలంలో నా యెదుట

సాక్షాత్కరించుగాక!" అంటున్నాడు లీలాశుకుడు. కృష్ణభక్తికి ఈ కోరిక పరాకాష్ఠ అని చెప్పవచ్చు.

"వ్యత్యస్తపాద మవతంసిత బర్హిబర్హం
సాచీకృతానన నివేశిత వేణురంధ్రమ్!
తేజః పరం పరమ కారుణికం పురస్తాత్
ప్రాణ ప్రయాణసమయే మమ సన్నిధత్తామ్ ॥ *(2-22)*

7. సంసారంలో సారం :

'సంసారంలోని సారం ఏమిటి?' అని తన్నుతాను ప్రశ్నించుకుని, లీలాశుకుడు 'కంసారి చరణకమల సేవమాత్రమే' అని సమాధానం చెప్పుకున్నాడు. అలాగే 'అజ్ఞానాంధకారంలో జ్యోతి ఏమిటి?' అని మళ్లీ ప్రశ్నించుకొని, 'అంధకారి (శివుని) నామస్మరణమే' అంటాడు. (అంధక+అరి=అంధకారి=అంధకాసురునకు శత్రువు - శివుడు).

"సంసారే కింసారం?, కంసారేశ్చరణ కమల పరిభజనమ్ ।
జ్యోతిః కిమంధకారే?, యదంధకారే రనుస్మరణమ్ ॥" *(2-80)*

(ఇక్కడ "అంధకారేః" అనే పదానికి "కృష్ణునియొక్క" అని కొందరు వ్యాఖ్యాతలు అర్థం వ్రాశారు. ఇది సరికాదు. అనువాదంలో వెలగపూడి వెంగన్న "ఇందుధరుడు" అని శివపరంగానే దీనిని అనువదించాడు).

8. మోక్ష సాధనం :

ధర్మార్థకామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థసాధనానికి, ముఖ్యంగా మోక్షసాధనానికి కృష్ణభక్తియే ముఖ్యం అంటాడు లీలాశుకుడు. "ఓ కృష్ణా! దైవవశం వల్ల ఎలాగైనా మాకు నీయందు కుదురైన భక్తి కుదిరిందంటే చాలు, ముక్తి కాంత తనకు తానే మా అండను చేరి, చేతులు కట్టుకొని పరిచర్య చేస్తుంది. ఇంక ధర్మార్థ కామాలు అంటావా, అని మా పంచలబడి, 'ఎప్పుడు మమ్మల్ని కటాక్షిస్తారు స్వామీ!' అంటూ ప్రాధేయపడుతూ, మాకోసం వేచి ఉంటాయి."

"భక్తిస్త్వయి స్థిరతరా భగవన్ యదిస్యాత్
దైవేన నః ఫలిత దివ్యకిశోర వేషే ।
ముక్తిః స్వయం ముకుళితాంజలి సేవతేఽస్మాన్
ధర్మార్థకామ గతయః సమయప్రతీక్షాః ॥" (1-107)

9.కృష్ణధ్యానమే నిరంతరకృత్యం :

'నిరంతరం శ్రీకృష్ణధ్యానం తప్ప, జీవితంలో ఇంకే పనీ చేయలేను' - అని అంటున్నాడు లీలాశుకుడు. "సంధ్యావందనం చేయలేను. స్నానం చేయలేను. ఓ దేవతలారా! పితరులారా! మీకు తర్పణాలు ఇవ్వలేను. నన్ను మన్నించండి. నేనేదో ఒక మూలన కూర్చుండి కృష్ణుని ధ్యానించుకుంటూ పాపాన్ని పోగొట్టుకుంటాను. నా కదిచాలు. మరొక దానితో నాకేమి పని?"

"సంధ్యావందన భద్రమస్తు భవతే, భోః స్నాన తుభ్యం నమో,
భోదేవాః పితరశ్చ తర్పణ విధౌ నాహం క్షమః క్షమ్యతామ్ ।
యత్రక్వాపి నిషీద్య, యాదవ కులోత్తంసస్య కంసద్విషః
స్మారం స్మార మఘం హరామి, తదలం మన్యే, కిమన్యేనమే? ॥" (2-107)

10. స్వప్నంలో శ్రీకృష్ణసాక్షాత్కారం :

ఇంతటి మహాభక్తుడైన లీలాశుకుడికి శ్రీకృష్ణపరమాత్మ స్వప్నంలో సాక్షాత్కరించాడు. ఆ దివ్యానుభవాన్ని ఇలా చెప్పుకున్నాడు :

"జుట్టు ముడిలో నల్లమబ్బులాంటి నెమలిపురిని చెరువుకున్నాడు. తళ తళ మెరుస్తున్న పీతాంబరం వల్ల మెరుపు తీగతో చుట్టబడినవాడులా ఉన్నాడు. ఇంద్రనీలమణి స్తంభాలవంటి బలమైన భుజములు కలిగిఉన్నాడు. లేత తులసిమాల భూషణంగా కలిగిఉన్నాడు - ఇటువంటి కృష్ణమేఘం (నీలమేఘం) లక్ష్మీదేవిని కౌగిలించు కున్నవాడై నాకలలో కనిపించాడు."

"వేణీమూలే విరచిత ఘనశ్యామ పింఛావ చూడో
విద్యుల్లేఖా వలయిత ఇవ స్నిగ్ధపీతాంబ రేణ ।

మామాలింగ న్మరకతమణి స్తంభ గంభీరబాహు:
స్వప్నేదృష్ట స్తరుణ తులసీభూషణో నీలమేఘ: ॥" (2-7)

11. శ్రీకృష్ణసేవ వల్లనే జన్మసాఫల్యం :

తన కవిత్వానికి జీవగఱ్ఱ శ్రీకృష్ణుడే అని ముందుగానే చాటుకున్నాడు లీలాశుకుడు. 'విజయతాం మమ వాజ్మయ జీవితమ్' (1-8) అంటాడు ప్రారంభంలోనే. ఇంకొక చోట, శ్రీకృష్ణుని కీర్తించడం వల్లనే తనవంటి వారి మామూలు మాటలు కమ్మదనాన్ని వెదచల్లే మహాకవి వాక్యాలుగా మారాయి అంటాడు. "సముజ్జృంభా గుంభా మధురిమ గిరాం మాదృశగిరాం". చంచలమైన తనజన్మకు ముక్తిరూపమయిన పరమ లాభం శ్రీకృష్ణసేవ వల్లనే లభించింది - అంటాడు ఈ మహాభక్తుడు.

'కృష్ణా! నీవు అవతరించిడంవల్ల, నీ అండచేరి, సిగ్గులేని చపలలైన గొల్లపడుచులు రతీదేవుల్లా అయిపోయారు. నిన్ను చేరడంవల్ల వేణుగానం తేనెలతో నిండిపోయి చెప్పరాని మాధుర్యాన్ని పొందింది. నీవల్ల నా చాంచల్యం మనోజ్ఞమైనదిగా మారింది. నిన్ను స్తుతించడంవల్ల మాబోటి అనామధేయుల వాక్కులు కూడా మనోహరాలై శోభిల్లుతున్నాయి. నిన్ను సేవించడంవల్లనే నాబోటి దీనుని వ్యర్థమైన జన్మకూడా సఫలమైంది"

"గళద్వ్రీడా లోలా మదన వనితా గోపవనితా,
మధుస్ఫీతం గీతం కిమపి, మధురా చాపల ధురా ।
సముజ్జృంభా గుంభా మధురిమ కిరాం మాదృశ గిరాం.
త్వయిస్థానే జాతే, దధతి చపలం జన్మచ ఫలమ్ ॥" (1-101)

ఇంతటి మధుర మంజుల కవిత్వాన్ని సృష్టించిన మహాకవి తనలో ఏమీలేదనీ; శ్రీకృష్ణుని ప్రశంసించడం వల్లనే ఇది గొప్పకవిత్వంగా భాసిస్తోందనీ అనడం ఆతని అచంచల కృష్ణభక్తికి నిదర్శనం. ఈ శిఖరిణీవృత్తంలో లీలాశుకుడు శబ్దాలంకారం, లయ, అంత్యప్రాస, అక్షరరమ్యత సంతరింపజేసి, పాఠకునికి ఒకదివ్యమైన శ్రీకృష్ణానుభూతిని కలిగిస్తున్నాడు.

12. రాముణ్ణి కూడా కృష్ణుడుగా మారమని ప్రార్థించడం :

లీలాశుకుని కృష్ణభక్తి ఎంత తీవ్రమైనదంటే - ఎంతముదిరిపోయిందంటే, ఇతడు రాముణ్ణి కూడా లెక్కచేయకుండా, అతడు కృష్ణుడుగా వేషం మార్చిన తర్వాతనే తాను నమస్కరిస్తాను అని చెప్పేంతవరకూ వెళ్లిపోయింది!

"ఓ సీతాపతీ! కొంచెంసేపు నీ ధనుస్సును బాణాన్ని విడిచిపెట్టు. ఆ చేతిలో రత్నాలు పొదిగిన అందమైన పిల్లనగ్రోవిని పట్టుకో. నీ శిరస్సుమీద నెమలి పింఛం పెట్టుకో. ఆ తర్వాత నీకు నేను నమస్కరిస్తాను" - అంటున్నాడు లీలాశుకుడు.

"విహాయ కోదండ శరౌ ముహూర్తం
గృహాణ పాణౌ మణి చారువేణుమ్ ।
మాయూరబర్హం చ నిజోత్తమాంగే
సీతాపతే త్వాం ప్రణమామి పశ్చాత్ ॥" (3-94)

ఒక మహారామభక్తుడు శ్రీకృష్ణుణ్ణి చూచి, సరిగ్గా దీనికి వ్యతిరేకమైన శ్లోకం చెప్పాడు. "ఏమిటయ్యా! శ్రీకృష్ణా! చేతిలో ఏ ఆయుధమూలేకుండా నన్ను ఎలా రక్షిస్తావు? రాముడిలా ధనుర్బాణాలు ధరించు. అప్పుడు నీకు నమస్కరిస్తాను" అన్నాడు. అంటే ఆ కృష్ణుడు భక్తుని కోరిక ప్రకారం విల్లమ్ములు ధరించాడట!

13. లీలాశుకుడు శివాద్వైతి :

ఒక విచిత్రమైన విషయం ఏమిటంటే, ఇటువంటి ప్రగాఢమైన కృష్ణభక్తి కలిగిన బిల్వమంగళ లీలాశుకుడు నిత్యం పంచాక్షరీ మంత్రాన్ని జపించే శివభక్తుడు కావడం! ఈ విషయం కవే స్వయంగా చెప్పుకున్నాడు :

"మేము శివభక్తులం. అందులో ఏమీ సందేహంలేదు. పైగా శివ పంచాక్షరీ మంత్రాన్ని జపించేవారము. అలా అయినప్పటికీ కూడా నామనస్సు (చిత్తం) అగిసెపూల కాంతివంటి కాంతి గలవాడూ, చిరునవ్వుమోము గలవాడూ, గొల్లయిల్లాలైన యశోద బిడ్డడూ అయిన శ్రీకృష్ణుని (గోపవధూ కిశోరాన్ని) ధ్యానిస్తుంది."

"శైవా వయం నఖలు తత్ర విచారణీయం
పంచాక్షరీ జపపరా నితరాం, తథాపి ।
చేతో మదీయ మతసీ కుసుమావ భాసం
స్మేరాననం స్మరతి గోపవధూ కిశోరమ్ ॥" (2-24)

దీనిని బట్టి లీలాశుకుడు ఎంత గొప్ప అద్వైతియో ఊహించుకోవచ్చు. బమ్మెరపోతన్నగారు కూడా మొదట శివభక్తుడై ఉండి, తరువాత విష్ణుభక్తుడైనవాడే.

ఇటువంటి హరిహరాద్వైత దృష్టి మహాకవులైన తిక్కన సోమయాజిలోను, నాచన సోమనాథునిలోను కూడా చూస్తాం. తాళ్లపాక అన్నమాచార్యుడు కూడా పూర్వాశ్రమంలో అద్వైతియే.

కృష్ణభక్తి ఇంత గొప్పది కాబట్టే ఈనాడు ఇది ప్రపంచవ్యాప్తంగా పాశ్చాత్య దేశాలలో కూడా బలంగా వ్యాపించి వుంది (International Sri Krishna Consciousness).

లీలాశుకుని కవితావైభవం

"Poetry is musical thought" (కవిత్వం అంటే ఒక సంగీతాత్మకమైన భావన) - అనే నిర్వచనానికి శ్రీకృష్ణకర్ణామృతం ఉత్తమోత్తమమైన ఉదాహరణం. సాధారణంగా స్తోత్రాలలో భగవంతుని గురించిన స్తుతి ఉంటుందేకాని అలంకార సమన్వితమైన కవిత్వం ఉండదు. కాని లీలాశుకుని కావ్యం దీనికి అపవాదం. కృష్ణ సంస్మరణ రూపమైన ఈ కవితా త్రిశతిలో ప్రతిశ్లోకమూ లీలాశుకుని మహత్వకవిత్వ పటుత్వసంపదకు మణిదర్పణంలా భాసిస్తోంది. లాక్షణికులు చెప్పిన కవిత్వ లక్షణాలన్నీ ఈ కావ్యానికి అన్వయించవచ్చు. అయితే లీలాశుకునిలోని గొప్పతనం ఏమిటంటే - ఒక్క అలంకారం కూడా ప్రయోగించకుండా గొప్పకవిత్వం చెప్పడం.

'కావ్యం గ్రాహ్యమలంకారాత్" - కవిత్వాన్ని అలంకారంవల్ల తెలుసుకుంటాం - అని పెద్దలన్నారు. కాని లీలాశుకుని కవిత్వంలో అలంకారాలు లేవు. అయినా అది గొప్ప కవిత్వం ఎలా అయింది? అంటే అలంకారమే కవిత్వం అని భావించడం సరికాదు. కేవలం అలంకారాలతోనే కవిత్వం అల్లితే అది తక్కువరకం కవిత్వమే అవుతుంది. కవిత్వానికి నిజమైన నిర్వచనం 'సాంద్రమైన అనుభూతి' (Intense Feeling)అంటారు శరభయ్యగారు. ఇది లీలాశుకునిలో పుష్కలంగా ఉంది. అతని ప్రగాఢమైన కృష్ణభక్తియే అతని సాంద్రమైన అనుభూతి. ఆ అనుభూతితో ఆ భక్తి తన్మయత్వంలో శబ్దచిత్రాలు సృష్టించి మన మనసుల్ని ఉఱ్ఱూతలూగిస్తాడు. మనకు కృష్ణానుభవాన్ని కలిగిస్తాడు.

'లీలాశుకుడు అలంకారాలు వాడలేదు' అంటే 'అందరు కవులూ వాడినట్లుగా ఎక్కువగా వాడలేదు' అని అర్థం. (ఇక్కడ 'అలంకారం' అర్థాలంకారానికి మాత్రమే పరిమితం. శబ్దాలంకారానికి వర్తించదు. శబ్దాలంకారాలు లీలాశుకుడు పుష్కలంగా వాడాడు).

మొత్తం 332 శ్లోకాలలో లీలాశుకుడు అలంకారం ప్రయోగించిన శ్లోకాలు ఆరు ఏడు కన్న ఎక్కువ లేవు (పది సంఖ్యకు లోపులోనే).

శ్రీకృష్ణకర్ణామృతంలో ప్రతి శ్లోకంలోనూ భక్తి+కవిత్వం (ఇక్కడ కవిత్వం అంటే సాంద్రనుభూతి) పాలూ తేనెల్లా చక్కగా కలిసిపోయే ఉంటాయి. కాని లీలాశుకుడు అర్థాలంకారం ప్రయోగించిన ఆరు ఏడు శ్లోకాల్లో భక్తికన్నా కవిత్వం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈ క్రింది ఉదాహరణలు పరిశీలించండి :

1. కృష్ణుని కాలిగోళ్ల వర్ణన :

"ఓ కృష్ణా! చంద్రుడు నీ ముఖ చంద్రునిచేత జయింపబడినవాడై, పదిముక్కలుగా అయిపోయి, నీ పాదాల మీదపడి, అధికమైన శోభను పొందుతున్నాడు. నిరుపమాన సౌభాగ్యాన్ని పొందుతున్నాడు. ఆహా! దీనులయెడ నీ దయావిశేషం ఎంత గొప్పదో కదా!"

"వదనేందు నిర్జితశ్శశీ
దశధా దేవ! పదం ప్రపద్యతే ।
అధికాంశ్రియ మశ్నుతేతరాం
తవ కారుణ్య విజృంభితం కియత్ ॥" *(1-95)*

2. కృష్ణుని నల్లని మేని కాంతి వర్ణన :

"నల్లగా నిగనిగా మెరుస్తూ జగన్మంగళకరమైన శ్రీకృష్ణుని శరీర కాంతిని చూచి, దప్పిగొన్న ఆలమంద, యమునానది జలమని భ్రమించి, మాటిమాటికి దాంట్లో ప్రవేశించాలని ప్రయత్నిస్తోంది. ఆ కన్నయ్య మేని కాంతిని నల్లమబ్బుగా తలంచి, నెమళ్లగుంపు ఆశ్చర్యంగా వేడుకలో చూస్తోంది. గోపికలు ఆ నీలకాంతిని నల్లకానుగు చిగుళ్లని భ్రమించి, త్రుంచి సిగలో తురుముకోవాలని చూస్తున్నారు. అటువంటి పవిత్రమైన శ్రీకృష్ణుని మేని కాంతి మమ్మల్ని రక్షించుగాక!"

"యాందృష్ట్వా యమునాం పిపాసు రనిశం వ్యూహో గవాం గాహతే
విద్యుత్వానితి నీలకంఠ నివహో యాంద్రష్టు ముత్కంఠతే ।

ఉత్తంసాయ తమాలపల్లవమితి చ్ఛిందంతి యాంగోపికాః
కాన్తిః కాళియ శాసనస్య వపుషః సాపావనీ పాతునః ॥" (2-2)

3. గొల్లభామల కడగంటి చూపుల వర్ణన :

గొల్లభామలు ఎంతో ప్రేమతో కృష్ణుని నఖశిఖ పర్యంతం చూస్తున్నారు. అవి నల్లని క్రీగంటిచూపులు. అటువంటి ఆ గోపికల కడగంటి చూపులు కృష్ణుని పాదాలమీద పడినప్పుడు - ఆ చూపులు నల్లకలువల దోయిలిలా కనబడుతున్నాయి. కృష్ణుని నాభీమీద పడినప్పుడు - ఆ చూపులు బొడ్డు అనే కొలనులో చేపల్లా కనబడుతున్నాయి. కృష్ణుని హృదయం మీద పడినప్పుడు - ఆ చూపులు మన్మథుని బాణాల్లా కనబడుతున్నాయి. కృష్ణుని కంఠమీదపడినప్పుడు - ఆ చూపులు ఇంద్రనీలమణిమయములైన హారాల్లా కనబడుతున్నాయి. ఆ గోపికల కడగంటిచూపులు కృష్ణుని ముఖపద్మంమీద పడినప్పుడు - అవి తుమ్మెదల్లా కనబడుతున్నాయి. కృష్ణుని కురులమీద పడినప్పుడు - ఆ చూపులు నెమలిపింఛాల్లా కనబడుతున్నాయి. అటువంటి గొల్లభామల కడగంటి చూపులు నిన్ను రక్షించుగాక!

"రక్షంతు త్వా, మసిత జలజై రంజలిః పాదమూలే,
మీనా నాభీసరసి, హృదయే మారబాణా, మురారేః ।
హారాః కంఠే హరిమణిమయా, వక్త్రపద్మే ద్విరేఫాః,
పింఛాపీడాశ్చికుర నిచయే, ఘోషయోషి త్కటాక్షాః ॥" (3-86)

శ్రీకృష్ణకర్ణామృతంలోని శ్లోకాలన్నీ కృష్ణుని పరంగానే సాగాయి. ఈ ఒక్కశ్లోకం మాత్రం గోపికల పరంగా సాగింది. ప్రతి శ్లోకంలోనూ పాఠకుల్ని లేదా శ్రోతల్ని లేదా తన్ను 'బాలకృష్ణుడు రక్షించాలి' అని ఆశిస్తాడు లీలాశుకుడు. ఈ ఒక్క శ్లోకంలో మాత్రం గోపికల చూపులు రక్షించాలి' అన్నాడు. ఆ చూపులు పరమాత్మయందు లగ్నమైన చూపులు కాబట్టి వాటికి కూడా దైవత్వం సంభవించింది. ఇది విష్ణుమూర్తి అవతారమైన శ్రీకృష్ణుని వర్ణన కాబట్టి ఈ వర్ణన సిరి పాదాలనుండి శిరస్సు వరకూ కొనసాగింది.

4. గోపికలు ఎంగిలిచేసిన కన్నయ్య నల్లని సొబగు :

గాఢమైన అనురక్తితో గోపికలు శ్రీకృష్ణుని శరీరాన్నంతటినీ తమ అందమైన కడగంటి చూపులతో చూశారని పైశ్లోకంలో చెప్పాడుకవి. ఇలా చూడటం ఎలా ఉన్నదంటే

గోపికలు తమకన్నులతో కన్నయ్య నల్లని సొబగును త్రాగినట్లు ఉందట! ఇది గొప్ప Poetic expression! త్రాగడమేకాదు, త్రాగి త్రాగి ఎంగిలిచేశారట! What a beautiful poetry! ఇటువంటి మహత్తర కవిత్వభావనతో లీలాశుకుడు ఇలా అంటున్నాడు :

"కృష్ణా! నల్ల కలువరేకులవలె నల్లనైన నీన కాంతి పూరాన్ని (సొబగుల మొత్తాన్ని) మదించిన గొల్లపడుచులు తమకన్నులతో త్రాగి త్రాగి ఎంగిలిచేసి విడిచిపెట్టారు. అయినాసరే, మహాతృష్ణను కలిగించే నీ నల్లని సొబగును, మిక్కిలి ఆశతో కొట్టుకుంటున్న మా రెండు కన్నులతోనూ క్రోలడానికి ఎప్పటికి అర్హత వస్తుందో మాకు?"

"వ్రజజన మదయోషి ల్లోచనోచ్ఛిష్టశేషీ
కృత, మతి చపలాభ్యాం లోచనాభ్యాముభాభ్యామ్ ।
సకృదపి పరిపాతుం తే వయం పారయామః
కువలయదళ నీలం కాంతిపూరం కదాను? ॥" *(3-12)*

5. శ్రీకృష్ణుని శ్యామల తేజస్సు - ఒక అద్భుత వర్ణన :-

లీలాశుకుడు శ్రీకృష్ణుని శ్యామల తేజస్సును గురించి చెప్పిన మరొక అద్భుతమైన వర్ణన ఉంది. దీనిని ఈ కావ్యంలోని 332 శ్లోకాలలో కెల్లా గొప్పశ్లోకంగా నేను భావిస్తున్నాను. ఇంత గొప్ప కవిత్వం నా జీవితంలో ఇంతకుముందెప్పుడూ వినలేదు, కనలేదు.

"శ్రీకృష్ణుడనే ఆ నల్లని తేజస్సు మా హృదయాలలో ప్రకాశించునుగాక! ఆ నల్లని తేజస్సు ఎలా ఉన్నదంటే - గోపికల చంద్రబింబం వంటి ముఖాలకు భూషణమైన కస్తూరీ తిలకంలా ఉంది. లక్ష్మీదేవి పాలిండ్లనే బంగారు కుండలలో వికసించిన నల్ల కలువలా ఉంది. యోగులకు మోక్షం అనే నిక్షేపాన్ని సాధించుకొనే విధానంలో కళ్ళకు పెట్టుకున్న సిద్ధాంజనంలా ఉంది." కళ్ళకు కాటుక పెట్టుకోవడంచేత నిధి (పాతర)ని తెలిసికొని పొందినట్లుగా, కృష్ణుడనే కాటుకచేత యోగులు ముక్తి అనే నిధిని తెలుసుకొని పొందుతారనిభావం.

"యద్గోపీ వదనేందు మండన మభూ త్కస్తూరికా పత్రకం
యల్లక్ష్మీ కుచ శాతకుంభ కలశ వ్యాకోశ మిందీవరమ్ ।

యన్నిర్వాణ నిధాన సాధన విధౌ సిద్ధాంజనం యోగినాం
తన్నశ్శ్యామల మావిరస్తు హృదయే కృష్ణాభిధానం మహః ॥" (3-84)

ఇటువంటి లీలాశుకుని 'మహత్వ కవిత్వ పటుత్వసంపద' లోని రహస్యం ఏమిటంటే - అతడు కృష్ణసాక్షాత్కారాన్ని పొందిన మహాభక్తుడుకావడం. గొప్ప భక్త్యావేశంతో, తన్మయత్వంతో, సాంద్రానుభూతితో అల్లే అతని కవిత్వంలో శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు, భావసౌందర్యం, కల్పనా చమత్కృతి - అన్నీ కలిసి ఒకేసారి అతని నాలుక మీద నాట్యం చేస్తాయి. ఈ కావ్యంలోని ప్రతి శ్లోకమూ దీనికి లక్ష్యమే అని చెప్పవచ్చు. తెలుగు భాషలోని మాధుర్యమంతా పోతనగారి కవిత్వంలో గూడు కట్టుకొన్నట్లుగా, సంస్కృత భాషలోని మాధుర్యం, గాంభీర్యం, ప్రసన్నత లీలాశుకుని కవిత్వంలో నిబిడీకృతమై ఉంది. శ్రీకృష్ణకర్ణామృతం ఒక అమృత రస పూరిత సహృదయభక్త మానస సరోవరం. ఈ కవితారస మానససరోవరంలోని ఒక్క బిందువును రుచిచూస్తే చాలు, సాంసారిక ద్వంద్వాలనుండి విముక్తులమవుతాం.

మధుర మంజుల మకరంద శైలి : ("సరసానులాప సరణి" - "సుధావృష్టి")

లీలాశుకుని కవిత్వంలో ధారా శుద్ధి గంగాప్రవాహంలా సాగిపోతుంది. సంస్కృత భాష ఏమీ తెలియనివాడు కూడా ఈతని కవితా మందార మకరంద మాధుర్యంలో ఓలలాడుతాడు. ఇక తెలిసినవారి సంగతి చెప్పనక్కరలేదు. వారు లీలాశుకుని కవితా సమ్మోహనాస్త్రం దెబ్బతిని మిగిలిన కాళిదాసాది మహాకవుల్ని మరిచి పోతారు. (ప్రముఖ పండిత కవి విమర్శకులైన శ్రీమల్లంపల్లి శరభయ్యగారు తమ 13వ ఏట లీలాశుకుణ్ణి మొట్టమొదట చదివినప్పుడు, రెండు మూడు నెలలపాటు వ్యాసవాల్మీకుల్నీ కాళిదాస మహాకవినీ మరిచిపోయారట. చాలా ప్రయత్నంమీద మళ్లీ ఆ కవుల కవిత్వాలను అధ్యయనం చేయవలసి వచ్చిందట. ఈ విషయం వారు నాతో స్వయంగా చెప్పారు). తనకావ్యశైలి "సరసానులాప సరణి" అనీ, "సుధావృష్టి" అనీ లీలాశుకుడే స్వయంగా చెప్పుకున్నాడు (1-111). రకరకాల శబ్దాలంకారాలను ప్రయోగించడం, సంస్కృతంలో లేని యతిప్రాసలను, అనుప్రాసలను తెలుగు పద్యంలోవలె బిగించడం, నన్నయలా అక్షర రమ్యతను పాటించడం (ఈ లీలాశుకుడు కూడా నన్నయ కాలంవాడే) - ఈతని ప్రసన్నశైలిని మరింత శోభాయమానంగా చేశాయని నా భావన. ద్వితీయాశ్వాసంలోని రాసక్రీడాష్టకం (35 నుండి

42 వరకు గల శ్లోకాలు); "నౌమిగోపాలబాలమ్" అనే మకుటంతో ఉన్న 12వ శ్లోకం, 87 నుండి 90 వరకు గల శ్లోకాలు; 91వ శ్లోకం లీలాశుకుని ప్రసన్న కవితా ధారకు మంచి ఉదాహరణాలు. ఈతని మధుర మంజుల శైలికి ప్రతిశ్లోకమూ ఉదాహరణమే అయినా, చదువగానే హృదయాన్ని ఆకర్షించే కొన్ని శ్లోకపాదాలు శ్లోకాలు మనవి చేస్తాను.

1. "శీత శీతే వటే యామునీయే తటే" (2-42)

2. "సాయంకాలే వనాంతే కుసుమిత సమయే సైకతే చంద్రికాయాం" (3-99)

3. "మందం మందం మధుర నినదై ర్వేణు మాపూరయంతం
బృందం బృందావన భువిగవాం చారయంతం చరంతమ్." (2-6)

4. "కరార విందేన పదారవిందం
ముఖారవిందే వినివేశయంతం...." (2-58)

5. "తరుణా రుణ కరుణామయ... " ఇత్యాది శ్లోకం (1-18) పూర్తిగా ఇంతకుముందే ఉదాహరించాను.

6. "గళద్వ్రీడా లోలా మదన వనితా.... " ఇత్యాది శ్లోకం (1-101) పూర్తిగా ఇంతకు ముందే ఉదాహరించాను.

7. "సజల జలద నీలం దర్శితోదార లీలం
కరతలధృతశైలం వేణునాదై రసాలమ్ ।
వ్రజజనకులపాలం కామినీ కేళిలోలం
కలిత లలిత మాలం నౌమి గోపాల బాలమ్ ॥" (2-87)

(నేను బాలగోపాలునికి నమస్కరిస్తాను. అతడు ఎటువంటి వాడంటే - నీటిమబ్బులా నల్లనైనవాడు; గంభీరమైన విలాసాలు చూపుతున్నవాడు; కొండను చేతితో ఎత్తినవాడు; రసవంతంగా పిల్లనగ్రోవిని ఊదుతున్నవాడు; వ్రేపల్లెలోని జనుల్ని రక్షించేవాడు; గోపకాంతలతో క్రీడించేవాడు; అందమైన వనమాలను ధరించినవాడు).

8. "కరకమల దరదళిత లలిత తర వంశీ
కలనినద గళదమృత ఘనసరసి దేవే।
సహజరస భరభరిత దరహసిత వీథీ
సతతవహ దధరమణి మధురిమణి లీయే॥" (1-52)

శ్రీకృష్ణుడు ఒక మధురిమ/ఒక మాధుర్యం/ఒక సౌందర్యరాశి. ఆయన సొగసైన పిల్లనగ్రోవిని చేతివ్రేళ్లతో కొంచెం కదిలిస్తున్నాడు. దానినుండి మధురమైన ధ్వని వస్తోంది. అది అమృతంలా ఉంది. ఆ వేణుగానామృతానికి ఒక బావిలా ఉన్నాడు ఆ కృష్ణుడు. ఆయన క్రింది పెదవి కెంపులా ఎఱ్ఱగా ఉంది. దానిమీద చిరునవ్వులబారులు ఎడతెగకుండా ఉన్నాయి. అవి సహజంగానే మిక్కిలి రుచిగలవి. ఇలా వేణుగానామృతానికి బావిలా ఉండి, చిరునవ్వులు దాల్చిన కెంపు మోవి కలిగిన శ్రీకృష్ణుని మధురిమలో/మాధుర్యంలో నేను లీనమైపోతాను ('మధురిమణి లీయే') - అంటున్నాడు లీలాశుకుడు. ప్రతిపాదంలోనూ చివరి రెండక్షరాలు తప్పిస్తే తక్కినవన్నీ హ్రస్వాక్షరాలే కావడంతో ఒక వింత అందం వచ్చింది శ్లోకానికి. ఇంతమధురమైన శ్లోకాలు కాబట్టే వీటిని గాయకులు గానం చేయడం, నర్తకులు నాట్యంచేయడం, ఆబాలగోపాలం భక్తితో పాడుకోవడం, మంత్రవేత్తలు ధ్యానశ్లోకాలుగా మలుచుకోవడం జరుగుతోంది.

ఇంచుమించు శ్రీకృష్ణకర్ణామృత కావ్యమంతా ఇంత ప్రసన్న కవితాధారతో నడిపించిన లీలాశుకుడు, ఒకటి రెండు శ్లోకాలలో మాత్రం కఠినమైన శైలిని పాటించాడు. దీనికి ప్రత్యేకమైన కారణం ఉందని విమర్శకులు చెపుతున్నారు. ఉదాహరణానికి "అస్తి స్వస్తరుణీ కరాగ్ర విలత్...." అనే మొట్టమొదటి శ్లోకంలో (1-2) "స్త" అనే సంయుక్తాక్షరాన్ని పునరావృత్తం చేశాడు. "తుభ్యం నిర్భరహర్ష వర్ష..." అనే మరొక శ్లోకంలో (1-109) "భ" - "ర్భ" - "ర్ష" - "ష" - అనే కఠినమైన అక్షరాల ఆవృత్తి ఉంది. ద్వితీయాశ్వాసం మొదట వచ్చే ఈ క్రింది శ్లోకంలో "గ్ధ" - "భ్ర" - "చ్ఛ" - "ఛ" - అనే కఠినమైన అక్షరాల ఆవృత్తి ఉంది:

"అభినవ నవనీత స్నిగ్ధ, మాపీత దుగ్ధం,
దధికణ పరిదిగ్ధం, ముగ్ధ, మంగం మురారేః।
దిశతు, భువన కృచ్ఛ్రచ్ఛేది, తాపించ గుచ్ఛ
చ్ఛవి, నవశిఖి పింఛా లాంఛితం, వాంఛితం నః॥" *(2-1)*

ఇది బాలకృష్ణుని శరీర వర్ణన. అతడు పాలూ పెరుగూ త్రాగుతున్న బాలకృష్ణుడు. దొంగతనంగా వెన్నతినే బాలకృష్ణుడు. అతని ఒడలు ఎలా ఉందంటే -

"అప్పుడే చిలికి తీసిన వెన్నలా మిసమిసలాడుతోంది।

దప్పిక తీరేటట్లుగా పాలు త్రాగింది।

పెరుగు చినుకులతో నిండి ఉంది।

లోకాల ఆపదలను పోగొట్టేది।

కానుగు గుత్తి కాంతివంటి నల్లని కాంతిగలది।

క్రొత్తనెమలి కన్నుతో అలంకరింపబడినది।

సుందరమైనది

అటువంటి బాలకృష్ణుని ఒడలు మా కోరికలను ఈడేర్చుగాక!" అంటున్నాడు కవి. ఎల్లవేళలా మధురమైన ద్రాక్షాపాకంలో పాంచాలీశైలిని పాటించే కవి, ఇక్కడ నారికేళ పాకంలో గౌడీశైలిని ఎందుకు పాటించాడు? ఈ విషయాన్ని మల్లంపల్లి శరభయ్యగారితో చర్చించాను నేను. వారు ఇలా సెలవిచ్చారు : " యశోద యింటిలో కడవనిండా గడ్డ పెరుగు ఉంది. కవ్వంపెడితే దిగటం లేదు. అంత గట్టిగా ఉంది ఆ పెరుగు. బాలకృష్ణుడు ప్రక్కన నిలబడి వెన్నకోసం గోల చేస్తున్నాడు. యశోద గట్టిగా ఆ కవ్వాన్ని పెరుగులో దించి చిలకడం మొదలుపెట్టింది. ఆ పెరుగు చినుకులన్నీ ఒక్కసారిగా చెదరి కృష్ణుని శరీరమీదికి చిందాయి. యశోద గడ్డ పెరుగును చిలుకుతోంది అనే ధ్వని వచ్చేలా లీలాశుకుడు ఇక్కడ ఈ కఠినశైలిని పాటించాడు!" మిగిలిన సందర్భాలలో కూడా విమర్శకులు ఇలాంటి అందమైన ఊహాలు చేయవచ్చు.

యతిప్రాసలు - శబ్దాలంకారాలు :-

తెలుగులో ఉన్నట్టుగా సంస్కృతంలో యతిప్రాసలు లేవు. సంస్కృతంలో 'యతి' అంటే 'విరామస్థానం' మాత్రమే. అక్కడ పదం అంతమై మరొక పదం ప్రారంభమయితే చాలు. తెలుగులోలా అదే అక్షరం రావాలని కాని, దానికి మైత్రిగల అక్షరం రావాలని కాని సంస్కృతంలో నియమం లేదు. శార్దూల విక్రీడితం శ్లోకం చెపుతుంటే - "కస్తూరీ తిలకం

లలాట ఫలకే - వక్షస్థలే కౌస్తుభం" - క-వలకు మైత్రి లేదు. యతిస్థానంలో విరామం మాత్రమే ఉంది. తెలుగులో అలాకాదు. అదే అక్షరం లేదా మైత్రిగల అక్షరం రావాలి. "కారే రాజులు రాజ్యముల్‌గలుగవే - గర్వోన్నతింబొందరే" (క-గలకుయతి). అలాగే సంస్కృతంలో ప్రాస కూడాలేదు. (కన్నడంలో యతి లేదు, ప్రాసమాత్రం ఉంది).

తెలుగులో యతిప్రాసలు తప్పక పాటించితీరాలి. (వీటివల్లనే తెలుగు భాషకు మాధుర్యం అబ్బి ఉండాలి). సామెతల్లో కూడా యతిప్రాసలు నియతంగా వాడుతారు తెలుగువారు. లీలాశుకుడు కృష్ణానదీ తీరవాసియైన ఆంధ్రపండితుడు కావడం వల్లనేమో ఆయనపై తెలుగుభాషలోని యతిప్రాసల ప్రభావం బలంగా పడింది. అనేక శ్లోకాలలో అతడు వీటిని పాటించాడు.

ఉదా॥ యతి (2-89), ప్రాస (1-9, 1-45, 3-66), ద్విప్రాస (3-17, 3-68), అంత్యప్రాసలు (2-48, 2-91, గోపాల బాలపంచకం 2-12, 87 నుండి 90); ఆదిప్రాస+అంత్యప్రాస రెండూవాడిన సందర్భాలు (1-81). ఒకే శ్లోకంలో యతి, ప్రాస, ప్రాసయతి మూడూ కూడా పాటించాడు లీలాశుకుడు. ఈ క్రింది శ్లోకం చూడండి:

"కిశోర వేషేణ కృశోదరీ దృశాం
విశేష దృశ్యేన విశాల లోచనమ్ ।
యశోదయా లబ్ధ యశో నవాంబుధేః
నిశామయే నీల నిశాకరం కదా ॥" *(3-42)*

శ్లోకంలో నాలుగు పాదాల మొదటా ఒకే అక్షరం ఉండేలా రచించడం కూడా ఉంది (చూ. 2-26).

లీలాశుకుడు అర్థాలంకారాలు మిక్కిలి తక్కువగా వాడినా, శబ్దాలంకారాలు మాత్రం ఇంచుమించు ప్రతి శ్లోకంలోనూ ప్రయోగించాడు. అన్ని రకాల అనుప్రాసలు (ఛేక, లాట, వృత్త్యనుప్రాసలు), యమకం, అక్షరరమ్యత అనుసరించాడు. అక్షరాలు, పదాలు, వాక్యంలోని దళాలు, పూర్తి వాక్యాలు పునరుక్తం చేసి తనశైలికి మాధుర్యాన్ని సంతరించుకున్నాడు. పాదాంతంలోనే కాకుండా పదంలోని దళం చివరకూడా అంత్యప్రాసలు

వేశాడు. ('నౌమి గోపాలబాలమ్' మకుటంతో ఉన్న శ్లోకాలన్నీ దీనికి ఉదాహరణాలే). లీలాశుకుని కవిత్వంలోని శబ్దాలంకార సౌందర్యంతో కూడిన అక్షరరమ్యతకు ఈ క్రింది రెండు శ్లోకాలు ఉదాహరించకుండా ఉండలేకపోతున్నాను.

"అధరబింబ విడంబిత విద్రుమం
మధుర వేణు నినాద వినోదినమ్ ।
కమల కోమల కమ్ర ముఖాంబుజం
కమపి గోప కుమార ముపాస్మహే ॥" *(2-13)*

నేను గొల్ల కుఱ్ఱవాణ్ణి ఉపాసిస్తాను. అతడు ఎలాంటివాడు అంటే -
దొండపండు వంటి పెదవిచేత అనుకరింపబడిన పగడం కలవాడు
(అంటే దొండపండునీ పగడాన్నీ మించిన మోవి సొబగు కలవాడు)
తీయని పిల్లనగ్రోవి మ్రోత చేత వినోదించేవాడు
కమలంలాగ అందమైన మోముదమ్మి గలవాడు
అనిర్వాచ్య స్వరూపం గలవాడు!

"మృగపద పంక సంకర విశేషిత వన్య మహా
గిరితట గండ గైరిక ఘనద్రవ విద్రుమితమ్ ।
అజిత భుజాంతరం, భజత హేబత!, గోప వధూ
స్తన కలశస్థలీ ఘుసృణ మర్దన కర్దమితమ్ ॥" *(3-46)*

ఓ జనులారా! జయించడానికి శక్యంకాని కృష్ణుని యొక్క వక్షస్థలాన్ని సేవించండి. ఆ వక్షస్థలం ఎలాంటిదంటే - అడవిలో పెద్దపెద్ద కొండచఱులలో బండలమీద కస్తూరీమృగాలు లెక్కకు మిక్కిలిగా పండుకుని ఉంటాయి. వాటి పొక్కిటి కస్తూరి ఆ కొండమీది బండలకు బాగా అంటుకొని బురద బురదగా ఉంటుంది. అందువల్ల ఆ బండలమీది ఎఱ్ఱని గైరికాది ధాతుద్రవం ఆ కస్తూరీ పంకంతో కూడుకొని చక్కగా గుబాళిస్తూ ఉంటుంది. అటువంటి చిక్కటి ఎఱ్ఱని గైరిక ధాతుద్రవాన్ని కృష్ణుడు తన వక్షస్థలానికి పూసుకున్నాడు. అప్పుడు ఆ

వక్షస్థలం ఎఱ్ఱగా పగడంలా కనబడుతోంది. అంతేకాదు, ఆ వక్షస్థలం మీద, గోపికలు తమ కలశాలవంటి గుబ్బలమీద పూసుకున్న కుంకుమ ఒరపిడిచేత, కుంకుమ పూత దట్టంగా అంటుకొని అందంగా ఉంది. గోపస్త్రీల ఆలింగనాలచేత వారి స్తనములకు పూసుకున్న కుంకుమ పూతలు కృష్ణుని గుండెలకు మిక్కిలిగా అంటుకొని రొంపిగొన్నవి అని భావం.

ఉపసంహారం :-

"ఈ కావ్యం తియ్యని పలుకుల జాడల సొబగును నేర్చుకునే ధన్యాత్ముల చెవులలో మాటి మాటికి చెప్పనలవికాని అమృతవర్షాన్ని కురిపిస్తుంది. అందుకే ఇది "కర్ణామృతం" అయింది. భక్తి వివశులైన పండితులయొక్క లేదా స్త్రీలయొక్క మనస్సులలోను, కన్నులలోను మునిగిపోయిన మా శ్రీకృష్ణదేవుని గురించి, తన్మయత్వంతో నేను వినిన పలికిన మాటల విజృంభణమే ఈ కావ్యం!" - అంటాడు ప్రథమాశ్వాసం చివర్లో లీలాశుకుడు:

"ధన్యానాం సరసానులాపసరణీ సౌభాగ్యమభ్యస్యతాం
కర్ణానాం వివరేషు కామపి సుధావృష్టిం దుహానం ముహుః ।
వశ్యానాం సుదృశాం మనో నయనయోర్మగ్నస్య దేవస్య నః
కర్ణానాం వచసాం విజృంభిత మహో శ్రీకృష్ణకర్ణామృతమ్ ॥" *(1-111)*

లీలాశుకుడు 332 శ్లోకాలలో తాను రచించిన కర్ణామృతకావ్యాన్ని శ్రీకృష్ణపరమాత్మ మిక్కిలి ప్రీతితో చూడాలని కావ్యాంతంలో (తృతీయాశ్వాసం చివర) కోరుకుంటున్నాడు.

కృష్ణుడు తన కావ్యాన్ని ఎటువంటి ప్రీతితో చూడాలంటే - విదురుడు పెట్టిన అన్నంమీద ఎలాంటి ప్రీతి ఉందో అలాంటి ప్రీతితో చూడాలి. కుంతీదేవి పెట్టిన అన్నంమీద, గోవర్ధన పర్వత శిఖరంమీద, కుచేలుడు సమర్పించిన అటుకులమీద, యశోద కుడిపిన చనుబాలమీద, భరద్వాజ మహర్షి సమర్పించిన విందుమీద, శబరి ఇచ్చిన ఫలాలమీద, గోపికాస్త్రీల అధరాలమీద, ముని పత్నులు భక్తితో వండిన అన్నంమీద ఎలాంటి ప్రీతి ఉందో అలాంటి ప్రీతితో చూడాలి.

"యా ప్రీతిర్విదు రార్పితే, మురరిపో, కుంత్యర్పితే యాదృశీ,
యాగోవర్ధన మూర్ధ్నియాచ, పృథుకే, స్తన్యేయశోదార్పితే ।
భారద్వాజ సమర్పితే, శబరికాదత్తే, ఽధరే యోషితాం,
యాప్రీతిర్మునిపత్ని భక్తి రచితే,ప్యత్రాపి తాం తాం కురు ॥" *(3-107)*

బిల్వమంగళుడు శివపాదభక్తుడు. పండును తినగోరి పూలగుత్తిని ఆశ్రయించిన చిలుక మాదిరిగా అతడు మోక్షాన్ని పొందగోరి మూలధనమైన శ్రీకృష్ణుని స్థిరమైన కీర్తిమీద మిక్కిలి ఆశపెట్టుకున్నాడు. అందుకే అతడు "లీలాశుకుడు" (విలాసపు చిలుక) అయ్యాడు. అతడు తాను రచించిన శ్రోత్ర మధురమైన ఈ కర్ణామృతకావ్యం కల్పశతములకైనా సరే చలనం లేకుండా శ్రీకృష్ణుని అండలో ఉండాలని కోరుకుంటున్నాడు:

"ఈశానదేవ చరణా భరణేన నీవీ
దామోదరస్థిర యశః స్తబకోద్గమేన ।
లీలాశుకేన రచితం తవదేవకృష్ణ!
కర్ణామృతం వహతు కల్పశతాంతరేఽపి ॥" (1-112)

ఫలశ్రుతి :-

పాపసమూహమనే గూడు - అంటే గాఢంగా క్రమ్ముకొని ఉండే పాపాలన్నీ, శ్రీకృష్ణుని ఎడతెగక స్మరించటంచేతనే, వజ్రాయుధం చేత కొట్టబడిన పర్వతంలా, నూరుముక్కలుగా చీలిపోతాయి. కాబట్టి శ్రీకృష్ణస్మరణం సకల శుభాలనూ ఇస్తుంది!

"కృష్ణానుస్మరణాదేవ
పాప సంఘాత పంజరః
శతధా భేదమాయాతి
గిరిర్వజ్ర హతో యథా!" (3-108)

మంగళం :-

"జయ జయ జయ! దేవ దేవ దేవ!
త్రిభువన మంగళ దివ్యనామధేయ!
జయ జయ జయ బాలకృష్ణదేవ!
శ్రవణ మనో నయనామృతావ తార ॥" (1-108)

ఓ దేవా!

దేవతలకు దేవుడైనవాడా!

ముల్లోకాలకు శుభప్రదమైన

అనితర సాధారణమైన

నామములు కలవాడా!

సర్వోత్కర్షంతో వర్తించు!

చెవులకు, మనస్సుకు, కన్నులకు

అమృతంలా అత్యంత భోగ్యమైన

అవతారం కలవాడా!

(వేణుగానం చేత చెవులకు

శైశవ చాపలం చేత మనస్సుకు

శిఖిపింఛాద్యలంకృతమైన వేషంచేత కన్నులకు

అత్యంత భోగ్యమైనవాడు శ్రీకృష్ణుడు)

బాలకృష్ణాకారంలో పుట్టిన ఓదేవా!

సర్వోత్కర్షంతో వర్తించు!!

ఓం

తత్ సత్

శ్రీకృష్ణార్పణమస్తు!

✡ ✡ ✡

శుభమస్తు శ్రీరస్తు అవిఘ్నమస్తు

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

శ్రీకృష్ణకర్ణామృతము

తెలుఁగు టీకాతాత్పర్య సహితము

ప్రథమాశ్వాసము

శ్లో. *చింతామణి ర్జయతు సోమగిరి ర్గురు ర్మే*
శిక్షాగురు శ్చ భగవాన్ శిఖిపింఛమౌళిః ।
యత్పాద కల్పతరు పల్లవ శేఖరేషు
లీలా స్వయంవర రసం లభతే జయశ్రీః ॥ 1

అర్థము :- లీలాశుకుండను కవివరుండు తాను రచింపఁబూనిన యాగ్రంథము నిర్విఘ్నముగా నెఱవేఱుటకై మంగళము నాచరింపఁగోరి 'ఆశీ ర్నమస్క్రియా వస్తునిర్దేశో వాపి తన్ముఖమ్' అను వచనము చొప్పున ఆశీరూపమైన మంగళము నాచరించుచున్నాఁడు. చింతామణిః=చింతామణి యనుమంత్రము, జయతు=సర్వోత్కృష్టమై యుండుగాఁక; చింతామణిః=(కేవల విషయలోలుఁడై యుండిన తన్ను భగవద్విషయమందుఁ బ్రవర్తింపఁజేసిన) చింతామణి యనువేశ్యయు, జయతు=సర్వోత్కృష్టురాలై యుండుఁగాక; చింతామణిః=చింతామణివలె నభీష్టముల నొసఁగువాఁడైన, సోమగిరిః=సోమగిరియను, మే=నాయొక్క, గురుః=ఆచార్యుఁడును, జయతు=సర్వోత్కృష్టుఁడై యుండుగాక; శిక్షా=ప్రవృత్తి నివృత్తులకు, గురుః=గురువును, భగవాన్=ఐశ్వర్యాదిషడ్గుణసంపన్నుఁడు నైన, శిఖిపింఛమౌళిః-శిఖిపింఛ=నెమిలిపురిని, మౌళిః=శిరసునందుఁగలిగియున్న శ్రీకృష్ణస్వామియు, జయతు=సర్వోత్కృష్టుఁడై యుండుగాఁక. యత్...శేఖరేషు-యత్=ఎవరియొక్క, పాద=అడుగులనెడి, కల్పతరు పల్లవ శేఖరేషు=కల్పవృక్షముయొక్క శ్రేష్ఠమైన చిగురుటాకులయందు - మిక్కిలిమేలైన కల్పవృక్షపుఁ జిగురుటాకులవలెనుండు

నెవ్వనియడుగలయందనుట - లేక, యత్ పాద కల్పతరు పల్లవ=ఎవరి యడుగులనెడి కల్పవృక్షపుఁ జిగురుటాకులను, శేఖరేషు=శిరోభూషణములుగాఁగల వారలయందు అనియు నర్థాంతరము, జయశ్రీః=జయలక్ష్మి, లీలా...రసం-లీలా=విలాసప్రయుక్తమైన, స్వయంవర=తానే వరించుటయందు, రసం=అభిలాషను, లభతే=పొందుచున్నదో, అట్టిగురువగు సోమగిరియు, శిక్షాగురువగు భగవంతుఁడును,సర్వోత్కృష్టులై వర్తింతురుగాక యని పూర్వముతో నన్వయము. లేక 'యత్పాదః' అనుటను భగవంతునికి మాత్రము విశేషణముగా నైనను గ్రహింపవచ్చును. ఇచట నద్విషయములందుఁ దన్నుపయోగించెడువిద్యను తనకుఁ గలిగించినది చింతామణిమంత్ర మనియును, ఆ సద్విషయములలో నుత్తమంబగు భగవద్విషయమ్మునందుఁ దన్నుఁ బ్రవర్తింపఁజేసినది చింతామణియను వేశ్య యనియును, భగ్వద్విషయంబునఁ బ్రవర్తించినతనకు భగవత్సాక్షాత్కారసాధనంబగు నుపదేశము ననుగ్రహించి కృతార్థునిఁజేసిన గురువు సోమగిరి యనియు, సదాచార్యానుగ్రహముంబడసిన తనయం దంతర్యామియై సత్కార్యప్రవృత్తియు దుష్కార్యనివృత్తియుఁ జేయించునట్టి పరమగురుండై మోక్షపదవి నొసఁగునట్టివాడు భగవంతుఁడనియు ఉత్తరోత్తరాతిశయముఁ దెలియునది. కావుననే వీరికెల్ల మంగళాచరణము గావించునంత ప్రేమాతిశయము కవికిఁగలిగినదనియును గ్రహించునది. 'భగవాన్' అని జ్ఞానశక్త్యాదిషడ్గుణసంపత్తిని జెప్పుటవలన పరబ్రహ్మమగుట రూపితమగుచున్నది. యోగిజనధ్యానైకగోచరుఁడగు పరాత్పరుఁడయ్యు నస్మాదృశులు ఉజ్జీవించుటకై 'శిఖిపింఛమౌళిః' శిఖిపింఛాద్యలంకారకలితమైన గోపాలవేషమున సులభుఁడై శ్రీకృష్ణమూర్తిగా నవతరించెనని భావము. మఱియు 'శిఖిపింఛమౌళిః' అను విశేషణముచే దక్కిన యవతారములకంటె సౌలభ్యాతిశయము గలదిగాన శ్రీకృష్ణావతారమందే తనకు భక్త్యతిశయము గలిగిన దనుస్వారస్యమును సూచిత మయ్యెడి. ఇదియే 'విహాయకోదండశరౌ' ఇత్యాదులందు మీఁద వ్యక్తంబయ్యెడి. పాదములను కల్పతరుపల్లవములుగా రూపించుటచే నవి వానివలె సకలాభీష్టప్రదములనియు నతిసుకుమారములనియు భావము. కావుననే వానిని జయలక్ష్మి తానై వరించుచున్నదనఁబడియె. వారిస్వరూపములనుగాక పాదములను వరించుననుటచే వారి కత్యంతపరాధీనురాలగుట యూహ్యము. అట్టి పాదముల నుపాసించువారికి సకల కార్యములందును జయము తనంత సిద్ధించునని భావము. జయలక్ష్మి ఎవ్వరిపాదములను వరింపగోరునో, అట్టివారింగూర్చి 'జయతు' అనుట మిక్కిలి వ్యర్థమేకదా యన్నచో నది ప్రేమాతిశయముచేతను మంగళా చరణవిధిని బట్టియుఁ

జెప్పఁబడినదిగాన వైయర్థ్యము గలుగదు. పాదపల్లవములు శేఖరములుగాఁ గలవారలనెడి యర్థాంతరమందు లోకమున మంచి భూషణములుగల పురుషులయందుఁ గన్య లాశపడునట్లు తత్పాదపల్లవములను శిరోభూషణములుగాఁ గలవారియందు విజయలక్ష్మీ కన్యయు నాశపడెనని భావము.

తాత్పర్యము :- చింతామణి యను మంత్రమును, చింతామణి యను వేశ్యయు, సర్వోత్కృష్టులై వర్తింతురుగాక! కల్పతరువు మేలిచిగుళ్ళవంటి యెవ్వరి పాదములను జయలక్ష్మి తానై విలాసముతో వరించునో అట్టి మదాచార్యుం డగు సోమగిరియు, మాదృశులకు ప్రవృత్తి నివృత్తులఁగావించు పరమగురుఁడై జ్ఞానశక్త్యాది షడ్గుణ సంపన్నుండగు పరుండయ్యును శిఖిపింఛాద్యలంకృత గోపాలవేషమున సకలజన సులభుఁడై యవతరించిన శ్రీకృష్ణదేవుండును సర్వోత్కృష్టులై వర్తింతురుగాక!

అవతారిక :- కవి తాను గురునిర్దేశపూర్వకముగాఁ బేర్కొని ప్రేమాతిశయమున నాశీర్వదించిన దైవమును లేదనువారలను ధిక్కరించుచు శ్రీకృష్ణ రూపంబగు పరతత్త్వ వస్తువు విలసిల్లుచున్నదని నిర్దేశించుచు దానిచే వస్తునిర్దేశరూపమైన మంగళము నాచరించుచున్నాఁడు.☆

(☆ ఈ మొదటి శ్లోకమునకు గల వ్యాఖ్య కీ.శే.తంజనగరము తేవప్పెరుమాళ్ళయ్యగారు వ్రాసినది. ఇక రెండవ శ్లోకమునుండి శివశ్రీ మల్లంపల్లి శరభయ్యగారి వ్యాఖ్య - సంపాదకుడు).

శ్లో. అస్తి స్వస్తరుణీ కరాగ్ర విలసత్ కల్పప్రసూ నాప్లుతం
వస్తు ప్రస్తుత వేణునాదలహరీ నిర్వాణ నిర్వ్యాకులమ్।
స్రస్తస్రస్త నిరుద్ధ నీవి విలస ద్గోపీ సహస్రావృతం
హస్తన్యస్త నతాపవర్గ మఖిలోదారం కిశోరాకృతి॥ 2

అన్వయము :- అస్తి కిశోరాకృతి వస్తు=కిశోర స్వరూపమై త్రికాలములయందు ఉండుటయే తన లక్షణమైన ఒక తత్త్వము కలదు. లీలాశుకుఁడు శ్రీకృష్ణ స్వరూపానుభవరూపమైన తన కావ్యమును వస్తునిర్దేశముతో మొదలుపెట్టుచున్నాఁడు. తన కావ్యవస్తువు మూఁడు కాలములు తనలో లీనమైయుండు లక్షణము కలది. మఱియు అది కిశోర స్వరూపముతో అభివ్యక్తమైన నిర్వ్యాకుల నిర్వాణము. ఆ శాశ్వతానందమే తన

కావ్యవస్తువు. ఆ వస్తు స్వరూపము ఎట్లుండునో ఈ క్రింది ఆఱు విశేషణములతో వివరించుచున్నాఁడు.

అర్థము :- ఆ వస్తువు-(ఆకాశమునందు) స్వః + తరుణీ-స్వస్తరుణీ=స్వర్లోకములోని తరుణీజనముల యొక్క, కరాగ్ర=చేతివ్రేళ్ల కొనల యందు, విలసత్=వెలుఁగు లీనుచున్న, కల్ప=హరిచందన, మందార, పారిజాత, కల్పక, సంతానములను దివ్యవృక్షములు పూఁచిన, ప్రసూన=పూవులలో, ఆప్లుతం=నిండార జలకములాడిన చందముగానైనది; ప్రస్తుత=మొదలు పెట్టిన, వేణు పిల్లన గ్రోవినుండి వెలువడుచున్న, నాద=ప్రణవనాదమే అనెడి, లహరీ=ప్రవాహరూపమైన, నిర్వాణ=ప్రపంచోపశమరూపమైన ఆనందమునందు, నిర్వ్యాకులం=నిబ్బరమగానున్నది; (భూమిపైన) స్రస్త స్రస్త=మాటి మాటికి జాఱిపోవుట నుండి, నిరుద్ధ=బిగియారపట్టుకొన్న, నీవీ=పోకముడులతో, విలసత్=ఒయ్యారములు ఒలుకుచున్న, గోపీసహస్ర=వేలకొలది గోపికాస్త్రీలతో, ఆవృత్తం=పరివేష్టింపఁబడి యున్నది; హస్తన్యస్త=అఱచేతులతో అమర్పఁబడిన, నత=ప్రణతజనముల కోసమైన, అపవర్గం=మోక్ష ఫలములు కలది; అఖిల=కామధేను కల్పవృక్షాదికమైన సకల వదాన్య ప్రపంచముకంటె కూడ, ఉదారం=వితరణశీలమైన, కిశోరాకృతి=బాలస్వరూపమును దాల్చియున్న, వస్తు=శాశ్వత వస్తువు, అస్తి=కలదు.

తాత్పర్యము :- ఆకాశమునందు అప్సరః స్త్రీల చిగురు చేతులతో వెలుఁగు లీనుచున్న దివ్యప్రసూనముల సోనవానలలో తోఁగియాడుచు - పిల్లనగ్రోవినుండి వెలువడుచున్న ప్రణవనాదపు వెల్లువలలో చరాచరములన్నియును కన్నులఱమోడ్చి కదలక మెదలకయుండఁగా, ప్రణతజనముల అఱచేతులలో అమర్పఁబడియున్న అపవర్గ ఫలములతో - సకల వదాన్య ప్రపంచముకంటె వదాన్యమై - కిశోర స్వరూపములో - అభివ్యక్తమగుచున్న ఒక శాశ్వత వస్తువు కలదు.

విశేషము :- తెనుఁగు పద్యములలో వలె ఈ కర్ణామృతములోని పెక్కు శ్లోకములలో ప్రాసము పై కల్పప్రసూనములవలెనే అయత్నొపతితమై యుండును. "అస్తి స్వస్తరుణీ" "వస్తుప్రస్తుత" 'స్రస్త స్రస్త' "హస్తన్యస్త" ఈ 'స్త' అను ద్విదావృత్తమైన యాప్రాసము అచ్చరల చేతులలో నుండి అవశముగా పూలు జాఱి పడుచుండుటనే సూచించుచున్నది.

శ్లో. చాతుర్యైక నిధానసీమ చపలాపాంగ చ్ఛటామంథరం
లావణ్యామృతవీచి లాలిత దృశం లక్ష్మీ కటాక్షాదృతమ్ ।

కాళిందీ పులినాంగణ ప్రణయినం కామావతారాంకురం
బాలం నీల మమీ వయం మధురిమ స్వారాజ్య మారాధ్నుమః ॥ 3

అన్వయము :- అమీ వయం నీలం బాల మారాధ్నుమః ఈ మేము బాలుఁడైన నీలవర్ణుని= విష్ణువును ఆరాధించుచున్నాము. మిగిలిన శ్లోకములోని పదములన్నియును ఆ బాలునకు విశేషణములు.

అర్థము :- చాతుర్య=నేర్పులకన్నింటికి, ఏక నిధాన సీమ=ఒకేఒక నెలవైన, చపల=మెఱపులవంటి, అపాంగ=కడకంటి చూపుల, ఛటా=గుంపులతో, మంథరం=క్రిక్కిరిసిన వానిని, లావణ్యా=కాంతి అనెడి, అమృతవీచి=అమృతపు టలల చేత, లాలిత=అందమైన, దృశం=చూపులుగలవానిని, లక్ష్మీ=లక్ష్మీదేవి యొక్క, కటాక్ష=ఓర చూపులచేత, ఆదృతం=మన్నింపఁబడిన వానిని, కాళిందీ=యమునానది యొక్క, పులినాంగణ=తిన్నెల వాఁకిళ్లయందు, ప్రణయినం=మక్కువ గలవానిని, కామ=కోరికల యొక్క - మన్మథుని యొక్క, అవతార=అవతరణమునకు, అంకురం=మొలకయైన వానిని, బాలం=బాల్యదశలోనున్న, నీలం=నీలవర్ణుని - విష్ణువును, మధురిమ స్వారాజ్యం=చక్కఁదనము యొక్క స్వర్గరాజ్యమును, అమీ=ఈ, వయం=మేము, ఆరాధ్నుమః=అతని మనసు మాపై ప్రసన్నమగు రీతిని కొలిచెదము. ఆరాధనము అనగా చిత్తానువర్తనము.

తాత్పర్యము :- నేర్పుల కన్నింటికి ఒకే ఒక నెలవుగా నున్న మెఱపుతీఁగల వంటి క్రేఁగంటి చూపుల ముమ్మరము కలవానిని, కాంతుల అలలతో అందములు చిందుచున్న చూపులు గలవానిని, లక్ష్మీ దేవి ఓరచూపులకు చేరిక యైన వానిని, యమున యిసుక తిన్నెల వాఁకిళ్ళలో మక్కువలు గలవానిని, కోరికలెత్తిన యీరిక వలె - ఉన్న వానిని, చక్కదనాల స్వారాజ్యమును, బాలునివలెనున్న ఆ నీలవర్ణుని, సాక్షాద్విష్ణువును - ఆయన మనసు మాపై వచ్చురీతిని - ఈ మేము సేవింతుము.

శ్లో. బర్హోత్తంస విలాసి కుంతల భరం మాధుర్యమగ్నాననం
ప్రోన్మీలన్నవయౌవనం ప్రవిలస ద్వేణు ప్రణాదామృతమ్ ।
ఆపీన స్తన కుట్మలాభిరభితో గోపీభి రారాధితం
జ్యోతిశ్చేతసి నశ్చకాస్తి జగతా మేకాభిరామాద్భుతమ్ ॥ 4

అన్వయము :- జ్యోతిః నః చేతసి చకాస్తి = ఒకానొక జ్యోతి మా చేతస్సులో వెలుఁగుచున్నది.

అర్థము :- బర్హ=నెమలిపురి అనెడి, ఉత్తంస=సిగబంతి చేత, విలాసి=వన్నియలు ఈనుచున్న, కుంతల=పెన్నెఱుల యొుక్క, భరం=ముమ్మరము గలది, మాధుర్య=చక్కఁదనముతో,మగ్న=మునిఁగిన, ఆననం=నెమ్మోము గలది; ప్రోన్మీలన్=ఎల్లెడల వికసించుచున్న, నవయౌవనం=నూత్నయౌవనము గలది; ప్రవిలసత్=వెల్లివిరియుచున్న, వేణుప్రణాద=వేణునాదమే అనెడి, అమృతం=అమృతము కలది; ఆపీన=క్రిక్కిరిసిన, స్తనకుట్మలాభిః=అరవిరి మొగ్గలవంటి చనుగవలుగల, గోపీభిః=గోపవధువులచేత, అభితః=అన్నిదెసలలో, ఆరాధితం=సేవింపఁబడినదియును, జగతాం=లోకములకు, ఏకాభిరామ=ఒకేవిధముగా హృదయాభిరామమై, అద్భుతం= అబ్బురపాటు గలిగించుచున్న, జ్యోతిః=వెలుఁగు, నః=మాయొుక్క, చేతసి=స్ఫురణలను మేలుకొలుపుచున్న మనస్సు నందు, చకాస్తి=వెలుఁగుచున్నది.

తాత్పర్యము :- సిగబంతిగా సవదరించిన నెమలిపురి కన్నులతో వన్నెలీనుచున్న పెన్నెఱులగుంపుతో, చక్కఁదన ముట్టి పడుచున్న నెమ్మోముసొరుతో, ఒడలెల్ల అలమి కొని పొటమరించుచున్న కొదమప్రాయముతో, వెల్లివిరియుచున్న వేణునాదామృతముతో, అరవిరి మొగ్గలవలె క్రిక్కిరిసిన చన్నుగవలు గల మందప్రోయాంద్రు బలసికొని సేవింపఁగా సకలజగములకు ఒకే తీఱుగా హృదయాభిరామమై అబ్బురపాటొదవింపఁజేయుచున్న ఒకానొక వెలుఁగు వివిధ స్ఫురణలను మేలుకొలుపుచు మామనస్సులోనిండి వెలుఁగొందుచున్నది.

శ్లో. **మధురతర స్మితామృత విముగ్ధ ముఖాంబురుహం**
మదశిఖిపింఛలాంఛిత మనోజ్ఞ కచప్రచయమ్ ।
విషయ విషామిషగ్రసన గృధ్నుని చేతసి మే
విపుల విలోచనం కి మపి ధామ చకాస్తి చిరమ్ ॥ 5

అన్వయము :- విషయ విషామిషగ్రసన గృధ్నుని మే చేతసి కిమపి విపుల విలోచనం ధామ చిరం చకాస్తి = పరిణామ విషమైన విషయప్రపంచమునందు - ఆబగొని యున్న నామనస్సులో విశాలవిలోచనమైన ఒకానొక వెలుఁగు సుస్థిరమై నిలిచి వెలుఁగుచున్నది - ఆవెలుఁగు-

అర్థము :- మధురతర=అమృతముకంటె తియ్యనైన, స్మితామృత=మందస్మితామృతముతో, విముగ్ధ=మిక్కిలి అందమైన, ముఖాంబురుహం=మోముఁదామర కలది; మదశిఖి=మత్తమయూరము యొక్క, పింఛ=పింఛముతో, లాంఛిత=అలంకరింపఁబడిన, మనోజ్ఞ=మురువైన, కచప్రచయం=కేశకలాపము గలది, విపులవిలోచనం=విశాలమైన కన్నులుగల, కిమపి=మాటలకు అందని, ధామ=వెలుఁగు, విషయ=ఇంద్రియ సుఖములనెడి, విషామిష=విష విమిశ్రితమైన ఎఱలయందు, గృధ్నుని=ఆబపెంచికొనియున్న, మే చేతసి=నా చేతస్సునందు, చిరం=సుస్థిరమై, చకాస్తి=వెలుఁగొందుచున్నది.

తాత్పర్యము :- ఇంద్రియ భోగములనెడి విషదిగ్ధములైన ఎఱలకై ఆబగొనియున్న నామనస్సునందు - అమృతముకంటె తియ్యనైన నవ్వొలుకుచున్న మోముదామరతో, మద మయూర పింఛము చెరివిన కేశకలాపముతో, వెడఁద కన్నులతో - ఒకానొక వెలుఁగు నిలుకడలో వెలుఁగుచున్నది.

శ్లో. ముకుళాయమాన నయనాంబుజం విభోః
మురళీ నినాద మకరంద నిర్భరమ్ ।
ముకురాయమాణ మృదు గండ మండలం
ముఖపంకజం మనసి మే విజృంభతామ్ ॥ 6

అన్వయము :- విభో : ముఖమండలం మే మనసి విజృంభతామ్=విభుని ఆననమండలము నామనస్సులో నిండియుండునుగాక!

అర్థము :- విభోః=శ్రీకృష్ణస్వామియొక్క, 'మురళీ నినాద మకరంద నిర్భరం'- మురళీనినాద=వేణునాదమే అనెడి, మకరంద=పుష్పరసముతో, నిర్భరం=నిండారినదై, ముకుళాయమాన=అరమోడ్పు మొగ్గలగుచున్న, మృదు=ప్రన్నని, గండమండలం=చెక్కిళులుగలిగిన మఖపంకజం=ఆనన పద్మము, మే మనసి=నా మనస్సునందు, విజృంభతాం=నిండార విరియునుగాక!.,

తాత్పర్యము :- మురళీ నినాదమనెడి పుష్పరసముతో నిండారి - అరమోడ్పుగొని మొగ్గలవలె అగుచున్న కన్నుదామరలతో, మెఱుగులు చిమ్ముతళుకుటద్దములవలె అగుచున్న సోఁగచెక్కిళులతో, స్వామి ముఖారవిందము నాడెందములో నిండారి విరియునుగాక!

శ్లో. **కమనీయ కిశోర ముగ్ధ మూర్తేః**
కలవేణు క్వణితాదృతాననేందోః ।
మమవాచి విజృంభతాం మురారేః
మధురిమ్ణః కణికాఽపి కాఽపి కాఽపి ॥ 7

అన్వయము :- మురారేః మధిరిమ్ణః కాఽపి కాఽపి కణికా మమవాచి విజృంభతామ్- మురవైరియైన శ్రీకృష్ణస్వామియొక్క అనిర్వచనీయమైన మాధుర్యలేశమొక్కటియైనను నా పలుకులో ప్రవేశించి నిండారి యుండునుగాక!

అర్థము :- కమనీయ=మనసుపడదగియున్న, కిశోర=కిశోరాకృతిలోనున్న, ముగ్ధమూర్తేః=మనోహర స్వరూపము కలదియును, కల=అవ్యక్త మధురములైన, వేణుక్వణిత=వంశీనాదములతో, ఆదృత=ఆదరింపబడిన, ఆననేందోః= చంద్రబింబమువంటి నెమ్మోము కలిగియున్నz మురారేః=మురాంతకునియొక్క, మధురిమ్ణః=తియ్యదనముయొక్కz కాఽపి=ఇదమిత్థమని చెప్పుటకు వీలుపడని, కాఽపి కణికా=ఒక్కలేశమైనను, మమ వాచి=నా పలుకునందు, విజృంభతాం= పెరుగుచుండును గాక!

తాత్పర్యము :- చిన్నారి పొన్నారి చిఱుత ప్రాయముతో, చంద్రబింబమునకు మృదుస్వనములను నేర్పుచున్నలీలగా, వంశీ మధురనాదములతో, తన ఆననచంద్ర బింబమును ఆదరించుచున్న ఆ మురవైరియొక్క మాటలలోనికి రాని - ఒకానొక తియ్యదనములోని - ఏయొక్క పిసరైనను నామాటలోనికి వచ్చి పెరుగుచుండునుగాక!

శ్లో. **మదశిఖండి శిఖండ విభూషణం**
మదన మంథర ముగ్ధ ముఖాంబుజమ్ ।
వ్రజవధూ నయనాంచల వంచితం
విజయతాం మమ వాఙ్మయ జీవితమ్ ॥ 8

అన్వయము :- మమ వాఙ్మయ జీవితమ్ విజయతామ్=నామాటలలో సన్నిధి చేసియున్న నాజీవితము సర్వాతిశాయియై పెంపొందుచుండునుగాక! అట్టి తనజీవిత స్వరూపమునే వివరించుచున్నాడు.

అర్థము :- మదశిఖండి=సమద మయూరముయొక్క, శిఖండ=బర్హముచేత, విభూషితం=అలంకరింపఁబడినదియును, మదన మంథర=మన్మథ భావాలసమై, ముగ్ధ=మనోహరమైన, ముఖాంబుజం=ముఖాంబుజము కలదియును, వ్రజవధూ=గోపవధువుల యొక్క, నయనాంచల=కటాక్షములచేత, వంచితం=కికురింపఁబడిన, మమ=నాయొక్క వాఙ్మయజీవితం=వాఙ్మయరూపమైన జీవితము లేక వాఙ్మయము యొక్క ప్రాణము (శ్రీకృష్ణుడు), విజయతాం=సర్వాతిశాయియై ఒప్పారుగాక!

తాత్పర్యము :- మద మయూరము యొక్క పింఛముతో అలంకరింపఁబడి మదనాలస సుందరమైన ముఖారవిందముతో మందప్రాయాంధ్ర ఆకేకరాక్షి ప్రసారములచే కికురింపఁబడిన నావాఙ్మయమునకు ప్రాణమైన శ్రీకృష్ణస్వామి సర్వాతిశాయియై పెంపొందునుగాక!

శ్లో. ***పల్లవారుణ పాణిపంకజ సంగి వేణురవాకులం***
ఫుల్లపాటల పాటలీ పరివాది పాదసరోరుహమ్ ।
ఉల్లసన్మధురాధర ద్యుతి మంజరీ సరసాఽననం
వల్లవీ కుచకుంభ కుంకుమపంకిలం ప్రభుమాశ్రయే ॥ 9

అన్వయము :- ప్రభుం ఆశ్రయే=ప్రభువును ఆశ్రయించుచున్నాను. ఆ ప్రభువెట్టివాఁడనఁగా -

అర్థము :- పల్లవ=చిగురాకువలె, అరుణ=ఎఱ్ఱని వన్నియుకల, పాణిపంకజ=హస్తాంబుజమునందు, సంగి=విడువకయున్న, వేణురవ=పిల్లనగ్రోవి రవళులచేత, ఆకులం=సందడించుచున్నవానిని, ఫుల్ల=అరవిచ్చిన, పాటల=తెలుపును మించిన ఎఱుపువన్నె గల, పాటలీ=కలిగొట్టుపూవులను, పరివాది=దూఱుచున్న, పాద సరోరుహం=అడుగు దామరలు కలవానిని, ఉల్లసత్=సొంపులనెగఁబోయుచున్న, మధురాధర=తీయఁబెదవియొక్క, ద్యుతిమంజరీ=కెంపువన్నెల పూలగుత్తి చేత, సరస=ఇంపులొలుకుచున్న, ఆననం=నెమ్మోముగలవానిని, వల్లవీ=గోపికలయొక్క, కుచ కుంభ=స్తనకలశములయందలి, కుంకుమ=కుంకుమ ద్రవముచేత, పంకిలం=అసలారుచున్న, ప్రభుం=జగత్ప్రభువును, ఆశ్రయే=ఆశ్రయించుచున్నాను.

తాత్పర్యము :- కెంజిగురు వన్నెల కరకమలము నందు ఎల్లవేళల విడువక తాల్చిన వేణువు రవళులతో సందడించుచున్నవానిని, ఆరవిచ్చిన తెలుపు మించిన ఎఱుపువన్నెకల కలిగొట్టు పూలను తిట్టి పోయుచున్న అడుగుదామరల వానిని - కెంపు లెగఁజిమ్ముచున్న తీయమోవి పూలగుత్తితో ఇంపులొలుకుచున్న ముద్దుమోము వానిని - గోపికా స్తనకలశములమీద కుంకుమ రసములచేత - అసలారుచున్న జగత్ప్రభువును ఆశ్రయించుచున్నాను.

శ్లో. ***అపాంగ రేఖాభి రభంగురాభిః***
అనంగ లేఖా రసరంజితాభిః ।
అనుక్షణం వల్లవ సుందరీభిః
అభ్యర్చ్యమానం విభుమాశ్రయామః ॥ *10*

అన్వయము :- వల్లవ సుందరీభిః అనుక్షణం అభ్యర్చ్యమానం విభుం ఆశ్రయా మః =వల్లవ పల్లవ పాణులచేత ప్రతిక్షణము పూజింపఁబడుచున్న ఆ జగద్విభుని మేము అనుక్షణము ఆశ్రయించుచున్నాము.

అర్థము :- అభంగురాభిః=విఱుగుట ఎఱుంగని, 'అనంగలేఖా రస రంజితాభిః'- అనంగలేఖా=ప్రణయలేఖలయందలి, రస=అనురాగ రసముచేత, రంజితాభిః=పూయఁ బడినవి వలె నున్న, అపాంగరేఖాభిః=వాలుఁజూపుల వరుసలచేత, వల్లవ సుందరీభిః=గొల్ల హొయలుకత్తెలచేత, అనుక్షణం=క్షణక్షణము, అభ్యర్చ్యమానం=అర్చింపఁబడుచున్న, విభుం=సర్వగతుఁడైన స్వామిని, ఆశ్రయామః=ఆశ్రయించుచున్నాము.

తాత్పర్యము :- విఱిఁగిపోవుట ఎఱుఁగని ప్రణయలేఖలయందలి అనురాగరసము చేత పూఁతపెట్టినట్లున్న వాలుఁజూపులవరుసలచేత క్షణక్షణము మందయందలి అందకత్తియలచేత పూజింపఁబడుచున్న సర్వగతుఁడైన ఆ స్వామిని మేము ఆశ్రయించుచున్నాము.

శ్లో. ***హృదయే మమ హృద్య విభ్రమాణాం***
హృదయం హర్ష విశాల లోల నేత్రమ్ ।
తరుణం వ్రజ బాల సుందరీణాం
తరళం కించన ధామ సన్నిధత్తామ్ ॥ *11*

అన్వయము :- మమ హృదయే కించనధామ సన్నిధత్తామ్=నా హృదయములో ఒకానొక వెలుఁగు సన్నిధి చేయును గాక!

అర్థము :- మమ హృదయే=నా హృదయమునందు, హృద్య=హృదయంగమములైన, విభ్రమాణాం=హొయలులకు, హృదయం=హృదయమువంటిదైన, హర్ష=హర్షముచేత, విశాల=మఱింత పెద్దవియైన, లోల=ఆసక్తములైన, నేత్రం=కన్నులుగల, తరుణం=లేఁతప్రాయముగల, వ్రజబాలసుందరీణాం=మంద లేఁబ్రాయపు సొగసుకత్తెలకు, తరళం=హారమధ్య నాయకమణియైన, కించన ధామ=ఒకానొక వెలుఁగు, సన్నిధత్తాం=సన్నిధిని అవధరించునుగాక!

తాత్పర్యము :- నా హృదయములో - హృదయంగమములైన ఎల్ల విభ్రమములకును హృదయస్థాన భూతమును, హర్షాతిశయముచేత మఱింత విరివియై అనురాగాసక్తములైన కన్నులు గలదియును, లేఁతప్రాయము గలదియును, వ్రేఁతలను హార వలయమునకు నాయకమణియైన ఒకానొక దీధితి తన సన్నిధానమును అవధరించునుగాక!

శ్లో. *నిఖిల భువన లక్ష్మీ నిత్య లీలాఽస్పదాభ్యాం*
కమల విపిన వీథీ గర్వ సర్వంకషాభ్యామ్ ।
ప్రణమ దభయదాన ప్రౌఢి గాఢోద్ధతాభ్యాం
కిమపి వహతు చేత: కృష్ణ పాదాంబుజాభ్యామ్ ॥ 12

అన్వయము :- కృష్ణ పాదాంబుజాభ్యాం కిమపి మమ చేతో వహతు=శ్రీ కృష్ణస్వామి పాదారవిందము లనెడు గమ్యస్థానముకొఱకు నాకు తెలియకనే నా చేతోవృత్తి ప్రవహించుచుండును గాక!

అర్థము :- నిఖిలభువన=అఖిల లోకముల యొక్క, లక్ష్మీ=శోభాతిశయమునకుఁ గారణములైన, నిత్య-లీలా=నిత్యవిభూతికిని, లీలావిభూతికిని, ఆస్పదాభ్యాం=నెలవులైనవియును, కమల విపినవీథీ=పద్మవన వీథులయొక్క, గర్వ=గర్వమును సర్వంకషాభ్యాం=మూల ముట్టుగా దులిచినవియును, ప్రణమత్=ప్రణమిల్లు వారికై, అభయ దాన=అభయము నిచ్చుటయందలి, ప్రౌఢి=నేర్పుచేత, గాఢ=మిక్కుటముగా, ఉద్ధతాభ్యాం=గర్వమును దాల్చినవియును-అయిన, కృష్ణ పాదాంజాభ్యాం=శ్రీకృష్ణస్వామి అడుగు దామరల కొఱకు, కిమపి=అవశముగా, మమ=నాయొక్క, చేత:=చేతోవృత్తి, వహతు=ప్రవహించుచుండునుగాక!

తాత్పర్యము :- నిఖిలలోకములు సిరిసంపదలతో వెలయుటకు ((గారణములైన నిత్య-లీలా విభూతులు రెండింటికి నెలవులైనవియును-తామరపూల వరుసల శోభా గర్వమును నిర్మూలించునవియును, ప్రసన్న జనములకు అభయమిచ్చునేర్పువలని గర్వముచేత ఉద్ధతి వహించినవియునైన శ్రీకృష్ణపాదారవిందములకొఱకై నా చేతోవాహిని నిర్వ్యాజముగాఁ బ్రవహించుచుండునుగాక!

శ్లో. ప్రణయ పరిణతాభ్యాం ప్రాభవాఽలంబనాభ్యాం
ప్రతి పద లలితాభ్యాం ప్రత్యహం నూతనాభ్యామ్ ।
ప్రతిముహు రధికాభ్యాం ప్రస్నువ ల్లోచనాభ్యాం
ప్రభవతు హృదయేనః ప్రాణనాథః కిశోరః ॥ 13

అన్వయము :- ప్రాణనాథః కిశోరం: నః హృదయే ప్రభవతు=ప్రాణనాథుఁడైన ఆ కిశోరమూర్తి మా హృదయమునందు ఆవిర్భవించునుగాక!

అర్థము :- ప్రణయపరిణతాభ్యాం=ప్రణయముగా పరిణమించినవియు, ప్రాభవాలంబనాభ్యాం=ప్రభుత్వయునకు ఊనిక పట్టులును, ప్రతిపద లలితాభ్యాం= అడుగడుగునకును లలితములైనవియును, ప్రత్యహం:=ప్రతిదినమును, నూతనాభ్యాం=సరిక్రొత్తవియును, ప్రతిముహుః=మాటిమాటికిని, అధికాభ్యాం=పెరుగుచున్న వియునైన, ప్రస్నువల్లోచనాభ్యాం=కరుణతో ఆర్ద్రములగుచున్న కన్నులతో, నః=మాయొక్క, ప్రాణనాథః=ప్రాణనాథుఁడైన, కిశోరః=ఆదికిశోరుఁడు, హృదయే=హృదయమునందు, ప్రభవతు=ఆవిర్భవించునుగాక!

తాత్పర్యము :- ప్రేమ మయములును, ప్రాభవ నిలయములును, ప్రతిపద సుందరములును, ప్రతిక్షణ వినూతనములును, ప్రతిదిన వర్ధమానములును, కరుణతో కరఁగిపోవుచున్నవియు నగు నయనములతో, నాప్రాణనాథుడైన కిశోరుఁడు నా హృదయమునందు ఆవిర్భవించునుగాక!

శ్లో. మాధుర్య వారిధి మదాంధ తరంగ భంగీ
శృంగార సంకలిత శీత కిశోర వేషమ్ ।
ఆమందహాస లలితానన చంద్రబింబం
ఆనంద సంప్లవ మనుప్లవతాం మనో మే ॥ 14

అన్వయము :- ఆనంద సంప్లవం ఆనన చంద్రబింబం మే మనః అనుప్లవతామ్= ఆనందమునందు తేలియాడుచున్న శ్రీకృష్ణస్వామి ఆనన చంద్రబింబమును అనుసరించి నా డెందము తేలియాడునుగాక!

(**అర్థము :-** మాధుర్య.....వేషమ్ - మాధుర్యం=సౌందర్యమనెడి, వారిధి=సముద్రముయొక్క, మద+అంధ=మదముచే కన్నుగాననివైన-మిక్కుటముగా విజృంభించుచున్న వైన అనుట, తరంగ=అలలయొక్క, భంగీ=పంక్తుల రూపముగా నున్న, శృంగార=శృంగార రసము తోడ, సంకలిత=కూడినట్టి, శీత=చల్లని-చూచువారి కన్నులకు సుఖప్రదమైనట్టి అనుట, కిశోర వేషం=బాలుని ఆకారము కలదియు; ఇట సౌందర్యమును సముద్రముగాను, అందుపొంగి పొరలుచున్న అలలే శృంగార రసముగాను నిరూపితములైనవి. కావున సౌందర్యము మిక్కిలి విజృంభించి శృంగారరస సముద్రమువలె నున్నదని అర్థము. అట్టి శృంగార రసముచేత ఆర్ద్రమగుటచే కిశోర వేషము శీతముగా నున్నదని చమత్కారము; మఱియును, ఆమందహాస లలితానన చంద్రబింబం - ఆమందహాస=కొంతనెఱసిన చిఱునవ్వుచేత, లలిత=మనోరహరమైన, ఆనన=ముఖము అనెడి, చంద్రబింబమ్=చంద్రబింబముగలదియు - చిఱునగవుచే సొగసు గులుకుచు చంద్రబింబము వలె ప్రకాశించుచున్న మొగము కలదియు ననుట, ఇటువంటిదైన, ఆనందసంప్లవమ్= ఆనందప్రవాహమును, మే=నాయొక్క, మనః=మనస్సు, అనుప్లవతాం=అనుసరించునుగాక, లేక, అను=అనుసరించి, ప్లవతామ్=తెప్పలఁదేలునుగాక - ఆనందమయమైన ఆ ప్రవాహమునందు నామనసు ఓలలాడునుగాక అనుట; ఇందు 'ఆమందహాస' అని మందహాసరూపమైన వెన్నెలగల, 'ఆనన చంద్రబింబం' అని ఆనన రూపమైన చంద్రునిచేత, 'మాధుర్య' మనెడి 'వారిధి', 'మదాంధ తరంగ భంగీ' అని పొంగి, 'ఆనందసంప్లవమ్' అని ఆనందమయముగా ప్రవహించినదనియు, ఆప్రవాహము నందు తన మనంబు ఓలలాడుఁగాక అనియు, నర్థము శబ్దశక్తిచే ధ్వనించుచున్నది.

తాత్పర్యము :- చక్కందనము మిక్కిలి అతిశయించి సింగారము కులుకుచున్న చల్లని చిన్ని బాలుని రూపుఁదాల్చి, చిఱునవ్వుతోఁ గూడిన చంద్రుని మొగము గలిగి, వెలుఁగుచున్న కృష్ణుండనెడి ఆనందపు వెల్లియందు నామనస్సు తేలియాడునుగాక!)

శ్లో. అవ్యాజ మంజుల ముఖాంబుజ ముగ్ధభావైః
ఆస్వాద్యమాన నిజవేణు వినోద నాదమ్ ।

ఆక్రీడతా మరుణపాద సరోరుహాభ్యాం
ఆర్ద్రే మదీయ హృదయే భువనార్ద్ర మోజః ॥ 15

అన్వయము :- అరుణ పాద సరోరుహాభ్యాం. భువనార్ద్రం ఓజః మదీయ హృదయే ఆక్రీడతాం = ఎఱ్ఱని అడుగుదామరలతో భువనమును ఆర్ద్రమొనరించు వెలుఁగు నా ఆర్ద్రహృదయమునందు నడయాడుచుండునుగాక!

అర్థము :- అవ్యాజ మంజుల=సహజ సుందరమైన, ముఖాంబుజ=ముఖ కమలము నందలి, ముగ్ధ భావైః=రమ్య భావములచేత, ఆస్వాద్యమాన=ఆస్వాదింపఁబడుచున్న, నిజవేణు=తనవేణువుయొక్క, వినోద=క్లేశములను తొలఁగించెడు, నాదైః=నాదములతో, భువనార్ద్రం=భువనములను ఆర్ద్రీ భవింపఁజేయునట్టి, ఓజః=తేజము, అరుణపాద సరోరుహాభ్యాం=ఎఱ్ఱని అడుగు దామరలతో, ఆర్ద్రే=కరిఁగిన, మదీయ హృదయే=నా హృదయమునందు, ఆక్రీడతాం=ఎల్లెడలఁ గ్రీడించునుగాక!

తాత్పర్యము :- సహజ సుందరమైన ముఖారవిందమునందలి రమ్యభావములతో తన వేణునాదమును తానే ఆస్వాదించుచు ఎఱ్ఱని అడుగు దామరలతో, భువనములను ఆర్ద్రీభవింపజేయుచున్న వెలుఁగు సమార్ద్రమైన నా హృదయక్షేత్రమునందు ఎల్లెడలఁ గ్రీడించుచుండునుగాక!

శ్లో. మణినూపుర వాచాలం, వందే తచ్చరణంవిభోః
లలితాని యదీయాని, లక్ష్మాణి వ్రజవీథిషు. 16

అన్వయము :- విభోః తత్ చరణం వందే - స్వామి యొక్క ఆ చరణమును నమస్కరించుచున్నాను.

అర్థము :- మణినూపుర వాచాలం=మణులు పొదిగిన అందెరవళులతో సందడిగా మాటాడుచున్నదివలెనున్న, విభోః=స్వామియొక్క తత్=ఆ, చరణం=అడుగును, వందే=నమస్కరించుచున్నాను. వ్రజవీథిషు=వ్రేపల్లె వీథులయందు, యదీయాని=ఏ చరణమునకుఁజెందిన, లక్ష్మాణి=చిన్నెలు, లలితాని=అలంకారములో!

తాత్పర్యము :- మణులు పొదిగిన అందె రవళులతోఁజెలఁగి చెలఁగి మాటలాడు చున్నది వలెనున్న స్వామియొక్క ఏ అడుగుచిన్నెలు వ్రేపల్లె వీథివీథులకు తొడుగనినగలై అందగించుచుండునో ఆచరణమునకు ప్రణమిల్లుచున్నాను.

శ్లో. మమ చేతసి స్ఫురతు వల్లవీ విభోః
మణినూపురప్రణయి మంజు శింజితమ్ ।
కమలావనేచర కళింద కన్యకా
కలహంస కంఠ కలకూజి తాదృతం ॥ 17

అన్వయము :- మమచేతసి వల్లవీవిభోః నూపురశింజితం స్ఫురతు=నాహృదయములో వల్లవీవల్లభుని యొక్క అందెరవళి ప్రతిశబ్దించునుగాక!

అర్థము :- కమలా వనేచర=లక్ష్మీనివాసమైన పద్మవనమునందు సంచరించుచున్న, కళింద కన్యకా=యమునానదికి సంబంధించిన, కలహంసకంఠ=కలహంసల కంఠముల నుండి వెలువడుచున్న, కలకూజిత=అవ్యక్త మధుర ధ్వనులతో, ఆదృతం=ఎదురేగి మన్నింపఁబడిన, వల్లవీ విభోః=వల్లవీ వల్లభుని యొక్క, మణినూపుర ప్రణయి=మణి నూపురమే యనెడి ప్రణయ శాలియొక్క, మంజు శింజితం=తీయనైన గిలుకు, మమ చేతసి=నా హృదయమందు, స్ఫురతు=స్ఫురించునుగాక!

తాత్పర్యము :- యమునానదిలోని పద్మవనమునందు విహరించుచున్న కలహంస కంఠ ధ్వనులతో ప్రతికూజితవ్యాజమున సమాదరింపఁబడిన వల్లవీ వల్లభునియొక్క అందెల గిలుకు నా డెందములో కలధ్వనులనీనునుగాక!

శ్లో. తరుణారుణ కరుణామయ విపులాऽయత నయనం
కమలా కుచ కలశీభర విపులీకృత పులకమ్ ।
మురళీరవ తరళీకృత ముని మానస నలినం
మమఖేలతి మదచేతసి మధురాధర మమృతమ్ ॥ 18

అన్వయము :- మమ మదచేతసి మధురాధరం అమృతం ఖేలతి =పరవశించిన నా హృదయములో మధురాధరమైన అమృతము క్రీడించుచున్నది. ఆ అమృతము యొక్క ఆకారము ఎట్టిదనఁగా -

అర్థము :- తరుణారుణ=తరుణములు అరుణములు, కరుణామయ= కరుణామయములు, విపులాయత=విశాలమైన పొడవైన, నయనం=కన్నులుగలది. కమలా=లక్ష్మీదేవియొక్క, కుచ కలశీభర=కుచ కలశముల బరువుచేత, విపులీకృత

పులకం=ముమ్మరించిన గగుర్పాటు కలది. మురళీరవ=మురళీరవములచేత, తరళీకృత=కదలింపఁబడిన, మునిమానస నలినం=మునుల మానసములనెడి నలినములు కలది. మమ=నాయొక్క, మద=పారవశ్య జడీభూతమైన, చేతసి=చేతస్సునందు, మధురాధరం=మధురమైన అధరముగల, అమృతం=అమృతము, ఖేలతి=ఖేలనము చేయుచున్నది.

తాత్పర్యము :- తరుణారుణములు కరుణామయములు విపులాయతములు అయిన నయనములతో, కమాలాదేవియొక్క కుచకలశములయొక్క బరువుతో ముమ్మరముగా చాదిన గగుర్పాటుతో, మురళీరవములచేత తరళీకృతములైన ముని మానసములే యనెడు పద్మములుగల, మధురాధరమైన ఒక అమృతము, పారవశ్యజడమైన నా హృదయములో ఖేలనము చేయుచున్నది.

శ్లో. **ఆముగ్ధ మర్ధ నయనాంబుజ చుంబ్యమాన**
హర్షాకుల వ్రజవధూ మధురాననేందో: ।
ఆరబ్ధ వేణురవ మాది కిశోర మూర్తే:
ఆవిర్భవంతి మమచేతసి కే ఽపి భావా: ॥ 19

అన్వయము :- ఆరబ్ధవేణురవం ఆదికిశోరమూర్తే: కేఽపిభావా: మమ చేతసి ఆవిర్భవంతి = వేణురవము ప్రారంభించుటయే తడవుగా - ఆదికిశోరునకు సంబంధించిన అపూర్వభావము లేవేవియో నా హృదయమునందు ఆవిర్భావము నందుచున్నవి.

అర్థము :- ఆముగ్ధం=సర్వతో ముగ్ధముగా, అర్ధనయనాంబుజ=అఱమోడ్పు కనుదమ్ములతో, చుంబ్యమాన=ముద్దిడుకొనబడుచున్న, హర్షాకుల=హర్షాతిశయముచేత సందడించుచున్న, వ్రజవధూ=గోపవధువులయొక్క, మధుర=సుందరములైన, ఆననేందో:=ముఖచంద్రబింబములుగల, ఆది కిశోర మూర్తే:=ఆది కిశోరునియొక్క, ఆరబ్ధ వేణురవం=వేణునాదారంభమునుండి, మమ=నాయొక్క, చేతసి=చేతస్సునందు, కేఽపి=చెప్పనలవి కాని, భావా:=భావములు, ఆవిర్భవంతి=ఆవిర్భావము నందుచున్నవి.

తాత్పర్యము :- అఱమోడ్పు కనుదమ్ములతోనే గోపికాముఖచంద్రబింబములను ముద్దిడికొనుచు వేణురవము నారంభించిన ఆదికిశోరుని వలన నా మనసుకడలిలో అలలు అలలుగా అపూర్వానుభూతములైన భావములు ఆవిర్భవించుచున్నవి.

శ్లో. *కల క్వణిత కంకణం కర నిరుద్ధ పీతాంబరం*
క్రమ ప్రసృత కుంతలం కలిత బర్హభూషం విభోః ।
పునః ప్రసృతి చాపలం ప్రణయినీ భుజాయంత్రితం
మమ స్ఫురతు మానసే మదనకేళి శయ్యోత్థితమ్ ॥ 20

అన్వయము :- విభోః మదనకేళి శయ్యోత్థితం మమమానసే స్ఫురతు=స్వామి రతిశయ్యనుండి లేచిన తీఱు నామనస్సులో స్ఫురించుగాక!

అర్థములు :- కల క్వణిత కంకణం=మధురముగా రవళించుచున్న కంకణములు కలదియు, కర నిరుద్ధ పీతాంబరం=చేతితో ఆచి పట్టుకొనిన పసి దువ్వలువ జాఱుపాటు కలదియు, క్రమప్రసృత కుంతలం=క్రమముగా సద్దుకొనిన ధమ్మిల్లము కలదియు, కలిత బర్హభూషం=చెరివికొనిన బర్హాలాకారం కలదియు, పునః ప్రసృతి చాపలం=పునః ప్రసార చాపలము కలదియు, ప్రణయినీ భుజాయంత్రితం=ప్రియురాలి బాహువుతో నియమింపఁబడినదియు నైన - విభోః=స్వామి యొక్క, మదనకేళి శయ్యోత్థితం=రతిశయ్య నుండి లేచిన తీఱు, మమ మానసే=నా మానసమునందు, స్ఫురతు=స్ఫురించునుగాక!

తాత్పర్యము :- కంకణ కలధ్వనులతో, పాణి నిరుద్ధ పీతాంబరముతో, చక్కనొత్తిన ధమ్మిల్లముతో, చెరివిన నెమ్మి పురితో, పునః ప్రసారచాపలమును అరికట్టుచున్న ప్రేయసీ బాహువల్లికతో రతిశయ్యనుండి స్వామి లేచిన తీఱు నామానసములో ఇరవొందునుగాక!

శ్లో. *స్తోక స్తోక నిరుధ్యమాన మృదుల ప్రస్యంది మందస్మితం*
ప్రేమోద్భేద నిరర్గళ ప్రసృమర ప్రవ్యక్త రోమోద్గమమ్ ।
శ్రోతృశ్రోత్ర మనోహర వ్రజవధూ లీలా మిథో జల్పితం
మిథ్యాస్వాప ముపాస్మహే భగవతః క్రీడా నిమీల ద్దృశః ॥ 21

(**అన్వయము :-** భగవతః మిథ్యాస్వాపం ఉపాస్మహే=సామియొక్క కల్లనిద్దురను ఉపాసించెదము. అదియెట్టిదనఁగా-)

అర్థము :- స్తోక స్తోక నిరుధ్యమాన=ఇంచించుక బిగియఁబట్టి కొనినను, మృదుల ప్రస్యంది=నెమ్మదిగా ఉబికివచ్చుచున్న, మందస్మితం=చిఱునవ్వు గలదియును, ప్రేమోద్భేద=ప్రేమ వెల్లడియగుటచేత, నిరర్గళ=అడ్డుమాఁకలు లేక, ప్రసృమర=సర్వ

శరీరము నందు చాదుకొనుచున్న, ప్రవ్యక్త=మిక్కిలి వెల్లడియగుచున్న, రోమోద్గమం=గగుర్పాటు గలదియును, శ్రోత్రశ్రోత్ర మనోహర=వినువారి వీనులకు విందైన, వ్రజవధూ - వ్రజాంగనలయొక్క, లీలా=ప్రియానుకరణములయందు, మిథోజల్పితం=పరస్పరము ముచ్చటించుకొనఁబడిన, క్రీడానిమీలద్దృశః=క్రీడార్థమై మూఁతలు పడుచున్న కన్నులుగల, భగవతః=స్వామియొక్క, మిథ్యాస్వాపం=మోసపు నిద్దురను, ఉపాస్మహే=ఉపాసింతుము.

తాత్పర్యము :- మెల్లమెల్లగా అదుమఁబడియును పెల్లుబికి అల్లనల్లన జాలువాఱుచున్న చిఱునవ్వుకలదియు, వెల్లివిరిసిన ప్రేమభావము చేత సర్వాంగములయందు జాదుకొనిన పులకల ముమ్మరము గలదియును, వినువారి వీనులవిందుగా వ్రజాంగనలచేత పరస్పర సల్లాపములయందు ముచ్చటించుకొనఁబడినదియునైన స్వామియొక్క నిమీలిత నయనమైన నిద్రాభినయమును ఉపాసించెదము.

శ్లో. ***విచిత్ర పత్రాంకుర శాలిబాలా***
స్తనాంతరం మౌని మనోఽంతరం వా ।
అపాస్య బృందావన పాదపాస్యమ్
ఉపాస్య మన్య న్నవిలోకయామః ॥ 22

అన్వయము :- బృందావన పాదపాస్య మపాస్య అన్యదుపాస్యం నవిలోకయామః = బృందావన పాదప నివాసిని విడిచి వేఱొక ఉపాస్యమును మేము కానము.

అర్థము :- విచిత్ర=చిత్రవర్ణములకల, పత్రాంకుర=పత్రాకారములు అంకురాకారములునైన రేఖారచనలతో, శాలి=ఒప్పుచున్న, బాలా=లలనలయొక్క, స్తనాంతరం=స్తనమధ్యదేశమును, వా=లేక, మౌని మనోంతరం=ముని జనముల యొక్క మనోఽ ంతరమును, అపాస్య=తొలఁగఁబెట్టి, బృందావన పాదపాస్యం=బృందావనము చెట్లక్రింద నివాసముగల, అన్యదుపాస్యం=ఉపాసింపఁదగిన వేఱొక వస్తువును, నవిలోకయామః=కానము.

తాత్పర్యము :- చిత్ర వర్ణాభిరామములైన పత్రాంకుర విన్యాసములుకల తరుణీస్తనాంతరము - లేక - ముని మనోఽంతరము. అను రెండుస్థానములను విడిచి బృందావన తరు నివాసియైన ఉపాస్యవస్తువును వేఱొకచోట మేము కనుగొనము.

శ్లో. సార్ధం సమృద్ధై రమృతాయమానైః
ఆధ్మాయ మానై ర్మురళీ నినాదైః ।
మూర్ధాభిషిక్తం మధురాకృతీనాం
బాలం కదానామ విలోకయిష్యే ? 23

అన్వయము :- మధురాకృతీనాం మూర్ధాభిషిక్తం బాలం కదానామ విలోకయిష్యే? - అందగాండ్రలో మూర్ధాభిషిక్తుఁడైన బాలుని నే నెన్నఁడు చూడఁగలనోకదా!

అర్థము :- సమృద్ధైః=సమృద్ధిమంతములు, అమృతాయమానైః=అమృతమువలె పరిణమించుచున్నవి, ఆధ్మాయమానైః=ఊఁదఁబడుచున్నవియునైన, మురళీ నినాదైః సార్ధం=మురళీ నినాదములతో సహ, మధురాకృతీనాం=మధురాకృతులలో నెల్ల, మూర్ధాభిషిక్తం=పట్టాభిషిక్తుఁడైన, బాలం=బాలుని, కదానామ=ఎప్పటికిఁగాను, విలోకయిష్యే=చూడఁగలనో!

తాత్పర్యము :- అమృతాయమానములగుచున్న మాఱుమ్రోగుచున్న పుష్కల మురళీనినాదములతో సహ మధురాకృతులకెల్ల మూర్ధాభిషిక్తుఁడైన బాలుని నే నెన్నటికి చూడఁగలనోకదా!

శ్లో. శిశిరీకురుతే కదానునః
శిఖిపింఛాభరణ శ్శిశుర్దృశోః ।
యుగళం విగళ న్మధుద్రవ
స్మిత ముద్రా మృదునా ముఖేందునా ॥ 24

అన్వయము :- నః దృశోర్యుగళం శిఖిపింఛాభరణః శిశుః కదాను శిశిరీకురుతే! = శిఖిపింఛాభరణుఁడైన శిశువు మా కనుదోయిని ఎన్నటికి చల్లఁ బఱచునోకదా!

అర్థము :- శిఖిపింఛాభరణః=నెమలిపురియే పెద్దనగవలెఁదాల్చిన, శిశుః=చిన్నవాఁడు, నః=మాయొక్క, దృశోఃయుగళం=కన్నుల జంటను - కనుదోయిని, విగలన్మధుద్రవ స్మితముద్రామృదునా-విగళత్=జాఱుచున్న, మధుద్రవ=తేనెవంటి, స్మితముద్రా= స్మితలాంఛనముతో, మృదునా=సౌమ్యదర్శనమైన, ముఖేందునా=ముఖ చంద్రునితో, కదాను=ఎన్నటికిఁగానుz శిశిరీ కురుతే=చల్లఁబఱచునోకదా!

తాత్పర్యము :- నెమలిపింఛమునే పెద్ద నగవలె సవదరించి కొనిన ఆ చిన్నవాడు జాఱుచున్న తేనెధారవంటి మందహాసలాంఛనముగల సౌమ్యదర్శనమైన తన ముఖ చంద్రబింబ దర్శనముతో నాకనుదోయిని ఎన్నటికి చలువ లానఁజేయునో?

శ్లో. *కారుణ్య కర్బుర కటాక్ష నిరీక్షణేన*
తారుణ్య సంవళిత శైశవ వైభవేన ।
ఆపుష్ణతా భువన మద్భుత విభ్రమేణ
శ్రీకృష్ణ చంద్ర! శిశిరీకురు లోచనం మే! 25

అన్వయము :- హే శ్రీకృష్ణచంద్ర! మే లోచనం శిశిరీకురు!=ఓ శ్రీకృష్ణచంద్రుఁడా! నా కన్నులను చల్లనివిగాఁ జేయుము.

అర్థము :- కారుణ్య=కనికారముచేత, కర్బుర=శబలవర్ణమైన, కటాక్ష నిరీక్షణేన=కడకంటి చూపులు గలదియు తారుణ్య=కొదమతనముతో, సంవలిత= పెనవైచుకొనఁబడిన, శైశవ=బాల్యముయొక్క, వైభవేన=వైభవము కలదియును, భువనం= లోకమును, ఆపుష్ణతా=నిండార పోషించుచున్న, అద్భుత విభ్రమేణ=అచ్చెరు వొదవించు విలాసముతో, శ్రీకృష్ణచంద్ర!=శ్రీకృష్ణుఁడనెడి చంద్రుడా!, మే లోచనం=నా కంటిని, శిశిరీ కురు=చల్లనయగురీతినిఁ జేయుము.

తాత్పర్యము :- ఓ శ్రీకృష్ణచంద్రుఁడా! కనికరముతో కలగలుపువన్నెలు కలదై, కొదమతనము ఆవరించిన బాల్యము కలదియై, లోకమును నిండార కాపాడుచున్న అచ్చెరువు గొలుపుచున్న విలాసముతో నాకంటిని చలువలారఁజేయుము.

శ్లో. *కదావా కాళిందీ కువలయ దళ శ్యామల తరాః*
కటాక్షా లక్ష్యంతే కిమపి కరుణా వీచి నిచితాః ।
కదావా కందర్పప్రతిభటజటా చంద్ర శిశిరాః
కిమ ప్యంతస్తోషం దదతి మురళీ కేళి నినదాః ॥ 26

అన్వయము :- కటాక్షాః కదావా లక్ష్యంతే! మురళీకేళి నినదాః కిమప్యంతస్తోషం కదావా దదతి!=కటాక్షము లెన్నఁడు పొడఁగాంతునో! చల్లని మురళీ నినాదములు అంతఃశాంతిని నా కెన్నటికి ఒనఁగూర్చునోకదా!

అర్థము :- కాళిందీ కువలయ దళ శ్యామల తరాః=యమునానదిలోని నల్లకలువ రేకులకంటె నల్లనైనవియును, కిమపి=చెప్పనలవికాని, కరుణావీచి=కనికరపు టలలతో, నిచితాః=వ్యాప్తములైన, కటాక్షాః=కడకంటి చూపులు, కదావా=ఎన్నటికైనఁగాని, లక్ష్యంతే!=పొడఁగాంచఁబడునో!, కందర్పప్రతిభట=మదనాంతకునియొక్క, జటాచంద్ర=జడలలోని చందమామవలె, శిశిరాః=చలువలూరించు, మురళీ కేళి నినదాః=క్రేళ్లుఱుకుచున్న పిల్లనగ్రోవి నాదములు, కిమపి=చెప్పనలవికాని, అంతస్తోషం=లోపలినుండి పెల్లుబుకుచున్న ఆనందమును కదావా=ఎన్నటికైనఁగాని, దదతి=ఇచ్చునా?

తాత్పర్యము :- యమునలోని నల్లకలువరేకులకంటె నల్లనై చెప్పనలవి కాని కని కరపుటలలతో నిండిన ఆ కడకంటి చూపులను ఎన్నటికైనఁగాని పొడఁగాంతునా? మదానాంతకుని జడల అడవిలోని చందమామవలె చలువలూరించుచు, క్రేళ్లుటికి వచ్చుచున్న ఆ పిల్లనఁగ్రోవి నాదములు లోపలినుండి పెల్లుబికివచ్చుచున్న ఆనందమును నా కెన్నటికైనఁగాని కలిగించునా?

శ్లో. *అధీర మాలోకిత మార్ద్ర జల్పితం*
గతంచ గంభీర విలాస మంథరం ।
అమంద మాలింగిత మాకులోన్మద
స్మితం చ తేనాథ! వదంతి గోపికాః ॥ 27

అన్వయము :- హేనాథ! తే ఆలోకితం గతం ఆలింగితం స్మితంచ గోపికా వదంతి=ఓనాథుఁడా! నీ చూపునుగురించి, నీ మాటను గురించి, నీ నడకను గురించి, నీ ఆలింగనమును గురించి, నీస్మితమును గురించి గోపికలు ముచ్చటించుకొనుచున్నారు.

అర్థము :- నాథ!=ఓనాథుడా!, తే=నీయొక్క, అధీరం=చంచలమైన, అలోకితం=చూపును గుఱించి, ఆర్ద్రజల్పితం=ప్రేమార్ద్రమైన మాటను గుఱించి, గంభీర విలాస మంథరం=గంభీరము, విలాసాలసమునైన, గతంచ=నడకనుగుఱించి అమందం=గాటమైన, ఆలింగితం=కౌగిలింతను గుఱించి, ఆకులోన్మద స్మితంచ=అకులమును ఉన్మదజనకమైన స్మితమును గుఱించి, గోపికాః=గోపికలు, వదంతి= ముచ్చటించుచున్నారు.

తాత్పర్యము :- ఓనాథుడా! నీచూపు బెఱుకని, నీ సల్లాపము ప్రేమార్ద్రమని, నీ నడక గాంభీర్య విలాస మంథరమని, నీ ఆశ్లేషము గాఢమని, నీ స్మితము ఆకులము - ఉన్మదమునని గోపికలు ముచ్చటింతురు.

శ్లో. అస్తోక స్మితభర మాయతా ऽయతాక్షం
నిశ్శేష స్తన మృదితం వ్రజాంగనాభిః ।
నిస్సీమ స్తబకిత నీలకాంతి ధారం
దృశ్యాసం త్రిభువన సుందరం మహ స్తే ॥ 28

అన్వయము :- త్రిభువన సుందరం తే వపుః దృశ్యాసం=త్రిభువన సుందరమైన నీ మూర్తిని చూచెదను గాక!

అర్థము :- అస్తోక=అలంతికాని, స్మితభరం=నవ్వువ్రేఁగుకలదియును, ఆయతాऽయత=విశాల విశాలములైన, అక్షం=విలోచనములు గలదియును, వ్రజాంగనాభిః=వ్రేజవరాంద్ర చేత, నిఃశేషస్తన మృదితం=జొమ్ములారఁగ్రుమ్మఁబడినదియు, నిఃశేష స్తబకిత నీలకాంతి ధారం=ఎల్లలు లేని నల్లని వెలుఁగులు మిలమిలలు గుత్తులు గుత్తులు గొనినట్లున్న, త్రిభున సుందరం=త్రిజగన్మోహనమైన, తే=నీయొక్క, వపుః=నెమ్మేనును, దృశ్యాసం=చూచెదనుగాక!

తాత్పర్యము :- అలంతికాని నవ్వు వ్రేఁగు కలదియును, విశాల విశాలములైన, కన్నులు గలదియును, వ్రేజవరాంద్రచేత జొమ్ములకొలఁది చేత క్రుమ్మఁబడినదియును, ఎల్లలు లేని నల్లని వెలుఁగులు మిలమిలలచేత గుత్తులు గుత్తులు పడినట్లున్నదియు నైన త్రిజగన్మోహనమైన నీనెమ్మేనును జూచెదను గాక!

శ్లో. మయి ప్రసాదం మధురైః కటాక్షైః
వంశీ నినాదానుచరై ర్విధేహి ।
త్వయి ప్రసన్నే కి మిహాపరైర్నః
త్వయ్యప్రసన్నే కిమిహాపరైర్నః ॥ 29

అన్వయము :- త్వయి ప్రసన్నే అప్రసన్నేపి నః కిమపరైః?=నీవుప్రసన్నుఁడవైనచో నితరులతో మాకు బనివేదు. నీవు అప్రసన్నుఁడనైనను ఇతరులతో మాకు ఁబనిలేదు.

అర్థము :- వంశీ నినాదానుచరైః-వంశీ=పిల్లనఁగ్రోవి యొక్క, నినాద=ధ్వనులకు, అనుచరైః=వెన్నంటి వచ్చుచున్న, మధురైః=తీయనైన, కటాక్షైః=ఆకేకర ప్రసారితములైన చూపులతో - క్రేగంటిచూపులతో, మయి=నాయందు, ప్రసాదం=ప్రసన్న భావమును, విధేహి=అలవరింపుము, త్వయి=నీవు, ప్రసన్నే=ప్రసన్నుఁడవైనచో, ఇహ=ఇచ్చట, నః=మాకు అపరైః=వేఱొకరితో, (పరుఁడుకాని వారితో - పరమాత్మకాని వారితో), కిం=ఏమి ప్రయోజనము?, త్వయి=నీవు, అప్రసన్నే=అప్రసన్నుడవైనచో, అపరైః=ఇతరులతో, నః=మాకు., కిమ్=ఏమిప్రయోజనము?

తాత్పర్యము :- వేణునాదమును వెన్నంటి వచ్చుచున్న మధురములైన కడకంటి చూపులతో నాయందు ప్రసన్నతను అలవరింపుము! నీవు ప్రసన్నుఁడవైనచో ఇతరులెట్లున్నను మాకేమి? నీవు అప్రసన్నుఁడవైనచో - ఇతరులు ప్రసన్నులైమాత్రము నాకు ఏమి చేయగలరు?

శ్లో. ***నిబద్ధ ముగ్ధాంజలి రేషయాచే ।***
నీరంధ్ర దైన్యోన్నత ముక్తకంఠం ।
దయాంబుధే! దేవ! భవత్కటాక్ష!
దాక్షిణ్యలేశేన సకృన్నిషించ ॥ 30

అన్వయము :- దయాంబుధే! దేవ! తవకటాక్ష దాక్షిణ్యలేశేన మాం సకృన్నిషించ!= దయాసముద్రుఁడవైన ఓస్వామీ! నీకడకంటి చూపులోని కనికరపు పిసరుతో ఒక్క మారైన నన్ను తడుపుము!

అర్థము :- నిబద్ధ=కూర్చిన, ముగ్ధ=అమాయికమైన, అంజలిః=దోయిలి కలవాఁడనై, నీరంధ్ర=దట్టమైన, దైన్య=జాలితో, ఉన్నత ముక్త కంఠం=బిగ్గరగా ఎలుగెత్తి, ఏ షః=ఈ-నేను, యాచే=అడిగికొనుచున్నాను. దయాంబుధే!=దయాసముద్రుఁడా!, దేవ!=స్వామీ!, భవత్కటాక్ష=నీ కడకంటి చూపునందలి, దాక్షిణ్యలేశేన=కనికరపు పిసరుతో, సకృత్=ఒక్కమాఱు, మాం=నన్ను, నిషించ=తడుపుము!

తాత్పర్యము :- దోయిలి ఒగ్గి జాలి ఉట్టిపడునట్లు బిగ్గఱగా ఎలుగెత్తి ఇదిగో, నిన్ను వేడికొనుచున్నాను. ఓ దయాసముద్రమా । స్వామీ! నీ కడకంటి చూడ్కియందలి కారుణ్య కణముతో ఒక్కమాఱు నన్ను తడుపుము !

శ్లో. పింఛావతంస రచనోచిత కేశపాశే ।
పీనస్తనీ నయన పంకజ పూజనీయే ।
చంద్రారవింద విజయోద్యత వక్త్రబింబే ।
చాపల్యమేతి నయనం తవ శైశవే నః ॥ 31

అన్వయము :- తవశైశవే నః నయనం చాపల్యమేతి=స్వామీ! నీ చిన్ననాటి నెనరుఎంచుకొనుచున్న కొలఁది నాకన్నులు వేఁదుఱులు గొనుచున్నవి.

అర్థము :- పింఛ=నెమలిపురితో, అవతంస రచనా=సిగబంతి సింగారములు దిద్దుటకు, ఉచిత=అనువైన, కేశపాశే=కూఁకటి వేణి కలదియును, పీనస్తనీ=జవరాండ్రయొక్క, నయనపంకజ=కనుదామరలతో, పూజనీయే=అద్దుకొనఁదగినవియును, చంద్ర= చందమామపై, అరవింద=తామరపూవుపై, విజయ=ఎత్తిపోయి, గెలుచుటకు, ఉద్యత=సందడిపడుచున్న, వక్త్రబింబే=ముద్దు మోముగల, తవ=నీయొక్క శైశవే=చిఱుత ప్రాయమునందు, నః=మాయొక్క, నయనం=కన్ను, చాపల్యంఏతి=వేఁదుఱులు గొనుచున్నది.

తాత్పర్యము :- నెమలి పురితో సిగబంతి సింగారములు దిద్దుటకు అనువైన కూఁకటి వేణితో, జవరాండ్రు - తామరరేకుల వంటి తమకన్నులతో అద్దుకొనఁదగిననెనరుతో, చందమామపై నెఱరవిరిసిన తమ్మి పూవుపై ఎత్తిపోయి గెలిచివచ్చుటకు - సందడిపడుచున్న ముద్దుమోహముతో - ఒనరి యున్న నీ చిఱుతప్రాయమును జుఱ్ఱుకొనుటకు నా కన్నులు వేఁదుఱులుగొనియున్నవి.

శ్లో. త్వచ్ఛైశవం త్రిభువనాద్భుత మిత్యవైమి
యచ్చాపలం చ మమవాగవివాద గమ్యమ్ ।
తత్ కింకరోమి? విరణన్మురళీ విలాస
ముగ్ధం ముఖాంబుజ ముదీక్షితు మీక్షణాభ్యామ్ ॥ 32

అన్వయము :- విరణన్మురళీనినాదముగ్ధం ముఖాంబుజ మీక్షణాభ్యాం ఉదీక్షితుం కింకరోమి?=రవళించుచున్న మురళితో ముగ్ధమైన ముఖాంబుజమును కన్నులతో జూచుటకు మిన్నులరయుచున్న నే నేమిచేయుదును?

అర్థము :- త్వచ్ఛైశవం=నీ శిశులక్షణము, త్రిభువనాద్భుతమిది=త్రిలోకాద్భుతమని, అవైమి=ఎఱుఁగుదును, యత్=ఏకారణము వలన, మమ చాపలంచ=నా దర్శన చాపలము కూడ, వాగ వివాద=మాటలతో వివదింపకుండుటచేతనే, గమ్యం=తెలియఁదగినదో, తత్=ఆ కారణమువలన, విరణత్=మ్రోఁగుచున్న, మురళీ నినాద=మురళీ నినాదములచేత, ముగ్ధం=రమ్యమైన ముఖాంబుజం=ముఖపద్మమును, ఈక్షణాభ్యాం=కన్నులతో, ఉదీక్షితుం=మిన్నరయుటకు, కింకరోమి=ఏమిచేయుదును?

తాత్పర్యము :- నీ శిశులక్షణము మూఁడులోకములకు అచ్చెరువైనదని యెఱుగుదును. నాదర్శన చాపలముకూడ మాటలకు అందనిది. (మౌనమునకు మాత్రమే అందునది). అందువలన మురళీ నినాద ముగ్ధమైన ముఖాంబుజమును కన్నులతో మిన్నులవంకకు జూచుటకు మించి నే నేమి చేయుదును?

శ్లో. పర్యాచితామృత రసాని పదార్థభంగీ
వల్గూని వల్గిత విశాల విలోచనాని ।
బాల్యాధికాని మదవల్లవ భావితాని
భావే లుఠంతి సుదృశాం తవ జల్పితాని ॥ 33

అన్వయము :- తవ జల్పితాని సుదృశాం భావే లుఠంతి=అరయఁగలిగిన వారికి (స్త్రీలకు) నీ భాషితములు మనస్సులో మెదలుచుండును.

అర్థము :- పర్యాచితామృతరసాని=బండ్లతో మోయఁదగిన అమృత రస భారము కలవియును, పదార్థ భంగీ వల్గూని-పదార్థ=శబ్దార్థములయొక్క, భంగీ=రచనా ప్రకారములచేత, వల్గూని=సుందరములైనవియును, వల్గిత విశాలవిలోచనాని=త్రిప్పఁబడిన పెద్ద కన్నులు కలవియును, బాల్యాధికాని=ఈడుకు మించినవియును, మద వల్లవ భావితాని=ప్రౌఢగోవ కులచేత తలపోయఁబడినవియునైన, తవ=నీయుక్క జల్పితాని=భాషితములు, సుదృశాం=స్త్రీలయొక్క (అరయగలిగిన వారియొక్క)z భావే=మనస్సునందు, లుఠంతి=దొరలుచున్నవి.

తాత్పర్యము :- అమృత రససమృద్ధి కలవి, పదార్థరచనా విన్యాస విశేషసుందరములు, వల్గిత విశాలవిలోచనములు, వయసునకు మించినవి, వ్రజ ప్రౌఢులచేత భావింపఁబడినవియు నైన నీ జల్పితములు సుదృక్కుల యొక్క (పండితులయొక్క- స్త్రీలయొక్క) మనస్సునందు మెదలుచుండును.

శ్లో. పునః ప్రసన్నేన ముఖేందు తేజసా
పురోఽవతీర్ణస్య కృపా మహాంబుధేః
తదేవ లీలా మురలీరవామృతం
సమాధి విఘ్నాయ కదాను మే భవేత్? ॥ 34

అన్వయము :- తదేవ మురళీ రవామృతం మే సమాధి విఘ్నాయ పునః కదాను భవేత్?=ఆ మురళీ రవామృతమే నాసమాధికి తిరిగి విఘ్నమెన్నఁడు కలిగించును?

అర్థము :- ప్రసన్నేన=ప్రసాదసుభగమైన, ముఖేందు తేజసా=ముఖచంద్ర వర్చస్సుతో, పురః=ఎట్టయెదుట, అవతీర్ణస్య=దిగిన, కృపామహాంబురాశేః=కృపామహా జలరాశియొక్క, తదేవ=అదియే, లీలా మురళీరవామృతం=లీలా సంబంధియైన మురళీనినాదామృతము, పునః=ఇంకొకసారి, మే=నాయొక్క, సమాధి విఘ్నాయ=సమాధి భంగముకొఱకు, కదాను=ఎన్నడుగాని, భవేత్=అగునో!

తాత్పర్యము :- ప్రసాద సుభగమైన ముఖచంద్ర దీధితితో నాయెట్టయెదుట అవతరించి నిలిచిన ఆ కృపామహాజలరాశియొక్క ఆ మురళీరవామృతమే ఇంకొకమాఱు నా సమాదికి భంగమును ఎన్నఁడు కలిగించునోకదా?

శ్లో. భావేన [1]ముగ్ధ చపలేన విలోకనేన
మన్మానసే కిమపి చాపల ముద్వహంతమ్ ।
లో లేన లోచన రసాయన మీక్షణేన
లీలా కిశోర ముపగూహితు ముత్సుకోఽస్మి ॥ 35

అన్వయము :- లీలాకిశోరం ఉపగూహితుం ఉత్సుకః అస్మి - లీలార్థమై కిశోర భావమును దాల్చిన వానిని కౌఁగిలించి కొనుటకు ఉబలాటపడుచున్నాను.

అర్థము :- భావేన=ప్రేమ భావముతో. ముగ్ధ చపలేన=ముగ్ధము చంచలమునైన, విలోకనేన=చూపుతో, మన్మానసే=నా మానసమునందు, కిమపి=చెప్పనలవి కాని, చాపలం=కౌతూహల జనితమైన చాంచల్యమును, ఉద్వహంతం=ఉదయింపఁజేయు చున్న

---

1 'బాలేన' (పాఠాంతరము)=కోమలమైన

వానిని, లోచన రసాయనం=నయనములచేత ఆస్వాదనీయమైన రసాయనమువంటి దానిని, లీలాకిశోరం=లీలాకిశోరుని, లోలేన=తదేకాసక్తమైన, లోచలేన=కంటితో, ఉపగూహితుం=కౌఁగిలించికొనుటకు, ఉత్సుకః ఉబలాటముకలవాడను, అస్మి=అయితిని.

తాత్పర్యము :- ప్రేమ భావముచేత ముగ్ధము కౌతూహల చపలమునైన చూపుతో నా మనస్సునందు చెప్పనలవి పడని చాపలమును ఉదయింపఁజేయుచున్న లోచన రసాయన భూతుడైన లీలాకిశోరుని తదేక ప్రవణమైన కంటితోఁగౌఁగిలించికొనుటకు పర్యుత్సుకుఁడ నగుచున్నాను.

శ్లో. అధీర బింబాధర విభ్రమేణ
హర్షార్ద్ర వేణు స్వర సంపదాచ ।
అనేన కేనాపి మనోహరేణ
హా హన్త! హా హన్త! మనో ధినోతి [2] ॥ 36

అన్వయము :- కేనాపి అనేన మనో హరేణ మేమనో: ధినోతి =ఈ ఎవరో తెలియని మానస చోరుని చేత నా మనస్సు అలరుచున్నది.

అర్థము :- అధీర=కదలుచున్న, బింబాధర విభ్రమేణ=దొండపండువంటి అధరవిలాసము కలవానిచేత, హర్షార్ద్ర=హర్షముతో తడిసిన, వేణుస్వర సంపదాచ=వేణుస్వర సంపద కలవానిచేత, అనేన=ఈ, కేనాపి మనోహరేణ=ఎవరో మానసచోరుని చేత, మనః=మనస్సు, ధినోతి=ఆనందించుచున్నది, హా హంత! హా హంత!=ఆహా! ఆహా!

తాత్పర్యము :- అధీర బింబాధర విభ్రమునితో= హర్షార్ద్ర వేణుస్వర సంపన్నునితో ఈ యెవరో మానసచోరునితో నా మనస్సు సుఖించుచున్నది! ఆహా! ఆహా!

శ్లో. యావ న్న మే నిఖిల మర్మ దృఢాభిఘాత
నిస్సంధిబంధన ముదేతి నవోపతాపః ।
తావ ద్విభో! భవతు తావక వక్త్రచంద్ర
చంద్రాऽతప ద్విగుణితా మమచిత్త ధారా ॥ 37

---

2 'ధునోతి' (పాఠాంతరము)=చలించుచున్నది

అన్వయము :- హేవిభో! యావన్మమ నవోపతాపో నోదేతి తావన్మమ చిత్తధారా త్వన్ముఖచంద్రాతప ద్విగుణితా భవతు=ఓస్వామీ!నాకు ప్రాణప్రయాణ యాతన పైకొనుటకు ముందే నాచిత్తధారపై నీ ముఖచంద్రజ్యోత్స్న ద్విగుణితముగా వర్షించునుగాక!

అర్థము :- మే=నాకు, నిఖిల మర్మదృఢాభిఘాతని: సంధి బంధనం=అన్ని ఆయువుపట్టులయందు తీవ్రాఘాతములచేత శరీర సంధిబంధనములను సడలగొట్టుచున్న, నవోపతాప:=పూర్వమెన్నఁడును అనుభవించి యెఱుఁగని సంతాపము, యావత్=ఎంతలో, నోదేతి=ఉదయించదో, తావత్=అంతలోనే, మమ=నాయొక్క, చిత్తధారా=ధ్యానధార, విభో!=స్వామీ!, తావక వక్త్ర చంద్ర చంద్రాతప ద్విగుణితా=నీ ముఖచంద్రునికి సంబంధించిన నిండు వెన్నెలలతో రెండింతలు నిండియున్నదిగా, భవతు=అయ్యెడునుగాక!

తాత్పర్యము :- ఓ ప్రభువా! మరణావస్థయందు ఆయువుపట్టులన్నింటియందును తీవ్రాఘాతములచేత శరీర సంధులన్నింటిని విడకొట్టునట్టి పూర్వమెన్నఁడు నెఱిఁగియుండని బాధపైకొనిరాకముందే నా ధ్యానధార, నీ ముఖచంద్ర బింబమునుండి వెలువడుచున్న వెన్నెలలతో రెండింతలు నిండియుండునట్లుగా కరుణింపుము! ఆ మరణవేదనకంటె యీ వెన్నెల సుఖము రెండింతలగుట చేత నాకా బాధ తెలియదు.

శ్లో. *యావ న్న మే నరదశా దశమీ దృశోఽపి*
రంధ్రాదుదేతి తిమిరీకృత సర్వభావా ।
లావణ్య కేళిభవనం తవ తావ దేతు
లక్ష్మ్యాః సముత్క్వణితవేణు ముఖేందుబింబమ్ ॥ 38

అన్వయము :- దశమీ నరదశా యావన్మేనోదేతి తవముఖేందు బింబం తావతుదేతు= పదియవ నరదశ-నాకు-ప్రాప్తింపకముందే నీ ముఖచంద్రబింబ ముదయించునుగాక!

అర్థము :- యావత్=ఎంతటిలో, తిమిరీకృతసర్వభావా=ఎల్లదృశ్యములను చీఁకటిముద్దలుగా మార్చుచున్న, దశమీ=పదియవ దైన, నరదశా=మానవుని అవస్థ, దృశోఽపి రంధ్రాత్=కంటి బొత్తల నుండియే, నోదేతి=పుట్టుకొనిరాదో, తావత్=అంతటిలోనే, లక్ష్మ్యా:=లక్ష్మీదేవియొక్క, లావణ్య కేళి భవనం=లావణ్యమునకు కేళీమందిరమును, సముత్క్వణితవేణు=రవళించుచున్న మురళికల, తవ=నీయొక్క, ముఖేందు బింబం=ముఖ చంద్ర బింబము, లేతు=వచ్చునుగాక!

తాత్పర్యము :- సర్వదృశ్యప్రపంచమును చీఁకటి ముద్దగా చేసి వైచెడు మానవుని పదియవదియైన అవస్థ నాకంటిబొత్తలనుండి పుట్టుకొని వచ్చుటకు ముందుగానే - లక్ష్మీదేవికి లావణ్యకేళీమందిరము, విరణద్వేణువు, అయిన నీముఖ చంద్రబింబము నా చేరువకుఁ జేరునుగాక!

శ్లో. *ఆలోల లోచన విలోకిత కేళిధారా*
నీరాజితాగ్రసరణేః కరుణాంబురాశేః ।
ఆర్ద్రాణి వేణునినదైః ప్రతినాదపూరైః
ఆకర్ణయామి మణినూపుర శింజితాని ॥ 39

అన్వయము :- కరుణాంబురాశేః వేణునినదై రార్ద్రాణి మణి నూపుర శింజితాని ఆకర్ణయామి=కరుణా జలరాశియొక్క వేణునాద సమార్ద్రములైన అందెల రవళులు వినిపించుచున్నవి.

అర్థము :- ఆలోల=అన్ని దెసలను కలయఁజూచుచున్న, లోచన=కన్నులయొక్క, విలోకిత=చూపులయొక్క, కేళిధారా= కేళిపరంపరలచేత, నీరాజిత=నివ్వాళులెత్తఁబడి నట్లున్న, అగ్రసరణేః=అగ్రభూమికల, కరుణాంబురాశేః=కరుణాజలరాశియొక్క, ప్రతినాదపూరైః=ప్రతిశబ్ద ప్రవాహములుకల, వేణునినదైః=వేణునాదములచేత, ఆర్ద్రాణి=తడిసిన, మణినూపురశింజితాని=మణులుపొదిగిన అందె రవళులను, ఆకర్ణయామి=వినుచున్నాను.

తాత్పర్యము :- ఎల్లదిశలు కలయఁగనుగొనుచున్న కన్నులనుండి క్రేళ్లుఱుకుచున్న చూపుల తళతళలతో నివ్వాళులెత్తినట్లున్న పురోవీథికల ఆకరుణా జలరాశియొక్క ప్రతి శబ్దప్రవాహముల నీనుచున్న వేణునాదములతో సమార్ద్రములైన అందియల రవళులు నాకు వినిపించుచున్నవి.

శ్లో. *హే దేవ! హే దయిత! హే జగదేకబంధో!*
హే కృష్ణ! హే చపల! హే కరుణైకసింధో! ।
హే నాథ! హే రమణ! హే నయనాభిరామ!
హా! హా! కదాను భవితాసి పదం దృశోర్మే? ॥ 40

అన్వయము :- హే దేవ! మేదృశో: పదం కదాను భవితాసి?=ఓస్వామీ! నా కంటి కెప్పుడు కాననయ్యెదవు!

అర్థము :- హే దేవ!=ఓప్రకాశ స్వరూపుఁడా!, హే దయిత!=ఓప్రేమమూర్తీ!, హే కృష్ణ!=ఓ ఆకర్షణ శీలుడా!, హే చపల!=ఓ అల్లరివాడా!, హే కరుణైకసింధో!= ఓ కరుణారస సింధువా!, హే నాథ=ఓనాథుడా!, హేరమణ!=ఓ రమింపఁజేయు లక్షణముకలవాఁడ!, హే నయనాభిరామ!=ఓ లోచనాభిరాముఁడా!, హా! హా!=అయ్యో అయ్యో!, మే దృశో:=నాకన్నులకు, పదం=గోచరుఁడవు, కదాను=ఎప్పటికో, భవితాసి=కానున్నావు?

తాత్పర్యము :- ఓ ప్రకాశస్వరూపుడా! ఓ ప్రియతముఁడా! ఓ సకలజగద్బాంధవా! ఓ ఆకర్షణశీలుడా! ఓ చపలుఁడా! ఓ కరుణారసైక సింధువా! ఓ నాథుఁడా! ఓరమణుఁడా! ఓ నయనాభిరాముడా! అక్కటా! అక్కటా! ఏనాటికి నాకంటికి కాననగుదువు?

శ్లో. ***అమూ న్యధన్యాని దినాంతరాణి***
హరే! త్వదాలోకన మంతరేణ ।
అనాథ బంధో! కరుణైక సింధో!
హా హంత! హా హంత! కథం నయామి? 41

అన్వయము :- హరే! అంతరేణ త్వదాలోకనం అమూని దినాంతరాణి అధన్యాని హే అనాథబంధో! కరుణైకసింధో! కథంనయామి? హా! హంత!=నీదర్శనములేని ఈ రోజులు భాగ్యహీనములు. ఓ అనాథబంధువా ! కరుణాసింధువా! వీనిని ఎట్లు వెళ్లఁదీయుదును? అకటకటా!

అర్థము :- హరే=ఓశ్రీహరీ!, త్వదాలోకన మంతరేణ=నిన్ను కానఁబడయని కారణముగా, అమూని=ఈ, దినాంతరాణి=దినముల దొంతరలు, అధన్యాని=బైసిమాలినవి - అకృతార్థములు, అనాథబంధో!=దిక్కులేని వారికి దిక్కా!, కరుణైకసింధో!=కనికరపు కడలీ! కథం=ఏవిధముగా, నయామి=వెళ్లదీయుదును?, హా=అయ్యో!, హంత!=అక్కటా! హా!=అయ్యో!, హంత=అక్కటా!

తాత్పర్యము :- ఓ శ్రీహరీ! నిన్ను కానఁజాలని కారణముగా ఈ దినపరంపరలు బైసి మాలియున్నవి. ఓ అనాథుల పాలిటి బంధువా! కరుణైకసింధువా! వీనిని ఏవిధముగా దొరలింతును?

శ్లో. *కిమివ శృణుమః[3]కస్య బ్రూమః కథం కృతమాశయా*
కథయత కథం ధన్యా! మన్యామహే హృదయేశయమ్ ।
మధుర మధుర స్మేరాకారే మనోనయనోత్సవే
కృపణ కృపణా కృష్ణే తృష్ణా చిరం బత! లంబతే ॥ 42

అన్వయము :- కృష్ణే కృపణ కృపణా తృష్ణా చిరం లంబతే బత!=కృష్ణుని యందు దీనాతిదీనమై నాతృష్ణ చిరకాలమునుండి పట్టుకొని వ్రేలాడుచున్నది. అక్కటా!

అర్థము :- కిమివ శృణుమః=ఎట్లని విందుము?, కథం=ఏవిధముగా, కస్యబ్రూమః=ఎవ్వనికిఁజెప్పుదుము?, ఆశయా=ఆశతో, కృతం=చాలును, ధన్యాః!= ఓకృతార్థులారా!, కథయత=మీకుతెలుసు, హృదయేశయం=దహరమందు శయనించి యున్న వానిని, కథం=ఏవిధముగా, మన్యామహే=తలంతుము? మధుర మధుర స్మేరాకారే=మధురాతిమధురమును వికాస శీలమును అయిన ఆకారముగలట్టియు, మనోనయనోత్సవే=మనస్సేఅనెడి కంటికి -లేక- మనోనయనములు రెంటికి, ఉత్సవే=పండుగయైన, కృష్ణే=శ్రీకృష్ణుని యందు, కృపణ కృపణా=దీనాతిదీనమై, తృష్ణా=దప్పిక, చిరం=చిరకాలమునుండి, లంబతే=పట్టుకొని వ్రేలాడుచున్నది. బత!=అక్కటా!

తాత్పర్యము :- మేము వినుట ఎట్లు? ఎవ్వరికైన చెప్పుట ఎట్లు? ఓ కృతార్థులారా! మీరు దయచేసి చెప్పండి! దహరమందుశయనించి యున్న వానిని తలంచికొనుట ఎట్లు? మధురాతిమధుర వికస్వరమైన ఆకారముగల, మనోనయనములకు ఒక్కరీతిగాపండుగయైన, శ్రీకృష్ణుని యందు దీనాతిదీనమై నా తృష్ణ పట్టుకొని వ్రేలాడుచున్నది.

శ్లో. *అభ్యాం విలోచనాభ్యాం*
లంబుజ దళ లలిత లోచనం బాలమ్ ।
ద్వాభ్యా మపి పరిరబ్ధుం
దూరే మమహంత! దైవ సామగ్రీ ॥ 43

---

3 *'కిమిహ కృణుమః' (పాఠాంతరము) - ఇహ=ఇక్కడ, కింకృణుమః=ఏమిచేయుదుము?*

అన్వయము :- ఆభ్యాం విలోచనాభ్యాం అంబుజదళ లలిత లోచనం బాలం= పరిరబ్ధుమపి మమదూరే దైన సామగ్రీ హంత!=అంబుజ దళ లలిత లోచనుఁడైన ఆ బాలుని ఈ కన్నులు రెండింటితో కౌఁగిట బట్టుటకైన నాకు అదృష్టము చాల దూరముగా నున్నది.

అర్థము :- అంబుజదళ=తామరరేకులవలె, లలిత లోచనం=అందమైన కన్నులుగల, బాలం=బాలుని, ఆభ్యాం విలోచనాభ్యాం ద్వాభ్యాం=ఈరెండు కన్నులతో, పరిరబ్ధుమపి=కౌఁగిలించికొనుటకైన, మమ=నాకు, దైవ సామగ్రీ=అదృష్టసంపద, దూరే=దూరమైయున్నది. హంత!=అయ్యో!

తాత్పర్యము :- అరవిందదళ సుందర లోచనుఁడైన బాలుని - ఈ చర్మచక్షుస్సులు రెండింటితో కౌఁగిటఁబట్టుకొనుటకైన వలసినంత అదృష్టసంపద నాకు దూరమై యున్నది కదా! అయ్యో!

శ్లో. అశ్రాంతస్మిత మరుణారుణాధరోష్ఠం
హర్షార్ద్ర ద్విగుణ మనోజ్ఞ వేణుగీతమ్ ।
విభ్రామ్యద్విపుల విలోచనార్థముగ్ధం
వీక్షిష్యే తవ వదనాంబుజం కదాను ॥ 44

అన్వయము :- కదాను తవ వదనాంబుజం వీక్షిష్యే!=ఎన్నటికి నీముఖార విందమును చూడఁగలనో కదా!

అర్థము :- అశ్రాంతస్మితం=చెఱుఁగని స్మితముద్ర కలది, అరుణారుణాధరోష్ఠం= కెంపులు చిమ్ముచున్న పెదవుల కూర్పుకలది, హర్షార్ద్ర=గగుర్పాటి పించు ఆనందముతో, ద్విగుణ మనోజ్ఞ=రెండింతలుగా మనోహరమైన, వేణుగీతం=పిల్లనఁగ్రోవి పాట నాలికించుచున్నది, విభ్రామ్యత్=విభ్రమము నొందించుచున్న, విపుల=విశాలములైన, విలోచనార్ధ=అఱమోడ్పుగన్నులతో, ముగ్ధం=ముద్దాఱుచున్న తవ=నీయొక్క, వదనాంబుజం=మోముదామరను, కదాను=ఎన్నటికిఁగాను, వీక్షిష్యే=చూడఁగలనో!

తాత్పర్యము :- ఎడతెగని స్మితముద్రతో, కెంపులు చిమ్ముపెదవుల కూర్పుతో, గగుర్పాడిపించుచున్న ఆనందముతో తడిసి రెండింతలుగా మనస్సును లాగివేయుచున్న

పిల్లనఁగ్రోవిపాటతో, విభ్రమమునొందించుచున్న అఱమోడ్పుఁగన్నులతోముద్దాఉు నీ మోము నెత్తామరను నేను ఎన్నటికిఁ జూడఁగలనో కదా!

శ్లో. *లీలాయతాభ్యాం రసశీతలాభ్యాం*
నీలా రుణాభ్యాం నయనాంబుజాభ్యామ్
ఆలోకయే దద్భుత విభ్రమాభ్యాం
బాలః కదా కారుణికః కిశోరః? 45

అన్వయము :- బాలః కారుణికః కిశోరః అద్భుత విభ్రమాభ్యాం నయనాంబు జాభ్యాం కదా ఆలోకయేత్ !=కారుణిక కిశోరుఁడైన బాలుఁడు అద్భుత విభ్రమములైన నయనాబ్జములతో నావైపు ఎన్నఁడు చూచునో!

అర్థము :- లీలా=ప్రియాఽనుకరణరూపములైన శృంగార భావచేష్టలతో, ఆయతాభ్యాం=విశాలములైననియు, రస శీతలాభ్యాం=అనురాగ రసముతో మనస్సును చలువలారించునవియును, నీలారుణాభ్యాం=నీల వర్ణములైనవి - ఎఱ్ఱ సెరలు కలవియు, అద్భుత విభ్రమాభ్యాం=అద్భుత విలసనములు నయిన, నయనాంబుజాభ్యాం=నయన సరసిజములతో కారుణికః=కనికరపు గుండె కల, కిశోరః=గుఱ్ఱపుఁగొదమవంటి, బాలః=బాలుఁడు, కదా=ఏనాడు, ఆలోకయేత్=చూచెడినో!

తాత్పర్యము :- ప్రియానుకరణరూపములైన - ప్రియురాండ్ర శృంగార భావచేష్టాభినయములతో, విశాలములై నల్లనై ఎఱ్ఱసెరల కలిగి అనురాగరసముతో మనస్సును చలువలార్చుచున్న అద్భుతవిభ్రమములైన నయనాంబుజములతో, కరుణాస్వభావముగల ఆ కిశోర బాలుఁ డెన్నడు నన్నుఁ జూచునో !

శ్లో. *బహుళ చికుర భారం బద్ధ పింఛావతంసం*
చపల చపల నేత్రం చారు బింబాధరోష్ఠమ్ ।
మధుర మృదుల హాసం మంథరోదారలీలం
మృగయతి నయనం మే ముగ్ధ వేషం మురారేః ॥ 46

అన్వయము :- మే నయనం మురారేః ముగ్ధ వేషం మృగయతి=నా కన్ను శ్రీకృష్ణుని ముగ్ధ వేషమును అన్వేషించుచున్నది.

అర్థము :- బహుళ చికుర భారం=ఒత్తైనజుట్టు జొంపము కలదియును, బద్ధపించావతంసం-బద్ధ=చెరివిన, పింఛ=నెమలిపురి, అవతంసం=సిగబంతి కలదియును, చపల చపల=మిక్కిలి చంచలములైన, నేత్రం=కన్నులు గలదియు, చారు బింబాధరోష్ఠమ్=అందమైన దొండపండువంటి పెదవుల కూర్పు గలదియును, మధుర మృదుల హాసం=తీయని మెత్తని నవ్వు గలదియును, మంథరోదార లీలం=విలాస మంథరములు ఉదారములునైన చేష్టలు కలదియును నైన, మురారేః=మురవైరియైన శ్రీకృష్ణుని యొక్క, ముగ్ధవేషం=రమ్యవేషమును, మే నయనం=నా కన్ను, మృగయతి=వెదకుచున్నది.

తాత్పర్యము :- ఒత్తై జొంపము కట్టియున్న జుట్టుకలదియును నెమలి పురిని సిగబంతిగా సవదరించినదియును, చపలాతిచపలములైన కన్నులు గలదియును, అందమైన దొండపండువంటి పెదవులకూర్పు గలదియును, విలాస మంథరములైన ఉదారచేష్టలు కలదియునైన, మూరవైరి యొక్క రమ్యవేషమును నా కన్నుదోయి అన్వేషించుచున్నది.

శ్లో. ***బహుళ జలదచ్ఛాయా చోరం విలాసభరాలసం***
మద శిఖి శిఖా లీలోత్తంసం మనోజ్ఞ ముఖాంబుజమ్ ।
కమపి కరుణాపాంగోదగ్ర ప్రసన్న జగజ్జడం
మధురిమ పరీపాకోద్రేకం వయం మృగయామహే ॥ 47

అన్వయము :- కమపి మధురిమ పరీపాకోద్రేకం వయం మృగయామహే =ఒకానొక మాధుర్య పరిణామాతి శయముయొక్క ఆవేశమును మేము అన్వేషించుచున్నాము.

అర్థము :- బహుళ=దట్టమైన, జలదచ్ఛాయా=మేఘచ్ఛాయను, చోరం=దొంగిలించిన దేహకాంతి కలదానిని, విలాస భరాలసమ్=విలాసముల బరువుచేత అలసి నెమ్మదియైన దానిని, మదశిఖి=మదించిన నెమలియొక్క, శిఖా=కూఁకటియే, ఉత్తంసం=కర్ణపూరముగా గలదానిని, మనోజ్ఞ ముఖాంబుజం=అందమైన ముఖారవిందముగలవానిని, కరుణాపాంగోదగ్రప్రసన్న జగజ్జడం - కరుణా=కనికరముతోనిండిన, అపాంగ=కంటితుదల చేతనే, ఉదగ్ర=ఉవ్వెత్తుగా, ప్రసన్న=ప్రసాద భావమును పొందిన, జగత్=జంగమములు, జడం=స్థావరములు గల, కమపి=ఒకానొక, మధురిమ=సౌందర్యము యొక్క,

పరీపాక=పరిణామముయొక్క, ఉద్రేకం= అతిశయావేశమును, వయం=మేము, మృగయామహే=అన్వేషించుచున్నాము.

తాత్పర్యము :- చిక్కని మేఘచ్ఛాయను క్రుచ్చిలించిన దేహచ్ఛాయ కలదానిని, విలాసముల బరువుచేత అలసచేష్టకలదానిని, మత్త మయూర శిఖ ఉత్తంసముగాఁ గలదానిని, అందమైన ముఖాంబుజము కలదానిని, కరుణాకటాక్షములచేత ఉవ్వెత్తుగాఁదేరుకొన్న స్థావర జంగమ ప్రపంచము గలదానిని - చరాచర ప్రపంచముగలదానిని, ఒకానొక సౌందర్యపరిణామ - ఆవేశాతిశయ స్వరూపమును మేము అన్వేషించుచున్నాము.

శ్లో. *పరామృశ్యం దూరే పరిషది మునీనాం వ్రజ వధూ*
దృశాం దృశ్యం శశ్వత్త్రిభువన మనోహారి వపుషమ్ ।
అనామృశ్యం వాచా మనిద ముదయా నామపి కదా
దరీదృశ్యే దేవం దరదళిత నీలోత్పల నిభమ్ ॥ 48

అన్వయము :- దరదళిత నీలోత్పలనిభం దేవం కదా దరీదృశ్యే?=అరవిరిసిన నల్లకలువలవంటి స్వామిని నేనెన్నఁడు కన్నులారఁ చూడఁగలనో!

అర్థము :- మునీనాం=మననశీలురయొక్క, పరిషది=గోష్ఠియందు దూరే=దవ్వుల యందు, పరామృశ్యం=లెస్సగా విచారింపఁదగిన దానిని, వ్రజవధూ=మందప్రోయాండ్ర యొక్క, దృశాం=కన్నులకు, దృశ్యం=దర్శనీయుని, శశ్వత్=ఎల్లపుడు, త్రిభువన మనోహారి=త్రిజగన్మనోహరమైన, వపుషం=శరీరశోభ కలవానిని, అనిద ముదయానాం= 'ఇది మొద'లని చెప్పననువుపడని, వాచాం=వాక్కులకు (వేదములకు - ప్రాఁబలుకులకు) అనామృశ్యం=అందుకొనరాని వానిని, దరదళిత=ఇంచుక విరిసిన, నీలోత్పలనిభం= నల్లకలువలవంటి వానిని, దేవం=ప్రకాశ లక్షణుని, కదా=ఎన్నఁడు, దరీదృశ్యే=కన్నులార దర్శించెదనో!

తాత్పర్యము :- మనన శీలుర గోష్ఠిలో దవ్వుగా విచారింపఁదగిన వానిని, వ్రజాంగనా నయనములకు దృశ్యమైన వానిని, ఎల్లప్రొద్దుల త్రిజగన్మనోహరమైన శరీరశోభ కలవానిని, ఇంచుక విరిసిన నల్లకలువలవంటి నెమ్మేనికాంతి గల స్వామిని ప్రకాశలక్షణుని నేనెన్నఁడు చూచెదనో!

శ్లో. లీలా ననాంబుజ మధీర ముదీక్షమాణం
నర్మాణి వేణువివరేషు నివేశయంతమ్ ।
డోలాయమాన నయనం నయనాభిరామం
దేవం కదాను దయితం వ్యతిలోకయిష్యే? ॥ 49

అన్వయము :- దయితం దేవం కదాను వ్యతిలోకయిష్యే?=ప్రియతముఁడైన స్వామిని ఎన్నఁడు చూడఁగలనో!

అర్థము :- లీలా=లీలా పరిపూర్ణమైన, ఆననాంబుజం=ముఖాంబురుహము కలవానిని, అధీరం=కేళీలోలముగా, ఉదీక్షమాణం=పైకి చూచుచున్న వానిని, వేణువివరేషు=పిల్లనఁగ్రోవి రంధ్రములయందు, నర్మాణి=మేలపుబలుకులను, నివేశయంతం=అమరించుచున్నవానిని, డోలాయమాన=ఊయలలూఁగుచున్న, నయనం=కన్నులుగల వానిని, నయనాభిరామం=కన్నులకింపైనవానిని, దయితం=ప్రియతముఁడైన, దేవం=ప్రకాశమానుఁడైన స్వామిని, కదాను=ఎప్పటికిఁగాను, వ్యతిలోకయిష్యే=చూడఁగలనో!

తాత్పర్యము :- లీలలతో నిండిన ముఖారవిందము కలవానిని, కేళీలోలముగా పైకి జూచుచున్న వానిని, పిల్లనగ్రోవి రంధ్రములలో నర్మాలాపములను జొనుపుచున్న వానిని, ఊయలలవలె తూఁగుచున్న నయనములు కలవానిని, నయనాభిరాముఁడై ప్రకాశించుచున్న ప్రియతముఁడైన స్వామి నెన్నటికి జూడఁగలనో కదా!

శ్లో. లగ్నం ముహు ర్మనసి లంపట సంప్రదాయి
లేఖా విలేఖన రసజ్ఞ మనోజ్ఞ వేషమ్ ।
లజ్జ న్మృదుస్మిత మధు స్నపి తాధరాంశు
రాకేందు లాలిత ముఖేందు ముకుంద బాల్యమ్ ॥ 50

అన్వయము :- స్మితమధుస్నపితాధరాంశు, రాకేందు లాలిత ముఖేందు ముకుందబాల్యం, మనసి ముహుః లగ్నమ్=నవ్వుతేనెలో ఓలలాడింపఁబడిన అధరకాంతికలిగి పూర్ణిమాచంద్రబింబమువలె అవ్యాజ సుందరమైన ముఖ బింబముగల ముకుందుని బాల్య దశ, నామనస్సులో మాటిమాటికి అద్దికొనియున్నది.

అర్థము :- 'లంపట సంప్రాయి' - లంపట=తదేక ధ్యానస్థితిని కలిగించు భావములయొక్క, సంప్రదాయి=సంప్రాయమునకు -(కోవకు)- జెందినదియు, లేఖావిలేఖన=చిత్తరువులో రేఖాకృతులుగా, విలేఖన=గీయుటకు అనువైనట్టి, రసజ్ఞ=రసజ్ఞులైనవారికి, మనోజ్ఞ=మనస్సునకు నచ్చుబాటైన, వేషం=బర్హాదిప్రసాధన లక్షణముకలదియు, లజ్జత్=సిగ్గిలుచున్న, మృదుస్మిత=కోమలహాసమే అనెడి, మధు=తేనెచేత, స్నపిత=జలకమాడింపఁబడిన, అధర=పెదవులయొక్క, అంశు=కిరణములుగల, రాకేందు=పూర్ణిమాచంద్రునివలె, లాలిత=లలితమైన, ముఖేందు=ముఖచంద్రబింబముగల, ముకుంద=ముక్తిప్రదుడైన శ్రీ కృష్ణస్వామియొక్క, బాల్యమ్=బాల్యదశ, మనసి=(నా) మనస్సు నందు, ముహుః=మాటిమాటికి, లగ్నం=హత్తికొని యున్నది.

తాత్పర్యము :- తదేక నిమగ్న స్థితిని కలిగించు కొన్నిభావముల కోవకుఁజెందినదియు, రేఖాచిత్రములుగా గీయుటకు వీలైన, సౌందర్యవేత్తల మనస్సుకింపైన వేషరచన కలదియును, సిగ్గును స్ఫురింపఁజేయు కోమల హాస మధువులో ఓలలాడింపఁబడిన ఎఱ్ఱని పెదవి కెంపు కాంతులతో, పూర్ణిమాచంద్రబింబము వలె, రమ్యమైన ముఖబింబముకల, ముకుందుని బాల్య లీల నా మనస్సునందు మాటిమాటికిని హత్తికొని చెదరకయున్నది.

శ్లో. ***అహిమకర కరనికర మృదు మృదిత లక్ష్మీ***
సరసతర సరసిరుహ సదృశ దృశి దేవే ।
వ్రజయువతి రతికలహ విజయి నిజ లీలా
మద ముదిత వదనశశి మధురిమణి లీయే ॥ 51

అన్వయము :- లీలా మద ముదిత వదనశశి మధురిమణి దేవే లీయే=లీలామదము చేత అలరిన ముఖచంద్ర మాధుర్యముకల ప్రకాశమానమైన వెలుఁగునందు అణఁగిపోవుచున్నాను.

అర్థము :- అహిమకర=వేఁడి వెలుఁగుల బరణియైన తరణి యొక్క, కరనికర=కిరణముల గుత్తిచేత, మృదు=సుకుమారముగా, మృదిత=ఒత్తఁబడిన, లక్ష్మీ=కాంతిచేత, సరసతర=తత్పూర్వదశయందు కంటె అందమైన, సరసిరుహ=తామర పూలతో, సదృశ=సమానములైన, దృశి=కన్నులుగలట్టియు, వ్రజయువతి=మంద జవరాండ్రయొక్క, రతికలహ=రతిరూపములైన పోరులయందు, విజయి=విజయ లక్షణము

కల, నిజ=స్వీయమైన, లీలామద=లీలా మద విలాసముచేత, ముదిత=అలరిన, వదనశశి=ఆనన చంద్రబింబము యొక్క, మధురిమణి=తీయఁదనముగల, దేవే=ప్రకాశ స్వరూపమునందు, లీయే=లీనమైపోయెదను.

తాత్పర్యము :- ఉదయసూర్యుని వెలుఁగు మొత్తముల మెత్తని ఒత్తిళ్లలో నలిగి తత్పూర్యముకంటె సిరులు వెలయించుచున్న విరిదమ్ములతో సరివచ్చు కనుదమ్ములతో మందజవరాంద్రతోడి పొందుపోరులలో గెలుపొందునిజలీలామదముతో అలరారుచున్న ముఖచంద్ర మాధుర్యము గల వెలుఁగునందు లీనమైపోవుచున్నాను.

శ్లో. *కరకమల దళదళిత లలితతర వంశీ*
కలనినద గళ దమృత ఘన సరసి దేవే ।
సహజరస భర భరిత దరహసిత వీథీ
సతతవహ దధరమణి మధురిమణి లీయే ॥ 52

అన్వయము :- అమృతఘనసరసి అధరమణి మధురిమణి దేవే లీయే=అమృత ఘన సరోరూపము, అధరమణి మాధుర్య స్వరూపము, అయిన వెలుఁగులో లీనమగుచున్నాను.

అర్థము :- కరకమల=పాణిపద్మము యొక్క, దళ=ఱేకులచేత(వ్రేళ్లచేత), దళిత=వికసితమై - కొట్టఁబడినదై, లలితతర=వెనుకటికంటె అందమైన, వంశీ= పిల్లనగ్రోవియొక్క, కల=అవ్యక్తమధురమైన, నినద=నినాదములనుండి, గళత్=జాఱుచున్న, అమృత ఘన=ఆనంద ఘనమైన, సరసి=సరోవరరూపమైనట్టియు, సహజ=స్వాభావికమైన, రస భర=రస సమృద్ధి చేత, భరిత=నిండిన, దరహసిత=చిఱునవ్వునకు, వీథీ=సంచారవీథియై, సతత వహత్=నిరంతరవాహినియైన, అధరమణి=మోవికెంపుయొక్క, మధురిమణి= తీయఁదనమునందు - చక్కఁదనమునందు, లీయే=లీనమై పోవుచున్నాను.

తాత్పర్యము :- కేలు తామర ఱేకుల తాఁకులకు మేలుకొనిన - వెనుకటికంటె లలితములైన -పిల్లనఁగ్రోవి తీయని ఎలుఁగులనుండి జలజల జాఱుచున్న అమృత మహాసరోవరమునందు; స్వాభావికమైన రససమృద్ధితో నిండారిన చిఱునవ్వులకు సంచారవీథియైన - నిరంతర వాహినియైన మోవికెంపు తీయఁదనమునందు - సకలేంద్రియప్రహ్లాదనమైన వెలుఁగు నందు లయించిపోవుచున్నాను.

శ్లో. కుసుమశర శరసమర కుపిత మద గోపీ
కుచ కలశ ఘుసృణ రస లస దురసి దేవే ।
మద లులిత మృదు హసిత ముషిత శశిశోభా
ముహురధిక ముఖ కమల మధురిమణి లీయే ॥ 53

అన్వయము :- మృదుహసిత ముషిత శశిశోభా ముహురధిక ముఖకమల మధురిమణి లీయే= అలఁతి నవ్వుతోనే చందమామ అందమంతయు ముచ్చిలించికొని క్షణక్షణమునకు పెరుగుచున్న మోము నెత్తామర అందము నందు సొమ్మసిల్లి లయించిపోవుచున్నాను.

అర్థము :- కుసుమశర=పూవుటమ్ములవానియొక్క, శరసమర=అమ్ములపోరులందు, కుపిత=అలిగిన, మదగోపీ=మదవిభ్రమశాలినులైన మందప్రోయాంధ్రయొక్క, కుచకలశ=స్తనకలశములయందలి, ఘుసృణరస=కుంకుమనీటితో, లసదురసి= అరుణారుణమైన లలితోరః స్థలమునందు, మదలులిత=అన్ను నిండారి తొలకిన, మృదుహసిత=అలఁతినవ్వుతోనే ముచ్చిలించికొనఁబడిన, శశి=చందమామయొక్క, శోభా=అందముతో, ముహురధిక=క్షణక్షణమునకు పెరుగుచున్న, ముఖకమల=మోము విరిదమ్మియొక్క, మధురిమణి=అందమునందు, లీయే=లయించిపోవుచున్నాను.

తాత్పర్యము :- కుసుమశరుని యొక్క శరసమరములయందు నలఁగి అలిగిన మదవిభ్రమ శాలినులైన వ్రజ యువతులయొక్క స్తనకలశములమీది కుంకుమ రసముతో జొబ్బిల్లి - ఎఱ్ఱనైన పేరుటురము వానియందు పారవశ్యముతో తొలఁకిన అలఁతినవ్వుతో తెక్కలించిన చందమామ అందముతో క్షణక్షణము పెరుగుచున్న మోము విరిదమ్మి అందము గలవానియందు లయించిపోవుచున్నాను.

శ్లో. ఆనమ్రా మసితభ్రువో రుపచితా మక్షీణ పక్ష్మాంకురే
ష్వాలోలా మనురాగిణో ర్నయనయో రార్ద్రాం మృదౌ జల్పితే ।
ఆతామ్రా మధరామృతే మదకలా మమ్లాన వంశీరవే
ష్వాశాస్తే మమలోచనం వ్రజశిశోర్మూర్తిం జగన్మోహినీమ్ ॥ 54

అన్వయము :- మమ లోచనం వ్రజ శిశోః మూర్తిం జగన్మోహినీం ఆశాస్తే= నాకన్ను మందలోని చిన్నవాని అందము 'సకల భువనములను సమ్మోహింపఁజేయునది?' అని ఎత్తిలి చెప్పుచున్నది.

అర్థము :- అసిత భ్రువోః=నల్లని కనుబొమలయందు, ఆనమ్రాం=ఇంచుక వంపులువాఱియున్నదియును, అక్షీణ=తఱచైన, పక్ష్మాంకురేషు=తొంగలి ఱెప్ప కొనవెండ్రుకలయందు, ఉపచితాం=ఈఱమి వాఱినదియు, అనురాగిణోః=వలపునిండిన, నయనయోః=కన్నులయందు, ఆలోలాం=కదలాడుచున్నదియును, మృదౌ=మెత్తని, జల్పితే=ముచ్చటయందు - సల్లాపమునందు, ఆర్ద్రాం=నెనరుతో తడిసినదియును, అధరామృతే=అమృతస్వరూపమైన అధరమునందు, ఆతామ్రాం=అతట నెఱ్ఱవాఱినదియు, అమ్లాన వంశీ రవేషు=వడలఁబాఱని పిల్లనఁగ్రోవి రవళులయందు, మదకలాం=పారవశ్య మధురమైనదియునుగా, వ్రజశిశోః=వ్రజములోపలి చిన్నవానియొక్క, మూర్తిం=స్వరూపమును, జగన్మోహినీమ్=జగన్మోహనమైనదానినిగా - లోకములను సమ్మోహింపఁజేయుదానినిగా, మమలోచనం=నా కన్ను, ఆశాస్తే=ఆశాసించుచున్నది - ఆశీర్వదించుచున్నది.

తాత్పర్యము :- నల్లని కనుబొమలలో ఇంచుక వంపులు వాఱియున్నదియును, తఱచైన తొంగలిఱెప్ప కొనవెండ్రుకలయందు - ఈఱములు వాఱుచున్నదియును, అనురాగ పరిపూర్ణములైన కన్నులలో కదలాడుచున్నదియును, మృదు సల్లాపములయందు ప్రేమార్ద్రమైనదియును, అమృత స్వరూపమైన అధరము నందంతట నెఱ్ఱవాఱినదియు, వడలఁబాఱని పిల్లనఁగ్రోవి నాదములలో మదపారవశ్య మధురమైనదియునుగా వ్రేపల్లెలోని పిల్లవాని ఆకృతిని లోక సమ్మోహనమైనదానినిగా ఆశాసించుచున్నది. మంగళాశాసనము చేయున్నది.

శ్లో. తత్కైశోరం తచ్చ వక్త్రారవిందం
తత్కారుణ్యం తేచ లీలాకటాక్షాః ।
తత్సౌందర్యం సాచ మందస్మిత శ్రీః
సత్యం సత్యం దుర్లభం దైవతేషు ॥ 55

అన్వయము :- తత్సర్వం దైవతేషు దుర్లభం సత్యం సత్యం సత్యమ్= అదియంతయును ఇతర దైవతములలో పడయరానిది.

అర్థము :- తత్=ఆ, కైశోరం=కొదమగుబ్బమిు సొరు, తచ్చ వక్త్రారవిందం=ఆ వద నారవిందము, తత్=ఆ, కారుణ్యం=కారుణిక స్వభావము, తేచ=ఆ, లీలా కటాక్షాః=లీలా

నిర్భరములైన కటాక్ష ప్రసారములు, తత్సౌందర్యం=ఆ అందము, సాచ=ఆ, మందస్మితశ్రీః=మందస్మిత లక్ష్మి, దైవతేషు=తదితర దైవతములయందు, దుర్లభం=పడయరానిది, సత్యం సత్యం సత్యమ్=ముమ్మాటికిని సత్యము.

తాత్పర్యము :- ఆ కైశోరమైన సౌరు, ఆ ముఖారవిందము, ఆ కారుణ్య స్వభావము, ఆలీలా పరిపూర్ణములైన కటాక్షప్రసారములు, ఆ సౌందర్యము, ఆ మందస్మిత ముద్రా లక్ష్మి, ఇతర దైవతములయందు పడయారానివి. సత్యము సత్యము సత్యము మూమ్మాటికిని సత్యము.

శ్లో. *విశ్వోపప్లవ శమనైక బద్ధ దీక్షం*
విశ్వాస స్తబకిత చేతసాం జనానామ్ ।
పశ్యామః ప్రతినవకాంతి కందళార్ద్రం
పశ్యామః పథిపథి శైశవం మురారేః ॥ 56

అన్వయము :- పథి పథి మురారేః శైశవం పశ్యామః=ఎల్ల దారులయందును మురారి శైశవలక్ష్మియే మాకు సాక్షాత్కారమును అనుగ్రహించుచున్నది.

అర్థము :- విశ్వాస స్తబకిత చేతసాం=నమ్మిక గుత్తులు కట్టికొన్న మనస్సుగల, జనానాం=నరులకు, విశ్వ=సకలమైన, ఉపప్లవ=ఉపద్రముల యొక్క, ఉపశమనైక =ఉపశమింపఁజేయుటయందే, బద్ధదీక్షం=దీక్షాకంకణమును కట్టికొన్నదియును, ప్రతినవ=నిత్యనూతనమైన, కాంతి కందల=కాంతియొక్క క్రొత్త మొలకలచేత, ఆర్ద్రం=తడిసిన, మురారేః=మురవైరి యొక్క, శైశవం=శిశుత్వమును, పశ్యామః= చూచుచున్నాము.

తాత్పర్యము :- నమ్మిక గుత్తులు గుత్తులు కట్టియున్న నెమ్మనముగల జనులకు సకల పీడోపశమనార్థమై దీక్షా కంకణము కట్టికొనియున్న నిత్య నూతన కాంతి కందళములతో ఆర్ద్రమైయున్న మురారి యొక్క కైశోర లక్ష్మినిఁజూచుచున్నాము. ఎల్ల దారులయందును దానినే చూచుచున్నాము.

శ్లో. *మౌళి శ్చంద్రక భూషణా మరకత స్తంభాభిరామంవపుః*
వక్త్రం చిత్ర విముగ్ధ హాసమధురం బాలే విలోలే దృశౌ ।[4]

వాచశ్శైశవ శీతలాః మదగజ శ్లాఘ్యా విలాస స్థితిః
మందం మంద మయే కఏష మధురావీథీ మితో గాహతే? ॥ 57

అన్వయము :- అయే! మందం మందం మితో మధురా వీథీం గాహతే క ఏషః?= ఓయీ! మెల్లమెల్లగా నీవైపునుండి మధురా నగరి వీథిలో ప్రవేశించుచున్నాఁడే! ఈతఁడెవ్వడు?

అర్థము :- మౌళి=ధమ్మిల్లము, చంద్రక భూషణా=నెమలికన్నే ఒకనగవలె తుఱుముకొన్నది, వపుః=శరీరశోభ, మరకత స్తంభాభిరామం=ఆకుపచ్చమణులు పేర్చికట్టిన కంబమువలె నయనాభిరామమై యున్నది. వక్త్రం=నెమ్మొగము, చిత్ర=అచ్చెరువుట్టిపడుచున్న, విముగ్ధ=మిక్కిలి మనోహరమైన, హాస=నవ్వుచే, మధురం=మధురమైయున్నది, దృశౌ=కన్నులు, విలోలే=మిక్కిలి లోలములుగా నున్నవి. వాచః=పలుకులు, శైశవశీతలాః=చలువలార్చెడు అమాయికమైన పసితనముట్టిపడుచున్నవి, విలాసస్థితిః=విలసనముతోడినిలుకడ, మదగజశ్లాఘ్యా=మదపుటేనుఁగు నిలుకడవలె నిబ్బరమై యున్నది, మందంమందం=మెల్ల మెల్లగా, ఇతః=ఈవైపు నుండి, మధురావీథీం= మధురానగరవీథిని, గాహతే=ప్రవేశించు చున్నాఁడు, అయే! బాలే!=ఓ చిన్నదానా! క ఏషః=ఎవ్వరీయన?

తాత్పర్యము :- తుఱుములో నెమలికన్నే ఒక నగవలె చెరివికొన్నాడు. నెమ్మేను పచ్చరాకట్టు కంబమువలె కంటికింపై యున్నది. నెమ్మోము అచ్చెరు వొందుచున్నట్లున్న మిక్కిలి అమాయికమైన నవ్వుటలలతో అందముగా నున్నది. కన్నులుమిక్కిలి కదలుచు దప్పిక కొన్నట్లున్నవి. మాటలు పసితనపుఁ జలువ లార్చుచున్నవి. నిలిచిన విలాసము మదగజమును తలఁపించుచున్నది. ఈ వైపు నుండి మంద గమనముతో మధురా నగరి వీథిలో ప్రవేశించుచున్నాఁడు - ఓ చిన్నదానా! ఎవ్వరీతఁడు?

శ్లో. ***పాదౌ పాద వినిర్జితాంబుజ వనౌ పద్మాఽలయాఽలంకృతౌ***
పాణీ వేణు వినోదన ప్రణయినౌ పర్యాప్త శిల్ప శ్రియౌ ।
బాహూ దోహదభాజనం మృగదృశాం మాధుర్య ధారాగిరో
వక్త్రం వాగ్విభవాతిలంఘిత మహో! బాలం కిమేత న్మహః? 58

---

4 'హాస లహరీ విన్యాస ధన్యాధరమ్' (పాఠాంతరము) నవ్వుటలలయొక్క అమరికచేత కృతార్థమైన పెదవి కలది.

అన్వయము :- అహో! బాలం కిమేతన్మహః! = అహో! ఈవెలుఁగు బాలుఁడా!

అర్థము :- పద్మాలయాలంకృతౌ=పద్మాలయయైన లక్ష్మిచేత అలంకరింపఁబడిన, పాదౌ=పాదములు, పాదవినిర్జితాంబుజ వనౌ - పాద=నాలుగవ పాలుచేత, వినిర్జిత=ఓడింపఁబడిన, అంబుజ వనౌ=తామరతంపరలు గలవి; వేణువినోదన ప్రణయినౌ - వేణు=పిల్లనఁగ్రోవిని, వినోదన=లాలనము చేయుటయందు, ప్రణయినౌ=అక్కఱపడి యున్న, పాణీ=చేతులు, 'పర్యాప్తశిల్పాశ్రయౌ' - పర్యాప్త=యథేష్టమైన, శిల్ప=నిర్మాణమునకు, ఆశ్రయౌ=ఆశ్రయభూతములు. బాహూ=బాహువులు, మృగదృశాం=హరిణ నయనలకు - స్త్రీలకు, దోహదభాజనం=అభిలాషములను నిలిపికొనెడు నెలవు, గిరః=పలుకులు, మాధుర్యధారాః=మాధుర్యధారలు, వక్త్రం=ముఖము, వాగ్విభవాతి లంఘితం=వాగ్వైభవమును దాఁటియున్నది. ఏతత్=ఈ, మహః=వెలుఁగు, బాలం కిమ్=బాలస్వరూప మాత్రమా? అహో!=ఆశ్చర్యము.

తాత్పర్యము :- పద్మ నిలయమైన లక్ష్మీ దేవిచేత అలంకరింపఁబడిన పాదములు తమ శోభలోని పాదాంశము - నాలుగవ వంతుచేతనే పద్మవనములను ఓడించినవి. వేణులాలనమునకు మక్కువపడియున్న చేతులు యథేష్ట నిర్మాణమునకు చాలినవి. బాహుదండములు స్త్రీల అభిలాషములను - మనోరథములు దాఁచుకొనెడి నెలవులు. వాక్కులు మాధుర్య ధారలు. ముఖశోభ వాగ్వైభవమునకు ఆవలి మేరలోనిది. అహో! ఈ వెలుఁగు బాల మాత్రుఁడా!

శ్లో. *బర్హం నామ![5]విభూషణం బహుమతం వేషాయ శేషైరలం*
వక్త్రం ద్విత్ర విశేష కాంతి లహరీ విన్యాస ధన్యాధరమ్ ।
శీలై రల్పధియా మగమ్యవిభవైః శృంగార భంగీమయం
చిత్రం చిత్ర మహో విచిత్ర మహహో! చిత్రం విచిత్రం మహః॥ 59

అన్వయము :- 'కాక్వర్థ' మైన 'నామ' అను అన్వయమును మొదటి మూడు పాదములలోని ప్రతివాక్యమునకు విడివిడిగా అన్వయము చేసికొనవలయును.

అర్థము :- బహుమతం విభూషణం=మక్కువయైన నగ, బర్హంనామ!=నెమలి పురియా!, వేషాయ=వేషరచనకు, శేషైః=కడమనగలతో, అలంనామ!=అక్కఱలేదా!,

5 'ఏతన్నామ' (పాఠాంతరము) -

వక్త్రం=ముఖము, ద్విత్ర=రెండు మూఁడు, విశేష=తిలకముల యొక్క, కాంతిలహరీ=కాంతి తరంగములయొక్క విన్యాస=అమరికచేత, ధన్యాధరంనామ!=ధన్యమైన అధరబింబము కలదియా!, అల్పధియాం=పరిమిత బుద్ధులకు, అగమ్య=గోచరముకాని, శీలైః=స్వభావములచేత, శృంగార భంగీమయం నామ!=శృంగార రచనా విధములతోనిండిన దా!, చిత్రంచిత్రం=చిత్రము చిత్రము, అహో విచిత్రం=అహో పలునగల అచ్చెరువులు కలది, అహహో! చిత్రం విచిత్రం మహః=ఈ వెలుఁగు చిత్రవిచిత్రమైనది - అహహో!

తాత్పర్యము :- మక్కువమైన నగ నెమలి పురియా! సింగారమునకు మిగిలినవి అక్కఱలేదా! ముఖమున రెండు తిలకములా! అల్పబుద్ధులకు అగమ్యగోచరములై స్వభావములను పరికించినచో అవియన్నియును శృంగార భంగీ మయములా? చిత్ర చిత్రము అహో విచిత్రము! అహో!ఈ వెలుఁగు చిత్ర విచిత్రము!.

శ్లో. *అగ్రే సమగ్రయతి కామపి కేళి లక్ష్మీమ్*
అన్యాసు దిక్ష్వపి విలోచనమేవ సాక్షీ।
హా! హంత! హంత! మమ దూర[6] మహో కి మేతత్?
ఆసీత్ కిశోరమయ మంబ! జగత్త్రయం మే! ॥ 60

అన్వయము :- ఏత జ్జగత్త్రయం కిశోర మయ మాసీకిమ్!=అమ్మా! ఈ జగత్త్రయము కిశోర మయమైపోయినదా!

అర్థము :- అగ్రే=(నా)ఎట్టయెదుట, కామపి కేళి లక్ష్మీమ్=ఏదేని ఒక ఆట సంబరమును, సమగ్రయతి=నిరవాకముచేయుచున్నాఁడు, అన్యాసుదిక్షు అపి!=మిగిలిన దిక్కులలోఁగూడ - అదియే ఆట ఆడుచున్నాఁడు!, విలోచనమేవ=నాకన్నే, సాక్షీ=సాక్షి, హా! హన్త హన్త! హా!=అయ్యో! అయ్యో!, మమ=నాకు, దూరం=దూరముగపోవుచున్నాఁడు, అంబ!=అమ్మా! మే=నాకు, జగత్త్రయం=భువనత్రయము, కిశోరమయమాసీత్=కిశోర మయమైపోయినది.

తాత్పర్యము :- నా ఎట్ట యెదుట ఏదో ఆట ఆడుచున్నాఁడు అదే సమయము నందు మిగిలిన దిక్కులలోఁగూడ ఆయాటయే! దీనికి నాకన్నే సాక్షి! అయ్యయ్యో! నాకు దూరముగా పోవుచున్నాఁడు! అమ్మా! ఈ జగత్త్రయము నాకు కిశోరమయమైపోయినది!

---

6 'హస్తమథ దూరమ్' (పాఠాంతరము)-అథ=చేజాపిన వెనుక, హస్తం=చేయి, దూరమ్=దూరమందువున్నది.

శ్లో. చికురం బహుళం విరళం భ్రమరం
మృదులం వచనం విపులం నయనమ్ ।
అధరం మధురం వదనం లలితం
చపలం చరితం చ కదాఽనుభవే ॥ 61

అన్వయము :- చపలం చరితం కదాఽనుభవే?=చపలమైన చరితమును ఎన్నఁడు అనుభవింతును?

అర్థము :- చికురం=జుట్టు, బహులం=విరివి, భ్రమరం=అలకము, విరలం=పలుచన, వచనం=మాట, మృదులం=మెత్తన, నయనం=కన్ను, విపులం=విశాలము, అధరం=మోవి, మధురం=తీయన, వదనం=మోము, లలితం=చక్కన, చరితం=నడవడి, చపలం=నిలకడలేనిది, కదా=ఎన్నఁడు, అనుభవే=అనుభవింతును?

తాత్పర్యము :- (కృష్ణుని దట్టంపు నెఱికురులను, పలుచని ముంగురులను, మెత్తని పలుకులను, సొగసైన మోవిని, చెలువైన మొగమును, చంచలమైన నడవడిని నేనెప్పుడు చూతునో!)

శ్లో. పరిపాలయ నః కృపాఽలయే
త్యసకృజ్జల్పిత మాత్మబాంధవః ।
మురళీ మృదుల స్వనాంతరే
విభు రాకర్ణయితా కదాను నః ॥ 62

అన్వయము :- నః అసకృత్ జల్పితం ఆత్మబాంధవో విభుః కదాను ఆకర్ణయితా?= మా మొఱను జీవలోకబంధువైన సర్వగతుఁ డెన్నఁ డాలించునో!

అర్థము :- హే కృపాఽఽ లయ!=ఓ కృపానిలయుఁడా! నః=మమ్ము, పరిపాలయ!=పరిపాలింపుము! ఇతి=అనెడి, నః=మాయొక్క, అసకృత్=పలుమాఱులుగా వెట్టిన, జల్పితమ్=మొఱను, ఆత్మబాంధవః=జీవలోకబాంధవుఁడైన, విభుః=సర్వగతుఁడు, 'మురళీ మృదుల స్వనాంతరే' - మురళీ=వేణువుయొక్క, మృదుల స్వన=మృదు నినాదముల యొక్క, అంతరే=నడుమ, కదాను=ఎన్నటికిఁగాను, ఆకర్ణయితా=ఆలించునో!

తాత్పర్యము :- 'ఓ కృపానిలయుఁడా! మమ్ము పాలింపుము!' అనెడి మా మొఱను ఆ జీవలోకబాంధవుఁడైన విభుఁడు ఆ మురళీ మృదులనినాదముల నడుమ ఏనాటికి ఆలింపఁగలడో కదా!

శ్లో. ***కదాను కస్యాంను విపద్దశాయామ్***
కైశోరగంధిః కరుణాంబుధిర్నః ।
విలోచనాభ్యాం విపులాఽయతాభ్యామ్
వ్యాలోకయిష్యన్ విషయీ కరోతి?॥ 63

అన్వయము :- కదాను కరుణాంబుధిః విలోచనాభ్యాం నః విషయీ కరోతి!= ఎప్పుడు కరుణాంబునిధి తనకంట మమ్మరయును?

అర్థము :- కదాను=ఎన్నటికిఁగాను, కస్యాంను విపద్దశాయామ్=ఏ విపత్కాలము నందు, కరుణాంబునిధిః=కరుణా జలనిధి యైన, కైశోర గంధిః=ఈషత్కిశోరుఁడు, విపులాఽయతాభ్యాం=విపులములు నిడుదలునైన, విలోచనాభ్యాం=కన్నులతో, నః=మమ్ము, విషయీకరోతి=ఆరసి చూచును?

తాత్పర్యము :- కరుణాజలనిధి యైన ఆచిన్నారి ఎన్నఁడు ఏ విపద్దశయందు విపులాఽయతములైన తన కన్నులతో మమ్ము ఆరసిచూచును?

శ్లో. ***మధుర మధుర బింబే మంజులం మందహాసే***
శిశిర మమృత వాక్యే శీతలం దృష్టిపాతే ।
విపుల మరుణనేత్రే విశ్రుతం వేణునాదే
మరకతమణి నీలం బాల మాలోకయే ను? ॥ 64

అన్వయము :- మరకతమణి నీలం బాల మాలోకయేను?=మరకతమణి వలె నీల వర్ణుఁడైన బాలునిఁ జూచెదనా?

అర్థము :- అధరబింబే=బింబాధరమునందు, మధురం=తీయ్యనివానిని, మందహాసే=చిఱునవ్వునందు మంజులం=దర్శనీయుని, అమృత వాక్యే=అమృతవాక్కు నందు, శిశిరం=చలువ లార్చువానిని, దృష్టిపాతే=చూపువాఱిన చోట, శీతలం=

ఇవతళించువానిని, అరుణనేత్రే=ఎఱ్ఱసెరలుగల కన్నులయందు, విపులం=విశాలమైన వానిని, వేణునాదే=వేణునాదము నందు, విశ్రుతం=వెల్లడియైనవానిని, మరకతమణి నీలం=మరకతమణి వర్ణుఁడైన, బాలం=చిన్నవానిని. ఆలోకయేను!=చూచెదనా?

తాత్పర్యము :- బింబాధరమునందు మాధుర్యమూర్తిని, మందహాసము నందు మంజులమూర్తిని, అమృత వాక్యము నందు శిశిరమూర్తిని, దృష్టిప్రసారమునందు శీతల మూర్తిని, ఆరుణనయనమునందు విపులమూర్తిని, వేణునాదము నందు విశ్రుత మూర్తిని, మరకతమణి నీలుఁడైన బాలుని ఆలోకించెదనా?

శ్లో. *మాధుర్యా దపి మధురం!,*
మన్మథ తాతస్య కిమపి కైశోరమ్ ।
చాపల్యా దపి చపలం!,
చేతో మమ హరతి హంత! కిం కుర్మః? ॥ 65

అన్వయము :- మన్మథ తాతస్య కైశోరం మమచేతో హరతి హంత! కిం కుర్మః?= మన్మథ జనకుని కిశోరభావము నా మనస్సును లాఁగికొనుచున్నది. అవురా! ఏమి చేయుదుము?

అర్థము :- మాధుర్యాదపి=మాధుర్య గుణముకంటె, మధురం=మధురమైన, మన్మథ తాతస్య=మన్మథ జనకుని యొక్క, కిమపి=అనిర్వచనీయమైన, కైశోరం=కిశోరభావము, చాపల్యాదపి=చాపల్యముకంటె, చపలం=చపలమైనది, మమచేతః=నా మనస్సును, హరంతి=అపహరించుచున్నది, హంత!=అవురా!, కింకుర్మః=ఏమిచేయుదుము?

తాత్పర్యము :- మన్మథ జనకుని అనిర్వచనీయ కిశోరభావము మధురాతి మధురము. చపలాతిచపలము. నామనస్సును అపహరించి కొనిపోవుచున్నది, అవురా! ఏమిచేయుదుము?

శ్లో. *వక్షఃస్థలే చవిపులం నయనోత్పలే చ*
మందస్మితే చ మృదులం మదజల్పితేచ ।
బింబాధరే చ మంధురం మురళీరవేచ
బాలం విలాసనిధి మాకలయే కదా ను! ॥ 66

అన్వయము :- విలాసనిధిం బాలం కదాను ఆకలయే!=విలాసములకు నిధియైన బాలుని ఎన్నటికి ఆరయుదునో!

అర్థము :- వక్షఃస్థలేచ= వక్షః స్థలమునందు, నయనోత్పలేచ=నయనోత్పలమునందు, విపులం= విశాలమైన వానిని, మందస్మితేచ=మందహాసమునందు,మదజల్పితేచ=మోహన వాక్కుల యందును, మృదులం=మృదువైన వానిని, బింబాధరేచ మురళీ రవేచ మధురం=బింబాధరమునందు, మురళీరవము నందు మధురమైనవానిని, విలాసనిధిం= విలాసములకు నిధి యైన, బాలం=బాలుని, కదాను=ఎన్నఁడు, అకలయే=ఆరయుదునో!

తాత్పర్యము :- వక్షఃస్థలము నందు - నయనోత్పలమునందు - విశాలమైనవానిని, మందస్మిత - మదజల్పితముల యందు మృదువైన వానిని, బింబాధర మురళీ రవముల యందు మధురమైన వానిని, విలాసనిధియైన బాలుని ఎన్నఁడారయుదునో!

శ్లో. ***ఆర్ద్రావలోకిత దయాపరిణద్ధ నేత్రమ్***
ఆవిష్కృత స్మిత సుధా మధురాధరోష్ఠం ।
ఆద్యం పుమాంస మవతంసిత బర్హిబర్హమ్
ఆలోకయంతి కృతినః కృత పుణ్య పుంజాః ॥ 67

అన్వయము :- అవతం సిత బర్హి బర్హ మాద్యం పుమాంసం కృతపుణ్యపుంజాః కృతినః ఆలోకయంతి=నెమలిపురి సిగబంతిగాఁ జెరివికొనిన ఆదిపురుషుని పుణ్యముల చేగికొని పుట్టిన ధన్యపురుషులు చూచెదరు.

అర్థము :- ఆర్ద్రావలోకిత=తడిసిన చూడ్కులలో ఉట్టిపడుచున్న, దయా=కనికరము చేత, పరిణద్ధ=దట్టమైన, నేత్రమ్=కన్నులు గలట్టియు, ఆవిష్కృత=వెలువరింపఁబడిన స్మితసుధా=స్మితామృతము చేత, మధుర=తీయని, అధరోష్ఠం=అధరోష్ఠ ముద్రకల, అవతంసిత బర్హిబర్హమ్-అవతంసిత=సిగబంతిగా సవదరింపఁబడిన, బర్హిబర్హం=నెమలి పురిగల, ఆద్యంపుమాంసం=పురాణపురుషుని, కృతపుణ్యపుంజాః కృత=చేసికొనఁబడిన, పుణ్యపుంజాః=పుణ్యారాసులుగల, కృతినః=కృతార్థులు, అవలోకయంతి=చూచెదరు.

తాత్పర్యము :- నెమలి పురిని సిగబంతిగా అలవరించికొని వచ్చి, అధరోష్ఠ ముద్ర పై అమృతహాసమును వెల్లివిరియించుచున్న పురాణ పురుషుని, పుణ్యపుంజములుచేసికొని పుట్టిన ధన్యపురుషులు అవలోకించుచున్నారు.

శ్లో. *మారః స్వయం ను! మధురద్యుతి మండలం ను!*
మాధుర్యమేవ ను! మనో నయనామృతం ను! ।
వాణీ మృజాను! మమ జీవితవల్లభో ను!
బాలోऽయ మభ్యుదయతే మమ లోచనాయ ॥ 68

అన్వయము :- బాలోऽయ ముభ్యదయతే మమ లోచనాయ=నాకంటికి ఎదురుగా ఈ బాలుఁడు ఉదయించుచున్నాడు.

అర్థము :- స్వయం ను మారః!=సాక్షాత్తు మన్మథుఁడేనా!, అయం=వీడు!, మధుర ద్యుతి మండలం ను!=మధుర కాంతి వలయమా!, మాధుర్యమేవను!=సాక్షాత్తు మాధుర్యమేనా!, మనో నయనామృతం ను!=మనస్సునకే అమృతమా! - నయనా మృతమా!, వాణీ=నా పలుకులకు, మృజాను=మాలిన్య శోధకమైన పులికాపా!, మమ జీవితవల్లభోను!=నా జీవివల్లభుఁడేనా!, అభి మమ లోచనాయ=ఎదురుగా నాకంటికి, అయముదయతే=ఇదిగో! ఉదయించుచున్నాడు!, బాలః=బాలుఁడు!

తాత్పర్యము :- (నా కన్నులకుఁ గనబడుచున్న యీ బాలుఁడు మన్మథుఁడా? లేక చంద్రమండలమా? సౌందర్యపురాశియా? నా మనస్సు యొక్క ఆనందమా? నా కన్నుల పండువా? పలుకుల యచ్చందనమా? నా ప్రాణవల్లభుఁడా?

శ్లో. *బాలోऽయ మాలోల విలోచనేన*
వక్త్రేణ చిత్రీకృత దిఙ్ముఖేన ।
వేషేణ ఘోషోచిత భూషణేన
ముగ్ధేన దుగ్ధే నయనోత్సుకం నః ॥ 69

అన్వయము :- అయం బాలః నః నయనోత్సుకం దుగ్ధే=ఈ బాలుఁడు మానయనోత్కంఠను పిదుకుచున్నాఁడు!

అర్థము :- చిత్రీకృత దిఙ్ముఖేన=తిలకీకృత దిగంగనాముఖమును, ఆలోల విలోచనేన=ఆలోల విలోచనమునైన, వక్త్రేణ=ముఖముతో, ఘోషోచితభూషణేన-ఘోష=ఘోషవాసులకు - వ్రజ నివాసులకు, ఉచిత=అలవాటైన, భూషణేన=నగలుగల, ముగ్ధేన=అమాయికమగు, వేషేణ=ముస్తాబుతో, నః=మాయొక్క, నయనోత్సుకం= కన్నుల ఉబలాటమున, అయంబాలః=ఈ బాలుఁడు, దుగ్ధే=పిదుకుచున్నాఁడు.

విశేషము :- దూడ కనిపించినప్పుడు ఆవు పొదుగునకు మోయలేని పాల బరువును గొల్లవాఁడు పిండునట్లుగా, నా కన్ను మోయలేని ఉబలాటపు బరువును ఈ గొల్లపిల్లవాఁడు - కదలుచున్న కన్నులు గలిగి, దిగంగనాముఖమునందు తీర్చిన కస్తూరీ తిలకము వలెనే ఉన్న - తన ముద్దు మోముతో, వ్రజనివాసులకు అలవాటైన నగలు సింగారించికొనిన వెఱ్ఱి గొల్లవాని వేషముతో పిదుకుచున్నాఁడు.

శ్లో. *ఆందోళి తాగ్రభుజ మాకుల నేత్రలీలమ్*
ఆర్ద్ర స్మితార్ద్ర వదనాంబుజ చంద్రబింబమ్ ।
శింజాన భూషణ శతం శిఖిపింఛమౌళిం
శీతం విలోచన రసాయన మభ్యుపైతి ॥ 70

అన్వయము :- శీతం విలోచన రసాయన మభ్యుపైతి=చల్లని లోచన రసాయన మెదురుగా దగ్గఱకు వచ్చుచున్నది!

అర్థము :- ఆందోళితాగ్రభుజం= బుజములకొనలు -ఊగించుకొనుచు ఆకులనేత్రలీలం=నేత్రలీలాకాంతులు సందడించి కొనుచుండఁగా, ఆర్ద్రస్మితార్ద్ర వదనాంబుజ చంద్రబింబం=ఆర్ద్ర వదనాంబుజ చంద్ర బింబము -తడినవ్వులలలో కరఁగిపోవుచుండఁగా, శింజాన భూషశతం=పలువగల నగల గలగలలతో, శిఖిపింఛమౌళి=సిగబంతిగాఁజెరివికొన్న నెమ్మిపురియై, శీతం=చలువలాఱుచున్న, విలోచన రసాయనం=విలోచన పానీయమైన ఒకానొక రసాయనము, అభ్యుపైతి=నాకు ఎదురై దగ్గఱకు వచ్చుచున్నది.

తాత్పర్యము :- బుజముల కొనలు ఊఁగించుకొనుచు, నేత్ర లీలా కాంతులు తమలో తాము సందడించుకొనుచుండఁగా, నైసర్గికముగా ఆర్ద్ర లక్షణముగల - అంబుజ -చంద్రబింబములు పరస్పర విరోధులగుట - ప్రకృతిలోని విచిత్రము - జగత్ప్రభువు తనముఖమునందు - ఆ రెంటికిని సామరస్యము కుదిర్చినాఁడు. కనుక - ఆర్ద్రవదనాంబుజ చంద్రబింబము తడినవ్వులలో కరఁగిపోవుచుండఁగా పలు వగల నగల గలగలలతో, సిగబంతియైన నెమ్మిపురి తనకు గుర్తుగా చల్లని లోచనా స్వాదనీయమైన ఒక రసాయనము నా కెదురై చేరవచ్చుచున్నది.

శ్లో. *పశుపాల బాల పరిషద్విభూషణం*
శిశురేష శీతల విలోల లోచనః ।

మృదుల స్మితార్ద్ర వదనేందు సంపదా
మదయన్ మదీయ హృదయం విగాహతే ॥ 71

అన్వయము :- ఏష శిశుః మదీయ హృదయం విగాహతే=ఈ పిల్లవాఁడు నాగుండె లోఁతుల లోనికి చొచ్చికొని వచ్చుచున్నాఁడు.

అర్థము :- పశు పాల బాల పరిషద్విభూషణమ్=గొల్లపిల్లల గోష్ఠికి పెట్టని నగయైన, ఏష శిశుః=ఈ పిల్లవాఁడు, శీతల విలోల లోచనః=కదలియాడుచున్న చల్లని కన్నులు గలవాఁడై, మృదుల స్మితార్ద్ర వదనేందు సంపదా-మృదుల=కోమలమైన, స్మిత=అలఁతి నవ్వులతో, ఆర్ద్ర=కరఁగిన, వదనేందు=ఆననేందువు యొక్క, సంపదా=వైభవముతో మదయన్=హర్ష పారవశ్యమును గలిగించుచు, మదీయ హృదయం=నా హృదయమును, విగాహతే=లోలోనికి (జొచ్చుకొనుచున్నాఁడు.

తాత్పర్యము :- గొల్లపిల్లల గోష్ఠికి (సభకు) పెట్టని విశేష విభూషణమైన యీ శిశువు - కోమలములైన అలఁతి నవ్వులతో కరఁగిపోవుచున్న ముఖ చంద్రబింబ వైభవముతో మైమఱపించుచు నాగుండె లోఁతుల లోనికి ప్రవేశించుచున్నాడు!

శ్లో. *త దిద ముపనతం తమాల నీలం*
తరళ విలోచన తారకాభిరామమ్ ।
ముదిత ముదిత వక్త్ర చంద్రబింబం
ముఖరితవేణు విలాస జీవితమ్ ॥ 72

అన్వయము :- తదిదం తమాలనీల ముఖరిత వేణు జీవితం ఉపనతమ్= శబ్దాయమానమై పిల్లనఁగ్రోవికి ప్రాణమైన ఆయీ తమాల నీలము చేరవచ్చినది.

అర్థము :- తరళ విలోచన తారకాభిరామం-తరళ=కదలుచున్న, విలోచన=కన్నుల లోపలి, తారకా=పాపలతో, అభిరామం=సుందరమైనదియును, ముదిత ముదిత వక్త్ర చంద్రబింబమ్=మిక్కిలి ప్రసన్నమైన ముఖచంద్రబింబము కలదియును, ముఖరిత వేణు విలాస జీవితమ్-ముఖరిత=శబ్దాయమానమైన, వేణు=పిల్లనఁగ్రోవియొక్క, విలాస=విలసనమునకు, జీవితం=ప్రాణమైన, తదిదం తమాలనీలం=ఆయీ తమాల నీలవర్ణము, ఉపనతం=చేరవచ్చినది.

తాత్పర్యము :- కదులుచున్న కంటిపాపలతో మిక్కిలి హృదయంగమమై, మిక్కిలి ప్రసన్నమైన ముఖచంద్రబింబముతో, శబ్దాయ మానమైన వేణునాళమునకు ప్రాణభూతమైన ఆయీ తమాల నీలవర్ణము నన్ను చేరవచ్చినది.

శ్లో. చాపల్యసీమ చపలానుభవైక సీమ
చాతుర్యసీమ చతురానన శిల్ప సీమ ।
సౌరభ్యసీమ సకలాద్భుత కేళిసీమ
సౌభాగ్య సీమ తదిదం వ్రజ భాగ్యసీమ ॥ 73

అన్వయము :- తదిదం వ్రజ భాగ్యసీమ=ఈయది వ్రజ నివాసుల భాగ్యముల తుట్టతుది మేర.

అర్థము :- తదిదం=ఆయీ, వ్రజ భాగ్యసీమ=వ్రజనివాసుల భాగ్యములకు చరమసీమయైనది - చాపల్యసీమ=చాంచల్యమునకు మేర, చపలా=లక్ష్మీదేవి యొక్క, అనుభవ=అనుభవమునకు, ఏకసీమ=ఏకాయతనము, చాతుర్యసీమ=జాణతనమునకు మేర, చతురానన శిల్పసీమ-చతురానన=బ్రహ్మయొక్క, శిల్ప=నిర్మాణ వైభవమునకు, సీమ=హద్దు, సౌరభ్య=దాతృత్వ మునకు (సురభి-కామధేనువు. సురభియొక్క లక్షణము సౌరభ్యము. దాని లక్షణము దాతృత్వమే కదా!) 'సకలాద్భుతకేళిసీమ' - సకలాద్భుత= అన్నిఆశ్చర్యములకును, కేళిసీమ=ఆటపట్టు, సౌభాగ్యసీమ=సౌభాగ్య స్పృహణీయతా లక్షణమునకు, సీమ=తుదిహద్దు!

తాత్పర్యము :- ఆ వ్రజవాసులపాలిటి అదృష్టములకు పొలమైన యీ తమాల నీలము, అల్లరులకు హద్దు లేక లక్ష్మి యొక్క అనుభవమునకు ఏకనిలయము, జాణతనములకు తుదిహద్దు బ్రహ్మయొక్క సృష్టివైభవమునకు చరమసీమ సౌరభ్యమునకు (దాతృత్వమునకు) పరాకాష్ఠ ఆశ్చర్యములు అన్నింటికి ఆటపట్టు. స్పృహణీయతా లక్షణమునకు తుదిహద్దు.

శ్లో. మాధుర్యేణ ద్విగుణ శిశిరం వక్త్రచంద్రం వహంతీ
వంశీ వీథీ విగళ దమృత స్రోతసా సేచయంతీ ।
మద్వాణీనాం విహరణ పదం మత్త సౌభాగ్య భాజాం
మత్పుణ్యానాం పరిణతి రహో! నేత్రయోస్సన్నిధత్తే ॥ 74

అన్వయము :- అహో! మత్ పుణ్యానాం పరిణతిః నేత్రయోః సన్నిధత్తే=ఆహో! నాపుణ్య పరిణామము కన్నులకు సన్నిధి చేయుచున్నది.

అర్థము :- మాధుర్యేణ=మాధుర్యలక్షణముచేత, ద్విగుణ శిశిరం=రెండింతలుగా చల్లనగుచున్న, వక్త్రచంద్రం=ముఖచంద్రుని, వహంతీ=వహించుచున్నదై, వంశీవీథీ= వేణుగర్భవీథినుండి, విగళదమృతస్రోతసా-విగళత్ =జాఱుచున్న, అమృతస్రోతసా= అమృతపుజాలుచేత, సేచయంతీ=తడిపించుచున్నదియై, మద్వాణీనాం=నా వచోభంగులకు, విహరణపదం=విహారస్థానమును, మత్త సౌభాగ్యభాజాం-మత్త=మదించిన, సౌభాగ్య=స్పృహణీయతా లక్షణమును, భాజాం=పొందియున్న, మత్పుణ్యానాం= నా పుణ్యములయొక్క,పరిణతిః=పంట, నేత్రయోః=కన్నులకు, సన్నిధత్తే=సాన్నిధ్యమును ప్రసాదించుచున్నది, అహో=ఆశ్చర్యము!

తాత్పర్యము :- మాధురీ మహిమచే రెండింతలు చల్లనగుచున్న ముఖచంద్రునితో, వేణుగర్భవీథినుండి జాలువాఱుచున్న అమృతవాహిని చేత నన్ను తడుపుచు, నా వచస్స్ఫురణులకు విహరణస్థానము, అసాధారణ సౌభాగ్యములైన నా పుణ్యములపంట - నా కన్నులకు సన్నిధిని అనుగ్రహించుచున్నది.

శ్లో. ***తేజసేఽస్తు నమో ధేనుపాలినే లోకపాలినే***
రాధా పయోధరోత్సంగ శాయినే శేష శాయినే ॥ 75

అన్వయము :- తేజసే నమోఽస్తు=వెలుఁగునకు జేజేలు!

అర్థము :- ధేనుపాలినే=ఆలను పాలించునట్టి, లోకపాలినే=లోకములను పాలించునట్టి, రాధా పయోధ రోత్సంగ శాయినే=శ్రీరాధాదేవి పాలిండ్లపై పవ్వళించునట్టి, శేష శాయినే=శేషునిపై పవ్వళించునట్టి, తేజసే=వెలుఁగునకు, నమోఽస్తు=జేజే!

తాత్పర్యము :- (గోవులను జగములను గాచుచు, రాధ చన్నుల మీఁదను ఆదిశేషుని మీఁదను బవ్వళించు తేజస్స్వరూపమగు కృష్ణాఖ్య బ్రహ్మమునకు నమస్కరించుచున్నాను.)

శ్లో. ***ధేనుపాల దయితా స్తనస్థలీ***
ధన్య కుంకుమ సనాథ కాంతయే ।

వేణుగీత గతి మూల వేధసే
తేజసే త దిద మోం [7] నమో నమః ॥ 76

అన్వయము :- తేజసే తదిదం ఓం నమో నమః = "ఓం నమో నమః" అనెడి ఆయీ నమస్కారము తేజస్సునకు!

అర్థము :- ధేనుపాల దయితా=ఆభీర ప్రేయసులయొక్క, స్తనస్థలీ=చనుగొండల ఎత్తు పల్లములయందలి - ఉపత్యకాధిత్యకా స్థలీ ప్రదేశములయందలి, ధన్య=కృతార్థమైన, కుంకుమ=కుంకుమ ద్రవముతో, సనాథ=సహితమైన, కాంతయే=నీలకాంతిగల, వేణుగీత=బ్రహ్మగీతముయొక్క, గతి=ప్రసారమునకు, మూలవేధసే=మూలకారణమైన - ఆదిమ బ్రహ్మతేజమునకు, తదిదం=ఆయీ, ఓం నమో నమః="ఓం నమో నమః నమః"

తాత్పర్యము :- ఆభీర ప్రేయసుల యొక్క స్తనగిరుల యొక్క ఎత్తుపల్లములయందు - (ఉపత్యకా - అధిత్యకలయందు) ఉండుట చేత కృతార్థమైన కుంకుమ ద్రవముతో సనాథమైన నీలవినీల దేహకాంతి కలవాని కొఱకు వేణుగర్భమునందు బ్రహ్మగీతి ప్రసారగతికి మూలకారణమైన ఆదిమ బ్రహ్మ మైన తేజమునకు ఆయీ "ఓం నమో నమః"

శ్లో. *మృదు క్వణ న్నూపుర మంథరేణ*
బాలేన పాదాంబుజ పల్లవేన ।
అనుక్వణ న్మంజుల వేణుగీతమ్
ఆయాతి మే జీవిత మాత్తకేళి ॥ 77

అన్వయము :- ఆత్తకేళి మే జీవితం ఆయాతి=తొడఁగిన సృష్టి స్థితి సంహార రూపమైన ఆటకల - నా జీవితం నడచి వచ్చుచున్నది. ఏలాగున - అనగా -

అర్థము :- 'మృదు క్వణ న్నూపుర మంథరేణ' - మృదు=మృదులీలగా, క్వణత్=రవళించుచున్న, నూపుర=అందియలతో, మంథరేణ=బరువుపడి మందగతియైన, బాలేన=లేఁతదియైన, పాదాంబుజ=అడుగుఁదామర అనెడి, పల్లవేన=తలిరాకుతో -

---

7 'బ్రహ్మరాశి మహసే' (పాఠాంతరము)=బ్రహ్మ సమూహములకు తేజస్సు అయిన శ్రీకృష్ణునకు

అనుక్వణత్=అందెరవళి తాళమును అనుసరించి - రవళించుచున్న, మంజుల=మధురమైన, వేణు గీతమ్=పిల్లనఁగ్రోవిపాటకలదియై, 'ఆత్తకేళి' - ఆత్త=తొడఁగిన, కేళి=సృష్టి స్థితి సంహార రూపమైన ఆట కలదియై, మే జీవితమ్=నా జీవితసర్వస్వము, ఆయాతి=మెల్లగా నడిచి వచ్చుచున్నది.

తాత్పర్యము :- మృదులీలగా రవళించుచున్న అందెలతో బరువుపడి మందగతియైన అడుగుఁదామర అనెడి తలిరాకుతో - అందెరవళి తాళగతిని అనుసరించి రవళించుచున్న మంజులమైన పిల్లనఁగ్రోవిపాటతో - తొడఁగిన సృష్టి స్థితి, లయములనెడి ఆటతో - నాజీవిత సర్వస్వము మెల్లగా నడిచి వచ్చుచున్నది.

విశేషము :- నూపుర తాళగతిని అనుసరించి స్వామి అడుగులు పడుచుండుట - ఆ అడుగులు పడుట -గీత గతికి మేళనమై యుండుట - ఇది స్వామికి ఒకకేళిగా ఉన్నది. కనుక "ఆత్తకేళి".

శ్లో. ***సోఽయం విలాస మురళీ నినదామృతేన***
సించన్నుదంచిత మిదం మమ కర్ణ యుగ్మమ్ ।
ఆయాతి మే నయనబంధు రనన్యబంధు
రానంద కందలితకేళి కటాక్ష లక్షః ॥ 78

అన్వయము :- సోఽయ మనన్యబంధుః మే-నయనబంధుః ఆయాతి=ఇదుగో! అనన్యులకు బంధువు! నా నయనబంధువు! వచ్చుచున్నాఁడు!

అర్థము :- సః=అతడు, మమ=నాయొక్క, ఇదం=ఈ, ఉదంచితం=టిక్కించికొని యున్న, కర్ణయుగ్మమ్=వీనుదోయిని, 'విలాసమురళీనినాదామృతేన' - విలాస=పలుపోకడలుగల, మురళీ నినాద=మురళీ నినాదములే అనెడి, అమృతేన=అమృత రసముతో, సించన్=తడుపుచు, అనన్యబంధుః=అనన్యులకు బంధువైన, మే నయన బంధుః=నా నయనబంధువు, 'ఆనంద కందళిత కేళి కటాక్ష లక్షః' - ఆనంద=ఆనందము నుండి, కందళిత=మొలకెత్తిన, కేళి=క్రీడయందలి, కటాక్షలక్షః=లక్షలకొలఁది క్రేఁగంటి చూపులు గలవాఁడై, అయ మాయాతి!=ఇదుగో! వచ్చుచున్నాఁడు.

తాత్పర్యము :- అనన్య బంధువైన ఆ నా నయనబంధువు - తిక్కించుకొనిన నా వీనుదోయిని పలు వగల మురళీనినాదములనెడి అమృతరసముతో తడుపుచు స్వరూపానందము నుండి మొలకలెత్తిన లక్షలకొలఁది కేళీ కటాక్షములతో - ఇదుగో! వచ్చుచున్నాఁడు.

శ్లో. *దూరా ద్విలోకయతి వారణ ఖేలగామీ*
ధారా కటాక్ష భరితేన విలోచనేన ।
ఆరా దుపైతి హృదయంగమ వేణునాద
వేణీ దుఘేన దశనావరణేన దేవ : ॥ 79

అన్వయము :- దూరా ద్విలోకయతి ఆరాదుపైతి దేవః=స్వామి దూరమునుండి కటాక్షించుచున్నాఁడు.

అర్థము :- 'వారణ ఖేలగామీ' - వారణ=మదవారణమువలె, ఖేలగామీ=విలాస గమనముగల, దేవః=ప్రకాశ లక్షణుడైన స్వామి, ధారా=అవిచ్ఛిన్న ధారవలె ఎడతెగని, కటాక్ష=క్రేఁగంటి చూపులతో, భరితేన=నిండిన, విలోచనేన=కంటితో, దూరాత్=దూరమునుండి, విలోకయతి=చూచుచున్నాఁడు - 'హృదయంగమ వేణునాద వేణీ దుఘేన' - హృదయంగమ=హృదయములోనికిఁ బ్రవేశించుచున్న, వేణునాద= వంశీనినాదముయొక్క, వేణీ=జాలును, దుఘేన=పిండుచున్న, దశనావరణేన= రదనాంశుకముతో - వాతెఱతో, ఆరాత్=చేరువగా, ఉపైతి=వచ్చుచున్నాఁడు.

తాత్పర్యము :- మదవారణము వలె ఖేలగామియైన స్వామి, ధారావాహినులైన కటాక్ష వీక్షణములతో నిండిపోయిన విలోచనముతో దూరమునుండి (నన్ను) చూచు చున్నాడు. హృదయంగమమైన వంశీనినాద వాహినిని పిండుచున్న దశనాంశుకముతో (వాతెఱతో) చేరువగా వచ్చుచున్నాఁడు.

శ్లో. *త్రిభువన సరసాభ్యాం దీప్త భూషా పదాభ్యాం*
దృశి దృశి శిశిరాభ్యాం దివ్యలీలాఽకులాభ్యామ్ ।
అశరణ శరణాభ్యా మద్భుతాభ్యాం పదాభ్యామ్
అయ మయ మను కూజద్వేణు రాయాతి దేవః ॥ 80

అన్వయము :- అయమయ మనుకూజద్వేణు రాయాతి దేవః=తన గమనఖేలను అనుసరించి రవళించుచున్న మురళితో ఇడుగిడుగో! స్వామి మందమంద గతులతో వచ్చుచున్నాఁడు.

అర్థము :- త్రిభువన సరసాభ్యాం=ముల్లోకముకంటె సారభూతములైనవి, దీప్త భూషా పదాభ్యామ్=వెలుఁగు లీనుచున్న ఆభరణములకు నెలవులైనవి; దృశి దృశి=ప్రతి దృశా ప్రసారమునందును, శిశిరాభ్యామ్= శిశిర శిశిరములైనవియును, దివ్యలీలాzzకులాభ్యామ్=దివ్యలీలలతో ఆకులాz కులములును, అశరణ శరణాభ్యామ్=అశరణులకు (రక్షణలేని వారికి) శరణభూతములైనవియు, అద్భుతాభ్యాం=అద్భుతములైన, పదాభ్యామ్=అడుగులతో, అను=గమనలీలను అనుసరించి, కూజద్వేణుః=రవళించుచున్న మురళి గల, దేవః=ప్రకాశానందలక్షణుఁడైన స్వామి, అయమయమాయాతి=ఇడుగిడుగో! మెల్లగా వచ్చుచున్నాఁడు.

తాత్పర్యము :- త్రిభువన సారభూతములును, ప్రదీప్త భూషణాస్పదములును, ప్రతి ఉన్మేషమునందును శిశిర శిశిరములును, దివ్యలీలలతో ఆకులాకులములును, అశరణులకు శరణభూతములును, అద్భుతములునైన పదములతో - తన గమనలీలను అనుసరించి రవళించుచున్న మురళితో - ప్రకాశానందలక్షణుఁడైన స్వామి ఇడుగిడుగో! మంద గమనముతో వచ్చుచున్నాఁడు.

శ్లో. **సోzయం మునీంద్ర జన మానస తాపహారీ**
సోzయం మద వ్రజ వధూ వసనాపహారీ ।
సోzయం తృతీయ భువనేశ్వర దర్పహారీ
సోzయం మదీయ హృదయాంబురుహాపహారీ ॥ 81

అన్వయము :- మదీయ హృదయాంబురుహాపహారీ సోzయమ్=నా హృదయాంబురుహమును అపహరించిన ఆతఁడే ఇతఁడు!

అర్థము :- 'మునీంద్రజన మానసతాపహారీ' - మునీంద్రజనః=మునీంద్ర సంఘములయొక్క, మానసతాప=మానసతాపమును, హారీ=హరించునట్టి, సః=ఆతఁడే, అయమ్=ఈతఁడు. 'మదవ్రజవధూ వసనాపహారీ' - మద=మదశాలినులైన, వ్రజవధూః=వ్రజస్త్రీలయొక్క, వసన=చీరలను, అపహారీ=అపహరించిన, సః=ఆతఁడే,

అయమ్=ఈతఁడు. 'తృతీయ భువనేశ్వర దర్పహారీ' - తృతీయ భువన=పాతాళలోకమునకు - నాగలోకమునకు, ఈశ్వర=ప్రభువైన కాళియునియొక్క, దర్పహారీ=దర్పమును హరించిన సః=ఆతఁడే, అయమ్=ఈతఁడు. మదీయ హృదయాంబురుహాపహారీ=నా హృదయాంబురుహమును అపహరించిన, సః=ఆతఁడే, అయమ్=ఈతఁడు.

తాత్పర్యము :- మునిసంఘములయొక్క మానస తాపములను పోఁగొట్టునాతఁడే యీతఁడు. మదశాలినులైన వ్రజస్త్రీల చీరలను అపహరించిన ఆతఁడే యీతఁడు. నాగలోక ప్రభువైన కాళియుని దర్పమణఁచిన ఆతఁడే యీతఁడు. నా హృదయాంబురుహమును దొంగిలించిన ఆతఁడే యీతఁడు!

శ్లో. *సర్వజ్ఞత్వే చ మౌగ్ధ్యే చ, సార్వభౌమ మిదం మమ*
నిర్విశ న్నయనం తేజో, నిర్వాణపద మశ్నుతే ॥ 82

అన్వయము :- ఇదం తేజో నిర్విశత్ మమ నయనం నిర్వాణపద మశ్నుతే=ఈ వెలుఁగును అనుభవించుచున్న నా కన్ను నిర్వాణమును పొందుచున్నది.

అర్థము :- సర్వజ్ఞత్వేచ=సర్వజ్ఞభావమునందును, మౌగ్ధ్యేచ=అజ్ఞ భావమునందును - ముగ్ధ భావమునందును, సార్వభౌమం=సర్వభూమియందును విదితమైన, ఇదంతేజః=ఈ వెలుఁగును, నిర్విశత్=అనుభవించుచున్న, మమ నయనం=నాకన్ను, నిర్వాణ పదమ్=నిర్వాణ స్థితిని, అశ్నుతే=పొందుచున్నది.

తాత్పర్యము :- సర్వజ్ఞతాలక్షణము నందును, మౌగ్ధ్యలక్షణము నందును, సర్వభూమి యందును ప్రసిద్ధమైన ఈ వెలుఁగును అనుభవించుచున్న నా కన్ను నిర్వాణస్థితిని పొందుచున్నది.

శ్లో. *కృష్ణాన[8]మేతత్ పునరుక్తశోభమ్*
ఉష్ణేతరాంశో రుదయం ముఖేందోః ।
తృష్ణాంబురాశిం ద్విగుణీ కరోతి
కృష్ణాహ్వాయం కించన జీవితం మే ॥ 83

---

8 పుష్ణానమ్ (పాఠాంతరము)=చేయుచున్నదై

అన్వయము :- కృష్ణాz హ్వాయం కించన మే జీవితం తృష్ణాంబురాశిం ముఖేందో: ద్విగుణీకరోతి=కృష్ణుఁడను పేరుగల నా జీవితము తనముఖచంద్రుని వలన నా తృష్ణా సముద్రమును రెండింతలుగా ఉప్పొంగఁజేయుచున్నది.

అర్థము :- ఉష్ణేతరాంశో:=శీతాంశువు యొక్క, ఉదయం=ఆవిర్భావమును, పునరుక్త శోభం=పునరుక్తమైన శోభకలదానినిగా, కృష్ణానం=హింసించుచున్నదియై, కృష్ణాz హ్వాయం= కృష్ణాభిధానమైన, కించన జీవితమ్=ఒకానొక జీవితము, మే=నా యొక్క, తృష్ణాంబురాశిమ్= తృష్ణాసముద్రమును, ముఖేందో:=ముఖచంద్రుఁడు కారణముగా, ద్విగుణీ కరోతి=రెండింతలుగాఁజేయుచున్నది.

తాత్పర్యము :- (ఇట్టి దట్టిదని వర్ణింపనలవి కానిదై, నాకు ప్రాణతుల్యమై కనబడుచున్న ఈ కృష్ణాఖ్యతత్త్వము, చంద్రునికంటె ఇనుమడి కాంతి విశేషము గలిగి, మిక్కిలి ఆహ్లాదమును కలిగించు తనమొగము చేత, చూడ నువ్విళ్ళూరుచున్న నాపేరాసను మఱింత పెరుగఁజేసినదేకాని తీర్చినది కాదయ్యె.)

విశేషము :- ఈశ్లోకము ప్రక్షిప్తమువలె తోఁచుచున్నది.

శ్లో. *తదేత దాతామ్ర విలోచనశ్రీ*
సంభావితాశేష వినమ్ర వర్గమ్ ।
ముహు ర్మురారే ర్మధురాధరోష్ఠమ్
ముఖాంబుజం చుంబతి మానసం మే ॥ 84

అన్వయము :- మే మానసం మురారే: తదేతన్ముఖాంబుజం ముహు:చుంబతి=నా మానసము అట్టి యీ మురారి ముఖాంబుజమును మాటిమాటికిని ముద్దిడుకొనుచున్నది.

అర్థము :- ఆతామ్ర=ఈషదరుణములైన, విలోచన=కన్నుల యొక్క, శ్రీ=శోభచేత, సంభావిత=మన్నన చేయఁబడిన, అశేష=సమస్తమైన, వినమ్ర=ప్రణత జనము యొక్క, వర్గమ్=వర్గముగల, మురారే:=మురారియొక్క, మధురాధరోష్ఠమ్= మధురాధరోష్ఠముగల, ముఖాంబుజం=ముఖపద్మమును, మేమానసం=నా మనస్సు, ముహు:=మాటిమాటికిని, చుంబతి=స్పృశించుచున్నది.

తాత్పర్యము :- (కరుణాతిశయముచే ఎఱ్ఱని కడగంటి కాంతులు పొలయునట్లు ఆశ్రిత సమూహము నంతయుఁ గటాక్షించుచున్న కన్నుఁగవయు, చెలువైన క్రింది పెదవియుఁ గలిగి, అత్యంత మనోజ్ఞముగాఁ గనబడుచున్న యీ కృష్ణుని ముఖారవిందము యొక్క సొంపును నామనస్సు మాటిమాటికి అనుభవించు చున్నది).

శ్లో. *కరౌ శరదుదంచి తాంబుజ విలాస శిక్షాగురూ*
పదౌ విబుధ పాదప ప్రథమ పల్లవోల్లంఘినౌ ।
దృశౌ దళిత దుర్మద త్రిభువనోపమానశ్రియౌ
విలోకయ విలోచనామృత మహో మహచ్ఛైశవమ్ ॥ 85

అన్వయము :- విలోచనామృతం శైశవంమహః విలోకయ=విలోచనములకు అమృతమైన శైశవ తేజమును విలోకింపుము.

అర్థము :- కరౌ=చేతులు, శరత్=శరత్కాలమునందు, ఉదంచిత=ఉల్లసిల్లిన, అంబుజ విలాస=కమల విలాసములకు, శిక్షాగురూ=శిక్షాగురువులు; పదౌ=అడుగులు, విబుధ పాదప=కల్పవృక్షముయొక్క, ప్రథమ పల్లవ=తొలి చిగుళ్లను, ఉల్లంఘినౌ= దాఁటుకొనునవి; దృశౌ=కన్నులు, దళిత దుర్మద=అణఁచఁబడిన దుర్మదముగల, త్రిభువన=త్రిభవనములయందలి, ఉపమానశ్రియౌ=ఉపమానవస్తువులశోభ కలవి; అహో!=అహో, విలోచనామృతం=లోచనామృతమైన,శైశవం మహః=శిశువునకు సంబంధించిన వెలుఁగును, విలోకయ=విలోకింపుము!

తాత్పర్యము :- (శరదృతువునందు పొడమునట్టి తామరల చెలువములను మించునట్టి చేతులును, కల్పవృక్షముల తొలుచిగుళ్ళను మీఱునట్టి అడుగులును, ముల్లోకములందును గల ఉపమాన వస్తువుల ఒప్పిదములనెల్ల అతిశయించునట్టి కన్నులును గలిగి, కన్నులపండువై వింతలు గొలుపుచున్న శ్రీకృష్ణుని బాల్యమును చూడుమా!

శ్లో. *ఆచిన్వాన మహన్యహన్యహని సాకారాన్ విహారక్రమాన్*
ఆరుంధాన మరుంధతీ హృదయ మప్యార్ద్ర స్మితాస్యశ్రియా ।
ఆతన్వాన మనన్యజన్మ నయన శ్లాఘ్యా మనర్ఘ్యాం దశామ్
ఆమందం వ్రజసుందరీ స్తనతటీ సామ్రాజ్య ముజ్జృంభతే ॥ 86

(**అర్థము** :- అహని అహని అహని=ప్రతిదినమును, స+ఆకారాన్=ఆకారముతోఁ గూడిన వైన, విహార క్రమాన్=క్రీడాపద్ధతులను, ఆచిన్వానం=సంపాదించుచున్నదియు - అప్రాకృత స్వరూపమైన వస్తువైనను సౌలభ్యవశమున సకలజన మోహనములైన అయ్యోయాకారముల నొంది ఆయాక్రీడలను సలుపుచున్నది అనుట, 'ఆర్ద్ర స్మితాస్యశ్రియా' - ఆర్ద్ర=సరసమైన, స్మిత=చిఱునవ్వుగల, ఆస్య=నెమ్మొగము యొక్క, శ్రియా=సంపదచేత - చిఱునవ్వుదొలకు నెమ్మొగంపు సొంపుచేత అనుట, 'అరుంధతీ హృదయమపి' - అరుంధతీ=(పతివ్రతాశిరోమణియు వసిష్ఠుని భార్యయునై) అరుంధతి యొక్క, హృదయమపి=హృదయమును గూడ, ఆరుంధానమ్=కొంచెము అభిముఖముగాఁ జేసి కొనుచున్నదియు - అరుంధతిని గూడ కొంత తన్నువలచునట్లు చేయునది అనుట - ఇఁక తక్కిన వారిని వలపించుట చెప్పనేలయని ఆశయము; 'అనన్య జన్మ నయన శ్లాఘ్యామ్' - అనన్యజన్మ=మన్మథుని వంటి సౌందర్య శాలియుఁజూచి మెచ్చుకొనఁదగినట్టియు, కావుననే, అనర్ఘ్యం=వెలలేనిదియు - సాటిలేనిది అనుట, అగు, దశామ్=అవస్థను - స్థితిని - అత్యంత సౌందర్యము నెఱపునట్టి దశననుట, ఆతన్వానమ్=సాఁగించుచున్నదియు - మన్మథునికంటెను అత్యంత మోహకరమైన సౌందర్య విలాసములు పయిఁబయి నెఱుపుచున్నది అనుట, అగు, 'వ్రజ సుందరీ స్తన తటీ సామ్రాజ్యమ్' - వ్రజ సుందరీ=గొల్ల చెలువలయొక్క, స్తనతటీ=కుచ ప్రదేశములయొక్క సామ్రాజ్యమ్=సర్వధిపత్యము - ఇతి సామ్రాజ్యశబ్దములే సర్వోత్కృష్టవైభవమును భోగమును సూచితములు గావున - కుచముల యొక్క మహావైభవమును భోగమును అయినదనుట - కుచములకు మితిలేని ఉబ్బును సుఖాతి శయమును గలిగించునది అనుట - ఇట్టి కృష్ణాఖ్య వస్తువు, ఆమందం=ఒక్కంత మందమగునట్లుగా, ఉజ్జృంభతే=విజృంభించుచున్నది - కేవల 'స్తన' ముల యొక్క అనక - 'స్తన తటుల' యొక్క సామ్రాజ్యమనుటచే ఆలింగనముయొక్క గాఢత్వము వ్యంజితము. వస్తువో గోపస్త్రీ స్తనతటమునకు 'సామ్రాజ్య' నిరతిశయ భోగ విభవమును గూర్చునది - అట్టి వస్తువు ప్రొద్దున కొక రూపముతో చిన్నెలు వన్నెలు చూపుచు అరుంధతిని గూడ వలపించునట్టి ముద్దునగుమొగము గలిగియున్నది. కావుననే వ్రజసుందరీ స్తనతటులకు సామాన్య సుఖప్రదమైనది కాక 'సామ్రాజ్య' మే అయ్యున్నదని అర్థము. అనఁగా ప్రొద్దు ప్రొద్దునకు వింతల గులుకు రూపును, వన్నెలు గులుకు లీలలును, చిఱునవ్వు దొలఁకు మొగమును, మన్మథుని కంటె మించిన మోహనత్వమును, జూచి గొల్ల చెలువలు చన్నుగుబ్బలుప్పొంగ బిగ్గఁ గౌగిలించుకొని నిర్భరానందరసమగ్నలగుదురని భావము.

తాత్పర్యము :- అప్రాకృత స్వరూపమైన వస్తువు అయినను, ప్రతిదినమును వింతలు గులుకు ఆకారములను దాల్చి, చిన్నెలు వన్నెలు నెఱపుచు, అరుంధతిని గూడ ఒకింత మోహము గొలుపునట్టి చిఱునవ్వుతోడి మొగము సొంపుతో, మన్మథుఁడు చూచి మెచ్చుకొనునట్టి మోహన దశగలిగి, గోపస్త్రీలుచొక్కి చన్ను గుబ్బలు బిగ్గనొత్తి కౌఁగిలించుకొని ఆనంద విభవ మనుభవించు కృష్ణాఖ్యవస్తువు నాయెడ నల్లల్లఁబ్రకాశించుచున్నది).

ఇదియును ప్రక్షిప్తము వలెనే యున్నది.

శ్లో. *సముచ్ఛ్వసిత[9]యౌవనం తరళశైశవాలంకృతం*
మదచ్ఛురితలోచనం మదన ముగ్ధ హాసామృతమ్ ।
ప్రతిక్షణ విలోభనం ప్రణయ పీత వంశీముఖం
జగత్త్రయ విమోహనం జయతి మామకం జీవితమ్ ॥ 87

అన్వయము :- జగత్త్రయ విమోహనం మామకం జీవితం జయతి= త్రిజగన్మోహనమైన నా జీవితము సర్వోత్కర్షతో వర్తించుచున్నది.

అర్థము :- సముచ్ఛ్వసిత యౌవనం=ఊపిరి అందుకొనిన యౌవనము కలది, తరళ శైశవాలంకృతమ్-తరళ=చాంచల్యలక్షణములకల, శైశవ=పసితనముచేత, అలంకృతమ్= అలంకరింపఁబడినది, మదచ్ఛురిత లోచనమ్-మద=నవయౌవన లక్షణమైన మదముచేత, చ్ఛురిత=వ్యాప్తములైన, లోచనం=కన్నులు గలది, మదన ముగ్ధ హాసామృతమ్- మదన=శృంగారభావము చేత, ముగ్ధ=రమణీయమైన, హాసామృతమ్ - నవ్వువెన్నెలకలది, ప్రతిక్షణ=ప్రతిక్షణము, విలోభనం=మభ్యపెట్టునది, ప్రణయ=ప్రేమతో, పీత= ఆస్వాదింపఁబడిన, వంశీ=వంశియొక్క, ముఖం=ఆననము కలది, జగత్త్రయ= భూర్భువఃస్వర్ లోకములను, విమోహనం=విమోహింపఁజేయునట్టి, మామకమ్= నాయదియైన, జీవితమ్=జీవితము, జయతి=సర్వోత్కర్ష చేత వర్తించుచున్నది.

తాత్పర్యము :- వికసించిన ప్రథమ యౌవనము కలదియును, శైశవ చాపల్యము వీడనిదియును, శృంగారభావ రమణీయమైన వెన్నెలవంటి నవ్వు కలదియును, ప్రతిక్షణ నూత్న నూత్నమును, ప్రణయాస్వాదిత వంశీ ముఖమును, జగత్త్రయ విమోహనమైన నా జీవితము సర్వాతిశాయియై వర్తించుచున్నది.

---

9 'తదుచ్ఛ్వసిత' (పాఠాంతరము) - తత్=ఆ కృష్ణ తత్త్వము, ఉచ్ఛ్వసిత=కొలదిగా వికసించిన

శ్లో. *చిత్రం తదేత చ్చరణారవిందం*
చిత్రం తదేత న్నయనారవిందమ్ ।
చిత్రం తదేత ద్వదనారవిందం
చిత్రం తదేత త్పునరంబ! [10] చిత్రమ్ ॥ 88

ఏ చరణమునకు ఆ చరణమే అన్వయము. ఆ ప్రతిక్షణ విలోభనమునకు కారణమైన నవనవత్వమునే వర్ణించుచున్నాఁడు.

అర్థము :- తత్=ఆ, ఏతత్=ఈ, చరణారవిందం=చరణ పద్మమే, చిత్రమ్=క్రొత్తది, తత్=ఆ, ఏతత్=ఈ, నయనారవిందమ్= నయనారవిందమే, చిత్రమ్=క్రొత్తది, తత్=ఆ, ఏతత్=ఈ, వదనారవిందం=వదనారవిందమే, చిత్రమ్=క్రొత్తది. అంబ!=అమ్మా, తత్=ఆ, ఏతత్ సర్వమ్=ఇది అంతయును, చిత్రమ్=క్రొత్తది, పునః=మఱియు, చిత్రమ్=ఆశ్చర్యమైనది.

తాత్పర్యము :- క్రిందటి క్షణములో చూచిన ఆ అడుగుఁదామరయే ఈ క్షణములో క్రొత్తగా కనిపించుచున్నది. క్రిందటి క్షణములో చూచిన ఆ నయనారవిందమే ఈ క్షణములో క్రొత్తగా కనిపించుచున్నది. క్రిందటి క్షణములో చూచిన ఆ వదనారవిందమే ఈ క్షణములో క్రొత్తదిగా కనిపించుచున్నది. మఱల ఇవి అన్నియును క్రొత్తవిగా మిక్కిలి ఆశ్చర్యమైనవిగా కనిపించుచున్నవి.

వివరణము :- స్వానుభవ గోచరమగుచున్న ఆ రమణీయతా లక్షణము లీలాశుకుని అనుభవము ఆధారముగా లీలగా మనకు గోచరమగుచున్నది. అందఱము 'రమణీయత' 'రమణీయత' అని ఘోషించుచుందుము. వాస్తవమునకు దాని అనుభవము మనకు తెలియదు. లీలా శుకుఁడు దానిని అనుభవించి చెప్పుచున్నాఁడు. అనుభవమును చెప్పుటకు మాటలుండవు. అది మూఁగవానికి వచ్చిన స్వప్నమువంటిది.

"చిత్రం తదేతత్" "చిత్రం తదేతత్" "చిత్రం తదేతత్" అని అన్నమాటలే అనుచున్నట్లున్నది. మాటలవియేకాని అనుభవము మాత్రము ప్రతి క్షణములోను సరిక్రొత్తది.

"క్షణే క్షణే యన్నవతా ముపైతి
తదేవ రూపం రమణీయతా యాః"॥

---

10 వపురస్య (పాఠాంతరము) - అస్య=ఈ కృష్ణునియొక్క, వపుః=శరీరము

సౌందర్యము బ్రహ్మపదార్థము వలెనే స్వానుభవైక గోచరమగుటయేకాదు - అది స్వానుభవైక ప్రమాణముకూడ.

శ్లో. ***అఖిల భువనైక భూషణ***
మధి భూషిత జలధి దుహితృ కుచకుంభమ్ ।
వ్రజయువతీ హారావళి
మరకత నాయక మహామణిం వందే ॥ 89

అన్వయము :- వ్రజయవతీ హారావళి మరకత నాయక మహామణిం వందే= వ్రజయువతీ హారయష్టికి నాయకమైన మరకత మహామణికి నమస్కరించుచున్నాను.

అర్థము :- "అఖిల భువనైక భూషణమ్" - అఖిల భువన=భువనము లన్నింటికిని గలిపి, ఏకభూషణం=ఒకేఒక భూషణమైన వానిని, అధిభూషిత=అధిష్ఠించి భూషింపఁబడిన, జలధి దుహితృ=సముద్ర దుహితయొక్క కుచ కుంభమ్=కుచ కుంభములు గలవానిని - వ్రజయువతీ=వ్రజాంగనా రూపమైన, హారావళి=హారయష్టియొక్క, మరకత=మరకత స్వరూపమైన నాయక=నాయకస్థాన స్థితమైన, మహామణిమ్=మరకత మహామణిని, వందే=నమస్కరించున్నాను.

తాత్పర్యము :- భువనములన్నింటికిని కలిపి ఒకే ఒక భూషణమైన వానిని, తాను అధిష్ఠించుట చేత విభూషితమైన సముద్ర దుహితయొక్క కుచకుంభయుగళి గలవానిని, వలయాకారముగా నిలిచిన వ్రజయువతీ మయమైన మహాహారమునకు నాయకస్థాన స్థితమైన మరకతమహామణికి నమస్కరించుచున్నాను.

శ్లో. ***కాంతా కచగ్రహణ[11]విగ్రహబద్ధ లక్ష్మీ***
ఖండాంగ రాగ రసరంజిత మంజుల శ్రీ ।
గండస్థలీ ముకుర మండల ఖేలమాన
ఘర్మాంకురం కిమపి ఖేలతి కృష్ణతేజః ॥ 90

అన్వయము :- కిమపి కృష్ణ తేజః ఖేలతి=అనిర్వచనీయమైన శ్రీకృష్ణతేజము ఖేలనము చేయుచున్నది. అది ఎట్టిదన్నచో -

---

11 'కుచగ్రహణ' (పాఠాంతము) = స్తనములను పట్టుకొనుటచేత కలిగిన

అర్థము :- కాంతా=ప్రియురాలియొక్క, కచగ్రహణ విగ్రహ=కేశగ్రహణ రూపమైన యుద్ధమునందు - (కేశాకేశి యందు) బద్ధ=ఆలింగన బద్ధురాలైన, లక్ష్మీ=సాగర దుహిత యొక్క, 'ఖండాంగ రాగరస' - ఖండ=శ్రీఖండమయమైన, అంగరాగ=కలపముయొక్క, రస=ద్రవముచేత, రంజిత=పూఁతపెట్టఁబడి, మంజుల శ్రీ=మంజుల శోభ కలదియును, 'గండస్థలీ ముకుర మండల ఖేల మాన ఘర్మాంకురమ్' - గండస్థలీ=కపోల ఫలకములే అనెడి, ముకురమండల=ఆదర్శ బింబములయందు - మెఱుఁగుటద్దములయందు, ఖేలమాన =నీడలాఱుచున్న, ఘర్మాంకురం=సాత్త్విక స్వేదజల లవములు గల, కిమపి=అనిర్వచనీయ మాధుర్యముగల, కృష్ణతేజః=నీలవర్ణమైన వెలుఁగు, ఖేలతి=ఖేలనము చేయుచున్నది.

తాత్పర్యము :- ప్రేయసీ ధమ్మిల్లమును ఒడిసిపట్టుట - అను లక్షణముగల ఎక్కటి పోరునందు (ద్వంద్వయుద్ధమునందు) అక్కున బంధింపబఁడిన శ్రీదేవియొక్క శ్రీ ఖండాంగరాగ రసముచేత - (శ్రీచందనద్రవము కలిపి సమకూర్చిన కలపము) మంజులమైన నీల దేహశోభకలదియై ఆమె చెక్కుటద్దములలో నీడలాఱుచున్న సాత్త్విక స్వేద మౌక్తికములు జాఱుచున్న - ఒకానొక - నీలివెన్నెల ఖేలనము చేయుచున్నది.

శ్లో ॥ **మధురం మధురం వపు రస్య విభోః**
మధురం మధురం వదనం మధురమ్ ।
మధుగంధి మృదుస్మిత మేత దహో!
మధురం మధురం మధురం మధురమ్ ॥ *91*

అన్వయము :- (అస్య విభోః వపుః వదనం మృదుస్మితమ్ అతిమధురమ్=అహో! ఈ ప్రభువుయొక్క శరీరము, మొగము, చిఱునవ్వు అతిమధురములు - ఆశ్చర్యము)

అర్థము :- అస్య=ఏవం విధ దశాగతుఁడైన, విభోః=సర్వగతుఁడై లీలా పరిగృహీత విగ్రహుఁడైన స్వామియొక్క, వపుః=నెమ్మేను, మధరం మధురం=మధురము మధురము; వదనమ్=ఆననము, మధురం మధురం మధురం=మధురము, మధుర మధురము; అహో!=ఆహా!, ఏతత్=ఈ, మృదుస్మితం=లేఁతనవ్వు, మధుగంధి=మధుగంధముకలది! మధురం మధురం మధురం మధురం=సర్వమధురము.

తాత్పర్యము :-(ఈ విధమైన శ్రీకృష్ణు స్వామియొక్క శరీరము మిక్కిలి మధురమైనది - సుందరమైనది. ముఖము ఇంకను మధురమైనది. పూఁదేనె వాసనతో కూడిన చిఱునవ్వు అంతకంటె మధురమైనది. ఆహా! అంతయు మధురమే!)

శ్లో. *శృంగార రస సర్వస్వం, శిఖిపింఛ విభూషణమ్ ।*
అంగీకృత నరాకారం, ఆశ్రయే భువనాశ్రయమ్ ॥ 92

అన్వయము :- భువనాశ్రయం ఆశ్రయే=సకల భువనములకు ఆశ్రయమైన వానిని ఆశ్రయించుచున్నాను.

అర్థము :- శృంగార రస సర్వస్వం=శృంగార రసముయొక్క సర్వస్వభూతుని, శిఖిపించ విభూషణమ్=మయూర బర్హము విశేషభూషణముగా కలవానిని, భువనాశ్రయమ్=సకల భువనములకు ఆశ్రయభూతుని, అంగీకృత నరాకారమ్=స్వీకరింపఁబడిన మానవాకారము గలవానిని, ఆశ్రయే=ఆశ్రయించుచున్నాను.

తాత్పర్యము :- "శృంగార ఏవ మధుర: పర: ప్రహ్లాదనో రస:" అని ఆనందవర్ధనులు. 'శృంగం ఇయర్తి ఇతి శృంగార:' శృంగమును - శిఖరమును ఆరోహించుచున్నది కనుక శృంగారము. సార్వభౌమమయిన అట్టి శృంగార రసమునకు (ఆలంబన విభావమగుట వలన) సర్వస్వభూతుఁడు స్వామి! ఆ స్వామి యొక్క మాయాగుణజాల కర్బుర సకల జగన్నిర్మాణ వైచిత్ర్య నిస్సీమ ఖ్యాతికి ప్రతీక - మయూర బర్హము! ఆ ఖ్యాతిని శిఖిపింఛవ్యాజముతో స్వామి శిరసావహించుచున్నాఁడు! సచ్చిదానంద స్వరూపమైన వస్తువు సకల భువనావనార్థమై లీలా మానవాకారమును స్వీకరించినది. అట్టి ఆకారమును ఆశ్రయించుచున్నాను.

శ్లో. *నా ద్యాపి పశ్యతి కదాచన దర్శనేన*
చిత్తేన చో పనిషదా సుదృశాం సహస్రమ్ ।
సత్వం చిరం నయనయో రనయో: పదవ్యాం
స్వామిన్ కయాను[12]కృపయా మమ సన్నిధత్సే! ॥ 93

అన్వయము :- స్వామిన్! అనయో: నయనయో: పదవ్యాం కయానుకృపయా మమ సన్నిధత్సే?=స్వామీ! ఈ నా చర్మచక్షువులకు ఎట్టి కృపతో సన్నిధిని అనుగ్రహించుచున్నావు?

అర్థము :- సుదృశాం సహస్రమ్=సుదర్శనులైన మనీషుల సహస్రము, దర్శనేన=సాంఖ్యాది దర్శనము చేత, చిత్తేన=చిత్తవృత్తి నిరోధరూపమైన యోగముచేత,

---

12 కదాను (పాఠాంతరము) = ఎప్పుడు

ఉపనిషదాచ=ఔపనిషదమైన జ్ఞానముచేత, కదాచన=ఒకప్పుడైనను, అద్యాపి=ఇప్పటికిని, నపశ్యతి=చూచుటలేదు. సత్వమ్=అట్టినీవు, నయనయో రనయోః=ఈచర్మచక్షువులయొక్క, పదవ్యామ్=మార్గమునందు, చిరం=చాలసేపు, కయాను=ఏవిధమైన, కృపయా=కృపతో, స్వామిన్=స్వామీ! సన్నిధత్సే=సన్నిధిని అనుగ్రహించుచున్నావు?

తాత్పర్యము :- సుదర్శనులైన మనీషి సహస్రములు సాంఖ్యదర్శనముచేత, చిత్త వృత్తి నిరోధరూపమైన యోగముచేత, ఔపనిషదమైన జ్ఞానముచేత - ఒకప్పుడైనను, నేటివఱకును,జూడఁజాలని - అట్టి నీవు ఈ నా చర్మచక్షుస్సుల త్రోవలో స్వామీ! ఎట్టి కృపచేత సన్నిధిని అనుగ్రహించుచున్నావు?

శ్లో. *కేయం కాంతిః కేశవ! త్వన్ముఖేందోః*
కోzయంవేషః కోzపి వాచా మభూమిః ।
సేzయం సోzయం స్వాదుతా మంజులశ్రీః
భూయో భూయో భూయశ స్త్వాం నమామి ॥ 94

అన్వయము :- భూయశస్త్వాం నమామి=అనేక పర్యాయములు నీకు నమస్కరించుచున్నాను.

అర్థము :- కేశవ!=ఓ కేశవా!, త్వన్ముఖేందోః=నీ ముఖచంద్రుని యొక్క, ఇయం కాంతిః=ఈ విధమైన కాంతి, కా?=ఏమి?, వాచామభూమిః=వాక్కులకుఁజేరరానిz కోzప్యయం వేషః=ఒకానొక - ఈ వేషము, కః=ఏమి, (సా+ఇయమ్) సేయం=ఆ యీ కాంతి, సోzయం=ఆ యీ వేషము, స్వాదుతా మంజుల శ్రీః=స్వాదుతా మంజులమైన వైభవము కలది, భూయో భూయః=మఱల మఱల, త్వాం=నిన్ను, భూయశః=పలుసారులుగా, నమామి=నమస్కరించుచున్నాను.

తాత్పర్యము :- ఓ కేశవా! నీ ముఖచంద్రుని ఈ కాంతియేమి? పలుకులకుఁ జేరరాని అపూర్వమైన యీ నీ వేషమేమి? ఆ కాంతి, ఈ వేషము, స్వాదుతామంజులమైన వైభవము కలవి. మఱల మఱల పలుసారులుగా నీకు నమస్కరించుచున్నాను.

శ్లో. *వదనేందు వినిర్జితశ్శశీ,*
దశధా దేవ! పదం ప్రపద్యతే ।

అధికాం శ్రియ మశ్నుతేతరాం
తవ కారుణ్య విజృంభితం కియత్! ॥ 95

అన్వయము :- కియత్ తవ కారుణ్య విజృంభితమ్!=నీ కారుణ్య విజృంజణము ఎంతటిది!

అర్థము :- దేవ!=ఓ ప్రకాశానందలక్షణుఁడా!, వదనేందు వినిర్జిత: =నీముఖచంద్రుని చేత ఓడింపఁబడిన వాఁడై, శశీ=చంద్రుఁడు, దశధా=పదివిధములుగా, తే=నీయొక్క, వదమ్=చరణమును, ప్రపద్య=ప్రపన్నుడై, అధికాంశ్రియం=పూర్వాధిక కాంతిని, అశ్నుతే తరామ్=సమృద్ధిగా పొందుచున్నాఁడు, తవ=నీయొక్క, కారుణ్య విజృంభితమ్=కారుణ్య విజృంభణము, కియత్=ఎంతటిది!

తాత్పర్యము :- దేవా! నీముఖచంద్రుని చేత వినిర్జితుఁడై చంద్రుఁడు పది విధములుగా (గోళ్లుగా) నీచరణమును ఆశ్రయించి పూర్వాధిక్యమైన శోభను పొందుచున్నాఁడు. నీ కారుణ్య విజృంభణము ఎంతటిదో!

✿శ్లో. తత్ త్వన్ముఖం కథమి వాబ్జ సమాన కక్షం
వాఙ్మాధురీ బహుళ పర్వకళా సమృద్ధమ్ ।
తత్ కిం బ్రువే కి మపరం భువనైక కాంతం
యస్య త్వదానన సమా సుషమా సదాస్యాత్ ॥ 96

(అర్థము :- 'వాఙ్మాధురీ....సమృద్ధమ్' - వాక్+మాధురీ=వాక్కులయొక్క తీయందనమను, బహుళ=అత్యంతమైన, వర్వ=ఉత్సవముగల-మిక్కిలి నేత్రోత్సవముగలిగించు, కళా=కళలచేత - రేఖల చేత, సమృద్ధం=నిండినదైన; తత్=ప్రసిద్ధమైన, త్వత్ముఖమ్=నీయొక్క మొగము, 'అబ్జసమానకక్షం' - అబ్జ=చంద్రుని తోడ, సమాన=సమమైన, కక్షం=కోటిగలది - చంద్రుని తోడి సామ్యమునుజెప్పఁదగినది, కథమివ=ఎట్లుగా - చంద్రునిని దీనిని సామ్యమునందు ఒక్కటిగా చేయరాదనుట - నీ

✿96, 97 శ్లోకములు లీలాశుకుడు రచించినవి కావని శ్రీ మల్లపల్లి శరభయ్యగారి అభిప్రాయము. వీనికి ఆయన వ్యాఖ్య వ్రాయలేదు. అందువలన ఈ రెండు శ్లోకములకును తంజవగరము తేవప్పెరుమాళ్ళయ్యగారి టీకాతాత్పర్యముల నువయోగించితిని - సంపాదకుడు.

ముఖము బహుళ పర్వకళా సమృద్ధమైనది అనఁగా అత్యంత నేత్రోత్సవము గలిగించు సౌందర్యరేఖలచే నిండాలినది. చంద్రుఁడో బహుళ పర్వకళా సమృద్ధుఁడు గాఁడు - అనఁగా, బహుళ పర్వ=బహుళ పక్షమునందలి పర్వదినములగు అష్టమి అమావాస్యలయందు, కళా=కళలచేత, సమృద్ధం=నిండినవాఁడు, కాఁడు - అనగా కళలు తగ్గియుండుననుట, బహుళ పర్వ కళా సమృద్ధమైన నీముఖమును బహుళ పర్వ కళా సమృద్ధుడుకాని చంద్రునితో సామ్యమునకు తేరాదని శ్లేషమహిమచే ముఖము చంద్రుని అతిశయించిన దగుట తెలుపబడినది. తత్=కాఁబట్టి, చంద్రుఁడు నీ మొగమునకు తక్కువయే యైనవాఁడు గావున,కిం=ఏమి, బ్రువే=చెప్పుదును!, యస్య=దేనికి, త్వదానన సమా - త్వత్=నీయొక్క, ఆనన=మొగము తోడ, సమా=సమానమైన - నీ ముఖ కాంతితోడ సమానమైన, సుషమా=ఉత్కృష్ట కాంతి, సదా=ఎప్పుడును, స్యాత్=అగునో, అట్టి, 'భువనైక కాంతం' - భువన=లోకములందు, ఏక=ముఖ్యమైన, కాంతం=మనోజ్ఞ వస్తువైనది, అపరం=మఱియొక, కిం=ఏది? - నీ ముఖమువలెనే సర్వకాలములందును జగదేక మనోహరముగా నుండు వస్తువు మఱొకటి లేదనుట. నీ ముఖముతో సమానముగా ఎన్నఁబడు చంద్రునికో ఎల్లప్పుడును కాంతి కలుగదు. నీ ముఖమువలెనే చెప్పుడును అత్యంత కాంతిని కలిగియుండు వస్తువు మఱి వేఱేదియుఁగానరాదు. కాన ఏమి చప్పుదునని ఆశయము.

తాత్పర్యము :- బహుళ పర్వకళా సమృద్ధుఁడు కాని చంద్రునితో బహుళ పర్వకళా సమృద్ధమైన నీముఖమును సామ్యమున నొకటిఁగా జేయరాదు. మఱి నీమొగమువలె ఎల్లప్పుడును ఉత్కృష్టకాంతి గలదై జగదేక మనోజ్ఞముగా నుండునది మఱేవస్తువును గానరాదు. ఏమని చెప్పుదును!)

ఈ శ్లోకము లీలాశుకునిది కాదు.

శ్లో. శుశ్రూషసే యది వచః శృణు మామకీనం[13]
పూర్వై రపూర్వకవిభి ర్న కటాక్షితం యత్ ।
నీరాజన క్రమ ధురం భవదాననేందోః
నిర్వ్యాజ మర్హతి చిరాయ శశిప్రదీపః ॥ 97

13 'శుశ్రూషసే శృణు యది ప్రణిధాన పూర్వం' (పాఠాంతరము) యది శుశ్రూషసే=వినదలచివచో, ప్రణిధాన పూర్వమ్=సావధానముగ, శ్రుణు=వినుము.

(**అర్థము** :- శుశ్రూషసేయది=వినుటకు ఇచ్చగించితివేని, పూర్వైః=తొల్లిటి వారయిన, అపూర్వకవిభిః - అపూర్వ=సాటిలేని - అద్భుత చమత్కార ప్రబంధములు చెప్పుటచే ఎనలేని వారగు, కవిభిః=కవులచేత, యత్=ఏది, న కటాక్షితం=గమనింపఁబడలేదో - చెప్పఁబడలేదో, మామకీనం=నా సంబంధమైన, (తత్=ఆ) వచః=వాక్యమును, శ్రుణు=వినుము - మహాకవితా చమత్కారులగు పూర్వకవులు గూడ చెప్పని ఒకమాట చెప్పెదను వినుము అనుట, 'శశిప్రదీపః' - శశి=చంద్రుఁడనెడి, ప్రదీపః=దీపము, భవత్+ఆనన+ఇందోః=నీయొక్క ముఖచంద్రునియొక్క, నీరాజన క్రమధురం' - నీరాజన=నీవాళియొక్క, క్రమ=విధియొక్క, ధురం=భారమును - నీ ముఖచంద్రునికి నివ్వాళిగా నుండవలయుననుటను, నిర్వ్యాం=నిరుపాధికముగా, అర్హతి=తగుచున్నది - అట్లు ఉండుటకు అర్హమగుచున్నది. లోకోత్తర సౌందర్యాదులుగల వస్తువులకుఁగలుగు దృష్టిదోషమును వానికి సజాతీయములై సౌందర్యాదులందు వానికంటె తక్కువయగు వస్తువులచేత పరిహరించుట లోకసిద్ధము. ఇట శ్రీకృష్ణుని యొక్క ముఖ చంద్రునికిఁగలుగు దృష్టి దోషమును తత్సజాతీయమై దానికంటె తక్కువ శోభ కలిగియుండు చంద్రునిచేతనే పరిహరింపఁదగునని ఆశయము. మఱియు దీపాదుల నారతి యెత్తుట చేతను దృష్టి దోషము పరిహృత మగుచున్నదిగాన ఆ చంద్రునే దీపముగా రూపించి కృష్ణుముఖచంద్రునికి నివాళియొనర్పఁదగునని చెప్పఁబడియె. మఱియు శశి నివాళియగుట 'ధురం అర్హతి' అనుటచే ఆవశ్యకమనియు, 'నిర్వ్యాజమ్' అనుటచే నెపము నెదురుచూడక తనంతటనే జరుగఁదగుననియు సూచితము లగుచున్నవి. పూర్వశ్లోకమునందు చంద్రుఁడు నఖములనెడి నెపముచే ఆశ్రయించినాఁడు గాని తనంతఁగల రూపున ఆశ్రయింపలేదు. ఇందు ఎట్టి నెపములు లేక చంద్రుడు తనంతనే కలరూపున నీరాజనము కావలయునని 'నిర్వ్యాజ' శబ్దసారస్యము. శ్రీకృష్ణుని ముఖచంద్రుఁడు చంద్రుని అతిశయించిన వాఁడని ఫలితార్థము.

తాత్పర్యము :- కృష్ణా! కవితా చమత్కృతియందు అపూర్వులైన తొల్లిటి వ్యాసవాల్మీకాది మహాకవులును పలుకని ఒకమాట నేను సాహసించి చెప్పెదను. దానిని విన నిచ్చగించితివేని వినుము. చంద్రుని ఆరతి పళ్ళెరంబున దీపముగా నుంచుకొని నీ ముఖచంద్రునికి నివాళి యొనర్పఁదగును.)

ఊహ క్రొత్తదే; కాని యిది లీలాశుకవాణి కాదు.

శ్లో. ***అఖండ నిర్వాణ రసప్రవాహైః***
విఖండితాశేష రసాంతరాణి ।

అయంత్రితోద్వాంత సుధార్ణవాని
జయంతి శీతాని తవ స్మితాని ॥ 98

అన్వయము :- శీతాని తవ స్మితాని జయంతి =చల్లని నీ నవ్వులకు జయవాదములు

అర్థము :- అఖండ నిర్వాణ రస ప్రవాహైః=పరిపూర్ణానంద రసప్రవాహములచేత, విఖండితాశేష రసాంతరాణి=విఖండితములైన సకలములైన యితర రసములు కలవై, అయంత్రితోద్వాంత సుధార్ణవాని=ఏతాము లెత్తకయే సుధా సముద్రములను ఎత్తి పోసిన - శీతాని=చల్లని, తే స్మితాని=నీ నవ్వులు, జయంతి=సర్వాతిశాయులై వెలుఁగొందుచున్నవి.

(**తాత్పర్యము** :- నిరతిశయ సుఖరసప్రవాహములను ఎడతెగక కూర్చుచు, నితర రసముల నడంచి, విచ్చలవిడిగా నింతింతని కొలదియిడరాని అమృతము లొలుకుచుఁజల్లనై యుల్లసిల్లు నీ చిఱునగవులు పెంపు సొంపారుచున్నవి.)

శ్లో. *కామం సంతు సహస్రశః కతిపయే సారస్య ధౌరేయకాః*
కామం వా కమనీయతా పరిణతి స్వారాజ్య బద్ధవ్రతాః ।
నైవేతైర్వివదామహే నచ వయం దేవ! ప్రియం బ్రూమహే
యత్సత్యం రమణీయతా పరిణతి స్త్వయ్యేవ పారంగతా ॥ 99

అన్వయము :- త్వయ్యేవ రమణీయతా పరిణతిః పారంగతేతి యత్సత్యం. దేవ! నవయం ప్రియంబ్రూమహే=స్వామీ! ఒక్క నీయందు మాత్రమే రమణీయతాపరిణతి పారమును ముట్టినదను మాట సత్యము. మేము ముఖప్రియములాడెడి వారము కాము.

అర్థము :- కామం సన్తు సహస్రశః=వేలకొలది (దేవతలు) ఉందురుగాక! సారస్య ధౌరేయకాః=సారస్య ధురంధరులు, కతిపయే=కొందఱు మాత్రమే; 'కమనీయతా పరిణతి స్వారాజ్య బద్ధవ్రతాః కామం వాసంతు!'=కమనీయతయొక్క పరిణతి అనెడి స్వర్గరాజ్యమునందు పట్టబద్ధులును కొందఱుందురుగాక! ఏతైః=వీరితో, నైవ వివదామహే=వాదు కొననే కొనము; చ=మఱియును, నవయం ప్రియం బ్రూ మహే=మేము ముఖప్రియములు పలుకువారమునుగాము, దేవా!=ప్రకాశానందమయుఁడా! సత్యంయత్=సత్యమేమనఁగా, రమణీయతా పరిణతిః=రమణీయత యొక్క పరిణతి, త్వయ్యేవ=ఒక్కనియందు మాత్రమే, పారంగతా=పారము ముట్టినది.

తాత్పర్యము :- వేలకొలఁది దేవతలుండనిమ్ము! సౌందర్య ధురంధరులు కొందఱే; కమనీయతాపరిణతి స్వర్గ పట్టబద్ధులును కొందఱుందురుగాక! వారితో మాకు వివాదము లేనేలేదు. స్వామీ!ముఖప్రియములు పలుకు వారముకాము. వాస్తవము - ఏమనఁగా - రమణీయతా పరిణతి - ఒక్క నీయందు మాత్రమే పారముముట్టినది.

శ్లో. *మందారమూలే మదనాభిరామం*
బింబాధరా పూరిత వేణు నాదమ్ ।
గో గోప గోపీజన మధ్యసంస్థం
గోపం భజే గోకుల పూర్ణ చంద్రమ్ ॥ 100

అన్వయము :- గోపం భజే గోకుల పూర్ణచంద్రమ్=గోబృంద నక్షత్ర గణమధ్యమునందు పూర్ణచంద్రుడైన గోపాలబాలుని భజింతును.

అర్థము :- మందార మూలే=మందార వృక్షముక్రింద, మదనాభిరామం=మదనాభి రాముఁడయి, బింబాధరా పూరిత వేణునాదమ్=బింబఫలమువంటి వాతెఱతో నింపిన వేణునాదముకల, గోగోపగోపీజన మధ్యసంస్థమ్=గోవులు, గోపబాలకులు, గోపికలమధ్యనున్న, గోకుల పూర్ణచంద్రమ్=గోకులమునకు పున్నమ చందమామయైన, గోపం=గోపబాలకుని, భజే=సేవించుచున్నాను.

తాత్పర్యము :- మందార వృక్షము క్రింద మదనాభి రాముఁడయి బింబాధరముతో వేణునాదమును నింపుచు - ఆవులమధ్య, గొల్లపిల్లలమధ్య, గోపికల మధ్య నిలిచిన, గోకులమునకు పున్నమచందమామయైన గోపాల బాలకుని భజించెదను.

శ్లో. *గళద్వ్రీడా లోలా మదన వనితా గోపవనితా*
మధుస్ఫీతం గీతం కిమపి మధురా చాపలధురా ।
సముజ్జృంభా గుంభా మధురిమ కిరాం మాదృశ గిరాం
త్వయి స్థానే జాతే దధతి చపలం జన్మ చ ఫలమ్ ॥ 101

అన్వయము :- త్వయి స్థానే జాతేసతి గోపవనితా, గీతం, చాపలధురా, మాదృశ గిరాం గుంభా, చపలం జన్మచ, ఫలం దధతి=నిన్నాశ్రయించి గోపవనిత యును, గీతమును, చాపలమును, నావంటివాని కవితానిగుంభనమును, అశాశ్వతమైన జన్మముకూడ సఫలములగుచున్నవి.

అర్థము :- త్వయి స్థానే జాతే సతి= నీవు స్థానమవైనంతనే, గళద్వ్రీడా=జారుచున్న సిగ్గు గలదియై, లోలా=పురుషాసక్తిగల, గోపవనితా=వ్రేతకూడ, మదన వనితా=రతిదేవి వంటిదై, గీతం=పాట, మధుస్పీతం -మధు=తేనెతో (మాధుర్యముతో), స్పీతం=విస్తరించినదై, చాపలధురా=చపల స్వభావాతిశయము కూడ, కిమపి మధురా=అవ్యాజ మధురమై, మధురిమ కిరాం=తీయదనమును వెదచల్లుచున్న, మాదృశ గిరాం గుంభా=నావంటి వాని మాటల కూర్పు, సముజ్జృంభా=రససముజ్జృంభము కలదై, చపలం=క్షణభంగుంమైన, జన్మచ=జీవితము గూడ, ఫలం=సాఫల్యమును, దధతి=ధరించుచున్నవి.

తాత్పర్యము :- నీవు స్థానమవైనంతనే జాఱిన సిగ్గుతో - లోల స్వభావముగల గోపవనిత కూడ మదనవనితయై, గీతము మధుస్పీతమై, చాపలము నిర్వ్యాజమధురమై, నా బోటివాని పలుకుల కూర్పు మాధుర్యమును వెదఁచల్లు నముజ్జృంభముకలదియై క్షణ భంగురమైన జీవితము కూడ శాశ్వత ఫలమును ధరించుచున్నది.

శ్లో: *భవనం భువనం[14] విలాసినీ శ్రీః*
తనయ స్తారసాసన: స్మరశ్చ ।
పరిచార పరంపరాః సురేంద్రాః
తదపి త్వచ్చరితం విభో! విచిత్రమ్ ॥ 102

అన్వయము :- తత్ త్వచ్చరితమపి ప్రభో! విచిత్రమ్=ప్రసిద్ధమైన నీ చరితము కూడ విచిత్రము.

అర్థము :- భువనం=సలిలమే, భవనమ్=నిలయము, శ్రీః=లక్ష్మీ దేవియే, విలాసినీ=ప్రియురాలు, తనయః= కుమారుఁడు, తామరసాసనః=కమలాసనుఁడు, స్మరశ్చ=మారుఁడును, సురేంద్రాః= సురప్రభువులు, పరిచార పరంపరాః=సేవక శ్రేణులు, తత్=అట్టి, త్వచ్చరితమపి=నీ చరిత్రము కూడ, విచిత్రం=అద్భుతావహము.

తాత్పర్యము :- నీ నిలయము సలిలము. నీ విలాసిని లక్ష్మి. నీ కుమారులు సృష్టికర్తలైన కమలాసనుఁడు - కాముఁడును. సేవక శ్రేణులు సురరాజులు. ప్రభూ! అట్టి నీ చరిత్రము కూడ అద్భుతావహము.

---

14 'భువనం భవనం' (పాఠాంతరము)

శ్లో. దేవ స్త్రిలోకీ సౌభాగ్య, కస్తూరీ తిలకాంకుర:
జీయా ద్వ్రజాంగనానంగ, కేళీ లలిత విభ్రమ: ॥ 103

అన్వయము :- దేవో జీయాత్=స్వామి జయించునుగాక!

అర్థము :- త్రిలోకీ=లోకత్రయ సమాహార రూపమైన ఒకానొక రూపవతికి, సౌభాగ్య=స్పృహణీయత పెంపొందుటకై తీర్చిన, కస్తూరీ=కస్తూరీ విరచితమైన - కస్తూరితో పెట్టిన, తిలకాంకుర:=తిలకముమొలకయైన శ్రీకృష్ణస్వామి, వ్రజాంగనా=వ్రజవిలాసినులతోనైన, అనంగకేళీ=సురతక్రీడలయందలి, లలిత=అందమైన, విభ్రమ:=భూషాస్థానములయొక్క తబ్బిబ్బులు కలవాఁడై, జీయాత్=జయించునుగాక!

తాత్పర్యము :- త్రిలోకియే అనెడు సొగసుకత్తెకు మఱింత సౌభాగ్యము వృద్ధి పొందుటకు కస్తూరితోఁదీర్చిన గీఱ తిలకము మొలక వలెనున్న స్వామి వ్రజాంగనలతోఁ అనఁగి పెనఁగుటలు కల ఆటలలో మఱింత సొగసైన నగలు పెట్టుకొనుటలోని తబ్బిబ్బులతో (ఒకచోట ధరింపవలసిన నగను వేఱొక చోట ధరించుట విభ్రమము - అదే తబ్బిబ్బు) విజయమును పొందునుగాక!

శ్లో. ప్రేమదం చ మే కామదం చ మే
వేదనం చ మే వైభవం చ మే ।
జీవనం చ మే జీవితం చ మే
దైవతం చ మే దేవ! నాపరమ్ ॥ 104

అన్వయము :- దేవ! అపరం దైవతం నచ మే=స్వామీ! నాకు వేఱొక దైవతము లేదు.

అర్థము :- మే=నాకు, ప్రేమదం చ=ప్రేమలనిచ్చునది, కామదం చ మే=నాకు కామములనిచ్చునదియును. వేదనం చ మే=నా వేదనయును, వైభవం చ మే=నా వైభవమును, జీవనం చ మే=నా జీవనమును, దైవతం చ మే=నా దైవతమును, దేవ!=స్వామీ!, నాపరమ్=వేఱొకటి కాదు. నీకంటె వేఱొకటి కాదు.

తాత్పర్యము :- నాకు ప్రేమదము, కామదము, వేదనయును, వైభవమును, జీవనమును జీవితమును స్వామీ! నీ కంటె వేఱొకటి లేదు.

శ్లో. ***మాధుర్యేణ విజృంభంతాం,[15]వాచో న స్తవ వైభవే***
చాపల్యేన వివర్ధంతాం, చింతా న స్తవ శైశవే ॥ 105

అన్వయము :- మమ వాచో విజృంభంతాం మమ చింతా విజృంభంతామ్ - నా వాక్కులు విజృంభించును గాక! నా తలంపులు విజృంభించును గాక!

అర్థము :- తవ వైభవే=నీ వైభవమునందు, మే వాచః=నా వాక్కులు, మాధుర్యేణ విజృంభంతామ్= మాధుర్యముతో విజృంభించును గాక! తవ శైశవే=నీ శైశవమునందు, మే చింతాం=నా తలంపులు, చాపల్యేన=ఆసక్తితో, విజృంభంతామ్=విజృంభించును గాక!

తాత్పర్యము :- నీ వైభవము నందు నా వాక్కులు మాధుర్యముతో విజృంభించునుగాక! నీ శైశవము నందు నా తలంపులు ఆసక్తితో విజృంభించునుగాక!

శ్లో. ***యాని త్వచ్చరితామృతాని రసనా లేహ్యాని ధన్యాత్మనాం***
యే వా చాపల శైశవ వ్యతికరా రాధాఽపరాధోన్ముఖాః ।
యావా భావిత వేణుగీత గతయో లీలా ముఖాంభోరుహే
ధారా వాహికయా వహంతు హృదయే తాన్యేవ తాన్యేవ మే ॥ 106

అన్వయము :- తాన్యేవ తాన్యేవ మే హృదయే ధారావాహిక యా వహంతుమే=అవియే అవియే నా హృదయములో ధారావాహికగా ప్రవహించుచుండునుగాక!

అర్థము :- ధన్యాzత్మనామ్=కృతార్థులైన వారలకు, రసనాలేహ్యాని=నాలుకలచేత ఆస్వాదనీయములైన, యాని=ఏ, త్వచ్చరితామృతాని=నీ చరితామృతములు కలవో, రాధాఽపరాధోన్ముఖాః=శ్రీ రాధాదేవి యెడల అపరాధములు చేయుటకయి - సిద్ధము గానున్న, చాపల శైశవ వ్యతికరా యేవా - చాపల శైశవ=చాపల భావములయొక్క, శైశవ భావములయొక్క, వ్యతికరాః=కలగలుపులు, యేవా=ఎయ్యవి కలవో, లీలా ముఖాంభోరుహే - లీలా=లీలానిలయమైన, ముఖాంభోరుహే=శ్రీమన్ముఖాంభోరుహమునందు, భావిత=జన్మింపఁజేయఁబడిన, వేణుగీతి గతయః=వేణుగీతి ప్రసార గతులు, యావా=ఎన్ని ఉన్నవో, తాన్యేవ తాన్యేవ=అవిమాత్రమే అవి మాత్రమే, మే హృదయే=నా హృదయమునందు, ధారావాహికయా=అవిచ్ఛిన్న ధారా వాహినీ రూపముగా, వహంతు=ప్రవహించు చుండునుగాక!

---

15 'వివర్ధంతాం' (పాఠాంతరము)=వృద్ధిపొందుగాక

తాత్పర్యము :- కృతార్థులైన వారల రసనలకు ఆస్వాదనీయములైన (పునఃపునః సంకీర్తనీయములైన) ఏనీ చరితామృతములున్నవో, శ్రీ రాధాదేవి యెడల అపరాధోన్ముఖములైన కొంటె తనమునకు చిన్నతనమునకు కలగలుపులైన భావము లేవియున్నవో, నిత్యలీలా నిలయమ్మైన శ్రీమన్ముఖాంభోరుహమునందు ఆవిర్భవింపజేయఁబడిన వేణుగీతిగతు లేవికలవో, అవిమాత్రమే అవిమాత్రమే నా హృదయమునందు నిరంతరము ధారావాహికగా ప్రవహించుచుండునుగాక!

శ్లో. *భక్తి స్త్వయి స్థిరతరా భగవన్! యది స్యాత్*
దైవేన నః ఫలిత దివ్యకిశోరవేషే ।
ముక్తిః స్వయం ముకుళితాంజలి సేవతేఽస్మాన్
ధర్మార్థ కామగతయః సమయ ప్రతీక్షాః ॥ 107

అన్వయము :- ముక్తి : స్వయమస్మాన్ సేవతే; ధర్మార్థ కామగతయః సమయ ప్రతీక్షాః=ముక్తి తనంతట తాను మమ్ము సేవించును; ధర్మార్థ కామములు మా అవసరమును వేచియుండును.

అర్థము :- భగవన్!=భగవంతుడా!, 'ఫలిత దివ్య కిశోరవేషే త్వయి' - ఫలిత=ఫలించిన, దివ్య=దివ్యమైన, కిశోర వేషే=కిశోర రూపముగల, త్వయి=నీయందు, నః=మాకు, దైవేన=దైవ యోగముచేత, భక్తిః=భక్తి, స్థిరతరా=మఱింత స్థిరపడిన పక్షములో, ముకుళితాంజలి=ముకుళితాంజలిగా - దోయిలి మోడ్పుగా, ముక్తిః=మోక్షము, స్వయం=స్వయముగా, అస్మాన్=మమ్ము, సేవతే=సేవించును, ధర్మార్థ కామ గతయః=ధర్మార్థ కామములను త్రివర్గ గతులు, సమయప్రతీక్షాః=మా అవసరములను వేచికొనియుండును.

తాత్పర్యము :- ఓ భగవంతుడా! దివ్యకిశోరాకారముగా పండియున్న నీయందు మాకు భక్తి భావన మఱింత గట్టిపడియున్న పక్షములో, ముక్తి చేతులు మోడ్చి మమ్ము సేవించుచుండును. ఇఁక ధర్మార్థకామము లనెడి త్రివర్గముల మాట యన్నచో - అవి మా

శ్లో. *జయ జయ జయ దేవ! దేవ! దేవ!*
త్రిభువన మంగళ దివ్య నామధేయ! ।

జయ జయ జయ బాలకృష్ణ! దేవ!
శ్రవణ మనో నయనామృతావతార! ॥ 108

అర్థము :- త్రిభువనమంగళ దివ్యనామధేయ! - త్రిభువన=మూడు భువనములకు, మంగళ=కల్యాణములను వర్షించెడి, దివ్యనామ ధేయ!=దివ్యనామములు కల, దేవదేవదేవ=దేవదేవుఁడనైన దేవా!; శ్రవణ మనో నయనామృతావతార!=చెవులకు మనస్సునకు కన్నులకు అమృతావతారుడా!, బాలకృష్ణ=బాలకృష్ణ స్వరూపుఁడవైన, దేవ!=ప్రకాశానంద లక్షణుఁడా! జయ జయ జయ=సర్వాతిశాయివై యుండుము!

తాత్పర్యము :- మూఁడు భువనములకు కల్యాణప్రదమైన దివ్యనామము గలవాఁడా! దేవ దేవా! సర్వాతిశాయివై యుండుము! చెవులకు మనస్సునకు కన్నులకు అమృతావతారుఁడా! సర్వాతిశాయివై ఎల్లకాలము నుండుము.

శ్లో. **తుభ్యం నిర్భర హర్ష వర్ష వివశావేశ స్ఫుటావిర్భవ**
ద్భూయశ్చాపల భూషితేషు సుకృతాం[16] భావేషు నిర్భాసతే ।
శ్రీ మద్గోకుల మండనాయ మహతే వాచాం విదూర స్ఫుర
న్మాధుర్యైక రసార్ణ వాయ[17] మహసే క స్మైచి దస్మై నమః ॥ 109

అన్వయము :- మాధుర్యైక రసార్ణవాయ మహసే కస్మైచిదస్మై నమః=మాధుర్య రసార్ణవమై అనిర్వచనీయమైన యీ మహస్సునకు నమస్కారము.

అర్థము :- "నిర్భర హర్షవర్ష వివశావేశస్ఫుటావిర్భవద్భూయ శ్చాపల భూషితేషు" - నిర్భర=పరిపూర్ణమైన, హర్షవర్ష=రోమ హర్షణమైన హర్షవర్షముచేత, వివశ=వశము తప్పిన, ఆవేశ=ఆవేశమునుండి, స్ఫుట=పరిస్ఫుటముగా, ఆవిర్భవత్=ఆవిర్భవించుచున్న, భూయశ్చాపల=ఉత్కట చాపలముచేత, భూషితేషు=విభూషితములైన, సుకృతామ్=ధన్యుల యొక్క, భావేషు=హృదయమునుండి పెల్లుబికిన భావములయందు, నిర్భాసతే=వెలువడి వెలుఁగుచున్నట్టియు, వాచాం=వాక్కులకు, విదూర=మిక్కిలి దూరమునందు స్ఫురత్=స్ఫురించుచున్న, మాధుర్యై కరస=మాధుర్యైమనెడి ఏక రసమునకు, రసార్ణవాయ=రసార్ణవమైన, శ్రీమత్ గోకుల మండనాయ=శ్రీ మద్గోకులమునకు అలంకార భూతమైన, కస్మైచిత్=

---

16. మహతాం (పాఠాంతరము) 17. కారుణ్యైక మహార్ణవాయ (పాఠాంతరము)

అనిర్వచనీయమైన, అస్మై=పురోదృశ్యమానమైన, మహతే మాహసే=గొప్ప మహస్సు వైన, తుభ్యం=నీ కొఱకు, నమః=నమస్కారము.

తాత్పర్యము :- పరిపూర్ణ హర్షవర్షముచేత వశముతప్పిన ఆవేశము నుండి పరిస్ఫుటముగా ఆవిర్భవించుచున్న ఉత్కట చాపలముచేత విభూషితములైన ధన్యుల యొక్క హార్దభావములనుండి వెలికుఱికి వెలుఁగుచున్న - వాక్కులకు బహుదూరమునందు స్ఫురించుచున్న -మాధుర్యైక రసార్ణవమునకు, శ్రీమద్గోకులాలంకారమునకు, అనిర్వచనీయమై పురోదృశ్యమానమైన యీ మహామహస్సునకు నీకు నమస్కారము.

శ్లో. అనుగ్రహ ద్విగుణ విశాల లోచనైః
అనుస్వన ద్విగుణ గళ ద్రవామృతైః ।
యతో యతః ప్రసరతి మే విలోచనం
తత స్తతః స్ఫురతు తవైవ వైభవమ్ ॥ 110

అన్వయము :- యతో యతో మే విలోచనం ప్రసరతి తత స్తత స్తవ వైభవ మేవ స్ఫురతు=నా కన్ను ఏయే వైపునకు ప్రసరించుచున్నదో, ఆయావైపునుండి నీ వైభవమే స్ఫురించును గాక!

అర్థము :- అనుగ్రహ=అనుగ్రహ భావమునకు, ద్విగుణ విశాల=రెండింతలుగా విస్తరిల్లిన, లోచనైః=కన్నులతో, అనుస్వన=ప్రతిస్వనమునకు, ద్విగుణ=రెండింతలుగా, గళత్=జాఱుచున్న, రవామృతైః=నాదామృతములతో, మే విలోచనమ్=నా కన్ను, యతోయతః ప్రసరతి=ఏయే వైపుగా ప్రసరించుచున్నదో, తతస్తతః=ఆయావైపు నుండి, తవైవ వైభవమ్=నీ వైభవమే, ప్రసరతు=ప్రసరించునుగాక!

తాత్పర్యము :- అనుగ్రహమునకు రెండింతలై విస్తరిల్లిన కన్నులతో, ప్రతిస్వనమునకు రెండింతలై జాఱుచున్న నాదామృతములతో,ఏయే వైపునకు నా కన్ను ప్రసరించుచున్నదో, ఆయా వైపునుండి నీ వైభవమే స్ఫురించునుగాక!

★శ్లో. కిమిద మథర వీథీ క్లుప్త వంశీ నినాదం
కిరతి నయనయోర్నః కామపి ప్రేమధారామ్ ।

★ఈ శ్లోకము శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు సేకరించిన ప్రతిలో అధికముగా నున్న శ్లోకము. ఈ ప్రతి వంగదేశములో ప్రసిద్ధి కెక్కిన ప్రతి. దీనిని 'ఉత్తరాది ప్రతి' అందురు, ఈ శ్లోక వ్యాఖ్య శ్రీగౌడీయ మఠము - - గుంటూరు వారు ప్రచురించిన ప్రతిలోనిది. రచన శ్రీజన్నాభట్ల వాసుదేవశాస్త్రి (1991).

తదిద మమర వీథీ దుర్లభం వల్లభం నః
త్రిభువన కమనీయం దైవతం జీవితం చ ॥ 111

అర్థము :- అధరవీథీ=పెదవియనెడు మార్గమునందు, క్లుప్తా=విరచితమైన, వంశీనినాదమ్=వేణునాదము గలిగిన, ఇదం కిమ్?=ఈ వస్తువేది?, నః=మాయొక్క, నయనయోః=నేత్రములకు, కామపి=ఒకానొక, ప్రేమధారామ్=ప్రేమయనెడు ధారను, కిరతి=వర్షించుచున్నది, తత్=ఆ, ఇదమ్=ఈ వస్తువు, అమర వీథీ దుర్లభమ్=దేవగణమునకు దుర్లభమైనది, త్రిభువన=ముల్లోకములలోను, కమనీయమ్=సుందరమైనది, నః=మాకు, వల్లభమ్=ఇష్టమైనది, దైవతం=దైవము, జీవితంచ=జీవనమును.

తాత్పర్యము :- ఈ విలక్షణమైన వస్తువేమి? ఇది మా నేత్రములయందు అనిర్వచనీయమైన ఒకానొక ప్రేయధారను కురిపించుచున్నది. ఇది అధర వీథియందు వంశీ నాదమును చేయుచున్నది. ఇది ముల్లోకములయందు మనోహరమైనది, దేవతలకు కూడ దుర్లభమైనది; మాకు ఇష్టము దైవము జీవనమును ఐయున్నది.

శ్లో. ధన్యానాం సరసానులాప సరణీ సౌభాగ్య మభ్యస్యతాం
కర్ణానాం వివరేషు కామపి సుధావృష్టిం దుహానం ముహు : ।
వశ్యానాం[18]సుదృశాం మనోనయనయో ర్మగ్నస్య దేవస్య నః
కర్ణానాం వచసాం విజృంభిత మహో! శ్రీకృష్ణ కర్ణామృతమ్[19] ॥ 112

అన్వయము :- నః కర్ణానాం వచసాం విజృంభిత మహో! శ్రీకృష్ణ కర్ణామృతమ్ - మా కర్ణములయొక్క మాటలయొక్క పరస్పరాధికమైన విజృంభణమే శ్రీకృష్ణ కర్ణామృతము.

(**అర్థము** :- 'సరసానులాప సరణీ సౌభాగ్యమ్' - సరస=రసవంతములైన, అనులాప=పలుకులయొక్క, సరణీ=మార్గముయొక్క - రసవంతములైన పలుకుల పొందికయొక్క, సౌభాగ్యమ్=మనోజ్ఞత్వమును - పెంపుసొంపును, అభ్యస్యతాం= అభ్యసించుచున్నవారైన, ధన్యానాం=కృతార్థులయొక్క - సహృదయుల యొక్క అనుట, కర్ణానాం=చెవులయొక్క, వివరేషు=రంధ్రములయందు, కామపి=కొలఁది యిడరాని, సుధావృష్టిం=అమృత వర్షమును, ముహుః=మాటిమాటికి, దుహానం=పిదుకుచున్నదియగు,

18 'వన్యానాం' (పాఠాంతరము)=బృందావన స్త్రీల యొక్క, 19 'కృష్ణస్య కర్ణామృతమ్' (పాఠాంతరము)

శ్రీకృష్ణ కర్ణామృతమ్=శ్రీకృష్ణ కర్ణామృతమనెడి యీ గ్రంథము, వశ్యానాం=జితేంద్రియులైన - వశురాండ్రైన, సదృశామ్=విద్వాంసులయొక్క - స్త్రీలయొక్క, మనోనయనయోః= మనస్సునందును కన్నులందును, మగ్నస్య=మునిఁగినవాఁడైన - లీనుడైన అనుట, దేవస్య=దేవునియొక్క, నః=మా, కర్ణానాం=చెవులయు, వచసాం=వాక్కులయు, విజృంభితమ్=చెలరేగుట - శ్రీకృష్ణుడు మా కర్ణములందును వాక్కులందును విజృంభించుటయే యీ కర్ణామృత మయ్యెననుట - విద్వాంసులకును గోపస్త్రీలకును మనోనయనములకు ఆనందప్రదమైన పరత్వసౌలభ్య సంగతి గలిగిన వాఁడు గావున మాకర్ణములకును వాక్కులకును ఆనందప్రదుఁడైన వాఁడు, ఇట్టి మా కర్ణములయు వాక్కులయు కృష్ణ విషయమైన విజృంభణమే కర్ణామృతమయ్యెనని భావము. ఆహో!=ఆశ్చర్యము! ధన్యుల కర్ణములందు సుధావృష్టి కురియునదిగాన కర్ణామృత మనబడినది అని అభిసంధి.

తాత్పర్యము :- సరసములైన మాటల పొందికల పెంపును అలవాటు చేసికొనుచున్న సహృదయుల కర్ణములకు అమృత వర్షమువలె అత్యంత భోగ్యమై, కావుననే కర్ణామృత మనఁబడిన యీ కర్ణామృతము విద్వాంసులకును స్త్రీలకును ఆనందప్రదమగు మూర్తి విశేషము గలవాఁడైన శ్రీకృష్ణుఁడు మా కర్ణములను వాక్కులను విజృంభింపజేయఁగా నైన విజృంభణమే అగును.)

శ్లో. *ఈశాన దేవ చరణా భరణేన నీవీ* [20]
దామోదర స్థిరయశః స్తబకోద్గమేన ।
లీలాశుకేన రచితం తవ దేవ! కృష్ణ
కర్ణామృతం వహతు కల్పశతాంతరేఽపి ॥ 113

అన్వయము :- హేదేవ! కృష్ణ! లీలాశుకేన రచితం తవ కర్ణామృతం కల్పశతాంతరేఽపి వహతు=ఓ శ్రీ కృష్ణ దేవా!లీలాశుకుఁడు రచించిన నీ కర్ణామృతము ఇంకొక కల్పశతము నందు కూడ ప్రవహించుచుండునుగాక!

అర్థము :- ఈశాన దేవ చరణాz భరణేన - ఈశాన=శివగురుని యొక్క, చరణాఽభరణేన=చరణములే శిరోభూషణములుగాఁ గలట్టియును, నీవీ=నీవీ దేవి యొక్క

20 'నీలీ" (పాఠాంతరము)

దామోదర=దామోదరుని యొక్క, స్థిర=శాశ్వతమైన, యశః స్తబక=కీర్తిగుచ్ఛము యొక్క, ఉద్గమేన=పైకి నిగుడుటవంటి వాఁడైన, లీలాశుకేన=లీలాశుకునిచేత, రచితం= విరచింపఁబడిన, తవ=నీయొక్క, కర్ణామృతమ్=కర్ణామృతకావ్యము, దేవ! కృష్ణ=ఓ శ్రీకృష్ణ దేవా!, కల్పశతాంతరేఽపి=మఱియొక కల్పశతమునందుగూడ, వహతు= ప్రవహించుచుండునుగాక!

తాత్పర్యము :- ఓ శ్రీకృష్ణదేవా! ఈశాన శివగురుదేవుని చరణములు తన శిరో భూషణములుగా గలట్టియును, నీవీ(లీ) దామోదరులనెడి తల్లి దండ్రుల యొక్క చిర స్థాయియైన యశస్సే అనెడి సుమస్తబకమువలె వెలికి నిగిడిన, లీలాశుకునిచేత విరచితమైన నీ కర్ణామృత మను కావ్యము మఱియొక కల్పశతమునందుగూడ ప్రవహించుచుండునుగాక!

విశేషము :- పూర్వ వ్యాఖ్యాతలు ఈ శ్లోకమును వేఱొక విధముగా వ్యాఖ్యానించినారు. తంజనగరము తేవప్పెరుమాళ్ళయ్యగారి వ్యాఖ్య ఈ క్రింది విధముగా నున్నది.(సంపాదకుడు)

అర్థము :- దేవ=దేవా!, కృష్ణ=శ్రీకృష్ణా!, 'ఈశానదేవ చరణాభరణేన' - ఈశానదేవ=దేవుండగు శివునియొక్క, చరణ=అడుగులే, ఆభరణేన=భూషణములుగాఁ గలదియు, 'నీవీ దామోదర స్థిరయశః స్తబకోద్గమేన - నీవీ=మూలధనమైన, దామోదర=కృష్ణునియొక్క, స్థిర=నిశ్చలమైన, యశః=కీర్తియనెడు, స్తబక=పూలగుత్తి కొఱకైన, ఉద్గమేన=ఎగురుట గలదియు, అగు, లీలాశుకేన=లీలాశుకుఁడను విలాసార్థమైన చిలుక చేత, రచితం=(కవిపరముగా) నిర్మింపబడినదియు - (శుకపరముగా) కావింపఁబడినదియు, అనఁగా శబ్దింపఁబడినదియు, అగు, కర్ణామృతం=కర్ణామృతగ్రంథమనెడి చెవులకు అమృతప్రాయమైన శబ్దము, కల్పశతాంతరేపి=వందలకొలఁది కల్పములయందుఁగూడ, వహతు=అవిచ్ఛిన్నమై విలసిల్లుచుండుఁగాక!

తాత్పర్యము :- శివుని పాదారవిందములయందు భక్తిగలిగి, పూగుత్తికై యెగురు లీలాశుకమువలె, నీ కీర్తియందు అత్యంతాసక్తిగలిగియుండు లీలాశుకుఁడను కవి కర్ణామృతముగా రచించిన యీ కర్ణామృతగ్రంథము పెక్కు కల్పములుండును గాక!

ఇతి శ్రీ లీలాశుక విరచితే శ్రీకృష్ణకర్ణామృతే ప్రథమ శతకం సమాప్తమ్.

శ్రీ లీలాశుకుఁడు రచించిన శ్రీకృష్ణకర్ణామృతమందు

ప్రథమ శతకము సమాప్తము.

శ్రీరస్తు

శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

శ్రీకృష్ణకర్ణామృతము

తెలుఁగు టీకాతాత్పర్య సహితము

ద్వితీయాశ్వాసము

శ్లో. అభినవ నవనీత స్నిగ్ధ మాపీత దుగ్ధమ్
దధికణ పరిదిగ్ధం ముగ్ధ మంగం మురారేః ।
దిశతు భువన కృచ్ఛ్రచ్ఛేది తాపింఛ గుచ్ఛ
చ్ఛవి నవశిఖి పింఛా లాంఛితం వాంఛితం నః ॥ 1

అన్వయము :- ముగ్ధం మురారేరంగం నః వాంఛితం దిశతు=మురారి యొక్క ముద్దొలుచున్న దేహము మా వాంఛితమును నెరవేర్చును గాక!

అర్థము :- అభినవ = సరిక్రొత్తయైన, నవనీత=వెన్నపూస-మైపూఁతతో, స్నిగ్ధం= జిడ్డుదేలుచున్నట్టియు, ఆపీత=కుత్తుకబంటిగాఁ గ్రోలిన, దుగ్ధం=ఆవుపాలు గలదియును, దధికణ పరిదిగ్ధమ్ - దధికణ=పెరుచిద్రుపలచేత, పరిదిగ్ధం=పరివ్యాప్తమైనది యును, భువన కృచ్ఛ్రచ్ఛేది=లోకముయొక్క బాధలను ఛేదించునట్టియు, తాపింఛ గుచ్ఛచ్ఛవి= కానుగుచిగురు జొంపముయొక్క కాంతివంటి కాంతి గలదియును, నవశిఖి పింఛా లాంఛితమ్=కొదము నెమలి పురి చేత లాంఛితమైన, మురారేః=మురవైరి యొక్క, ముగ్ధమ్=మనోహరమైన; అంగం=నెమ్మేను, నః=మా యొక్క, వాంఛితం=కోరికను, దిశతు=ఇచ్చునుగాక!

తాత్పర్యము :- క్రొత్త వెన్నపూస మై పూఁతతో జిడ్డుదేలుచు-బొజ్జ నిండారఁ గ్రోలిన పాలతో, పెరుగు చిద్రుపలంటిన సర్వాంగములతో, భువన క్లేశాపహమైన కానుగు చివురు

జొంపమువంటి మైచాయతో, మయూర పింఛ లాంఛితమైన మురవైరియొక్క మోహన దేహము వాంఛితము లొసంగును గాక!

శ్లో. *యాం దృష్ట్వా యమునాం పిపాసు రనిశం వ్యూహో గవాం గాహతే*
విద్యుత్వానితి నీలకంఠ నివహో యాం ద్రష్టు ముత్కంఠతే ।
ఉత్తంసాయ తమాల పల్లవ మితి చ్ఛిందంతి యాం గోపికాః
కాంతిః కాళియ శాసనస్య వపుషః సాపావనీ పాతునః ॥ 2

అన్వయము :- కాళియ శాసనస్య వపుషః పావనీ సా కాంతిః నః పాతు=కాళియ భంజనుని యొక్క ఆ పావన దేహకాంతి మమ్ము కాపాడుగాక !

అర్థము :- యాం=ఏకాంతిని, దృష్ట్వా=చూచి, పిపాసుః=నీరుగాలి తిరిగినదై, గవాం=గోవుల యొక్క, వ్యూహః=రంగులనుపట్టి తీర్చికట్టిన కదుపు, యమునాం=యమునా నదినిగా, గా హతే=అవగాహించుచున్నదో, (తలంచుచున్నదో - ప్రవేశించుచున్నదో); నీలకంఠ నివహః=నెమళ్ల గుంపు, విద్యుత్వానితి=విద్యుత్వంతమని-మేఘమని, యాం=ఏ నీలకాంతిని, ద్రష్టుమ్=చూచుటకొఱకు, ఉత్కంఠతే=మెడ నిక్కించుచున్నదో, ఉత్తంసాయ=ఉత్తంస రచనము కొఱకు, తమాల పల్లవమితి=కానుగు చివురాకని, యాం=ఏ నీలకాంతిని, గోపికాః=గోపికలు, ఛిందంతి=పాటల నఖ కాంతులతో చిదుముచున్నదో, సా=అట్టి, కాళియ శాసనస్య=కాళియుని శాసించిన శ్రీకృష్ణస్వామియొక్క, వపుషః=నెమ్మేనియొక్క, పావనీ=భువన పావనియైన, కాంతిః=వెలుఁగు, నః=మమ్ము, పాతు=కాపాడుగాక!

తాత్పర్యము :- బృందారణ్య మంతయు నిండిన - ఏ నల్లని వెలుఁగునుజూచి గో వ్యూహము నీరుగాలి తిరిగి - యమునా ప్రవాహమని లోపలికి అవగాహనము చేయుచున్నదో, కొమ్మలపైనున్న నెమ్మిగుంపు-ఏ నీలకాంతినిఁజూచి క్రొమ్మొయిలని మెడలు నిక్కించు చున్నదో, ఉత్తంస రచనకు గోపికలు ఏ నీలకాంతిని తమ పాటల పాణినఖకాంతులతో చిదుముకొనుచున్నారో, తాదృశమైన కాళియశాసనుని నెమ్మేని వెలుఁగు మమ్ము కాపాడునుగాక !

శ్లో. **దేవః పాయా త్పయసి విమలే యామునే మజ్జతీనాం**
యాచంతీనా మనునయ పదై ర్వంచితా న్యంశుకాని ।
లజ్జాలోలై రలసవిలసై రున్మిష త్పంచబాణైః
గోపస్త్రీణాం నయనకుసుమై రర్చితః కేశవో నః ॥ 3

అన్వయము :- గోపస్త్రీణాం నయన కుసుమై రర్చితః కేశవో నః పాయాత్ = గోపికా నయన కుసుమములతో అర్చితుఁడైన స్వామి మమ్ము కాపాడును గాక!

అర్థము :- విమలే=నిర్మలమైన, యామునే పయసి=యమునా సమీపమునందు, మజ్జతీనామ్=మునుకలాడుచున్నట్టియు, వంచితాని=ఏమరించి మ్రుచ్చిలింపఁబడిన, అంశుకాని=వలిపములను, అనునయపదైః=అనునయాలాపములతో, బుజ్జవపు పలుకులతో, యాచంతీనాం=వేఁడికొనుచున్న, గోపస్త్రీణాం=గోపవధువుల యొక్క, లజ్జాలోలైః=లజ్జా చంచలములును, అలస విలసైః=అలసవిలాసములును, ఉన్మిష త్పంచబాణైః= వికసించుచున్న కుసుమ శరుఁడు కల, నయన కుసుమైః=నేత్ర కుసుమములతో అర్చితః=పూజింపఁబడిన, దేవఃకేశవః=ప్రకాశానంద క్రీడాలక్షణుఁడైన కేశవుఁడు, నః=మమ్ము, పాయాత్=కాపాడును గాక!

తాత్పర్యము :- యమున తేటనీటి మునుకులాటలలో ఏమరియున్నవేళ మ్రుచ్చలింపఁబడిన తమ వలిపములను, లజ్జా చంచలములును, అలస విలాసములును, వికస త్కుసుమ శరములునైన తమ నేత్రకుసుమములతో, గోప వధువులచేత అర్చింపబడిన ప్రకాశానంద క్రీడామయుఁడైన స్వామి మమ్ము కాపాడునుగాక!

(విశేషాంశము :- ఈ శ్లోకమున కర్థము -

"కదంబవృక్ష మారూఢం గోపీ వస్త్రాపహారిణమ్ ।
కృష్ణం ధ్యాత్వార్ధరాత్రేతు జపేన్మంత్రం సహస్రకమ్ ॥
దశరాత్ర జపాదేవ మాకర్షేన్నాగ కన్యకాం ।
కన్యకా స్త్రీ దశాదీనాం కింపునర్మర్త్య యోషితః ॥"

- అని గోపాలకృష్ణ మంత్ర రాజమండలి వస్త్రాకర్షణ ప్రయోగధ్యానమని సనత్కుమార సంహితయందు చెప్పఁబడియున్నది.)

శ్లో. *మాత ర్నాతః పర మనుచితం యత్ ఖలానాం పురస్తాత్*
అస్త్రాశంకం జఠర పిఠరీ పూర్తయే నర్తితాఽసి ।
తత్ క్షంతవ్యం సహజ సరళే! వత్సలే! వాణి! కుర్యామ్
ప్రాయశ్చిత్తం గుణగణనయా గోపవేషస్య విష్ణోః॥ 4

అన్వయము :- గోపవేషస్య విష్ణోః గుణగణనయా ప్రాయశ్చిత్తం కుర్యామ్= గోపవేషధరుఁడైన విష్ణుని గుణగణనముచేత ప్రాయశ్చిత్తమును జేయుదునుగాక !

అర్థము :- మాతః=అమ్మా!, ఇతఃపరమ్=ఇంతకుమించి, అనుచితం=అనుచిత కృత్యము, న=లేదు, యత్=ఏదనఁగా-జఠర పిఠరీ పూర్తయే=పిడుత కడుపు నింపికొనుట కొఱకు, ఖలానామ్=అధములయొక్క, పురస్తాత్=ఎట్టయెదుట, అస్త్రాzశంకమ్=నదరు బెదరులేక, నర్తితాఽసి=నాట్యమాడింపఁ బడినావు, తత్=దానిని; సహజ సరళే!=సహజమైన సరళస్వభావము కలదానా!, వత్సలే=వాత్సల్యముకల, వాణి!=ఓ సరస్వతీ! క్షంతవ్యమ్=క్షమింపవలసినది, గోపవేషస్య=గోపవేషధరుఁడైన, విష్ణోః=విష్ణునియొక్క, గుణ గణనయా=గుణగణనముచేత, ప్రాయశ్చిత్తమ్=ప్రాయశ్చిత్తమును, కుర్యామ్= చేయుదునుగాక!

తాత్పర్యము :- అమ్మా! యింతకంటె అనుచితకృత్యము వేఱొకటి యుండదు. పిడత కడుపు నింపికొనుట కొఱకు నదరు బెదరు లేక ఇన్నాళ్లు అధముల యెట్టయెదుట నిన్ను నాట్యములాడించినాను. సహజమైన సరళస్వభావము, వాత్సల్యము గల ఓ సరస్వతీ! ఆ తప్పు క్షమింపవలసినది. గోపవేషధరుఁడైన విష్ణుని గుణగణనముతో ప్రాయశ్చిత్తము చేసి కొందునుగాక!

శ్లో. *అంగుళ్యగ్రై రరుణ కిరణై ర్ముక్త సంరుద్ధ రంధ్రం*
వారం వారం వదన మరుతా వేణు మాపూరయంతమ్ ।
వ్యత్యస్తాంఘ్రిం వికచ కమలచ్ఛాయ విస్తారి నేత్రం
వందే బృందావన సుచరితం నందగోపాల సూనుమ్ ॥ 5

అన్వయము :- బృందావన సుచరితం నందగోపాలసూనుం వందే= బృందావనము చేసికొనిన పుణ్యస్వరూపమైన నందగోకులపతియొక్క నందనుడైన శ్రీకృష్ణస్వామిని స్తుతించుచున్నాను- నమస్కరించుచున్నాను. (వది-అభివాదనస్తుత్యోః)

అర్థము :- అరుణకిరణైః=ఎఱ్ఱని వెలుఁగులుగల, అంగుళ్యగ్రైః=కొనవ్రేళ్లతో, ముక్త సంరుద్ధరంధ్రమ్=తెఱచి-మూయుటలైన బెజ్జములు కలుగునట్లు, వారం వారం=మాటికిమాటికి, వదనమరుతా=ముఖమారుతముచేత, వేణుమ్=పిల్లనగ్రోవిని, ఆపూరయంతమ్=నింపుచున్నట్టియు, వ్యత్యస్తాంఘ్రిమ్=విజ్జోడుగా నిలిపిన అడుగులు కలట్టియు - (ఎడమ చరణముపై అడ్డముగా సాచి నిలిపిన కుడి చరణము గలవానిని), 'వికచ కమల చ్ఛాయ విస్తారి నేత్రమ్'=విచ్చిన తమ్మిపువ్వుల కాంతి కల విస్తరించుచున్న నేత్రములు కలవానిని, బృందావన సుచరితమ్=బృందావనముయొక్క పుణ్యమైన, నందగోపాల సూనుమ్=నందగోపాలనందనుని, వందే=స్తుతించుచున్నాను-నమస్కరించుచున్నాను.

తాత్పర్యము :- ఎఱ్ఱని వెలుఁగు లీనుచున్న కొనవ్రేళ్లతో - విడుపు - మూతలుగా నగుచున్న బెజ్జములు కలుగునట్లు - ముఖసమీరముతో మాటిమాటికిని పిల్లనఁ గ్రోవిని - ఊదుచున్నట్టియు, ఒకదానిపై నొకటి అడ్డముసాచి నిలిపిన అడుగుగవ వానిని, విచ్చిన తామర పువ్వుల కాంతితో విస్తరిల్లుచున్న కన్నులు గల వానిని, బృందావన భూమి చేసికొనిన పుణ్యస్వరూపమైన వానిని, నందగోపాలనందనుని, స్తుతించుచున్నాను - నమస్కరించు చున్నాను.

శ్లో. *మందం మందం మధుర నినదై ర్వేణు మాపూరయంతం*
బృందం బృందావనభువి గవాం చారయంతం చరంతమ్ ।
ఛందోభాగే శతమఖ మఖ[1] ధ్వంసినాం దానవానాం
హంతారం తం కథయ రసనే! గోపకన్యాభుజంగమ్॥ 6

అన్వయము :- హేరసనే! తం గోపకన్యా భుజంగం కథయ=ఓ నాలుకా ! ఆ మందబిటారము వలపుకాని ముచ్చట లాడుము !

అర్థము :- మందం మందం=మెల్లమెల్లగా, మధుర నినదైః=మధుర నినాదములతో, వేణుమ్=పిల్లనఁగ్రోవిని, ఆపూరయంతమ్=నింపుచున్నవానిని, బృందావన భువి =బృందావన భూమియందు, గవాం బృందమ్=గోబృందమును, చారయంతమ్=మేఁపుచున్న వానిని,

---

1 'శతమఖ ముఖ' (పాఠాంతము)=దేవేంద్రుడు మొదలైనవారిని

ఛందోభాగే=వేదాంతవీథియందు, చరంతమ్=విహరించుచున్నవానిని, శతమఖ=ఇంద్రుని కొఱకు ఉద్దేశింపఁబడిన, మఖ=క్రతువులను, ధ్వంసినామ్=చెఱచుచున్న, దానవానామ్=రాక్షసులకు, హంతారమ్=సంహారకర్తయైన వానిని, తం గోపకన్యాభుజంగమ్=ఆ మంద మిటారుల వలపుకానిని, కథయ=ముచ్చటింపుము!

తాత్పర్యము :- మెల్ల మెల్లన పిల్లనఁగ్రోవిని తీయని ఎలుగులతో నింపుచున్న వానిని, బృందావనములో ఆలమందలను మేపుచున్నవానిని, వేదాంత వీథులయందు విహరించుచున్న వానిని, ఇంద్రుని జన్నములకు బన్నములుచేయు సోఁకు మూఁకలను తెగటార్చువానిని ఆ గోపకన్యాప్రియుని ఓనాలుకా! కీర్తింపుము.

శ్లో. ***వేణీ మూలే విరచిత ఘనశ్యామ పింఛావచూడో***
విద్యుల్లేఖా వలయిత ఇవ స్నిగ్ధ పీతాంబరేణ ।
మా మాలింగన్ మరకత మణిస్తంభ గంభీర బాహుః
స్వప్నే దృష్ట స్తరుణ తులసీభూషణో నీలమేఘః ॥ 7

అన్వయము :- తరుణ తులసీ భూషణో నీలమేఘః స్వప్నే దృష్టః=తరుణ తులసీ దామ విభూషితమైన నీలమేఘము స్వప్నములోఁ గనిపించినది.

అర్థము :- వేణీమూలే=జడ కుదురునందు, 'విరచిత ఘనశ్యామ పింఛావచూడః' విరచిత=అమర్పఁబడిన, ఘనశ్యామ=మేఘశ్యామలమైన, పింఛ=నెమలిపురియొక్క, అవచూడః=క్రింది కొనకుచ్చు (నెమలికన్ను) కలదియును, స్నిగ్ధపీతాంబరేణ=నునుపైన పచ్చని వలువచేత, విద్యుల్లేఖావలయిత ఇవ=మెఱుపు రేఖతో 'జుట్టఁబడినట్లున్నదియును, 'మరకతమణిస్తంభ గంభీర బాహుః'=ఆకుపచ్చమణులతో కట్టిన కంబములవలె గంభీరములైన బాహుదండములు కలదియు, తరుణ తులసీ భూషణః=లేఁత తులసిచివుళ్ల దండతో అలంకరింపఁబడిన, నీలమేఘః=కటిమబ్బు, మాం=లక్ష్మీదేవిని, ఆలింగన్=కౌగిలించికొనుచు, స్వప్నే=స్వప్నమునందు, దృష్టః=కనఁబడినది.

తాత్పర్యము :- జడకుదురునందు తుఱుమఁబడిన మొయిలువలె నల్లనైన నెనుపురి క్రించి కొన కుచ్చుతో, నిద్దంపు పసిమివలువతో, మెఱపుతోఁబరివేష్టింపబడినట్లున్న తరుణ తులసీ పల్లవ దామమును ధరించినదియును, మరకత మణిస్తంభ గంభీర బాహువులుగల ఒక నీలమేఘము లక్ష్మీ దేవిని ఆలింగనముచేసి కొనుచు-కలలో కనఁబడిననది.

(**విశేషాంశము** :- ఈ శ్లోకమున కర్థము -

'వామాంకస్థితయా వామపాణి పద్మస్థ పద్మయా ।
పద్మావతార యాశ్లిష్టం రుక్మిణ్యా కనకాభయా ॥
హరిం తాపింఛ సచ్ఛాయ మాసీనం కాంచనాంబుజే
ఆశ్లిష్యంతం ప్రియం దేవ్యా ఫలోద్యద్వామ పాణినా ।
సౌవర్ణ వేత్ర విలసద్దక్ష పాణితలం స్మరేత్
పీతాంబరధరం దివ్యభూషామాలా విభూషణమ్ ॥'

- అని గోపాలకృష్ణ షోడశాక్షరమంత్ర ధ్యానముగా సనత్కుమారసంహిత యందుఁజెప్పఁబడినది).

శ్లో. కృష్ణే హృత్వా సిచయనిచయం కూలకుంజాధిరూఢే
ముగ్ధా కాచి న్ముహు రనునయైః కింన్వితి వ్యాహరంతీ ।
సభ్రూభంగం సదరహసితం సత్రపం సానురాగం
ఛాయాశౌరేః కరతలగతా న్యంబరా ణ్యాచకర్ష ॥ 8

అన్వయము :- కాచి న్ముగ్ధా ఛాయాశౌరేః కరతలగతాన్యంబరాణి ఆచకర్ష= ఒకానొక ముద్దరాలు కృష్ణుని నీడయొక్క చేతిలోనున్న తనచీరను లాగుకొనెను.

అర్థము :- సిచయ నిచయమ్=చీరల ప్రోవును, హృత్వా=అపహరించి, కృష్ణే=కృష్ణుఁడు, కూలకుంజాధిరూఢేసతి=గట్టుపైనున్న పొదరింటిపై నెక్కఁగా, కాచిత్=ఒకానొక, ముగ్ధా=ముద్దరాలు, ముహుః=మాటిమాటికిని, అనునయైః=అనునయాలాపములతో, కింను ఇతి=కింన్వితి='ఏమి-ఇది' అని, వ్యాహరంతీ=పలుకుచున్నదియై, సభ్రూభంగమ్=బొమ విఱుపుతో, సదరహసితమ్=చిఱునవ్వుతో, సత్రపమ్=సిగ్గుతో, సానురాగమ్=అనురాగముతో, ఛాయాశౌరేః=ప్రతిబింబకృష్ణుని యొక్క, కరతలగతాని=చేతులలోనున్న, అంబరాణి=చీరలను, ఆచకర్ష=లాగెను.

తాత్పర్యము :- చీరల ప్రోవు ముచ్చిలించి కృష్ణుఁడు గట్టుపై నున్న పొదరిల్లెక్కఁగా ఒక ముద్దరాలు పలుమారులు అనునయాలాపములతో- 'ఇది-ఏమి?' అని పలుకుచు -

బొనుముడితో, చిఱునవ్వుతో, సిగ్గుతో, అనురాగముతో, ఛాయాకృష్ణుని చేతులలో నున్న చీరలను లాగికొనెను.

(**విశేషాంశము** :- ఈ శ్లోకమున కర్థము -

'కదంబవృక్ష మారూఢం గోపీ వస్త్రాపహారిణమ్ ।
కృష్ణం ధ్యాత్వార్ధ రాత్రేతు జపేన్మంత్రం సహస్రకమ్ ॥
దశరాత్ర జపాదేవ మాకర్షేన్నాగ కన్యకాః ।
కన్యకా స్త్రీ దశాదీనాం కింపునర్మర్త్య యోషితః ॥"

- అని గోపాలకృష్ణ మంత్ర రాజమని సనత్కుమార సంహిత)

శ్లో. **అపి జనుషి పరస్మి న్నాత్త పుణ్యోభవేయం**
తట భువి యమునాయా స్తాదృశో వంశనాళః ।
అనుభవతి య ఏష శ్శ్రీ మదాభీరసూనోః
అధరమణి సమీప న్యాస ధన్యా మవస్థామ్ ॥ *9*

అన్వయము :- ఆత్తపుణ్యః పరస్మిన్నపిజనుషి యమునాయాస్తటభువి తాదృశో వంశనాళః అపి భవేయమ్=పుణ్యములు సంపాదించి మఱుసటి జన్మలోనైన యమునానది ఒడ్డున అట్టి వంశనాళమును అయ్యెదనా !

అర్థము :- ఆత్త పుణ్యః=పుణ్యములు చేసికొని, పరస్మిన్నపి జనుషి=పరజన్మములో నైనను, యమునాయాః=యమునానది యొక్క, తటభువి=తటభూమియందు, తాదృశః=అట్టిదియైన, వంశనాళః=వేణునాళమును, భవేయమ్=అయ్యెదనా!, య ఏషః=ఏ-ఈ వేణునాళము, శ్రీమదాభీర సూనోః=శ్రీనిలయుడైన ఆభీర సూనుని యొక్క, 'అధరమణి సమీపన్యాస ధన్యామ్' - అధరమణి=అధర పద్మరాగముయొక్క, సమీప న్యాస=సమీపము నందుంచుటచేత, ధన్యామ్=కృతార్థమైన, అవస్థాం=దశను, అనుభవతి=అనుభవించు చున్నదియో !

తాత్పర్యము :- పుణ్యములు చేసికొని-పుట్టి-రాఁబోవు జన్మలోనయిన ఆ యమునానది యొడ్డున ఆ విధమైన వేణునాళమునయ్యెదనా! ఏయీ వేణునాళము శ్రీ

నిలయుఁడైన ఆభీరనందనునియొక్క అధరపద్మరాగమణి సమీపమునందు నిలిపికొనుటచేత కృతార్థమైన దశను అనుభవించుచున్నదో !

శ్లో. *అయి! పరిచిను చేత: ప్రాతరంభోజనేత్రం*
కబర కలిత చంచత్ పింఛదామాభిరామమ్ ।
వలభి దుపల నీలం వల్లవీ భాగధేయం
నిఖిల నిగమవల్లీ మూలకందం ముకుందమ్ ॥ 10

అన్వయము :- అయి! చేత: ముకుందం పరిచిను !=ఓసి మనసా! ముక్తి ప్రదుఁడైన ముకుందుని ప్రోఁదిచేసికొనుము.

అర్థము :- అయి!=ఓసి, చేత!=చేతమా!, ప్రాతరంభోజనేత్రమ్-ప్రాత:=ప్రాత: కాలమునందలి, అంభోజ=అంబుజములవంటి, నేత్రమ్-కన్నులు గలవానిని, కబర కలిత చంచత్పింఛ దామాభిరామమ్- కబర=కబరీభరమునందు, కలిత=అలంకరింపఁబడి, చంచత్=మెఱుపులీనుచున్న, పింఛదామ=పింఛపుదండచేత, అభిరామమ్=లోచనాభి రాముఁడైనట్టియును, వలభిదుపల=ఇంద్రనీలమణివలె, నీలమ్=నీలవర్ణుఁడైనట్టియు, వల్లవీ భాగధేయమ్= గోపికా భాగధేయమైనట్టియు, 'నిఖిల నిగమవల్లీ మూలకందమ్' నిఖిల=సకలములైన, నిగమవల్లీ=వేదములనుతీఁగలకు, మూలకందమ్=మొదలి దుంపయునై, ముకుందమ్=ముకుందుని, పరిచిను=ప్రోఁదిచేసికొనుము !

తాత్పర్యము :- ఓసి చేతమా! ప్రాత: కాల పద్మములవంటి కన్నులు గలవానిని, కబరీభరమునందు చెరివిన మెఱుఁగు లీనుచున్న పింఛపు దండచేత కన్నుల పండుగయైన వానిని, ఇంద్రమణివలె నీలవర్ణుని, గోపికల పాలిటి భాగధేయమును, సకల శ్రుతి వల్లికలకు మూలకందమునైన ముకుందుని ప్రోఁది చేసికొనుము !.

శ్లో. *అయి! మురళి! ముకుంద స్మేర వక్త్రారవింద*
శ్వసన మధు రసజ్ఞే! త్వాం ప్రణ మ్యాద్యయాచే ।
అధరమణి సమీపం ప్రాప్తవత్యాం భవత్యాం
కథయ! రహసి కర్ణే మద్దశాం నందసూనో: ॥ 11

అన్వయము :- అయి! మురళి! నందసూనో: కర్ణే రహసి మద్దశాం కథయ!=ఓసి మురళీ! నందసూనుని చెవిలో ఏకాంతమునందు నా స్థితిని విన్నవింపుము.

అర్థము :- ముకుంద స్మేరవక్త్రారవింద శ్వసన మధురసజ్ఞే! అయి! మురళి! - ముకుంద=మోక్షప్రదాతయైన ప్రభువుయొక్క, స్మేర=వికస్వరమైన, శ్వసన=వదన సమీరముల, మధురసజ్ఞే!=తీయదనము యొక్క ఆస్వాదమునెఱిఁగియున్న,అయిమురళి!= ఓసి మురళీ! అద్య=ఇప్పుడు, ప్రణమ్య=ప్రణమిల్లి, త్వాం=నిన్ను, యాచే=వేఁడుకొనుచున్నాను, భవత్యాం=నీవు, అధరమణి సమీపమ్=మోవికెంపు చేరువను, ప్రాప్తవత్యామ్=పొందిన దానవైనప్పుడు, రహసి=ఏకాంతమునందు, కర్ణే=చెవిలో, మద్దశామ్=నా అవస్థను, నందసూనోః=నందనందనునకు, కథయ=విన్నవింపుము!

తాత్పర్యము :- ముక్తి నిధానమైన స్వామియొక్క శ్రీముఖ సరసిజ సమీర సౌరభ-స్వాదు రసజ్ఞవై ధన్యురాలవైయున్న ఓసి మురళీ! ప్రణమిల్లి నేఁడు నిన్నొకటి అభ్యర్థనము చేయుచున్నాను - అధరమణికి చేరువగా నీవు పోయినప్పుడు స్వామిచెవిలో రహస్యముగా నా అవస్థను విన్నవింపవలసినది.

శ్లో. ***సజల జలద నీలం వల్లవీ కేళిలోలం***
శ్రిత సురతరు మూలం విద్యుదుల్లాసిచేలమ్ ।
సురరిపుకుల కాలం సన్మనోబింబలీలమ్
నత సురముని జాలం నౌమి గోపాలబాలమ్ ॥ 12

అన్వయము :- నౌమి గోపాల బాలమ్=గోపాల బాలుని నుతించుచున్నాను.

అర్థము :- సజల జలద నీలమ్=నీటిమబ్బువలె నీలవర్ణము కలవానిని, వల్లవీ కేళిలోలమ్=గోపికా కేళిలోలుని, శ్రిత సురతరు మూలమ్=మందార తరుమూలమును ఆశ్రయించియున్న వానిని, విద్యుదుల్లాసి చేలమ్=మెఱుపుతీగవలె మెఱపులు విరఁజిమ్ము చున్న పరిధానము గలవానిని, సురరిపు కుల కాలమ్-సురరిపు=సురవిరోధులైన రాక్షసుల యొక్క, కుల=వంశమునకు, కాలం=యముని, సత్=సత్పురుషులయొక్క, మనః=మనస్సుల యందు, బింబలీలమ్=బింబమైయున్నవానిని, నత సురముని జాలమ్=దివ్యమునులు ప్రణమిల్లువానిని, గోపాలబాలమ్=గోపాలబాలుని, నౌమి=నుతించుచున్నాను.

(**విశేషాంశము** :- ఈ శ్లోకమున కర్థము, సనత్కుమార సంహిత యందు -

'ధ్యాయేత్కల్పద్రుమాధస్తా న్మణీ పీఠాసనం శుభమ్
కృష్ణం పీతాంబరధరమ్ శంఖచక్ర కరాంబుజమ్ ॥

సించమానం సుధాకుంభై రైరావణకరావృతైః
శక్రేణ శాంత దర్పేణ సన్నుతం తపసాత్మనా ॥
స్తూయమానం సురగణైః పుష్పవృష్టి కరైర్దివి
సేవ్యమానంచ మునిభి స్సిద్ధ సాధ్యైర్మహోరగైః'

- అని గోపాలకృష్ణ ద్వాదశాక్షరీ మంత్ర ధ్యానమని చెప్పఁబడియున్నది.)

శ్లో. **అధరబింబ విడంబిత విద్రుమం**
మధుర వేణునినాద వినోదినమ్ ।
కమల కోమల కమ్ర ముఖాంబుజం
కమపి గోపకుమార ముపాస్మహే ॥ 13

అన్వయము :- కమపి గోపకుమార ముపాస్మహే=ఒకానొక గోపకుమారుని ఉపాసించుచున్నాము.

అర్థము :- అధరబింబ=బింబాధరముచేత, విడంబిత=గేలిచేయఁబడిన, విద్రుమం=పగడము గలవానిని, 'మధుర వేణు నినాద వినోదినం' - మధుర=స్వాదువైన, వేణునినాద=వేణునినాదముచేత, వినోదినమ్=భవదుఃఖములను ప్రక్కకు తొలఁగించువానిని, 'కమల కోమల కమ్ర ముఖాంబుజమ్' కమల=అంబుజమువలె కోమల=సుకుమారమైన, క్రమ=సుందరమైన, ముఖాంబుజమ్=నెమ్మోము గలవానిని, కమపి=ఒకానొక, గోపకుమారమ్=గోపబాలుని, ఉపాస్మహే=ఉపాసించుచున్నాము.

తాత్పర్యము :- దొండపండువంటి మోవితో పగడమును గేలిచేయుచున్నవానిని, స్వాదువులైన వేణునాదములతో సంసారక్లేశమును తొలఁగఁద్రోయుచున్నవానిని, కమలము వలె ముద్దులొలుకు కాంతివంతమైన నెమ్మోముగల ఒకానొక గోపబాలుని ధ్యానించుచున్నాము.

శ్లో. **అధరే వినివేశ్య వంశ నాళం[2]**
వివరాణ్యస్య సలీల మంగుళీభిః ।

---

1 'వేణు నాళం' (పాఠాంతరము)

ముహురంతరయన్ ముహుర్వివృణ్వన్
మధురం గాయతి మాధవో వనాంతే ॥ 14

అన్వయము :- వనాంతే మాధవో మధురం గాయతి=అడవిలో మాధవుడు మధురముగా పాడుచున్నాడు.

అర్థము :- అధరే=మోవిపై, వంశనాళమ్=వెదురుకాడను, వినివేశ్య=మోపి, అస్య=ఈవెదురుకాడయొక్క, వివరాణి=బెజ్జములను, సలీలం=హేలగా, అంగుళీభిః=వ్రేళ్ళతో, ముహుః=మాటిమాటికి, అంతరయన్=మూయుచు, ముహుః=మఱలమఱల, వివృణ్వన్=తెఱచుచు, మాధవః=రమాధవుఁడు, వనాంతే=అడవిలో, మధురమ్=తీయఁగా, గాయతి=పాడుచున్నాఁడు.

తాత్పర్యము :- మోవిపై పిల్లనఁగ్రోవిని మోపి దీని బెజ్జములను వ్రేళ్లతో పలుమారులు హేలగా మూయుచు మఱలఁదెఱచుచు మాధవుఁడు వనమధ్యములో మధురముగా పాడుచున్నాఁడు.

శ్లో. *వదనే నవనీత గంధవాహం*
వచనే తస్కర చాతురీ ధురీణమ్ ।
నయనే కుహనాశ్రు మాశ్రయేథాః
చరణే కోమల తాండవం కుమారమ్ ॥ 15

అన్వయము :- కుమారం ఆశ్రయేథాః=కుమారుని ఆశ్రయింపుము

అర్థము :- వదనే=ముఖమునందు, నవనీత గంధవాహం=వెన్నగాలి కొట్టుచున్న వానిని, వచనే=మాటయందు, "తస్కర చాతురీ ధురీణమ్" - తస్కర=దొంగిలు వానియొక్క చాతురీ=నేర్పుతో-జాణ తనముతో, ధురీణమ్=నిండిన వానిని, నయనే=కంటి యందు, కుహనాశ్రుమ్=మోసపు కన్నీరు గలవానిని, చరణే=పాదమునందు కోమల తాండవమ్=మెత్తని 'తందనాలు' గల, కుమారమ్=పిల్లవానిని, ఆశ్రయేథాః=ఆశ్రయింపుము!

తాత్పర్యము :- నోటిపై వెన్నగాలి కొట్టుచున్న వానిని, మాటలో దొంగతనపు జాణతన ముట్టిపడుచున్న వానిని, కన్నులలో ఉత్తుత్త కన్నీళ్లు గలవానిని, అడుగులలో తందనాలు త్రొక్కుటలుగల పిల్లవానిని అశ్రయింపుము.

(**విశేషాంశము** :- ఈ శ్లోకమందలి యర్థము -

"హర్తనం నవనీతాది చౌర్యేణ వ్రజయోషితామ్ ।
గోపబాలై ర్వృతం కృష్ణం ధ్యాయన్మంత్ర మిమం జపేత్ ॥"

- అని సనత్కుమార సంహితయందు గోపాలకృష్ణ ఏకాదశాక్షరీ మంత్ర ధ్యానముగాఁ జెప్పఁబడినది).

శ్లో ॥ అమునాఽఖిలగోపగోపనార్థం
యమునారోధసి నందనందనేన ।
దమునా వనసంభవః పపే నః
కిమునాసౌ శరణార్థినాం శరణ్యః ॥ 16

అన్వయము :- శరణార్థినాం నః కిమునాసౌ శరణ్య?=శరణార్థులమైన మాకు ఈతఁడు శరణమును ఈయలేని వాఁడా?

అర్థము :- అమునా నందనందనేన=ఈ నందకుమారునిచేత, యమునా రోధసి=యమున ఒడ్డు నందు, అఖిలగోప గోపనార్థమ్=గొల్ల లందఱిని కాపాడుట కొఱకు, వనసంభవః=అడవిలో పుట్టిన, దమునాః=నిప్పు-కార్చిచ్చు, పపే=పానము చేయఁబడినది. అసౌ=ఈతఁడు, శరణార్థినాం నః=శరణు కోరిన మాకు, శరణ్యః=రక్షణమునకుఁజాలినవాఁడు, నకిము?=కాడాయేమి?

తాత్పర్యము :- ఈ నందకుమారుఁడు పూర్వము యమునానది గట్టున గొల్లలందఱిని చుట్టుముట్టుకొని వచ్చుచున్న కార్చిచ్చును నోరుతెఱచి త్రాఁగివైచినాఁడు. ఈతఁడు నేఁడు శరణార్థుల మైన మమ్ము కాపాడఁ జాలని వాఁడా యేమి?

శ్లో. జగదాదరణీయ జారభావం
జలజాపత్య వచో విచార గమ్యమ్ ।
తనుతాం తనుతాం శివేతరాణాం
సురనాథోపల సుందరం మహో నః ॥ 17

అన్వయము :- సురనాథోపల సుందరం మహః నః శివేతరాణాం తనుతాం తనుతామ్=ఇంద్రనీలమణి సుందరమైన వెలుఁగు మాపాపములను శమింపఁజేయునుగాక!

అర్థము :- 'జగదాదరణీయ జారభావం' - జగత్=లోకమునకు, ఆదరణీయ=ఆదరణయోగ్యమైన, జారభావమ్=జారత్వలక్షణము కలదియును, 'జలజాపత్య వచో విచార గమ్యమ్" - జలజాపత్య=బ్రహ్మదేవునియొక్క, వచః=మాటలయొక్క, విచార=తాత్పర్య విచారణముచేత, గమ్యం=తెలియఁదగినదియు - అయిన, సురనాథోపల సుందరమ్=ఇంద్రనీలమణి సుందరమైన, మహః=వెలుఁగు, నః=మాయొక్క, శివేతరాణాం=శుభేతరములకు - అశుభములకు, తనుతాం=కృశీభావమును, తనుతామ్=వృద్ధిపొందించునుగాక!

తాత్పర్యము :- జగత్తులకు ఆదరణీయమైన జారభావముకలదియును, తమ్మిచూలి మోమునుండి వెలువడిన పలుకులయొక్క (వేదవాక్కుల యొక్క) తాత్పర్యార్థ విచారణచేతఁదెలియఁదగినదియు నైన ఇంద్రనీలమణి సుందరమైన వెలుఁగు మా శుభేతరములకు కృశీభావమును పెంపొందించునుగాక!

శ్లో. *యా శేఖరే శ్రుతిగిరాం హృది యోగభాజాం*
పాదాంబుజే చ సులభా వ్రజ సుందరీణామ్ ।
సా కాఽపి సర్వ జగతా మభిరామ సీమా
కామాయ నో భవతు గోప కిశోర మూర్తిః ॥ 18

అన్వయము :- సా గోప కిశోరమూర్తిః నః కామాయ భవతు=ఆ గోపకిశోరమూర్తి మా మనోరథమును పండించునుగాక!

అర్థము :- యా=ఏయది, శ్రుతిగిరాం=శ్రుతినరస్వతులయొక్క, శేఖరే=సిగదండయందు, యోగభాజామ్=యోగులయొక్క, హృది=దహరమునందు, చ=మఱియును, వ్రజసుందరీణామ్=మందలోని సొగసుకత్తెల యొక్క, పాదాంబుజే=అడుగు దామరలయందు, సులభా=అలవోకగా దొరకుచుండునో, సా=అట్టి, సర్వ జగతామ్=సర్వ భువనములకును, కాఽపి=చెప్పినలవికాని, అభిరామసీమా=హృదయంగమమగు తుది మేరయైన, గోపకిశోరమూర్తిః=గోపకిశోరాకృతి, నః కామాయ=మా మనోరథమునకు గమ్యము, భవతు=అగునుగాక.

తాత్పర్యము :- ఏ యది శ్రుతి సరస్వతుల సిగబంతి యందును, యోగీశ్వరుల దహరమునందును, వ్రజసుందరుల పాదారవిందమునందును, అలవోకగా

లభించుచుండునో, అట్టి సకల భువనాభిరామసీమమైన అనిర్వచయమగు గోపకిశోరాకృతి, మా మనోరథమునకు గమ్యస్థాన మగునుగాక!

శ్లో. అత్యంత బాల మతసీ కుసుమ ప్రకాశం
దిగ్వాససం కనక భూషణ భూషితాంగమ్ ।
విస్రస్త కేశ మరుణాధర మాయతాక్షం
కృష్ణం నమామి మనసా వసుదేవ సూనుమ్ ॥ 19

అన్వయము :- మనసా వసుదేవ సూనుం కృష్ణం నమామి - మనసార వసుదేవసూనుఁడైన కృష్ణుని నమస్కరించుచున్నాను.

అర్థము :- అత్యంత బాలమ్=మిక్కిలి చిఱుత ప్రాయము వానిని, అతసీ కుసుమ ప్రకాశమ్=నల్ల అవిసెపూవు వన్నియవానిని, దిగ్వాసనమ్=దిస్సమొలవానిని, కనకభూషణ భూషితాంగమ్=బంగారునగలతో అలంకరింపఁబడిన మేనివానిని, విస్రస్త కేశమ్=విరియఁబాఱిన కూఁకటివానిని, అరుణాధరమ్=ఎఱ్ఱని మోవివానిని, ఆయతాక్షమ్=వెడఁద కన్నులవానిని, వసుదేవ సూనుమ్=వసుదేవుని నిసుగైన, కృష్ణం=కృష్ణుని, మనసా=మనస్సులో, నమామి=నమస్కరించుచున్నాను.

తాత్పర్యము :- మిక్కిలి చిఱుత ప్రాయము వానిని, నల్లని అవిసెపూవు వన్నియవానిని, దిస్సమొలవానిని, బంగారునగలు తొడిగిన మేనివానిని, విరియఁబాఱిన కూఁకటిజుట్టువానిని, ఎఱ్ఱని పెదవివానిని, వెడఁద కన్నులవానిని, వసుదేవుని నిసుగైన కృష్ణుని మనసార నమస్కరించుచున్నాను.

శ్లో. హస్తాంఘ్రి నిక్వణిత కంకణ కింకిణీకం
మధ్యేనితంబ మవలంబిత హేమసూత్రమ్ ।
ముక్తా కలాప ముకులీకృత కాకపక్షం
వందామహే వ్రజచరం వసుదేవ భాగ్యమ్ ॥ 20

అన్వయము :- వ్రజచరం వసుదేవ భాగ్యం వందామహే = మందలో నడయాడుచున్న వసుదేవుని భాగ్యమును పొగడుచున్నాము.

అర్థము :- 'హస్తాంఘ్రి నిక్వణిత కంకణకింకిణీకమ్' - హస్తాంఘ్రి=కేలుదోయియందు అడుగుగవయందు, నిక్వణిత=గలగలలాడుచున్న, కంకణ=కడియములు కింకిణీకమ్=మువ్వలు గలవానిని, మధ్యే నితంబం=నితంబమధ్యమునందు అవలంబిత=వ్రేల్చఁబడిన, హేమసూత్రమ్=బంగారు మొలత్రాడు గలవానిని, 'ముక్తాకలాప ముకుళీకృత కాకపక్షమ్' - ముక్తాకలాప=ముత్యాల సోఁగు (రావిరేక) చేత, ముకుళీకృత=ముడువఁబడిన, కాకపక్షమ్=పిల్లజెంద్రుకలు గలవానిని, వ్రజచరం=మందలో నడయాడుచున్న, వసుందేవ భ్యాగమ్=వసుదేవుని భాగ్యమును, వందామహే=స్తుతించు చున్నాము.

తాత్పర్యము :- కేలుదోయియందు - అడుగుగవయందు గలగల మ్రోఁగుచున్న కడియాల అందెల మువ్వల గలగలలు గలవానిని, పిఱుదుపై వ్రేలుచున్న బంగరు మొలత్రాఁడు గలవానిని, ముత్యాలసోఁగుచే (రావిరేకచే) ముడువఁబడిన పిన్న కూఁకటులతో మంద వీథులలో నడయాడుచున్న వసుదేవభాగ్యమును స్తుతించుచున్నాము.

(**విశేషాంశము** :- ఈ శ్లోకమందలి యర్థము -

> *" పంచ హాయన మిశానం ధావమానం వ్రజాంగణే ।*
> *కింకిణీ నూపుర గ్రీవా కర్ణభూషోజ్జ్వలం స్మరేత్ ॥ "*

- అని శ్రీకృష్ణ అష్టాక్షరీ ధ్యానముగా సనత్కుమార సంహితయందుఁ జెప్పఁబడినది).

> శ్లో. *బృందావన ద్రుమ తలేషు గవాం గణేషు*
> *వేదావసాన సమయేషు చ దృశ్యతే యత్ ।*
> *తద్వేణు నాదన పరం శిఖిపింఛ చూడమ్*
> *బ్రహ్మ స్మరామి కమలేక్షణ మభ్ర నీలమ్ ॥* 21

అన్వయము :- అభ్రనీలం కమలేక్షణం బ్రహ్మస్మరామి=అంబుద వినీలము అంబుజ విలోచనము అయిన బ్రహ్మమును స్మరింతును.

అర్థము :- బృందావన ద్రుమ తలేషు=బృందావనమునందలి చెట్లక్రిందను, గవాం గణేషు=గోగణములయందును, వేదావసాన సమయేషు చ=వేదములయొక్క చరమ సీమలయందును, యత్=ఎయ్యది, దృశ్యతే=గోచరించుచుండునో, తత్=ఆ,

కమలేక్షణమ్=అంబుజములవంటి కన్నులు గలదియును, అభ్రనీలమ్=అంబుదమువలె నీలవర్ణము నయిన, బ్రహ్మ=బ్రహ్మ పదార్థమును, స్మరామి=స్మరించుచున్నాను.

తాత్పర్యము :- ఎయ్యది బృందావనము చెట్లనీడలలోను, గోగణముల నడుమ,వేదముల చరమ సమయములయందును, నయనగోచర మగుచునుండునో, అట్టి కమలములవంటి కన్నులుగల, సజలజలదమువంటి నీలవర్ణముగల బ్రహ్మపదార్థమును తలపోయుచుందును.

శ్లో. ***వ్యత్యస్త పాద మవతంసిత బర్హిబర్హం***
సాచీకృతానన నివేశిత వేణురంధ్రమ్ ।
తేజః పరం పరమకారుణికం పురస్తాత్
ప్రాణ ప్రయాణ సమయే మమ సన్నిధత్తామ్ ॥ 22

అన్వయము :- పరమకారుణికం పరం తేజః మమ ప్రాణప్రయాణ సమయే పురః సన్నిధత్తామ్=పరమకారుణికమైన పరమతేజము ప్రాణప్రయాణ సమయమునందు నా యెట్టయెదుట వచ్చి నిలుచునుగాక!

అర్థము :- వ్యత్యస్త పాదమ్=వ్యత్యాసముగా నిలిపిన పాదములు గలదియును - అనఁగా ఎడమపాదముపై అడ్డముసాచి నిలిపిన కుడిపాదము గలదియును, అవతంసిత బర్హిబర్హమ్=సిగబంతిగా అవధరింపఁబడిన నెమలి పింఛము కలదియును, 'సాచీకృతానన నివేశిత వేణురంధ్రమ్' - సాచీకృత=ప్రక్కగాఁద్రిప్పఁబడిన, ఆనన=నెమ్మోమునందు, వినివేశిత=అమరింపఁబడిన, వేణు=పిల్లనఁగ్రోవియొక్క, రంధ్రమ్=బెజ్జములు గలదియును, పరమ కారుణికమ్=నిరవధిక కరుణాస్వభావముగల, పరంతేజః=పరతేజము, మమ=నాయొక్క, ప్రాణ ప్రయాణ సమయే=ప్రాణములు పయనించు సమయమునందు పురస్తాత్=ఎట్టయెదుట, సన్నిధత్తామ్=వచ్చి నిలుచునుగాక !

తాత్పర్యము :- ఎడమడుగుగా నిలిపిన అడుగులతో, సిగబంతిగా అమరించి కొనిన శిఖిబర్హముతో, ఓరగాఁద్రిప్పిన మోము నందు నిలిపికొనిన పిల్లనఁగ్రోవి బెజ్జములతో, పరమ కరుణామయమైన పరతేజము, ప్రాణములు పయనమైపోవు సమయములో, నా యెట్టయెదుటకు వచ్చి నిలుచుండునుగాక!

శ్లో. ఘోష ప్రఘోష శమనాయ మథోగుణేన
మధ్యే బబంధ జననీ నవనీతచోరమ్ ।
తద్బంధనం త్రిజగతా ముదరాశ్రయాణామ్
ఆక్రోశకారణ మహో! నితరాం బభూవ ॥ 23

అవతారిక :- ఒక విచిత్రమును చెప్పుచున్నాడు -

అర్థము :- 'ఘోష ప్రఘోషశమనాయ' - ఘోష=మందప్రజలయొక్క, ప్రఘోష=చాడీల హోరును, శమనాయ=మానిపించుటకుగాను, నవనీతచోరమ్=వెన్నదొంగను, జననీ=యశోద, మధ్యే=నడుమునందు, బబంధ=(ఱోటికి) కట్టెను, తత్=ఆ, బంధనమ్=కట్టు, ఉదరాశ్రయాణామ్=బొజ్జలో నెలకొనిన, త్రిజగతామ్=మూడు లోకములవారికిని, నితరామ్=మిక్కిలియును, ఆక్రోశ=మొఱ్ఱలు పెట్టుటకు, కారణమ్=నిమిత్తముగా, బభూవ=ఆయెను, అహో=ఆశ్చర్యము!

తాత్పర్యము :- మందలోని ప్రజల చాడీల హోరును మానిపించుటకయి తల్లియైన యశోద వెన్నదొంగను పట్టి బొజ్జను ఱోటికి బిగించి కట్టి వైచెను. ఆ బంధనము వెన్నదొంగకు బదులుగా - వాని బొజ్జలో నున్న మూడు లోకములవారును మొఱ్ఱలు పెట్టుకు నిమిత్తమయ్యెను. ఆశ్చర్యముగా నున్నది.!

శ్లో. శైవా వయం న ఖలు తత్ర విచారణీయం
పంచాక్షరీ జపపరా నితరాం తథా ఽపి ।
చేతో మదీయ మతసీకుసుమావభాసం
స్మేరాననం స్మరతి గోపవధూ కిశోరమ్ ॥ 24

అవతారిక :- వేఱొక విశేషమును జెప్పుచున్నాడు -

అర్థము :- వయం శైవాః=మేము శైవులము, తత్ర=ఆ విషయమునందు, విచారణీయమ్=విచారణచేసి తెలియదగినది, నఖలు=లేదుకదా!, నితరామ్= మిక్కిలియును, పంచాక్షరీ జపపరాః=పంచాక్షరీ జప పరాయణులము, తథాఽపి= అట్లయినప్పటికిని, మదీయమ్చేతః=నాయదియైన చేతస్సు, అతసీ కుసుమావభాసమ్- అతసీ కుసుమ=నల్ల అవిసె పూవువంటి, అవభాసం=వెలుగు కలట్టియును, స్మేరాననమ్

- స్మేర=వికాసశీలమైన, ఆననమ్=నెమ్మోముగల, గోపవధూ కిశోరమ్=యశోదా కిశోరుని, స్మరతి=తలపోయు చుండును.

తాత్పర్యము :- మేము శైవులము, ఆ విషయములో విచారణచేయవలసినది లేదుగదా! మిను మిక్కిలి పంచాక్షరీ జప పరాయణులము. అట్లయినను నాయది యైన యీ చేతస్సు ఎల్లప్రొద్దును నల్ల అవిసెపూవు వన్నియతో వెలుఁగుచుండువాఁడును, నిత్యవికాసశీలమైన నెమ్మోము గలవాఁడునగు - ఆ యశోదా శిశువునే తలపోయుచుండును.

శ్లో. *రాధా పునాతు జగ దచ్యుతదత్తచిత్తా*
మంథాన మాకలయతీ దధిరిక్తపాత్రే ।
తస్యాః స్తన స్తబక చంచల లోలదృష్టిః
దేవోఽపి దోహనధియా వృషభం నిరుంధన్ ॥ 25

అవతారిక :- వేఱొక తబ్బిబ్బు చెప్పుచున్నాఁడు.

అర్థము :- అచ్యుతదత్త చిత్తా - అచ్యుత=అచ్యుతుని కొఱకు, దత్త=కైవస మొనర్పఁబడిన, చిత్తా=మానసము కలదియై, దధిరిక్త పాత్రే=దధిశూన్యమైన కుండలో - (పెరుగులేని కుండలో), మంథానమ్=కవ్వమును, ఆకలయతీ=త్రిప్పుచున్న, రాధా=శ్రీరాధాదేవి, జగత్=లోకమును, పునాతు=పావనమును చేయునుగాక!, తస్యాః=ఆ రాధాదేవియొక్క, స్తన స్తబక=చనుగుత్తుల యందు, చంచల=ప్రసరించుచున్న, లోల=ప్రవణమైన - తదేకాసక్తమైన, దృష్టిః=చూడ్కి కలవాఁడై, దోహనధియా= పిదుకవలయుననెడి యూహతో, వృషభమ్=ఎద్దును, రుంధన్=బందెవైచి నిర్బంధించుచున్న, దేవోఽపి=శ్రీకృష్ణదేవుఁడు కూడ - (జగత్ పునాతు=లోకమును పావనముచేయునుగాక!)

తాత్పర్యము :- అచ్యుతార్పితమైన చిత్తవృత్తి కలదగుటవలన పెరుగులేని కుండలో కవ్వము వైచి త్రిప్పుచున్న శ్రీరాధాదేవి జగములను పావనము చేయునుగాక! ఆమె స్తనస్తబకముల యందు చంచలించుచు తదేకప్రవణదృష్టియగుటవలన పాలుపిదుకు తలంపుతో కాళ్లకు బందమువైచి వృషభమును పట్టువఱుచుచున్న స్వామియును భువనములను పావనము చేయుఁగాక!

వివరణము :- అన్యోన్య వినిహితాత్ములగుట వలన మనోలయము పొందిన

సమాధి స్థితిలో నున్న యిరురువురును సంకల్ప వికల్పరూపమైన కశ్మలమును అణంచి లోకమును పావనము చేయుదారుగాక! ఇది మహాభావస్థితి. ఇందు కామగంధము లేదు.

శ్లో. గోధూళి ధూసరిత కోమల కుంతలాగ్రం
గోవర్ధనోద్ధరణ కేళి కృత ప్రయాసమ్ ।
గోపీజనస్య కుచకుంకుమ ముద్రితాంగం
గోవింద మిందువదనం శరణం భజామః ॥ 26

అన్వయము :- ఇందువదనం గోవిందం శరణం భజామః=ఇందువదనుఁడైన గోవిందుని రక్షకునిగా భజింతుము.

అర్థము :- 'గోధూళి ధూసరిత కోమల కుంతలాగ్రమ్' - గోధూళి=గోపాద పరాగములచేత, ధూసర=బూదివన్నె కలవియైన, కోమల=మెత్తనివైన, కుంతలాగ్రమ్= కుంతలముల కొసలు గలవానిని, 'గోవర్ధనోద్ధరణ కేళికృత ప్రయాసమ్' - గోవర్ధన=గోవర్ధన పర్వతము యొక్క, ఉద్ధరణ=ఎత్తిధరించుట అనెడి, కేళి=ఆటయందు, కృతప్రయాసమ్= అలసటపొందియున్న వానిని, గోపీజనస్య=గోపికాజనముయొక్క, కుచ కుంకుమ=కుచ మండలములయందలి కుంకుమ ద్రవముచేత, ముద్రిత=చిహ్నితమైన, అంగం=శరీరము గలవానిని, ఇందు వదనమ్=చంద్రుని వలె ప్రహ్లాదనమైన ఆననముగల, గోవిందమ్=గోవిందుని, శరణం=రక్షకునిగా, భజామః=సేవించెదము.

తాత్పర్యము :- గోధూళి కప్పి బూదివన్నియలైన మెత్తని కుంతలముల కొసలు కలవానిని, గోవర్ధన పర్వతమును మీదికెత్తి ఏడహోరాత్రములు ధరించుట అనెడి ఆటయందు కృతశ్రముఁడైన వానిని, గోపికా జనముయొక్క కుచకలశ కుంకుమ ద్రవముచేత ముద్రితమైన శరీరము గలవానిని, చంద్రబింబమువలె ప్రహ్లాదనమైన ముఖమండలము గల - గోవిందుని రక్షకునిగా భజించెదము.

శ్లో. యద్రోమరంధ్ర పరిపూర్తి విధావదక్షా
వారాహ జన్మని బభూవు రమీ సముద్రాః ।
తం నామనాథ మరవింద దృశం యశోదా
పాణి ద్వయాంతర జలైః స్నపయాం బభూవ ॥ 27

అవతారిక :- వరాహావతార వైభవమును వర్ణించుచున్నాఁడు

అర్థము :- వారాహజన్మని=వారాహమైన అవతారమునందు, అమీ సముద్రాః=ఈ సముద్రములన్నియును, యద్రోమరంధ్ర పరిపూర్తి విధౌ=ఏస్వామి యొక్క ఒక్క రోమకూపమును నింపుట అను కృత్యమునందు, అదక్షాః=చాలకపోయినవో, అరవింద దృశమ్=కమలాక్షుఁడైన, తం నామనాథమ్=ఆ ప్రభువునట!, యశోదా=యశోదాదేవి, పాణి ద్వయాంతర జలైః=దోసెడు నీళ్లతో, స్నపయాం బభూవ=జలక మాడించెను.

తాత్పర్యము :- వరాహావతార సమయమునందు ఏ పరమపురుషునియొక్క ఒక్క రోమ కూపమును నింపుటకునైన ఈ సకల సముద్రములును చాలియుండక పోయినవో, అట్టి సకలలోకనాథుఁడైన అరవింద నయనుని యశోదాదేవి తన దోసెడు నీళ్లతో బోరుకాడించెను. ఇదేమి ఆశ్చర్యము!

శ్లో॥ వర మిమ ముపదేశ మాద్రియధ్వం
నిగమ వనేషు నితాంతచార ఖిన్నాః ।
విచినుత భవనేషు వల్లవీనామ్
ఉపనిషదర్థ ములూఖలే నిబద్ధమ్ ॥ *28*

అవతారిక :- హితోపదేశము - వేదాంత విదులు వెదకి కానని తత్త్వము సులభముగా దొరుకునట్టి చోటును జెప్పుచున్నాఁడు.

అర్థము :- నిగమ వనేషు=వేద విపినముల యందు, నితాంతచార=నిరంతర భ్రమణముచేత, ఖిన్నాః=ఖేదము పొందిన బుధులారా! ఇమ ముపదేశమ్=ఈ హితో పదేశమును, వరమ్=ఇంచుక, ఆద్రియధ్వం=ఆదరింపుఁడు!, ఉలూఖలే నిబద్ధమ్= ఱోటియందు కట్టఁబడియున్న, ఉపనిషదర్థమ్=ఉపనిషత్తులయొక్క తాత్పర్యార్థమును, వల్లవీనాం భవనేషు=గోపికాభవనముల యందు, విచినుత!=వెదకుఁడు!

తాత్పర్యము :- వేదారణ్యముల యందు నిరంతర భ్రమణము చేసిచేసి నిలుకడమాని డస్సిపోయిన విద్వాంసులారా! మీరు శ్రేయస్కరమైన యీ మాట కొంచెము మన్నించి వినుడు! వల్లవీ మందిరములలో ఱోటియందు బిగియఁగట్టఁబడి - ఉపనిషదర్థమున్నది. వెదకి పట్టుకొనుఁడు.

శ్లో. **దేవకీ తనయ పూజన పూతః ।**
పూతనారి చరణోదక ధౌతః ।
య ద్యహం స్మృత ధనంజయ సూతః ।
కిం కరిష్యతి స మే యమదూతః? ॥ 29

అన్వయము :- సః యమదూతః మే కింకరిష్యతి?=ఆ యమదూత నన్నేమిచేయును?

అర్థము :- అహంయది=నేను కనుక, 'దేవకీతనయ పూజిన పూతః' దేవకీతనయ=దేవకి కొడును, పూజన=పూజించుట చేత, పూతః=పవిత్రుడను, 'పూతనారి చరణోదక ధౌతః' - పూతనారి=పూతనా ఘాతుకునియొక్క, చరణోదక=పాదోదకముచేత, ధౌతః=కడుగఁబడినవాఁడను, 'స్మృత ధనంజయ సూతః' స్మృత=స్మరింపఁబడిన, ధనంజయ= అర్జునునియొక్క, సూతః యది=సారథికలవాఁడనయ్యెదనేని, సః=ఆ, యమదూతః= యమదూత, మే=నన్ను, (కర్మణీ షష్ఠీ=ద్వితీయార్థములో షష్ఠి) కిం కరిష్యతి?=ఏమి చేయఁగలడు?

తాత్పర్యము :- నేను-దేవకీ నందనుని పూజచేత పవిత్రుఁడనై, పూతనాంతకుని చరణోదకమునందు మజ్జన మాడి, పార్థ సారథిని మనసున నిలిపికొని యుందునేని - ఆ యమదూత నన్నేమి చేయఁగలడు?

శ్లో. **భాసతాం భవ భయైక భేషజం**
మానసే మమ ముహు ర్ముహు ర్ముహుః ।
గోపవేష ముపసేదుషః స్వయం
యాఽపి కాఽపి రమణీయతా విభోః ॥ 30

అన్వయము :- మే మానసే విభోః యాఽపి కాఽపి రమణీయతా భాసతామ్=నా మానసములో విభునియొక్క ఏ ఒక్క రమణీయతయైనను వెలుఁగుచుండునుగాక!

అర్థము :- 'భవభయైక భేషజమ్' - భవభయ=సంసార భయములకు, ఏక భేషజమ్=ముఖ్యౌషధమైన, గోపవేషమ్=గోపవేషమును, స్వయం=తనంతట, ఉసేదుషః=అందికొనయున్న,విభోః=సర్వవ్యాపకుఁడైన స్వామియొక్క, యాఽపి కాఽపి రమణీయతా=ఏ ఒక్క రమణీయతయైనను, మే మానసే=నా మానసమునందు, ముహుర్ముహుర్ముహుః=ప్రతిక్షణము నందును, భాసతామ్=స్ఫురించుచుండునుగాక!

తాత్పర్యము :- సంసార భయములకు అన్నింటికిని ముఖ్యౌషధమైన గోపవేషమును స్వయముగా అందుకొని, ప్రాణులకు అందుఁబాటైన సర్వవ్యాపకుఁడైన పరమేశ్వరుని యొక్క-ఏ-ఒక్క రమణీయతయైనను నామానసమునందు మాటిమాటికిని స్ఫురించుచుండునుగాక!

శ్లో. **కర్ణలంబిత కదంబ మంజరీ ।**
కేసరారుణ కపోల మండలమ్ ।
నిర్మలం నిగమవా గగోచరం ।
నీలిమాన మవలోకయామహే ॥ 31

అన్వయము :- నిగమవా గగోచరం నీలిమాన మవలోకయామహే=నిగమాంత వాక్కులకు అంతుపట్టని నీలిమను అవలోకించుచున్నాము.

అర్థము :- కర్ణలంబిత=వీనులకు వ్రేల్చఁబడిన, కదంబ మంజరీ=కడిమి పూవు గుత్తులలోని, కేసర=అకరువులచేత, అరుణ=అరుణ వర్ణమైన, కపోల మండలమ్=గుండ్రని చెక్కిళ్లు గలవానిని, నిర్మలం=నిర్మలుని, 'నిగమవాగగోచరమ్' - నిగమవాక్=వేదవాక్కులకు, అగోచరమ్=గోచరించని, నీలిమానమ్=నీలిమను (నల్లనివానిని - శ్రీకృష్ణుని), అవలోకయామహే=అవలోకించు చున్నాము.

తాత్పర్యము :- వీనులకు వ్రేలఁదీయఁబడిన కడిమిపూల గుత్తులలోని అకరువుల చేత ఎఱ్ఱఁదనమంటిన కపోలమండలములు గలవానిని. రజస్తమో మాలిన్యములులేని వానిని, నిగమవాక్కులకు అగోచరమైన నీలిమను - అనగా నల్లని శ్రీకృష్ణుని అవలోకించుచున్నాము.

(**విశేషాంశము :-** ఈ శ్లోకమందలి యర్థము గోపాల కల్పకమునందు -

"నీలోత్పల దళశ్యామం, పీతవాసన మచ్యుతమ్ ।
శుద్ధస్ఫటిక సంకాశ, మథవా పురుషోత్తమ్ ॥
ధాత్వా నిత్యం జపేన్మంత్రం, యాక్షారి త్రిసహస్రకమ్ ।"

- అని గోపాల మంత్రరాజముయొక్క యాక్షోపయోగ ప్రయోగమందలి ధ్యానముగాఁ జెప్పఁబడినది).

శ్లో. సాచి సంచలిత లోచనోత్పలం ।
సామి కుట్మలిత కోమలాధరమ్ ।
వేగ వల్గిత కరాంగులీ ముఖం
వేణునాద రసికం భజామహే ॥ 32

అన్వయము :- వేణునాద రసికం భజామహే=వేణునాద రసికుని భజించెదము.

అర్థము :- సాచి సంచలిత లోచనోత్పలమ్=కెలఁకులకు కదలిన నల్లకలువలవలెనున్న కన్నులు గలవానిని, సామి కుట్మలిత కోమలాధరమ్ - సామి=సగము, కుట్మలిత=ముకుళీ భూతమైన, కోమల=సుకుమారమైన, అధరమ్=పెదవి కలవానిని, 'వేగవల్గిత కరాంగుళీ ముఖమ్' - వేగ=వేగముతో, వల్గిత=కదలింపఁబడిన, కరాంగుళీ=చేతివ్రేళ్లయొక్క, ముఖం=కొనలుగల, వేణునాద=వేణునాదమునందు, రసికమ్=రసీభావమునందిన వానిని, భజామహే=సేవించెదము.

తాత్పర్యము :- కెలంకులకుఁగదలుచున్న నల్లకలువలవలెనున్న కన్నులు గల వానిని, అఱమొగ్గఁగాఁ జేయఁబడిన కెంబెదవి కలవానిని, వేగముగా కదలింపఁబడిన చేతి వ్రేళ్ల కొనలుగల వేణునాద రసికుని భజించెదము.

శ్లో. స్యందనే గరుడ మండిత ధ్వజే ।
కుండినేశ తనయాధిరోపితా
కేనచి న్నవ తమాల పల్లవ ।
శ్యామలేన పురుషేణ నీయతే ॥ 33

అన్వయము :- కేనచిత్ పురుషేణ కుండినేశ తనయా నీయతే=ఒకానొక పురుషునిచేత కుండినేశ్వరుని కూఁతురు కొనిపోవఁబడుచున్నది.

అర్థము :- 'గరుడ మండిత ధ్వజే' - గరుడ=గరుడుని చేత, మండిత=విభూషితమైన, ధ్వజే=కేతనముగల, స్యందనే= రథమునందు, అధిరోపితా=ఎక్కించుకొనఁబడినదియై కుండినేశతనయా=కుండిన నగరాధీశ్వరుని కూఁతురు, కేనచిత్=ఒకానొక, నవ తమాల పల్లవ శ్యామలేన=తరుణ తమాల పల్లవ శ్యామల వర్ణుఁడైన, పురుషేణ=పురుషుని చేత, నీయతే=ఏగింపఁబడుచున్నది.

తాత్పర్యము :- గరుడాలంకృత కేతనమైన రథముపై నధిరోహింపఁజేసికొనఁబడి కుండిన నగరాధీశ్వరుని కూఁతురు ఎవరో ఒక తరుణ తమాల పల్లవ శ్యామల వర్ణుఁడైన పురుషుని చేత ఏగింపఁబడుచున్నది.

శ్లో. ***మా ఽఽయాత పాంథాః పథి భీమరథ్యాః***
దిగంబరః కోఽపి తమాలనీలః ।
విన్యస్త హస్తోఽపి నితంబబింబే
ధూర్తః సమాకర్షతి చిత్తవిత్తమ్ ॥ 34

అన్వయము :- భోః పాంథా! భీమరథ్యాః పథి మాఽఽయాత!=ఓ బాటసారులారా! భీమరథీనది దారిని రావలదు.

అర్థము :- భోః పాంథాః!=ఒయ్యోయి బాటసారులారా! భీమరథ్యాః పథి=భీమరథీనది వైపు దారిని, మాఽఽయాత!=రాకుండుఁడు!, కోఽపి దిగంబరః=ఎవరో దిస్సమొలవాఁడు, తమాల నీలః=కానుగుచెట్టువలె నల్లనివాడు, నితంబబింబే=కటిబింబమునందు, విన్యస్త హస్తోఽపి=ఘటితహస్తుఁడై యుండియే, చిత్తవిత్తమ్=మనోధనమును, సమాకర్షతి=లాఁగి వేయును, ధూర్తః=మోసకాఁడు.

తాత్పర్యము :- ఒయ్యోయి బాటసారులారా! భీమరథీనది దారిని రావలదు. ఎవరో దిస్సమొలవాఁడు కానుగుచెట్టు మాదిరినే నల్లగానుండును. రొండి మీఁది చేతులు అట్లే యుండును, కాని మీచిత్త ధనమును మాత్రము లాఁగికొనును. వాడు మిక్కిలి మోసకాఁడు సుమా!

రాసక్రీడాష్టకమ్

శ్లో. ***అంగనా మంగనా మంతరే మాధవో***
మాధవం మాధవం చాంతరే ణాంగనా ।
ఇత్థ మాకల్పితే మండలే మధ్యగః
సంజగౌ వేణునా దేవకీనందనః ॥ 35

అన్వయము :- దేవకీనందనో వేణునా సంజగౌ=దేవకీనందనుఁడు వేణువుతో సొగసుగా గానముచేసెను.

అర్థము :- అంగనామ్ అంగనామ్ అంతరే మాధవః=స్త్రీ స్త్రీ నడుమ మాధవుఁడు, మాధవం మాధవం చాంతరేణ=మాధవుని మాధవుని నడుమ, అంగనా=స్త్రీ, ఇత్థమ్=ఈ విధముగా, ఆకల్పితే=అల్లఁబడిన, మండలే=వలయమునందు, మధ్యగః=మధ్య ప్రదేశమునందు నిలిచి, దేవకీనందనః=దేవకీనందనుఁడు, వేణునా=వేణువుతో, సంజగౌ=సొగసుగా గానముచేసెను.

తాత్పర్యము :- స్త్రీ స్త్రీ నడుమ మాధవుఁడు. మాధవుని మాధవుని నడుమస్త్రీ. ఈ విధముగా విరచితమైన మండలయు యొక్క నడిమి ప్రదేశమునందు నిలిచి దేవకీనందనుఁడు వేణువుతో సొగసుగా గానము చేసెను.

శ్లో. *కేకి కేకా ఽఽదృతానేక పంకేరుహా*
లీన హంసావళీ హృద్య తాహృద్యతా ।
కంసవంశాటవీ దాహ దావానలః
సంజగౌ వేణునా దేవకీనందనః ॥ 36

అన్వయము :- దేవకీ నందనో వేణునా సంజగౌ=దేవకీనందనుడు వేణువుతో చక్కగా పాడెను.

అర్థము :- కేకి=నెమళ్ల యొక్క, కేకా=కూజతములచేత, ఆదృత=ఆదరింపఁబడిన, అనేక=అసంఖ్యాకములైన, పంకేరుహ=పద్మములయందు, ఆలీన=ఒదిగియున్న, హంసావళీ=హంసమాలలయొక్క, హృద్యతా=హృద్యతకంటె,హృద్యతా=హృదయంగమ మైనది (ఆ రాసక్రీడ అనుట), కంస=కంసునియొక్క, వంశ=వంశమే అనెడి వెదుళ్ల యొక్క, అటవీ=అడవియొక్క, దాహ=దహించుటయందు, దావానలః=దావాగ్నియైన, దేవకీనందనః=దేవకీనందనుఁడు, వేణునా=వేణువుతో, సంజగౌ=చక్కగా గానముచేసెను.

తాత్పర్యము :- ఆరాసలీలా సౌందర్యమెట్టిది యనఁగా - మయూర వాణులచేత సమాదరింపఁబడిన పద్మవన నిలీనములైన హంసమాలలయొక్క హృద్యత్వముకంటె హృదయంగమత్వ లక్షణముకలది. అనఁగా ఇచ్చట కేకి - (మయూరము) కృష్ణుఁడు. ఆ కృష్ణుని కేక - మయూర వాణియే వేణుధ్వని! ఆ నాదముచేత ఆదరింపఁబడిన పద్మవన నిలీనములైన హంసావళులే గోపికాశ్రేణులు. వీరి హృద్యతాలక్షణము ఆ హంసమాలలయొక్క హృద్యతకంటె హృద్యముగా నున్నదనుట. ఆ దేవకీనందనుఁడు కంసవంశమే యనెడి వంశాటవి - వెదుళ్ల అడవిని దహించునట్టి దావాగ్ని!

శ్లో. ***క్వాపి వీణాభి రారావిణా కంపిత:***
క్వాపి వీణాభి రాకింకిణీ నర్తిత: ।
క్వాపి వీణాభిరామాంతరం గాపిత:
సంజగౌ వేణునా దేవకీనందన: ॥ 37

అన్వయము :- దేవకీ నందనో వేణునా సంజగౌ=దేవకీ నందనుఁడు వేణువుతో లెస్సగా గానము చేసెను.

అర్థము :- క్వాపి=ఒకచోట, వీణాభి:=వీణలతో, ఆరావిణా=ఆరావము కలదియైన (వేణునా=వేణువుతో), కంపిత:=కదలింపఁబడినవాఁడై - క్వాపి=వేఱొకచోట, వీణాభి:= వీణలతో, ఆకింకిణీ=ఎల్లయెడల చిఱుమువ్వల గలగలలతో, నర్తిత:= నర్తింపఁజేయఁబడినవాఁడై, క్వాపి=ఇంకొకచోట, వీణాభిరామాంతరం-వీణా=వీణా క్వణనములతో, అభిరామ=హృదయాభిరామములైన, అంతరం=వ్యవధానములు గలుగునట్లుగా, గాపిత:=గానముచేయింపఁబడినవాఁడై, దేవకీనందన:=దేవకీనందనుఁడు, వేణునా=వేణువుతో, సంజగౌ=లెస్సగా గానము చేసెను.

తాత్పర్యము :- ఒకచోట వీణలతో లీనమైన ఆరావముగల వేణువుతో, (వేణునాదముతో) కదలింపఁబడిన వాఁడై - వేఱొక చోట - వీణలతో ఎల్లయెడల చిఱుమువ్వల గలగలలతో నర్తింపఁ.జేయబడిన వాఁడై - ఇంకొక చోట - వీణా నిక్వణనాభిరామములైన వేణుగాన వ్యవధానములు గలుగునట్లుగా గానము చేయింపఁబడిన వాఁడై - దేవకీనందనుఁడు వేణువుతో లెస్సగా గానముచేసెను.

శ్లో. ***చారు చంద్రావళీ లోచనై శ్చుంబితో***
గోప గోబృంద గోపాలికా వల్లభ: ।
వల్లవీబృంద బృందారక: కాముక:
సంజగౌ వేణునా దేవకీనందన: ॥ 38

అన్వయము :- దేవకీనందనో వేణునా సంజగౌ=దేవకీ నందనుఁడు వేణువుతో సొగసుగా గానము చేసేను.

అర్థము :- 'చారుచంద్రావళీలోచనై:' - చారు=సుందరమైన చంద్రావళీ= చంద్రావళియొక్క,(వెండి భూషణములుగల స్త్రీల యొక్క), లోచనై:=చూపులచేత,

చుంబితః=చుంబింపఁబడిన వాఁడును, 'గోప గోబృంద గోపాలికా వల్లభః' - గోప=గోపకులకు, గోబృంద=గోబృందమునకు, గోపాలికా=గోపికలకు, వల్లభః=ప్రియుఁడును, 'వల్లవీ బృంద బృందదారకః' వల్లవీబృంద=గోపికాబృందమునకు, బృందారకః=దైవతమును, కాముకః=కమనుఁడును అయిన, దేవకీనందనః=దేవకీనందనుఁడు, వేణునా=వేణువుతో, సంజగౌ=సొగసుగా గానముచేసెను.

తాత్పర్యము :- చంద్రావళీ చారులోచనములతో చుంబింపఁబడిన వాఁడును, గోపకులకు గోబృందమునకు గోపాలికలకును వల్లభుడును, వల్లవీ బృందమునకు దైవతమును కమనుఁడును అయిన దేవకీనందనుఁడు వేణువుతో సొగసుగా గానముచేసెను.

శ్లో. ***మౌళి మాలా మిళ న్మత్త భృంగీలతా***
భీతభీత ప్రియా విభ్రమాzలింగితః ।
స్రస్త గోపీ కుచాభోగ సమ్మేళితః
సంజగౌ వేణునా దేవకీనందనః ॥ *39*

అన్వయము :- దేవకీ నందనో వేణునా సంజగౌ=దేవకీ నందనుఁడు వేణువుతో లెస్సగా గానము చేసెను.

అర్థము :- మౌళి=ధమ్మిల్లమునందలి, మాలా=పుష్పమాలలయందు, మిళత్=మిళితములగుచున్న, మత్త=మదించిన, భృంగీలతా=తుమ్మెద దాఁటులవలన, భీతభీత=మిక్కిలి బెదరిన, ప్రియా=ప్రియురాండ్రచేత, విభ్రమ=విభ్రమ చేష్టలతో ఆలింగితః=కౌగిలించికొనఁబడినవాఁడును, స్రస్త=జాఱిన, గోపీ=గోపికలయొక్క, కుచ=కుచమండలములయొక్క, ఆభోగ=పరిపూర్ణ భావము చేత, సమ్మేళితః=సమ్మేళనము పొందినవాఁడై, దేవకీనందనుఁడు వేణువుతో లెస్సగా గానముచేసెను.

తాత్పర్యము :- ధమ్మిల్ల కుసుమ మాలలయందు వచ్చిచేరుచున్న గండుతుమ్మెద బారులచేత మిక్కిలి బెదరిన ప్రియురాండ్రచేత సవిభ్రమముగాఁ గౌగిలించుకొనఁబడుచున్న వాఁడును, సడలిన మైతీఁగలు కల గోపికల కుచకుంభ పరిపూర్ణ భావములతో సమ్మేళనము నొందిన దేవకీనందనుఁడు వేణువుతో మిక్కిలి హృదయంగమముగా గానముచేసెను.

శ్లో. ***చారు చామీకరాభాస భామావిభుః***
వైజయంతీ లతా వాసి తోరః స్థలః ।

నంద బృందావనే వాసితా మధ్యగః
సంజగౌ వేణునా దేవకీనందనః ॥ 40

అన్వయము :- దేవకీనందనో వేణునా సంజగౌ=దేవకీనందనుఁడు వేణువుతో సమ్మోహనముగా గానము చేసెను.

అర్థము :- చారు=నయన స్పృహణీయమైన చామీకర=బంగారమువలె, ఆభాస=మెఱుఁగులు తుఱఁగలించుచున్న, భామా=కోపనలైన ప్రియురాండ్రకు, విభుః=ఎల్లెడల మనసు నొవ్వనీయని వాఁడును, వైజయంతీ లతా=లతవలె వ్రేలుచున్న వైజయంతి అను వనమాలతో, వాసిత=సమాకర్షియైన, ఉరఃస్థలః=వక్షఃస్థలము గలవాఁడును, నంద బృందావనే=నందుని బృందావనమునందు, వాసితా=స్త్రీలయొక్క, మధ్యగః=నడుమ నున్నవాఁడై, దేవకీనందనః=దేవకీనందనుడు, వేణునా=పిల్లనఁగ్రోవితో, సంజగౌ=లోక సమ్మోహనముగా గానము చేసెను.

తాత్పర్యము :- నయన స్పృహణీయమైన బంగారు మైచాయలతో మెఱయుచున్న కోపనలైన ప్రియురాండ్ర కెల్లప్రొద్దుల వల్లభుఁడును, తీఁగవలె వ్రేలుచున్న వైజయంతి అను వనమాలతో సమాకర్షియైన వక్షఃస్థలము గలవాడును, నందుని బృందావనమునందు వనితాజన మధ్యస్థితుఁడై దేవకీనందనుఁడు వేణువుతో జగన్మోహనముగా గానము జేసెను.

శ్లో. *బాలికా తాళికా తాళ లీలా లయా*
సంగ సందర్శిత భ్రూలతా విభ్రమః ।
గోపికా గీత దత్తావధానః స్వయం
సంజగౌ వేణునా దేవకీనందనః ॥ 41

అన్వయము :- దేవకీనందనో వేణునా సంజగౌ = దేవకీనందనుఁడు వేణువుతో సొగసుగా గానము చేసెను.

అర్థము :- బాలికా తాళికా=తాళధారిణులైన బాలికలయొక్క, తాళ లీలా=తాళక్రియ కును, లయ=లయకునుగల, ఆసంగ=కలయికలయందు, సందర్శిత=ప్రకటీకృతమైన, భ్రూలతా=తీఁగల వంటి కనుబొమలయొక్క, విభ్రమః=విలసనములు గలవాడును, గోపికా

గీత=గోపికలు పాడుచున్న గీతములయందు, దత్తావధాన:=నిలుపఁబడిన ఏకాగ్రత కలవాఁడై, స్వయం=తాను, దేవకీనందన:=దేవకీనందనుఁడు, వేణునా=వేణువుతో, సంజగౌ=సొగసుగా గానముచేసెను.

తాత్పర్యము :- బాలికలైన తాళధారిణుల యొక్క తాళక్రియకును లయకును గల అనుసంధానములయందు ప్రకటీకృతమైన తీఁగలవంటి కనుబొమలయొక్క విలసనములు గల వాఁడయి, గోపికలు ఆలాపించుచున్న గీతముల యందు నిలిపిన ఏకాగ్రత కలవాఁడయి, తాను గూడ దేవకీనందనుఁడు వేణువుతో సమ్మోహనముగా గానము చేసెను.

శ్లో. *పారిజాతం సముద్దృత్య రాధావరో*
రోపయామాస భామా గృహస్యాంగణే । [3]
శీతశీతే వటే యామునీయే తటే
సంజగౌ వేణునా దేవకీనందన: ॥ 42

అన్వయము :- దేవకీనందనో వేణునా సంజగౌ = దేవకీనందనుఁడు వేణువుతో మంజులముగా గానము చేసెను.

అర్థము :- రాధావర:=రాధావల్లభుఁడు, పారిజాతం=నందన వనము నందున్న పారిజాత ద్రుమమును, సముద్దృత్వ=పెల్లగించి, భామాగృహస్య=సత్యభామామందిరము యొక్క, అంగణే=ముంగిలియందు, రోపయామాస=నాటించెను. యామునీయే=యమునా నదికి సంబంధించిన, తటే=ఒడ్డునందు, శీతశీతే=మిక్కిలి చల్లనయిన, వటే=మఱ్ఱినీడయందు, దేవకీనందన:=దేవకీనందనుఁడు, వేణునా=వేణువుతో, సంజగౌ=మంజులముగా గానముచేసెను.

తాత్పర్యము :- తాను రాధికా వల్లభుఁడేఅయినను, సురలోకమునుండి పారిజాత వృక్షమును తెచ్చి సత్యభామ యింటి వాకిలిలో నాఁటెను. యమునా తటమునందు మిక్కిలి చల్లనైన మఱ్ఱి చెట్టు నీడలో దేవకీ నందనుఁడు పిల్లన గ్రోవితో మంజులముగా గానముచేసెను.

(3 "రాధావయో రూపయా మానభాసా గుణై రంగణే" - అని పాఠాంతరము. రాధావయోరూపయా=రాధయొక్క వయో రూపములు గలదియు, గుణై:=గుణములచేత, మానభాసా=లక్ష్మీ దేవితో సమానురాలైనదియునగు నాకస్త్రీతోడ, అంగణే=దాని ముంగిలియందు, పారిజాతం=పారిజాతమును , సముద్దృత్య=స్థాపించి (ఈ పాఠము సరికాదు)

శ్లో. అగ్రే దీర్ఘతరోఽయ మర్జునతరు స్తస్యాగ్రతో వర్త్మనీ
సా ఘోషం సముపైతి తత్పరిసరే దేశే [4]కళిందాత్మజా ।
తస్యా స్తీర తమాల కాననతలే చక్రం గవాం చారయన్
గోపః క్రీడతి దర్శయిష్యతి సఖే! పంథాన మవ్యాహతమ్ ॥ 43

అన్వయము :- సఖే! అగ్రే క్రీడతి గోపః అవ్యాహతం పంథానం దర్శయిష్యతి = ఓ సఖుఁడా! ముందఱ గొల్ల పిల్లవాడు ఆడుకొనుచున్నాడు. ఆతంకములు లేని త్రోవ చూపింపఁ గలఁడు.

అర్థము :- అగ్రే=ముందఱ, దీర్ఘతరః=మిక్కిలి ఎత్తైన,అయం అర్జున తరుః=ఈ మద్దిచెట్టు!, తస్య=ఆ మద్దిచెట్టు యొక్క, అగ్రతః=ఎదురుగా, వర్త్మనీ=కాలిబాట, సా=ఆ కాలిబాట, ఘోషం సముపైతి=వ్రేపల్లెకుఁజేరును, తత్పరిసరే=ఆపల్లె పరిసరమునందలి, దేశే=ప్రదేశమందు, కళిందా ఽత్మజా =యమునానది పాఱుచుండును, తస్యాః=ఆ నదియొక్క, తీర=ఒడ్డుపైన, తమాల కాననతలే=ఒడ్డుపైన కానుఁగుచెట్ల అడవి, ఆ ఆడవిలో - గవాంచక్రమ్=గోవుల వలయమును, చారయన్=మేఁపుచు, గోపః=గొల్లపిల్లవాఁడు, క్రీడతి=ఆడుకొనుచుండును, -అతడు-సఖే!=ఓ నెచ్చెలీ!, అవ్యాహతమ్=చెడని, పంథానం=దారిని, దర్శయిష్యతి=చూపఁగలఁడు.

తాత్పర్యము :- ఓ నెచ్చెలీ! ఎట్టయెదుట మిక్కిలి ఎత్తుగా నున్న యీ మద్దిచెట్టు . ఆ చెట్టుకు ముందు సూటిగా కాలిబాట. ఆబాట వ్రేపల్లెకు పోవును. ఆ పరిసరములో యమున పాఱుచుండును. ఆ యమునగట్టున కానుఁగుచెట్ల అడవి. ఆ యడవిలో వలయాకారముగా నిలిపి ఆలను మేఁపుచు ఒక గొల్లపిల్లవాఁడు ఓరంతప్రొద్దును ఆటలాడుకొనుచుండును. అతడు చెడనిదారి చూపఁగలడు.

(**విశేషాంశము :-** కొందఱు ఈ శ్లోకమునకు ఈ యర్థమును జెప్పుచున్నారు. అదెట్లనిన - హేసఖే =ఓ మిత్రుడా!, అగ్రే=ముందట - తేరుముందట, దీర్ఘతరః=మిక్కిలి ఉన్నతుఁడైన, అయం=ఈ, అర్జున తరుః=తరువు వంటి అర్జునుఁడు - బంధువధమును జేయఁజాలక శోకముచేఁ దరువువలె మ్రాన్పడియున్న అర్జునుఁడనుట, తస్య=ఆయర్జునుని

---

4 'తీరే' (పాఠాంతరము)

యొక్క, అగ్రతః=ముందర, వర్త్మనీ=మార్గము - ఉపదేశమార్గమనుట - గీతారూప మైతత్త్వోపదేశకమైన మార్గమనుట, సా=ఆమార్గము, ఘోషం=శబ్దమును - శబ్దప్రధానమైన ఉపనిషత్తుల ననుట, సముపైతి=పొందుచున్నది - ఆ గీతామార్గము ఉపనిషత్తులకు సంబంధించినది - అది ఉపనిషత్తుల విషయమే యైనదనుట, తత్పరిసరే దేశే=దానికి సమీప ప్రదేశమందు - దానికి అందియునందకుండునట్లు - ఆ ఉపనిషత్తులచే బూర్ణముగాఁ బ్రతిపాదింపఁబడుటకు అశక్యమై, కళిందాత్మజా=యమునానది - యమునా నదివలె నల్లనైన కాంతి ప్రవాహమనుట, తస్యాః=అద్దానియొక్క, తీరతమాలకానన తలే=గట్టునందలి కానుగు చెట్లపట్టునందు, గవాంచక్రం=ఉపనిషద్వాక్యములను, చారయన్=అధ్యయనము చేయించుచు, గోపః=శ్రీకృష్ణుడు, క్రీడతి=విహరించుచున్నాడు. అవ్యాహతం=అక్షతమైన, పంథానం=మార్గమును - మోక్షమార్గమును, దర్శయిష్యతి=చూపఁగలఁడు.

ఈ యర్థము మిక్కిలి క్లిష్టము. "తత్పరిసరే దేశే కళింగాత్మజా", "తస్యాస్తీర తమాల కాననతలే" - అను ఈ రెండు వాక్యములును ఈ యర్థమునకు అనుకూలముగా వ్యవస్థితములు కావు. కాన నిది కవి హృదయముగాఁగాని పింపదు. 'అగ్రే' మొదలుకొని 'సఖే' అను వఱకును ఒక్కటే అర్థము గ్రహింపఁదగును. 'పంథాన మవ్యాహతమ్' అనుటకు సరియైన మార్గమనియు, మోక్షమార్గమనియు రెండు అర్థములు గ్రాహ్యములు.

మఱియు, ఈ శ్లోకము ఈ యర్థమున -

"పార్థే దిశంతం గీతార్థం ధ్యానముద్రా లసత్కరమ్ ।
రథస్థం భావయన్ జప్త్వా దశలక్ష మిమం మనుం ।
నోచిరాల్లభతే జ్ఞానం పరమైశ్వర్య దాయకమ్ । "

- అని గోపాలకృష్ణ సర్వగత ఏ కాక్షరీ మంత్రధ్యానముగా సనత్కుమార సంహితయందుఁ జెప్పఁబడియున్నది.)

శ్లో. *గోధూళి ధూసరిత కోమల గోపవేషం*
గోపాల బాలక శతై రనుగమ్యమానమ్ ।
సాయంతనే ప్రతిగృహం పశుబంధనార్థం
గచ్ఛంత మచ్యుతశిశుం ప్రణతోஉస్మి నిత్యమ్ ॥ 44

అన్వయము :- సాయంతనే పశుబంధనార్థం ప్రతి గృహం గచ్ఛంతం అచ్యుత శిశుం నిత్యం ప్రణతోఽస్మి= సాయంకాలము పశువులను కట్టుటకై ప్రతియింటికి పోవుచున్న శాశ్వత శిశువునకు నిత్యము ప్రణమిల్లుచున్నాను.

అర్థము :- గోధూళి=ఆల దుమ్ముచేత, ధూసరిత=బూఁదిపాటిన, కోమల=నేవళమైన, గోపవేషం=గొల్లవేషముగలవానిని, గోపాల బాలక శతైః=వందలకొలఁది గొల్లకుఱ్ఱలచేత, అనుగమ్యమానం=వెన్నంటి రాఁబడుచున్న వానిని, సాయంతనే=మునిమాఁపు వేళలో, పశు బంధనార్థమ్=ఆవులను కట్టివేయుటకు, ప్రతిగృహమ్=ఇంటింటికిని, గచ్ఛంతం=పోవుచున్న, అచ్యుతశిశుం=జారుపాటు నెఱుఁగని, శిశుం=నిత్య శిశువునకు, నిత్యం=ఎల్లప్రొద్దును, ప్రణతః=ప్రణమిల్లినవాఁడను, ఆస్మి=అగుచున్నాను.

తాత్పర్యము :- ఆలదుమ్ముతో బూఁదుపాటిన లేఁత ప్రాయపుగొల్లవేషముతోనున్న వానిని, వందలకొలఁది గొల్ల పిల్లవాండ్రు వెంటవచ్చుచున్న వానిని, మునిమాఁపు పొద్దులో పసులను కట్టివేయుటకయి ఇంటింటికి బోవుచున్న నిజస్థితినుండి జాఱుట ఎఱుగని శాశ్వత శిశువునకు ఎల్లప్రొద్దును ప్రణమిల్లుచున్నాను.

శ్లో. *నిధిం లావణ్యానాం నిఖిల జగదాశ్చర్యనిలయం*
నిజావాసం భాసాం నిరవధిక నిశ్రేయస రసమ్ ।
సుధాధారాఽసారం, సుకృత పరిపాకం మృగదృశాం
ప్రపద్యే మాంగల్యం ప్రథమ మధిదైవం కృతధియామ్ ॥ 45

అన్వయము :- కృతధియాం ప్రథమం అధిదైవం ప్రపద్యే = స్థిరబుద్ధులైన వారికి ప్రథమ శుభస్వరూపమైన అధిదైవమును - (అదిత్యమండలాంతర్గతుఁడై జీవుల సకలేంద్రియ వృత్తులకు ప్రచోదకుఁడైన హిరణ్మయ పురుషుని) ఆశ్రయించు చున్నాను.

అర్థము :- లావణ్యానాం=సృష్టియందలి సకల కాంతి విశేషముకు, నిధిం=పెన్నిధియైన వానిని, నిఖిల=సమస్తములయిన జగదాశ్చర్య=లోకాద్భుతములకు, నిలయం=నెలవైన వానిని, భాసాం=రవిచంద్ర తారాదులైన వెలుఁగులకు, నిజావాసం=స్వగృహమైన వానిని, నిరవధిక నిఃశ్రేయస రసమ్ - నిరవధిక=నిస్సీమమైన - మేరలు లేని, నిశ్రేయస రసమ్= కైవల్య రసమును, సుధాధారాఽసారమ్ - సుధాధారా=అమృతధారలయొక్క, ఆసారం=ధారా వర్షరూపమైన వానిని, మృగ దృశామ్=హరిణ లోచనలయొక్క - స్త్రీలయొక్క, సుకృత

పరిపాకం=పుణ్యములయొక్క పంటయైన వానిని, కృతధియాం= కృతబుద్ధులకు, ప్రథమం మాంగల్యం=మొదటి శుభస్వరూపమైన, అధిదైవం=పురుషుని, ప్రపద్యే=ఆశ్రయించు చున్నాను.

తాత్పర్యము :- లావణ్యైక నిధానమును, నిఖిల లోకాద్భుతైక నిలయమును, సమస్త తేజములకు స్వగృహమైనవానిని, అసీమమైన కైవల్యరసస్వరూపమును, అమృతధారా వర్షమును, స్త్రీలయొక్క పుణ్యపరిపాకమును, కృతబుద్ధులకు ప్రథమ మంగల స్వరూపమునైన పురుషుని ఆశ్రయించుచున్నాను.

శ్లో. ***ఆతామ్ర పాణికమల ప్రణయ ప్రతోదమ్***
ఆలోల హార మణికుండల హేమసూత్రమ్ ।
ఆవిశ్రమాంబుకణ మంబుద నీల మవ్యాత్
ఆద్యం ధనంజయ రథాభరణం మహోనః ॥ *46*

అన్వయము :- ధనంజయ రథాz భరణం ఆద్యం మహః నోz వ్యాత్ = అర్జునుని రథమునకు ఆభరణమైన తొలివెలుఁగు మమ్ము కాపాడును గాక!

అర్థము :- ఆతామ్ర=ఇంచుక ఎఱ్ఱనైన, పాణికమల=కేలుదామరను ప్రణయ=విడిచియుండని, ప్రతోదం=మునికోల కలదియును, ఆలోల=కదలుచున్న, హార=హారములు, మణి కుండల=మణిమయ కుండలములు, హేమసూత్రమ్=బంగారు మొలత్రాడు కలదియును, ఆవిః+శ్రమ+అంబుకణం - ఆవిః=మొగ్గ తొడుగుచున్న, శ్రమఅంబుకణం=శ్రమజలకణములు - స్వేదబిందువులు కలదియును, అంబుద నీలం=మబ్బువలె నీలవర్ణము కలదియును, ధనంజయ రథాభరణం=అర్జునుని అరదమునకు తొడుగని నగయైన, ఆద్యం మహః=తొల్లింటి వెలుఁగు, నః=మమ్ము, అవ్యాత్=కాపాడును గాక!

తాత్పర్యము :- ఇంచుక ఎఱ్ఱనైన కేలుఁదామరను వీడియుండని మునికోల కలదియును, కదలుచున్న హారములు మణియమకుండలములు, బంగరు మొలనూలు కలదియును, మొగ్గ తొడుగుచున్న చెమరుబిందువులు కలదియును, అంబుద నీలమైనదియును, అర్జున రథమునకు పెట్టని అలంకారమైనదియునగు తొల్లింటి వెలుఁగు మమ్ములను కాపాడును గాక!

శ్లో. నఖ నియమిత కండూన్ పాండవ స్యందనాశ్వాన్
అనుదిన మభిషించన్ అంజలిస్థైః పయోభిః ।
అవతు వితతగాత్రః తోత్రనిష్ప్యూత మౌళిః
దశన విధృత రశ్మిః దేవకీ పుణ్యరాశిః ॥ 47

అన్వయము :- దేవకీ పుణ్యరాశిః అవతు = దేవకీదేవియొక్క పుణ్యములరాశి కాపాడును గాక!

అర్థము :- నఖ నియమిత కండూన్ - నఖ=గోళ్లచేత, నియమిత=ఉపశమింప జేయఁబడిన, కండూన్=తీఁటలుగల, పాండవ స్యందనాశ్వాన్=అర్జున రథాశ్వములను, అంజలిస్థైః=దోయిటఁబట్టిన, పయోభిః=జలములచేత, అనుదినమ్=ప్రతిదినము, అభిషించన్=తడుపుచు, వితతగాత్రః=వీఁగిన నెమ్మేను గలవాఁడును, తోత్ర నిష్ప్యూత మౌళిః - తోత్ర=మునికోలచేత, నిష్ప్యూత=త్రోయఁబడిన, మౌళిః=శిఖిపింఛము కలవాఁడును, దశన విధృత రశ్మిః - దశన=దంతములచేత, విధృత=లాఁగి ధరింపఁబడిన, రశ్మిః=పగ్గముల కల, దేవకీ పుణ్య రాశిః=దేవకీదేవి యొక్క పుణ్యముల ప్రోవు, అవతు=రక్షించునుగాక!

శ్లో. వ్రజ యువతి సహాయే యావనోల్లాసి కాయే
సకల శుభ విలాసే కుంద మందార హాసే ।
నివసతు మమ చిత్తం తత్పదాఽఽయత్త వృత్తం
ముని సరసిజ భానౌ నందగోపాల సూనౌ ॥ 48

అన్వయము :- నంద గోపాల సూనౌ మమ చిత్తం నివసతు = నంద గోపాల సూనుని యందు నా చిత్తము నివసించును గాక!

అర్థము :- 'వ్రజయువతి సహాయే' - వ్రజ=పసులమందలోని, యువతి=జవరాండ్రే, సహాయే=తోడుగలట్టియు, యౌవనోద్భాసి కాయే - యౌవన=కొదమప్రాయముచేత, ఉద్భాసి=మిసమిసలాఱుచున్న, కాయే=నెమ్మేను కలట్టియు, సకల శుభ విలాసే=సకల జనమునకు శుభప్రదమైన విలసనములు కలట్టియు, కుంద మందార హాసే=మొల్లలవంటి సురలోక మందారములవంటి నవ్వులు గలట్టియు, ముని సరసిజ భానౌ=మునిజనమే అనెడి పద్మవనమునకు ప్రాతఃకాల సూర్యబింబమువంటి వాఁడైన, నందగోపాల సూనౌ=నంద

గోపాల నందనునియందు, తత్పదాzzయత్త వృత్తమ్ - తత్=ఆయనయొక్క, పద=అడుగులయందు, ఆయత్త=సమధీనమైన, వృత్తం=వర్తనము కలవియై, మమ=నాయొక్క, చిత్తం=మనస్సు, నివసతు=నిలుచును గాక!

తాత్పర్యము :- వలసల్లోని యెలనాగలే తోడుగాఁగలిగి, కొదమప్రాయపు హొయలు నెమ్మేనితో, తన విలసనములు సకల భూవనములకు శుభములను కురియించు చుండఁగా, మాఘ్య - (మొల్లపూలు) మందార (సురలోక మందారము ధవళవర్ణమని కవిసమయ ప్రసిద్ధి) కుసుమముల వంటి నవ్వులతో, మునిజనులనెడి పద్మవనములకు ప్రాతఃకాల భానుబింబమైన నందగోపాల నందనునియందు - తచ్చరణాయత్త వృత్తమై నా చిత్తము నెలకొని యుండు గాక!

శ్లో. ***అరణ్యానీ మార్ద్రస్మిత మధుర బింబాధర సుధా***
సరణ్యా సంక్రాంతైః సపది మదయన్ వేణునినదైః ।
ధరణ్యా సానందోత్పులక ముపగూఢాంఘ్రికమలః
శరణ్యానా మాద్యః స జయతు శరీరీ మధురిమా ॥ 49

అన్వయము :- శరీరీ మధురిమా స జయతి = శరీరమును ధరించిన ఆ మాధుర్యము సర్వాతిశాయియై వర్తిల్లుచున్నది.

అర్థము :- "ఆర్ద్ర స్మిత మధుర బింబాధర సుధా సరణ్యా" - ఆర్ద్ర స్మిత మధుర=తరుణార్ద్ర స్మిత సుందరమైన, బింబాధర=కెమ్మోవియొక్క, సుధా సరణ్యా=అమృతపు దారిగా, సంక్రాంతైః=అంటివచ్చిన, వేణునినదైః=వేణునాదములతో, అరణ్యానీం=మహారణ్యసీమను, సపది=వెనువెంటనే, మదయన్=పరవశింపఁజేయుచు, ధరణ్యా=ధరణీదేవిచేత, సానందోత్పులకం (యథాతథా) ఆనంద సమకాలము నందే - (ఘాసాంకుర వ్యాజముతో) క్రిక్కిరిసిన గగుర్పాటు కలుగు రీతిని, ఉపగూఢ=ఔమ్మనకు హత్తుకొనబఁడిన, అంఘ్రికమలః=అడుగుఁదమ్ములు కలట్టియు,. శరణ్యానాం=రక్షణ సమర్థులైన వారిలో, ఆద్యః=మొదటివాఁడైన, సః=ఆ, శరీరీ=శరీరధారియైన, మధురిమా=మాధుర్యసీమ, జయతి=సర్వాతిశాయియై వర్తిల్లుచున్నది.

తాత్పర్యము :- కరుణార్ద్ర స్మిత సుందరమైన కెమ్మోవి అనెడి అమృతపు త్రోవను అంటివచ్చి మఱింత మధురములైన వేణునాదములతో మహారణ్యసీమనంతయు

ఆనందపరవశముగా జేయుచు ధరణీదేవిచేత నవతృణోద్గమవ్యాజముతో సానందముగ ఔమ్మనకు హత్తి కొనఁబడిన అడుగుఁదమ్ములు కలవాఁడును, శరణ సమర్థులలో ఆద్యుఁడునైన ఆ సాకారమాధుర్యము సర్వాతిశాయియై వర్తిల్లుచున్నది.

*శ్లో. ముగ్ధం స్నిగ్ధం మధుర మురళీ మాధురీ ధీరనాదైః
కారం కారం కరణ వివశం గోకుల వ్యాకులత్వమ్ ।
శ్యామం కామం యువజన మనోమోహనం మోహనాంగం
చిత్తే నిత్యం నివసతు మహో వల్లవీ వల్లభం నః ॥ 50

అన్వయము :- వల్లవీ వల్లభం మహః నశ్చిత్తే నిత్యం నివసతు = గోపికా వల్లభమైన నల్లని వెలుఁగు మాయుల్లములో ఎల్లవేళల వెల్లివిరియుచుండును గాక!

అర్థము :- ముగ్ధం=చక్కనిదియును, స్నిగ్ధం=నెనరుగలదియును, 'మధుర మురళీ మాధురీ ధీర నాదైః' - మధుర=సుందరమైన, మురళీ=పిల్లనగ్రోవియొక్క, మాధురీ ధీర=మాధురీ నిశ్చలములైన, నాదైః=నాదములతో, కరణ=ఇంద్రియములయందు, వివశం=వశముతప్పిన, గోకుల=గోకులమునకు, వ్యాకులత్వమ్=వ్యాకులభావమును, కారం కారం=చేసి చేసి, శ్యామం=నీలవర్ణమైనదియును, కామం=మిక్కిలియును, యువజన మనోమోహనం=తరుణజన మనోమోహనమైనదియును, వల్లవీ వల్లభం=గోపికా వల్లభమైన, మహః=వెలుఁగు, నః=మాయొక్క, చిత్తే=చిత్తమునందు, నిత్యం=ఎల్లవేళల, నివసతు=నివసించి యుండునుగాక!

తాత్పర్యము :- చక్కనిది, నెనరుగలది, అందమైన పిల్లనగ్రోవియొక్క మాధుర్య నిశ్చలములైన నాదములతో ఆలమందలను మైమఱపించునదియును, నీలవర్ణమును, ఇనుమిక్కిలిగా తరుణజన మనోమోహనమైనదియును, మోహనాకారమును, వల్లవీవల్లభమునైన నల్లని వెలుఁగు మా యుల్లములో నెల్లవేళల వెల్లివిరియుచుండునుగాక!

శ్లో. విదగ్ధ గోపాల విలాసినీనాం
సంభోగ చిహ్నాంకిత సర్వగాత్రమ్ ।

---

*(ఈ శ్లోకము ఒకానొక ప్రతియందే కనుపట్టుచున్నది. సవ్యాఖ్యానములగు ప్రతులయందు నగానిపింపదు... ఇందు పదసారస్యమే కాని లీలాశుకుని అర్థవైభవము చూపట్టదు. కావున ఇది లీలాశుక ప్రణీతము గాకుండ వచ్చుననియుఁ దోఁచుచున్నది)

పవిత్ర మామ్నాయగిరా మగమ్యం
బ్రహ్మ ప్రపద్యే నవనీతచోరమ్ ॥ 51

అన్వయము :- నవనీత చోరం బ్రహ్మ ప్రపద్యే = వెన్నల ముచ్చిలించి కొనిపోయెడి బ్రహ్మపదార్థము నాశ్రయించుచున్నాను.

అర్థము :- విదగ్ధ=ప్రోడలైన, గోపాల విలాసినీనాం=గోపాల సుందరులయొక్క, సంభోగచిహ్న=భోగచిహ్నములచేత, అంకిత=చిహ్నితమైన, సర్వగాత్రం=సర్వాంగములు కలవానిని, పవిత్రం=పావనుని, ఆమ్నాయగిరాం=వేదసరస్వతులకు, అగమ్యం=చేరరాని - అందుకొన శక్యము కాని, నవనీతచోరం=వెన్నలను ముచ్చిలించెడి, బ్రహ్మ=బ్రహ్మపదము యొక్క తాత్పర్యార్థమును, ప్రపద్యే=ఆశ్రయించుచున్నాను.

తాత్పర్యము :- ప్రోడలైన మందప్రోయాంగ్ర పెనకువ గంటులతో ముద్రించి నట్లున్న నెమ్మేని వానిని, పరమ పావనుని, తొలి మినుకులకు అందుకొనుటకు అలవికాని వెన్నల దొంగయైన పరబ్రహ్మమును ఆశ్రయించుచున్నాను.

శ్లో. **అంతర్గృహే కృష్ణ మవేక్ష్య చోరం ।**
బద్ధ్వా కవాటం జననీం గతైకా ।
ఉలూఖలే దామ నిబద్ధ మేనం ।
తత్రాపి దృష్ట్వా స్తిమితా బభూవ ॥ 52

(అవతారిక :- ఒకానొక గోపికయెడ శ్రీకృష్ణుఁడు చూపిన ఆశ్చర్య లీలను చెప్పుచున్నాఁడు)

అర్థము :- అంతర్గృహే=లోపలి లోఁగిలిలో, చోరం=దొంగతనము చేయుటకయి తారాడుచున్న, కృష్ణం=కృష్ణుని, అవేక్ష్య=కనుగొని, కవాటం బద్ధ్వా=తలుపు గడియపెట్టి, ఏకా=ఒకగొల్లభామ, జననీం=తల్లియైన యశోద నుద్దేశించి, గతా=వెళ్లినదై, ఉలూఖలే=ఱోటియందు, దామ నిబద్ధం=పలుగుతో గట్టిగా బంధింపఁబడియున్న, ఏనం=తన యింటిలో నున్న వానినే, తత్రాపి=అక్కడకూడ, దృష్ట్వా=చూచి, స్తిమితా=స్తిమితపడి నదిగా, బభూవ=ఆయెను.

తాత్పర్యము :- లోపలిలో(గిలిలో వెన్నదొంగిలించుటకయి తారాడుచున్న కృష్ణునిజూచి మెల్లగా తలుపుగడియపెట్టి యశోద వద్దకు వచ్చిన ఒక గొల్లభామ యశోద వాఁకిటిలో ఱోటికి పలుపువేసి గట్టిగా బంధింపఁబడి యున్నవానిని, తనయింటిలో తానుచూచిన వానినే అక్కడఁ గూడఁ జూచి స్తిమిత పడినది ఆయెను.

శ్లో. ***రత్నస్థలే జానుచరః కుమారః***
సంక్రాంత మాత్మీయ ముఖారవిందమ్ ।
ఆదాతు కామ స్త దలాభ ఖేదాత్
విలోక్య ధాత్రీ వదనం రురోద ॥ 53

అన్వయము :- ధాత్రీ వదనం విలోక్య కుమారో రురోద = తల్లి మొగమువంక కనుగొని పిల్లవాఁడు బిక్కమొగముపెట్టి ఆవురుమనెను.

అర్థము :- రత్నస్థలే=మణులు తాఁపిన నెలకట్టు మీద, జానుచరః కుమారః=పారాడుచున్న పోరఁడు, సంక్రాంతమ్=నీడపాఱిన, ఆత్మీయ ముఖారవిందమ్=తనదేయైన మోముఁదామరపూవును, ఆదాతుకామః=లాఁగికొనుటకు మనసుపడినవాఁడై, తదలాభఖేదాత్=అది చేతికి అందిరాని దుఃఖమువలన, ధాత్రీ వదనమ్=తల్లి మోమును, విలోక్య=కనుగొని, రురోద=ఏడ్చెను.

తాత్పర్యము :- మణలు తాఁపిన నెలకట్టుమీఁద పారాడుచున్న పిల్లవాఁడు, ఆ నెలకట్టుమీఁద తన మోముదామర నీడ చూచి - దానిని లాఁగికొనుటకు మనసుపడి - అది నీడయగుటవలన చేతికి అందిరాని దుఃఖము వలన తల్లి మోము వంకఁజూచి యేడ్చెను.

శ్లో. ***ఆనందేన యశోదయా సమదనం గోపాంగనాభి శ్చిరం***
సాశంకం బలవిద్విషా సకుసుమైః సిద్ధైః పృథివ్యాకులమ్ ।
సేర్ష్యం గోపకుమారకైః సకరుణం పౌరైః జనైః సస్మితం
యో దృష్టః స పునాతు నో మురరిపుః ప్రోత్క్షిప్త గోవర్ధనః ॥ 54

అన్వయము :- ప్రోత్క్షిప్త గోవర్ధనః స మురరిపుః నః పునాతు = గోవర్ధన పర్వతమును మీఁది కెత్తిన ఆ మురవైరి మమ్ము పావనులను జేయునుగాక!

అర్థము :- ఆనందేన=ఆనందముతో, యశోదయా=యశోదాదేవి చేతను, సమదనం =వలపుతో, గోపాంగనాభిః=గోపికలచేతను, సాzశంకం=ఆశంకానహితముగా, బలవిద్విషా=ఇంద్రుని చేతను, సకుసుమైః=కుసుమ సమేతముగా, సిద్ధైః=సిద్ధుల చేతను, పృథివ్యా=భూదేవి చేత, ఆకులం=వ్యాకులముగాను, గోప కుమారకైః=గోపకుమారుల చేత, సేర్ష్యం=ఈర్ష్యతోను, పౌరైః=పౌరులచేత, సకరుణం=కనికరముతోను, జనైః=జనులచేత, సస్మితం=నవ్వుతోను, యః=ఎవ్వఁడు, చిరం=చాలసేపు, దృష్టః=దర్శింపఁబడెనో, సః=ఆ, ప్రోత్క్షిప్త గోవర్ధనః= మీఁదకెత్తిన గోవర్ధన పర్వతముకల, మురరిపుః=మురసూదనుఁడైన శ్రీకృష్ణుఁడు, నః=మమ్ము, పునాతు=పావనులను చేయునుగాక!

తాత్పర్యము :- ఆనందముతో యశోదాదేవి, వలపుతో గోపికలు, సంశయముతో శతమఖుఁడు, కుసుమ వర్షము కురియించుటకై సిద్ధులు (పూలు కృష్ణునిపై బఁడువఱకును - కొండ దింపిన పిమ్మటనే కాని పూవులాతనిపైనఁబడవు కనుక అంతవఱకును ఎదురుచూచుచున్నారు), భూదేవి వ్యాకులముగాను - (కొండ పెల్లగించిన తావున మహాగర్త మేర్పడినది కనుక భూదేవి వ్యాకులపడుట) చూచుచున్నారు. గోపకుమారులు ఈర్ష్య పడుచున్నారు - (తాము చేయఁజాలని పని కృష్ణుఁడు చేసి వైచెనే! అని). పౌరులు 'పసివాఁడు! కొండ మీఁదపడినచో ఏమగునో!' అని కనికరముతోఁ జూచుచున్నారు. మిగిలిన జనులకది ఒక వినోదమాత్రముగానున్నది కనుక నవ్వుతోఁజూచుచున్నారు. ఇట్లు నానాజనులలో నానా భావములు ఒకే సమయమున - ఒకేపనిచేత కలిగించుచు చిరకాలము దర్శింపఁబడిన శ్రీకృష్ణస్వామి మమ్ము పావనులను జేయునుగాక!

శ్లో. *ఉపాసతా మాత్మవిదః పురాణాః*
పరం పుమాంసం నిహితం గుహాయామ్ ।
వయం యశోదాశిశు బాలలీలా
కథా సుధాసింధుషు లీలయామః ॥ 55

అన్వయము :- వయం యశోదాశిశు బాలలీలా కథాసుధా సింధుషు లీలయామః =మేము యశోదాశిశువు యొక్క బాలలీలలకు సంబంధించిన కథామృత నదీ ప్రవాహములలో ఓలలాడుచుందుము.

అర్థము :- పురాణాః=పురాతనులైన, ఆత్మవిదః=ఆత్మవేత్తలు, గుహాయాం=హృదయ గుహయందు, నిహితం=ఉంచఁబడిన, పరం పుమాంసమ్=పరమపురుషుని, ఉపాసతామ్=ఉపాసింతురుగాక!, వయం=మేము, యశోదాశిశు=యశోదానందనుని యొక్క, బాలలీలా=బాలలీలలకు సంబంధించిన, కథా=కథలే అనెడి, సుధాసింధుషు=అమృత నదులయందు, లీలయామః=ఓలలాడెదము.

తాత్పర్యము :- పురాతనులైన ఆత్మవేత్తలు హృదయ గుహలో నిహితుఁడైన పరమ పురుషుని ఉపాసింతురుగాక! మేము మాత్రము యశోదాశిశువుయొక్క బాలలీలకు సంబంధించిన అమృతప్రవాహములయందు ఓలలాడెదము.

శ్లో. *విక్రేతుకామా కిల గోపకన్యా*
మురారి పాదార్పిత చిత్త వృత్తిః ।
దధ్యాదికం మోహవశాదవోచత్
గోవింద! దామోదర! మాధ వేతి ॥ 56

అవతారిక :- శ్రీకృష్ణునియందు ఆసక్తియైన ఒక గోపికయొక్క పారవశ్యమును జెప్పుచున్నాడు.

అర్థము :- మురారి పాదార్పిత చిత్త వృత్తిః - మురారి=మురవైరియైన శ్రీకృష్ణస్వామి యొక్క, పాద=చరణముల యందు, అర్పిత=సమర్పితమైన, చిత్తవృత్తిః=చేతోవృత్తి కలదియై, దధ్యాదికం విక్రేతు కామా=పెరుగుమొదలైనవి అమ్మఁగోరిన, గోపకన్యా=గొల్లపడుచు, మోహవశాత్=పరాకువలన, గోవింద! దామోదర! మాధవ! ఇతి=గోవిందా!, దామోదర!, మాధవ! అని, అవోచత్=పలికెను.

తాత్పర్యము :- స్వామి చరణములయందు సమర్పితమైయున్న చేతోవర్తనము గల గోపకన్య - పెరుగువెన్నల అమ్మఁదలంచినదై పరాకులో ఉన్నందువలన పెరుగు వెన్నలకు బదులు 'గోవిందా! దామోదరా! మాధవా!' అని అఱచుచుఁబోవుచున్నది.

శ్లో. *ఉలూఖలం వా యమినాం మనో వా*
గోపాంగనానాం కుచకుట్మలం వా ।
మురారి నామ్నః కలభస్య మానమ్
ఆలాన మాసీత్ త్రయమేవ భూమౌ ॥ 57

అన్వయము :- మురారి కలభస్య భూమౌ త్రయమేవ ఆలాన మాసీత్ = మురారి అను ఏనుఁగు గున్నకు భూమిపైన మూఁడు మాత్రమే కట్టుగొయ్యలయ్యెను.

అర్థము :- ఉలూఖలంవా=ఱోలుకానీ, యమినాం=సంయమీశ్వరులయొక్క, మనో వా=మనస్సుకానీ, గోపాంగనానామ్=గోపస్త్రీలయొక్క, కుచకుట్మలం వా=కుచమనెడి తామరమొగ్గకానీ, మురారి నామ్నః='మురారి' అనుపేరుగల, కలభస్య=ఏనుఁగు గున్నయొక్క, బంధనే=బంధించుట యందు, భూమౌ=భూమిపైన, త్రయమేవ=యీ త్రితయమే, ఆలానం=గజబంధన స్తంభము, ఆసీత్=ఆయెను.

తాత్పర్యము :- ఱోలుగానీ - యోగీశ్వరుల యొక్క మానసముగానీ - గోపాంగనలయొక్క స్తనకోరకముగానీ - 'మురారి' అనుపేరుగల ఏనుఁగు గున్నను బంధించుట యందు - ఈ మూఁడే ఆలానముగా - గజబంధన స్తంభముగా నాయెను.

శ్లో. ***కరారవిందేన పదారవిందం ।***
ముఖారవిందే వినివేశయంతమ్ ।
వటస్య పత్త్రస్య పుటే శయానం ।
బాలం ముకుందం మనసా స్మరామి ॥ *58*

అన్వయము :- బాలం ముకుందం మనసా స్మరామి = బాలముకుందుని మనసార స్మరించుచున్నాను.

అర్థము :- కరారవిందేన=కేలుఁదామరతో, పదారవిందమ్=అడుగుఁదామరను, ముఖారవిందే=మోముఁదామరయందు, వినివేశయంతమ్=చొప్పించుచున్నట్టియును, వటస్య పత్త్రస్య పుటే=వటపత్త్ర పుటమునందు - మఱ్ఱియాకు నందు, శయానం=శయనించి యున్న, బాలం=బాలుఁడైన, ముకుందమ్=ముకుందుని, మనసా=మనస్సుతో, స్మరామి=స్మరించుచున్నాను.

తాత్పర్యము :- కేలుఁదామరతో - అడుగుఁదామరను ఎత్తిపట్టుకొని, మోముఁదామరయందుఁజొనుపుకొనుచు, వటపత్త్రమునందు - వెల్లకిలి పరుండియున్న బాలుఁడైన ముకుందుని మోక్షప్రదాతను మనసార స్మరించుచున్నాను.

విశేషము :- చేయి - సృష్టికి, అడుగు - స్థితికి, మోము - లయమునకు, సంకేతములు. ఈ సృష్టి - స్థితి - లయములు శిశు స్వాభావిక చేష్టా విశేషముగా అతి సహజముగా - ఇందు పొందువడియున్నవి.

శ్లో. *శంభో! స్వాగత మాస్యతా మిత ఇతో వామేన పద్మాసన!*
క్రౌంచారే! కుశలం? సుఖం? సురపతే! విత్తేశ! నోదృశ్యసే? ।
ఇత్థం స్వప్న గతస్య కైటభజిత: శ్రుత్వా యశోదా గిర:
కిం కిం బాలక! జల్పసీతి రచితం ధూధూ కృతం పాతు న: ॥ 59

అన్వయము :- యశోదా రచితం ధూధూ కృతం పాతున: = యశోద చేసిన 'ధూ' 'ధూ' కారము మమ్ము కాపాడునుగాక!

అర్థము :- శంభో!=శంభువా!, స్వాగతం=స్వాగతము!, ఇత:=ఈవైపున, ఆశ్యతామ్=ఆసీనుఁడవుకమ్ము!, పద్మాసన!=కమలాసనుఁడా!, ఇతో వామేన=ఈ వామ భాగమున (ఆస్యతా=కూర్చుండుము), క్రౌంచారే!=ఓకుమారస్వామీ!, కుశలం?=కుశలమా?, సురపతే!=ఓ యింద్రుడా!, సుఖం?=సుఖమా?, విత్తేశ=ఓధనపతీ!, నోదృశ్యసే?=నీవు కానవచ్చుటలేదే!, ఇత్థం=ఈ విధముగా, స్వప్నగతస్య=కలలోనున్న, కైటభ జిత:=కైటభవైరియొక్క, గిర:=పలవరింతలను, శ్రుత్వా=విని, యశోదా=యశోద, బాలక!=చిట్టితండ్రీ!, కింకింజల్పసి? - కిం కిం=ఏమి? ఏమి?, జల్పసి?=పలపరింతయా? ఇతి=అని, రచితం=చేసిన, 'ధూ' 'ధూ' కృతమ్= 'ధూధూ' కారము - 'తూ' పాడుపు, న:=మమ్ము, పాతు=కాపాడునుగాక!

తాత్పర్యము :- ఓ శంభువా! స్వాగతము! ఇచ్చట నా సీనుఁడవు కమ్ము! కమలాసనుఁడా! ఇటు! ఎడమ! ఓ క్రౌంచభేదనుఁడా! కుమారస్వామీ! కుశలమా? ఓ సురపతీ! సుఖముగా నున్నావా? ఓ అర్థపతీ! నీ వీమధ్య కనిపించుటలేదే! ఈ విధముగా స్వప్నావస్థలో నున్న కైటభాంతకుని పలవరింతలు యశోద విని - "ఏమి టేమిటి? నాయనా! పలవరించుచున్నావా?" అని - చేసిన 'ధూధూ' కారము మమ్ము కాపాడునుగాక!

శ్లో. *మాత:! కిం యదునాథ? దేహి చషకం! కింతేన? పాతుం పయ:*
తన్నాస్త్యద్య - కదా స్తివా? నిశి నిశా కావా? అంధకారోదయ: ।
ఆమీల్యాక్షియుగం నిశా ప్యుపగతా దేహీతి? మాతుర్ముహు:
వక్షోజాంశుక కర్షణోద్యకర: కృష్ణ: స పుష్ణాతు న: ॥ 60

అన్వయము :- ముహుః మాతుః వక్షోజాంశుక కర్షణోద్యకరః కృష్ణస్స పుష్ణాతు నః = మాటిమాటికి మారాములు చేయుచు తల్లి పయ్యెదను గుంజుచున్న ఆ కృష్ణుఁడు మమ్ము పోషించునుగాక!

అర్థము :- మాతః!=అమ్మా!., కిం యదునాథ?=ఏమి యదుపతీ?, దేహి చషకమ్=గిన్నె యిమ్ము!, కింతేన?=దానితో ఏమిపని?, పాతుం పయః=పాలు త్రాగుటకు, తన్నాస్త్యద్య=అది యిప్పుడు లేదు,. కదాz స్తివా?=ఎప్పుడు - ఉండునో?, నిశి=రాత్రివేళ ఉండును, నిశాకావా?=రాత్రి అనఁగా ఎవరో?, అంధకారోదయః=చీకటిపడుట, అక్షియుగం ఆమీల్య=కన్నులు మూసికొని, నిశాప్యుగతా=ఇదిగో! రాత్రివచ్చినది, దేహి!=(పాలగిన్నె) ఇమ్ము! ఇతి=అని, ముహుః=మాటిమాటికిని, మాతుః=తల్లియొక్క, వక్షోజాంశుక= పయ్యదను, కర్షణ=గుంజుటకు, ఉద్యత కరః=చేతులెత్తిన, సకృష్ణః=ఆ కృష్ణుఁడు, నః=మమ్ము, పుష్ణాతు=పోషించునుగాక!

తాత్పర్యము :- అమ్మా! - ఏమి యదువులదొరా? - గిన్నె యిమ్ము! - దేనికి? - పాలు త్రాగుటకు - అదియిపుడులేదు - ఎప్పుడు ఉండునో! - రాత్రి... రాత్రి యనఁగానెవ్వరో! - చీఁకటి పడుట - కన్నులు మూసికాని 'ఇదిగో!! రాత్రివచ్చినది! ఇమ్ము!' అని మాటిమాటికి మారాములుచేయుచు తల్లి పయ్యెద చెఱఁగు పట్టి గుంజుచున్న ఆ కృష్ణుఁడు - మమ్ము పోషించునుగాక!

శ్లో. ***కాళిందీ పులినోదరేషు ముసలీ యావద్గతః ఖేలితుం***
తావత్ కార్పరికం పయః పిబ! హరే! వర్ధిష్యతే తే శిఖా ।
ఇత్థం బాలతయా ప్రతారణపరాః శ్రుత్వా యశోదా గిరః
పాయా న్నః స్వశిఖాం స్పృశన్ ప్రముదితః క్షీరేz ర్ధపీతే హరిః ॥ 61

అన్వయము :- అర్ధ పీతే క్షీరే స్వశిఖాం స్పృశన్ ప్రముదితో హరిః నః పాయాత్ = పాలు సగము క్రోలి తన సిగ తడుముకొనుచు - ప్రఫుల్ల వదనుఁడైన శ్రీహరి మమ్మేలునుగాక!

అర్థము :- కాళిందీ=యమునానదియొక్క, పులిన=ఇసుక తిన్నెల, ఉదరేషు= లోలోపల, ఖేలితుం=ఆడుటకు, ముసలీ=బలరాముఁడు, యావద్గతః=వెళ్ళియున్నాఁడు, తావత్=వాఁడు తిరిగి వచ్చుసరికి, కార్పరికం=గిన్నెలోనున్న, పయః=పాలు, పిబ=క్రోలుము,

హరే!=శ్రీహరీ! తే=నీయొక్క, శిఖా=చుంచు, వర్ధిష్యతే=పెరుగఁగలదు! ఇత్థం=ఈవిధముగా, బాలతయా=పసితనము కారణముగా, ప్రతారణపరాః=మభ్యపెట్టుటకోసమైన, యశోదా గిరః=యశోద మాటలను, శ్రుత్వా=విని, క్షీరే=పాలు, అర్ధపీతే (సతి)=సగము క్రోలినంతలో, స్వశిఖాం=తన సిగను, స్పృశన్=తడుము కొనుచు, ప్రముదితః=మిక్కిలి ఆనందించిన, హరిః=శ్రీహరి, నః=మమ్ము, పాయాత్=పాలించి పెంచునుగాక!

తాత్పర్యము :- యమున యిసుక తిన్నెల లోలోపలికి ఆటలకు బలరాముఁడు నిన్ను విడిచి పోయినాఁడు. వాఁడు తిరిగి వచ్చునంతతో నీవీ ముంతెడు పాలు క్రోలివేయుము! నీ చుంచు పెరుగును! ఈరీతిగా పసితనము కారణముగా తన్ను మభ్యపఱచుటకు యశోద ఆడిన మాటలు విని - పాలు సగము క్రోలినంతలో తన సిగను తడిమికొనుచు ప్రహర్షముతో ప్రఫుల్లవదనుఁడైన శ్రీహరి మమ్ము పెంచి పాలించునుగాక!

శ్లో. *కైలాసో నవనీతతి, క్షితిరియం ప్రాగ్జగ్ధమృల్లోష్టతి*
క్షీరోదోఽపి నిపీత దుగ్ధతి లసత్ స్మేరే ప్రఫుల్లే ముఖే ।
మాత్రాఽజీర్ణధియా దృఢం చకితయా నష్టాఽస్మి దృష్టఃకయా?
ధూ! ధూ! వత్సక! జీవ! జీవ! చిరమిత్యుక్తోఽవతా న్నో హరిః ॥ 62

అన్వయము :- వత్సక! జీవ! జీవ! చిర మిత్యుక్తోఽవతా న్నో హరిః = 'బిడ్డా! చిరంజీవ! చిరంజీవ!' అని పలుకఁబడిన శ్రీహరి మమ్ము కాఁచునుగాక!

అర్థము :- లసత్=నవ్వులతో వెలుఁగుచున్న, స్మేరే=విప్పారుచున్న - ముఖే=నోరు, ప్రఫుల్లేసతి=నిండార విచ్చికొని నంతలోనే, కైలాసః=వెండికొండ, నవనీతతి=వెన్నముద్దగా మాఱిపోవుచున్నది, ఇయం క్షితిః=ఈ పుడమియంతయును, 'ప్రాగ్జగ్ధమృల్లోష్టతి' - ప్రాగ్=మున్ను, జగ్ధ=తిన్న, మృత్=మట్టియొక్క, లోష్టతి=పెంచిక (పెల్ల) గా మాఱుచున్నది, అజీర్ణధియా=అజీర్ణము చేసినదను తలంపుగల, దృఢం=మిక్కిలి, చకితయా=వెఱచఱచిన, మాత్రా=తల్లిచేత, నష్టా=చచ్చిపోయినదానను, అస్మి=అయినాను, కయా=ఏ పాపాత్ము రాలిచేత, దృష్టః=కానఁబడినావు?, 'ధూ! ధూ!'='ధూధూ', వత్సక=బిడ్డా!, జీవచిరం, జీవచిరం=చిరంజీవ! చిరంజీవ!, ఇతి=అని, ఉక్తః=దీవింపఁబడిన, హరిః=శ్రీహరి, నః=మమ్ము, అవతాత్=కాఁచునుగాక!

తాత్పర్యము :- నవ్వులతో వెల్లి విరియుచు విచ్చికొనుచున్న నోరు నిండార తెఱచినంతనే వెండికొండ వెన్న ముద్దగా మాఱిపోవుచున్నది. ఈ పుడమి అంతయును మున్ను తిన్న మన్ను పెంచిక (పెల్ల) వలె కనిపించుచున్నది. పాలకడలి అంతయును, క్రోలిన అరుగని పాలవలె కనిపించుచున్నది. అజీర్ణము చేసియుండు నన్న ఊహ తోఁచినంతనే మిక్కిలి వెఱచఱచిన తల్లినోట "చచ్చిపోయాను!! ఏ దుష్టురాలి కంటఁబడినావో? 'థూ! థూ!' " అని దీవెనలు కురియింపఁబడిన శ్రీహరి మమ్ము కాఁచునుగాక!

శ్లో. *కించిత్ కుంచిత లోచనస్య పిబత: పర్యాయ పీతస్తనం*
సద్య: ప్రస్నుత దుగ్ధబిందు మపరం హస్తేన సమ్మార్జత: ।
మాత్రైకాంగుళి లాలితస్య చుబుకే స్మేరానన స్యాధరే
శౌరే: క్షీర కణాన్వితా నిపతితా దంతద్యుతి: పాతున: ॥ 63

అన్వయము :- శౌరే: దంత ద్యుతి: న: పాతు = శౌరి యొక్క పలువరుసల వెలుఁగు మమ్ము కాఁచునుగాక!

అర్థము :- 'కించిత్ కుంచిత లోచనస్య' - కించిత్=ఇంచుక, కుంచిత=మూసిన, లోచనస్య=కన్నులు కలిగి, 'పర్యాయ పీత స్తనమ్' (యథాతథా) పర్యాయ=క్రమముతో, పీత=క్రోలఁబడిన, స్తనమ్=స్తనములు కలుగునట్లు, పిబత:=క్రోలుచున్నట్టియును, సద్య:=వేంటనే, ప్రస్నుత=పెల్లుబికిన, దుగ్ధబిందుం=పాలకణములుగల, అపరం=మాఱుస్తనమును, హస్తేన=చేతితో, సమ్మార్జత:=తుడుచుచున్నట్టియును, చుబుకే=చుబుకమునందు, మాత్రా=యశోదచేత, ఏకాంగుళి లాలితస్య=ఒంటివ్రేలితో లాలింపఁబడినట్టియు, స్మేరాzననస్య=విరియుచున్న మోముగల, శౌరే:=శ్రీకృష్ణునియొక్క, అధరే=పెదవిపైన, నిపతితా=వ్రాలిన, క్షీరకణాన్వితా=పాలకణములతో బెరసిన, దంతద్యుతి:=పలువరుసల కాంతి, న:=మమ్ము, పాతు=కాచునుగాక!

తాత్పర్యము :- అఱమూత కన్నులతో ఒండొకటిగా తల్లిచన్నులు గ్రోలుచు - ఆవలి స్తనమునుండి పెల్లుబికి వచ్చుచున్న క్షీరకణములను తనచేతితోఁ దుడుచుచు - తన చిబుకమును తల్లి ఒంటివ్రేలితోఁ బునుకుచుండఁగా - నవ్వుతో విరియఁబాఱుచున్న నెమ్మోముగల శ్రీహరియొక్క పెదవిపై చిందిలుచున్న - పాల పిసరులు బెరసిన పలువరుసల కాంతులు మమ్ముఁ గాచునుగాక!

శ్లో. *ఉత్తుంగ స్తనమండలోపరి లసత్ ప్రాలంబ ముక్తామణేః*
అంతర్బింబిత మింద్రనీల నికర చ్ఛాయానుకారి ద్యుతేః ।
లజ్జావ్యాజ ముపేత్య నమ్రవదనా స్పష్టం మురారే ర్వపుః
పశ్యంతీ ముదితా ముదే஽స్తు భవతాం లక్ష్మీ ర్వివాహోత్సవే ॥ 64

అన్వయము :- వివాహోత్సవే లక్ష్మీః భవతాం ముదే అస్తు = పెండ్లి సంబరములో నున్న లక్ష్మీదేవి మీకు సంతోషాతిశయము నిచ్చునుగాక!

అర్థము :- ఉత్తుంగ=సమున్నతమైన, స్తనమండల=కుచమండలము యొక్క, ఉపరి=మీఁద, ప్రాలంబి=వ్రేలుచున్న, ముక్తామణేః=వలుద ముత్తియము యొక్క, అంతః=అంతరాళమునందు, బింబితం= నీడలాఋచున్న, ఇంద్రనీల నికరచ్ఛాయాను కారిద్యుతేః - ఇంద్రనీలనికర=ఇంద్రనీలమణి పుంజము యొక్క, చ్ఛాయా=కాంతిని, అనుకారి=అనుకరించుచున్న, ద్యుతేః=వెలుఁగుకల, మురారేః=శ్రీమహావిష్ణువు యొక్క, వపుః=నెమ్మేనును, లజ్జా=సిగ్గు దొంతరయను, వ్యాజం=నెపమును, ఉపేత్య=ఆశ్రయించి, నమ్ర వదనా=వ్రాల్చిన మోముకలదై, స్పష్టం పశ్యంతీ=స్పష్టముగా కనుగొనుచు, ముదితా=మోదమును పొందిన, వివాహోత్సవే=పెండ్లి సంబరములోనున్న, లక్ష్మీః=శ్రీమహాలక్ష్మి, భవతాం=మీ, ముదే=సంతోషాతిశయమునకు - ఉబ్బునకు, అస్తు=అగునుగాక!

తాత్పర్యము :- సమున్నతమైన స్తనమండలము మీఁద వ్రేలుచున్న వలుదముత్తెము యొక్క అంతరాళమునందు నీడలాఋచు, ఇంద్రనీలమణిపుంజ ద్యుతులను అనుకరించుచున్న శ్రీమహావిష్ణువుయొక్క దివ్యదేహ సుషమను - సిగ్గునెపము వెనుక అవనతముఖియై కన్నారఁగనుగొనుచు సమ్మోదమును పొందుచు, పెండ్లి సంబరములో నున్న శ్రీమహాలక్ష్మి మీ కుబ్బును పెంపొందించునుగాక!

శ్లో. *కృష్ణే నాంబ! గతేన రంతు మధునా మృద్భక్షితా స్వేచ్ఛయా*
తథ్యం [5]కృష్ణ! క ఏవ మాహ? ముసలీ; మిథ్యాంబ! పశ్యాననమ్ ।

---

5 సత్యం' (పాఠాంతరము)

వ్యాదే హీతి విదారితే శిశుముఖే దృష్ట్వా సమస్తం జగత్
మాతా యస్య జగామ విస్మయపదం పాయాత్ సన: కేశవ: ॥ 65

అన్వయము :- యస్య మాతా విస్మయపదం జగామ స కేశవ న: పాయాత్ = ఎవ్వని తల్లి ఆశ్చర్య చరమసీమకుఁ జేరినదో అట్టి కేశవుఁడు మమ్ము కాపాడునుగాక!

అర్థము :- అంబ!=అమ్మా!, అధునా=ఇప్పుడు, రంతుం గతేన=ఆడుటకు పోయిన, కృష్ణేన=కృష్ణునిచేత, స్వేచ్ఛయా=స్వేచ్ఛానుసారము, మృత్=మట్టి, భక్షితా=భక్షింపఁబడినది; కృష్ణ=కృష్ణా!, సత్యమ్?=నిజమా?, క:=ఎవ్వఁడు, ఏవం=ఇట్లు, ఆహ=చెప్పినాఁడు? అంబ!=అమ్మా, మిథ్యా= అసత్యము, మే=నాయొక్క, ఆననం=నోటిని, పశ్య=కనుగొనుము! వ్యాదేహి=తెఱువుము!, ఇతి=అని, విదారితే=విప్పఁబడిన, శిశుముఖే=పసివాని నోటిలో, సమస్తం=సమస్తమైన, జగత్=జగత్తును, దృష్ట్వా=కనుగొని, యస్యమాతా=ఎవ్వని తల్లియైన యశోదాదేవి, విస్మయ పదమ్=ఆశ్చర్య సీమను, జగామ=చేరెనో, స కేశవ:=అట్టి కేశవుఁడు, న:=మమ్ము, పాయాత్=రక్షించునుగాక!

తాత్పర్యము :- "అమ్మా! నేడు కృష్ణుడు ఆడుకొనుటకని పోయి స్వేచ్ఛాను సారము మట్టి బొక్కినాఁడు!" - "కృష్ణా! నిజమేనా?" - " ఎవరు చెప్పినవారు?" "బలరాముఁడు" - "అమ్మా! ఉత్తది-కావలసినచో నానోరు చూచికొనుము!" - "ఏదీ తెఱువు" మని-విప్పిన ఆ పసివాని నోటిలో సకల చరాచర ప్రపంచమును కనుగొని - ఎవ్వని తల్లి యశోదాదేవి ఆశ్చర్య చరమసీమకుఁజేరినదో, అట్టికేశవుడు మమ్ము కాపాడునుగాక!

శ్లో. స్వాతీ సపత్నీ కిల తారకాణాం
ముక్తా ఫలానాం జననీతి రోషాత్ ।
సా రోహిణీ నీల మసూత రత్నం
కృతాస్పదం గోపవధూ కుచేషు ॥ 66

అన్వయము :- రోహిణీ నీలం రత్నం అసూత కిల = రోహిణీ నక్షత్రము ఇంద్రనీలమణిని ప్రసవించినదట!

అర్థము :- తారకాణామ్=అశ్వినిమొదలైన నక్షత్రములలోపల, సపత్నీ=(తనకు) సవతియైన, స్వాతీ=స్వాతీ నక్షత్రము, ముక్తాఫలానాం=మౌక్తికమణులకు, జననీ=తల్లి, ఇతి=అనెడి, రోషాత్=సవతి హెచ్చును ఓర్వలేని రోషము వలన, సా=ఆ, రోహిణీ =రోహిణీ

నక్షత్రము, గోపవధూ కుచేషు=వ్రజాంగనా, స్తనమండలములందు,కృతాస్పదం=నెలకొనిన, నీలంరత్నం=ఇంద్రనీల మణిని, అసూతకిల!= ప్రసవించినదఁట!

తాత్పర్యము :- అశ్విని మొదలైన నక్షత్రములలో తనకు సవతియైన స్వాతి నక్షత్రము మౌక్తిక ఫలములను ప్రసవించిన తల్లి అన్న రోషమువలన ఆ రోహిణీ నక్షత్రము గోపవధూస్తనములయందు నెలకొనిన ఒక ఇంద్రనీలమణిని ప్రసవించినదఁట!

వివరణము :- స్వాతికార్తెలో కురిసిన వానచినుకులు ముత్యపుఁజిప్పలలో పడి ముత్యములగుచుండుటవలన స్వాతీనక్షత్రము ముత్యాలకు కన్నతల్లి! అట్టి స్వాతీ నక్షత్రము రోహిణీ నక్షత్రము సవతులు కనుక, రోహిణి, స్వాతి హెచ్చు నోర్వలేక, తానొక ఇంద్రనీలమణినే ప్రసవించినదఁట! ఆ యింద్రనీలమణి గోపవధూ స్తనమండలమందు స్థానమును సంపాదించికొన్నది. ముక్తాతిశాయి సౌందర్యముకలది. ముత్యములకు కూడ దానితో సమ్మేళన మున్నప్పుడే అందము. శ్రీ కృష్ణుని జన్మనక్షత్రము రోహిణి. కనుక ఈ నీలమణిని కన్న తల్లి!

శ్లో. **నృత్యంత మత్యంత విలోకనీయం**
కృష్ణం మణి స్తంభగతం మృగాక్షీ ।
నిరీక్ష్య 'సాక్షా దివ కృష్ణ మగ్రే
ద్విధా వితేనే నవనీత మేకమ్ ॥ 67

అన్వయము :- మృగాక్షీ మణిస్తంభగతం కృష్ణం విలోక్య ఏకం నవనీతమ్ ద్విధా వితేనే = కృష్ణుని - మణిస్తంభమందు ప్రతిబింబించిన కృష్ణుని (జూచి యశోద ఒక వెన్నముద్దను రెండుగాఁ జేసెను.

అర్థము :- అత్యంత విలోకనీయం=అత్యంత దర్శనీయుఁడై, నృత్యంతం=నృత్యము చేయుచున్న, కృష్ణం=కృష్ణుని, మణిస్తంభగతం=మణిస్తంభమందు ప్రతిబింబించిన కృష్ణుని, మృగాక్షీ=లేడి వలె చలించుచున్న కన్నులు గల యశోద, అగ్రే=ఎదుట, కృష్ణమిత=కృష్ణునివలెనే, విలోక్య=చూచి, ఏకం నవనీతమ్=ఒక వెన్నముద్దను, ద్విధా=రెండుగా, వితేనే=చేసెను.

---

6 'విలోక్య' (పాఠాంతరము)

తాత్పర్యము :- అత్యంత దర్శనీయుఁడై నృత్యమాడుచున్న మణిస్తంభములోని కృష్ణుని జూచి, లేడివలె అటునిటు కదలుచున్న కన్నులు గలదియై, యశోద ఎట్టయెదుట సాక్షాత్తుగా కృష్ణుని జూచి తన చేతిలోని ఒకే వెన్నముద్దను రెండుగా విభాగించెను.

శ్లో. *వత్స! జాగ్రుహి! విభాత మాగతం*
జీవ! కృష్ణ! శరదాం శతం శతమ్ ।
ఇత్యుదీర్య సుచిరం యశోదయా
దృశ్యమాన వదనం భజామహే ॥ 68

అన్వయము :- సుచిరం యశోదయా దృశ్యమాన వదనం భజామహే = పెద్దతడవు యశోదచేత దర్శింపబడుచున్న నెమ్మోముగల స్వామిని మేము సేవించుచున్నాము.

అర్థము :- వత్స=కూనా!, జాగ్రుహి!=మేలుకొనుము!, విభాత మాగతమ్=తెల్లవారవచ్చినది, కృష్ణ=కృష్ణా!, శరదాం=సంవత్సరములయొక్క, శతం శతం=పదివేలు, జీవ!=బ్రదుకుము!, ఇతి=ఇట్లు, ఉదీర్య=పలికి, సుచిరం=పెద్దతడవుగా, యశోదయా=యశోదాదేవిచేత, దృశ్యమాన వదనమ్=సందర్శింపఁబడుచున్న నెమ్మోము గలవానిని, భజామహే=సేవించుచున్నాము.

తాత్పర్యము :- "కన్నా! నిద్రలే! తెల్లవారవచ్చినది. 'కృష్ణా! పదివేలేండ్లు బ్రదుకుము!' ఇట్లు పలికి, యశోదాదేవిచేత పెద్దతడవుగా దర్శింపఁబడుచున్న నెమ్మోము గలవానిని మేము సేవించుచున్నాము.

శ్లో. *ఓష్ఠం జిఘ్రన్ శిశురితి ధియా చుంబితో వల్లవీభిః*
కంఠం గృహ్ణ న్నరుణిత పదం గాఢ మాలింగితాంగః ।
ధోర్ష్ణా లజ్జాపద మభిమృశ న్నంక మారోపితాత్మా
ధూర్త స్వామీ హరతు దురితం దూరతో బాలకృష్ణః ॥ 69

అన్వయము :- ధూర్త స్వామీ బాలకృష్ణః దురితం దూరతో హరతు = ధూర్తులకెల్ల దొరయైన బాలకృష్ణుఁడు మా దురితమును దూరముగా హరించునుగాక!

అర్థము :- శిశురితి ధియా=శిశువను తలంపుతో, వల్లవీభిః=వ్రజస్త్రీలచేత, చుంబితః=ముద్దిడుకొనఁబడినవాఁడయి, ఓష్ఠం=మోవిని, జిఘ్రన్=ఆఘ్రాణించుచు -

ఆలింగితాంగః=కౌఁగిలించికొనఁబడినవాఁడై - అరుణిత పదం=ఎఱ్ఱవాఱిన నఖపదములు కలుగు రీతిని, గాఢం=గాటముగా, కంఠం గృహ్ణన్=కంఠాశ్లేషము చేయుచు - అంకమారోపితాత్మా=ఒడి నెక్కించికొనఁబడిన వాఁడై, దోర్ష్ణా=చేతితో, లజ్జాపదం= లజ్జాస్థానమును, అభిమృశన్=అంతట తడుముచు - ధూర్తస్వామీ=ధూర్తులకు దొరయైన, బాలకృష్ణః=బాలస్వరూపములోనున్న కృష్ణుఁడు, దూరతః=దూరముగా, దురితం=పాపమును, హరతు=హరించునుగాక!

తాత్పర్యము :- శిశువే కదా! అని - వ్రజాంగనలు ముద్దిడుకొనుచుండఁగా, మోవిని ఆఘ్రాణించుచు, కౌగిలించుకొనుచుండఁగా నెత్తురు వాఱునట్లు నఖాంకములుంచుచు గాటముగా కంఠాశ్లేషము చేయుచు - ఒడిపై నెక్కించికొనుచుండగా, చేతితో లజ్జాస్థానమును దడుముచు ధూర్తులకు దొరయైన బాలకృష్ణుడు మా దురితమును దూరముగాఁ దొలఁగించునుగాక!

శ్లో. ***ఏతే లక్ష్మణ! జానకీ విరహితం మాం ఖేదయం త్యంబుదాః***
మర్మాణీవ చ ఘట్టయం త్యల మమీ క్రూరాః కదంబానిలాః ।
ఇత్థం వ్యాహృత పూర్వజన్మ చరితం యో రాధయా వీక్షితః
సేర్ష్యం శంకితయా స నః సుఖయతు స్వప్నాయమానో హరిః ॥ 70

అన్వయము :- స్వప్నాయమానో హరిః నః సుఖయతు = కలవరించుచున్న స్వామి మమ్ము సుఖస్థితియందుంచునుగాక!

అర్థము :- లక్ష్మణ!=ఓ లక్ష్మణా!, జానకీ విరహితం మాం=సీతా విరహితుఁడనైన నన్ను, ఏతే=ఈ, అంబుదాః=మబ్బులు, ఖేదయంతి=దిగులుపఱచుచున్నవి, అమీ=ఈ, క్రూరాః=క్రూరస్వభావములైన, కదంబానిలాః=కడిమి చెట్ల మీఁదుగా వచ్చుచున్న గాలులు, అలం=మిక్కిలియును, మర్మాణి=ఆయువుపట్టులను, ఘట్టయంతీవ=నొక్కుచున్న మాదిరిగా నున్నవి, ఇత్థం=ఈ విధముగా, వ్యాహృత పూర్వజన్మ చరితమ్=ముచ్చటింపఁబడిన వెనుకటి జన్మమునాటి యుబుసు కలుగునట్లు, స్వప్నాయమానః=కలవరించుచు, యః=ఎవ్వఁడు, శంకితయా రాధయా=శంక యుదయించిన రాధాదేవి చేత, సేర్ష్యం=ఈసుతో, వీక్షితః=కనుగొనబడినాఁడో, స హరిః=ఆ కృష్ణుఁడు, నః=మమ్ము, సుఖయతు=సుఖ పడునట్లు చేయునుగాక!

తాత్పర్యము :- "ఓ లక్ష్మణా! సీత నెడఁబాసి యున్న నన్ను ఈ మబ్బులు దిగులు కొలుపుచున్నవి. ఈ కడిమిచెట్ల పైనుండి వీచుచున్న గాలులు ఆయువు పట్టులను గట్టిగా నొక్కుచున్నట్లే తాఁకుచున్నవి - " ఈ ధోరణిలో వెనుకటి జన్మము నాటి యుబుసును ముచ్చటించుటగా పలవరించుచు ప్రక్కనున్న శంకితయైన రాధచేత ఈసుతోఁ గనుగొనఁబడిన శ్రీహరి మమ్ము సుఖియింపఁజేయునుగాక!

శ్లో. ***ఓష్ఠం ముంచ హరే! బిభేమి భవతా పానై ర్హతా పూతనా***
కంఠాశ్లేష మముం జహీహి దళితా వాలింగనే నార్జునౌ ।
మా దేహి చ్ఛురితం హిరణ్యకశిపు ర్నీతో నఖైః పంచతాం
ఇత్థం వారిత రాత్రికేళి రవతా ల్లక్ష్మ్యాఽపహాసా ద్ధరిః ॥ 71

అన్వయము :- అపహాసాత్ లక్ష్మ్యా వారిత రాత్రి కేళిః హరిః అవతాత్ = గేలిచేయుచు రాత్రికేళినుండి లక్ష్మిచేత నివారింపఁబడిన శ్రీహరి మమ్ము కాపాడునుగాఁక!

అర్థము :- ఓష్ఠం ముంచ=(నా) మోవి విడువుము! హరే!= ఓ శ్రీహరీ! భవతా=నీచేత, పానైరేవ=క్రోలుటలతోనే, పూతనా హతా=పూతన చంపఁబడినది. అముం=ఈ, కంఠాఽశ్లేషమ్=కంఠాఽలింగనమును, జహీహి!=విడువుము!, అర్జునా=యమలార్జునములు - (మద్దిచెట్లు), ఆలింగనేన=కౌఁగిలితోనే, దళితౌ=విఱువఁబడినవి. ఛురితం మా దేహి=గీఱుట మానుము!, నఖైః=(నీ) గోళ్లతోనే, హిరణ్యకశిపుః=హిరణ్యకశిపుఁడు, పంచతాం=పంచత్వమును - మృత్యువును, నీతః=పొందింపఁబడినాఁడు!", ఇత్థం=ఈ తీరైన, అపహాసాత్=ఆలిగొనుటవలన, లక్ష్మ్యా=లక్ష్మీ దేవిచేత, వారిత రాత్రికేళిః=నివారింపఁబడిన నిశీథకేళి గల, హరిః=శ్రీహరి, అవతాత్=కాఁచునుగాక!

తాత్పర్యము :- "ఓ శ్రీహరీ! నా మోవి విడువుము, వెఱతును, (ఈ) నీ క్రోలుటలతోనే పూతన ప్రాణములుపోయినవి. ఈ కౌఁగిలి వీడుము! నీ కౌఁగిలింతతోనే మద్దిచెట్లు విఱిగి పడిపోయినవి! గోళ్లతో ఒత్తకుము! నీ గోళ్లతోనే హిరణ్య కశిపుఁడు హతమాఱినాఁడు!" ఈ రీతి ఆలిగొను మాటలతోనే లక్ష్మీదేవిచేత నిశీథకేళి నుండి నివారింపఁబడిన శ్రీహరి రక్షించుగాక!

శ్లో. ***రామోనామ బభూవ హుం, తదబలా సీతేతి, హుం, తాం పితు***
ర్వాచా పంచవటీతటే విహరత స్తస్యాహర ద్రావణః ।

నిద్రార్థం జననీ కథా మితి హరే ర్హుంకారతః శ్రుణ్వతః
సౌమిత్రే! క్వ ధను ర్ధను ర్ధను రితి వ్యగ్రాగిరః పాంతు నః [7] ॥ 72

అన్వయము :- "సౌమిత్రే! క్వ? ధను ర్ధను ర్ధను రితి" వ్యగ్రాగిరః పాంతు నః = "సౌమిత్రీ! ఎక్కడ ధనుస్సు! ధనుస్సు! ధనుస్సు!" అనెడి వ్యాసక్త వచనములు మమ్ము కాపాడునుగాక!

అర్థము :- రామో నామ బభూవ=రాముఁడని యుండెను, తదబలా=ఆతని భార్య, సీతేతి=సీత అని, పితుర్వాచా=తండ్రిమాట చేత, పంచవటీ తటే="పంచవటి" అను గోదావరి ఒడ్డున, విహరతః=విహరించుచుండఁగా, తస్య=ఆ రామునియొక్క, తాం=ఆ సీతను, రావణః=రావణుఁడు, అహరత్=హరించెను, నిద్రార్థం=నిద్రపుచ్చుటకై, జననీకథాం= తల్లిచెప్పుచున్న కథను, ఇతి=ఈ రీతిగా, "హుంకారతః" 'ఊకొట్టుటలుగా శ్రుణ్వతః=వినుచున్న, హరేః=శ్రీహరియొక్క, "సౌమిత్రే!=సౌమిత్రీ!, క్వధనుః=ఎక్కడ? ధనుస్సు!, ధనుర్ధనుః=ధనుస్సు! ధనుస్సు!", ఇతి=అనెడి, వ్యగ్రా గిరః=వ్యాసక్త వచనములు తొందరపాటుతో చెప్పబడిన మాటలు, నః=మమ్ము, పాంతు=కాపాడునుగాక!

తాత్పర్యము :- "అనఁగా అనఁగా రాముఁడని ఒకఁడుండెను. ఆయన భార్య సీత. తండ్రి మాట చేత "పంచవటి" అను గౌతమి ఒడ్డునందు విహరించుచుండఁగా ఆ రాముని యొక్క ఆ సీతను రావణుఁడెత్తికొనిపోయెను" - ఈరీతిగా తన్ను నిద్రపుచ్చుటకై తల్లి చెప్పుచున్న కథను 'ఊ' కొట్టి వినుచున్న శ్రీహరి యొక్క "సౌమిత్రీ! ఎక్కడ ధనస్సు? ధనుస్సు! ధనుస్సు!" అనెడి వ్యాసక్త వచనములు (తొట్రుపడుచు చెప్పిన మాటలు) మమ్ము కాపాడునుగాఁక!

శ్లో. *బాలోఽపి శైలోద్ధరణాగ్రపాణిః*
నీలోఽపి నీరంధ్రతమః ప్రదీపః ।
ధీరోఽపి రాధా నయనావబద్ధః
జారోఽపి సంసార హరః కుత స్త్వమ్ ॥ 73

అన్వయము :- త్వం=నీవు, బాలోఽ పి=బాలుఁడవై యుండియే, శైలోద్ధరణాగ్ర పాణిః=శైలమును మీఁదికెత్తి ధరించిన అగ్ర హస్తము కలవాఁడవు, కుతః=ఎందువలన?

---

7 'నః'=మిమ్ము (పాఠాంతరము)

నీలో౽పి=నీలవర్ణుఁడవై యుండియే, నీరంధ్రతమః ప్రదీపః - నీరంధ్ర=సూదిమొనతోనైనను బెజ్జము చేయుటకు అనువుపడని, తమః=పెంజీఁకటికి, ప్రదీపః=పెనుదివ్వెవు, కుతః=ఎందువలన?, ధీరో౽పి=నిశ్చల చిత్తుఁడవై యుండియే, రాధా నయనావబద్ధః=రాధకన్నులతో బంధింపఁబడినవాఁడవు, కుతః?=ఎందువలన?, జారో౽పి=జారుఁడవై యుండియే, సంసారహరః=సంసారమును హరించువాఁడవు, కుతః?=ఎందువలన?

తాత్పర్యము :- నీవు బాలుఁడవై యుండియే శైలమును అవలీలగా అఱచేత ధరించిన వాఁడవు! ఎందువలన? నీవు నీలవర్ణుఁడవయి యుండియే సూదియొనతోనైనను బెజ్జము చేయుటకైనను అనువుపడని పెంజీఁకటిని హరించివేయువాఁడవు! ఎందువలన? నీవు నిర్వికార చిత్తుఁడవై యుండియే రాధ కనుసన్నలలో కట్టఁబడి యున్నావు! ఎందువలన? నీవు జారుఁడవై యుండియే సంసారము హరించుచుందువు! ఎందువలన?

శ్లో. బాలాయ నీల వపుషే నవ కింకిణీక
జాలాభిరామ జఘనాయ దిగంబరాయ ।
శార్దూల దివ్య నఖ భూషణ భూషితాయ
నందాత్మజాయ నవనీతముషే నమస్తే ॥ 74

అన్వయము :- నవనీతముషే నమస్తే = వెన్నల దొంగవైన నీకొఱకు నమస్కారము!

అర్థము :- బాలాయ=నిసువు ప్రాయము వానికొఱకు, 'నవ కింకిణీక జాలాభిరామ జఘనాయ, - నవ=రమ్యములైన, కింకిణీక=బంగరు చిఱుమువ్వల మొత్తముల యొక్క, జాల=గుత్తులతో, అభిరామ=నయనాభిరామమయిన, జఘనాయ=మొలగలవాని కొఱకు, దిగంబరాయ=దిస్సమొలవాని కొఱకు, 'శార్దూలదివ్యనఖభూషణ భూషితాయ' - శార్దూల=పెద్దపులి యొక్క, దివ్య=మెఱయుచున్న, నఖ=గోరుపాదిగిన, భూషణ=పతకము చేత, భూషితాయ=అలంకరింపఁబడిన వాని కొఱకు, నందాత్మజాయ=నందనందనుని కొఱకు, నవనీత ముషే=వెన్నలదొంగవైన, తే=నీ కొఱకు, నమః=నమస్కారము!

తాత్పర్యము :- నిసువు ప్రాయపువాని కొఱకు, నల్లని నెమ్మేనివాని కొఱకు, రమ్యములైన బంగరు చిఱుమువ్వల మొత్తముల గుత్తులతో కన్నుల పండుగగానున్న కటిసీమ కలవాని కొఱకు, పులిగోరుపాదిగిన మెఱుఁగు లీనుచున్న పతకముతో సింగారింపఁబడినవాని కొఱకు, నందనందనుని కొఱకు, వెన్నల దొంగవయిన నీ కొఱకు నా నమస్కారము!

శ్లో. *పాణౌ పాయస భక్త మాహితరసం బిభ్రన్ ముదా దక్షిణే*
సవ్యే శారద చంద్రమండల నిభం హైయంగవీనం దధత్।
కంఠే కల్పిత పుండరీక నఖమ ప్యుద్దామ దీప్తిం వహన్
దేవో దివ్యదిగంబరో దిశతు నః సౌఖ్యం యశోదాశిశుః ॥ 75

అన్వయము :- దివ్య దిగంబరో యశోదాశిశుః దేవోనః సౌఖ్యం దిశతు = దివ్య దిగంబర రూపములో నున్న యశోదా శిశువైన స్వామి మాకు సౌఖ్యము నిచ్చును గాక!

అర్థము :- దక్షిణే పాణౌ=కుడి చేతియందు, ఆహితరసమ్=చవులూరుచున్న, 'పాయసభక్తం' - పాయస=ఆవుపాలతో వండిన, భక్తం=అన్నమును - (పరమాన్న పాత్రమును), ముదా=ఉబ్బుతో, బిభ్రన్=తాల్చుచు, - సవ్యే=ఎడమచేతియందు, 'శారద చంద్రమండల నిభమ్' - శారద=శరత్కాలమునందలి, చంద్రమండల=చంద్రబింబముతో, నిభం=సరియైన, హైయంగవీనం=నిన్నటి గోదోహమునుండి సముద్భవించిన వెన్నముద్దను, దధత్=ధరించుచు, - ఉద్దామ=విశృంఖలమైన, దీప్తిం=తేజముగల, కంఠే=గళమునందు, కల్పిత పుండరీక నఖం అపి - కల్పిత=పొదుగఁబడిన, పుండరీక నఖమపి=పులిగోరుగల నగనుగూడ, వహన్=తాల్చుచు, - దివ్య=తేజోమయుఁడును, దిగంబరః=దిస్సమొలవాఁడును, దేవః=క్రీడామయుఁడునయిన, యశోదాశిశుః=యశోదాదేవియొక్క చిన్నవాఁడు, నః=మాకొఱకు, సౌఖ్యం=సుఖస్థితిని, దిశతు=ఇచ్చునుగాక!

తాత్పర్యము :- కుడిచేతిలో చవులూరుచున్న పాయసాన్నముతో నిండిన గిన్నెను పట్టుకొని - ఎడమచేతితో - కార్తిక పున్నమనాటి చందమామవంటి వెన్నముద్ద పెట్టికొని - మెడలో మెఱుఁగు లీనుచున్న పులిగోరు పతకమును దాల్చి - క్రీడాపరాయణుఁడును, తేజోమయుఁడు, దిగంబరుఁడు నయిన, యశోదా శిశువు మాకు సౌఖ్యస్థితిని కల్పించునుగాక!

శ్లో. *కింకిణి కిణికిణి రభసైః*
అంగణ భువి రింగణైః సదాఽటంతమ్।
కుంకుణు కుణు పదయుగళం
కంకణ కర భూషణం హరిం వందే ॥ 76

అన్వయము :- కంకణ భూషణ కరం హరిం వందే = కడియంపు రవణములతో రవళించుచున్న చేతులుగల శ్రీహరికి చేతులెత్తి జోతలిడుచున్నాను.

అర్థము :- కింకిణి=చిఱుమువ్వలయొక్క, 'కిణికిణి'='కిణి కిణి' అను ధ్వనులయొక్క, రభసైః=సందడులతో, అంగణభువి=ముంగిటిలో, రింగణైః=చెంగనాలతో, సదా=ఏ(ప్రొద్దులను, అటంతం=ఆడుచున్నవానిని, "కుంకుణు కుణు పదయుగళమ్" ="కుంకుణు కుణు' లుగా మ్రోఁగుచున్న గిలుకుటందియల పాదద్వయము గల వానిని, కంకణ కర భూషణం=కడియాల రవణములతో రవళించుచున్న చేతులు గలవానిని, హరిం=శ్రీహరిని, వందే=చేతులెత్తి జోతలిడుచున్నాను.

తాత్పర్యము :- చిఱుమువ్వల 'కిణికిణి' ధ్వనుల కలకలములతో యశోద ముంగిటిలో చెంగనాలుగా నే(ప్రొద్దుల నాడుచున్న వానిని, 'కుంకుణు కుణు'లు గాగా మొరయుచున్న గిలుకుటందియల పాదద్వయము గల వానిని, కడియాల రవణములతో రవళించుచున్న చేతులు గలవానిని, శ్రీహరిని చేతులెత్తి జోతలుపెట్టుచున్నాను.

శ్లో. ***సంబాధే సురభీణాం ।***
అంబా మాయాసయంత మనుయాంతీమ్ ।
లంబాలక మవలంబే ।
తం బాలం తను విలగ్న జంబాలమ్ ॥ 77

అన్వయము :- లంబాలక మవలంబే తం బాలం తను విలగ్న జంబాలమ్ = ఒడలెల్ల అడుసు చేసికొని, ముంగురులతో తూఁగాడుచు, తల్లికి అందని, ఆ చిన్నవానిని, నేను పట్టుకొందును.

అర్థము :- సురభీణాం=తొఱ్ఱుల (ఆవుల) యొక్క, సంబాధే=ఇఱుకాటములో, అనుయాంతీమ్=వెన్నడి వచ్చుచున్న, అంబాం=అమ్మను, ఆయాసయంతమ్=అందక అలజడి పెట్టుచున్నవానిని, లంబాలకం=తూఁగాడుచున్న ముంగురుల వానిని, తను విలగ్న జంబాలం=ఒడలికి మేదికొన్న అడుసు గలవానిని, తం=ఆ. బాలం=చిన్నవానిని, అవలంబే=అలవరించి పట్టుకొందును.

తాత్పర్యము :- తొఱ్ఱుల (ఆవుల) ఇఱుకాటములో తన్ను వెన్నాడి వచ్చుచున్న అమ్మను అందుకొననీయక అలజడి పెట్టుచున్నవానిని, తూఁగాడు ముంగురులవానిని,

ఒడలెల్ల అడుసు చేసికొన్న వానిని - ఆ బుడుత వానిని నేను పోయి అలవరించి పట్టుకొందును.

(విశేషాంశము :- ఈ శ్లోకమందలి యర్థము -

"పంచహాయన మీశానం ధావమానం వ్రజాంగణే
కింకిణీ నూపురగ్రీవా కర్ణభూషోజ్జ్వలం స్మరేత్"

- అని గోపాల కృష్ణ సంపత్కృత్ అష్టాక్షరీ మంత్ర ధ్యానమని సనత్కుమార సంహితయందుఁ జెప్పఁబడియున్నది)

శ్లో. అంచిత పింఛాపీడం
వంచిత సౌజన్య వల్లవీ వలయమ్ ।
అధరమణి నిహిత వేణుం ।
బాలం గోపాల మనిశ మవలంబే ॥ 78

అన్వయము :- బాలం గోపాల మనిశ మవలంబే = బాలుఁడైన గోపాలుని (అలవరించి) ఎల్లవేళల పట్టుకొనియుందును.

అర్థము :- అంచిత=అందమైన, పింఛాz పీడమ్ - పింఛ=నెమలి పింఛమే అనెడి, ఆపీడం=ఆభరణము గలవానిని, 'వంచిత సౌజన్య వల్లవీ వలయమ్' - వంచిత=బేలు పఱుపఁబడిన, సౌజన్య=మంచితనముగల, వల్లవీ=వ్రేఁతలయొక్క, వలయం=సముదాయము గలవానిని, అధరమణి నిహిత వేణుం - అదరమణి=మోవి మానిక మందు, నిహిత=నెలకొలుపఁబడిన, వేణుం=పిల్లనఁగ్రోవి వానిని, బాలం=చిఱుతప్రాయపు, గోపాలమ్=గోపాలుని, అనిశమ్=ఎల్లప్రొద్దుల, అవలంబే=అవలంబించియుందును.

తాత్పర్యము :- (తలయందు నెమలిపురి యెప్పుచున్నవాడును, గోపస్త్రీల వలపును కొల్లలాడిన వాడును, మోవి కెంపున పిల్లనగ్రోవిని మోపినవాఁడును, గొల్లవంశమునఁ బుట్టినవాఁడును, అగు చిన్నబాలుని శ్రీకృష్ణుని ఎల్లప్పుడును ఆశ్రయించుచున్నాను.)

శ్లో. ప్రహ్లాద భాగధేయం
నిగమ మహాద్రే ర్గుహాంత రాధేయమ్ ।

నరహరి పదాభిధేయం
విబుధ విధేయం మ మానుసంధేయమ్ ॥ 79

అన్వయము :- విబుధ విధేయం మమ అనుసంధేయమ్ = విబుధులయందు వినయగ్రాహియైన తత్త్వము నాకు అనుసంధానయోగ్యము.

అర్థము :- ప్రహ్లాద భాగధేయం=ప్రహ్లాదుని పాలిటి భాగ్యమును, నిగమ మహాద్రేః=వేదాద్రియొక్క, గుహాంతర=గుహాంతరాళమునందు, ఆధేయం=నెలకొని యున్నదియును, నరహరి పదాభిధేయం=నరహరి పదమునకు అర్థభూతమునైన, విబుధ విధేయం=విబుధులయందు వినయము నవలంబించునట్టి తత్త్వము, మమ=నాకు, అనుసంధేయమ్=ధ్యానింపఁదగినది.

తాత్పర్యము :- ప్రహ్లాదునియొక్క భాగధేయ రూపమైనదియును, వేదాచల గుహాంతరాళములలో నెలకొని యుండునదియును, నరహరి పదమునకు అభిధేయార్థ రూపమైనదియును, విబుధులయందు వినయగ్రాహియును - అయిన తత్త్వము నాకు ధ్యానింపఁదగినది.

(విశేషాంశము :- 'అవతారాస్సంత్వన్యే సరసిజ నయనస్య సర్వతో భద్రాః కృష్ణా దన్యః కోవా ప్రభవతి' - 'ప్రాయశ్చిత్తం గుణగణనయా గోప వేషస్య విష్ణోః, - 'ఉపాసతామాత్మవిదః పురాణాః ...... వయం యశోదా శిశు బాల లీలా కథా సుధా సింధుషు లీలాయామః' - 'విహాయ కోదండ శరౌ ముహూర్తం గృహాణ పాణౌ మణి చారు వేణుమ్' - ఇత్యాదులచే శ్రీ విష్ణుదేవునవతారములందు కృష్ణావతారమునే కంఠోక్తిగా తనకభీష్టతమమని చెప్పుటే కాక ప్రతి శ్లోకమందును కృష్ణావతారమునకు మాత్రమే ఉపలక్షకములగు పింఛ, వ్రజ, నంద, యశోదా, గోపికా, వేణు, రాధాది పదములందేదేని ప్రయోగించి, కృష్ణునందేకాని తక్కిన అవతారములందది అన్వయింపకుండునట్లు నిబంధించియున్నాఁడు. ఏ శ్లోకమందేని తక్కిన అవతారముల లీలలు వర్ణించినను అందే కృష్ణావతారమందు పర్యవసించు పదములను గూర్పక మానఁడు. ఈ శ్లోకమందో 'ప్రహ్లాద భాగధేయం' - 'నరహరి పదాభిధేయం' - అని నరసింహావతారమందే తాత్పర్యము కనఁబడుటే కాక కృష్ణునకు అసాధారణములైనవి ఏవియుఁగానరావు. అయినను 'ఉత్తుంగ స్తన మండలోపలి ...... లక్ష్మీ ర్వివాహోత్సవే' ఇత్యాదులు కేవల కృష్ణుని గూర్చి కాక సాధారణముగా విష్ణుపరములుగానే

నిబద్ధములై యుండునట్లు ఇదియును నరహరి పరముగా నుండు నన్నయెడల 'కాంతా కచగ్రహణ నిగ్రహ బద్ధ లక్ష్మీ ఖండాంగ రాగ రసరంజిత మంజులశ్రీ .... కృష్ణ తేజః' - 'వారిత రాత్రి కేళిరవతా లక్ష్మ్యా పహోసాద్దరిః' - ఇత్యాదులందు లక్ష్మీ శబ్దమునకు 'కృష్ణతేజః' - 'వారిత రాత్రి కేళిః' - ఇత్యాది పదములతోడి సంగతిని బట్టి లక్ష్మీదేవి కాక రుక్మిణిదేవియే అని అర్థము గ్రాహ్యముగాన పూర్వశ్లోకమందలి లక్ష్మీశబ్దము రుక్మిణీ పరముగానే అగును గాన ఆ శ్లోకమును కృష్ణుని గుఱించిన దనియే ఊహింపఁదగియున్నది. ఇట్లు ఈ శ్లోకము కృష్ణావతార పరము గామిచే ప్రక్షిప్తమే అగును)

శ్లో. *సంసారే కిం సారం?*
కంసారే శ్చరణ కమల పరిభజనమ్ ।
జ్యోతిః కి మంధకారే? ।
యదంధకారే రనుస్మరణమ్ ॥ 80

(అవతారిక :- కృష్ణుని సేవించుట, శివుని ధ్యానించుట అతిముఖ్యములని చెప్పుచున్నాడు.)

అర్థము :- సంసారే=సంసారమునందు, కిం సారం?=సారభూతమైనది ఏమి? కంసారేః=కంసాంతకునియొక్క, చరణ కమల పరిభజనం=పాద పద్మముల యొక్క పరిచర్యయే; అంధకారే=చీఁకటిలో,జ్యోతిః కిమ్=వెలుఁగు - ఎయ్యది?, అంధకారేః= అంధకాంతకునియొక్క - శివునియొక్క, అనుస్మరణం యత్=నిరంతరస్మరణము ఏది కలదో, (తత్)=అదియే.

తాత్పర్యము :- సంసారమునందు సారభూతమైనది - ఏది? కంసారియొక్క చరణకమల సంసేవనము. చీఁకటిలో జ్యోతి - ఏది? అంధకారి (శివుని) యొక్క అనవరతమైన అనుస్మరణమే.

శ్లో. *కలశ నవనీత చోరే ।*
కమలా దృక్కుముద చంద్రికా పూరే ।
విహరతు నందకుమారే ।
చేతో మమ గోపసుందరీ జారే ॥ 81

అన్వయము :- మమ చేతః నందకుమారే విహరతు = నా చేతము నందకుమారునియందు విహరించుచుండుగాక!

అర్థము :- 'కలశ నవనీత చోరే' - కలశ=ఘటములో నున్న, నవనీత=వెన్నయొక్క, చోరే=తెక్కలికానియందు, కమలా దృక్కుముద చంద్రికాపూరే - కమలా =లక్ష్మీదేవియొక్క, దృక్కుముద=నయన కైరవములకు, చంద్రికాపూరే=వెన్నెల వెల్లియైన, గోపసుందరీ జారే=గోపికా జారుడైన, నంద కుమారే=నంద కుమారుని యందు, మమ చేతః=నా చేతస్సు, విహరతు=విహరించుచుండునుగాక!

తాత్పర్యము :-

పిడుత వెన్నల తొడుకు నందు
కడలి కన్నియ కలువ కన్నుల
తఱపి వెన్నెల జాలు నందు
మంద కన్నెల మరుని యందు
నంద నందను నందె మరఁగుచు
డెంద మలరారున్.

శ్లో: ***కస్త్వం బాల? బలానుజః ; కిమిహతే? మన్మందిరాశంకయా;***
యుక్తం తన్నవనీత పాత్ర వివరే హస్తం కిమర్థం న్యసేః? ।
మాతః! కంచన వత్సకం మృగయితుం మాగా విషాదం క్షణాత్;
ఇత్యేవం వరవల్లవీ ప్రతి వచః కృష్ణస్య పుష్ణాతు నః[8] ॥ 82

అన్వయము :- కృష్ణస్య వల్లవీ ప్రతి వచః నః పుష్ణాతు! = కృష్ణుఁడు గోపికకుఁజెప్పిన సమాధానము మమ్ము పోషించునుగాఁక!

అర్థము :- కస్త్వం బాల?=పోఱఁడా! నీవెవ్వఁడవు?, బలానుజః=బలరాముని తమ్ముగుఙ్జను, కిమిహతే?=ఇచ్చట నీకేమిపని?, మన్మందిరాశంకయా=మాయిల్లేయగునని, యుక్తం=బాగున్నది, తన్నవనీత పాత్ర వివరే హస్తం కిమర్థం న్యసేః=ఆ వెన్నకుండలో దేని

8 'నః=మిమ్ము (పాఠాంతరము)

కొఱకు చెయ్యి పెట్టుచున్నావు?, మాతః!=అమ్మా!, కంచన వత్సకం మృగయితుమ్=ఒకానొక లేఁగను వెదకుటకు, విషాదం మాగాః=కింకిరి పాటు పడకుము!, ఇత్యేవం=అని ఈవిధముగా, క్షణాత్=వెంటనే, కృష్ణస్య=కృష్ణుని యొక్క, వరవల్లవీ ప్రతివచః=గోపికకుఁజెప్పిన ప్రతి సమాధానము, నః=మమ్ము, పుష్ణాతు=పోషించునుగాక!

తాత్పర్యము :- అబ్బాయీ! నీవెవ్వరవు?; బలరాముఁడు మాయన్న!; ఇక్కడ నీకేమిపని?; మాయిల్లే అనుతలంపుతో; బాగున్నది - ఆవెన్న కుండలో దేనికి చెయ్యి పెట్టితివి?; అమ్మా! కింకిరి పడకుము! ఒక లేఁగను వెదకుటకు - అని ఈ విధముగా వెనువెంటనే కృష్ణుఁడు గోపికకుఁజెప్పిన సమాధానము మమ్ము పోషించునుగాఁక!

(**విశేషాంశము** :- ఈ శ్లోకమందలి యర్థము -

'హరంతం నవనీతాది చౌర్యేణ వ్రజయోషితామ్ ।
కృష్ణం ధ్యాయే న్మంత్రం జపేదిదమ్'

- అని గోపాలకృష్ణ ఏకాదశాక్షరీ మంత్ర ధ్యానముగా సనత్కుమార సంహితయందుఁ జెప్పబడియున్నది).

శ్లో. *గోపాలా ఽజిర కర్దమే విహరసే, విప్రాఽధ్వరే లజ్జసే,*
బ్రూషే గోకుల హుంకృతైః, స్తుతి శతై ర్మౌనం విధత్సే విదామ్ ।
దాస్యం గోకుల పుంశ్చలీషు కురుషే, స్వామ్యం నదాంతాఽత్మసు ;
జ్ఞాతం కృష్ణ! తవాంఘ్రి పంకజయుగం, ప్రేమ్ణాఽచలం మంజులమ్ ॥ 83

అన్వయము :- జ్ఞాతం కృష్ణ! తవాంఘ్రి పంకజయుగం ప్రేమ్ణా చలం మంజులమ్ = కృష్ణా! తెలిసికొన్నాను. మంజులమైన నీ పాద పద్మయుగళము ప్రేమచేతనే కదలును.

అర్థము :- గోపాల=గొల్ల వారియొక్క, అజిర=ముంగిళ్లలోని, కర్దమే=రొంపియందు, విహరసే=విహరించుచుందువు, విప్రాధ్వరే=బాపల జన్నమునందు, లజ్జసే=బిడియ పడుచుందువు, గోకుల హుంకృతైః=ఆల హుంకారములతో, బ్రూషే=ముచ్చటింతువు, విదాం=తత్త్వవేత్తలయొక్క, స్తుతిశతైః=స్తోత్రశతములతో, మౌనం=మౌనవ్రతమును, విధత్సే=ధరింతువు, గోకుల పుంశ్చలీషు=గోకులస్వైరిణుల యందు, దాస్యం=ఊడిగమును, కురుషే=చేయుచుందువు, దాంతాఽత్మసు=దమ సంపన్నుల యందు, స్వామ్యం=

దొరతనమును, న=ఒల్లవు, కృష్ణ!=కృష్ణా!, మంజులం=సుందరమైన, తవ=నీయొక్క అంఘ్రి పంకజ యుగం=అడుగుఁ దామరల జంట, ప్రేమ్ణా=ప్రేమచేత, చలం=కదలెడి స్వభావము కలది.

తాత్పర్యము :- కృష్ణా! తెలిసినది! అందమైన నీ అడుగుఁ దామరల జంట ప్రేమయున్నచోటికి మాత్రమే కదలెడు స్వభావము కలది. ఎందుకనగా - నీవు గొల్లవారి ముంగిటి రొచ్చులో విహారము చేయుదుగాని - బ్రాహ్మణుల యజ్ఞశాలలకు (బోవుటకు బిడియ పడుచుందువు. ఆవుల హుంకారములతో ముచ్చటింతువుకాని - తత్త్వవేత్తల స్తోత్ర శతములకు మూఁగనోము పట్టుచుందువు, గోకుల స్వైరిణులకు - ఊడిగము చేయుచుందువుగాని - దమ సంపన్నాత్ముల యందు మాత్రము దొరతనము నెరపవు.

శ్లో. నమ స్తస్మై యశోదాయా దాయాదాయాఽస్తు తేజసే ।
యద్ధి రాధా ముఖాంభోజం భోజం భోజం వ్యవర్ధత ॥ 84

అన్వయము :- తస్మై తేజసే నమః = ఆ వెలుఁగు కొఱకు నమస్కారము.

అర్థము :- యశోదాయాః=యశోదకు, దాయాదాయ=కుమారుఁడైన, తస్మై తేజసే=ఆ వెలుఁగుకొఱకు, నమః=నమస్కారము, యత్=ఏ వెలుఁగు, రాధాముఖాంభోజం=రాధయొక్క ముఖాంభోజమును, భోజంభోజమ్=అనుభవించి అనుభవించి, వ్యవర్ధతహి=పెంపొందినదికదా!

తాత్పర్యము :- యశోదానందన రూపమైన ఆ వెలుఁగునకు నమస్కారము. ఏ వెలుఁగు శ్రీరాధాదేవియొక్క ఆననమను అంభోజమును ఆస్వాదించి ఆస్వాదించి అభివృద్ధిని పొందియున్నదో!

శ్లో. అవతారాః సంత్వన్యే సరసిజ నయనస్య సర్వతో భద్రాః ।
కృష్ణా దన్యః కోవా ప్రభవతి? గో గోప గోపికా ముక్త్యై ॥ 85

అన్వయము :- కృష్ణా దన్యః కోవా ప్రభవతి! = కృష్ణుని కంటె వేఱొక్కఁడెవ్వఁడైనను సమర్థుఁడైయుండునా?

అర్థము :- సరసిజ నయనస్య=సరసిజాక్షుని యొక్క, సర్వతో భద్రాః=ఐహి కాముష్మిక భద్ర ప్రదములైన, అన్యే=ఇతరములైన, అవతారాః=అవతారములు,

సంతు=ఉండునుగాఁక!, గో గోప గోపికా ముక్త్యై=ఆవుల యొక్క - ఆలకాపరులయొక్క - వారి యిల్లాండ్ర యొక్క, ముక్త్యై=ముక్తి కొఱకు, కృష్ణాదన్యః=కృష్ణునికంటె ఇతరుడు, కోవా=ఎవ్వఁడుగాని, ప్రభవతి?=సమర్థుఁడగును?

తాత్పర్యము :- ఐహికాముష్మిక భద్ర ప్రదములైన అరవింద నయనుని యొక్క అన్యములైన అవతారములమాట అట్లుండునుగాఁక! ఆవులకు, ఆలకాఁపరులకు, వారియిల్లాండ్రకు (గూడ ముక్తినిచ్చుటకు కృష్ణునికంటె చాలిన వారుందురా?

శ్లో. *మధ్యే గోకుల మండలం ప్రతిదిశం చాంభార వోజ్జృంభితే*
ప్రాత ర్దోహ మహోత్సవే నవఘనశ్యామం రణన్నూపురమ్ ।
ఫాలే బాలవిభూషణం కటిరట త్సత్కింకిణీ మేఖలమ్
కంఠే వ్యాఘ్ర నఖంచ శైశవ కళా కల్యాణ కార్త్స్న్యం భజే ॥ 86

అన్వయము :- శైశవ కళా కల్యాణ కార్త్స్న్యం భజే = శైశవ శిల్పమునందలి కౌశల సర్వస్వమును సేవింతును.

అర్థము :- మధ్యే గోకుల మండలం=గోకుల వలయ మధ్యప్రదేశము నందు ప్రాత=ప్రాతఃకాలము నందు - వఱువాతనే మొదలగునట్టి, దోహ మహోత్సమే=పాలు పిదుకు సంబరము, ప్రతిదిశంచ=ప్రతిదిక్కు నందు, అంభారవోజ్జృంభితే సతి= "అంభా" రవములచేత - ఉజ్జృంభితమగుచుండఁగా, నవఘనశ్యామం=మేఘశ్యామలుని, రణన్నూపురమ్=గిలుకు టందెల వానిని, ఫాలే=నొసటియందు, బాలవిభూషణం=రావియాకు నగ కలవానిని, కటి రటత్ సత్కింకిణీమేఖలం=కటిప్రదేశమునందు మ్రోఁగుచున్న మువ్వల ఒడ్డాణము గలవానిని, కంఠే వ్యాఘ్ర నఖంచ=గళమునందు పులిగోరుపతకము గలవానిని, శైశవకళా - శైశవ=శైశవము యొక్క, కళా=శిల్పరచనా విశేషమునందలి, కల్యాణ=మాంగల్యము యొక్క, కార్త్స్న్యం=సర్వస్వమును, భజే=సేవింతును.

తాత్పర్యము :- గోకుల వలయ మధ్యమునందు మండలాకారముగ నిలిపిన ఆవుల మధ్యలో ప్రాతఃకాలమునందలి గోదోహ మహోత్స వారంభమునందు, నవమేఘ శ్యామలుని గిలుకుటందెలవానిని, నొసటియందలి బాలవిభూషణమైన రావియాకు నగ గలవానిని, కటిసీమయందు గలగలలాడుచున్న మువ్వల యొడ్డాణము గలవానిని,

గళమునందు పులిగోరు పతకము వానిని, శైశవ శిల్పరచనా విశేషమునందలి మాంగల్య సర్వస్వ భూతుఁడైన స్వామిని సేవించెదను.

(**విశేషాంశము :-** ఈ శ్లోకమందలి యర్థము -

"పంచహాయన మీశానం ధావమానం వ్రజాంగణే।
కింకిణీ నూపురగ్రీవా కర్ణభూషోజ్జ్వలం స్మరేత్॥"

- అని గోపాలకృష్ణ సర్వసంపత్కృత్ అష్టాక్షరీ మంత్రధ్యానమని సనత్కుమార సంహితయందుఁ జెప్పబడియున్నది).

శ్లో. ***సజల జలద నీలం దర్శితోఽదార లీలం***
కరతల ధృత శైలం వేణునాదై రసాలమ్।
వ్రజ జన కుల పాలం కామినీ కేళి లోలం
కలిత లలిత మాలం నౌమి గోపాల బాలమ్॥ 87

అన్వయము :- నౌమి గోపాల బాలమ్ = గోపాల బాలుని నుతించుచున్నాను.

అర్థము :- సజల జలద నీలం - సజల=నీటితో నిండిన, జలద=మబ్బువలె, నీలం నీలవర్ణము గలవానిని, దర్శితోదారలీలమ్ - దర్శిత=ప్రదర్శింపఁబడిన, ఉదార=వదాన్యుని యొక్క, లీలం=క్రియగలవానిని, కరతల ధృతశైలం - కరతల=అఱచేతియందు, ధృత=ధరింపఁబడిన, శైలం=గోవర్ధన శైలము గలవానిని, వేణునాదైః=వేణునాదములతో, రసాలం=తియ్య మామిడిచెట్టు వలె నున్నవానిని, వ్రజజన=మందప్రజకు, కుల పాలం=కులస్వామిని, కామినీ కేళి లోలం - కామినీ కామినులతోడి, కేళి= పరిహాసములయందు, లోలం=చంచలుని, కలిత=ధరింపఁబడిన, లలిత=సుకుమారమైన, మాలం=వనమాల గల, గోపాల బాలం=గోపాల బాలుని, నౌమి=నుతింతును.

తాత్పర్యము :- నీటిమబ్బువలె నీలవర్ణుని, ప్రదర్శితమైన ఔదార్యలీలలు గలవానిని, అఱచేత కొండను దాల్చిన వానిని, పిల్లనగ్రోవి నాదములతో తియ్యమామిడి చెట్టువలెనున్న వానిని, మందప్రజలపాలి కులదైవమును కామినీ గోష్ఠియందు పరిహాసలోలుని, లలిత వనమాలను దాల్చిన గోపాల బాలుని నుతించుచున్నాను.

శ్లో. ***స్మిత లలిత కపోలం స్నిగ్ధ సంగీత లోలం***
లలిత చికుర జాలం చౌర్య చాతుర్య లీలమ్।

శతమఖ రిపు కాలం శాతకుంభాభ చేలం
కువలయ దళ నీలం నౌమి గోపాల బాలమ్ ॥ 88

అన్వయము :- నౌమి గోపాల బాలమ్ = గోపాలబాలుని నుతించుచున్నాను.

అర్థము :- స్మిత=నవ్వుతో, లలిత=అందమైన, కపోలం=చెక్కిళ్లు గలవానిని, స్నిగ్ధ సంగీత లోలమ్=స్నిగ్ధ=స్నేహ సంపన్నులయొక్క, సంగీత=సంకీర్తన రూపమైన సంగీతము నందు, లోలం=తృష్ణాళువును, లలిత చికుర జాలమ్=లలితమైన వలవంటి కుంతలములు గలవానిని, చౌర్య చాతుర్య లీలమ్ - చౌర్య=దొంగతనమునందు, చాతుర్య=నేర్పుతో గూడిన, లీలమ్=క్రియగలవానిని, శతమఖ రిపు కాలమ్-శతమఖ రిపు=ఇంద్రశత్రువులైన రాక్షస కులమునకు, కాలం=యముని, శాతకుంభాభ చేలం=బంగారు వన్నె వలిపము గల వానిని, కువలయ దళ నీలం=ఇందీవర దళ నీలవర్ణుని, గోపాల బాలమ్=గొల్లపిల్లవానిని, నౌమి=నుతించుచున్నాను.

తాత్పర్యము :- దరహాస లలితములైన కపోలముల వానిని, స్నేహభరితమైన సంగీతమునందు తృష్ణాళువును, ప్రన్నని (మనోజ్ఞమైన) వలవంటి కుంతలముల వానిని, చౌర్యమునందు చతురలీలలు గలవానిని, రాక్షసకులమునకు కాలస్వరూపుని, స్వర్ణ వర్ణాభిరామమైన దుకూలమువానిని, కువలయదళ శ్యామలుఁడైన గోపాల బాలుని నుతించుచున్నాను.

శ్లో. *మురళి నినద లోలం ముగ్ధ మాయూర చూళం*[9]
దళిత దనుజ జాలం ధన్య సౌజన్య లీలమ్ ।
పరహిత నవహేలం పద్మసద్మానుకూలం
నవ జలధర నీలం నౌమి గోపాల బాలమ్ ॥ 89

అన్వయము :- సౌమి గోపాల బాలమ్ = గోపాల బాలుని నుతింతును.

అర్థము :- మురళి నినద లోలమ్=వేణు నినాదముల యందు ప్రవణుని, ముగ్ధ మాయూర చూళమ్ - ముగ్ధ=సుందరమైన, మాయూర=మయూర బర్హము, చూళం=సిగయందుఁ గలవానిని, దళిత దనుజ జాలం - దళిత=ఛేదింపఁబడిన,

---

9 'చూడం' (పాఠాంతరము)

దనుజ=రాక్షసులయొక్క, జాలం=ఇంద్రజాలములు-మాయలు కలవానిని, ధన్య సౌజన్య లీలం - ధన్య=ధన్యులకు - కృతార్థులకు, సౌజన్య=అకుటిలములయిన, లీలం=క్రియలు గలవానిని, పరహిత నవహేలం - పరహిత=పరహితముచేత, నవ=సుందరములైన, హేలం=విలాసములు గలవానిని, పద్మసద్మానుకూలమ్ - పద్మ సద్మా=పద్మాలయయైన లక్ష్మికి, అనుకూలం=అనుకూల నాయకుఁడైన వానిని, నవ జలధర నీలం=క్రొమ్మొయిలు వలె నల్లనైన నెమ్మేని వానిని, గోపాల బాలం=గోపాలబాలుని, నౌమి=నుతింతును.

తాత్పర్యము :- మురళి నినదములయందు లోలుని, మనోహరమయిన మయూర పింఛమును సిగపై అలవరించికొనిన వానిని, రాక్షసుల మాయలను భేదించిన వానిని, ధన్యులయందు సౌజన్యమును వెలయించు క్రియా కలాపముల వానిని, పరహితముచేత రమ్యములైన హేలలు గలవానిని, పద్మాలయయైన శ్రీమహాలక్ష్మి యందు - అనుకూల నాయకుని - (ఏకాzయత్తుని), నీటి మబ్బువలె నీల వర్ణుఁడైన గోపాల బాలుని నుతింతును.

శ్లో. *సరస గుణ నికాయం సచ్చిదానంద కాయం*
శమిత సకల మాయం సత్యలక్ష్మీ సహాయమ్ ।
శమ దమ సముదాయం శాంత సర్వాంతరాయం
సుహృదయ జన దాయం నౌమి గోపాల రాయమ్ ॥ 90

అన్వయము :- నౌమి గోపాలరాయమ్ = గోపాలరాయుని నుతింతును.

అర్థము :- 'సరస గుణనికాయం' - సరస=రసభరితములైన, గుణ=కల్యాణ గుణములయొక్క, నికాయం=కదంబము కలవానిని, సచ్చిదానంద కాయం= సచ్చిదానందములనెడు స్వరూప లక్షణములుగల, కాయం=దేహము గలవానిని, సత్యలక్ష్మీ సహాయమ్=సత్య సంపన్నులకు - సత్య నిష్ఠులకు, సహాయమ్=తోడైన వానిని, శమిత సకల మాయం - శమిత=శమింపఁజేయఁబడిన, సకల=సకలములైన, మాయం=రాక్షసమాయలును దైవీమాయలును కలవానిని, శమదమ సముదాయం=బహిరంతరింద్రియ నిగ్రహ లక్షణములయొక్క, సముదాయం=సముదాయ స్వరూపుని, శాంత సార్వంతరాయం=సర్వవిఘ్నములను అణఁచువానిని, సుహృదయ జనదాయం=విమల హృదయులకు బాంధవుఁడైనవానిని, గోపాల రాయమ్=గోపాల రాయుని, నౌమి=నుతించుచున్నాను.

శ్లో. **లక్ష్మీ కళత్రం లలితాబ్జ నేత్రం ।**
పూర్ణేందు వక్త్రం పురుహూత మిత్రమ్ ।
కారుణ్య పాత్రం కమనీయ గాత్రం ।
వందే పవిత్రం వసుదేవ పుత్రమ్ ॥ 91

అన్వయము :- వందే పవిత్రం వసుదేవ పుత్రమ్ = పవిత్రుఁడైన వసుదేవ పుత్రుని అభివాదనము చేసెదను.

అర్థము :- లక్ష్మీ కళత్రం=లక్ష్మి కళత్రమైన వానిని, లలితాబ్జ నేత్రం - లలిత=సుందరములైన, అబ్జ=తామరపూవుల వంటి, నేత్రం=కన్నులు కలవానిని, పూర్ణేందువక్త్రం - పూర్ణేందు=పూర్ణిమా చంద్రబింబము వంటి, వక్త్రం=ఆననము గలవానిని, పురుహూత మిత్రమ్=శతమఖ సఖుని, కారుణ్య పాత్రం=కనికరముండు పాత్రమైనవానిని, కమనీయ గాత్రం - కమనీయ=లోభనీయమైన, గాత్రం=నెమ్మేని వానిని, పవిత్రం=పావనుడైన వానిని, వసుదేవ పుత్రమ్=వసుదేవ పుత్రుని, వందే=నమస్కరింతును.

తాత్పర్యము :- లక్ష్మీ కళత్రుని, లలితాబ్జ నేత్రుని, పూర్ణేందు వక్త్రుని, పురుహూత మిత్రుని, కారుణ్య పాత్రుని, కమనీయ గాత్రుని, పవిత్రుఁడైన వసుదేవ పుత్రుని నమస్కరింతును.

శ్లో. **మదమయ మదమయ దురగం ।**
యమునా మవతీర్య వీర్య శాలీయః ।
మమ రతి మమర తిరస్కృతి
శమన పరః స క్రియాత్ కృష్ణః ॥ 92

అన్వయము :- స కృష్ణః మమ రతిం క్రియాత్ - అట్టి కృష్ణుఁడు నాకు ప్రీతిని కలిగించును గాక!

అర్థము :- వీర్యశాలీ=తేజఃశాలియైన, యః=ఎవ్వఁడు, యమునా మవతీర్య= యమునలో దిగి, మదమయం=మదపరీతుఁడయిన, ఉరగమ్= కాళియుని, అదమయత్=మర్దించెనో, 'అమర తిరస్కృతి శమన పరః' - అమర తిరస్కృతి=అమరులకుఁ

గలిగెడు తిరస్కారములను, శమనపరః=శమింపఁజేయుట యందు పూఁటకాఁపైన, సః=అట్టి, కృష్ణః=కృష్ణుడు, మమ=నాకు, రతిం=ప్రీతిని, క్రియాత్=చేయునుగాక!

తాత్పర్యము :- తేజోనిధియైన ఏ కృష్ణుఁడు యమునా హ్రదములో దిగి మదోద్ధతుఁడై యున్న కాళియుని మదమణఁగించెనో అట్టి దేవావమాన శమనైక పరాయణుఁడైన కృష్ణుడు నాకు ప్రియమును చేయును గాక!

శ్లో: **మౌళౌ మాయూర బర్హం మృగమద తిలకం చారు లాలాటపట్టే**
కర్ణ ద్వంద్వేచ తాళీదళ మతిమృదులం మౌక్తికం నాసికాయామ్
హారో మందార మాలా పరిమళ భరితే కౌస్తుభస్యోపకంఠే
పాణౌ వేణుశ్చ యస్య వ్రజ యువతి యుతః పాతు పీతాంబరో నః ॥93

అన్వయము :- వ్రజ యువతి యుతః పాతు పీతాంబరోనః = గోప తరుణీ పరివేష్టితుఁడైన పీతాంబరుఁడు మమ్ము కాపాడునుగాక!

అర్థము :- యస్య=ఏ ప్రభువునకు, మౌళౌ=మౌళితలమునందు, మాయూర బర్హం=మయూర బర్హము, చారు లాలాటపట్టే - చారు=సుందరమైన, లాలాటపట్టే=లలాట ఫలకమునందు, మృగమద తిలకం=కస్తూరీ తిలకమును, కర్ణ ద్వంద్వేచ=వీను దోయియందు, అతిమృదులం=మిక్కిలి మెత్తనైన, తాళీదళం=తాటి మొవ్వ ఆకును, నాసికాయాం=నాసికయందు, మౌక్తికం=ముక్తా ఫలమును, 'మందారమాలా పరిమళ భరితే' - మందార మాలా=మందార మాల యొక్క, పరిమళ భరితే=పరిమళముతో నిండిన, కౌస్తుభస్య=కౌస్తుభ మణియొక్క, ఉపకంఠే=సమీపము నందు, హారః=హారమును, గలవో, అట్టి, వ్రజ యువతి యుతః=గోపికా సమేతుడైన, పీతాంబరః=పీతాంబరుఁడు, నః=మమ్ము, పాతు=రక్షించునుగాక!

తాత్పర్యము :- ఏ స్వామికి మౌళి తలమునందు మయూర బర్హమును, లలాట ఫలకమునందు కస్తూరీ తిలకమును, వీనుదోయియందు అతిసుకుమారమైన తాటి మోవును, నాసికయందు మౌక్తికమును, మందారమాలా పరిమళ భరితమైన కౌస్తు భ ప్రాంతమునందు మణిహారమును, పాణితలమునందు వేణువును - కలవో, అట్టి గోపయువతీ పరివేష్టితుఁడైన పీతాంబరుఁడు మమ్ము కాపాడును గాక!

శ్లో. మురారిణా వారి విహార కాలే ।
మృగేక్షణానాం ముషితాంశుకానామ్ ।
కర ద్వయం వా కచసంహతి ర్వా
ప్రమీలనం వా పరిధాన మాసీత్ ॥ 94

అర్థము :- వారివిహార కాలే=జలకములాడు వేళలో, మురారిణా=మురవైరిచేత, 'ముషితాంశుకానాం' - ముషిత=అపహరింపఁబడిన, అంశుకానాం=చీరలుగల, మృగేక్షణానాం=గోప హరిణేక్షణలకు, కర ద్వయం వా,=కేలుదోయికాని, కచ సంహతి ర్వా=కేశ కలాపముకాని, ప్రమీలనం వా=నేత్రనిమీలనముకాని, పరిధానం=ఆచ్ఛాదనము, ఆసీత్=అయ్యెను.

తాత్పర్యము :- జలక్రీడా సమయములో స్వామి చేత అపహృత వస్త్రలైన గోపికా స్త్రీలకు వారి కేలుగవయో, కేశకలాపమో, నేత్రనిమీలనమో, మఱువుగా నయ్యెను.

శ్లో. యాసాం గోపాంగనానాం లస దసితతర రాలోల లీలా కటాక్షా:
య న్నాసా చారు ముక్తామణి రుచినికర వ్యోమగంగా ప్రవాహే ।
మీనాయంతేఽపి తాసా మతిరభస చలచ్చారు నీలాలకాంతా:
భృంగాయంతే యదంఘ్రిద్వయ సరసిరుహే పాతు పీతాంబరో న: ॥ 95

అన్వయము :- పీతాంబరో న: పాతు = పీతాంబరుఁడు మమ్ము కాపాడును గాక!

అర్థము :- యాసాం గోపాంగనానాం=ఏ గోపికా స్త్రీలయొక్క, లసత్=మెఱయుచున్న, లీలాకటాక్షా:=లీలాప్రసారితములైన వాలుచూపులు, యత్=ఏ స్వామియొక్క, నాసా=నాసాభరణమైన, చారు=సుందరమైన, ముక్తామణి=ముక్తామణియొక్క, రుచి నికర=కాంతి సమూహమే అనెడి, వ్యోమ గంగా ప్రవాహే=ఆకాశ గంగా ప్రవాహము నందు, మీనా యంతే=వాలుగలై పోవుచున్నవో, అపి=మఱియును, తాసాం=ఆ గోపికలయొక్క, అతిరభస చలచ్చారు నీలాలకాంతా: - అతిరభస=అతివేగముగా, చలత్=కదలుచున్న, చారు=రమ్యములైన, నీలాలకాంతా:=నల్లని ముంగురుల కొసలు, యదంఘ్రిద్వయ సరసిరుహే=ఎవ్వని అడుగు గవయను శతపత్రము నందు, భృంగాయంతేచ=తుమ్మెదలుగా నగుచున్న వో, స:=అట్టి, పీతాంబర:=పీతాంబరుఁడు, న:=మమ్ము, పాతు=కాపాడునుగాక!

తాత్పర్యము :- ఏ గోపికా స్త్రీలయొక్క మిల మిల లాడుచున్న మిక్కిలి చంచలములైన లీలాప్రసారితములైన వాలిక క్రేఁగంటి చూడ్కులు, ఏ స్వామియొక్క నాసాభరణము నందు పొదుగఁబడిన స్థూలముక్తా ఫలము యొక్క కాంతి నివహమే యనెడి - ఆకాశ గంగా ప్రవాహము నందు వాలుగుమీలై యీదులాడుచున్నవో, ఆ గోపికల యొక్క మిక్కిలి సంకులముగాఁ గదలుచున్న అతి స్నిగ్ధములైన నీలాలకాంతములు ఏస్వామియొక్క పాద ద్వంద్వమే యనెడి మహోత్పలమునందు కొదమ తుమ్మెదల గుంపులుగా మాఱుచున్న వో, అట్టి పీతాంబరుఁడు మమ్ము కాపాడుచుండునుగాక!

శ్లో. ***యద్వేణు శ్రేణిరూప స్థిత సుషిర ముఖోద్గీర్ణ నాద ప్రభిన్నా:***
ఏణాక్ష్య:, తత్క్షణేన త్రుటిత నిజపతి ప్రేమబంధా బభూవు: ।
అస్తవ్యస్తాలకాంతా: స్ఫుర దధర కుచద్వంద్వ నాభిప్రదేశా:
కామావేశ ప్రకర్ష ప్రకటిత పులకా: పాతు పీతాంబరో న: ॥ 96

అన్వయము :- పాతు పీతాంబరో న: = పీతాంబరుఁడు మమ్ము కాపాడునుగాక!

అర్థము :- యత్=ఏ స్వామియొక్క, వేణు=వేణువుమీఁద, శ్రేణిరూపస్థిత= వరుసగానున్న, సుషిరముఖ=రంధ్రాగ్రములనుండి, ఉద్గీర్ణ=వెలిగ్రక్కఁబడిన, నాద=నాదముచేత, భిన్నా:=వ్రీలిన డెందములు గలవారై, ఏణాక్ష్య:=హరిణాక్షులు, తత్క్షణేన=ఆ క్షణములోనే, త్రుటిత=వ్రీలిన, నిజపతి=తమపతులయందలి, ప్రేమబంధా:=వలపుముడులు గలవారుగా, బభూవు:=అయినారో, 'అస్తవ్యస్తాలకాంతా:' - అస్తవ్యస్త=చెల్లాచెదరైన, అలక=ముంగురులయొక్క, అంతా:=కొనలు గలవారును, స్ఫుర దధర కుచద్వంద్వ నాభిప్రదేశా: - స్ఫురత్=అదరుచున్న, అధర=అధరములు, కుచద్వంద్వ=చనుగవలు, నాభిప్రదేశా:=నాభిప్రదేశములు గలవారును, కామావేశ ప్రకర్ష ప్రకటిత తపులకా: - కామావేశ=మన్మథుని ఆవేశముయొక్క, ప్రకర్ష=అతిశయముచేత, ప్రకటిత=నిగిడిన పులకా:=గగుర్పాటు గలవారుగా నయిరో, న:=అట్టి, పీతాంబర:=పీతాంబరుఁడు, న:=మమ్ము, పాతు=కాచుగాక!

తాత్పర్యము :- ఏ స్వామియొక్క వేణువుమీఁద శ్రేణిరూపముననున్న రంధ్రముఖములనుండి పెల్లుబుకుచున్న నాదముచేత వ్రీలిన డెందములగల హరిణ విలోచనలకు ఆ క్షణమునందే తమ మగలయందలి అనురాగ బంధములు ప్రిదిలి -

చెదరిన ముంగురులతో - అదరిన యెదలతో - జలదరించిన నెమ్మేనులతో, ప్రకటితమైన వైవశ్య స్థితి గలవారుగా పరిణమించిరో - అట్టి పీతాంబరుఁడు మమ్ము కాపాడును గాక!

శ్లో. దేవక్యా జఠరాఽఽకరే సముదితః క్రీతో గవాం పాలినా
నందేనాఽఽనక దుందుభే ర్నిజసుతా పణ్యేన పుణ్యాఽఽత్మనా ।
గోపాలాఽఽవళి ముగ్ధహార తరళో గోపీజనాలంకృతిః
స్థేయా న్నోహృది సంతతం సుమధురః కోఽపీంద్రనీలో మణిః ॥ 97

అన్వయము :- స్థేయా న్నోహృది సంతతం సుమధురః కోఽ పీంద్రనీలోమణిః = అతిసుందరమైన ఒకానొక ఇంద్రనీలమణి మా హృదయందు నిరంతరము నిలుచునుగాక!

అర్థము :- దేవక్యాః=దేవకీదేవి యొక్క, జఠరాఽ కరే=జఠరమే అను గనియందు, సముదితః=ఉదయించినదియును, పుణ్యాఽఽత్మనా=పుణ్యములు చేసికొని పుట్టిన, గవాం పాలినా=గోపాలకుఁడైన, నందేన=నందుఁడనువానిచేత, ఆనక దుందుభేః=వసుదేవుని నుండి, నిజసుతాపణ్యేన - నిజసుతా=తనకూఁతురే అనెడి, పణ్యేన=మూల్యము చేత, క్రీతః=కొనబడిఁనదియును, గోపాలాఽఽవళి ముగ్ధహార తరళః - గోపాలాఽఽవళి=గొల్లల శ్రేణియే అనెడి, ముగ్ధహార=రమ్యహారమునకు; తరళః=నాయకమణియును, గోపీ జనాలంకృతిః=గోపికలందటికిని ఒకేఒక అలంకారభూతమును, సుమధురః=అత్యంత సుదరమైన, కోఽపి=ఒకానొక, ఇంద్రనీలోమణిః=ఇంద్రనీల మనెడి మణి, నః=మాయొక్క హృది=హృదయమందు, సంతతం=నిరంతరము, స్థేయాత్=నిలుచునుగాక!

తాత్పర్యము :- ఆ మణి మొట్టమొదట దేవకీదేవి జఠరమనెడి ఆకరమునందు ఉదయించినది. దానిని అదృష్టవంతుఁడైన నందుఁడను పేరుగల ఒకగొల్లవాఁడు తన బిడ్డను మూల్యముగా నిచ్చి వసుదేవునినుండి కొనుగోలు చేసెను. అది అమాయకులైన గొల్లల వరుసలో హారము మధ్య నాయకమణివలె నిలిచి ధగధగ మెఱయుచుండును. అది గోపికల కెల్లరకును ఏకైకాలంకారము! అత్యంత సుందరమైనది. ఇట్లని చెప్పుటకు అనువుపడనిది. ఆ యింద్రనీలమణి ఎల్లప్రొద్దును మా డెందములో నిలుచునుగాక!

శ్లో. పీఠే పీఠ నిషణ్ణ బాలక గళే తిష్ఠన్ స గోపాలకో
యంత్రాంతః స్థిత దుగ్ధభాండ మపకృ ష్యాచ్ఛాద్య ఘట్టారవమ్ ।

వక్త్రోపాంత కృతాంజలిః కృతశిరః కంపం పిబన్ యః పయః
పాయా దాగత గోపికా నయనయో ర్గండూష ఫూత్కారకృత్ ॥ 98

అన్వయము :- ఆగత గోపికా నయన యోర్గండూష ఫూత్కార కృత్ పాయాత్ = వచ్చిన గోపిక కన్నులపైన పుక్కిలించి యుమిసిన అతఁడు మిమ్మోము గాక!

అర్థము :- పీఠే=పీటపైన - పీఠ నిషణ్ణ బాలక గళే=పీఠముపైన పదిలముగా నిలిచిన బాలుని మెడ మీఁద, తిష్ఠన్=నిలువఁబడుచు, సగోపాలకః=ఆ గొల్లపిల్లవాడు, యంత్రాంతః స్థిత దుగ్ధభాండం - యంత్రాంతఃస్థిత=ఉట్టిలోపలనున్న, దుగ్ధభాండం=పాలకడవను, అపకృష్య=వంచి, ఘంటారవం=గంటగణగణను, ఆచ్ఛాద్య=మూసి - (మ్రోఁగకుండఁజేసి), వక్త్రోపాంత కృతాంజలిః=నోటిదగ్గఱగా దోయిలి పట్టి, కృతశిరః కంపం=తల ఊపికొనుచు, యః=ఏ గొల్లపిల్లవాడు, పయఃపిబన్=పాలుత్రాఁగుచు, ఆగతగోపికానయనయోః=వచ్చిన గొల్లభామ కన్నులలో, గుండూషఫూత్కారకృత్=పుక్కిలించి 'ఉఫ్' అని ఉమియుచున్నాఁడో, సః=ఆ అల్లరివాఁడు, పాయాత్=కాపాడునుగాక!

తాత్పర్యము :- పీటపైన - పీటపై మట్టసముగా గూర్చున్న బాలుని మెడపైన - నిలుపఁబడి, ఆ గొల్లపిల్లవాడు ఉట్టిలోపల నున్న పాలకడవ వంచికొని, గంట మ్రోఁగకుండాఁజేసి, నోటి దగ్గఱగా దోయిలించి కొని, తల యూపుచు పాలుత్రాగుచు, ఇంతలో నచ్చటికి వచ్చిన గొల్లభామ కన్నులలో కాండ్రించి "ఉఫ్" అని ఉమియుచున్న వాఁడు మమ్మోమును గాక!

శ్లో. *యజ్ఞై రీజిమహే ధనం దదిమహే పాత్రేషు నూనం వయం*
వృద్ధాన్ భేజిమహే తప శ్చకృమహే జన్మాంతరే దుశ్చరమ్ ।
యేనాస్మాక మభూ దనన్య సులభా భక్తి ర్భవ ద్వేషిణీ
చాణూర ద్విషి భక్త కల్మష ముషి శ్రేయఃపుషి శ్రీజుషి ॥ 99

అన్వయము :- అనన్య సులభా భక్తిరస్మాకం అభూత్ = అనన్యుడు (పరమాత్మయైన వాసుదేవుఁడు) సులభుఁడగు భక్తి, మాకు అలవడినది. లేక - ఇతరుల కబ్బని భక్తి మాకబ్బినది.

అర్థము :- (తేన=ఆ కారణముచేత), జన్మాంతరే=పూర్వజన్మమునందు, వయం=మేము, యజ్ఞైః=యజ్ఞములతో, ఈజిమహే=యజించియుంటిమి, ధనం=ధనమును,

పాత్రేషు - సత్పాత్రములయందు, దదిమహే=దానము చేసి యుంటిమి, నూనం=నిశ్చయము, వృద్ధాన్=పెద్దలను, భేజిమహే=భజించియుంటిమి, దుశ్చరం=చరింపనలవికాని, తపః=తపస్సును, చకృమహే=ఆచరించియుంటిమి; యేన=ఏహేతువుచేత, అస్మాకం=మాకు, అనన్య సులభా భక్తిః=అనన్యుడు - పరమాత్మయగు శ్రీవాసుదేవుఁడు ఏవిధమైన భక్తిచేత సులభుఁడగునో - ఆవిధమైన భక్తి - అనన్య సులభమైన భక్తి ; లేక - అనన్య సుల భముకాని - ఇతరులకు లభ్యముకాని భక్తి, అది - భవద్వేషిణీ=సంసారమును ఏవగించు కొనునట్టిది. అట్టి భక్తి - చాణూర ద్విషి=చాణూరుఁడను ఆంధ్రదేశపు మల్లుని విఱిచిన వాఁడును, భక్త కల్మష ముషి=భక్తుల పాపములను అపహరించు వాఁడును, శ్రేయఃపుషి=శ్రేయస్సులను పోషించువాడును - అయిన - శ్రీజుషి= శ్రీ నిలయునియందు, అభూత్=ఉండియుండెనో, తేన=అందుచేత, యజ్ఞైరీజిమహే - ఇత్యాది.

తాత్పర్యము :- అనన్యుఁడు - జీవుని వీడియుండని వాఁడు - అట్టి పరమాత్మ యైన శ్రీవాసుదేవుఁడు - ఏ విధమైన భక్తిచేత సులభుఁడగునో, అట్టి భక్తి అనన్యసులభమైన భక్తి (బహుప్రీహి); ఈ అర్థమురుచించని వారికి - ఇతరులకు సులభముకాని, భవద్వేషిణి యైన - సంసారమును ఏవగించికొను లక్షణముకల - భక్తి; చాణూరుని మల్లయుద్ధములో విఱిచిన, భక్తుల పాపములను చెఱచిన, శ్రేయస్సులను వృద్ధిపఱిచిన, శ్రీనిలయుని యందు - ఆజానజముగా - మాకీ జన్మములో అలపడియున్నందున - నిశ్చయముగా - మేము పూర్వ జన్మమునందు యజ్ఞములతో యజించి యున్నాము. సత్పాత్రములయందు ధనములను దానము చేసియున్నాము. పెద్దలను సేవించియున్నాము. చేయనలవికాని తపస్సులను జేసియున్నాము.

శ్లో. *త్వయి ప్రసన్నే మమ కిం గుణేన?*
త్వయ్యప్రసన్నే మమ కిం గుణేన? ।
రక్తే విరక్తేచ వరే వధూనాం
నిరర్థకః కుంకుమ పత్ర భంగః [10] ॥ *100*

---

10 ఈ శ్లోకమునకు క్రింది పాఠాంతరమున్నది:- "
త్వయి ప్రసన్నేమయి కిం గుణేన, త్వయ్యప్రసన్నేమయి కిం గుణేన ।
రక్తే విరక్తే దయితేఽంగనానాం, వృథా భవేత్కుంకుమ పత్రభంగః" ॥

అన్వయము :- వధూనాం నిరర్థక: కుంకుమ పత్రభంగ: = జవరాండ్రకు కుంకుమద్రవ విరిచితమైన మకరీ పత్రరచన నిరర్థకము.

అర్థము :- త్వయి=నీవు, ప్రసన్నే సతి=ప్రసన్నుఁడవైయుండగా, గుణేన= దుర్గుణముతో, మమ=నాకు, కిమ్=ఏమిప్రయోజనం?, త్వయి=నీవు, అప్రసన్నే సతి=అప్రసన్నుడవైయున్నప్పుడు మమ=నాయొక్క, గుణేన=సద్గుణముతో, కిమ్=ఏమి ప్రయోనము?, వధూనాం=జవరాండ్రయొక్క, కుంకుమ పత్ర భంగ:=కుంకుమ ద్రవ విరచితమైన, పత్ర భంగ:=మకరికా పత్ర రచనాశిల్పము, వరే=నాథుఁడు, రక్తే=అనురక్తుఁడై యున్నను, విరక్తేచ=అపరక్తుఁడై యున్నప్పుడు కూడ, నిరర్థక:=నిష్ప్రయోజనము.

తాత్పర్యము :- నీవు ప్రసన్నుడఁవైయున్నప్పుడు నా దుర్గుణముల పరిగణనము నిష్ప్రయోజనము. నీవు అప్రసన్నుఁడవే అయిన పక్షములో నా సద్గుణము లెన్నియున్నను - అవి అన్నియును నిష్ప్రయోజనములే. నాథుడు - అనురాగ భరితుఁడైయున్నచో - తరుణీజనమునకు మకరికాపత్రాది శృంగార ప్రసాధన శిల్ప విరచనము నిష్ప్రయోజనము. విరక్తుడైనచో గూడ అది నిరర్థకమని వేఱుగా జెప్పనవసరము లేదు.

శ్లో. ***గాయంతి క్షణదావసాన సమయే సానంద మిందు ప్రభా:***
రుంధంత్యో నిజ దంత కాంతి నివహై ర్గోపాంగనా గోకులే ।
మథ్నంత్యో దధి పాణి కంకణ ఝణత్కారానుకారం జవాత్
వ్యావల్గ ద్వసనాంచలా య మనిశం పీతాంబరోఽవ్యాత్ స న: ॥ 101

అన్వయము :- స పీతాంబర: న: అన్యాత్ అనిశమ్ = అట్టి పీతాంబరుఁడు మమ్మెల్లప్పుడును కాపాడుచుండునుగాక!

అర్థము :- గోకులే=మందలోపల, గోపాంగనా:=వ్రేఁతలు, నిజదంత కాంతి నివహై: - నిజ=తమయొక్క, దంత=పలు వరుసల యొక్క - దంత శ్రేణుల యొక్క, కాంతి నివహై:=వెలుఁగుల మొత్తములతో, ఇందుప్రభా:=(కడరేయి) వెన్నెలలను, రుంధంత్య:=వెను వెనుకకు నెట్టుచు, పాణి కంకణ ఝణాత్కారానుకారం - పాణి కంకణ=కేలి కడియముల యొక్క, ఝణత్కార=ఝణం ఝణలను, అనుకారం=అనుకరించు రీతిగా, దధి=పెరుగును, జవాత్=వడివడిగా, మథ్నంత్య:=త్రచ్చుచున్నవారై, వ్యావల్గత్= తూఁగాడుచున్న, వసనాంచలా:=చీరల చెఱఁగులు కలవారై, క్షణదా=రాత్రియొక్క, అవసాన

సమయే=తెల్లవాఱు వేళయందు, అనిశం=ఎప్పుడును, యం=ఎవ్వనిని గుఱించి, స+ఆనందమ్=ఆనందముతోడ, గాయంతి=పాడుచుందురో, సః=ఆ తీఱైన, పీతాంబరః=పీతాంబరుఁడు, నః=మమ్ము, అవ్యాత్=రక్షించుచునుగాక!

తాత్పర్యము :- మందలోని వ్రేఁతలు తెల్లవాఱుకడలలో కడరేయి వెన్నెలలను దమ పలువరుసల వెలుఁగులతో వెనువెనుకకు నెట్టుచు కేలి కడియముల ఝణం ఝణలకు అనురణనముగా వడివడిని పెరుగు కుండలను కవ్వములతోఁ ద్రచ్చుచుఁ జీరచుంగులు తూగాడుచుండగా ఎప్పుడును ఎవ్వని గుణగణములను ఆనందముతో గానము చేయుచుందురో, ఆ రీతైన పీతాంబరుఁడు మమ్ము రక్షించునుగాక!

శ్లో. ***అంసాఽలంబిత వామకుండల భరం మందోన్నత భ్రూలతం***
కించిత్ కుంచిత కోమలాధర పుటం సాచిప్రసారేక్షణమ్ ।
ఆలోలాంగుళి పల్లవై ర్మురళికా మాపూరయంతం ముదా
మూలే కల్పతరో స్త్రి భంగి లలితం జానే [11]జగన్మోహనమ్ ॥ 102

అన్వయము :- జానే జగన్మోహనమ్ = జగన్మోహనుని తెలియుచున్నాను.

అర్థము :- అంసాఽలంబిత=మూఁపుపైన వ్రాలించిన, వామకుండల=డాపలి కుండలముయొుక్క, భరం=వ్రేఁగు గలవానిని, మందోన్నత=ఇంచుక నిక్కిన, భ్రూలతమ్=కనుబొమతీఁగెవానిని, కించిత్ కుంచిత=ఇంచుక ముడువఁబడిన, కోమలా ధర=మెత్తని మోవియొుక్క, పుటం=సంపుటము గలవానిని, సాచిప్రసార=ప్రక్కలకు వ్రాలుచున్న, ఈక్షణం=చూపులు గలవానిని, ఆలోల=మిక్కిలి కదలుచున్న, అంగుళి పల్లవైః=తలిరాకులవంటి వ్రేళ్లతో, ముదా=ఉబ్బుతో, మురళికాం=మురళికను, ఆపూరయంతం=మధుర నాదముతో నింపుచున్నవానిని, కల్పతరోర్మూలే=మందార మూలమునందు, త్రిభంగి లలితం=ముువ్వంక మురువుతో నున్న, జగన్మోహనమ్ =జగములను మోహింపఁజేయువానినిన, జానే=తెలియుచున్నాను (ధ్యానించి తెలిసికొనుచున్నాను).

తాత్పర్యము :- మూఁపున మోపఁబడిన డాపలి కుండలపు వ్రేఁగు కలవానిని, ఇంచుక నిక్కిన తీఁగవంటి కనుబొమవానిని, కొంచెము ముడువబడిన మెత్తని మోవి

---

11 'వందే' (పాఠాంతరము)=నమస్కరించుచున్నాను.

సంపుటము వానిని, క్రేవలకు వ్రాలుచున్న చూపులవానిని, కదలుచున్న తలిరుల వంటి వ్రేళ్లతో - మధుర నాదములతో - ఉబ్బుతో - మురళికను మ్రోయించుచున్నవానిని, మందార మూలము నందు ముప్పంక మురువుతో నిలిచిన వానిని, జగములను మోహింపఁ జేయు వానిని ధ్యానించి తెలిసికొనుచున్నాను.

(**విశేషము** :- త్రిభంగి=మూడు వంపులు - పాదములు మొదలు కటివఱకును ఒక వంపు; కటిమొదలు మెడవఱకును ఒకవంపు; తల ఒక వంపు - ఇట్లు మూఁడు వంపులు తెలియునది).

శ్లో. *మల్లైః శైలేంద్రకల్పః శిశు రితరజనైః పుష్పచాపోఽంగనాభిః*
గోపైస్తు ప్రాకృతాఽత్మా దివి కులిశభృతా విశ్వకాయోఽప్రమేయః।
క్రుద్ధః కంసేన కాలో భయచకిత దృశా, యోగిభి ర్ధ్యేయమూర్తిః
దృష్టో రంగావతారే హరి రమర గణానందకృత్ పాతు యుష్మాన్ ॥ 103

అన్వయము :- హరిః పాతుయుష్మాన్ = శ్రీహరి మిమ్ము రక్షించునుగాక!

అర్థము :- మల్లైః=జెట్టీలచేత, శైలేంద్ర కల్పః=మహాపర్వతము వలెను, ఇతర జనైః=ఇతరుల చేత, శిశుః=శిశువువలెను, అంగనాభిః=అంగనలచేత, పుష్ప చాపః=పుష్ప శరాసనునివలెను, గోపైస్తు=(వ్రేపల్లెనుండి తనతో వచ్చిన) గొల్లలచేత మాత్రము, ప్రాకృతాఽత్మా=తమవంటి పాకృతుని వలెను - తమలోని వాఁడుగాను, దివి=ఆకాశమునందు, కులిశభృతా=వజ్రపాణిచేత - ఇంద్రుని చేత, అప్రమేయః=మేరలిడరాని, విశ్వకాయః= విశ్వస్వరూపుఁడుగాను, భయచకిత దృశా=వెఱచఱచిన చూపులుగల, కంసేన=కంసుని చేత, క్రుద్ధః=క్రోధపరీతుఁడైన, కాలః=కృతాంతుని వలెను, యోగిభిః=యోగుల చేత, ధ్యేయమూర్తిః=ధ్యేయాకారముగను, యః=ఏ యొక్కఁడు, రంగావతారే=రంగస్థలమునకు అవతరించువేళలో, దృష్టః=కానఁబడెనో; (అట్టి) అమరగణానందకృత్=అమరగణములకు ఆనందకరుఁడైన, హరిః=శ్రీహరి, యుష్మాన్=మిమ్ము, పాతు=రక్షించునుగాక!

తాత్పర్యము :- జెట్టీలకు పెద్దకొండ వలెను, ఇతరులకు శిశువు వలెను, అంగనలకు పుష్పశరాసనుని వలెను, ఆకాశములో ఇంద్రునకు మేరలిడరాని విశ్వస్వరూపుని వలెను, వెఱచఱచిన చూపులు గల కంసునికి క్రుద్ధ కృతాంతుని వలెను, యోగులకు ధ్యేయా కారముగను, రంగమునకు అవతరించిన వేళలో - ఏయొక్కఁడు కానఁబడెనో, అట్టి -

అమరగణానందకరుఁడైన శ్రీహరి మిమ్ములను కాపాడునుగాక!

శ్లో. సంవిష్టో మణివిష్టరే ఽంకతల మధ్యాసీన లక్ష్మీ ముఖే
కస్తూరీ తిలకం ముదా విరచయన్ హర్షాత్ కుచౌ సంస్పృశన్ ।
అన్యోన్య స్మితచంద్రికా కిసలయై రారాధయన్ మన్మథం
గోపీ గోప పరీవృతో యదుపతిః పాయా జ్జగన్మోహనః ॥ 104

అన్వయము :- జగన్మోహనో యదుపతిః పాయత్ = జగన్మోహనుఁడైన యదుపతి రక్షించునుగాక!

అర్థము :- మణివిష్టరే=మణిపీఠమునందు, సంవిష్టః=ఉపవిష్టుఁడై - (కూర్చుండియుండి), అంకతలం=ఒడిని, అధ్యాసీన=అధిష్ఠించియున్న, లక్ష్మీముఖే=లక్ష్మీదేవి యొక్క ఆననమునందు, ముదా=మోదముతో, కస్తూరీ తిలకమ్= కస్తూరీతో బొట్టును, విరయన్= తీర్చిదిద్దుచు, హర్షాత్=ప్రహర్షమువలన, కుచౌ=స్తనములను, సంస్పృశన్=సంస్పర్శనము చేయుచు, అన్యోన్య=ఒండొరుల యొక్క, స్మిత=స్మితములే అనెడి, చంద్రికా కిసలయైః=వెన్నెల చివుళ్లతో, మన్మధమ్=కామదేవుని, ఆరాధయన్=ఆరాధించుచు, గోపీ గోప పరీవృతః=గోపికలచేతను, గోపకులచేతను, పరీవృతః=పరివారింపఁబడిన, జగన్మోహనః=జగన్మోహనుఁడైన, యదుపతిః=యదుపతి, పాయాత్=రక్షించునుగాక!

తాత్పర్యము :- తాను మణిపీఠమునందు - ఉపవిష్టుఁడై యుండి, తన యంకతలముపై అధివసించియున్న లక్ష్మీ దేవి నెమ్మొగమునందు కస్తూరితో తిలకమును సమ్మోదముతో తీర్చిదిద్దుచు - హర్షాతిశయమువలన స్తనములను సంస్పర్శించుచు, ఒకరొకరి స్మితములే యనెడి వెన్నెల చివుళ్లతో కామదేవుని ఆరాధించుచు, గోపికలచేత - గోపకులచేత పరివారింపఁబడిన జగన్మోహనుఁడైన యదుపతి రక్షించునుగాక!

శ్లో. ఆకృష్టే వసనాంచలే కువలయ శ్యామా త్రపాఽధఃకృతా
దృష్టిః సంవలితా రుచా కుచయుగే స్వర్ణప్రభే శ్రీమతి ।
బాలః కశ్చన చూతపల్లవ ఇతి ప్రాంత స్మితాస్యశ్రియం
శ్లిష్యం స్తా మథ రుక్మిణీం నతముఖీం కృష్ణః సపుష్ణాతు నః ॥ 105

అన్వయము :- కృష్ణః స పుష్ణాతు నః = ఆ విధమైన కృష్ణుఁడు మాకు పుష్టిని కలిగించునుగాక!

అర్థము :- వసనాంచలే=చీరచెరఁగు, ఆకృష్టేసతి=లాగఁబడఁగా కువలయశ్యామా= ఇందీవరశ్యామమై, త్రపాధఃకృతా=సిగ్గుచేత క్రిందుపఱువఁబడిన, దృష్టిః=చూపు, స్వర్ణప్రభే=బంగరు కాంతిగల, శ్రీమతి=సమృద్ధిమంతమైన, కుచయుగే=చనుదోయి యందు, రుచా=కాంతిచేత, సంవలితా=పెనగొనఁబడినదై, కశ్చన=కొండొక, బాలఃచూతపల్లవః= లేఁతమామిడి చిగురు, ఇతి=అని, ప్రాప్తస్మిత=నవ్వుదయించిన, ఆస్యశ్రియం=నెమ్మోము సిరిగల, తాం=అట్టి, నతముఖీం=వంచిన మోముగల, రుక్మిణీం=రుక్మిణిని, అథ=పిమ్మట, శ్లిష్యన్=కౌఁగిలించుచున్న, స కృష్ణః=అట్టి కృష్ణుడు, నః=మమ్ములను, పుష్ణాతు= పోషించునుగాక!

తాత్పర్యము :- చీరచెఱఁగు పట్టి లాగినంతనే ఇందీవరశ్యామలమై - సిగ్గు పైకొన్న చూడ్కి, సమృద్ధిమంతమై (పరిపుష్టమై) బంగరు కాంతులను చిమ్ముచున్న చనుదోయి యందు - ఆ కాంతులతో సంవలితము కాగా - కొండొక లేఁతమామిడి చిగురని - నవ్వు గదిరిన నెమ్మోము సిరి గలిగి - నతముఖియైన రుక్మిణిని - అంతట కౌగిలించుకొనుచున్న శ్రీకృష్ణస్వామి మమ్ము పోషించునుగాక!

శ్లో. *ఉర్వ్యాం కోఽపి మహీధరో లఘుతరో దోర్భ్యాం ధృతో లీలయా*
తేన త్వం దివి భూతలేచ సతతం గోవర్ధనోద్ధారకః ।
త్వాం త్రైలోక్యధరం వహామి కుచయో రగ్రే న త ద్గణ్యతే
కిం వా? కేశవ! భాషణేన బహునా పుణ్యై ర్యశో లభ్యతే ॥ 106

అన్వయము :- కింవా బహునా భాషణేన కేశవ! పుణ్యైర్యశో లభ్యతే = పలుమాటలతో ఏమిపని? కృష్ణా! పుణ్యము చేసి పుట్టినచో పేరు ప్రతిష్ఠలవియే కలుగుచుండును.

అర్థము :- ఉర్వ్యాం=భూమియందు, లఘుతరః=మిక్కిలి తేలికయైన, కోఽపి= అనామకమైన, మహీధరః=కొండ, దోర్భ్యాం=రెండుచేతులలతో, ధృతః=ధరింపఁబడినది, తేన=అందుచేత, త్వం=నీవు, దివి=స్వర్గమునందు, భూతలేచ=భూతలమునందును, సతతం=ఓరంతప్రొద్దును, గోవర్ధనోద్ధారకః=గోవర్ధనోద్ధారకుఁడవు!, త్రైలోక్యధరం=

ముల్లోకమును ధరించిన, త్వాం=నిన్ను, కుచయోరగ్రే=స్తనములపైన, వహామి=మోయు చున్నాను, తత్=ఆ విషయము, నగణ్యతే=పరిగణింపఁబడుటలేదు, కేశవ=కృష్ణా!, కింవా బహునా భాషణేన?=బహుభాషణముతో ఏమి ప్రయోజనము?, యశః=కీర్తి, పుణ్యైః=పూర్వజన్మపుణ్యముల చేత, లభ్యతే=కాంచఁబడుచున్నది.

తాత్పర్యము :- ఈ పుడమిపై అతి తేలికయైన అనామకమైన ఒక కొండను రెండుచేతులతో ధరించినందుకు నీవు మిన్ను మన్నులలో ఏ ప్రొద్దును గోవర్ధనోద్ధారకుడవు! ముజ్జగమును దాల్చిన నిన్ను స్తనాగ్రములపై మోయుచున్నాను! అది లెక్కకు వచ్చుట లేదు. కృష్ణా! పలుమాటలతో ఏమిపని? పూర్మజన్మ పుణ్యములే పేరు ప్రతిష్ఠలకు మూలము.

శ్లో. ***సంధ్యావందన! భద్రమస్తు భవతే, భోఃస్నాన! తుభ్యంనమో***
భోదేవాః! పితరశ్చ! తర్పణవిధౌ నాహం క్షమః క్షమ్యతామ్ ।
యత్రక్వాపి నిషీద్య యాదవకులోత్తంసస్య కంసద్విషః
స్మారం స్మార మఘం హరామి త దలం మన్యే కి మన్యేన? మే ॥ 107

అన్వయము :- తదలం మన్యే కిమన్యేన మే? = అది చాలునని తలంతును, వేఱొక దానితో నాకేమి?

అర్థము :- సంధ్యావందన!=ఓసి సంధ్యావందనమా!, భద్రమస్తు భవతే=నీకు మేలగును గాక!, భోఃస్నాన=ఓసి స్నానమా! తుభ్యంనమః=నీకు నమస్కారము!, భోదేవాః పితరశ్చ=ఓదేవతలారా! పితృదేవతలారా!, తర్పణవిధౌ=తర్పణవిధి యందు, నాహం క్షమః=నేను చాలిన వాఁడను కాను, క్షమ్యతామ్=క్షమింపఁబడును గాక!, యత్రక్వాపి నిషీద్య=ఎచ్చటనో ఒక చోట కూర్చుండి, యాదవకులోత్తంసస్య=యదుకులోత్తంసుఁడైన, కంసద్విషః=కంసవైరిని, స్మారం స్మారం=తలఁచి తలఁచి, అఘం=పాపమును, హరామి=నశింపఁజేసికొందును,తత్=అది,అలంమన్యే=చాలునని తలంచి కొందును, కిమన్యేనమే=ఇతరముతో నాకేమి?

తాత్పర్యము :- ఓ సంధ్యావందనమా! నీకు మేలగునుగాక! ఓసి స్నానమా! నీకొక నమస్కారము! ఓ దేవపితృగణములారా! తర్పణవిధికి నేను చాలను, క్షంతవ్యుఁడను. ఎచ్చటనో కూర్చుండి యదుకులోత్తంసుఁడైన కంసవైరిని తలఁచి తలఁచి పాపమును క్షయించికొందును. అది చాలునని తలంతును. నాకింకొక దానితో నేమి పని?

శ్లో. *హే గోపాలక! హే కృపాజలనిధే! హే సింధుకన్యాపతే!*
హే కంసాంతక! హే గజేంద్ర కరుణా పారీణ! హే మాధవ! ।
హే రామనుజ! హే జగత్త్రయ గురో! హే పుండరీకాక్ష! మాం
హే గోపీజననాథ! పాలయ పరం జానామి న త్వాం వినా ॥ 108

అన్వయము :- హే గోపీజననాథ! పాలయ పరం జానామి న త్వాం వినా =ఓ గోపికా వల్లభా! పాలింపుము! నిన్నుకాక వేఱొకనిని ఎఱుఁగను.

అర్థము :- హే గోపాలక!=నోరులేని ఆలను పాలించువాఁడా! హే కృపా జలనిధే!= ఓ కృపా జలరాశీ!, హే సింధుకన్యాపతే=ఓ సాగరకన్యకాపతీ!, హే కంసాంతక!=ఓ కంసాంత కుఁడా!, హే గజేంద్ర కరుణా పారీణ!=ఓ గజేంద్ర కరుణా పారీణుడా!, హే మాధవ!=ఓ మాధవా!, హే రామానుజ!=ఓ బలరాముని తమ్ముగుజ్జా!, హే జగత్త్రయగురో!=ఓ త్రిభువనగురూ!, హే పుండరీకాక్ష!=ఓ పుండరీకాక్షుడా!, మాం=నన్ను, హే గోపీజననాథః=ఓ గోపికాజన వల్లభుఁడా!, పాలయ!=పాలింపుము!, త్వాం వినా=నిన్ను వినా, పరం న జానామి=వేఱెఱుఁగను.

తాత్పర్యము :- ఓ గోపాలకా! ఓ కృపాజలనిధీ! ఓ సింధుకన్యాపతీ! ఓకంసాంతకా! ఓ గజేంద్ర కరుణా పారీణుఁడా! ఓ మాధవా! ఓ బలరాముని తమ్ముఁడా! ఓజగత్త్రయగురూ! ఓ పుండరీకాక్షుఁడా! ఓ గోపికాజనవల్లభా! నన్ను పాలింపుము! నిన్ను కాక వేఱెఱుఁగను.

శ్లో. ***కస్తూరీ తిలకం లలాట ఫలకే, వక్షఃస్థలే కౌస్తుభం,***
నాసాగ్రే నవమౌక్తికం, కరతలే వేణుం, కరే కంకణమ్, ।
సర్వాంగే హరిచందనం చ, కలయన్, కంఠేచ ముక్తావళిం,
గోప స్త్రీ పరివేష్టితో, విజయతే గోపాలచూడామణిః ॥ 109

అన్వయము :- గోపస్త్రీ పరివేష్టితః గోపాలచూడామణిః విజయతే = గోపికాస్త్రీలచేత పరివేష్టింపఁబడిన గోపాలచూడామణి సర్వాతిశాయియై ఒప్పారుచున్నాఁడు!

అర్థము :- లలాట ఫలకే=ఫాలఫలకమునందు, కస్తూరీ తిలకమ్=కస్తూరితో తీర్చిదిద్దిన తిలకమును, వక్షఃస్థలే=వక్షఃస్థలమునందు, కౌస్తుభం=కౌస్తుభమణిని, నాసాగ్రే=ముక్కుకొనయందు, నవమౌక్తికం=క్రొత్త ముత్తియమును, కరతలే=అఱచేతిలో, వేణుం=పిల్లనగ్రోవిని, కరే=చేతియందు, కంకణమ్=కంకణమును,

సర్వాంగే=సర్వదేహమునందు, హరిచందనంచ=హరిచందనమును, కంఠే=గళసీమయందు, ముక్తావళిమ్=ముత్యాలపేరును, కలయన్=అందగింపఁజేయుచు, గోపస్త్రీ పరివేష్టితః=గోపికాస్త్రీల చేత చుట్టు వాఱఁబడిన, గోపాలచూడామణిః=గోపాలచూడామణి, విజయతే=అందఱికంటె అధికుఁడై యున్నాఁడు!

తాత్పర్యము :- లలాటపట్టికయందు కస్తూరీ తిలకమును, వక్షఃస్థలమునందు కౌస్తుభమణిని, నాసాగ్రమునందు నవమౌక్తికమును, అఱచేత వేణువును, కరమునందు కంకణమును, సర్వాంగమునందు హరిచందనపు మైపూఁతయును, గళసీమయందు ముత్యాలపేరును, తాను దాల్చుట చేత వానికి ఒక వినూత్న శోభను గలిగించుచు, గోపికా జన పరివేష్టితుఁడై గోపాలచూడామణి యెల్లరికంటె అధికుఁడై ప్రకాశించుచున్నాఁడు!

శ్లో. ***లోకా మున్మదయన్ శ్రుతీ ర్ముఖరయన్ క్షోణీరుహాన్ హర్షయన్***
శైలాన్ విద్రవయన్ మృగాన్ వివశయన్ గోబృంద మానందయన్ ।
గోపాన్ సంభ్రమయన్ మునీన్ ముకుళయన్ సప్తస్వరాన్ జృంభయన్
ఓంకారార్థ ముదీరయన్ విజయతే వంశీనినాదః శిశోః ॥ 110

అన్వయము :- ఓంకారార్థ ముదీరయన్ విజయతే వంశీనినాదః శిశోః = ప్రణవార్థమును ఉగ్గడించుచు శిశువు పిల్లనగ్రోవి నినాదము సర్వాతిశాయియై వెలుఁగొందుచున్నది.

అర్థము :- శిశోః=శిశువుయొక్క, వంశీ నినాదః=పిల్లనగ్రోవియొక్క నాదము, లోకాన్=భువనములను, ఉన్మదయన్=దివ్యోన్మాదము పూనిన వానినిగాఁ జేయుచు, శ్రుతీః=వేదములను, ముఖరయన్=ప్రతిశబ్దాయమానములనుగాఁ జేయుచు, క్షోణీ రుహాన్=భూమీరుహములను, హర్షయన్=హర్షపులకితములనుగాఁ జేయుచు, శైలాన్=కొండలను, విద్రవయన్=విశేషముగా కరఁగిపోవునట్లు చేయుచు, మృగాన్=లేళ్లను, వివశయన్=పరవశీభూతములను జేయుచు, గోబృందం=గోకదంబమును, ఆనందయన్= ఆనందింపఁజేయుచు, గోపాన్=గొల్లలను, సంభ్రమయన్=సంభ్రమింపఁజేయుచు, మునీన్=మునులను, ముకుళయన్=సమాధి, విలీనులనుగాఁజేయుచు, సప్తస్వరాన్=సప్త సాములను - సప్తస్వరములను, జృంభయన్=జృంభింపఁజేయుచు, ఓంకారార్థం= ప్రణవార్థమును, ఉదీరయన్=బిగ్గఱగా వెలువరించుచు, విజయతే=సర్వాతిశాయియై సర్వోన్నతమై సర్వాంతర్లీనమై వెలుఁగొందు చున్నది.

తాత్పర్యము :- యశోదా శిశువు యొక్క వంశీనినాదము లోకములను దివ్యోన్మాదాఽవిష్టములనుగాఁజేయుచు, శ్రుతిశిఖరములయందు ప్రతిశబ్దాయమానమగుచు, క్షోణీరుహములను ప్రహర్షపులకితములనుగాఁ జేయుచు, శైలములను నవనీత పిండములనువలె నిశ్శేషముగ ద్రవింపఁజేయుచు, మృగకులమును పరవశీభూతమొనరించుచు, గోబృందమును ఆనందింపఁజేయుచు, మంద ప్రజలను సంభ్రాంతులనుగాఁజేయుచు, మునిజనములను సమాధి లీనస్థితి నొందించుచు, సప్తస్వరములను జృంభింపఁజేయుచు, ఓంకారార్థమును ఉద్గీథమొనరించుచు, సర్వాతిశాయియై, సర్వోన్నతమై, సర్వాంతర్లీనమై, వెలుఁగొందుచున్నది.

శ్లో. *యస్యాఽత్మభూతస్య గురోః ప్రసాదాత్*
అహం విముక్తోఽస్మి శరీర బంధాత్ ।
సర్వోపదేష్టుః పురుషోత్తమస్య
తస్యాంఘ్రి పద్మం ప్రణతోఽస్మి నిత్యమ్ [12] ॥ 111

అన్వయము :- పురుషోత్తమస్య అంఘ్రిపద్మం నిత్యం ప్రణతోఽస్మి = పురుషోత్తముని అంఘ్రిపద్మమును నిత్యమును ప్రణమిల్లినవాఁడ నయ్యెదను.

అర్థము :- ఆత్మభూతస్య=ఆత్మభూతుఁడైన, యస్య=ఏ, గురోః=గురునియొక్క, ప్రసాదాత్=అనుగ్రహము వలన, అహం=నేను, శరీర బంధాత్=శరీరమే అనెడి బంధమునుండి, విముక్తః=విడివడిన వాఁడను, అస్మి=అయినాఁడనో, తస్య=ఆవిధమైన, సర్వోపదేష్టుః=సర్వోప దేష్టయైన - సర్వమును బ్రహ్మమునుగా ఉపదేశించ, గురోః=గురుస్వరూపుఁడైన, పురుషోత్తమస్య=పురుషోత్తమునియొక్క, అంఘ్రిపద్మమ్=పాదపద్మమును, నిత్యం=ఎల్లప్పుడును, ప్రణతః=ప్రణమిల్లినవాఁడను, అస్మి=అయినాఁడను.

తాత్పర్యము :- పరామాత్మభూతుఁడైన - ఏగురుని అనుగ్రహమువల్ల నేను - ఈ శరీరమే అనెడి బంధమునుండి విడివడితినో, అట్టి సర్వోపదేష్టయైన - సర్వము బ్రహ్మమని ఉపదేశించిన పురుషోత్తమునియొక్క పాదపద్మమును నిత్యము ప్రణమిల్లినవాఁడను అయితిని.

ఇతి శ్రీలీలాశుక విరచితే శ్రీకృష్ణ కర్ణామృతే
ద్వితీయ శతకం సమాప్తమ్.
శ్రీ లీలాశుకుఁడు రచించిన శ్రీకృష్ణ కర్ణామృతమందు
ద్వితీయ శతకము సమాప్తము.

---

12 ' ఈ శ్లోకము ఒకానొక ప్రతియందే చూపట్టుచున్నది'

శ్రీరస్తు
శ్రీకృష్ణ పరబ్రహ్మణే నమః

శ్రీకృష్ణకర్ణామృతము

తెలుఁగు టీకాతాత్పర్య సహితము

తృతీయాశ్వాసము

శ్లో. అస్తి స్వస్త్యయనం సమస్తజగతా మభ్యస్త లక్ష్మీ స్తనం
వస్తు ధ్వస్త రజస్తమోభి రనిశం న్యస్తం పురస్తా దివ ।
హస్తోదస్త గిరీంద్ర మస్తక తరుప్రస్తార విస్తారిత
స్రస్త స్వస్తరు సూన సంస్తర లస త్ర్పాస్తావి [1] రాధాస్తుతమ్ ॥ 1

అన్వయము:- రాధాస్తుతం వస్తు అస్తి = శ్రీ రాధాదేవిచేత ప్రస్తుతింపఁబడిన ఒకానొక వస్తువు కలదు.

అర్థము:- సమస్త జగతాం=సకల భువనములకును, స్వస్త్యయనమ్-స్వస్తి=శుభమునకు, అయనం=త్రోవయైనదియును, అభ్యస్త=మచ్చికయైన, లక్ష్మీ=లక్ష్మీదేవి యొక్క, స్తనం=స్తనమండలముకలదియును, ధ్వస్త=నశింపఁజేయఁబడిన, రజస్తమోభిః=రాజస-తామస-వికారములుగల జనులచేత, అనిశం=ఎల్లవేళల, పురస్తాత్=ఎట్టయెదుట, న్యస్తమివ=నెలకొల్పికొనఁబడినదానిలె సులభమైయున్నదియును, హస్త=చేతితో, ఉదస్త=పైకెత్తబడిన, గిరీంద్ర=గోవర్ధన పర్వతముయొక్క, మస్తక=శిఖరమునందలి, తరుప్రస్తార=వృక్షసంతతిచేత, విస్తారిత=విరివిచేయఁబడిన, స్రస్త=గగనతలమునుండి జాఱిన, స్వస్తరు=కల్పవృక్షములయొక్క, సూనసంస్తర=పుష్పమయాసనమునందు, లసత్=ఒప్పారుచున్న, ప్రాస్తావి=ముచ్చటలాడుచున్న, రాధా=శ్రీరాధాదేవిచేత, స్తుతం=ప్రస్తుతింపఁబడిన వస్తు=ఒకానొకవస్తువు, అస్తి=కలదు.

---

1 'ప్రస్తావి' (పాఠాంతరము)=పొగడఁబడిన

తాత్పర్యము:- సకల భువన శ్రేయో మార్గ భూతమును, లక్ష్మీస్తన మండలమునకు మచ్చికయైనదియును, రాజస తామసములు అణఁగిన జనులకు ఎల్లవేళల ఎట్టయెదుట నెలకొల్పఁబడిన రీతిని సులభమైయున్నదియును, కేలఁదాల్చిన గోవర్ధనగిరి యొక్క శిఖర తరువులచేత విస్తరింపఁజేయఁబడిన-మింటినుండి రాలిన కల్పకుసుమములచేత ఏర్పడిన సెజ్జపై ఒప్పారుచున్న శ్రీరాధాదేవి చేత ప్రస్తుతమైన ఒకానొక శాశ్వత వస్తు వున్నది.

వివరణము:- ఈ మూఁడవ ఆశ్వాసమునకు ఇది వస్తు నిర్దేశ రూపమైన మంగళా చరణము.

శ్లో. **రాధాఽఽరాధిత విభ్రమాద్భుతరసం లావణ్యరత్నాకరం**
సాధారణ్యపదవ్యతీత సహజస్మేరాననామ్భోరుహమ్ ।
ఆలమ్బే హరినీలగర్వగురుతా సర్వస్వనిర్వాపణం
బాలం వైణవికం విముగ్ధమధురం మూర్ధాభిషిక్తం మహః ॥ 2

అన్వయము:- వైణవికం విముగ్ధ మధురం బాలం మహః ఆలంబే=వేణుజీవనమును మిక్కిలి సుందరమును అగు లేఁత ప్రాయముగల వెలుగును ఆశ్రయించుచున్నాను.

అర్థము:- రాధా=శ్రీరాధాదేవిచేత, ఆరాధిత=ఆరాధింపఁబడిన, విభ్రమ= విభ్రమ= విభ్రమములకు నిలయమైన, అద్భుతరసం=అద్భుత రసస్వరూపమును, లావణ్యరత్నా కరం=లావణ్య జలధిని, సాధారణ్యపదవీ=సాటియైన మార్గమును, అతీత=అతిక్రమించిన, సహజ=స్వాభావికమైన, స్మేర=వికస్వర లక్షణముకల, ఆననాంభోరుహం=ముఖపద్మము గలదానిని, హరినీల=ఇంద్రనీలమణియొక్క, గర్వగురుతా=గర్వభరముయొక్క సర్వస్వ=మొత్తమును, నిర్వాహణం=తుడిచిపెట్టుదానిని - (నశింపఁజేయుదానిని), వైణవికం=వేణుజీవనమును, విముగ్ధమధురం=మిక్కిలి సుందరమును స్వాదువును, మూర్ధాభిషిక్తం=సర్వోన్నతస్థానమందు పట్టాభిషిక్తమైన, బాలం=లేఁతప్రాయముగల, మహః=వెలుఁగును, ఆలంబే=ఆశ్రయించుచున్నాను.

తాత్పర్యము:- శ్రీరాధా సమారాధితమైన-విభ్రమనిలయమైన-అద్భుత రసస్వరూపమును, లావణ్యరత్నాకరమును, సాధారణములకెల్ల అవ్వలిదియైన-సహజ వికస్వరమైన-ముఖారవిందము గలదియును, ఇంద్రనీలమణియొక్క సౌందర్యమదమును మూలముట్టుగా తుడిచివేయుదానిని, వేణుజీవనమును, స్వాదుసుందరమును, మధురాకృతులకెల్ల మూర్ధాభిషిక్తమైన లేఁతప్రాయపు వెలుగును ఆలంబనముగా పట్టుకొనుచున్నాను.

శ్లో. **కరిణా మలంఘ్యగతి వైభవం భజే**
కరుణావలంబిత కిశోర విగ్రహమ్ ।
యమినా మనారత విహారి మానసే
యమునా వనాంత రసికం పరం మహః ॥ 3

అన్వయము:- యమునా వనాంతరసికం పరం మహః భజే=యమునా తీరమునందలి వనసంచారమునందు మక్కువగల వెలుఁగును సేవించెదను.

అర్థము:- కరిణాం=ఏగుఁగులకు, అలంఘ్యం=మీఱనలవికాని, గతి=నడకలోని, వైభవం=ఠీవి కలదియును, కరుణా=కరుణచేత, అవలంబిత=ఊనఁబడిన, కిశోర=బాలుని యొుక్క విగ్రహం=ఆకారముగలదియును, యమినాం=యోగీశ్వరులయొుక్క, మానసే=హృదయమునందు, అనారత=నిరంతరమును, విహారి=విహరించునట్టి, యమునా వనాంతరసికం=యమునాతీరమునందలి వనసంచారమునందు మక్కువకల, మహః=వెలుఁగును, భజే=సేవించెదను.

తాత్పర్యము:- ఏనుఁగులకు అలవికాని నడకఠీవి కలదియును, ప్రపన్నజనము పైన గల కారుణ్యముచేత శిశుస్వరూపమును దాల్చినదియును ఎల్లవేళల యోగిహృదయములలో మెలఁగు నట్టిదియును, యమునాతీర వనాంతర ఖేలన రసజ్ఞమైన ఒకానొక వెలుఁగును ఆశ్రయించెదను.

శ్లో. **అతన్త్రిత త్రిజగదపి వ్రజాఙ్గనా**
నియన్త్రితం విపుల విలోచనాజ్ఞయా ।
నిరన్తరం మమహృదయే విజృమ్భతాం
సమన్తతః సరసతరం పరం మహః॥ 4

అన్వయము:- సరసతరం పరం మహః మమహృదయే నిరంతరం విజృంభతామ్=మిక్కిలి సరసమైన పరమమైన వెలుగు నా హృదయమునందు ఎల్లవేళలయందును పెంపొందుచుండునుగాక!

అర్థము:- అతంత్రిత=కదలకుండఁజేయఁబడిన, త్రిజగదపి=ముల్లోకము కలదియైనను, విపుల-విలోచనాజ్ఞయా-విపుల=విశాలమైన, విలోచన=కన్నుయొుక్క, ఆజ్ఞయా=ఆనచేత, వ్రజాంగనా=మందప్రోయాండ్రచేత, నియంత్రితం=గదుమఁబడిన, సరసతరం=మిక్కిలి సరసమైన, పరం=పరమ మయిన, మహః=వెలుఁగు, మమ=నాయొుక్క,

హృదయే=హృదయమునందు, సమంతతః=ఎల్లెడలను, నిరంతరం=ఎల్లవేళలయందును, విజృంభతామ్=పెంపొందుచుండునుగాక.

తాత్పర్యము:- తన ఆజ్ఞలో ముల్లోకమును నిలిపి కొనునట్టి స్వతంత్రము కలిగియును వ్రజాంగనల కంటి ఆనలకు తాను పరతంత్రమైయున్న సరసతరమగు ఆ పరమమయిన వెలుఁగు ఎల్లవేళల నాహృదయములో నెల్లయెడల పెంపొందునుగాక!

శ్లో. ***కన్దర్ప ప్రతిమల్ల కాన్తివిభవం కాదమ్బినీ బాన్ధవం***
బృన్దారణ్య విలాసినీ వ్యసనినం వేషేణ భూషామయమ్ ।
మన్దస్మేర ముఖామ్బుజం మధురిమ వ్యామృష్ట బిమ్బాధరం
వన్దే కన్దళితార్ద్ర యౌవన వనం కైశోరకం శార్‌ఙ్గిణః ॥ 5

అన్వయము:- శార్‌ఙ్గిణః కైశోరకం వందే=శౌరియొక్క కొదమతనమును స్తుతించు చున్నాను.

అర్థము:- కందర్ప=మన్మథునకు, ప్రతిమల్ల=ప్రతిభటమైన, కాంతి విభవం=కాంతి వైభవముకలదియును, కాదంబినీ=మేఘమాలకు, బాంధవం=బాంధవమైనదియును, బృందారణ్య=బృందావనమునందలి, విలాసినీ=విలాసవతులయందు, వ్యసనినం= అత్యంతాసక్తి కలదియును, వేషేణ=వేషముచేత, భూషామయం=ఆభరణ ప్రాచుర్యము కలదియును, మందస్మేర=మందహాస సుందరమైన, ముఖాంబుజం=నెమ్మోము దామర కలదియును, మధురిమ=తీయఁదనముచేత, వ్యామృష్ట=వ్యాప్తమైన, బింబాధరం= బింబిఫలమువంటి కెమ్మోవికలదియును కందళిత=మొలకెత్తిన, అర్ద్ర=సరసమైన, యౌవనవనం=తొలుఁబ్రాయపు టెలదోఁట కలదియునైన, శార్‌ఙ్గిణః=శౌరియొక్క, కైశోరకం=కొదమతనమును, వందే= స్తుతించుచున్నాను.

తాత్పర్యము:- మన్మథునికాంతితో మచ్చరించుచున్న శరీరకాంతి వైభవముతో మేఘమాలకుఁజుట్టఱికము నెరపుచున్నదియును, బృందారణ్యమునందలి హొయలు కత్తెలయందు వలపుకలదియును, ఆభరణాభిరామమైన వేషముకలదియును, అలరు మోము దామర కలదియును, తీయఁదనము లూరుచున్న కెమ్మోవి కలదియును, మొలకలెత్తుచున్న తొలిప్రాయపు టెలఁదోట కల-వెన్నుని కిశోరభావమును స్తుతించుచున్నాను.

శ్లో. ***ఆముక్తమానుష మముక్త నిజానుభావమ్***
ఆరూఢ యౌవన మగూఢ విదగ్ధలీలమ్ ।

ఆమృష్ట యౌవన మనష్ట కిశోరభావమ్
ఆద్యం మహః కిమపి మాద్యతి మానసే మే ॥ 6

అన్వయము:- కిమపి ఆద్యం మహః మే మానసే మాద్యతి=ఒకానొక తొలివెలుగు నా హృదయమునందు పుంజుకొనుచున్నది.

అర్థము:- ఆముక్త=తాల్పఁబడిన, మానుషం=మానవరూపము కలదైనను, అముక్త=విడువఁబడని, నిజా=నైసర్గికమైన, అనుభావం=పరమాత్మ లక్షణము కలదియును, ఆరూఢయౌవనం-ఆరూఢ=అడుగుమోపిన, యౌవనం=తొలిజవ్వనముకలదైనను, అగూఢ=విస్పష్టమైన, విదగ్ధలీలం=ప్రౌఢలీలలు కలదియును, ఆమృష్ట=స్పృశింపఁబడిన, యౌవనం=తొలుప్రాయము కలదైనను, అనష్ట=వీడిపోని, కిశోరభావమ్=పసితనము కలదియునైన, కిమపి=ఒకానొక, ఆద్యంమహః=తొలివెలుఁగు, మే మానసే=నా హృదయమునందు, మాద్యతి=పుంజుకొనుచున్నది.

తాత్పర్యము:- మానవరూపమును దాల్చినను పరమాత్మలక్షణమును వదలికొననిదియును, ఆరంభ యౌవనమైనను ప్రకటీకృతములైన ప్రౌఢలీలలు కలదియును, యౌవనము పైకొని వచ్చుచున్నను పసితనము విడిచిపోవని ఒకానొక తొలివెలుఁగు నా హృదయమునందు పుంజుకొనుచున్నది.

శ్లో. తేతే భావా స్సకల జగతీ లోభనీయ ప్రభావాః
నానాతృష్ణా సుహృది హృది మే కామ మావిర్భవన్తు ।
వీణా వేణు క్వణిత లసిత స్మేర వక్త్రారవిన్దాత్
నాహం జానే మధుర మపరం నన్దపుణ్యామ్బురాశేః ॥ 7

అన్వయము:- నందపుణ్యాంబురాశేః అపరం మధుర మహం నజానే=నందుని పురాకృత పుణ్య సముద్రము కంటె మధురమైన వేఱొక భావమును నేను ఎఱుగను.

అర్థము:- సకల జగతీ=సకల జగత్తులచేత, లోభనీయ=మక్కువపడఁదగిన, ప్రభావాః=మహిమగల, తేతే=ఆయా, భావాః=మనోరథములు, నానా తృష్ణా=పలువిధములైన విషయాభిలాషములకు, సుహృది=నెచ్చెలియైన, మే హృది=నా హృదయమునందు, కామమ్=మిక్కిలి-యథేచ్ఛముగా, ఆవిర్భవంతు=మొలకెత్తునుగాక!, వీణా=వీణయొక్క, వేణు=వేణువాద్యముయొక్క, క్వణిత=రవళులతో, లసిత=విలసిల్లుచున్న, స్మేర=వికస్వరమైన, వక్త్రారవిందాత్=ముఖారవిందముగల, నందపుణ్యాంబురాశేః=నందుని

పురాకృత పుణ్యసముద్రముకంటె, మధురం=మధురమైన, అపరం=వేఱొక భావమును, అహం=నేను నజానే=ఎఱుఁగను.

తాత్పర్యము:- నానా తృష్ణలకు ఆలవాలమైన నాహృదయములో సకల భువన ప్రలోభనీయములైన ఆయా మనోరథములు ముమ్మరముగా మొలకలెత్తుచుండనిమ్ము! కాని- వీణా వేణు మధుర క్వణితములకు నెలవైన వికస్వర వదనాంభోరుహముగల-ఆనంద పూర్వపుణ్యాంబురాశికంటె (శ్రీకృష్ణస్వామికంటె) మధురమైన వేఱొక మనోరథమును నేనెఱుఁగను.

శ్లో. **సుకృతిభి రాదృతే సరస వేణు నినాద సుధా**
రస లహరీ విహార నిరవగ్రహ కర్ణపుటే ।
వ్రజ వర సున్దరీ ముఖ సరోరుహ సారసికే
మహసి కదాను మజ్జతి మదీయ మిదం హృదయమ్ ॥ 8

అన్వయము:- సుకృతిభి: ఆదృతే మహసి మదీయం హృదయం కదాను మజ్జతి!= ధన్యజనులు సమదరించునట్టి వెలుఁగునందు నా హృదయము ఎన్నటికి లీనమగునో!

అర్థము:- సుకృతిభి:=సుకృతముగల వారిచేత, ఆదృతే=స్వీకరింపఁబడినదియును, సరస=రసభరితమైన, వేణునినాద=వేణునాదమే యనెడి, సుధారసలహరీ=అమృతప్రవాహము నందలి, విహార=విహరించుటచేత, నిరవగ్రహ=వఱపునుండి బయటపడిన - (వానలు లేనిస్థితి నుండి బయటపడిన), కర్ణపుటే=శ్రవణపుటములు కలదియును, వ్రజ=నందవ్రజము నందలి, వరసుందరీ=ఉత్తమ స్త్రీలయొక్క, ముఖసరోరుహ=ముఖపద్మములయందు, సారసికే=రసగ్రహణ ప్రవణమైన, మహసి=వెలుఁగునందు, ఇదం=ఈ, మదీయం హృదయం=నా హృదయము, కదాను=ఎన్నటికిఁగాను, మజ్జతి=మునుఁగునో! (లీనమగునో!)

తాత్పర్యము:- ధన్యజనులు సమాదిరించునట్టియును, సరస వేణునాద సుధాప్రవాహ విహారములచేత శ్రవణ పుటముల యొక్క అవగ్రహదోషమును తొలఁగించునట్టిదియును, వ్రజవధూవదనాంబుజ రసప్రవణమునైన వెలుఁగునందు - ఈ నా హృదయ, మేనాటికి నిమగ్నమగునోకదా !

శ్లో. **తృష్ణాతురే చేతసి జృమ్భమాణం**
ముష్ణ న్మమహ ర్మోహ మహాన్ధకారమ్ ।

పుష్ణాతు నః పుణ్యదయైక సిన్ధోః
కృష్ణస్య కారుణ్యకటాక్ష కేళిః ॥ 9

అన్వయము:- కృష్ణస్య కారుణ్య కటాక్ష కేళిః నః పుష్ణాతు=కృష్ణునియొక్క కరుణా కటాక్ష ఖేలనము మిమ్ములను పోషించునుగాక!

అర్థము:- తృష్ణాఽఽతురే=విషయ తృష్ణాలచేత వ్యాధిత మయిన, చేతసి=చేతమునందు, ముహుః=మాటి మాటికిని, జృంభమాణం=విజృంభించుచున్న, మోహ=మోహమే యనెడి, మహాంధకారమ్=పెంజీఁకటిని, ముష్ణన్=తొలగించుచున్నదియై, పుణ్యదయైకసింధోః= పుణ్యులయందలి దయకు ఏకార్ణవమైన, కృష్ణస్య=కృష్ణస్వామియొక్క, కారుణ్యకటాక్ష కేళిః=కరుణాకటాక్ష ఖేలనము, నః=మమ్ములను పుష్ణాతు=పోషించునుగాక.

తాత్పర్యము:- విషయతృష్ణా వ్యాధిగ్రస్తమైన చేతమునందు మాటిమాటికి ముంచుకొనుచున్న మోహమే యనెడి పెంజీఁకటిని తొలఁగించుచు, పుణ్యాత్ములయందలి దయాభావమునకు ఏకార్ణవమైన శ్రీకృష్ణస్వామియొక్క కరుణా కటాక్ష ఖేలనము మమ్ము పోషించుచుండునుగాక!

శ్లో: **నిఖిలాగమ మౌళి లాలితం**
పదకమలం పరమస్య తేజసః ।
వ్రజభువి బహు మన్మహేతరాం
సరస కరీష విశేష రూషితమ్ ॥ 10

అన్వయము:- పరమస్య తేజసః పదకమలం బహుమన్మహేతరామ్=పరమ తేజముయొక్క పాదకమలమును మిక్కిలి ధ్యానించుచున్నాను.

అర్థము:- నిఖిల=సకలములైన, ఆగమమౌళి=వేదశిఖలచేత, లాలితం=లాలింపఁ బడిన, పరమస్య తేజసః=పరమతేజముయొక్క, పదకమలమ్=పాదకమలమును, వ్రజభువి=వ్రజభూమియందలి, సరస కరీష=ఆర్ద్రగోమయముచేత, విశేషరూషితమ్=మిక్కిలి అసలుకొనియున్నదానిని-(బురదయైనదానిని), బహు=అతిశయముగా, మన్మహేత రామ్=మిక్కిలి ధ్యానించుచున్నాము.

తాత్పర్యము:- సకల శ్రుతిమౌళి సముపలాలితమైన పరమతేజముయొక్క పదకమలము వ్రజభూమిలో ఆర్ద్రగోమయముతో అసలుకొనియుండుటను మిక్కిలి తలఁచుకొనుచున్నాము.

శ్లో. ఉదార మృదుల స్మిత వ్యతిక రాభిరా మాననం
ముదా ముహు రుదీర్ణయా ముని మనోఽమ్బు జామ్రేడితమ్ ।
మదాలస విలోచన వ్రజవధూ ముఖాస్వాదితం
కదాను కమలేక్షణం కమపి బాల మాలోకయే ॥ 11

అన్వయము:- కమలేక్షణం కమపి బాలం కదాను ఆలోకయే!=తమ్మికన్నులుగల ఒకానొక బాలుని ఎన్నటికి కనుగొందునో!

అర్థము:- ఉదార=మనోరథఫలములను ప్రసాదించునట్టి, మృదుల=అలఁతియైన, స్మిత=చిఱునవ్వుయొక్క, వ్యతికర=మేళగింపుతో, అభిరామ=అలరించునట్టి, ఆననం=నెమ్మొగముగలవానిని, ముహుః=మాటిమాటికిని, ఉదీర్ణయా=పెల్లుబికిన, ముదా=సమ్మోదముతో, ముని=మునీశ్వరుల యొక్క, మనోఽంబుజ= హృదయపద్మముల యందు, ఆమ్రేడితం=ఇనుమడించినవానిని, మద=యౌవనవిలాసముచేత, అలస=సుందరములైన, విలోచన=కన్నులుగల, వ్రజ=గోపవధువులయొక్క, ముఖ=ముఖములచేత, ఆస్వాదితం=ఆస్వాదింపఁబడిన వానిని, కమలేక్షణం=తమ్మి కన్నులుగల, కమపి=ఒకానొక, బాలం=బాలుని, కదాను=ఎన్నటికిఁగాని, ఆలోకయే=కనుగొందునో!

తాత్పర్యము:- భక్త మనోరథ ఫలములను ప్రసాదించుటయందు సముదారమైన చిఱునవ్వుతో బెరసి హృదయాభిరామమైన నెమ్మోముగలవానిని, పెల్లుబికిన ఆనందముతో మునిమనోంబుజములయందు ఇనుమడించిన రూపముగలవానిని, యౌవన సహజవిలాసముతో అలసములైన కన్నులుగల గోపవనితాననములచేత ఆస్వాదింపఁబడు చున్న కమలదళ విలోచనుఁడైన ఒకానొక బాలుని నే నెన్నటికిఁగాని కనుగొందునో!

శ్లో. వ్రజజన మదయోషి ల్లోచనోచ్ఛిష్ట శేషీ-
కృత మతిచపలాభ్యాం లోచనాభ్యా ముభాభ్యామ్ ।
సకృదపి పరిపాతుం తే వయం పారయామః
కువలయదళనీలం కాంతిపూరం కదాను ॥ 12

అన్వయము:- కువలయదళనీలం తే కాంతి పూరం సకృదపి పరిపాతుం వయం కదాను పారయామః !=నల్ల కలువ రేకువంటి నల్లని నీ వెలుఁగు వెల్లువను ఒక్కసారియైనను తనివితీఱఁగ్రోలుచుటకు మేము ఎన్నటికి పడయఁగలుగుదుమో!

అర్థము:- ప్రజజన=వలసప్రజలలోని, మదయోషిత్=అందకత్తెలయొుక్క, లోచన= కన్నులచేత, ఉచ్ఛిష్ట శేషీకృతం= ఎంగిలి మిగులుగాఁజేయబడిన, తే=నీ యొుక్క, కువలయదళనీలం=ఇందీవరదళశ్యామమైన, కాంతిపూరం=వెలుఁగువెల్లువను, అతిచపలాభ్యాం=మిక్కిలి స్పృహయాళువులైన, ఉభాభ్యాం లోచనాభ్యాం=రెండు కన్ను చేరలతో, సకృదపి=ఒక్కసారియైనను, పరిపాతుం=తనివితీఅఁగ్రోలుటకు, వయం=మేము, కదాను=ఎన్నటికిఁగాని, పారయామః=పడయగలుగుదుమో!

తాత్పర్యము:- వలస ప్రజజలలోని అందకత్తెల కన్నుదొవలచేత ఎంగిలిచేసి విడువఁబడిన ఇందీవరదళ శ్యామలమైన నీ నెమ్మేని వెలుఁగు వెల్లువను మిక్కిలి దప్పికతో-తల్లడించుచున్న చేరకన్నులతో ఒక్కసారియైనను తనివితీఅఁగ్రోలు భాగ్యమును మే మెన్నటికిఁ బడయఁగల్గుదుమో !

శ్లో. ***ఘోషయోషి దనుగీత యౌవనం***
కోమల స్తనిత వేణు నిస్వనమ్ ।
సారభూత మభిరామ సమ్పదాం
ధామ తామరస లోచనం భజే ॥ *13*

అన్వయము:- తామరస లోచనం ధామ భజే=తమ్మి కన్నులుగల వెలుఁగును సేవించెదను.

అర్థము:- ఘోషయోషిత్=మందప్రోయాంగ్రచేత, అనుగీత=పాటలు కట్టి పాడఁబడిన, యౌవనం=జవ్వనము గలదియును, కోమల=మెల్లగా, స్తనిత=రవళించిన, వేణు=పిల్లనఁగ్రోవి యొుక్క, నిస్వనం=నాదముగలట్టియు, అభిరామ సంపదామ్=రామణీయక సమృద్ధులకెల్ల, సారభూతమ్=సారమైన, తామరసలోచనం=తమ్మికన్నులుగల, ధామ=వెలుఁగును, భజే=సేవించెదను.

తాత్పర్యము:- మందప్రోయాంగ్రచేత వరుసలుకట్టిపాడఁబడిన జవ్వనము కలదియు, మెల్లగా రవళించుచున్న పిల్లనగ్రోవి ఎలుగుకలదియును, రామణీయక సమృద్ధులలో కెల్ల రమణీయమైన కమలదళలోచనమైన వెలుఁగును సేవించెదను.

శ్లో. ***లీలయా లలితయాఽవలంబితం***
మూలగేహమివ మూర్తి సంపదామ్ ।

---

2 'ఆశ్రయమహే' (పాఠాంతరము)=ఆశ్రయించుచున్నాము.

నీలనీరద వికాస విభ్రమం
బాలమేవ వయ మాద్రియామహే[2] ॥ 14

అన్వయము:- నీలనీరద వికాస విభ్రమం బాలమేవ వయం ఆద్రియామహే=నల్లమబ్బుయొక్క విలాస విభ్రమములుగల బాలమూర్తిని మాత్రమే మేము ఆదరించుచున్నాము.

అర్థము:- మూర్తిసంపదాం=ఆకారవైభవముల కన్నింటికిని, మూలగేహమివ=ప్రధాన నిలయమువలె, లలితయా=సుందరమైన, లీలయా=హోయలుతో, అవలంబితం= ఆలంబింపఁబడి యున్నట్టియును, నీలనీరద=నల్ల మబ్బు యొక్క, వికాస=ప్రకాశముయొక్క, విభ్రమమ్=విలాసము గలవాఁడును - నల్లని మేఘము యొక్క కాంతి విలాసము గలవాడును - నల్లనై విలాసము దొలఁకుచున్న కాంతి గలవాఁడనుట, అగు, బాలమేవ=బాలమూర్తినిమాత్రమే, వయం=మేము, ఆద్రియామహే=ఆదరించుచున్నాము.

తాత్పర్యము:- ఆకృతి వైభవములకన్నింటికిని మూలనిలయమై, మధుర లీలావలంబితమై, నీలమేఘ విలసన-విభ్రమములుగల బాలమూర్తిని మాత్రమే మేము ధ్యానావలంబనముగాఁ గైకొందుము.

శ్లో. *వన్దే మురారే శ్చరణారవిన్ద*
ద్వన్ద్వం దయా దర్శిత శైశవస్య ।
వన్దారు బృన్దారక బృన్ద మౌళి
మన్దార మాలా వినిమర్ద భీరు ॥ 15

అన్వయము:- మురారేః చరణారవిందద్వంద్వమ్ వందే=మురవైరియొక్క పాదారవింద యుగళమును ప్రణమిల్లుచున్నాను.

అర్థము:- దయా=సృష్టియందలి దయచేత, దర్శిత=ప్రదర్శింపఁబడిన శైశవస్య=శిశులీలగల, మురారేః=మురవైరియొక్క, వందారు=అభివాదన-స్తుతి- సంకులములైన, బృందారక బృంద=సురబృందములయొక్క, మౌళి=ధమ్మిల్ల తలములయందలి, మందారమాలా=దివ్యకుసుమ మాలలయొక్క, వినిమర్ద=సమ్మర్దము వలన, భీరు=వెఱచుచున్న, చరణారవింద ద్వంద్వమ్=పాదారవింద యుగళమును, వందే=ప్రణమిల్లెదను.

తాత్పర్యము:- జీవలోకమునందలి నిర్భర దయచేత శిశులీలను ప్రదర్శించిన శ్రీమన్నారాయణునియొక్క, సురబృందవందితమై వారి మౌళిమందార మాలాసమ్మర్దమునకు నలిగిపోవుచున్న కోమల చరణారవింద ద్వంద్వమును ప్రణ మిల్లుచున్నాను.

శ్లో. **యస్మి న్నృత్యతి యస్య శేఖరభరైః క్రౌఞ్చద్విష శ్చన్ద్రకీ**
యస్మి న్దృప్యతి యస్య ఘోషసురభిం జిఘ్ర న్వృషో ధూర్జటేః ।
యస్మి న్సజ్జతి యస్య విభ్రమగతిం వాఞ్ఛ న్హరే స్సిన్ధురః
తద్బృన్దావన కల్పక ద్రుమ వనం తం వా కిశోరం భజే ॥ 16

అన్వయము:- బృందావన కల్పక ద్రుమ వనం తం వా కిశోరం భజే=బృందావన సీమయందలి కల్పవృక్షవాటికనుగాని ఆ కిశోర మూర్తినిగాని సేవించెదను.

అర్థము:- క్రౌంచద్విషః=కుమారస్వామియొక్క, చంద్రకీ=నెమలి, యస్య=ఏ కిశోరమూర్తియొక్క, శేఖరభరైః=సిగబంతులైన నెమలికన్నులతోసహ, యస్మిన్=ఏ బృందావనసీమయందు, నృత్యతి=నృత్యము చేయుచుండునో, ధూర్జటేః=శివునియొక్క, వృషః=వాహన వృషభము, యస్య=ఏకిశోరమూర్తియొక్క, ఘోష సురభిం=మందలోని ఆవును, జిఘ్రన్=మూర్కొనుచు, యస్మిన్=ఏ బృందావన సీమయందు, దృప్యతి=ఉబ్బుచుండునో, యస్య=ఏ కిశోరమూర్తియొక్క, విభ్రమగతిం=విలాస గమనమును, వాంఛన్=పుణికి పుచ్చుకొనఁగోరుచు, హరేః=ఇంద్రుని యొక్క, సింధురః=ఐరావతము, యస్మిన్=ఏ బృందావనసీమయందు, సజ్జతి=తగుల్కొని యుండునో, తత్=అట్టి, బృందావన కల్పకద్రుమ వనం=బృందావన సీమయందలి కల్పద్రుమ వాటికను గాని, తం వాకిశోరమ్=ఆ కిశోరమూర్తినిఁగాని, భజే=సేవించెదను.

తాత్పర్యము:- కుమారస్వామి వాహనమైన నెమలి, ఏ కిశోరమూర్తియొక్క సిగబంతులైన నెమలికన్నుల ఊగిసలతోసహ ఏ బృందావనసీమయందు తాను నృత్యముచేయుచుండునో, శివుని వాహనమైన నంది, ఏ కిశోరమూర్తి యొక్క మందలోని ఆవును మూర్కొనుచు ఏ బృందావన సీమయందు ఉబ్బుచుండునో, ఇంద్రుని ఔపవాహ్యమైన ఐరావతము ఏ కిశోరమూర్తి యొక్క ఒయ్యారపు నడకలను నేర్వమనసుపడి ఏ బృందావన సీమయందే ఓరంతప్రొద్దులు వేచి యుండునో, అట్టి బృందావనసీమయందలి కల్పవృక్షవాటికను గాని అట్టి కిశోరమూర్తిని గాని సేవించెదను.

శ్లో. **అరుణాధరామృత విశేషిత స్మితం**
వరుణాలయానుగత వర్ణ వైభవమ్ ।

తరుణారవిన్దదళ దీర్ఘలోచనం

కరుణామయం కమపి బాల మాశ్రయే ॥ 17

అన్వయము:- కరుణామయం కమపి బాలం ఆశ్రయే=కరుణాస్వరూపుఁడైన ఒకానొక బాలుని ఆశ్రయింతును.

అర్థము:- అరుణ=అరుణవర్ణమైన, అధరామృత=అమృతమువంటి కెమ్మోవియందు, విశేషిత=విశేషమధురమైన, స్మితమ్=మందహాసము కలవానిని, వరుణాలయ=సముద్రముతో, అనుగత=అచ్చుపడిన, వర్ణ=దేహవర్ణముయొక్క, వైభవమ్=వ్యాపన లక్షణము గలవానిని, తరుణ=క్రొత్తగా వికసించిన, అరవిందదళ=తామరరేకులవలె, దీర్ఘ=సోగలైన, లోచనం=కన్నులు గలవానిని, కరుణామయం=కరుణాస్వరూపుఁడయిన, కమపి=ఒకానొక, బాలమ్=బాలుని, ఆశ్రయే=ఆశ్రయింతును.

తాత్పర్యము:- అరుణవర్ణమైన అమృతాధరమునందు విశేషమధురమైన మందహాసము గలవానిని, సముద్రముతో సరివచ్చు నీలవర్ణముయొక్క వ్యాపన లక్షణము గలవానిని, క్రొత్తగా వికసించిన తామరరేకులవంటి సోగకన్నులు గలవానిని కరుణాస్వరూపుఁడైన ఒకానొక బాలుని ఆశ్రయించుచున్నాను.

శ్లో. **లావణ్యవీచీ రచితాఙ్గ భూషాం**

భూషాపదాఽఽరోపిత పుణ్య బర్హామ్ ।

కారుణ్యధారాళ కటాక్ష మాలాం

బాలాం భజే వల్లవవంశ లక్ష్మీమ్ ॥ 18

అన్వయము:- బాలాం వల్లవవంశ లక్ష్మీం భజే=బాలస్వరూపములోనున్న గోపవంశముయొక్క సౌభాగ్యలక్ష్మిని సేవించెదను.

అర్థము:- లావణ్యవీచీ=అలలు అలలుగా కదలుచున్న దేహకాంతులచేతనే, రచిత=విరచితములైన, అంగ=అవయముల యొక్క, భూషామ్=భూషణములు కలదియును, భూషాపద=భూషాస్థాన గౌరవమునకు, ఆరోపిత=ఆరోహింపఁజేయఁబడిన, పుణ్య=పుణ్యవిశేషముగల, బర్హామ్=నెమలిపురి గలదానిని, కారుణ్యధారాళ=ధారలు కట్టుచున్న కారుణ్య లక్షణముగల, కటాక్ష=క్రేగంటి చూపులయొక్క, మాలామ్=మాలలుగల, బాలామ్=బాలస్వరూపములో నున్న, వల్లవ వంశ=గోపవంశము యొక్క, లక్ష్మీమ్=సౌభాగ్య లక్ష్మిని, భజే=సేవించెదను.

తాత్పర్యము:- లావణ్య తరంగములచేతనే ఆయా అవయవముల యందు విన్యసింపఁబడిన భూషణములు గలవియును, భూషణ పదవి యందారోహింపఁ జేయబడిన అదృష్ట విశేషమునకు నోచికొనిన నెమలి పింఛము గలదియును, కారుణ్య ధారాళములైన కటాక్షమాలలు గలదియును, బాలస్వరూపములోనున్న వల్లవవంశ సౌభాగ్యలక్ష్మిని సేవించెదను.

శ్లో. **మధురైకరసం వపు ర్విభోః**
మధురావీథిచరం భజామహే ।
నగరీ మృగశాబ లోచనా
నయనేన్దీవర వర్ష వర్షితమ్ ॥ 19

అన్వయము:- మధురైకరసం మధురావీథి చరం విభోర్వపుః భజామహే=సౌందర్యముయొక్క ముఖ్యమైన సారమైనదియు, మధురాపట్టణపు వీథులయందు సంచరించునదియునగు శ్రీకృష్ణుని దేహమును సేవించెదను.

అర్థము:- మధురైకరసమ్=శృంగారైకరసమైన, విభోః=స్వామి యొక్క, మధురావీథి చరమ్=మధురానగర వీథులలో సంచరించుచున్న, వపుః=కాంతివంతమైన నెమ్మేనును, నగరీ=మధురానగరియందలి, మృగశాబలోచనా=పిల్లలేడి కన్నులవంటి కన్నులుగల వనితలయొక్క, నయనేందీవర=కన్నులేయనెడి నల్లగలువలయొక్క, వర్ష=వానలచేత, వర్షితమ్=వర్షింపఁబడినదానిని, భజే=సేవించెదను.

తాత్పర్యము:- మధురానగరస్త్రీల కలువ కన్నుల వానలలోఁదోఁగి నగరవీథులలో నడయాడుచున్న శృంగారైకరసమైన స్వామియొక్క శరీరశోభను సేవించెదను.

శ్లో. **పర్యాకులేన నయనాన్త విజృమ్భితేన**
వక్త్రేణ కోమల దరస్మిత విభ్రమేణ ।
మన్ద్రేణ మఞ్జులతరేణ చ జల్పితేన
నన్దస్య హన్త తనయో హృదయం ధునోతి ॥ 20

అన్వయము:- హంత! నందస్య తనయో హృదయం ధునోతి!=అక్కటా! నంద నందనునియందు డెందము స్పందితమగుచున్నది.

అర్థము:- పర్యాకులేన=ఎల్లయెడల సందడించుచున్న, నయనాంత=కటాక్షముల యొక్క, విజృంభితేన=అతిశయముచేత, కోమల=మెత్తని, దరస్మిత=మందహాసము యొక్క,

విభ్రమేణ=విలాసముచేత, మంద్రేణ=మంద్రస్థాయిలో నుండుటచేత, మంజుల తరేణ=ఇను మిక్కిలి తీయనైన, జల్పితేన చ=జల్పనముచేతను - ఉబుసులాడుటచేతను, నందస్యతనయే= నందనందనునియందు, హృదయం=డెందము, ధునోతి=కొట్టుకొనుచున్నది - స్పందితమగుచున్నది, హంత != అక్కటా!.

తాత్పర్యము:- అన్నివైపుల సందరించుచున్న కటాక్షముల విజృంభణముచేత, కోమల మందహాస విలసమయిన ఆననముచేత లోయెలుగులో మఱింత తీయనైన జల్పితములచేత, నందనందనుని యందు అవశమై నాహృదయము సంస్పందిత మగుచున్నది; అక్కటా!

శ్లో. ***కన్దర్ప కణ్డూల కటాక్ష బన్దీః***
ఇన్దీవరాక్షీ రభిలాషమాణాన్ ।
మన్దస్మి తాధార ముఖారవిన్దాన్
వన్దామహే వల్లవ ధూర్త పాదాన్ ॥ *21*

అన్వయము:- వల్లవ ధూర్త పాదాన్ వందామహే = గొల్లవిటకాంద్ర మేటియగు కృష్ణుని నమస్కరించుచున్నాము.

అర్థము:- కందర్ప=కామభావముచేత, కండూల=తీఁటలాఱుచున్న, కటాక్ష=క్రేఁగంటి చూపులకు, బందీః=బందీభూతలైన, ఇందీవరాక్షీః=కలువకంటులను, అభిలాషమాణాన్= అభిలషించుచున్నట్టియును, మందస్మిత=చిఱునవ్వులకు, ఆధార=ఆశ్రయమైన, ముఖారవిందాన్=ఆననపద్మముగల, వల్లవధూర్తపాదాన్=వల్లవధూర్తచరణులను- గొల్లవిటకాఁడుగారిని - (ఇట పాదశబ్దము పూజ్యావాచకము గనుక - గొల్లవిటకాంద్ర మేటియగు కృష్ణుని, పూజ్యవాచకమైన పాదశబ్దము బహువచనము గావున తక్కిన విశేషణములును బహు వచనములైనవని తెలియునది). వందామహే= నమస్కరించుచున్నాము. (గొల్లజాతియందుఁబుట్టిన విటకాఁడు గావుననే ఇందీవరాక్షులను మదులుగొన్న చూడ్కులచేతను, చిఱునవ్వుగలుగు మొగముచేతను వశపఱచుకొని పొందఁగోరుచున్నాడని అర్థము).

తాత్పర్యము:- కామభావముచేత తీఁటలారుచున్న కడకంటిచూపులకు బందీభూతలైన కలువకంటులను కామించుచున్న-మందస్మితములకు నెలవైన ఆననపద్మముగల వల్లవ ధూర్తుని నమస్కరించుచున్నాము. (ధూర్తపాదాన్ గురుపాదాన్ అన్నరీతిని పూజాయాం బహువచనమ్).

శ్లో. *లీలాటోప కటాక్ష నిర్భర పరిష్వంగ ప్రసంగాధిక-*
ప్రీతే గీతివిభంగ సంగత లసద్వేణు ప్రణాదామృతే
రాధాలోచన లాలితస్య లలితస్మేరే మురారే ర్ముదా
మాధుర్యైక రసే ముఖేందు కమలే మగ్నం మదీయం మనః ॥ 22

అన్వయము:- మదీయం మనః మురారేః ముఖేందు కమలే మగ్నమ్=నా మనస్సు శ్రీకృష్ణునియొక్క చంద్రునివంటి ముఖకమలమునందు నిలీనమైనది.

అర్థము:- లీలా=విలాసముల యొక్క, ఆటోప=వేగిరపాటుతోనిండిన, కటాక్ష=కడకంటి చూపులచేతను, నిర్భర పరిష్వంగ=గాటవు కౌగిళ్లచేత, ప్రసంగ=సల్లాపముల చేత, అధికప్రీతే=మిక్కిలి ప్రియమును పొందినదియును గీతివిభంగ=గీతిచ్ఛేదములతో, సంగత=కూడినదై, లసత్=విలసిల్లుచున్న, వేణు=వేణువు యొక్క, ప్రణాద=పుష్కల నాదమే యనెడి, అమృతే=అమృతము కలదియును, రాధాలోచన లాలితస్య=శ్రీరాధాదేవి యొక్క, లోచనములచేత లాలింపఁబడిన, మురారేః=మురవైరియొక్క, లలితస్మేరే=లలితమును వికస్వరమునైనదియును, మాధుర్యైక రసే=శృంగారైకరసమైన, ముఖేందు కమలే=చంద్రునివంటి ముఖకమలమునందు, మదీయం మనః=నా మనస్సు, మగ్నం=నిమగ్నమైనది-నీలీనమైనవి-మిక్కిలి అడగినది.

తాత్పర్యము:- లీలాసంభ్రమముగల కటాక్షములచేతను, గాటపు కౌగిళ్లచేతను, సలాపములచేతను, మిక్కిలి ప్రియము నొందినదియును, గీతిఖండములయందు సంగతమై విలసిల్లుచున్న వేణునాదామృతము కలదియునై రాధ కన్నులతో లాలింపఁబడి లలితస్మేరమైన మురవైరియొక్క మాధుర్యైకరసమైన ముఖేందు కమలమునందు ముదముతో నా మనస్సు నిమగ్నమైనది.

శ్లో. *శరణాఽఽగత వజ్రపఞ్జరే*
శరణే శార్ఙ్గధరస్య వైభవే ।
కృపయా ధృత గోపవిగ్రహే
కియదన్య న్మృగయామహే వయమ్ ॥ 23

అన్వయము:- వయం గోపవిగ్రహం వినా అన్యత్ కియత్ మృగయామహే?=మేము గోపకుమార రూపమునుదప్ప వేఱొకదానిని ఎంతని వెదకెదము?

అర్థము:- శరణాఽఽగత=శరణుచొచ్చిన వారికి, వజ్రపంజరే=వజ్రపంజరమును, శరణే=రక్షకమైన, శార్ఙ్గధరస్య=శార్ఙ్గి యొక్క, వైభవే=విభుత్వము, కృపయా=భక్తజనము నందలి కృపచేత, ధృత గోపవిగ్రహేసతి=ధరింపఁబడిన గోపకుమార రూపము కలదియై యుండఁగా, వయం=మేము, అన్యత్=వేఱొకదానిని, కియత్=ఎంతని, మృగయామహే= వెదకెదము?

తాత్పర్యము:- శరణాగతులకు వజ్రపంజరమువలె సంరక్షకమైన శార్ఙ్గివైభవము, భక్తజనులయందలి కృపచేత గోపకుమార రూపమును ధరించియుండగా వేఱొక దానిని ఎంతమాత్రమని మేము వెదకెదము?

శ్లో. **జగత్త్రయైకాన్త మనోజ్ఞభూమి**
చేత స్యజస్రం మమ సన్నిధత్తామ్ ।
రమా సమాస్వాదిత సౌకుమార్యం
రాధా స్తనాభోగ రసజ్ఞ మోజః ॥ 24

అన్వయము:- రాధాస్తనాభోగ రసజ్ఞం ఓజః అజస్రం మమచేతసి సన్నిధత్తామ్= రాధాదేవి స్తనమండలముయొక్క నిండుదనమునకు మరగిన వెలుఁగు ఎల్లప్పుడును నా చేతమునందు నిలిచియుండునుగాక!

అర్థము:- జగత్త్రయ=లోకత్రయమునకు, ఏకాంత=ముఖ్యమైన, మనోజ్ఞభూమి= సౌందర్యభూమియును, రమా=లక్ష్మీదేవిచేత, సమాస్వాద=అనుభవింపఁబడిన, సౌకుమార్యం= సుకుమారము గలదియును, రాధా=శ్రీరాధాదేవియొక్క, స్తనభోగ=స్తన మండలము యొక్క నిండుదనమునకు, రసజ్ఞమ్=మరగిన, ఓజః=వెలుఁగు, అజస్రమ్=ఎల్లప్పుడును, మమచేతసి=నా చేతమునందు, సన్నిధత్తామ్=సన్నిధిచేసి యుండునుగాక !

తాత్పర్యము:- లోకత్రయ సౌందర్యమునకు ఏకనిలయమును, లక్ష్మీదేవికి అనుభూతమైన సౌకుమార్యము గలదియును, శ్రీరాధాస్తనమండల రసజ్ఞమును ఐన వెలుఁగు నా హృదయమునందు నిత్యము సన్నిధిచేసి యుండునుగాక!

శ్లో. **వయ మేతే విశ్వసిమః**
కరుణాకరమూర్తి కింవదంత్యంగే ।
అపిచ విభో తవ లలితే
చపలతరా మతి రియం బాల్యే ॥ 25

అన్వయము:- హేవిభో! తవ లలితే బాల్యే మమ మతిరియం చపలతరా=ఓ ప్రభూ! నీయొక్క సుందరమైన బాల్యవయస్సునందు ఈ నామనస్సు మఱింత చాపల్యము కలది.

అర్థము:- కరుణాకరమూర్తి=కరుణాకరమూర్తి అనెడి, కింవదంతీ= వార్తకు, అంగే=స్వాకారమైన నీయందు, ఏతేవయం=ఈ మేము, విశ్వసిమః=విశ్వసించు చున్నాము, అపిచ=మఱియును, విభో!=ఓప్రభూ!, తవ=నీయొక్క, లలితే=సుందరమైన, బాల్యే=బాల్యవయస్సునందు, ఇయమ్=ఈ, మమ మతిః=నా మనస్సు, చపలతరా=నీమూర్తి యందుకంటె చాపల్యము కలది.

తాత్పర్యము:- 'కరుణాకరమూర్తి' అను కింవదంతికి నిలయమైన నీ అంగమునందు ఈ మేము విశ్వసించుచున్నాము. మఱియును ఓ ప్రభూ! లలితమైన నీ బాల్యమునందు నా యీ మతి మఱింత చాపల్యమును భజించుచున్నది.

శ్లో. ***వత్సపాలచరః కోఽపి - వత్స శ్రీవత్సలాఞ్ఛనః ।***
ఉత్సవాయ కదా భావీ - త్యుత్సుకే మమలోచనే ॥ 26

అన్వయము:- మమలోచనే ఉత్సుకే=నా కన్నులు ఉబలాట పడుచున్నవి. ఏరీతిగాననగా-

అర్థము:- వత్సపాలచరః=లేఁగకాపరుల నడుమ తిరిగెడి, శ్రీవత్సలాంఛనః= శ్రీవత్సమను పుట్టుమచ్చగల, కోఽపి=ఒకానొక, వత్సః=బాలుఁడు, ఉత్సవాయ=కన్నుల పండుగ కొఱకు, కదా=ఎన్నఁడు, భావీ=కానున్నాఁడు! ఇతి=ఈ విధముగా, మమలోచనే= నా కన్నులు, ఉత్సుకే=ఉబలాటపడుచున్నవి.

తాత్పర్యము:- లేఁగకాపరుల నడుమ తిరిగెడు శ్రీవత్సమను పుట్టుమచ్చగల చిన్నవాఁడు ఎన్నఁడు కనువిందుచేయఁగలడో! అని యీ రీతిని నా కన్నులు ఉబలాట పడుచున్నవి.

శ్లో. ***మధురిమ భరితే మనోభిరామే***
మృదులతర స్మిత ముద్రితాననేన్దౌ ।
త్రిభువన నయనైక లోభనీయే
మహసి వయం వ్రజభాజి లాలసాః స్మః ॥ 27

అన్వయము:- వ్రజభాజి మహసి వయం లాలసాఃస్మః=మందలో నెలవుకొన్న వెలుఁగునందు మేము లాలసులమై యున్నాము.

అర్థము:- మధురిమ భరితే=మాధుర్యముతో నిండినట్టిదియును, మనోభిరామే= మనస్సునకు ప్రహ్లాదనమైనట్టిదియును, మృదులతర=మఱింత సుకుమారమైన, స్మిత=మందహాసముచేత, ముద్రిత=చిహ్నితమైన, ఆననేందౌ=చందమామవంటి నెమ్మోము గలదియును, త్రిభువన నయనైక లోభనీయే=త్రిభువనముయొక్క కన్నులకు ఏక సంప్రార్థనీయమైన, వ్రజభాజి=మందలో నెలవుకొన్న, మహసి=వెలుఁగునందు, వయమ్=మేము, లాలసాఃస్మః=లాలసులమై యున్నాము.

తాత్పర్యము:- మాధుర్యభరితమును, మనోభిరామమును, మృదులతర మందహాస ముద్రితమైన ముఖ చంద్రబింబము గలదియును, త్రిభువనములకును కనువిందై మందలో నడయాడెడి వెలుఁగునందు, మేము లాలసులమై యున్నాము.

★శ్లో. *ముఖారవిందే మకరందబిందు*
నిష్యందలీలా మురళీనినాదే ।
వ్రజాంగనాపాంగ తరంగభృంగ
సంగ్రామ భూమౌ తవలాల సాః స్మః ॥ 28

అన్వయము:- తవ ముఖారవిందే లాలసాః స్మః - నీయొక్క మోముదామరయందు ఆసక్తిగలవార మగుచున్నాము.

అర్థము:- 'మకరందబిందు నిష్యంద (నిష్పంద) లీలా మురళీనినాదే' - మకరంద=పూఁదేనెయొక్క, బిందు=బొట్లయొక్క, నిష్యంద (నిష్పంద)=స్రవించుటగల - పూఁదేనె బొట్లు కాఱునట్లు తీపారుచున్నయనుట, లీలా=విలాసర్థమైన, మురళీ=పిల్లఁగ్రోవియొక్క, నినాదే=ధ్వనిగలదియు - విలాసార్థముగా ధరించిన పిల్లఁగ్రోవినుండి పూఁదేనెబొట్లు దొరఁగినట్లు నిగుడుచున్నధ్వని గలది యనుట, ఇట్టిదియు, 'వ్రజాంగనాపాంగ తరంగభృంగ సంగ్రామ భూమౌ' - వ్రజ=వ్రేపల్లె యందలి, అంగనా=స్త్రీలయొక్క - గోపికలయొక్క, అపాంగ=కడగన్నులయొక్క - కడగంటి చూడ్కులయొక్క అనుట, తరంగ=అలలుఅనెడి - అలలవలె పైపయి నిగుడుచున్న కడగంటి చూడ్కులు అనెడి, భృంగ=తుమ్మెదలయొక్క, సంగ్రామ=యుద్ధపు, భూమౌ=భూమియైనదియు - గొల్లచెలువలు ఒకరినొకరు మించి చూడ్కులు కృష్ణుని మొగమునందు దొందడిగా నిగుడ్పఁగా ఆచూడ్కులు ఒండొంటితో బెరసి

3 'నిష్పంద' (పాఠాంతరము)=స్రవించుటగల

★శరభయ్యగారు ఈ శ్లోకమునకు వ్యాఖ్య వ్రాయలేదు. అందుచే తంజనగరము తేవప్పెరుమాళ్ళయ్యగారి వ్యాఖ్యనుండి దీని అర్థ తాత్పర్యములు గ్రహింపబడినవి - సంపాదకుడు.

జగడమాడునట్లుండెననుట - గోపికల చూడ్కులచే క్రిక్కిరిసి యున్నదనుట - దీనిచే గోపికల కామాతిశయమును, తన్మూలమున కృష్ణముఖము యొక్క సౌందర్యాతిరేకమును వ్యంజితములు; ఇట్టిదైన, తవ=నీయొక్క, ముఖారవిందే=మోముఁదామరయందు, లాలసాః=ఆసక్తులము, స్మః=అనుచున్నాము.

తాత్పర్యము:- పూఁదేనె బొట్లు కాఱునట్లు తీపార నిగుడుచున్న పిల్లనగ్రోవి రవళి గలిగి, గోపస్త్రీలు ప్రేమాతిశయమున అవ్వారిగా నిగుడ్చుచున్న తుమ్మెదలవంటి నల్లని చూడ్కులు క్రిక్కిఱిసి వ్రాలఁగా, పెంపారుచున్న నీమోముఁదామరయందు మేము ఆసక్తులమగుచున్నాము.

శ్లో. *ఆతామ్రాయత లోచనాంశు లహరీలీలా సుధాప్యాయితై :*
గీతామ్రేడిత దివ్యకేళిభరితై స్స్మృతం వ్రజస్త్రీజనైః ।
స్వేదామ్బుఃకణ భూషితేన కిమపి స్మేరేణ వక్త్రేన్దునా
పాదామ్భోజ మృదుప్రచార సుభగం పశ్యామి దృశ్యం మహః ॥ 29

అన్వయము:- పాదాంభోజ మృదుప్రచార సుభగం దృశ్యం మహః పశ్యామి=పాదపద్మముల మందమంద సంచారముచేత సుందరమై దర్శనీయమైన వెలుఁగును దర్శించుచున్నాను.

అర్థము:- ఆతామ్ర=ఇంచుక ఎఱ్ఱనివియు, ఆయుత=విశాలములునైన, లోచనాంశు=నయన కిరణములయొక్క, లహరరీలీలా=తరంగవిలాసములుగల, సుధా=అమృతముచేత, ఆప్యాయితైః=తృప్తి నొందింపఁబడినట్టియును, గీత=వేణుగీతమునకు, ఆమ్రేడిత=పునరుక్తభూతములైన, దివ్యకేళి=రాసకేళితో, భరితైః=నిండారిన, వ్రజస్త్రీజనైః=గోపవనితాజనములతో, స్వీతమ్=పరివేష్టింపఁబడినదియును, స్వేదాంభఃకణ=చెమరు మొగ్గలచేత, భూషితేన=అలంకరింపఁబడినదియును, కిమపి=అనిర్వచనీయముగా, స్మేరేణ=వికస్వరమైన, వక్త్రేందునా=ముఖచంద్రునితో, పాదాంభోజ=చరణాంబుజములయొక్క, మృదుప్రచార=మందమంద సంచారముచేత, సుభగం=సుందరమై, దృశ్యం=దర్శనీయమైన, మహః=వెలుఁగును, పశ్యామి=దర్శించు చున్నాను.

తాత్పర్యము:- ఎఱ్ఱసెరలతో ఇంచుక ఎఱ్ఱనైన విశాలవిలోచనములనుండి వెలువడుచున్న కాంతితరంగామృతముతో ఆప్యాయితలై వేణుగీతమునకు పునరుక్త ప్రాయమైన రాసలీలారసముతోనిండిన గోపవధూజనములతో పరివేష్టితమై, చెమరుమొగ్గలతో

అలంకృతమైన వదనేందుమండలముతో, మందమంద సంచారసుందరములైన చరణార విందములతో దర్శనీయమైన వెలుఁగును సందర్శించుచున్నాను.

(**విశేషాంశము:-** ఈ శ్లోకార్థము శ్రీ గోపాలకృష్ణ మంత్రరాజధ్యానమని గోపాల కల్పకమునందుఁ జెప్పఁబడియున్నది-

శ్లో. గోపీనాం పాదపద్మాని - గృహీత్వా సహ నృత్యతః ।
ధ్యాయెల్లక్షం జపంచైవ - కన్యకాముద్వహేచ్ఛుభామ్ ॥)

శ్లో. పాణౌ వేణుః ప్రకృతి సుకుమా రాకృతౌ బాల్యలక్ష్మీ :
పార్శ్వే బాలాః ప్రణయసరసాలోకితాపాంగ లీలాః
మౌళౌ బర్హం మధుర వదనాంభోరుహే మౌగ్ధ్య ముద్రే -
త్యార్ద్రాకారం కిమపి కితవం జ్యోతి రన్వేషయామః ॥ *30*

అన్వయము:- ఆర్ద్రాకారం కిమపి కితవం జ్యోతిః అన్వేషయామః=హృదయంగమమైన ఆకారముగల అనిర్వచనీయమైన ధూర్తమైన వెలుఁగును వెదకుచున్నాము.

అర్థము:- ప్రకృతి సుకుమార=స్వభావ మృదులమైన, ఆకృతౌ=ఆకారముగల, ప్రాణౌ=అఱచేతియందు, వేణుః=పిల్లనగ్రోవియును, బాల్యలక్ష్మీః=బాల్యశోభయును, పార్శ్వే=పార్శ్వమునందు, ప్రణయ సరస=ప్రణయముతో సరసముగా, ఆలోకిత=చూడఁబడిన, అపాంగలీలాః=కటాక్ష విలాసములు గల, బాలాః=జవరాంౘ్రను, మౌళౌ=ధమ్మిల్లమునందు, బర్హం=నెమిలిపురియును, మధుర=సుందరమైన, వదనాంభోరుహే=ముఖారవిందమునందు, మౌగ్ధ్యముద్రా=అమాయకపు వాలకమును, ఇతి=ఈరీతిగా, ఆర్ద్రాకారం=హృదయంగమమైన ఆకారముగల, కితవం=ధూర్తమైన, కిమపి=అనిర్వచనీయమైన, జ్యోతిః=వెలుఁగును, అన్వేషయామః=వెదకుచున్నాము.

తాత్పర్యము:- సహజ కోమలమైన కెంగేల వేణునాళమును, బాల్యశోభయును, పార్శ్వమునందు ప్రణయసరసముగా- తన కటాక్షవిలాసములను ఆలోకించుచున్న జనరాంౘ్రను, మౌళితలమునందు నెమలిపురియును, ముద్దారు నెమ్మోమునందు, అమాయికపు తీఱును - ఈ రీతిగా హృదయంగమాకారమై అనిర్వచనీయమైన ధూర్త తేజమును వెదకుచున్నాము.

(**విశేషాంశము:-** ఈ శ్లోకార్థము శ్రీగోపాలకృష్ణ ఏకాదశాక్షరీ మంత్రధ్యానమని సనత్కుమార సంహితయందుఁ జెప్పబడియున్నది-

శ్లో. హరంతం నవనీతాది - చౌర్యేణ వ్రజయోషితామ్ ।
గోపబాలైర్యుతం కృష్ణం - ధ్యాయేన్మంత్ర మిమం జపేత్ ॥)

శ్లో. ఆరూఢవేణు తరుణాధర విభ్రమేణ
మాధుర్యశాలి వదనామ్బుజ ముద్వహన్తీ ।
ఆలోక్యతాం కిమనయా వనదేవతా వః
కైశోరకే వయసి కాపిచ కాన్తియష్టిః ॥ 31

అన్వయము:- వనదేవతాః వః అనయాకిమ్?=ఓవనదేవతలారా! మీకు ఈ వెలుఁగు మోవుతో ఏమి అక్కఱ?

అర్థము:- ఆరూఢవేణు=అధిరోహించిన వేణువుగల, తరుణాధర=లేఁతమోవి యొక్క, విభ్రమేణ=విలాసముతో, మాధుర్యశాలి=మాధుర్య సంపన్నమైన, వదనాంబుజమ్=వదనార విందమును, ఉద్వహంతీ=వహించుచున్నదియై, కైశోరకే వయసి=చిన్నారి వయసులోనున్న, కాపి=ఒకానొక, కాంతియష్టిః=వెలుఁగు కంబము, ఆలోక్యతాం=సందర్శింపఁబడునుగాక, వనదేవతాః=ఓ వనదేవతలారా!, వః=మీకు, అనయా=ఈ వెలుఁగు మోపుతో, కిమ్=ఏమి అక్కఱ?

తాత్పర్యము:- పిల్లనగ్రోవి యెక్కిన తలిరుమోవి విలాసముగల, తీయఁదనము ఉట్టి పడుచున్న మోముదమ్మితో, చిన్నారి ప్రాయములో నున్న ఒకానొక వెలుఁగు మోపును ఓ వనదేవతలారా! స్మరింపుడు! ఆ వెలుగు మోపుతో మీకు తీఱఁగల అక్కఱ ఏమియో (విచారించికొనుఁడు!)

శ్లో. అనన్య సాధారణ కాన్తికాన్తమ్
ఆక్రాన్త గోపీ నయనారవిన్దమ్ ।
పుంసః పురాణస్య నవం విలాసం
పుణ్యేన పూర్ణేన విలోకయిష్యే ॥ 32

అన్వయము:- పురాణస్య పుంసః నవం విలాసమ్ పూర్ణేనపుణ్యేన విలోకయిష్యే=పురాణపురుషుని యొక్క నిత్యనూతనమైన విలసనమును పరిపూర్ణమైన సుకృతముతో చూడగలను.

అర్థము:- అనన్యసాధారణ=అన్యదైవములలోలేని, కాంతి=కాంతిచేత, కాంతమ్=సుందరమైనదియును, ఆక్రాంత=ఆక్రమింపఁబడిన, గోపీ=గోపికా జనముయొక్క, వదనారవిందమ్=ఆనన కమలములు కలదియు నైన, పురాణస్య పుంసః=పురాణ పురుషుని యొక్క, నవం=నిత్యనూతనమైన, విలాసమ్=విలసనమును, పూర్ణేన=పరిపూర్ణమైన, పుణ్యేన=సుకృతముతో, విలోకయిష్యే=చూడఁగలను,

తాత్పర్యము:- ఇతర దైవములో కానరాని కాంతి విశేషముతో సుందరమైనదియు, గోపికాజన వదనారవిందములను ఆక్రమించి నదియును నైన, పురాణపురుషుని యొక్క నిత్యనూతనమైన విలాసమును పరిపూర్ణ సుకృతముతో సందర్శింపఁగలను.

శ్లో. *సాష్టాంగపాత మభివంద్య సమస్తభావైః*
సర్వాన్ సురేంద్రనికరా నిదమేవ యాచే! ।
మందస్మితార్ద్ర మధురానన చంద్రబింబే
నందస్య పుణ్యానిచయే మమ భక్తి రస్తు ॥ 33

అన్వయము :- నందస్య పుణ్యానిచయే మమభక్తిః అస్తు!=నందుని పుణ్యారాశియందు నాకు భక్తి కలుగునుగాక!

అర్థము:- సమస్త భావైః=సర్వభావములతో, సర్వాన్ సురేంద్ర నికరాన్=సర్వదేవతా బృందములను, సాష్టాంగపాతమ్=సాష్టాంగప్రణాయముగా, అభివంద్య=ప్రణమిల్లి, ఇదమేవ= ఇదియే, యాచే=అభ్యర్థించుచున్నాను, మందస్మిత=మందహాసముతో, ఆర్ద్ర=తడిసిన, మధుర=తీయని, ఆననచంద్రబింబే=నెమ్మోము చందమామగల, నందస్య పుణ్యానిచయే= నందుని పుణ్యరాశియందు, మమ=నాకు, భక్తిః=భక్తి, అస్తు= కలుగునుగాక.

తాత్పర్యము:- సమస్త దేవతలను-సమస్త భావములతో-సాష్టాంగపాతముగా ప్రణమిల్లి-ఇదియే అడిగికొనుచున్నాను. మందహాసముతో-తడిసిన-తీయని చందమామవంటి నెమ్మోముగల నందుని పుణ్యరాశి యందు-నాకు-భక్తి కలుగునుగాక!.

శ్లో. *ఏషు ప్రవాహేషు ఏవ మన్యే*
క్షణోఽపిగణ్యః పురుషాయుషేషు ।
ఆస్వాద్యతే యత్ర కయాపి భక్త్యా
నీలస్య బాలస్య నిజం చరిత్రమ్ ॥ 34

అన్వయము:- ప్రవాహేషు ఏషు పురుషాయుషేషు క్షణోపి స ఏవ గణ్యః మన్యే=నిరంతర ప్రవాహరూపములైన ఈ పురుషాయుర్దాయములయందు క్షణమాత్రమే యైనను ఆ కాలకళయే లెక్కించు కొనఁదగినదని తలంచుచున్నాను.

అర్థము:- ప్రవాహేషు=నిరంతర ప్రవాహ రూపములైన, ఏషు=ఈ, పురుషాయుషేషు=పురుషాయుర్దాయములయందు, క్షణోపి=క్షణమాత్రమే యైనను, సఏవ=ఆకాల కళయే, గణ్యః=లెక్కించికొనఁదగినదని, మన్యే=తలంచు చున్నాను, యత్ర=ఏ కాలకళయందు, నీలస్య=నీలవర్ణుఁడైన, బాలస్య=బాలుని యొక్క, నిజం=స్వీయమైన, చరిత్రమ్=చరిత్రము, కయాఽపి=చెప్పనలవికాని, భక్త్యా=పరమప్రేమతో, ఆస్వాద్యతే=ఆస్వాదింపఁబడుచున్నదో!

తాత్పర్యము:- నిరంతరప్రవాహముగాఁ గడిచిపోవుచున్న-ఈ జీవుల జీవిత కాలములలో క్షణపరిమితమైనను ఆ కాలకళ ఒక్కటియే లెక్కకురాఁదగినదని తలంచు చున్నాను - ఏ కాలకళలో నీలవర్ణుఁడైన బాలునియొక్క నిజచరిత్రము పరమప్రేమ రూపమైన భక్తితో ఆస్వాదింపఁబడుచున్నదో! (ఆ కాలకళ).

శ్లో. *నిసర్గ సరసాధరం నిజదయాఽఽర్ద్ర దివ్యేక్షణం*
మనోజ్ఞ ముఖపంకజం మధురసాఽఽర్ద్ర మందస్మితమ్ ।
రసజ్ఞ హృదయాస్పదం రమిత వల్లవీలోచనం
పునఃపున రుపాస్మహే భువన లోభనీయం మహః ॥ 35

అన్వయము:- భువన లోభనీయం మహః పునః పునః ఉపాస్మహే=భువన సంప్రార్థనీయమైన వెలుఁగును మఱల మఱల ఉపాసింతుము.

అర్థము :- నిసర్గ సరస=స్వభావ సరసమైన, అధరమ్=అధరబింబము కలదియును, నిజదయా=స్వరూపమైన దయచేత, ఆర్ద్ర=తడిసిన, దివ్య=తేజఃస్వరూపములైన, ఈక్షణం= చూపులు గలదియును, మనోజ్ఞ=మనోఽభిరామమైన, ముఖపంకజమ్= ముఖ కమలము గలదియును, మధు రస=మధు రసముచేత, ఆర్ద్ర=తడిసిన, మందస్మితమ్= మందహాసము కలదియును, రసజ్ఞ=నిజరసాభిజ్ఞులైన జనులయొక్క, హృదయ= హృదయములే, ఆస్పదమ్=నివాసముగాఁగలదియును, రమిత=క్రీడింపఁబడిన, వల్లవీలోచనమ్=గోపికా నయనములుగలదియును, భువన లోభనీయమ్=భువనప్రార్థనీయమైన, మహః=వెలుఁగును, పునఃపునః=మఱల మఱల, ఉపాస్మహే=ఉపాసింతుము.

తాత్పర్యము:- స్వభావ సరసమైన అధరబింబము కలదియును, స్వరూపమే అయిన దయచేత తడిసిన తేజోమయములైన చూపులు గలదియును, మనోఽభిరామమైన ముఖకమలము గలదియును, మధు రసార్ద్రమైన మందహాసములు గలదియును, నిజరసాభిజ్ఞులైనవారి హృదయములయందు నెలకొన్నదియును, రమింపఁజేయఁబడిన గోపికానయనములు గలదియును, భువన సంప్రార్థనీయమైన వెలుఁగును ఎల్లవేళల ఉపాసింతుము.

శ్లో. ***సకోఽపిబాలః సరసీరుహాక్షః***
సా చ వ్రజస్త్రీజన పాదధూళిః ।
ముహు స్తదేతద్యుగళం మదీయే
మోముహ్యమానేఽపి మనస్యుదేతు ॥ *36*

అన్వయము:- తత్ ఏతత్ యుగళం ముహుః మే మనసి ఉదేతి=ఆ యీ జంట మాటిమాటకిని నామనస్సునందు ఉదయించుచున్నది.

అర్థము:- సరసీరుహాక్షః=తమ్మికన్నులుగల, కోఽపి=అ నిర్వచనీయుఁడైన, సబాలః= ఆ బాలుఁడు, సా=ఆ, వ్రజస్త్రీజన పాదధూళిశ్చ=గోపికాజనము యొక్క చరణ పరాగమున్ను, అనెడి, తత్=ఆ, ఏతత్యుగళమ్=ఈజంట, ముహుః=మాటి మాటికిని, మోముహ్యమానేఽపి= మిక్కిలి మోహవివశమగుచున్న స్థితియందుఁగూడ, మే మనసి=నా మనస్సునందు, ఉదేతి=ఉదయించున్నది.

తాత్పర్యము:- ఆ యెవరో తమ్మికన్నుల బాలుఁడు, ఆ గోపికల చరణ ధూళి, అనెడి ఆయీ జంట మిక్కిలి మోహ వివశమగుచున్న స్థితియందుఁగూడ నా మనస్సునందు- ఉదయించుచున్నది.

శ్లో. ***మయి ప్రయాణాభిముఖే చ వల్లవీ***
స్తనద్వయీ దుర్లలితః సబాలకః ।
శనైఃశనైః శ్రావిత వేణునిస్వనో
విలాస వేషేణ పురః ప్రతీయతామ్ ॥ *37*

అన్వయము:- మయి ప్రయాణ అభిముఖే సః బాలకః పురః ప్రతీయతామ్!=నేను ప్రాణప్రయాణమునకు ఉన్ముఖుఁడనైన సమయమునందు ఆ చిన్నవాడు నాయెదుట గోచరించుచుండునుగాక!

అర్థము:- మయి=నేను, ప్రయాణ=ప్రాణప్రయాణమునకు, అభిముఖే=ఉన్ముఖుఁడనైన సమయమునందు, వల్లవీ=గోపికాజనములయొక్క, స్తనద్వయీ=చనుగవలకు, దుర్లలితః=పోరాని చుట్టమైన, సః=ఆ, బాలకః=చిన్నవాఁడు, శనైఃశనైః=మెల్లమెల్లగా, శ్రావిత=వినిపింపఁబడిన, వేణునిస్వనః=వేణునాదము కలవాఁడగుచు, పురః=నాయెదుట, విలాసవేషేణ=విలాసవేషముతో, ప్రతీయతామ్=గోచరించుచుండునుగాక.

తాత్పర్యము:- నేను ప్రాణ ప్రయాణోన్ముఖుఁడనైన వేళలో గోపికల చనుగవలకు పోరాని నెచ్చెలియైన ఆ బాలుఁడు-మెల్లమెల్లగా వేణునాదము వినిపింపఁజేయుచు విలాసవేషముతో నా యెదుట గోచరించుచుండునుగాక!

శ్లో. ***అతిభూమి మభూమి మేవ వా***
వచసాం వాసిత వల్లవీ స్తనమ్ ।
మనసా మపరం రసాయనం
మధురాద్వైత ముపాస్మహే మహః ॥ *38*

అన్వయము :- (కిమపి) మహః ఉపాస్మహే=(ఒకానొక) తేజమును ఉపాసించుచున్నాము.

అర్థము:- వచసాం=పలుకులకు, అతిభూమిం వా=అందని నెలవో, అభూమిమేవ వా= అందనేరాని నెలవో, వాసిత=నివసింపఁబడిన, వల్లవీ స్తనమ్=గోపికా స్తనభూమిగలదియును, మనసాం=మనస్సులకు, అపరమ్=పరమమైన, రసాయనమ్=రసాయనమైనదియును, మధురాద్వైతమ్=మాధుర్యైకరూపమైన, మహః=తేజమును, ఉపాస్మహే=ఉపాసించు చున్నాము.

తాత్పర్యము:- అది మాటలకు అందనిదియో, అందనేరానిదియో! మనస్సులకు మాత్రము పరమ రసాయనమును, మాధుర్యైక రూపమును, వల్లవీస్తనమండలవాసితమునైన ఒకానొక వెలుఁగును ఉపాసించుచున్నాము.

శ్లో. ***జననాంతరేఽపి జగదేకమండనే***
కమనీయధామ్ని కమలాయతేక్షణే ।
వ్రజసుందరీజన విలోచనామృతే
చపలాని సంతు సకలేంద్రియాణి మే ॥ *39*

అన్వయము:- కమనీయధామ్ని మే సకలేంద్రియాణి జననాంతరేపి చపలాని సంతు=రమ్యమైన వెలుగునందు నా సకలేంద్రియములును జన్మాంతరమునందు కూడ ఆసక్తి కలవి అయ్యెడునుగాక!

అర్థము:- జగత్=జగమునకంతటికిని, ఏకభూషణే=ఒకేఒక అలంకారమును, కమలాయతేక్షణే=కమలములకువలె విశాలములైన కన్నులుగలదియును, వ్రజసుందరీజన=మందలోని సుందరీజనముయొక్క, విలోచన=కన్నులకు, అమృతే=అమృతమైన, కమనీయధామ్ని=రమ్యమైన వెలుఁగునందు, మే=నా యొక్క, సకలేంద్రియాణి=సకలేంద్రియములును, జననాంతరేపి=జన్మాంతరమునందు కూడ, చపలాని=ఆసక్తికలవి, సంతు=అయ్యెడునుగాక.

తాత్పర్యము:- భువనైక భూషణమును తామరలవలె విశాలములైన కన్నులు గలదియును, వ్రజసుందరీ నయనామృతమైన-కమనీయ తేజమునందు- నా సకలేంద్రియము లును జన్మాంతరమునందుకూడ తదేకాసక్తములై యుండునుగాక.

శ్లో. **మునిశ్రేణీ వంద్యం మదభర లస ద్వల్లవ వధూ**
స్తన శ్రోణీబింబ స్తిమిత నయనాంభోజ సుభగమ్ ।
పున: శ్లాఘాభూమిం పులకిత గిరాం నైగమ గిరాం
ఘనశ్యామం వందే కిమపి కమనీయాకృతి మహః ॥ 40

అన్వయము:- కిమపి మహః వందే=అనిర్వచనీయమైన తేజమును నమస్కరించు చున్నాను.

అర్థము:- మునిశ్రేణీ=మునిపరంపరలకు, వంద్యం=వందనీయమును, మదభర=విలాసభరముతో, లసత్=ప్రకాశించుచున్న, వల్లవవధూ=గోపవధువుల యొక్క, స్తన=స్తనమండలములయందు, శ్రోణీబింబ=నితంబబింబములయందు, స్తిమిత=నిశ్చలములైన, నయనాంభోజ=నేత్రాంబుజములతో, సుభగం=సుందరమైనదియును, పునః=మఱల, పులకిత=హర్ష పులకితములైన, గిరాం=వాక్కులుగల, నైగమ గిరాం=వేద సరస్వతులకు, శ్లాఘాభూమిం=ప్రశంసాస్థానమును, ఘనశ్యామం=మేఘశ్యామలమైన, కిమపి=అనిర్వచ నీయమైన, మహః=తేజమును, వందే=నమస్కరించుచున్నాను.

తాత్పర్యము:- మునిపరంపరలకు వందనీయమును, విలాసభరాలసలైన గోపసుందరీజనము యొక్క స్తనమండలములయందును నితంబబింబములయందును నిశ్చలములైన నయనాంభోజములచేత దర్శనీయమును, అట్లయ్యును-హర్షపులకితలైన

వేదవాణులకు ప్రశంసాస్థానమును మేఘశ్యామలమును, అనిర్వచనీయమైన కామనీయకముగల ఒకానొక తేజమును నమస్కరించుచున్నాను.

శ్లో. ***అనుచుంబతా మవిచలేన చేతసా***
మనుజాzకృతే ర్మధురిమశ్రియం విభో: ।
అయి దేవ! కృష్ణ! దయితేతి జల్పతా
మపి నో భవేయు రపినామ తాదృశా: ॥ 41

అన్వయము:- న: అపి తాదృశా: అపినామ భవేయు:=మాకుఁగూడ అట్టి సాక్షాదనుభవములు కలిగెడునా!

అర్థము:- మనుజాzకృతే:=మనుజాకృతియైన, విభో:=విష్ణునియొక్క, మధురిమ శ్రియం=మాధుర్యలక్ష్మిని, అవిచలేన=చెదరని, చేతసా=చేతస్సుతో, అనుచుంబతాం= మాటిమాటికిని స్పృశించుచున్నట్టియును, అయి దేవ!=ఓ దేవా!, కృష్ణ!=కృష్ణా!, దయిత!= వల్లభుఁడా!, ఇతి=ఈవిధముగా, జల్పతామ్=జల్పనముచేయుచున్న - ఊసులాడుచున్న, న:అపి=మాకుఁగూడ, తాదృశా:=అట్టి సాక్షాదనుభవములు, అపినామ భవేయు:=కలిగెడునా?

తాత్పర్యము:- మనుజాకారుఁడైన విష్ణుని యొక్క మాధుర్యలక్ష్మిని చెదరని చేతముతో మఱలమఱల స్పృశించుచున్నట్టియును-ఓయి దేవా! కృష్ణా! ఓ దయితుఁడా! అని ఈ రీతిని జల్పనము చేయుచున్న మాకుఁగూడ అట్టి సాక్షాదనుభవములు కలెగెడునా?

శ్లో. ***కిశోర వేషేణ కృశోదరీ దృశాం***
విశేష దృశ్యేన విశాల లోచనమ్
యశోదయా లబ్ధయశో నవాంబుధే :
నిశామయే నీలనిశాకరం కదా ॥ 42

అన్వయము:- నీలనిశాకరం కదాను నిశామయే!=నీలవర్ణుఁడైన చంద్రుని ఎన్నడు కన్నార కనుగొందును?

అర్థము:- కృశోదరీ దృశామ్=వనితా విలోచనములకు, విశేషదృశ్యేన=విశేషదర్శనీయ మైన, కిశోర వేషేణ=కిశోర వేషముతో, విశాల లోచనమ్=విశాల విలోచనమును, యశోదయా=యశోదచేత, లబ్ధ యశో నవాంబుధే-లబ్ధ=సంప్రాప్తమైన, యశ:=కీర్తియే

అనెడి,నవాంబుధేః=నూతన సముద్రమునుండి వెలువడిన, నీలనిశాకరం=నీలవర్ణుఁడైన చంద్రుని, కదాను=ఎన్నఁడు, నిశామయే=కన్నారఁ గనుగొందును?

తాత్పర్యము:- వనితావిలోచనములకు విశేషదర్శనీయమైన కిశోరవేషముతో విశాలవిలోచనమును, యశోదచేత సంప్రాప్తమైన నూతన యశోజలరాశినుండి - ఉదయించిన నీలవర్ణుడైన నిశాకరుని ఎన్నఁడు కన్నారఁ గానఁబడయుదునో!

శ్లో. ***ప్రకృతి రవతు నో విలాసలక్ష్మ్యాః***
ప్రకృతిజడం ప్రణతాపరాధ వీథ్యామ్ ।
సుకృతి కృతపదం కిశోరభావే
సుకృతి మనఃప్రణిధాన పాత్ర మోజః ॥ 43

అన్వయము :- (కిమపి) ఓజః నః అవతు!=(ఒకానొక) తేజము మమ్ము రక్షించునుగాక!

అర్థము:- విలాసలక్ష్మ్యాః=విలాససమృద్ధికి, ప్రకృతిః=కారణమైనదియును, ప్రణత=ప్రణమిల్లిన వారియొక్క, అపరాధ=అపరాధముల యొక్క, వీథ్యామ్=పంక్తి యందు, ప్రకృతి జడమ్=స్వభావముచేతనే జడమైనదియును, కిశోరభావే=కిశోర స్వరూపమునందు, సుకృతి=సుకృతవంతులచేత, కృత=చేయఁబడిన, పదమ్=ఆశ్రయము కలదియును, సుకృతి=పుణ్యవంతులయొక్క, మనఃప్రణిధాన=ధ్యానమునకు, పాత్రమ్=పాత్రభూతమైన, ఓజః=తేజము, నః=మమ్ము, అవతు=రక్షించునుగాక!

తాత్పర్యము:- విలాససమృద్ధికి మూలకారణమైనదియును, ఆశ్రితుల అపరాధశ్రేణులయందు స్వభావ జడమైనదియు శిశుస్వరూపము నందు సుకృతవంతులచేత లబ్ధావకాశమైనదియు, పుణ్యవంతులయొక్క ధ్యానమునకు పాత్రభూతమైన తేజము మమ్ము రక్షించుగాక!

శ్లో. ***అపహసిత సుధా మదావలేపైః***
అతి సుమనోహర మార్ద్రమందహాసైః ।
వ్రజయువతి విలోచనావలేహ్యం
రమయతు ధామ రమావరోధనం నః ॥ 44

అన్వయము:- (కిమపి) ధామ నః రమయతు=(ఒకనొక) వెలుఁగు మమ్ము ఆనందింపఁజేయునుగాక!

అర్థము:- అపహసిత=గేలిచేయఁబడిన, సుధా=అమృతము యొక్క, మదావలేపై:= మదగర్వముకల, ఆర్ద్రమందహాసై:=కరుణతో తడిసిన చిఱునవ్వులతో, అతి సుమనోహరమ్=మిక్కిలి సుమనోహరమైనదియు, వ్రజయువతి=గోపయువతులయొక్క, విలోచన=కన్నులకు, అవలేహ్యమ్=ఆస్వాదయోగ్యమైన, రమావరోధనమ్=లక్ష్మీదేవి రాణివాసముగాఁగల, ధామ=వెలుఁగు, న:=మమ్ము, రమయతు=ఆనందింపఁజేయునుగాక!

తాత్పర్యము:- అమృతముయొక్క మాధుర్యమదగర్వమును వేళాకోళము చేయుచున్న కరుణార్ద్రములైన చిఱునవ్వులతో, అత్యంత సుమనోహరమైనదియును, గోపతరుణీ విలోచనములకు ఆస్వాదయోగ్యమైనదియును, శ్రీమహాలక్ష్మిని రాణివాసముగా నేలుచున్న వెలుఁగు మమ్ము ఆనందింపఁజేయునుగాక!

శ్లో. *అంకూరిత స్మేర దశా విశేషై:*
అశ్రాన్త హర్షామృతవర్ష మక్ష్ణామ్ ।
సంక్రీడతాం చేతసి గోపకన్యా
ఘనస్తన స్వస్త్యయనం మహో న: ॥ 45

అన్వయము:- (కిమపి) మహ: న: చేతసి సంక్రీడతామ్=(ఒకానొక) వెలుఁగు మా చేతమునందు క్రీడించునుగాక!

అర్థము :- అక్ష్ణామ్=కన్నులకు, అశ్రాంత=తెఱపిలేని, హర్షా=ఆనందము యొక్క, అమృతవర్షమ్=అమృతపు వాన సోనయైన, గోపకన్యా=గోపవధూజనము యొక్క, ఘనస్తన= పీన కుచ మండలములకు, స్వస్త్యయనమ్=శ్రేయోమార్గమైన, మహ:=వెలుఁగు, న:=మా యొక్క, చేతసి=చేతమునందు, అంకూరిత=మొలక లెత్తిన, స్మేర=వికస్వరములైన, దశావిశేషై:=అవస్థా విశేషములతో, సంక్రీడతామ్=క్రీడించునుగాక!

తాత్పర్యము:- కన్నుదోయికి విడుమర లేని హర్షామృతవర్ష స్వరూపమైనదియును, గోపవధూ స్తనమండలములకు శ్రేయ:పథమునైన, వెలుఁగు మా చేతమునందు మొలకలెత్తిన వికాస దశావిశేషములతో క్రీడించుచుండునుగాక!

శ్లో. *మృగమదపంక సంకర విశేషిత వన్యమహో*
గిరితట గండ గైరిక ఘనద్రవ విద్రుమితమ్ ।
అజిత భుజాంతరం భజత! హే బత! గోపవధూ
స్తనకలశ స్థలీ ఘుసృణ మర్దన కర్దమితమ్ ॥ 46

అన్వయము :- అజిత భుజాంతరమ్ భజత హే! బత!=అచ్యుతని బాహోమధ్య ప్రదేశమును ఓయీ! సేవించుటకు రారో! (జయింపరాని వాడైన కృష్ణునియొక్క ఱొమ్మును ఓజనులారా! సేవింపుఁడు!).

అర్థము:- మృగమద పంక=కస్తూరీ పంకముతోడి, సంకర=సమ్మేళనముతో, విశేషిత=అతిశయించిన, వన్య=వనమధ్యమునందలి, మహాగిరితట=పెద్ద కొండ చఱియ యందలి, గండ=పెద్ద శిల నుండి స్రవించుచున్న, గైరిక ఘనద్రవ=గైరికధాతుద్రవముచేత, విద్రుమితమ్=పవడపువన్నె కలదిగాఁజేయఁబడినట్లున్న, గోపవధూ=గోపయువతుల యొక్క, స్తనకలశ=కుచకుంభముల యొక్క, స్థలీ=నిమ్నోన్నత ప్రదేశముల యందలి, ఘుసృణ=కుంకుమ ద్రవము యొక్క, మర్దన=సమ్మర్దము చేత, కర్దమితమ్=అసలూరుచున్న, అజిత=అచ్యుతుని యొక్క, భుజాంతరమ్=బాహో మధ్యప్రదేశమును, బత=ఓయీ!, భజత హే=సేవించుటకు రారో!

తాత్పర్యము:- కస్తూరీద్రవమంటి బురదలాఱుచున్న - అడవిలోని కొండ చఱియప్రక్కనున్న - పెద్దశిలనుండి స్రవించుచున్న - జేగురు నీళ్లతో పవడపు వన్నె కలదాని వలెనున్న - గొల్ల జవరాండ్ర కుచకుంభముల - ఎత్తు పల్లములలో నున్న - కుంకుమ నీటి యొక్క - పులుముడుచేత బురద లూరుచున్న - అజితుని యొక్క (విష్ణుని యొక్క) బాహో మధ్య ప్రదేశమును ఆశ్రయింప రారో !

శ్లో. ***అమూల పల్లవిత లీల మపాంగ జాలై:***
ఆసించతీ భువన మాదృత గోపవేషా ।
బాలాఽకృతి ర్మృదుల ముగ్ధ ముఖేందుబింబా
మాధుర్యసిద్ధి రవతా న్మధువిద్విషో న: ॥ 47

అన్వయము:- భువన మాసించతీ మధువిద్విషో మాధుర్యసిద్ధి: న: అవతాత్=విశ్వమును తడుపుచున్న మధుసూదనునియొక్క మాధుర్య పరిణతి మమ్ము రక్షించునుగాక!

అర్థము:- అపాంగ జాలై:=కటాక్ష సమూహములచేత, ఆమూల పల్లవిత లీలమ్-ఆమూల=కాండమునుండి, పల్లవిత=చిగిరించిన, లీలమ్=విలాసముగలదానినిగా, భువనమ్=విశ్వమును, ఆసించతీ=తడుపుచున్నదియై, ఆదృత=స్వీకరింపఁబడిన, గోపవేషా=గోపవేషము గలదియై, బాలాఽకృతి:=బాలుని ఆకృతి గలదియై, మృదుల=సుకుమారమును, ముగ్ధ=సుందరమునైన, ముఖేందుబింబా=ముఖచంద్రబింబము గల,

మధువిద్విషః=మధుసూదనునియొక్క, మాధుర్యసిద్ధిః=మాధుర్యపరిణతి, నః=మమ్ము, అవతాత్=రక్షించునుగాక.

తాత్పర్యము:- మృదుల ముగ్ధ ముఖచంద్ర బింబముతో గోపవేషమును స్వీకరించి బాలాకృతియై తన కటాక్షజాలములతో సమస్త భువనమును కాండమునుండి చిగురు తొడిగిన విలాసము గలదానినిగా తడుపుచున్న-మధువైరి యొక్క మాధుర్యసిద్ధి-మమ్ము కాపాడునుగాక!

శ్లో. *విరణ న్మణినూపురం వ్రజే*
చరణామ్భోజ ముపాస్వ శార్జ్గిణః ।
సరసే సరసి శ్రియాశ్రితం
కమలం వా కలహంస నాదితమ్ వా ॥ 48

అన్వయము :- శార్జ్గిణః చరణాంభోజమ్ ఉపాస్వ= విష్ణుని యొక్క అడుగుదమ్మిని ఉపాసింపుము.

అర్థము:- వ్రజే=వ్రజభూమియందు, విరణత్=రవళించుచున్న, మణినూపురమ్= మణి మంజీరములుగల, శార్జ్గిణః=శార్జ్గధన్వునియొక్క (విష్ణుని యొక్క), చరణాంభోజమ్= అడుగుఁదమ్మిని, ఉపాస్వ=ఉపాసింపుము!, సరసే=సరసమైన, సరసి=సరస్సునందు, శ్రియా=లక్ష్మిచేత, ఆశ్రితమ్=సేవింపఁబడిన, కమలం వా=కమలము వంటిదానిని, కలహంస నాదితం వా=కలహంసకూజితము వంటిదానిని, (చరణము కమలము వంటిది - మణినూపుర రణితము - కలహంస కూజితము వంటిది). ఇచ్చటి 'వా' వికల్పార్థకము కాదు. ఇవార్థకమని తెలియునది.

తాత్పర్యము:- రవళించుచున్న అందెలతో వ్రజభూమి యందు నడయాడుచున్న బాలగోపవేషధరుఁడైన శార్జ్గి యొక్క చరణాంభోజమును ఉపాసింపుము. ఆ చరణాంభోజము-లక్ష్మీసమాశ్రితమైన సరస సరః కమలమో! ఆ నూపుర శింజితము-కలహంస కంఠ కలకూజితమో! అని ఆశయము.

శ్లో. *శరణ మశరణానాం శారదాంభోజనేత్రం*
నిరవధి మధురిమ్నా నీలవేషేణ రమ్యమ్ ।
స్మరశర పరతంత్ర స్మేర నేత్రాంబుజాభిః
వ్రజయువతిభి రవ్యాద్ బ్రహ్మ సంవేష్టితం నః ॥ 49

అన్వయము :- బ్రహ్మన: అవ్యాత్=పరబ్రహ్మము మమ్ము రక్షించునుగాక!

అర్థము:- అశరణానామ్=దిక్కులేనివారికి, శరణమ్=దిక్కైనదియును, శారద= శరత్కాలమునందలి, అంభోజ=తామరపూలవంటి, నేత్రమ్=కన్నులు గలదియును, నిరవధి= నిస్సీమమైన, మధురిమ్ణా=మాధుర్యముగల, నీలవేషేణ=నీలవర్ణముతో, రమ్యమ్= హృదయంగమమైనదియును, స్మరశర=మదనబాణములకు, పరతంత్ర=పరవశములైన, స్మేర=వికాసభాసురములైన, నేత్రాంబుజాభి:=నయనాంబుజములుగల, వ్రజ యువతిభి:= మంద ప్రోయాంద్రచేత, సంవేష్టితమ్=పరివేష్టింపఁబడియున్న, బ్రహ్మ=పరబ్రహ్మము, న:=మమ్ము, అవ్యాత్=రక్షించునుగాక.

తాత్పర్యము:- దిక్కులేనివారికి దిక్కైనదియు, శరత్కాలమునందలి తామర పూవులవంటి కన్నులు గలదియును, నిస్సీమ మధురమైన నీలవర్ణముతో హృదయాభిరామ మైనదియు, మదనశర పరవశములైన కనుదమ్ములుగల మందప్రోయాంద్రచేత పరివేష్టింపఁబడియున్న పరబ్రహ్మము మమ్ము కాపాడునుగాక!

శ్లో. *సువ్యక్త కాంతిభర సౌరభ దివ్యగాత్రమ్*
అవ్యక్త యౌవన పరీత కిశోరభావమ్ ।
గవ్యానుపాలన విధా వనుశిష్ట మవ్యాత్
అవ్యాజ రమ్య మఖిలేశ్వర వైభవం న: ॥ 50

అన్వయము:- అఖిలేశ్వర వైభవం న: అవ్యాత్!=సర్వేశ్వరునియొక్క వైభవము మమ్ము కాపాడునుగాక!.

అర్థము:- సువ్యక్త=మిక్కిలి వెల్లడియైన, కాంతిభర=కాంతి సమృద్ధియు, సౌరభ= ఘ్రాణ సంతర్పణమైన సహజగంధముతోఁ గూడిన, దివ్యగాత్రమ్=దివ్యశరీరముగలదియును, అవ్యక్త=వెల్లడికాని, యౌవన=పరువముతో, పరీత=వ్యాపింపఁబడిన, కిశోరభావమ్=కిశోర భావము కలదియును, గవ్య=ఆలపాడి మమ్మరముయొక్క, అనుపాలన విధౌ=అరయిక యందు, అనుశిష్టమ్=పనివడిన, అవ్యాజ రమ్యమ్=నిసర్గ హృదయంగమమైన, అఖిలేశ్వర= సర్వేశ్వరునియొక్క, వైభవమ్=వైభవము, న:=మమ్ము, అవ్యాత్=కాపాడునుగాక!

తాత్పర్యము:-మిక్కిలి విస్పష్టములైన కాంతి-సౌరభ భరములతో నిండిన దివ్యశరీరము గలదియును, వెల్లడికాని పరువముతో నిండిన కోమల కిశోరభావముగలదియును, ఆలపాడి మమ్మరమును అరయు నుద్యోగమునందు

నియుక్తమైనదియును, నిసర్గహృదయంగమమైన సకలేశ్వరుని వైభవము మమ్ము కాపాడునుగాక!

శ్లో. అనుగత మమరీణా మంబరాలంబినీనాం
నయన మధురిమశ్రీ నర్మ నిర్మాణ సీమ్నామ్ ।
వ్రజయువతి విలాస వ్యాపృతాపాంగ మవ్యాత్
త్రిభువన సుకుమారం దేవ కైశోరకం నః ॥ 51

అన్వయము:- దేవ కైశోరకమ్ నః అవ్యాత్!=శ్రీకృష్ణస్వామియొక్క కిశోరభావము మమ్ము రక్షించునుగాక!

అర్థము:- నయన మధురిమశ్రీ=నేత్ర మాధుర్యలక్ష్మికిని, నర్మ=శృంగార పరిహాసములకు, నిర్మాణ=నిర్మాణ సౌష్ఠవమునకు, సీమ్నామ్=చరమసీమలయినట్టియు, అంబర=అంబరమును, ఆలంబినీనామ్=ఆలంబించియున్న, అమరీణామ్=అప్సరః స్త్రీలకు, అనుగతమ్=అనుగమింపఁబడినదియును, వ్రజయువతి=వ్రజసుందరులయొక్క, విలాస=విలాసములయందు, వ్యాపృత=తగుల్కొనిన, అపాంగమ్=నయనాంచలములు గలదియును, త్రిభువన=ముల్లోకములయందును, సుకుమారమ్=నేవళమయిన, దేవ=శ్రీకృష్ణ స్వామియొక్క కైశోరకమ్=కిశోరభావము, నః=మమ్ము, అవ్యాత్=రక్షించునుగాక!

తాత్పర్యము:- నేత్రమాధుర్యలక్ష్మికిని, శృంగార పరిహాసమునకును, నిర్మాణ శోభకును, చరమసీమలైన, అంబరమును (ఆకాశమును-చీరలను) ఆలంబించియున్న అప్సరఃస్త్రీలచేత అనుగమింపఁబడినదియును, వ్రజ సుందరీ విలాసముల యందు సంసక్తమైన నయనాంచలములు గలదియును, త్రిభువనైక సుకుమారమునైన శ్రీకృష్ణదేవునియొక్క కిశోరభావము మమ్ము కాపాడునుగాక!

శ్లో. ఆపాద మాచూడ మతిప్రసక్తైః
ఆపీయమానా యమినాం మనోభిః ।
గోపీజన జ్ఞాతరసావతా న్న :
గోపాల భూపాల కుమార మూర్తిః ॥ 52

అన్వయము :- గోపాలభూపాల కుమారమూర్తిః నః అవతాత్!=నందుని కుమారునియొక్క ఆకృతి మమ్ము రక్షించునుగాక!

అర్థము:- అతిప్రసక్తైః=మిక్కిలిసంసక్తములైన, యమినామ్=యోగీశ్వరుల యొక్క, మనోభిః=మనస్సులచేత, ఆపాదమ్-ఆచూడమ్=పాదములనుండి సిగవఱకును, ఆపీయమానా=ఆస్వాదింపబడుచున్నదియును, గోపీజన=గోపికాజనముచేత, జ్ఞాతరసా=అనుభవింపఁబడిన మాధుర్యముగల, గోపాలభూపాల కుమారమూర్తిః - గోపభూపాల=యాదవుల ప్రభువైన నందునియొక్క, కుమార=పుత్రునియొక్క (శ్రీకృష్ణునియొక్క), మూర్తిః=ఆకృతి, నః=మమ్ము, అవతాత్=రక్షించునుగాక!

తాత్పర్యము:- తదేక ప్రవణములైన యోగీశ్వరుల యొక్క అంతః కరణములచేత ఆపాదచూడముగా ఆస్వాదింపఁబడుచున్నదియును, గోపికాజనములు చవి యెఱిగినదియు నయిన, నందనందనుని యొక్క ఆకృతి మమ్ము కాపాడునుగాక!

> శ్లో. **దిష్ట్యా బృందావన మృగదృశాం విప్రయోగాకులానాం**
> **ప్రత్యాసన్నం ప్రణయ చపలాపాంగ వీచీ తరంగైః ।**
> **లక్ష్మీలీలా కువలయదళ శ్యామలం ధామ కామాన్**
> **పుష్ణీయా న్నః పులక ముకుళాభోగ భూషావిశేషమ్ ॥** 53

అన్వయము:- (కిమపి) ధామ నః కామాన్ పుష్ణీయాత్!=(ఒకానొక) వెలుఁగు మా కోర్కులను పోషించునుగాక!

అర్థము:- విప్రయోగ=వియోగములవలన, ఆకులానామ్=వ్యాకులభావమును పొందిన, బృందావన=బృందావనమునందలి, మృగదృశామ్=స్త్రీలయొక్క, దిష్ట్యా=భాగ్య వశముచేత, ప్రణయ=ప్రేమచేత, చపల=చంచలములైన, అపాంగ=నయనాంచలములే యనెడి, వీచీతరంగైః=తరంగపరంపరలచేత, ప్రత్యాసన్నమ్=చేరువయైనదియును, లక్ష్మీ=లక్ష్మీదేవియొక్క, లీలా=లీలాగృహీతమైన, కువలయ=నల్లకలువయొక్క, దళ=ఱేకులవలె, శ్యామలమ్=నీలవర్ణమైనదియును, పులక ముకుళ=రోమాంచ కోరకముల యొక్క, ఆభోగ=పరిపూర్ణతయే, భూషావిశేషమ్=అదనపు నగగాకల, ధామ=వెలుఁగు, నః=మాయొక్క, కామాన్=కోర్కులను, పుష్ణీయాత్=పోషించునుగాక!

తాత్పర్యము:- వియోగ వ్యాకులలైన బృందావనమునందలి గోపహరిణాక్షుల యొక్క భాగ్యవిశేషముచేత ప్రణయచంచలములైన కటాక్షతరంగపరంపరలతో చేరువయైనదియును, లక్ష్మీదేవి యొక్క లీలా కువలయ దళ శ్యామలమును, మొగ్గతొడిగిన నెమ్మేని గగురింతయే ఒక క్రొత్త ఆభరణముగాగల ఒకానొక వెలుఁగు మాయొక్క కోర్కులను తీర్చును గాక !

శ్లో. *జయతి గుహ శిఖీంద్ర పింఛ మౌళిః*
సురగిరి గైరిక కల్పితాంగరాగః ।
సురయువతి వికీర్ణ సూనవర్ష
స్నపిత విభూషిత కున్తలః కుమారః ॥ 54

అన్వయము:- కుమారః జయతి=యశోద కుమారుఁడు సర్వోత్కర్షతో ప్రకాశించుచున్నాడు.

అర్థము:- గుహ=కుమారస్వామి యొక్క, శిఖీంద్ర=మయూరేంద్రము యొక్క, పింఛ=బర్హమే, మౌళిః=శిరోభూషణముగా కలవాఁడును, సురగిరి=మేరుపర్వతము యొక్క, గైరిక=గైరికధాతువుచేత, కల్పిత=విరచింపఁబడిన, అంగరాగః=మైపూఁతకలవాఁడును, సురయువతి=అప్సరఃస్త్రీలచేత, వికీర్ణ=విరఁజిమ్మఁబడిన, సూనవర్ష=పూలసోనచేత, స్నపిత=జలకములాడింపఁబడిన, విభూషిత=అలంకరింపబడిన, కుంతలః=కేశములు గల, కుమారః=యశోదకొడుకు, జయతి=సర్వోత్కర్షచేత వర్తించుచున్నాఁడు.

తాత్పర్యము :- కుమారస్వామి వాహనమైన మదశిఖావళేంద్రము యొక్క పింఛమును తన మౌళిభూషణముగా నలంకరించికొన్నవాఁడును, మేరుపర్వతముయొక్క గైరికధాతు ద్రవముతో మైపూఁత నలవరించి కొన్నవాఁడును, అప్సరఃస్త్రీలు విరఁజిమ్మిన పూలసోనవానలలో జలకములాడించి అలంకరింపఁబడినవాడును అయిన యశోద కుమారుఁడు సర్వోత్కర్షతో ప్రకాశించుచున్నాఁడు.

శ్లో. *మధుర మంద శుచిస్మిత మంజులం*
వదనపంకజ మంగజవేల్లితమ్ ।
విజయతాం వ్రజ బాలవధూజన
స్తనతటీ విలుఠ న్నయనం విభోః ॥ 55

అన్వయము:- విభోః అంగజవేల్లితమ్ విజయతామ్!=శ్రీకృష్ణస్వామియొక్క మన్మథభావము జయించునుగాక!

అర్థము:- విభోః=స్వామియొక్క, మధుర మంద=తీయని మెల్లని, శుచిస్మిత=తెలి నవ్వుతో, మంజులం=సుందరమైన, వదనపంకజమ్=ముఖపద్మము, వ్రజ=వ్రజమునందలి,

బాలవధూ=లేజవరాంధ్రయొక్క, స్తనతటీ=చనుగ్రేవలయందు, విలుఠత్=తొట్రిలుచున్న, నయనమ్=కన్నులుగల, అంగజవేల్లితమ్=మన్మథభావము, విజయతామ్=జయించునుగాక!

తాత్పర్యము:- స్వామియొక్క మందమధురమైన తెలినవ్వుతో సొగసైన ముఖపద్మము, వ్రజసీమయందలి లేజవరాంధ్ర చనుగ్రేవలయందు తొట్రుపడుచున్న కన్నులు గల మదన విలాలసము జయించునుగాక!

శ్లో. ***అలస విలస న్ముగ్ధ స్నిగ్ధ స్మితం వ్రజసుందరీ***
మదన కదన స్విన్నం ధన్యం మహద్వదనాంబుజమ్ ।
తరుణ మరుణ జ్యోత్స్నా కార్ష్ణ్య స్మిత స్నపితాధరం
జయతి విజయ[4]శ్రేణీ మేణీదృశాం మదయన్మహః ॥ 56

(అన్వయము:- మహద్వదనాంబుజమ్ జయతి=(శ్రీకృష్ణుని) గొప్పదైన మోము(దామర సర్వోత్కర్షముతో వర్తించుచున్నది.

అర్థము:- 'అలస విలస న్ముగ్ధ స్నిగ్ధ స్మితం' - అలస=మందమైనదియు, విలసత్=ప్రకాశించుచున్నదియు, ముగ్ధ=సుందరమైనదియు, స్నిగ్ధ=స్నేహముతో(గూడినదియు - లేక నిద్దపు మెఱుఁగులు గలదియు, అగు , స్మితం=చిఱునవ్వుగలదియు; 'వ్రజసుందరీ మదన కదనస్విన్నమ్' - వ్రజసుదరీ=గొల్లచెలువలతోడి, మదనకదన=మన్మథ యుద్ధముచేత - రతిక్రీడచేత, స్విన్నం=చెమర్చినదియు; ధన్యం=కృతార్థమైనది - నిరుపాధిక సుందరమైనదియు, తరుణ=లేఁతయైనదియు - ఎలపరువముతోఁగూడినదియు; 'అరుణ జ్యోత్స్నా కార్ష్ణ్య స్మిత స్నపితాధరం' - అరుణ=ఎఱ్ఱని, జ్యోత్స్నా=వెన్నెలయొక్క, కార్ష్ణ్య=అంతయునైన - ఎఱ్ఱని వెన్నెల పెంపు సొంపారుచున్న, స్మిత=చిఱునగవుచేత, స్నపిత=తడుపఁబడిన, అధరం=మోవిగలదియు - వ్రజసుందరీ మదన కదనమునందుఁ గలిగిన పలుగంట్లచే మోవి యెఱ్ఱని కాంతులు మఱియు నినుమడింపఁగా దానిపైఁబొలసిన చిఱునవ్వు, తెలుపుమాని యెఱ్ఱనై యెఱ్ఱని వెన్నెలవలెఁ బ్రకాశించినదనుట - తెల్లని చిఱునవ్వును ఎఱ్ఱగా మార్చునంతటి యెఱ్ఱని కాంతి పెదవికిఁగలిగించుటకై యందు దంతక్షతములు మిక్కిలిగా నుండుననియు, దానిచే గోపికలతోడి మదనకదనము మిక్కిలి గాఢమైనదనియుఁ, గావుననే యట్టి రతిశ్రమముచే నలఁగి చెమర్చిన ముఖమును 'ధన్యం' అనినాఁడనియుఁ దెలియునది. ఇట్టిదియు, మహః=తేజోరూపమైనదియు - తేజోమయమైనది

---

4 'విజయి' (పాఠాంతరము)=జయశీలమైనదియు - సర్వాతిశాయి యైనదియు

గావున కేవల తేజమని చెప్పినాఁడు, ఇట్టిదగు, 'మహద్వదనాంబుజమ్' మహత్=గొప్పదైన, వదన+అంబజమ్=మోముఁదామర - కృష్ణుని తామరవంటి మొగమనుట - ఇట, 'వ్రజసుందరీ' అనువ్యావర్తకముచేఁ గృష్ణుని గ్రహించునది. ఏణీదృశాం=(లేడివంటి కన్నులుగల) స్త్రీలయొక్క, విజయశ్రేణీం=గెలుపు వరుసను, ఇచట, 'విజయ' మనఁగా కార్యసిద్ధిగావున - కోర్కుల యొడఁగూడుట యగును. కనుక వరుసగా వారి కోర్కులెల్ల నొడగూడుటను, మదయన్=మదింపచేయుచు - అతిశయింపఁజేయుచు - వారి కోర్కులను మీఁదు మిక్కిలి యొడఁగూర్చుననుట, లేక 'విజయి శ్రేణీ మేణీ దృశామ్' అను పాఠమును గ్రహించినచో, విజయి=జయశీలమైనదియు - సర్వాతిశాయియైనదియు, ఏణీదృశామ్=స్త్రీలయొక్క, శ్రేణీం=సమూహమును, మదయన్=మదింపఁజేయుచున్నదియు - మరులుగొనఁజేయునది యని అర్థము. ఇట్టిదగుచు, జయతి=సర్వోత్కర్షముతో వర్తించుచున్నది.

తాత్పర్యము:- సోగసై ప్రకాశించుచున్న చిఱునగవుతోఁగూడి, గొల్లచెలువలతోడి రతిక్రీడలచేఁజెమర్చి, యింతింతన రాని సొంపుపెంపుగులుగుచు, ఎలపరువంపు మురువు మీఱ, చిఱునవ్వు పొలసి, యెల్లని వెన్నెలవలెఁజెన్నారుచున్న కెమ్మోవిగలిగి, చూచు స్త్రీలకుఁగోరిన గోర్కులు అవ్వారివాఁదీర్చునట్టి కృష్ణ ముఖారవిందము సర్వోత్కర్షముతో వర్తించుఁగాక!)

శ్లో. *రాధాకేళి కటాక్ష వీక్షిత మహా వక్షఃస్థలీ మండనాః*
జీయాసుః పులకాంకురా స్త్రిభువన స్వాదీయస స్తేజసః ।
క్రీడాంత ప్రతిసుప్త దుగ్ధతనయా ముగ్ధావబోధక్షణ
త్రాసాఽఽరూఢ దృఢోపగూహన మహాసామ్రాజ్య సాంద్రశ్రియః ॥ 57

అన్వయము:- త్రిభువన స్వాదీయసః తేజసః పులకాంకురాః జీయాసుః!=త్రిలోక స్వాదిష్ఠమైన వెలుఁగుయొక్క పులకలమొలకలు వర్ధిల్లునుగాక!

అర్థము:- రాధా=శ్రీరాధాదేవియొక్క, కేళి=కేళియందలి, కటాక్ష=నయనాంచలముల చేత, వీక్షిత=చూడఁబడిన, మహావక్షఃస్థలీ=విశాలవక్షఃస్థలికి, మండనాః=తొడుగని నగలును, క్రీడాంత=రతిక్రీడాంతమునందు, ప్రతిసుప్త=తిరిగి నిద్రించిన, దుగ్ధతనయా=దుగ్ధాబ్ధి తనయయొక్క, ముగ్ధ=అమాయికమైన, అవబోధక్షణ=జాగరిత క్షణమువలని, త్రాస=బెదరుచేత, ఆరూఢ=పైకొనఁబడిన, దృఢోపగూహన=గాటపు కౌఁగిలియేయనెడి, మహాసామ్రాజ్య=మహాసామ్రాజ్యముయొక్క, సాంద్రశ్రియః=దట్టపుసిరులైన, త్రిభువన

స్వాదీయసః=త్రిలోక స్వాదుతమమైన, తేజసః=వెలుఁగుయొక్క, పులకాంకురాః=పులకల మొలకలు, జీయాసుః=వర్ధిల్లునుగాక!

తాత్పర్యము:- కేళిసమయమునందలి శ్రీరాధాకటాక్ష వీక్షితమైన విశాలవక్షఃస్థలికి పెట్టనిగలై-అంతకుమున్ను రతిక్రీడాంతమునందు తిరిగినిద్రించిన శ్రీదుగ్ధాబ్ధి కన్యకయొక్క ముగ్ధప్రబోధ క్షణమువలని భయయు పైకొనిన (స్వామి యొక్క) గాఢాలింగనమేయనెడి మహాసామ్రాజ్యము యొక్క ముమ్మరించిన సిరులవలె నున్న-త్రిలోకస్వాదిష్ఠమైన వెలుఁగు యొక్క (శ్రీకృష్ణస్వామియొక్క) పులకల మొలకలు వర్ధిల్లునుగాక!

శ్లో. *స్మిత స్నుత సుధాధరా మదశిఖండి బర్హాంకితాః*
విశాల నయనాంబుజా వ్రజ విలాసినీ వాసితాః ।
మనోజ్ఞ ముఖపంకజా మధుర వేణునాద ద్రవాః
జయంతి మమచేతస శ్చిర ముపాసితా వాసనాః ॥ 58

అన్వయము :- మమ వాసనాః జయంతి=నా సంస్కారములు పెంపొందుచున్నవి.

అర్థము:- స్మితస్నుత=నవ్వుచేపిన, సుధాధరాః=అమృతాధరము కలవియును, మదశిఖండి=మత్త మయూరము యొక్క, బర్హ=పింఛముతో, అంకితాః=లాంఛితములును, విశాల నయనాంబుజాః=వెడఁదలైన కన్నుదామరలు గలవియును, వ్రజవిలాసినీ వాసితాః=వ్రజమునందలి విలాసినుల చేత పరిమళింపఁజేయబడినవియును, మనోజ్ఞముఖ పంకజాః=సుందరముఖపద్మముకలవియును, మధురవేణునాదద్రవాః=మధురమైన పిల్లన గ్రోవియొక్క నాదరసముగలవియును, మమచేతసః=నా చేతస్సు యొక్క, చిరము పాసితాః=చిరకాలోపాసితములునైన, వాసనాః=సంస్కారములు, జయంతి= పెంపొందుచున్నవి.

తాత్పర్యము:- నవ్వుచేపిన అమృతాధరము కలవియును, మత్త మయూర పింఛ లాంచితములును, విశాల నయనాంబుజములును, వ్రజవిలాసినీ సువాసితములును, మనోజ్ఞముఖారవిందములును, మధుర వేణునాదామృతములును, నా చేతస్సునకు చిరకాలోపాపితములునైన సంస్కారములు పెంపొందుచున్నవి.

శ్లో. *జీయా దసౌ శిఖిశిఖండ కృతావతంసా*
సాంసిద్ధికీ సరస కాన్తి సుధా సమృద్ధిః ।

యద్బిందు లేశ కణికా పరిమాణ భాగ్యః
సౌభాగ్యసీమ పద మంచతి పంచబాణః ॥ 59

అన్వయము:- అసౌ సరసకాంతి సుధా సమృద్ధిః జీయాత్!=ఈ సరసమైన కాంతి యనెడు అమృతముయొక్క పెంపు సర్వోత్కృష్టమగుగాక!

అర్థము:- శిఖి=నెమలి యొక్క, శిఖండ=బర్హముచేత, కృత=విరచితమైన, అవతంసా=శిరోభూషకల, అసౌ=ఈ, సాంసిద్ధికీ=స్వతస్సిద్ధమైన, సరస=సరసమైన, కాంతి=కాంతియనెడు, సుధాసమృద్ధిః=అమృతసంపద, జీయాత్=సర్వోత్కర్షతో వర్ధిల్లునుగాక, యత్=ఏకాంతి సంపద యొక్క, బిందులేశ=బిందులేశము యొక్క, కణికా=కణముయొక్క, పరిమాణభాగ్యః= పరిమాణమగుభాగ్యము గలవాఁడై, పంచబాణః=మన్మథుఁడు, సౌభాగ్య=సుభగత్వము యొక్క, సీమ=పరమావధి యొక్క, పదమ్=స్థానమును, అంచతి=పొందుచున్నాడో!

తాత్పర్యము:- నెమలి పించియమును అవతంసముగా సవరించికొనిన ఈ స్వయంసిద్ధ సరసకాంతి సమృద్ధి సర్వోత్కృష్టమై వర్ధిల్లుగాక! ఏకాంతి బిందులేశము యొక్క కణికాపరిమాణమగు భాగ్యమునకు నోచికొనిన పంచబాణుఁడు సుభగత్వమునకు పరమావధిస్థానమును అలంకరించుచున్నాఁడో! (ఆకాంతి).

శ్లో. *ఆయామేన దృశో ర్విశాలతరయో రక్షయ్య, మార్ద్రస్మిత*
చ్ఛాయాధర్షిత శారదేందులలితం, చాపల్యమాత్రం శిశోః ।
ఆయాసా నవరాన్ విధూయ రసికై రాస్వాద్యమానం ముహుః
జీయా దున్మద వల్లవీ కుచభరాధారం, కిశోరం మహః ॥ 60

అన్వయము :- కిశోరం మహః జీయాత్!=కిశోరరూపమైన వెలుఁగు జయించునుగాక!

అర్థము:- విశాలతరయోః=మిక్కిలి విశాలములైన, దృశోః=కన్నులయొక్క, ఆయామేన=పొడవుచేత, అక్షయ్యం=తుదినెఱుగుటకు అలవికాని, లలితం=సుందరమైన, శిశోః=శిశువుయొక్క, చాపల్యమాత్రం=చాపల్యమొక్కటియే, ఆర్ద్ర= కరుణార్ద్రమైన, స్మితచ్ఛాయా=స్మితకాంతిచేత, ధర్షిత=గదుమఁబడిన, శారదేందు=శరత్ కాలచంద్రుఁడు కలది, అపరాన్=ఇతరములైన, ఆయాసాన్=ఆయాసములను, విధూయ=విదలించికొని, ముహుః=మాటిమాటికిని, రసికైః=రసజ్ఞులచేత, ఆస్వాద్యమానం=ఆస్వాదింపఁబడుచున్న,

ఉన్మద=ఉదుటుగల, గోపికా=గోపికలయొక్క, కుచభర=చనుగవలే, ఆధారం=ఆధారముగాఁ గల, కిశోరం=కిశోరరూపమైన, మహః=వెలుఁగు, జీయాత్=జయించునుగాక!

తాత్పర్యము :- విశాలవిలోచనముల వైశాల్యముచేత అక్షయ్యమై, శిశుసహజ లలిత చాపల్యమాత్రమై - కరుణార్ద్రస్మితకాంతిచేత శరత్కాల చంద్రబింబమును బెదరించుచు, రసజ్ఞులచేత ఇతరాయాసములను ప్రక్కకునెట్టి పునఃపునరాస్వాద్యమానమై, ఉన్మద గోపీస్తనయుగళాధారమగు కిశోర రూపములోనున్న వెలుఁగు వర్ధిల్లునుగాక!

శ్లో. *స్కంధావారసదో వ్రజః కతిపయే గోపా స్సహాయాదయః*
స్కంధాఽలంబిని వత్సదామ్ని ధనదా గోపాంగనాః స్వాంగనాః ।
శృంగారా గిరిగైరికం శివ శివ! శ్రీమంతి బర్హాణి చ
శృంగగ్రాహికయా తథాఽపి తదిదం ప్రాహు స్త్రిలోకేశ్వరమ్ ॥ 61

అన్వయము :- తదిదం శృంగగ్రాహికయా త్రిలోకేశ్వరమ్ ప్రాహుః=ఆ యీ తేజమును శృంగగ్రాహికాన్యాయము ననుసరించి త్రిజగదీశ్వరునిగా పలుకుచున్నారు.

అర్థము :- వ్రజః=వలసప్రజల కావాసమైన వ్రేపల్లెయే, స్కంధావారసదః=సేనవిడిసిన తావునందలి సదస్సు. కతిపయే=పరిమిత సంఖ్యాకులైన, గోపాః=గోపాలకులే, సహాయాదయః=అమాత్యాది పరివారము, వత్సదామ్ని=దామెన (దూడలను కట్టెడి పలుపు), స్కంధాఽలంబినిసతి=మూఁపునందువ్రేలాడుచుండగా, ధనదా=పన్నిచ్చువారు - మూఁపున వ్రేలుచున్న దూడపలుపే రాజదండము. దానిని జూచియే గొల్లలు పన్నిచ్చుచున్నారనుట. దీనిచే పరికర సంపత్తియు లేదనుట. గోపాంగనాః= వ్రేఁతలే, స్వాంగనాః=నిజవనితలు; గిరి=కొండ యందలి, గైరికమ్=జేగురుజాయి, శ్రీమంతి=శ్రీమంతములైన, బర్హాణిచ=నెమలి పింఛములును, శృంగారాః=అలంకరణ సామగ్రులు; తథాఽపి=అట్లయినను, తదిదమ్=ఆయీ తేజమును, శృంగగ్రాహికయా= శృంగగ్రాహికాన్యాయము ననుసరించి, త్రిలోకేశ్వరమ్=త్రిజగదీశ్వరునిగా, ప్రాహుః=పలుకుచున్నారు.

తాత్పర్యము :- గొల్లలవలసయే పేరోలగము! పరిమిత సంఖ్యలోనున్న గొల్లలే అమాత్యాది పరివారము! మూపున వ్రేలాడుచున్న దూడలపలుపే రాజదండము; గోపాంగనలే స్వీయాంగనలు! కొండ జేగురుజాళ్లును నెమలి యీకలును ముస్తాబుసామగ్రి!

---

5 'గణనా' (పాఠాంతరము)=పరిగణనము

అయినప్పటికిని ఈ చిఱుతప్రాయపు తేజునే త్రిజగదీశ్వరునిగా శృంగగ్రాహికా న్యాయము ననుసరించి - ఉజ్జాయించి చెప్పుచున్నారు.

శ్లో. **శ్రీమ ద్బర్హిశిఖండ మండన జుషే శ్యామాభిరామ త్విషే**
లావణ్యైకరసావసిక్త వపుషే లక్ష్మీసరః ప్రావృషే ।
లీలాకృష్ట రసజ్ఞధర్మ మనసే లీలామృతస్రోతసే
కేవా నస్పృహయన్తి హన్త మహసే గోపీజనప్రేయసే ॥ *62*

అన్వయము:- (కస్మైచిత్) మహసే కేవా నస్పృహయంతి? హంత!=(ఒకానొక) వెలుఁగు కొఱకు ఎవ్వరుగాని మనసుపడకుందురు? అవురా!

అర్థము:- శ్రీమత్=శ్రీమంతమైన, బర్హిశిఖండ=నెమలి పింఛమే అనెడు, మండనజుషే=ఆభరణము దాల్చినట్టియును, శ్యామ=నీలవర్ణమైన, అభిరామ=హృదయంగమమైన, త్విషే=వెలుఁగుకలట్టియు, లావణ్యైకరస=లావణ్యరసముచేతనే, అవసిక్త=తడుపఁబడిన, వపుషే=నెమ్మేనుగలట్టియు, లక్ష్మీసరః=లక్ష్మీదేవియేఅనెడి సరోవరమునకు, ప్రావృషే=వర్షాకాలమయినట్టియు, లీలా=లీలాప్రపంచముచేత, ఆకృష్ట=ఆకర్షింపబఁడిన, రసజ్ఞధర్మ=రసజ్ఞధర్మముగల, మనసే=మానసముగలట్టియు, లీలా=లీలలకు, అమృతస్రోతసే=అమృత ప్రవాహ మైనట్టియును, గోపీజన ప్రేయసే=గోపీజన ప్రియమైన, మహసే=వెలుఁగు కొఱకు, కేవా= ఎవ్వరుగాని, నస్పృహయంతి=మనసు పడకుందురు? హంత!=అవురా!

తాత్పర్యము:- శ్రీరమణీయమైన నెమలిపురిని భూషణముగా సవరించికొనిన దానికొఱకు,శ్యామాభిరామమైన దేహకాంతికొఱకు, లావణ్యరసైకసిక్త వపుఃశ్రీ కొఱకు, లక్ష్మీసరోవర వర్షావైభవముకొఱకు, లీలాzకృష్టరసజ్ఞమనోధర్మముకొఱకు, లీలాzమృతవాహిని కొఱకు, గోపీజనప్రేయసము కొఱకు, మనసుపడకుండువారు ఎవ్వరుందురు? అవురా!

శ్లో. **ఆపాటలాధర మధీర విలోల నేత్రమ్**
ఆమోద నిర్భరిత మధ్బుత కాంతి పూరమ్ ।
ఆవిఃస్మితామృత మనుస్మృతి లోభనీయమ్
ఆముద్రితాzనన మహో! మధురం మురారేః ॥ *63*

అన్వయము:- మురారేః ఆముద్రితాzననమ్ మధురమ్ అహో!=మురారియొక్క అచ్చొత్తినట్లున్న నెమ్మోము చక్కనైనది, ఆశ్చర్యము!

అర్థము:- ఆపాటలాధరం=అంతటాఎఱ్ఱనైనపెదవి కలదియును, అధీర విలోలనేత్రమ్=బెళుకుచూపు లొలయించుచున్న చంచలనయనములు గలదియును, ఆమోద=సౌరభముతో, నిర్భరితం=నిండారినదియును, అద్భుతకాంతి పూరమ్=అచ్చెరువు గొలుపునట్టి కాంతి ప్రవాహము కలదియు, ఆవిఃస్మితామృతమ్=ఉదయించుచున్న స్మితామృతము కలదియు, అనుస్మృతి=అనుస్మరణముచేత, లోభనీయమ్=సంప్రార్థనీయమైనదియు నయిన, మురారేః=మురవైరియొక్క, ఆముద్రితాననమ్=అచ్చొత్తినట్లున్న నెమ్మోము, మధురమ్=చక్కనైనది, అహో!=ఆశ్చర్యము.

తాత్పర్యము:- అంతటా ఎఱ్ఱనైన పెదవితో, బెళుకుచూపు లొలయించు విలోలనయనములతో, దూరమునకు ప్రసరించుచున్న సౌరభముతో, అద్భుతకాంతి ప్రవాహముతో, ఉదయించుచున్న స్మితామృతముతో, తలంచికొన్న కొలఁది తనివితీఱనిదై - మురారియొక్క చక్కని నెమ్మోము నాహృదయములో అచ్చొత్తినట్టున్నది. ఆహా!

శ్లో. ***జాగృహి జాగృహి చేతః! - చిరాయ చరితార్థతా భవతః ।***
అనుభూయతా మిద మిదం - పురఃస్థితం పూర్ణనిర్వాణమ్ ॥ 64

అన్వయము :- చేతః! పూర్ణనిర్వాణమ్ పురఃస్థితం అనుభూయతామ్!=ఓ మనసా! పరిపూర్ణమగు మోక్షము ఎదుటనున్నది - అనుభవింపఁబడుగాక!

అర్థము:- చేతః=ఓచేతమా!, జాగృహి జాగృహి!=మేలుకొనుము! మేలుకొనుము! భవతః=నీకు, చిరాయ=చిరకాలమునకు, చరితార్థతా=కృతార్థత!, ఇదమిదమ్=ఇదిగో ఇదిగో!, పూర్ణనిర్వాణమ్=పరిపూర్ణనిర్వాణము, పురఃస్థితమ్=ఎదుటనున్నది, అనుభూయతామ్=అనుభవింపఁబడుగాక!

తాత్పర్యము:- ఓ చేతమా! మేలుకొనుము మేలుకొనుము! చిరకాలమునకు నీకు కృతార్థత! ఇదిగో ఇదిగో! పరిపూర్ణనిర్వాణము నీ యెదుటనున్నది! అనుభవింపఁబడునుగాక!

శ్లో. ***చరణయో రరుణం కరుణార్ద్రయోః***
కచభరే బహుళం విపులం దృశోః ।
వపుషి మంజుల మంజనమేచ కే
వయసి బాల మహో మధురం మహః ॥ 65

అన్వయము:- (కిమపి) మహః మధురం అహో!=(ఒకానొక) వెలుఁగు (శ్రీకృష్ణుఁడను తేజము) తీయనది - అత్యంత భోగ్యమైనది; ఆశ్చర్యము!

అర్థము:- కరుణార్ద్రయోః=దయార్ద్రములైన, చరణయోః=చరణములయందు, అరుణం=అరుణవర్ణ మైనదియును, కచభరే=కేశభరమునందు, బహుళమ్=ఒత్తైనదియును, దృశోః=కన్నులయందు, విపులం=విశాలమైనదియు, అంజనమేచకే=కాటుకవలె నల్లనైన, వపుషి=దేహమునందు, మంజులమ్=ఒప్పిదమైనదియును, వయసి=వయస్సునందు, బాలం= లేఁతదియును, అహో!=ఆశ్చర్యము!, మధురం మహః=తీయని వెలుఁగు!

తాత్పర్యము:- కరుణార్ద్రములైన చరణములయందు అరుణవర్ణము కలదియును, కేశభరమునందు ఒత్తైనదియు, కన్నులయందు విశాలమైనదియు, కాటుకవలె నల్లని నెమ్మేనియందు ఒప్పిదమైనదియు, వయస్సు నందు లేఁతదియునైన యీ వెలుఁగు తీయనిది. అహో!

శ్లో. *మాలా బర్హ మనోజ్ఞ కుంతలభరాం వన్యప్రసూనోక్షితాం*
శైలేయద్రవ క్లప్త చిత్రతిలకాం శశ్వన్మనోహారిణీమ్ ।
లీలా వేణురవామృతైక రసికాం లావణ్య లక్ష్మీమయీం
బాలాం బాలతమాల నీలవపుషం వందే పరాందేవతామ్ ॥ 66

అన్వయము:- పరాం దేవతామ్ వందే=సర్వోత్కృష్టమగు దేవతను నమస్కరించు చున్నాను.

అర్థము:- మాలా=పులమాలలతో, బర్హ=నెమలి బర్హముతో, మనోజ్ఞ=దర్శనీయమైన, కుంతలభరామ్=కేశభరముకల దానిని, వన్యప్రసూన=అడవిపూలతో, ఉక్షితామ్=చల్లఁబడిన దానిని, శైలేయద్రవ=గైరికద్రవముచేత, క్లప్త=దిద్దఁబడిన, చిత్రతిలకామ్=చిత్రతిలకముగల దానిని, శశ్వత్=క్షణక్షణమునందు, మనోహారిణీమ్=మనస్సును ఆకర్షించు లక్షణముగలదానిని, లీలా=లీలాస్వరూపమైన, వేణురవ=వేణునాదమునందు, ఏక రసికామ్=తదేకాసక్తమైన దానిని, లావణ్యలక్ష్మీ మయీమ్=లావణ్యలక్ష్మియొక్క స్వరూపమైన దానిని, బాలామ్=బాలరూపములో నున్నదానిని, బాలతమాల=లేఁత కానుగు మోకవలె, నీలవపుషం=నల్లనిశరీరము గలదానిని, పరాందేవతామ్=పరదేవతను - సర్వోత్కృష్టమగు దేవతను, వందే= నమస్కరించుచున్నాను.

తాత్పర్యము:- పూలమాలలతో, నెమలి పింఛముతో అలంకృతమైన తలకట్టుగలదానిని, అడవిపూలతో వెదచల్లఁబడిన దానిని, గైరిక రసముతో దిద్దఁబడిన చిత్రతిలకము గలదానిని, క్షణక్షణ మనోహారిణిని, లీలాగృహీతమైన వేణువుయొక్క

నాదామృతమునందు తదేకానక్తమైనదానిని, బాలరూపములో నున్నదానిని, లేఁతకానుగుమోకవంటి నల్లనిశరీరము గలదానిని, పరదేవతను నమస్కరించుచున్నాను.

శ్లో. గురు మృదుపదే, గూఢం గుల్ఫే, ఘనం జఘనస్థలే
నళిన ముదరే, దీర్ఘం బాహ్వో, ర్విశాల మురఃస్థలే ।
మధుర మధరే, ముగ్ధం వక్త్రే, విలాసి విలోచనే
బహు కచభరే, వన్యం వేషే, మనోజ్ఞ మహో మహః ॥ 67

అన్వయము :- (కిమపి) మహః మనోజ్ఞమ్ అహో!=(ఒకానొక) వెలుఁగు (శ్రీకృష్ణుఁడను తేజము) సుందరమైనది, ఆశ్చర్యము!

అర్థము:- మృదుపదే=మెత్తని అడుగునందు, గురు=బరువైనదియు, గుల్ఫే=చీలమండయందు, గూఢమ్=కనిపింపనిదియు, జఘనస్థలే=జఘనప్రదేశమునందు, ఘనం=పెద్దదియును, ఉదరే=ఉదరమునందు, నళినం=సన్ననిదియు, బాహ్వోః=బాహువుల యందు, దీర్ఘమ్=నిడుపైనదియు, ఉరఃస్థలే=వక్షఃస్థలమునందు, విశాలమ్=వెడల్పైనదియు, అధరే=అధరమునందు, మధురమ్=తీయనైనదియు, వక్త్రే=ముఖమునందు, ముగ్ధమ్=ముద్దులొలుకునదియు, విలోచనే=కంటియందు, విలాసి=విలాసములుగలదియు, కచభరే=కేశభరమునందు, బహు=బహుళమైనదియు, వేషే=వేషరచనయందు, వన్యమ్=అరణ్యాలక్షణముకల, మహః=వెలుఁగు, మనోజ్ఞమ్=సుందరమైనది. అహో=ఆశ్చర్యము!

తాత్పర్యము:- మెత్తని అడుగునందు బరువైనది, గుల్ఫమునందు గూఢమైనది, జఘన స్థలమునందు ఘనమైనది, ఉదరమునందు సన్ననిది, బాహువులయందు నిడుపైనది, వక్షఃస్థలము నందువిశాలమైనది, అధరమునందుమధురమైనది, ముఖమునందుముగ్ధమైనది, విలోచనమునందు విలాసములగలది, కేశభరమునందు బహుళమైనది, వేషమునందు వన్యలక్షణముగల ఈ మహస్సు మనోజ్ఞమైనది. అహో! ఆశ్చర్యము!

శ్లో. జిహానం జిహానం సుజాతేన (సుజానేన) మౌగ్ధ్యం
దుహానం దుహానం సుధాం వేణునాదైః ।
లిహానం లిహానం సుదీర్ఘై రపాంగైః
మహానన్దసర్వస్వ మేత న్నమేతమ్ [6] ॥ 68

---

6 ఏతన్నా మస్తాత్ (పాఠాంతరము)=ఏతం+నమః+స్తాత్=వీనిని (ఈ కృష్ణుని) గూర్చి నమస్కారము అగునుగాక!

(**అన్వయము:-** తమ్ ఏతమ్ నమే=ప్రసిద్ధుఁడైన వీనిని (ఈ కృష్ణుని) నమస్కరించుచున్నాను.

అర్థము:- సుజాతేన=పుట్టుకచేతనే, మౌగ్ధ్యం=సౌందర్యమును, జిహానం జిహానం=మిక్కిలియు పొందుచున్నవాఁడును-లేక, సుజాతేన=యౌవనము చేతనని కొందఱి యర్థము, మౌగ్ధ్యమును మఱిమఱి పొందుచున్నవాఁడు ననియర్థము - యౌవనము రాను రాను మఱిమఱి యందము మీఱుచున్నవాఁడనుట, వేణునాదైః=వేణుధ్వనులచేత, సుధాం=అమృతమును, దుహానం దుహానం=మిక్కిలి పిదుకుచున్న వాఁడును - అమృతమువలె వేణుధ్వనులను మిక్కిలి నిగుడ్చుచున్న వాఁడనుట, సుదీర్ఘైః=మిక్కిలి నిడుదలైన, అపాంగైః=కడకన్నులచేత - కడకంటి చూడ్కులచేతననుట, లిహానం లిహానం=మాటిమాటికి ఆస్వాదించుచున్నవాఁడును - నా కిలోఁగొనునట్లు చూడ్కులచేత గొల్లచెలువల చెలువమును ఆస్వాదించుచున్నవాఁడనుట, 'మహానంద సర్వస్వమ్' - మహానంద=గొప్పవాఁడైన నందునికి, సర్వస్వమ్=సారభూతమైన వాఁడును - ఇచ్చట 'మహానంద' శబ్దము కృష్ణావతార నియామకమైన వ్యవర్తకముగాన 'గొప్పవాఁడగునందు' డనియే యర్థము గ్రాహ్యముగాని 'మిక్కిలి యానంద'మని యర్థము సరసముగాదు. ఇట్టివాఁడైన, తమ్=ప్రసిద్ధుడైన, ఏతమ్=వీనిని - ఈ కృష్ణుని, నమే=నమస్కరించుచున్నాను.

తాత్పర్యము:- యౌవనము మించుకొలఁదిని మఱిమఱి యందము నొందుచున్న వాఁడును, అమృతమువంటి వేణుధ్వనులు నిగుడ్చుచున్నవాఁడును, నిడుదలైన కడగన్నులచేత గొల్లచెలువల చెలువమును ఆస్వాదించుచున్నవాఁడును, నందునియొక్క సర్వస్వమైనవాఁడును అగు శ్రీకృష్ణునికి మ్రొక్కుచున్నాను.)

శ్లో. **లసద్బర్హాపీడం లలిత లలిత స్మేర వదనం**
భ్రమత్ క్రీడాzపాంగం ప్రణత జనతా నిర్వృతిపదమ్ ।
నవామ్భోదశ్యామం నిజమధురి మామోదభరితం
పరం దేవం వందే పరిమళిత కైశోరక రసమ్ ॥ *69*

అన్వయము:- పరం దేవమ్ వందే=పరమపురుషుని నమస్కరించుచున్నాను.

అర్థము:- లసత్=ప్రకాశించుచున్న, బర్హా=పింఛమే అనెడి, ఆపీడం=అలంకారముగల వానిని, లలిత లలిత=లలితాతి లలితమైన, స్మేర=వికస్వరమైన, వదనమ్=నెమ్మోముగల వానిని, భ్రమత్=మలయుచున్న, క్రీడా=క్రీడామయములైన, అపాంగమ్=నేత్రాంచలములు కలవానిని, ప్రణత జనతా=ప్రపన్నజనమునకు, నిర్వృతిపదమ్= ఆనందస్థానమైనవానిని,

నవాంభోదశ్యామమ్=అభినవ జలద శ్యామలమూర్తిని, నిజ=స్వీయమైన, మధురిమా=మాధుర్యము యొక్క, ఆమోద=దూరప్రసారి సౌరభముగలవానిని, పరిమళిత=పరిమళించిన, కైశోరక=కిశోరభావమునకు సంబంధించిన, రసమ్=మాధుర్యముగల, పరందేవమ్=పరమపురుషుని, వందే=నమస్కరించుచున్నాను.

తాత్పర్యము:- ప్రకాశించుచున్న బర్హాభరణము కలవానిని, లలితాతి లలితమైన స్మేర వదనము గలవానిని, మలయుచున్న క్రీడామయములైన నేత్రాంచలములుగల వానిని, ప్రపన్న జనమునకు ఆనందస్థానమయినవానిని, అభినవజలద శ్యామలాకారుని, నిజమాధుర్యముయొక్క దూరప్రసారి సౌరభము గలవానిని, గుబాళించిన కైశోర రసగంధము గల పరమపురుషుని నమస్కరించుచున్నాను.

శ్లో. *సారస్య సామగ్ర్య మివాఽననేన*
మాధుర్య చాతుర్య మివస్మితేన ।
కారుణ్య తారుణ్య మివేక్షితేన
చాపల్య సాఫల్య మిదం దృశో ర్మే ॥ 70

అన్వయము:- ఇదమ్ మే దృశో: చాపల్య సాఫల్యమివ=ఈ వెలుఁగు నా కన్నులయొక్క చాపల్యమునకు సాఫల్యమువలె నున్నది.

అర్థము:- ఆననేన=నెమ్మోముచేత, సారస్య సామగ్ర్యమివ=సరసత్వముయొక్క సమగ్రతవలె నున్నదియు, స్మితేన=దరహాసముచేత, మాధుర్య చాతుర్యమివ=మధురిమ యొక్క చతురిమవలె నున్నదియు, ఈక్షితేన=చూపుచేత, కారుణ్య తారుణ్యమివ=కారుణ్యముయొక్క తారుణ్యమువలె నున్న, ఇదమ్=ఈ వెలుఁగు, మేదృశో:=నా కన్నుల యొక్క, చాపల్య సాఫల్యమివ=చాపల్యమునకు సాఫల్యమువలె నున్నది.

తాత్పర్యము:-నెమ్మోముచేత సరసతా సమగ్రతవలెను, మందహాసముచేత మధురిమయొక్క చతురిమవలెను, చూపుచేత కారుణ్యభావముయొక్క తారుణ్యము వలెను, గోచరించుచున్న యీ మూర్తి నాకన్నులయొక్క చాపల్యమునకు సాఫల్యము వలెనున్నది.

శ్లో. *యత్ర వా తత్ర వా దేవ! - యది విశ్వసిమస్త్వయి ।*
నిర్వాణ మపి దుర్వార - మర్వాచీనాని కిం పున: ॥ 71

అన్వయము:- హే దేవ! త్వయి యది విశ్వసిమ: నిర్వాణమపి దుర్వారమ్= ఓ

ప్రకాశ స్వరూపుఁడా! నీయందు విశ్వాసమును నిలుపుదుమేని మోక్షముకూడ అనివార్యమై మాకు లభించి తీఱును.

అర్థము:- హేదేవ!=ఓ ప్రకాశ స్వరూపుఁడా! యత్రవా తత్రవా=ఎచ్చటనో అచ్చట, త్వయి=నీయందు,యది విశ్వసిమః=విశ్వసింతుమేని,నిర్వాణమపి=తురీయ పురుషార్థమైన మోక్షము కూడ, దుర్వారమ్=ఆఁపశక్యముకానిది. అర్వాచీనాని=ధర్మార్థకామములను గూర్చి, కింపునః!=చెప్పవలసినదేమియున్నది?

తాత్పర్యము:- ఎచ్చటనో అచ్చట నీయందువిశ్వాసమును నిలుపుదు మేని మోక్షముకూడ అనివార్యమై మాకు లభించితీఱును. ఇఁక ధర్మార్థకామములమాట చెప్పవలయునా?

శ్లో. *రాగాంధ గోపీజన వందితాభ్యాం*
యోగీంద్ర భృంగేంద్ర నిషేవితాభ్యామ్ ।
ఆతామ్ర పంకేరుహ విభ్రమాభ్యాం
స్వామిన్! పదాభ్యా మయ మంజలి స్తే ॥ 72

అన్వయము:- స్వామిన్! తే పదాభ్యామ్ అయం అంజలిః!=స్వామీ! నీచరణముల కొఱకు ఈ దోయిలి!

అర్థము:- రాగాంధ=అనురాగాంధలైన, గోపిజన=గోపికలచేత, వందితాభ్యాం= నమస్కరింపఁబడినవియును, యోగీంద్ర=యోగీంద్రులేయనెడి, భృంగేంద్ర= గండుతుమ్మెదలచేత, నిషేవితాభ్యామ్=సేవింపఁబడినవియును, ఆతామ్ర=ఇంచుక ఎఱ్ఱనైన, పంకేరుహ=తామరపూలయొక్క, విభ్రమాభ్యామ్=విలాసముగల, తే=నీయొక్క పదాభ్యామ్=చరణములకొఱకు, అయమ్=ఈ, అంజలిః=దోయిలి, స్వామిన్=స్వామీ!

తాత్పర్యము:- అనురాగాంధలైన గోపికలచేత నమస్కరింపఁబడినవియును, యోగీశ్వరులే యనెడి గండుతుమ్మెదలచేత సేవింపఁబడినవియును, ఇంచుక ఎఱ్ఱనైన తామరపూవుల విలాసముగల నీచరణముల కొఱకు స్వామీ! ఇదిగో నా దోయిలి!

శ్లో. *అర్థానులాపాన్ వ్రజసుందరీణామ్*
అకృత్రిమాణాం చ సరస్వతీనామ్ ।
ఆర్ద్రాశయేన శ్రవణాంచలేన
సంభావయంతం తరుణం గృణీమః ॥ 73

అన్వయము:- తరుణమ్ గృణీమః=పిన్నవయస్సువానిని స్తుతింతుము.

అర్థము:- వ్రజసుందరీణామ్=వ్రజసుందరీజనముయొక్కయు, అకృత్రిమాణామ్=అపౌరుషేయములైన, సరస్వతీనామ్‌చ=వేదసరస్వతులయొక్కయు, అర్థానులాపాన్=అర్థవిశిష్టములైన ముహుర్భాషణములను, ఆర్ద్రాశయేన=ఆర్ద్రహృదయముతో, శ్రవణాంచలేన=కొసచెవితో, సంభావయంతమ్=మన్నించుచున్న, తరుణమ్=పిన్నవయస్సు వానిని, గృణీమః=స్తుతింతుము.

తాత్పర్యము:- వ్రజసుందరీ జనముయొక్క సరసార్థములైన ముహుర్భాషణముల తోపాటు అపౌరుషేయములైన శ్రుతిసరస్వతీ ముహుర్భాషణములను ఆర్ద్రహృదయముతో రిక్కించిన వీనుదోయితో మన్నించుచున్న తరుణిని స్తుతించెదము.

శ్లో. ***మనసి మమ సన్నిధత్తామ్ - మధురముఖా మంథరాపాంగా***
కరకలిత లలితవంశా - కాzపి కిశోరా కృపాలహరీ ॥ 74

అన్వయము:- కాzపి కిశోరా కృపాలహరీ మమ మనసి సన్నిధత్తామ్!=ఒకానొక కిశోరాకృతియైన కృపాతరంగిణి నామనస్సునందు సన్నిధిచేయునుగాక!

అర్థము:- మధురముఖా=స్వాదుముఖముగలదియును, మంథర=మెల్లని, అపాంగా=కటాక్షములుగలదియును, కరకలిత=చేతిలోధరింపఁబడిన, లలిత వంశా=సుకుమారవేణు నాళము గల, కాzపి=ఒకానొక, కిశోరా=కిశోరాకృతియైన, కృపాలహరీ=కృపాతరంగిణి, మమమనసి=నామనస్సునందు, సన్నిధత్తామ్=సన్నిధిచేయునుగాక!

తాత్పర్యము :- తీయని ముఖలక్షణము కలదియు, మెల్లని కటాక్ష వీక్షణములు గలదియు, కరగృహీతమైన సుకుమార వంశనాళము గలదియు నగు కిశోరాకృతియైన ఒకానొక కృపాలహరి నా మనస్సునందు సన్నిధిచేయునుగాక!

శ్లో. ***రక్షంతు నః శిక్షిత పాశుపాల్యాః***
బాల్యావృతా బర్హిశిఖావతంసాః ।
ప్రాణప్రియాః ప్రస్తుత వేణుగీతాః
శీతా దృశోః శీతల గోపకన్యాః ॥ 75

అన్వయము:- శీతల గోపకన్యాః నః రక్షంతు!=చల్లని గోపకన్యలు మమ్ము రక్షింతురుగాక!

అర్థము:- శిక్షిత=నేర్పఁబడిన, పాశుపాల్యాః=పశుపాలనము గలవారును, బాల్యావృతాః=బాల్యముచేత ఆవరింపఁబడినవారును, బర్హిశిఖావతంసాః= నెమలిపురి సిగబంతిగాఁ గలవారును, ప్రాణప్రియాః=ప్రాణములకు ప్రియమైనవారును, ప్రస్తుత=ఆరంభింపఁబడిన, వేణుగీతాః=పిల్లనగ్రోవిపాట గలవారును, దృశోః=కన్నులకు, శీతాః=చల్లనివారునైన, శీతల గోపకన్యాః=చల్లని గోపకన్యలు, నః=మమ్ము, రక్షంతు=రక్షింతురు గాక! ఇచ్చట స్వామియందు స్త్రీత్వము బహుత్వము ఆరోపింపఁబడినవని తెలియునది.

తాత్పర్యము:- పశుపాలనమును అభ్యసించినవారును, బాల్యముచేత ఆవరింపఁబడినవారును, బర్హము శిఖావతంసముగాఁ గలవారును, ప్రాణములకు ప్రియమైనవారును, ప్రస్తుతమైన వేణుగీతము గలవారును, కన్నులకు చల్లనివారు నైన చల్లని నల్లని గోపకన్యకలు మమ్ము రక్షించెదరుగాక!

శ్లో. ***స్మిత స్తబకితాధరం శిశిర వేణునాదామృతం***
ముహు స్తరళ లోచనం మదకటాక్షమాలాzకులమ్ ।
ఉరఃస్థల విలీనయా కమలయా సమాలింగితం
భువస్తల ముపాగతం భువనదైవతం పాతు నః ॥ 76

అన్వయము:- భువస్తలమ్ ఉపాగతం భువనదైతవతం నః పాతు!=భూతలమును చేరవచ్చిన సమస్త భువన దైవతము మమ్ము రక్షించునుగాక!

అర్థము:- స్మిత=చిఱునవ్వుచేత, స్తబకిత=గుత్తితొడిగిన, అధరమ్=పెదవి కలదియును, శిశిర=చల్లని, వేణునాద=క్రోవిపాటయే యనెడి, అమృతమ్=అమృతము కలదియు, ముహుః=మాటిమాటికి, తరళ=కదలుచున్న, లోచనమ్=కన్నులుగలదియు, మద=విలాస భరితములైన, కటాక్షమాలా=కటాక్షమాలలతో, ఆకులమ్=సందడించినదియు. ఉరఃస్థల=వక్షఃస్థలమునందు, విలీనయా=దాఁగియున్న, కమలయా=శ్రీకమలాదేవిచేత, సమాలింగితమ్=కౌఁగిలించుకొనఁబడిన, భువస్తలమ్=భూతలమును, ఉపాగతమ్=చేరవచ్చిన, భువన దైవతమ్=సమస్త భువన దైవతము, నః=మమ్ము, పాతు=రక్షించునుగాక!

తాత్పర్యము:- చిఱునవ్వుతో గుత్తితొడిగిన కెమ్మోవి గలదియు, చల్లని వేణునాదామృతము గలదియు, మాటిమాటికి విలోలములైన విలోచనములు గలదియు, విలాసభరితములైన కటాక్షమాలలచేత సందడించినదియు, వక్షఃస్థలమునందు విలీనమైయున్న

లక్ష్మీ దేవిచేతఁగౌఁగిలించి కొనఁబడిన-భూతలమునకు దిగివచ్చిన భువన దైవతము మమ్ము కాపాడునుగాక!

శ్లో. *నయనాంబుజే భజత! కామదుఘం*
హృదయాంబుజే కిమపి కారుణికమ్ ।
చరణాంబుజే మునికులైక ధనం
వదనాంబుజే వ్రజవధూ విభవమ్ ॥ 77

అన్వయము:- (భువన దైవతం) భజత!=భువన దైవతమును సేవింపుఁడు.

అర్థము:- నయనాంబుజే=నయన పద్మమునందు, కామదుఘమ్=కోరికలను వర్షించునట్టిదియును, హృదయాంబుజే=హృదయ పద్మమునందు, కిమపి=చెప్పనలవికాని, కారుణికమ్=కరుణాస్వభావము గలదియు, చరణాంబుజే=చరణపద్మమునందు, ముని కులైకధనమ్=మునీశ్వరులకు కులధనమైనదియు, వదనాంబుజే=వదనపద్మమునందు, వ్రజవధూజన వైభవమ్=గోపికాజన వైభవ మయినదానిని (భువన దైవతమును) భజత!=సేవింపుఁడు.

తాత్పర్యము:- కన్నుదామరలయందు కోరికలనువర్షించుదానిని, హృదయాంబుజమునందు చెప్పనలవి కాని కరుణాస్వభావము గలదానిని, చరణ పద్మము నందు - మునులకు కులధనమైనదానిని, వదనాంబుజమునందు - వ్రజవనితా వైభవమైన భువనదైవతమును భజింపుఁడు!

శ్లో. *నిర్వాసనం హన్త! రసాంతరాణాం*
నిర్వాణసామ్రాజ్య మివావతీర్ణమ్ ।
అవ్యాజమాధుర్య మహానిధానమ్
అవ్యాద్ వ్రజానా మధిదైవతం నః ॥ 78

అన్వయము:- వ్రజానాం అధిదైవతం నః అవ్యాత్!=గోపకుల అభిమాన దైవతము మమ్ము రక్షించునుగాక!

అర్థము:- హంత!=అవురా! రసాంతరాణామ్=అన్యరసములను, నిర్వాసనమ్= తొలఁగఁబెట్టునదియును, అవతీర్ణమివ=భూమికి దిగివచ్చినట్లున్న, నిర్వాణ సామ్రాజ్యమ్=మోక్ష సామ్రాజ్యమును, అవ్యాజ మాధుర్య=నిర్వ్యాజ మాధుర్యమునకు,

మహానిధానమ్=పెద్దనిధానమై యున్న, వ్రజానామ్=వ్రజనివాసులయొక్క, అధిదైవతమ్= అధిదైవతము, నః=మమ్ము, అవ్యాత్= కాపాడునుగాక!

తాత్పర్యము:- అన్యరసములను తొలగించునదియును, భూమికి దిగివచ్చిన మోక్షసామ్రాజ్యమువలె నున్నదియును, అవ్యాజమాధుర్యమునకు మహానిధానమైన వ్రజవాసులయొక్క అధిదైవము మమ్ము కాపాడునుగాక!

శ్లో. *గోపీనా మభిమత గీత వేష హర్షమ్*[7]
ఆపీన స్తనభర నిర్భరోపగూఢమ్ ।
కేళీనా మవతు రసై రుపాస్యమానం
కాళిందీ పులిన చరం పరం మహో నః ॥ 79

అన్వయము:- పరం మహః నః అవతు!=ఉత్కృష్టమైన తేజస్సు మమ్ము రక్షించునుగాక!

అర్థము:- గోపీనామ్=గోపికలకు, అభిమత=అభీప్సితమైన, గీత=పాటయును, వేష=వేషమును, హర్షమ్=ప్రహర్షము కలదియును, ఆపీన=బలసిన, స్తనభర=కుచభరము చేత, నిర్భర=గాఢముగా, ఉపగూఢమ్=కౌఁగిలించికొనఁబడినదియును, కేళీనాం రసైః= కేళీరసములచేత, ఉపాస్యమానమ్=ఉపాసింపఁబడుచున్న, కాళిందీ పులిన చరమ్= యమునానది యిసుక తిన్నెలలో సంచరించునట్టి , పరం మహః=పరమ తేజము, నః=మమ్ము, అవతు=రక్షించునుగాక!

తాత్పర్యము :- గోపికలకు అభిమతములైన గీత, వేష, హర్షములు గలదియును, బలసిన స్తనభరములతో గాఢముగా కౌఁగిలించికొనఁబడినదియును, కేళీరసములచేత - ఉపాస్యమానమై కాళిందీ పులినములయందు సంచరించునట్టి పరమ తేజము మమ్ము కాపాడునుగాక!

శ్లో. *ఖేలతాం మనసి ఖేచరాంగనా*
మాననీయ మృదు వేణు నిస్వనైః ।
కాననే కిమపి నః కృతాస్పదం
కాలమేఘ కలహోద్వహం మహః ॥ 80

---

7 "హర్షాత్" (పాఠాంతరము)=సంతోషమువలన

అన్వయము:- కిమపి మహః నః మనసి ఖేలతామ్=ఒకానొక వెలుఁగు మా మనస్సులో క్రీడించునుగాక!

అర్థము:- ఖేచరాంగనా=అప్సరసలచేత, మాననీయ=సమ్మానింపఁదగిన, మృదు=సుకుమారములైన, వేణునిస్వనైః=వేణునాదములతో కాననే=కాననమునందు, కృతాస్పదమ్=నెలవుకొన్న, కిమపి=ఒకానొక, కాలమేఘ కలహోద్వహమ్=కాలమేఘముతో కలహసన్నద్ధమైన, మహః=వెలుఁగు, నః మనసి=మా మనస్సునందు, ఖేలతామ్=క్రీడించును గాక!

తాత్పర్యము :-అప్సరసలచేత సంభావనీయములైన సుకుమార వేణు నాదములతో - కాననాంతరమునందు నెలవుకొన్న కాలమేఘ కలహసన్నద్ధమయిన ఒకానొక మహస్సు మా మనస్సులయందు ఖేలనము చేయునుగాక!

శ్లో. *ఏణీశాబ విలోచనాభి రలస శ్రోణీభర ప్రౌఢిభిః*
వేణీభూత రసక్రమాభి రభితః శ్రేణీకృతాభి ర్వృతః ।
పాణీద్వ్యా చ వినోదయన్ రతిపతే స్తూణీశయై స్సాయకైః
వాణీనా మపదం పరం వ్రజజన క్షోణీపతిః పాతు నః ॥ 81

అన్వయము:- వ్రజజన క్షోణీపతిః నః పాతు!=గోపసమూహమునకు రాజైన శ్రీకృష్ణుఁడు మమ్ము రక్షించునుగాక!

అర్థము:- అభితః=అన్నివైపులను, శ్రేణీకృతాభిః=శ్రేణులు తీఱియున్నట్టియు, అలస=భరాలసములైన, శ్రోణీభర=నితంబ బింబములయొక్క, ప్రౌఢిభిః=పరిపూర్ణభావము కలట్టియును, వేణీభూత=జాలుకట్టిన, రస=శృంగార రసము యొక్క, క్రమాభిః=తీఱుగల, ఏణీశాబ=హరిణీ శాబకముల యొక్క, విలోచనాభిః=విలోచనములవంటి విలోచనములుగల వ్రజస్త్రీలచేత, వృతః=పరివేష్టింపఁబడినవాఁడై, రతిపతేః=రతివల్లభునియొక్క, తూణీశయైః=తూణీరమునందు శయనించిన, సాయకైః=బాణములతో (పూవులతో), పాణీద్వ్యా=రెండుచేతులను, వినోదయన్=వినోదింపఁజేయుచు, వాణీనామ్=పలుకులకు, వరమ్=మిక్కిలి, అపదం=అందని, వ్రజజన క్షోణీవతిః=వ్రజప్రజానాథుఁడు, నః=మమ్ము, పాతు=రక్షించునుగాక!

తాత్పర్యము:- శ్రేణులు తీర్చి నితంబభరాలసలైన వ్రజసుందరులు శృంగార రసవాహినులవలె తన్ను పరివేష్టించి నిలిచియుండఁగా చేతులతో పూవులు చిమ్ముచు మాటలకు అందని సౌందర్యమునకు నెలవైయున్న వ్రజప్రజానాథుఁడు మమ్ము కాపాడునుగాక!

శ్లో. కాళిందీ పులినే తమాల నిబిడచ్ఛాయే పురః స్సంచర
త్తోయే తోయజ పత్ర పాత్ర నిహితం దధ్యన్న మశ్నాతి యః ।
వామే పాణితలే నిధాయ మధురం వేణుం విషాణం కటి
ప్రాంతే గాశ్చ విలోకయన్ ప్రతికలం తం బాల మాలోకయే ॥ 82

అన్వయము:- తంబాలం ఆలోకయే=ఆ బాలకృష్ణమూర్తిని చూచుచున్నాను.

అర్థము:- కాళిందీ పులినే=యమునానది యిసుక తిన్నెయందు, పురఃసంచర త్తోయే=ఎదుట పారుచున్న నీటి జాలుగల, తమాలనిబిడచ్ఛాయే=కానుఁగు చెట్టు దట్టపు నీడయందు, వామేపాణితలే=ఎడమచేతియందు, మధురంవేణు=తీయని పిల్లనగ్రోవిని, నిధాయ=నిలిపి, కటిప్రాంతే=మొలదగ్గఱ, విషాణం=బూరటకొమ్ము చెరివికొని, ప్రతికలమ్=ప్రతితెప్పపాటు కాలమునందు, గాః=ఆవులను, విలోకయంశ్చ=కనుపెట్టుచునే, తోయజపత్త్రపాత్ర నిహితమ్=తామరాకుదొన్నెయందుంచిన, దధ్యన్నమ్=పెరుగన్నమును, యః=ఏపిల్లవాఁడు అశ్నాతి=ఆరగించుచున్నాడో, తం బాలమ్=ఆ బాలుని, ఆలోకయే= అవలోకించుచున్నాను.

తాత్పర్యము:- యమునా నది యిసుక తిన్నెయందు - కానుగుచెట్టు దట్టపు నీడలో - ఎదుట నీటిపార జాలు పారుచుండఁగా - ఎడమచేత తీయని పిల్లనగ్రోవిపెట్టుకొని - బూరటకొమ్ము రొండిని దోఁపి కొని - ప్రతి తెప్పపాటునందు ఆవులను ఆరయుచు - తామరాకు దొన్నెలో నుంచిన పెరుగన్నమును - ఏ పిల్లవాఁడు ఆరగించుచున్నాడో, ఆ బాలుని నేను చూచుచున్నాను.

శ్లో. య ద్గోపీ వదనేందుమండన మభూత్ కస్తూరికా పత్రకం
య ల్లక్ష్మీ కుచ శాతకుమ్భకలశ వ్యాకోశ మిన్దీవరమ్ ।
య న్నిర్వాణ నిధాన సాధనవిధౌ సిద్ధాంజనం యోగినాం
త న్న శ్శ్యామల మావిరస్తు హృదయే కృష్ణాభిధానం మహః ॥ 83

అన్వయము:- తత్ శ్యామలం కృష్ణ+అభిధానం మహః నః హృదయే ఆవిరస్తు!=ఆ నల్లని శ్రీకృష్ణుఁడను పేరుగల వెలుఁగు మా హృదయమునందు ఆవిర్భవించునుగాక!

అర్థము:- యత్=ఎయ్యది, గోపీవదనేందుమండనమ్=గోపికావదన చంద్రబింబములకు అలంకారమైన, కస్తూరికా పత్రకమ్=కస్తూరీ విలిఖితమైన మకరికాపత్త్రము, అభూత్=అయ్యెనో, యత్=ఎయ్యది, లక్ష్మీదేవియొక్క, కుచ=స్తనములే

అనెడి, శాతకుంభ కలశ=స్వర్ణ కలశములయందు, వ్యాకోచం=విచ్చిన, ఇందీవరమ్=నల్లకలువ యో, యత్=ఎయ్యది, నిర్వాణ=మోక్షమేయనెడి, నిధాన=నిధియొక్క, సాధన విధౌ=సాధన ప్రక్రియయందు, యోగినామ్=యోగీశ్వరులకు, సిద్ధాంజనం అభూత్=నిధ్యంజన మయ్యెనో, తత్=అట్టి, శ్యామలమ్=నల్లనిదైన, కృష్ణాభిధానమ్=కృష్ణుఁడను పేరుగల, మహః=వెలుఁగు, నః=మాయొక్క, హృదయే=హృదయమునందు ఆవిరస్తు=ఆవిర్భవించునుగాక!

తాత్పర్యము:-ఎయ్యది గోపికాముఖ చంద్రబింబములకు అలంకారమైన కస్తూరికావిరచిత మకరీపత్త్రమయ్యెనో, ఎయ్యది లక్ష్మీదేవియొక్క బంగరు చనుగిండులలో విచ్చిన నల్లకలువ యయ్యెనో, ఎయ్యది నిర్వాణ నిధాన సాధన ప్రక్రియలో యోగులకు సిద్ధాంజనమయ్యెనో, అట్టి కృష్ణుఁడను పేరుగల నల్లని వెలుఁగు మా హృదయములలో ఆవిర్భవించునుగాక!

శ్లో. *ఫుల్లేందీవర కాంతి మిందు వదనం బర్హావతంస ప్రియం*
శ్రీవత్సాంక ముదార కౌస్తుభ ధరం పీతాంబరం సుందరమ్ ।
గోపీనాం నయనోత్పలార్చిత తనుం గోగోప సంఘావృతం
గోవిందం కల వేణునాద నిరతం దివ్యాఙ్గభూషం[8] భజే ॥ 84

అన్వయము:- గోవిందం భజే=గోవిందుని సేవించుచున్నాను.

అర్థము:- ఫుల్లేందీవరకాంతిమ్=విచ్చిన నల్లకలువ కాంతి వంటి కాంతి గలవానిని, ఇందువదనమ్=చంద్రబింబమువంటి నెమ్మోము గలవానిని, బర్హావతంసప్రియమ్=నెమలి పురి సిగబంతిపై మక్కువ గలవానిని, శ్రీవత్సాంకమ్=శ్రీవత్సమనుపేరుగల పుట్టుమచ్చ గలవానిని, ఉదార=వదాన్యమైన, కౌస్తుభధరమ్=కౌస్తుభమణిని ధరించినవానిని, పీతాంబరమ్=పచ్చని వలువ వానిని, సుందరం=అందగానిని, గోపీనామ్=గోపికల యొక్క, నయనోత్పల=కలువ కన్నులతో, అర్చితతనుమ్=పూజింపఁబడిన శరీరము గలవానిని, గోగోపసంఘావృతమ్=గోబృంద గోపాల బృందముల చేత పరివేష్టింపఁబడిన వానిని, కల=అవ్యక్తమధురమైన,వేణునాదనిరతమ్=వేణునాదలోలుఁడైన, దివ్యాంగభూషమ్=దివ్యాభరణ విభూషితుఁడైన, గోవిందం=గోవిందుని, భజే=సేవించుచున్నాను.

---

8 "శ్రీరుక్మిణీశం" (పాఠాంతరము)=రుక్మిణీదేవి భర్తయైన

తాత్పర్యము:- విచ్చిన నల్లకలువల కాంతి గలవానిని, నెమలిపురి సిగబంతి యందు మక్కువ గలవానిని, శ్రీవత్సమను పేరి పుట్టుమచ్చగలవానిని, వదాన్యమైన కౌస్తుభ మణిని ధరించినవానిని, పచ్చవలువవానిని, అందగానిని, గోపికల కలువకన్నులు పూజించిన నెమ్మేనివానిని, గోగోపబృందపరివేష్టితుఁడైనవానిని, దివ్యాభరణభూషితుని, అవ్యక్తమధురమగు వేణునాదలోలుని, గోవిందుని, సేవించుచున్నాను.

శ్లో. ***యన్నాభీ సరసీరు హాంతరపుటే భృంగాయమాణో విధి:***
యద్వక్ష: కమలా విలాస సదనం యచ్చక్షుషీ చేన్ద్వినౌ ।
యత్పాదాబ్జ వినిస్స్రుతా సురనదీ శమ్భో శ్శిరోభూషణం
యన్నామ స్మరణం ధునోతి దురితం పాయా త్స న: కేశవ: ॥ 85

అన్వయము:- స: కేశవ: న: పాయాత్!=ఆ ప్రసిద్ధుఁడైన శ్రీకృష్ణుఁడు మమ్ము రక్షించునుగాక!

అర్థము:- యత్=ఎవ్వనియొక్క, నాభీసరసీరుహ=నాభీకమలముయొక్క, అంతరపుటే=లోపలితేకుదొన్నెయందు, విధి:=బ్రహ్మ, భృంగాయమాణ:=తుమ్మెదవంటి వాఁడగుచున్నాఁడో, యద్వక్ష:=ఎవ్వని వక్ష:స్థలము, కమలా=లక్ష్మీదేవికి, విలాస సదనమ్=విలాస మందిరమో, ఇంద్వినౌచ=(ఇందు+ఇనౌ) చంద్రసూర్యులు కూడ, యచ్చక్షుషీ=ఎవ్వని కన్నులో, యత్=ఎవ్వనియొక్క, పాదాబ్జ=పాదాంబుజమునుండి, విని:సృతా=వెలువడిన, సురనదీ=ఆకాశనది (మందాకిని), శంభో:=శివునకు, శిరోభూషణం=శిరోభూషణమో, యన్నామ స్మరణమ్=ఎవ్వని నామస్మరణము, అఘం=పాపమును, ధునోతి=ఎగురఁ గొట్టుచున్నదియో, స:కేశవ:=అట్టికేశవుఁడు, న:=మమ్ము, పాయాత్=కాపాడునుగాక!

తాత్పర్యము:- ఎవ్వని నాభీకమలము యొక్క లోపలితేకుదొన్నెలో బ్రహ్మ తుమ్మెద యగుచున్నాఁడో, ఎవ్వని వక్ష:స్థలము లక్ష్మీదేవికి విలాసమందిరమో, సూర్యచంద్రులు ఎవ్వని కన్నులో, ఎవ్వని చరణాంబుజమునుండి వెలువడిన ఆకాశనది శంభుని యొక్క శిరోభూషణమో, ఎవ్వని నామస్మరణము పాపమును విదలించుచున్నదో, అట్టి కేశవుఁడు మమ్ము కాపాడునుగాక!

శ్లో. ***రక్షంతు త్వా మసితజలజై రంజలి: పాదమూలే***
మీనా నాభీసరసి హృదయే మారబాణా మురారే: ।
హారా: కంఠే హరిమణిమయా వక్త్రపద్మే ద్విరేఫా:
పింఛాపీడా శ్చికురనిచయే ఘోష యోషి త్కటాక్షా: ॥ 86

అన్వయము:- ఘోష యోషిత్ కటాక్షా: త్వామ్ రక్షంతు!=గొల్లచెలువలయొక్క కడగంటి చూపులు నిన్ను రక్షించునుగాక!

అర్థము:- మురారే:=మురారియొక్క,పాదమూలే=పాదమూలమునందు, అసితజలజై:=నల్లకలువలతోనిండిన, అంజలి:=దోయిలియును, నాభీసరసి=నాభీసరస్సునందు, మీనా:=మీనములును, హృదయే=హృదయమునందు, మారబాణా:=మన్మథబాణములును, కంఠే=కంఠమునందు, హరిమణిమయా:=ఇంద్రనీలమణిమయములైన, హారా:=హారములును, వక్త్రపద్మే=ముఖపద్మమునందు, ద్విరేఫా:=తుమ్మెదలును, చికురనిచయే=కేశభరమునందు, పించాzపీడా:=పింఛాలంకారములునైన, ఘోషయోషిత్కటాక్షా:=గోపికల కటాక్షములు, త్వామ్=నిన్ను, రక్షంతు=రక్షించునుగాక!

తాత్పర్యము:- మురారియొక్క పాదమూలమునందు నల్లకలువలదోసిళ్లను, నాభీసరస్సునందు మీనములును, హృదయమునందు మదనబాణములును, కంఠమునందు ఇంద్రనీలమణిమయములైన హారములును, ముఖపద్మమునందు భ్రమరములును, కేశభరమునందు బర్హాభరణములుగాను పరిణమించిన ఘోషయోషిజ్జనముయొక్క కటాక్షములు నిన్ను రక్షించును గాక!

శ్లో. *దధిమథన నినాదై స్త్యక్తనిద్ర: ప్రభాతే*
నిభృతపద మగారం వల్లవీనాం ప్రవిష్ట: ।
ముఖ కమల సమీరై రాశు నిర్వాప్య దీపాన్
కబళిత నవనీత: పాతు గోపాల బాల: ॥ 87

అన్వయము:- గోపాల బాల: పాతు!=గొల్లపిల్లవాఁడగు కృష్ణుఁడు రక్షించునుగాక!

అర్థము:- ప్రభాతే=ప్రభాత కాలమునందు, దధిమథన నినాదై:=కవ్వపు సవ్వడులతో, త్యక్తనిద్ర:=నిద్రవిడిచినవాఁడై, నిభృతపదమ్=అడుగులసడికాకుండ, వల్లవీనామ్=గోపికలయొక్క, అగారం=మందిరమును, ప్రవిష్ట:=ప్రవేశించినవాఁడై, ముఖకమల సమీరై:=ముఖకమల మారుతములతో (ని:శ్వాసములతో), ఆశు=శీఘ్రముగా, దీపాన్=దీపములను, నిర్వాప్య=ఊది, కబళిత నవనీత:=వెన్నలను కబళించిన, గోపాల బాల:=గోపాల బాలుఁడు, పాతు=రక్షించునుగాక!

తాత్పర్యము:- తెల్లవారువేళలో కవ్వపుసవ్వడులతో నిద్రతొలఁగి, ని:శబ్దచరణముగా గోపికామందిరము ప్రవేశించి, మోము దమ్మియూర్పులతో దీపకళికలను ఊదివైచి, వెన్నలను కబళించిన గోపాలబాలుఁడు కాచుగాక!

శ్లో. ప్రాతః స్మరామి దధిఘోష వినీత నిద్రమ్
నిద్రావసాన రమణీయ ముఖారవిందమ్ ।
హృద్యానవద్య వపుషం నయనాభిరామమ్
ఉన్నిద్ర పద్మనయనం నవనీతచోరమ్ ॥ 88

అన్వయము:- నవనీతచోరమ్ ప్రాతః స్మరామి=వెన్నదొంగయైన చిన్ని కృష్ణుని రేపకడ స్మరించుచున్నాను.

అర్థము:- దధిఘోష=దధిమథన ఘోషములచేత, వినీత=వీడ్కొనఁబడిన, నిద్రమ్=నిద్రగలవానిని, నిద్రావసాన =నిద్రావసాన వేళయందు, రమణీయ=రమణీయమైన, ముఖారవిందమ్=ఆననారవిందము గలవానిని, హృద్య=హృదయంగమమును, అనవద్య=సాముద్రిక దోషవిరహితమునైన, వపుషమ్=దేహము గలవానిని, నయనాభిరామమ్=కన్నులవిందైనవానిని, ఉన్నిద్ర=వికసించిన, పద్మనయనమ్=పద్మముల వంటి కన్నులు గలవానిని, నవనీతచోరమ్=వెన్నలదొంగను, ప్రాతః=ప్రాతఃకాలమునందు, స్మరామి=స్మరించుచున్నాను.

తాత్పర్యము:- దధిమథన నిర్ఘోషములతో నిద్రమేలుకొని - నిద్రావసాన రమణీయమైన ముఖారవిందముతో, హృదయంగమమును, సాముద్రిక దోషవిరహితము నైన నెమ్మేని వానిని, సద్యోవికసిత పుండరీక లోచనుఁడైన - నవనీతచోరుని, ప్రాతఃకాలము నందు స్మరించుచున్నాను.

శ్లో. ఫుల్ల హల్లక వతంస కోల్లస - ద్గల్ల మాగమగవీ గవేషితమ్ ।
వల్లవీ చికుర వాసితాంగుళీ - పల్లవం కమపి వల్లవం భజే ॥ 89

అన్వయము:- కమపి వల్లవం భజే=ఒకానొక గొల్లపిల్లవానిని సేవింతును.

అర్థము:- ఫుల్ల=నెఱవిచ్చిన, హల్లక=ఎఱ్ఱకలువ, వతంసక=కర్ణావతంసముచేత, ఉల్లసత్=ప్రకాశించుచున్న, గల్లమ్=చెక్కిళ్ళుగలవానిని, ఆగమ గవీ=వేద వాక్కులచేత, గవేషితం=అన్వేషింపఁబడినవానిని, వల్లవీ=గోపికాజనముయొక్క, చికుర=కుంతల భరముచేత, వాసిత=పరిమళింపఁబజేయఁబడిన, అంగుళీ పల్లవమ్=చిగురు వ్రేళ్లుగల, కమపి=ఒకానొక, వల్లవం=గొల్లవానిని, భజే=సేవించుచున్నాను.

తాత్పర్యము:- నెఱవిరిసిన యెఱ్ఱకలువను కర్ణావతంసముగాఁదీర్చుటచేత ప్రకాశించుచున్న చెక్కిళ్ళు గల వానిని, వేదవచనములచేత అన్వేషింపఁబడినవానిని, వల్లవీ

ధమ్మిల్ల సువాసితములైన అంగుళీపల్లవములుగల, ఒకానొక గొల్లపిల్లవానిని సేవింతును.

శ్లో. *స్తేయం హరే ర్హరతి యన్నవనీతచౌర్యం*
జారత్వమస్య గురుతల్ప కృతాపరాధమ్ ।
హత్యాం దశాననహతి ర్మధుపానదోషం
యత్ పూతనా స్తన పయః స పునాతు కృష్ణః ॥ 90

అన్వయము:- సః కృష్ణః పునాతు=ఆ ప్రసిద్ధుఁడైన కృష్ణుఁడు (మమ్ము) పవిత్రులను జేయునుగాక!

అర్థము :- హరేః=పాపసంహారియైన హరియొక్క, యత్=ఏ, నవనీత చౌర్యమ్=వెన్న ముచ్చిమికలదో, తత్=అది, స్తేయమ్=స్వర్ణస్తేయమును - బంగారమును దొంగిలించుట అను పాపమును, హరతి=హరించుచున్నది, అస్య=ఈ హరియొక్క, జారత్వమ్= జారభావము, గురుతల్ప=గురుపత్నియందు, కృతాపరాధమ్=చేసిన తప్పును, హరతి=నశింపఁజేయు చున్నది, దశాననహతిః=పౌలస్త్యవధ, హత్యాం=బ్రహ్మ హత్యాదోషమును, హరతి=నశింపఁ జేయుచున్నవి. యత్పూతనాస్తనపయః=పూతన చనుబాలు క్రోలుట యేదికలదో, అది-మధుపానదోషమ్=సురాపానదోషమును, హరతి=నశింపఁజేయుచున్నది, సః=అట్టి, కృష్ణః=కృష్ణుడు, పునాతు=పవిత్రము చేయునుగాక!

తాత్పర్యము:- దురిత సంహారియైన శ్రీహరియొక్క నవనీతచౌర్యము స్వర్ణస్తేయదోషమును హరించుచున్నది. శ్రీహరియొక్క జారభావము - గురుతల్పగమన దోషమును శమింపఁజేయుచున్నది. పౌలస్త్యవధ - బ్రహ్మహత్యాదోషమును శమింపజేయుచున్నది. పూతనాస్తన్యపానము - మధుపానదోషమును హరింపఁజేయుచున్నది. అట్టి శ్రీహరి మమ్ము పాపవినిర్ముక్తులను జేయునుగాక!

శ్లో. *మార! మావస మదీయ మానసే - మాధవైకనిలయే యదృచ్ఛయా!*
శ్రీరమాపతి రిహాగమే దసౌ - కః సహేత నిజ వేశ్మ లంఘనమ్ ॥ 91

అన్వయము:- మార! మదీయ మానసే మావస=ఓ మన్మథుఁడా! నా మనస్సులో నివసింపకుము.

అర్థము :- మార!=ఓ మన్మథుఁడా! మాధవైకనిలయే=మాధవునకొక్కనికి మాత్రమే నివాసమైన, మదీయ మానసే=నాదైన మనస్సునందు, మావస!=నివసింపకుము!, అసౌ=ఈ, శ్రీరమాపతిః=శ్రీలక్ష్మీపతి, యదృచ్ఛయా=యాదృచ్ఛికముగా, ఇహ=ఇచ్చటికి, ఆగమేత్=

రావచ్చును. నిజ వేశ్మ లంఘనమ్=నిజగృహాక్రమణమును, కః=ఎవ్వఁడు, సహేత?=సహించును?

తాత్పర్యము :- ఓయి మన్మథుఁడా! మాధవునకు ఒక్కనికి మాత్రమే నిలయమైన నా మనస్సునందు నివసింపకుము! ఒకవేళ యాదృచ్ఛికముగా శ్రీరమాపతి యిచ్చటికి రావచ్చును. నిజగృహాక్రమణమును ఎవ్వఁడు సహించును?

శ్లో. ***ఆకుంచితం జాను, కరంచ, వామం***
న్యస్య క్షితౌ; దక్షిణ హస్త పద్మే ।
ఆలోకయంతం నవనీత ఖండం
బాలం భజే కృష్ణ ముపానతాంగమ్ ॥ 92

అన్వయము:- బాలం కృష్ణమ్ భజే=బాలకృష్ణుని సేవింతును.

అర్థము:- ఆకుంచితమ్=ముడువఁబడిన, వామం=ఎడమదియైన, జాను=మోఁకాలిని, కరంచ=చేతిని, క్షితౌ=భూమియందు, న్యస్య=నిలిపి, దక్షిణ హస్త పద్మే=కుడికేలు తామరయందున్న, నవనీత ఖండమ్=వెన్నముద్దను, ఆలోకయంతమ్=చూచుచున్న, ఉపానతాంగమ్=వంచిన శరీరముగల, బాలం కృష్ణమ్=బాలకృష్ణుని, భజే=సేవింతును.

తాత్పర్యము :- వంచిన ఎడమమోఁకాలును ఎడమచేతిని నేలపై మోఁపి, కుడిచేతిలో నున్న వెన్నముద్దను అవలోకించుచున్న బాలగోపాలుని సేవించెదను.

శ్లో. ***జానుభ్యా మభిధావంతం - పాణిభ్యామతిసుందరమ్ ।***
సుకుండలాలకం బాలం - గోపాలం చింతయే దుషః[10] ***॥ 93***

అన్వయము:- బాలం గోపాలం ఉషః చింతయే=బాలగోపాల కృష్ణుని ప్రాతఃకాలమున ధ్యానించుచున్నాను.

(**అర్థము** :- జానుభ్యామ్=మోఁకాళ్ళచేతను, పాణిభ్యామపి=చేతులచేతను, అభిధావంతం=పరువులిడుచున్నవాఁడును, అతిసుందరమ్=మిక్కిలి సొగసైనవాఁడును,

---

9 'బాహుభ్యామ్' (పాఠాంతరము)=భుజములచేత
10 'కృష్ణం - ధ్యాయామ్యుషసి బాలకమ్' (పాఠాంతరము)=బాలుడగు కృష్ణుని ప్రాతఃకాలమున ధ్యానించుచున్నాను.

'సుకుండలాలకం' - సు=శ్రేష్ఠములైన, కుండల=కుండలములను, అలకం=ముంగురులను గలవాఁడును, బాలం=బాలుఁడును - అగు, గోపాలం=గొల్లవానిని - గోపాల కృష్ణుని, ఉషః=ప్రాతఃకాలమున, చింతయే=చింతుంచుచున్నాను - ధ్యానించుచున్నాను)

తాత్పర్యము :- మోఁకాళ్లతో, చేతులతో దోఁగాడి నేలపై పురువులు పెట్టుచున్న, అతి సుందరుఁడైన, శ్రేష్ఠములగు కుండలములను ముంగురులను గలిగిన, బాలగోపాలుని ఉషఃకాలమునందు ధ్యానింపవలయును.

శ్లో. *విహాయ కోదండ శరౌ ముహూర్తం*
గృహాణ పాణౌ మణి చారువేణుమ్ ।
మాయూర బర్హం చ నిజోత్తమాంగే
సీతాపతే! త్వాం ప్రణమామి పశ్చాత్ ॥ 94

అన్వయము:- సీతాపతే! త్వామ్ పశ్చాత్ ప్రణమామి=ఓ సీతాపతీ! నీకు ఆ పిమ్మట ప్రణమిల్లెదను.

అర్థము:- సీతాపతే!=ఓ సీతాపతీ!, ముహూర్తం=ఒక ముహూర్త కాలము, కోదండ శరౌ=కోదండశరములను, విహాయ=విడిచి, పాణౌ=చేతియందు, మణిచారు=మణి సుందరమైన, వేణుమ్=వేణువును, గృహాణ!=స్వీకరింపుము! నిజోత్తమాంగే=నిజశిరస్సునందు, మాయూర బర్హంచ=నెమలి పింఛమునుగూడ, త్వామ్=నిన్ను, పశ్చాత్=పిమ్మట, ప్రణమామి=ప్రణమిల్లెదను.

తాత్పర్యము :- ఓ సీతాపతీ! ఒక ముహూర్తకాలము కోదండశరములను విడిచి మణిమయ వేణువును కేలఁగైకొనుము! నిజమౌళి పై నెమలి పింఛము సవరింపుము! ఆపిమ్మట నీకుఁబ్రణమిల్లెదను.

శ్లో. *అయం క్షీరాంభోధేః పతిరితి గవాంపాలక ఇతి*
శ్రితోఽస్మాభిః క్షీరోపనయనధియా గోపతనయః ।
అనేన ప్రత్యూహో వ్యరచి సతతం యేన జననీ
స్తనాద ప్యస్మాకం సకృదపి పయో దుర్లభ మభూత్ ॥ 95

అన్వయము:- అస్మాకం జననీస్తనాదపి సకృదపి పయః దుర్లభమభూత్=మాకు కన్నతల్లి స్తనమునుండి కూడ ఒక్కమాఱుకూడ పాలు కరవైపోయినవి.

అర్థము:- అయం=ఈ, గోపతనయః=గొల్లపిల్లవాఁడు, క్షీరాంభోధేః=పాలకడలికి, పతిరితి=ఒడయఁడని, గవాంపాలకఇతి=గోపాలుఁడని, క్షీర+ఉపనయనధియా=పాలను సంపాదించుకొనవలయునను తలంపుచేత, అస్మాభిః=మాచేత, శ్రితః=ఆశ్రయింపఁబడెను. అనేన=ఈతనిచేత, అస్మాకం=మాకు, ప్రత్యూహః=విఘ్నము, వ్యరచి=విరచింపఁబడినది. యేన=ఎందుచేతననఁగా, జననీస్తనాదపి=కన్నతల్లి స్తనము నుండి కూడ, సకృదపి=ఒక్కమాటు కూడ, పయః=క్షీరము, దుర్లభ మభూత్=కరవైపోయినది!

తాత్పర్యము:- ఈకృష్ణుడుపాలకడలికి ఒడయఁడని, గోపాలకుఁడని, పాలను సంపాదించుకొనవలయునను తలంపుచేత, ఈ గొల్లపిల్లవానిని మేము ఆశ్రయించి కొనయుండఁగా, మాకు కన్నతల్లి స్తనమునుండి కూడ - ఒక్కమాఱు కూడ పాలు కరవైపోయినవి. (పునర్జన్మము లేకుండ పోయినదని ఆశయము).

శ్లో. ***హస్త మాక్షిప్య యాతోఽపి - బలాత్ కృష్ణ! కి మద్భుతమ్?***
హృదయా ద్యది నిర్యాసి - పౌరుషం గణయామి తే ॥ 96

అన్వయము:- కృష్ణ! (యది) హృదయాత్ నిర్యాసి తే పౌరుషం గణయామి=ఓ కృష్ణా! నా హృదయమునుండి పోయెదవేని నీ మగతనమును పరిగణింతును.

అర్థము :- కృష్ణ=ఓకృష్ణా!,బలాత్=బలవంతముగా, హస్త మాక్షిప్య=చేయివిదల్చికొని, యాతోఽపి=పోయితివికదా! కిమద్భుతమ్?=అబ్బురమా యేమి?, హృదయాత్= హృదయమునుండి, యది నిర్యాసి=పోయెదవేని, తే పౌరుషం=నీ పౌరుషమును, గణయామి=పరిగణింతును.

తాత్పర్యము :- కృష్ణా! బలవంతముగా చేయిగుంజుకొని వెళ్లిపోయినావు! అబ్బురమా యేమి? హృదయమునుండి పోఁగలిగినప్పుడు నీ మగతనమును పరిగణింతును.

శ్లో. ***తమసి రవి రి వోద్యన్, మజ్జతా మంబురాశౌ***
ప్లవ ఇవ, తృషితానాం స్వాదు వర్షీవ మేఘః ।
నిధిరివ విధనానాం, దీర్ఘతీవ్రామయాణాం
భిషగివ, కుశలం నో దాతు మాయాతు శౌరిః ॥ 97

అన్వయము:- నః కుశలమ్ దాతుమ్ శౌరిః ఆయాతు!=మాకు భద్రము నిచ్చుటకు శ్రీకృష్ణుడు వచ్చునుగాక!

అర్థము:- తమసి మజ్జతామ్=చీఁకటియందు క్రుంగిపోవుచున్నవారికి, ఉద్యన్=ఉదయించుచున్న, రవిరివ=సూర్యునివలె, అంబురాశౌమజ్జతామ్=సముద్రము నందు మునుఁగుచున్న వారికి, ప్లవఇవ=తెప్పవలె, తృషితానామ్=దప్పికగొన్నవారికి, స్వాదువర్షీ మేఘఇవ=తీయనినీటిని వర్షించుచున్న మబ్బువలె, విధనానామ్=ధనవిహీనులకు, నిధిరివ=నిధివలె, దీర్ఘతీవ్రామయాణామ్=తీవ్రమైన దీర్ఘవ్యాధిలో మునిఁగిన వారికి, బిషగివ=అగదం కారునివలె - వైద్యుని వలె, నః=మాకు, కుశలమ్=భద్రమును, దాతుమ్=ఇచ్చుటకు, శౌరిః=శౌరి, ఆయాతు=వచ్చునుగాక!

తాత్పర్యము:- చీఁకటిలో క్రుంగిపోవుచున్న వారికి - ఉదయించుచున్న సూర్యునివలెను, సముద్రములో మునిఁగిపోవుచున్నవారికి - తెప్పవలెను, దప్పిగొన్నవారికి - తీయనీరువర్షించుచున్న మబ్బువలెను, ధనవిహీనులకు - నిధివలెను, తీవ్రమైన దీర్ఘవ్యాధిచేత కబళింపఁబడినవారికి - భిషక్కువలెను, మాకు కుశలమును ప్రసాదించుటకు శౌరి దయచేయునుగాక!

శ్లో. *కోదండం మసృణం సుగంధి విశిఖం చక్రాబ్జపాశాంకుశం*
హైమీం వేణులతాం కరైశ్చ దధతం సిందూరపుంజారుణమ్ ।
కందర్పాధిక సుందరం స్మితముఖం గోపాంగనా వేష్టితం
గోపాలం మదనాధిపం త మభజం త్రైలోక్యరక్షామణిమ్ ॥ 98

అన్వయము:- తమ్ మదనాధిపం గోపాలం అభజమ్=ఆ మదనగోపాలుని సేవించితిని.

అర్థము :- మసృణం=మిసిమిగల, కోదండం=విల్లును, సుగంధి=పరిమళించుచున్న, విశిఖమ్=తూఁపును, చక్రాబ్జపాశాంకుశమ్=చక్రమును, అబ్జమును,పాశమును, అంకుశమును, హైమీమ్=స్వర్ణమయమైన, వేణులతాంచ=వేణులతను, కరైః=హస్తములతో, దధతమ్=ధరించుచున్న వానిని, సిందూరపుంజారుణమ్=సిందూరపుముద్దవలె అరుణ వర్ణముగలవానిని, కందర్పాధిక సుందరమ్=మన్మథాతిసుందరుని, స్మితముఖమ్=నవ్వుమోముగలవానిని, గోపాంగనావేష్టితమ్=గోపాంగనలచేత పరివేష్టింపఁబడిన వానిని, త్రైలోక్యరక్షామణిమ్=త్రైలోక్యరక్షామణియైన, తమ్=ఆ, మదనాధిపం గోపాలమ్=మదన గోపాలుని, అభజమ్=సేవించితిని.

తాత్పర్యము :- మిసిమి విల్లును, ప్రసవశరమును, చక్రాబ్జపాశాంకుశసమాహారమును, స్వర్ణమయమ్మైన వేణులతను, చేతులలో ధరించినవానిని, సిందూర పుంజారుణమైనశరీరాచ్ఛాయ గలవానిని, మదనాతి సుందరుని, గోపాంగనా పరివేష్టితుఁడైన వానిని, త్రైలోక్యరక్షామణియైన ఆ మదనగోపాలుని సేవించితిని.

శ్లో. *సాయంకాలే వనాంతే కుసుమిత సమయే సైకతే చంద్రికాయాం*
త్రైలోక్యాకర్షణాంగం సురనరగణికా మోహనాపాంగ మూర్తిమ్ ।
సేవ్యం శృంగారభావై ర్నవరసభరితై ర్గోప కన్యాసహస్రైః
వందేఽహం రాసకేళీరత మతిసుభగం వశ్యగోపాలకృష్ణమ్ ॥ 99

అన్వయము:- సాయంకాలే వశ్యగోపాలకృష్ణం అహం వందే=సాయంకాలమునందు వశ్యగోపాలకృష్ణుని నేను నమస్కరించుచున్నాను.

అర్థము :- సాయంకాలే=సాయంకాలమునందు, వనాంతే=వనమధ్యమునందు, కుసుమిత సమయే=పూవులు వికసించుచున్న సమయమునందు, సైకతే=ఇసుక తిన్నెయందు, చంద్రికాయామ్=వెన్నెలలో, త్రైలోక్య=మూఁడులోకములను, ఆకర్షణ=ఆకర్షించునట్టి, అంగమ్=వపుశ్శోభకలవానిని, సురనరగణికా=సురగణికలకు - నరగణికలకు, మోహన=సమ్మోహనములైన, అపాంగ=నయనాంచల ప్రసారములుగల, మూర్తిమ్=ఆకృతి గలవానిని, నవరసభరితైః=నవరస పరిపూర్ణములైన, గోపకన్యాసహస్రైః=సహస్రసంఖ్యగల గోపకన్యలచేత, శృంగారభావైః=శృంగార భావముల తో, సేవ్యమ్=సేవింపదగియున్నవానిని, రాసకేళీరతమ్=రాసకేళీప్రవణుఁడైన వానిని, అతిసుభగమ్=అత్యంత స్పృహణీయుఁడైన - మిక్కిలి సుందరుఁడైన, వశ్యగోపాలకృష్ణమ్=వశ్యగోపాలకృష్ణుని, అహం=నేను, వందే=నమస్కరించుచున్నాను.

తాత్పర్యము :- సాయంసమయము నందు-వనమధ్యమునందు-సైకత స్థలము నందు - పూవులువికసించుచున్న వేళలో, వెన్నెలలో, త్రిభువనాకర్షణమైన దివ్యదేహముగలవానిని, సురగణికలకు-నరగణికలకు సమ్మోహనములైన అపాంగ చలనములు గలవానిని, నవరసభరితములైన గోపకన్యా సహస్రములచేత శృంగారభావములతో సేవ్యమానుఁడగు వానిని, రాసకేళియందు తదేకాసక్తుఁడైన- అత్యంతస్పృహణీయుఁడైన వశ్య గోపాలకృష్ణుని నేను నమస్కరింతును.

శ్లో. **కదంబమూలే క్రీడంతం - బృందావన నివేశితమ్**
పద్మాసన స్థితం వందే - వేణుం గాయంత మచ్యుతమ్ ॥ 100

అన్వయము:- అచ్యుతం వందే=అచ్యుతుని నమస్కరించుచున్నాను.

అర్థము:- కదంబమూలే=నీపద్రుమము క్రింద, క్రీడంతమ్=క్రీడించుచున్నవానిని, బృందావన నివేశితమ్=బృందావనమునందు నివేశముగలవానిని, పద్మాఽసన స్థితమ్=పద్మాఽసన స్థితుఁడై, వేణుం గాయంతమ్=వేణుగానము చేయుచున్న, అచ్యుతమ్=అచ్యుతుని, వందే=నమస్కరించుచున్నాను.

తాత్పర్యము:- బృందావనమునందు నివేశముగలవానిని, కదంబతరు మూలమునందు క్రీడించుచున్న వానిని, పద్మాఽసనస్థితుఁడై వేణుగానము చేయుచున్న అచ్యుతుని నమస్కరించుచున్నాను.

శ్లో. ***బాలం నీలాంబుదాఽభం నవమణి విలస త్కింకిణీ జాలబద్ధ***
శ్రోణీ జంఘాంత యుగ్మం విపుల రురునఖ ప్రోల్లస త్కంఠభూషమ్ ।
ఫుల్లాంభోజాఽభవక్త్రం హత శకటమరుత్ పూతనాఽద్యం ప్రసన్నం
గోవిందం వందితేంద్రాద్యమరవర మజం పూజయే ద్వాసరాఽదౌ ॥ 101

అన్వయము:- వాసరాదౌ గోవిందం పూజయేత్=దిన ప్రారంభ సమయము నందు గోవిందుని పూజింపవలెను.

అర్థము:- వాసరాఽదౌ=దిన ప్రారంభ సమయమునందు, బాలమ్=బాల వయస్కుఁడైనవానిని, నీలాంబుదాభమ్=నీలాంబుదకాంతి గలవానిని, నవ=నూతనమైన, మణీవిలసత్=మణులతో విలసిల్లుచున్న, కింకిణీజాల=మువ్వల మొత్తముతో, బద్ధ=కూర్పఁబడిన, శ్రోణీజంఘాంతయుగ్మమ్=పిఱుఁదులయొక్క, పిక్కలయొక్క, యుగళము గలవానిని, విపుల=విశాలమైన, రురు నఖ=నల్లచారల దుప్పిగిట్టతో, ప్రోల్లసత్=మిక్కిలి ప్రకాశించుచున్న, కంఠభూషమ్=కంఠభూషణము గలవానిని, ఫుల్లాంభోజాభ=వికసించిన తామరపువ్వుయొక్క కాంతిగల, వక్త్రమ్=నెమ్మోము గల వానిని, హత=సంహరింపఁబడిన, శకట=శకటాసురుఁడు, మరుత్=తృణావర్తుఁడు, పూతనా=పూతన, ఆద్యమ్=మొదలైన రాక్షసులు గలవానిని, ప్రసన్నమ్=ప్రసన్నలక్షణము గలవానిని, వందిత=నమస్కరించిన, ఇంద్రాది=ఇంద్రాదులైన, అమరవరమ్=దేవతాశ్రేష్ఠులుగలవానిని, అజమ్=జన్మవిరహితుని, గోవిందం=గోవిందుని, పూజయేత్=పూజింపవలెను.

తాత్పర్యము:- దినప్రారంభవేళయందు - బాలుని, నీలాంబుద శరీరుని, మువ్వ మొత్తములతో వ్రేల్చఁబడిన పిఱుఁదులు పిక్కలు గలవానిని, నల్లచాఱల దుప్పిగిట్ట వ్రేల్చిన

కంఠ భూషణము గలవానిని, వికసిత పద్మము వంటి ఆననము గలవానిని, శకట-తృణావర్త-పూతనాऽది రాక్షసులను సంహరించిన వానిని, ప్రసన్న లక్షణముగల వానిని, ఇంద్రాऽది సురబృంద వందితుఁడైన గోవిందుని పూజింపవలయును.

శ్లో. *వంద్యం దేవై ర్ముకుందం వికసిత కురువిందాऽభ మిందీవరాక్షం*
గోగోపీబృందవీతం జితరిపునివహం, కుందమందారహాసమ్ ।
నీలగ్రీవాऽగ్ర్య పింఛగ్రథన సువిలసత్ కుంతలం భానుమంతం
దేవం పీతాంబరాఢ్యం యజయజ దినశో మధ్యమాహ్నే రమాయై ॥ 102

అన్వయము:- దినశః మధ్యమాహ్నే రమాయై దేవం ముకుందం యజయజ!=దినదినము మధ్యాహ్న సమయమునందు సంపదకొఱకు ప్రకాశస్వరూపుఁడును ముక్తిప్రదుఁడును అగు జనార్దనుని పూజింపుము! పూజింపుము!

అర్థము:- దినశః=దినదినము, మధ్యమాహ్నే=మధ్యాహ్న సమయమునందు రమాయై=సంపదకొఱకు, దేవైః=దేవతలచేత, వంద్యమ్=వందనీయుని, వికసిత కురువిందాభమ్=విచ్చిన మాణిక్యకాంతి గలవానిని, ఇందీవరాక్షమ్=నల్లకలువలవంటి కన్నులు గలవానిని, గోగోపీబృందవీతమ్=గోగోపీబృంద పరివేష్టితుఁడైనవానిని, జితరిపు నివహమ్=శత్రునివహమును జయించినవానిని, కుందమందారహాసమ్=కుంద కుసుమమువలె మందార కుసుమమువలె స్వచ్ఛమైన నవ్వు గలవానిని (దేవలోక మందారము తెల్లనిది), నీలగ్రీవాऽగ్ర్య=మయూరశ్రేష్ఠముయొక్క, పింఛ=బర్హముయొక్క, గ్రథన=కూర్పుతో, సువిలసత్=మిక్కిలి విలసిల్లుచున్న, కుంతలమ్=కుంతలములు గలవానిని, భానుమంతమ్=సూర్యస్వరూపుని, పీతాంబరాऽఢ్యమ్=పీతాంబరధారియైన, దేవం ముకుందమ్=ప్రకాశస్వరూపుఁడు ముక్తిప్రదుఁడునైన జనార్దనుని, యజయజ=పూజింపుము! పూజింపుము!

తాత్పర్యము:- దినక్రమముగా మధ్యాహ్నవేళయందు సంపత్సమృద్ధి కొఱకు - సుర నికర వందనీయుని, వికసిత మాణిక్య కాంతిని, ఇందీవరాక్షుని, గోగోపీ బృందపరివేష్టితుని, శత్రునివహమును జయించినవానిని, కుందమందారహాసుని, మయూరపింఛమును పొదుగుటవలన మిక్కిలి విలసిల్లుచున్న కుంతలభరము గలవానిని, సూర్యస్వరూపుని, పీతాంబరుఁడైన ముకుందుని పూజింపుము! పూజింపుము!

శ్లో. *చక్రాంత ధ్వస్త వైరి వ్రజ మజిత మపాస్తావనీభార మాద్యైః*
ఆవీతం నారదాద్యై ర్మునిభి రభినుతం తత్త్వనిర్ణీతి హేతోః ।

సాయాహ్నే నిర్మలాంగం నిరుపమ రుచిరం[11] చింతయేన్నీలభాసం
మంత్రీ విశ్వోదయస్థిత్యపహరణపదం ముక్తిదం వాసుదేవమ్ ॥ 103

అన్వయము:- మంత్రీ సాయాహ్నే ముక్తిదమ్ వాసుదేవమ్ చింతయేత్=మంత్రానుష్ఠాన తత్పరుఁడైనవాడు సాయాహ్న సమయమునందు ముక్తిప్రదాతయైన వాసుదేవుని ధ్యానింపవలయును.

అర్థము :- మంత్రీ=మంత్రానుష్ఠాన తత్పరుఁడైనవాఁడు, సాయాహ్నే=సాయాహ్న సమయమునందు - చక్రాంత=సుదర్శనాయుధపుటంచుచేత, ధ్వస్త=నశింపజేయబడిన, వైరివ్రజమ్=శత్రునివహము గలవానిని, అజితమ్=వేఱొకనిచేత జయింపఁబడనివానిని, అపాస్త=తొలఁగింపబడిన, అవనీభారమ్=భూభారముగలవానిని, ఆద్యైః=ఆద్యుడైన, నారదాద్యైః=నారదాదులచేత, ఆనీతమ్=పరివేష్టితుఁడైనవానిని, తత్త్వనిర్ణీతి హేతోః=తత్త్వనిర్ణయ కారణము వలన, మునిభిః=మునులచేత, అభినుతమ్=స్తుతింపఁబడిన వానిని, నిర్మలాంగమ్=నిర్మలశరీరుని, నిరుపమ రుచిరమ్=నిరుపమముగా సుందరుడైనవానిని, నీలభాసమ్=నల్లని వెలుఁగు గలవానిని, విశ్వ=ప్రపంచముయొక్క, ఉదయ-స్థితి-అపహరణ=సృష్టి-స్థితి-సంహారములకు పదమ్=స్థానమైనవానిని, ముక్తిదమ్=ముక్తిప్రదాతయైన, వాసుదేవమ్=వాసుదేవుని, చింతయేత్=ధ్యానింపవలయును.

తాత్పర్యము :- మంత్రానుష్ఠాన తత్పరుఁడైన వాఁడు సాయాహ్న సమయుమునందు-సుదర్శనాంచలముతో వైరివ్రజమును నఱికి ప్రోవులుపెట్టిన వానిని, వేఱొకనిచేత జయింపబడని వానిని, భూభారమును తొలఁగించిన వానిని, ఆద్యులైన నారదాదులచేత పరివేష్టింపఁబడిన వానిని, తత్త్వనిర్ణయ కారణమువలన మునులచేత స్తుతింపబడిన వానిని, నిర్మల శరీరుని, నిరుపమ సుందరుని, నీలభాసుని, ముక్తిప్రదుఁడైన వాసుదేవుని ధ్యానింపవలెను.

శ్లో. కోదండ మైక్షవ మఖండ మిషుంచ పౌష్పం
చక్రాబ్జపాశసృణి కాంచన వంశనాళమ్ ।
బిభ్రాణ మష్టవిధ బాహుభి రర్కవర్ణం
ధ్యాయే ద్ధరిం మదనగోప విలాస వేషమ్ ॥ 104

---

11 "నిరుపమమచిరం" (పాఠాంతరము)

అన్వయము:- మదనగోప విలాసవేషమ్ హరిమ్ ధ్యాయేత్=మదనగోపాల విలాసవేషుఁడైన శ్రీమహావిష్ణుని ధ్యానింపవలయును.

అర్థము :- ఐక్షవం=ఇక్షుమయమైన, అఖండం కోదండమ్=అఖండ కోదండమును, పౌష్పమ్=పుష్పమయమైన, ఇషుమ్=బాణమును, చక్ర=చక్రము, అబ్జ=పద్మము, పాశ=పాశము, సృణి=అంకుశము, కాంచన వంశనాళమ్=బంగారు పిల్లనగ్రోవి-వీని సమాహారమును అష్టవిధబాహుభిః=అష్టబాహువులతో, బిభ్రాణమ్=ధరించుచున్న వానిని, అర్కవర్ణమ్=సూర్యవర్ణుఁడైన వానిని, మదనగోప విలాసవేషమ్=మదనగోపాల విలాసవేషుఁడైన, హరిమ్=శ్రీమహావిష్ణుని, ధ్యాయేత్=ధ్యానింపవలయును.

తాత్పర్యము :- ఇక్షువికారమైన అఖండకోదండమును, పుష్ప వికారమైన బాణమును, చక్రాబ్జపాశాంకుశ కాంచన వంశనాళ సమాహారమును, అష్టబాహువులతో ధరించుచున్న అర్కవర్ణుఁడైన మదనగోప విలాసవేషుఁడైన శ్రీహరిని ధ్యానింపవలయును.

శ్లో. ***అంగుల్యా కః కవాటం ప్రహరతి? కుటిలే! మాధవః; కిం వసంతః?***
నో చక్రీ; కిం కులాలః? నహి ధరణి ధరః; కిం ద్విజిహ్వః ఫణీంద్రః? ।
నాహం ఘోరాహిమర్దీ; కి మసి ఖగపతిః? నోహరిః; కిం కపీంద్రః?
ఇత్యేవం గోపకన్యా ప్రతివచన జితః పాతు వ శ్చక్రపాణిః ॥ 105

అన్వయము:- గోపకన్యా ప్రతివచన జితః చక్రపాణిః వః పాతు=గోపిక యొక్క ప్రతివచనములచేత జయింపబడిన శ్రీకృష్ణుఁడు మిమ్ము రక్షించునుగాక!

అర్థము:- అంగుల్యా=వ్రేలితో, కఃకవాటం ప్రహరతి=తలుపు తట్టు చున్నవారెవ్వరు?, కుటిలే!=గడుసుదానా! మాధవః=మాధవుఁడును; కిం వసంతః?=వసంతుఁడవా?, నోచక్రీ=కాదు, చక్రిని; కింకులాలః?= కుమ్మరివా, నహి ధరణిధరః;=కాదు, ధరణి ధరుఁడను కదా!; కిం ద్విజిహ్వః ఫణీంద్రః?=రెండు నాలుకలుగల సర్పరాజువా?, నాహం ఘోరాహిమర్దీ=కాదు; నేను ఘోరసర్పమును మర్దించినవాఁడను; కిమసి ఖగపతిః? =గరుడుఁడవా?, నోహరిః=కాదు, హరిని; కిం కపీంద్రః?=వానరేంద్రుఁడవా? - ఇత్యేవం=ఈ తీఱుగా, గోపకన్యా=గోపికయొక్క,ప్రతివచనజితః=ప్రతివచనములచేత జయింపఁబడిన, చక్రపాణిః=చక్రపాణి, వః=మిమ్ము, పాతు=రక్షించునుగాక!

తాత్పర్యము :- "వ్రేలితోఁఆ తలుపు తట్టుచున్న వారెవ్వరు? - గడసుదానా! నేను మాధవుఁడను; వసంతుఁడవా?-కాదు, చక్రిని; కుమ్మరివా?-కాదు, ధరణిధరుఁడను;

ద్విజిహ్వుఁడవైన ఫణిరాజువా?- కాదు, ఘోరమైన కాళియాహిని మర్దించినవాఁడను: అయిన - గరుత్మంతుఁడవా? - కాదు, హరిని; అయిన - వానరేంద్రుఁడవా?" ఈతీఱుగా గోపిక ప్రతి వచనములకు బదులు పలుకఁజాలక పరాజితుఁడైన చక్రపాణి మిమ్ము రక్షించునుగాక!

శ్లో. *రాధా మోహనమందిరా దుపగత శ్చంద్రావళీ మూచివాన్*
రాధే క్షేమ మయేస్తి? తస్యవచనం శ్రుత్వాహ చంద్రావళీ ।
కంస క్షేమ మయే! విముగ్ధ హృదయే! కంసః క్వ దృష్ట స్త్వయా
రాధా క్వేతి విలజ్జితో నతముఖః స్మేరో హరిః పాతు వః ॥ 106

అన్వయము:- విలజ్జితః నతముఖః స్మేర హరిః వః పాతు=మిక్కిలి సిగ్గుపడినవాఁడై, వ్రాల్చిన మోముగలవాఁడై, స్మేరాననుఁడైన శ్రీకృష్ణుఁడు మిమ్ము రక్షించునుగాక!

అర్థము:- రాధా మోహనమందిరాత్=రాధ కేళిమందిరమునుండి, వెలువడి వచ్చి, చంద్రావళీమ్=చంద్రావళిని, ఊచివాన్=పలికినవాఁడయ్యెను, రాధే! క్షేమమయేస్తి?=ఓ రాధాక్షేమమా?, తస్యవచనమ్=ఆతని మాటను, శ్రుత్వా=విని, చంద్రావళీ=చంద్రావళి, ఆహ=పలుకుచున్నది, కంస! క్షేమమ్=కంసుఁడా! క్షేమమే; అయేవిముగ్ధహృదయే!=ఓ ముగ్ధహృదయురాలా!, త్వయా=నీచేత, కంసః=కంసుఁడు, క్వదృష్టః=ఎచ్చట కానబఁడెను?, రాధా క్వ=రాధ ఎక్కడ? ఇతి=ఈ రీతిని, విలజ్జితః=మిక్కిలి సిగ్గుపడినవాఁడై, నతముఖః= వ్రాల్చినమోము గలవాఁడై, స్మేరః=స్మేరాననుఁడైన, హరిః=శ్రీహరి, వః=మిమ్ము, పాతు=రక్షించునుగాక!

తాత్పర్యము:- రాధకేళిమందిరమునుండి వచ్చుచు దారిలో చంద్రావళినిఁ జూచి శ్రీహరి - రాధనిండిన హృదయముతో, చంద్రావళినిఁజూచి "రాధా! క్షేమమా?" అని పలుకరించెను. స్వామి మాట విని ఆ చంద్రావళి యిట్లు బదులుపలికెను. "కంసా! క్షేమమే" అని; స్వామి యనుచున్నాఁడు - "ఓ భ్రాంతహృదయురాలా! కంసుని నీ వెక్కడ చూచినావు?" అని; చంద్రావళి "రాధ మఱి ఎక్కడ?" అని బదులు పలుకఁగా, విలజ్జితుఁడై నతముఖుడై స్మేరాననుఁడైన శ్రీహరి మిమ్మురక్షించునుగాక!

శ్లో. *యా ప్రీతి ర్విదురార్పితే మురరిపో! కుంత్యర్పితే యాదృశీ*
యా గోవర్ధనమూర్ధ్ని యాచ పృథుకే స్తన్యే యశోదార్పితే ।

భారద్వాజ సమర్పితే శబరికాదత్తేzధరే యోషితాం
యా ప్రీతి ర్మునిపత్ని భక్తిరచితేz ప్యత్రాపి తాం తాం కురు ॥ 107

అన్వయము:- హే మురరిపో! అత్రాపి తాంతాం కురు=ఓ శ్రీకృష్ణా! దీనియందు (ఈ కావ్యమునందు) కూడ ఆయాప్రీతిని అవధరింపుము.

అర్థము :- హే మురరిపో!= ఓ మురసూదనా!, విదురార్పితే=విదురుని విందునందు, యాప్రీతిః=ఎట్టి ప్రీతి నీకుఁగలిగినదో, కుంత్యర్పితే=మీ మేనయత్త కుంతీదేవి సమర్పించిన దానియందు, యాదృశీ ప్రీతిః=ఏ విధమైన ప్రీతిగల్గినదో, గోవర్ధనమూర్ధ్ని=గోవర్ధన శిఖరము నందు, యా=ఏ ప్రీతియో, పృథుకే=అటుకు గింజయందు, యాచ=ఏప్రీతియో, యశోదార్పితే=యశోదయిచ్చిన, స్తన్యే=స్తన్యమునం దెట్టి మక్కువయో, భార ద్వాజ సమర్పితే=భారద్వాజుని విందునందు, శబరికాదత్తే=శబరియిచ్చినదానియందు, యోషితామ్=స్త్రీలయొక్క, అధరే=అధరమునందు, మునిపత్ని భక్తి రచితే=మునిపత్నులు భక్తితో చేసిన దానియందు, యాయా ప్రీతిః= ఏఏ ప్రీతి యున్నదో, అత్రాపి=దీని యందుకూడ, తాంతామ్=ఆయాప్రీతిని, కురు=చేయుము!

తాత్పర్యము :- స్వామీ! మురసూదనా! విదురుని విందునందు నీ కెట్టి ప్రీతిగలదో, కుంతీసమర్పితమైన దానియం దేవిధమైన ప్రీతియో, గోవర్ధనశిఖరమునందెట్టిప్రీతియో, కుచేలుని అటుకులయందు, శబరీసమర్పితమునందు, వనితాధరములయందు, మునిపత్నులు భక్తిలో సమర్పించినదానియందు ఏఏ ప్రీతిగలదో-ఈ కావ్యోపహారమునందు కూడ ఆయా ప్రీతిని అవధరింపుము!

*శ్లో. *కృష్ణానుస్మరణాదేవ - పాప సంఘాత పంజరః ।*
శతధా భేదమాయాతి - గిరిర్వజ్రహతో యథా ॥ 108

అన్వయము :- పాప సంఘాత పంజరః కృష్ణ+అనుస్మరణాత్+ఏవ శతధా భేదమ్ ఆయాతి=గడ్డకట్టిన పాపముల గూఁడు 'కృష్ణ' అన్న వెంటనే నూఱు శకలములుగా బ్రీలిపోవుచున్నది.

(**అర్థము :-** పాప సంఘాత పంజరః - పాప=పాపములయొక్క, సంఘాత=సమూహమనెడి, పంజరః=గూఁడు - గూఁటివలె బంధకమైయున్న పాప సమూహమనుట, కృష్ణ+అనుస్మరణాత్+ఏవ=కృష్ణుని ఎడతెగక స్మరించుట చేతనే,

---

* 'ఈ శ్లోకము ఒకానొక ప్రతియందు మాత్రమే కనుపట్టుచున్నది.

వజ్రహత:=వజ్రాయుధముచేఁ గొట్టఁబడిన, గిరి:యథా=కొండవలె, శతధా=నూఱుపఱియలుగా, భేదం=బ్రద్దలు వాఱుటను, ఆయాతి=పొందుచున్నది.

తాత్పర్యము :- వజ్రాయుధముచేత కొండ నూఱుబ్రద్దలగునట్లు, బంధకమైన పాప సమూహము కృష్ణుని ఎడతెగక స్మరించుట చేతనే పటాపంచలగును).

ఇతి శ్రీ లీలాశుక విరచితే శ్రీకృష్ణకర్ణామృతే

తృతీయ శతకం సమాప్తమ్

సర్వం సంపూర్ణమ్.

శ్రీలీలాశుకుఁడు రచించిన శ్రీకృష్ణ కర్ణామృతమందు

తృతీయ శతకము సమాప్తము

సర్వము సంపూర్ణము.

✡ ✡ ✡

హే దేవ! హే దయిత! హే జగదేక బంధో!
హే కృష్ణ! హే చపల! హే కరుణైక సింధో!
హే నాథ! హే రమణ! హే నయనాభిరామ!
హా! హా! కదాను భవితాసి పదం దృశోర్మే!!

✡ ✡ ✡

అనుబంధము - 1

అమృతచ్ఛందస్సు

ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య

అమృతచ్ఛందస్సు

శ్రీకృష్ణ మహాభావ సౌందర్యలీలానుభవానందమయుడు లీలాశుకుడు. ఆయన అనుభవం వాగ్విలాసంగా వైఖరీ దశనందుకొనేప్పటికి అది 'శ్రీకృష్ణకర్ణామృతం'గా - ఒక అనుభవకావ్యంగా ఆవిష్కృతమయింది. భావుకులకు ఆ కావ్యం శ్రీకృష్ణలీలా సౌందర్యామృత సరోవరం. ఎంతటి భావుకతకు అంతటి అమృతం. చిత్ర విచిత్రమయిన వచోవిన్యాసంతో, ఛందోగమన వైవిధ్యంతో అనుభవనాద వైభవమయిన ఆ కావ్యం మూడాశ్వాసాలుగా విభజింపబడింది. ఈ విభజన అచ్చంగా విషయాన్ని బట్టికాక పద్యసంఖ్యానియతి బట్టి సాగినట్టు స్ఫురిస్తుంది. ఒక్కొక్క ఆశ్వాసం ఒక్కొక్క 'శతక' మనవచ్చును. శతకం పద్యసంఖ్యా నియమంగల ఒక సాహిత్యా ప్రక్రియావిశేషం. సాధారణంగా 'శతకం' నూరు పద్యాలుగా, లేదా నూటెనిమిది పద్యాలుగా ఉంటుంది. నూటతొమ్మిదిగా ఉన్నా ఉండవచ్చు. తెలుగు శతకంలో ప్రతి పద్యాంతాన 'మకుటం' ఉంటుంది. అది సంబోధనగా ఉంటుంది. 'శ్రీకాళహస్తీశ్వరా!', 'భాస్కరా!' వంటివి చూడవచ్చు. కాని, సంస్కృత శతక ప్రక్రియలో ఈ విధమయిన మకుట నియమంలేదు. అందువల్ల మకుట నియమాన్ని బట్టిన ఛందో నియమం - పద్యరూపనియమం లేదు. పద్య వైవిధ్యం సంస్కృత శతకాలలో విరివిగా ఉంటుంది. ఈ కావ్యంలోనూ అంతే. అయితే ఈ మూడాశ్వాసాలలో పద్యసంఖ్య - వావిళ్లవారిప్రతి (1964) ననుసరించి ఈ విధంగా ఉంది:

ప్రథమాశ్వాసం	112	
ద్వితీయాశ్వాసం	111	= 331
తృతీయాశ్వాసం	108	

ఈ లెక్కను బట్టి చూస్తే మొదటి రెండాశ్వాసాల్లో వరుసగా నాలుగు, మూడు=మొత్తం ఏడు పద్యాలు అధికంగా ఉన్నట్టు స్పష్టపడుతుంది. అయితే-

మౌళిశ్చంద్రకభూషణా	1-57
అనుగ్రహద్విగుణ	1-110

ధన్యానాం సరసానులాప	1-111
ముగ్ధంస్నిగ్ధం	2-50
యస్యాత్మభూతస్య	2-111

అనే అయిదు పద్యాలూ ప్రక్షిప్త పద్యాలుగా వావిళ్లవారి ప్రతిలో సూచింపబడింది. 'శ్రీకృష్ణ కర్ణామృతా'న్ని తెలుగులో ప్రవహింపజేసిన వెలగపూడి పెద్దన ఈ పద్యాలను అనువదించకపోవటం అవి ప్రక్షిప్తాలనటానికి బలమయిన కారణం. ఇక, మొదటి ఆశ్వాసం చివర ఉన్న "ఈశానదేవ చరణాభరణేన నీవీ".... (1-112) అనే పద్యం కూడా ప్రక్షిప్తమే నేమోననిపిస్తుంది. లీలాశుక విరచిత కృష్ణ కర్ణామృత కావ్యం కల్పశతాలు గడిచినా ఉండనే ఉంటుంది - ఉండుగాక అనే ఆశంస ఈ పద్య తాత్పర్యం. నిజానికి ఈ విధమయిన తాత్పర్యంగల పద్యం ఉంటే, మూడవ ఆశ్వాసం చివర - మొత్తం కావ్యాంతాన ఉండవలసి ఉంటుంది. లేదా ప్రతి ఆశ్వాసం - శతకం చివర ఉండవలసిఉంటుంది. అట్లా కాక, కేవలం మొదటి ఆశ్వాసం చివరమాత్రమే ఉండటం అసందర్భంగా కన్పిస్తుంది. పైగా దీని రచనాతాత్పర్యరీతికూడా లీలాశుక రీతిగా అన్పించదు. అందువల్ల ఇది ప్రక్షిప్త మనటం సమంజసమనిపిస్తుంది. ఈ విధంగా ఈ పద్యంతో మొత్తం నాలుగు పద్యాలు తగ్గిపోతే నూటెనిమిది పద్యాలుగా శతకమవుతుంది. రెండవ ఆశ్వాసం చివరి 'యస్యాత్మ భూతస్య....' (2-111) వంటి ధోరణికి చెందిందే 'ఈశానదేవ...' పద్యం. మరి 'యస్యాత్మ భూతస్య...' ప్రక్షిప్తం. అందువల్ల ఇది కూడా ప్రక్షిప్తమే కావచ్చు. రెండవ ఆశ్వాసంలో కూడా మరొక పద్యం పరిశీలనలో ప్రక్షిప్తంగా బయటపడితే పడవచ్చు. లేదా రెండవ ఆశ్వాసం నూటతొమ్మిది పద్యాల శతకమనుకున్నా అనుకోవచ్చు. ఏదేమయినా, శ్రీకృష్ణకర్ణామృతం మూడు శతకాల సంపుటి.

ప్రస్తుతానికి యథాతథంగా మొత్తం పద్యసంఖ్య - ప్రక్షిప్తాలన్న వాటిని కూడా కలుపుకొని 331. మరి, ఇవన్నీ ఇకేవిధమయిన పద్యాలు కావు. వీటన్నింటినీ వింగడిస్తే 36 విధాల పద్యాలు ప్రయోగింపబడినట్టు స్పష్టపడుతుంది. వీటిని సమ-అర్ధసమ-విషమ వృత్తాలని మూడువర్గాలుగా విభజించవచ్చు. ఈ మూడు వర్గాల్లోనూ చేరనివి అనుష్టుప్, ఆర్య, (వీటిని గురించి తరువాత కొంత వివరించుకోవచ్చు). కాగా ఆయా పద్యాలు, అవి ప్రయోగింపబడిన సంఖ్య అకారాదిగా గమనిస్తే-

అనుష్టుప్	13		
ఆర్య	14		
			= 27

సమ వృత్తాలు

ఇంద్రవజ్ర	23	మందాక్రాంత	13	
ఉపేంద్రవజ్ర	20	మత్తకోకిల	1	
కరిణి	1	మాలిని	21	
తోటక	2	రథోద్ధత	11	
ద్రుతవిలంబిత	4	రుచిర	2	
నర్కుట	3	వంశస్థ	4	
పథ్య	1	వసంతతిలక	54	
పాలాశ దళ	3	శార్దూలవిక్రీడితం	61	
పృథ్వి	7	శాలిని	2	
ప్రమితాక్షర	1	శిఖరిణి	8	
ప్రహర్షిణి	4	స్రగ్ధర	9	
భుజంగప్రయాత	1	స్రగ్విణి	8	
మంజుభాషిణి	7	స్వాగత	1	
		హరిణి	4	
				= 276

అర్ధసమ వృత్తాలు

* లీలాశుక	7	* శుకలీల	7	
వాణి	1	హంసి	3	
వియోగిని	7			
				= 25

విషమ వృత్తాలు

* వజ్రగతి	2	* సుపద	1
			= 3
		మొత్తం	= 331

* ఈ గుర్తుగల పద్యాలను గురించి కొన్ని విషయాలు తరువాత వస్తాయి.

పై పద్యవృత్తాలకు సంబంధించి కొన్ని వివరణలు.

అనుష్టుప్, ఆర్య అనేవి సమవృత్తాలు కావు. అనుష్టుప్‌లో ప్రతిపాదంలోనూ ఎనిమిదేసి అక్షరాలు ఉండటం మాత్రమే ఆ పాదాల సమత. కాని, దీనికి గణక్రమం లేదా గురు-లఘు వర్ణక్రమ నిర్ణయం - ఏదీ లేదు. అయితే, అన్ని పాదాలలోనూ అయిదవ అక్షరం లఘువుగానూ, ఆరవ అక్షరం గురువుగానూ ఉండటం తప్పనిసరి. అట్లాగే బేసి (1,3) పాదాల్లో ఏడవ అక్షరం గురువుగానూ, సరి (2,4) పాదాల్లో లఘువుగానూ ఉండవలసి ఉంటుంది. ఉదాహరణకు-

కృష్ణానుస్మరణా దేవ । పాప సంఘాత పంజర:
శతధా భేదమాయాతి । గిరి ర్వజ్రహతోయథా.

అయితే, చాలా అరుదుగా పైన చెప్పిన అంశాలలో అక్కడక్కడా వ్యతిక్రమాలు కన్పిస్తాయి. ఉదాహరణకు- "కదంబమూలే క్రీడంతం" (3-100) - ఇందులో అయిదవ అక్షరం లఘువుకాదు. మరి, "తపస్స్వాధ్యాయనిరతం" - ఇందులో ఆరవ అక్షరం గురువుకాదు. అయితే సరిపాదాల్లో మాత్రమే ఆరవఅక్షరం గురువు కావలసి ఉంటుందనే అభిప్రాయాంతరమూ ఉంది. ఏదేమయినా ఈరకం వ్యతిక్రమాలు చాలా అరుదు.

పాదాలకు అక్షరసంఖ్య మాత్రమే నియతమయిన దశనుంచి, పాదాలలోని అక్షరక్రమానికి గురు-లఘు వర్ణత్వ నిర్ణయం (గణక్రమం) నయతమయ్యేదశకు చేరుకొనే మధ్యకాలంలో రూపొందిన పద్యం అనుష్టుప్. అందుకే దీనికి అక్షర సంఖ్య నియతం. వాటి గురు లఘుక్రమం అనియతం. కాని ప్రత్యేకంగా కొన్ని కొన్ని వర్ణాలు గురువులో లఘువులో కావాలనే నిర్ణయం. అందువల్ల పాదాల అక్షర సంఖ్య సమానమే అయినాకూడా

ఇది సమవృత్తంకాదు. సమవృత్తం కావటానికి అక్షరసంఖ్యతోపాటు వాటి గురులఘుత్వ క్రమంకూడా అన్ని పాదాల్లో సమంగా నియతం కావలసిఉంటుంది.

'ఆర్య' మాత్రాచ్ఛందస్సు. అక్షరసంఖ్యగానీ, వాటి గురులఘుక్రమంగానీ ఆర్యకు నియతంకాదు. మాత్రాసంఖ్య మాత్రం నియతం. ఆ మాత్రాసంఖ్య గణపద్ధతిలో చెప్పబడుతుంది. దీని లక్షణం పాదానికి కాక, పూర్వార్ధం, ఉత్తరార్ధం అంటూ చెప్పబడుతుంది. పూర్వార్ధంలో ఏడు చతుర్మాత్రాగణాలు+ఒక గురువు ఉంటాయి. చతుర్మాత్రా గణాలంటే గగ, భ, జ, స, నల. అయితే, ఏడింటిలో బేసిగణం జగణం కారాదు. ఆరవగణం మాత్రం తప్పనిసరిగా జగణమైనా, నలమైనా కావలసి ఉంటుంది. మొదటి మూడుగణాలు ఒకపాదంగా, మిగిలిన నాలుగున్నర గణాలు రెండవపాదంగా - రెండు అసమపాదాలతో పూర్వార్ధం ఏర్పడుతుంది. రెండవపాదంలో ఆరవగణం మొదటి లఘువు తరువాత యతి. ఉత్తరార్ధంకూడా ఇదేవిధంగా ఉంటుందిగాని, ఆరవగణం స్థానంలో ఒకేఒక లఘువు ఉంటుంది. ఉదాహరణకు-

సంసా-రే కిం-సారం-

కంసా-రేశ్వర-ణ కమల-పరిభజ-నమ్

జ్యోతిః-కిమంధ-కారే

యదంధ-కారే-ర-నుస్మర-ణమ్. (2-80)

ఈ ఆర్య పాదాల వ్యత్యస్తత మొదలయిన తీరుల్లో వివిధ భేదాలతో ఉంటుంది. అసలయిన - మూలరూపమయిన ఈ ఆర్యను 'పథ్యార్య' అంటారు. మరి, పథ్యార్య పూర్వార్ధం మాదిరిగానే ఉత్తరార్ధం కూడా ఉంటే - అంటే, ఉత్తరార్ధంలో ఆరవగణం స్థానంలో ఒక లఘువు బదులు చతుర్మాత్రాగణమే ఉంటే, దాని 'గీతి' అంటారు. ఉదాహరణకు-

ప్రహ్లా-ద భాగ-ధేయం -

నిగమమ-హాద్రే-ర్గుహాంత-రాధే-యమ్

నరహరి-పదాభి-ధేయం-

విబుధవి-ధేయం-మమాను-సంధే-యమ్. (2-79)

ఈ పథ్యార్య, గీతి అనే రెండు భేదాలూ శ్రీకృష్ణకర్ణామృతంలో ఉన్నాయి. అయితే వీటిని మొత్తంగా 'ఆర్య'లుగానే పట్టికలో చూపించాను.

సమవృత్తాలు ప్రసిద్ధమే. వీటిలో నాలుగు పాదాలూ ఒకే విధమయిన గణక్రమంతోనే ఉంటాయి. అందుకని అవి సమవృత్తాలు. ఇట్లాకాక సగం ఒక వృత్తం, మరొక సగం మరొక వృత్తంగా ఉంటే అర్ధసమవృత్తాలు. ఈ 'సగం' రెండు రకాలుగా గుర్తించవచ్చు. బేసి (1,3) పాదాలు ఒకరకం, సరి (2,4) పాదాలు మరొకరకంగా ఉండటం. ఇదే ప్రసిద్ధమయిన విధానం. 1,2 పాదాలు ఒకరకం, 3,4 పాదాలు మరొక రకంగా ఉండటం అప్రసిద్ధం - అంటే, చాలా అరుదు. కాగా బేసి, సరిపద్ధతిలో ఉదాహరణకు - (1-24)-

శిశిరీ-కురుతే-కదాను-నః	స-స-జ-గ (సుముఖి)
శిఖిపిం-ఛాభర-ణశ్శిశు-ర్దృశోః	స-భ-ర-లగ. (వనమాలి)

ఉత్తరార్ధం మళ్లీ ఇదే విధంగా ఉంటుంది. ఈ అర్ధసమాలలో పాదాలన్నింటా అక్షరసంఖ్య సమానంగానే ఉండి గణక్రమంమారితే స్వస్థానార్ధసమవృత్తాలంటారు. 'శిశిరీ....' అనేది పరస్థానార్ధసమవృత్తం. స్వస్థానార్ధసమవృత్తానికి ఉదాహరణ: (3-32)

అనన్య-సాధార-ణకాంతి-కాంతం	జ-త-జ-గ-గ ఉపేంద్రవజ్ర
ఆక్రాంత-గోపీన-యనార-విందమ్	త-త-జ-గగ ఇంద్రవజ్ర.

దీన్ని 'ఉపజాతి' అంటారు. ఇంద్రవజ్ర - ఉపేంద్రవజ్ర పాదాల కలగలుపులతో పధ్నాలుగు రకాల 'ఉపజాతి' పద్యాలను లాక్షణికులు గుర్తించారు వాటికి వేరు వేరు పేర్లు కూడా ఉన్నాయి. 'అనన్య..' అన్నది 'హంసి' అనే ఉపజాతి పద్యం. మరి మొదటిది ఇంద్రవజ్ర, రెండవది ఉపేంద్రవజ్ర పాదాలయితే, 'వాణి' అంటారు. ఉదాహరణకు: (3-73) -

అర్థాను-లాపాన్ప్ర-జసుంద-రీణాం	త-త-జ-గగ ఇంద్రవజ్ర
అక్ర్రుత్రి-మాణాంచ-సరస్వ-తీనాం	జ-త-జ-గగ ఉపేంద్రవజ్ర

'శిశిరీ...' అనేది 'వియోగిని'. ఈ మూడు రకాలు గాక మరొక రెండు రకాల అర్ధసమవృత్తాలు శ్రీకృష్ణకర్ణామృతంలో ఉపయోగించబడినాయి. అయితే వాటి పేర్లు నాకింకా దొరుకలేదు. అందుకని వాటికి 'లీలాశుక' (1,3=ససజగగ/2,4=సభరయ) అనీ, 'శుకలీల' (1,3=ననరయ/2,4=నజజరగ) అని పేర్లు పెట్టాను. ఇంతకుముందే ఏవయినా పేర్లుండి, అవి లభిస్తే - ఇవి నామాంతరాలవుతాయి. ఒకే వృత్తానికి రెండు మూడు పేర్లుండటం ఛందోగ్రంథాలను చూస్తే తెలియనే తెలుస్తుంది. మరొకటి: ఇంద్రవజ్ర,

ఉపేంద్రవజ్రలే కాక శాలిని - వాతోర్మివంటి పద్యాల సమ్మేళనాన్నికూడా ఉపజాతి అంటారుగాని, ఆతీరు అరుదు. ఇంకొకటి: ఈ ఉపజాతులకు, తెలుగు ఛందోవిధానంలోని ఉపజాతులకు సంబంధంలేదు. ఏ ఛందో గ్రంథం చూసినా ఈ విషయం స్పష్టపడుతుంది.

విషమవృత్తాల్లో రెండువృత్తాలకన్నా ఎక్కువగా, అంటే, మూడు, నాలుగు వృత్తాల సమ్మేళనంకూడా ఉండవచ్చు. ఒకపాదం ఒకరకంగా, మూడుపాదాలు మరొక రకంగా; ప్రతిపాదం వేరు వేరు వృత్తాలకు చెందినవిగా - ఏ విధంగానైనా ఉండవచ్చు. కొన్ని రకాల విషమవృత్తాలనే లాక్షణికులు ఉదాహరణ ప్రాయంగా గుర్తించారు, వాటికి పేర్లుపెట్టారు. శ్రీకృష్ణకర్ణామృతంలో ఉపయోగింపబడిన విషమవృత్తాలు మొత్తం మూడే. వాటిలో రెండు ఒక విధమయినవి కాగా, ఒకటేమో మరో విధమయింది. ఈ రకాలకు పేర్లుకూడా లభించలేదు. ఇంద్రవజ్ర, ఉపేంద్రవజ్రల సమ్మేళనం పద్యాల్లో ఉంది. అందుకని ఈ విధాన్ని 'వజ్రగతి' అన్నాను. మరొకటి సుముఖి, పదమాలి, చంద్రిక-మూడు పద్యాల సమ్మేళనం 'సుపద' అన్నాను.

సంస్కృతంలో పాదాంతమందున్న లఘువు సాధారణంగా (అవసరాన్ని బట్టి) గురువుగానే భావించబడుతుంది. సాధారణంగా వృత్తాలు గుర్వంత పాదాలవుతాయి. కాబట్టి పాదాంతంలో లఘువున్నా, దాన్ని గురువుగా భావించటం సంస్కృత మర్యాద.

అర్ధసమ, విషమ వృత్తాల్లో పాదాల్లోని అక్షరసంఖ్య భేదిస్తూఉంటుందిగదా! అయితే ఈ తేడా ఒకటి రెండక్షరాలకన్నా ఎక్కువ ఉండకపోవటంకూడా ఉన్నంతవరకు సంస్కృతచ్ఛందోమర్యాద.

కావ్యంలోని మొత్తం మూడువందల ముప్పయ్యొక్క పద్యాలను అకారాదిక్రమంలో పట్టికవేయటం సాధారణంగా కన్పిస్తుంది. అప్పుడు ఏ పద్యం ఎక్కడ ఉందో తెలుసుకోవటం సులభమే. కాని, ఇక్కడ తయారుచేసిన పట్టిక పద్యాలపేర్లనుబట్టి రూపొందింది. ఏ పద్యం ఏ వృత్తమో, పద్యమో తెలుసుకోవటం ఈ పద్ధతిలో సులభం. అనుష్టుప్ పద్యాలు ఎన్ని? అవి ఎక్కడ ఉన్నాయి? అంటే ఇక్కడ సులభంగా తెలుస్తుంది. అంతేకాక ఉపయోగించబడిన పద్యభేదాలెన్ని? అవేవి? అనేదికూడా ఇక్కడ తెలుస్తుంది. పద్యంపేరు ఎదురుగా ఆ పద్యగణక్రమం, యతిస్థానంకూడా సూచింపబడింది. సంస్కృతంలో యతి అంటే పదవిచ్ఛేదం. యతి 7 అని ఉంటే, ఆరవ అక్షరంలో ఒక పదం లేదా ప్రత్యయం విరిగి, 7వ అక్షరంతో మరొక పదం మొదలవుతుంది. ఉదాహరణకు- "అకూరిత స్మేర-దశావిశేషైః" అనే

పాదంలో ఆరవ అక్షరంతో పదం పూర్తయి. ఏడవ అక్షరంతో మరొకపదం మొదలైంది. అట్లాగే సంస్కృతంలో అన్ని పద్యాలకూ పాదాంతయతి తప్పనిసరి. అంటే, పాదాంతంలో పదంకూడా పూర్తికావలసి ఉంటుంది. తెలుగులోని 'యతి' పద్ధతి సంస్కృతంలోని యతి పద్ధతి భిన్నమయినవి.

యతిస్థాన నిర్ణయంలో అభిప్రాయభేదాలు లాక్షణికులలో కన్పిస్తాయి. ఈ పట్టికలో చూపిన యతి స్థానాల విషయంలోనూ ఉండవచ్చు. ఆ విషయం గమనించవలసి ఉంటుంది.

ఈ పట్టికలోని వృత్తాల్లో కొన్ని - ఉదాహరణకు కరిణి వంటివి తెలుగు ఛందోగ్రంథాల్లో కన్పించవు. సమవృత్తాల్లో కన్పించే 'పథ్య' అనేది పథ్యార్య అనే మాత్రా ఛందస్సుకాదు. ఇది వేరే వృత్తం. సంస్కృతచ్ఛందోగ్రంథాలను చూస్తే ఈ విషయాలు అవగతమవుతాయి.

ఇక్కడ చెప్పబడిన అంశాలు, పట్టికలోని పద్యాలు, వాటి లక్షణాలు మొదలయిన వాటికి సంబంధించి విశేషంశాలు, వివరాలు అవసరమయితే శ్రీరావూరి దొరసామిశర్మగారి 'తెలుగుభాషలో ఛందోరీతులు', నా రచనలయిన 'తెలుగు ఛందోవికాసం','ఛందఃపదకోశం' (తెలుగు అకాడమీ ప్రచురణ), 'తెలుగు ఛందస్సుపై కొన్ని వెలుగులు' అన్న గ్రంథాలు చూడవచ్చు.

ఈ పట్టిక తయారుచేయటం వంటి ఈ పని నాచేత చేయించటం ద్వారా శ్రీకృష్ణ కార్యంలో నన్ను అన్వయింపజేసిన ఆత్మీయులు ఆచార్యతంగిరాల వెంకటసుబ్బారావుగారికి, మా గురువుగారు శ్రీ మల్లంపల్లి శరభయ్యగారికి కృతజ్ఞతాపూర్వక నమోవాకాలు సమర్పించుకొంటున్నాను.

ఉపాసతా మాత్మ విదః పురాణాః
పరం పుమాంసం నిహితం గుహాయామ్ ।
వయం యశోదా శిశు బాలలీలా
కథా సుధాసింధుషు లీలయామః ॥

వరంగల్ **-కోవెల సంపత్కుమారాచార్య.**

23-6-1997

అమృతచ్ఛందస్సు 243

అనుష్టుప్

కదంబమూలే క్రీడంతం 3-100

కృష్ణానుస్మరణాదేవ 3-108

జానుభ్యామభిధావంతం 3-93

తేజసేఽస్తు నమోధేను 1-75

దేవ త్రిలోక సౌభాగ్య 1-103

నమస్తస్మై యశోదాయాః 2-84

మణినూపుర వాచాలం 1-16

మాధుర్యేణ విజృంభంతాం 1-105

యత్రవా తత్రవా దేవ 3-71

వత్సపాల చరః కోఽపి 3-26

శృంగారరస సర్వస్వం 1-92

సర్వజ్ఞత్వేచ మౌగ్ధ్యేచ 1-82

హస్త మాక్షిప్య యాతోఽసి 3-96

ఆర్య

అంచిత పింఛాపీడం 2-78

అఖిల భువనైక భూషణ 1-89

అవతారా స్సంత్వన్యే 2-85

ఆభ్యాం విలోచనాభ్యాం 1-43

కలశ నవనీత చోరే 2-81

కింకిణి కిణికిణి రభసైః 2-76

జాగృహి జాగృహి చేతః 3-64

ప్రహ్లాద భాగధేయం 2-79

మదమయ మదమయ దురగం 2-92

మనసి మమ సన్నిధత్తాం 3-74

మాధుర్యాదపి మధురం 1-65

వయమేతే విశ్వసిమః 3-25

సంబాధే సురభీణాం 2-77

సంసారే కింసారం 2-80

ఇంద్రవజ్ర : త-త-జ-గగ (7)

అంకూరిత స్మేర దశావిశేషైః 3-45

అంతర్గృహే కృష్ణ మవేక్ష్య చోరం 2-52

ఆకుంచితం జానుకరంచ వామం 3-92

ఆపాద మాచూడ మతిప్రసక్తైః 3-52

కందర్ప కండూల కటాక్షబందీ 3-21

కృష్ణానమేతత్పునరుక్తశోభం 1-83

చిత్రం తదేత చ్చరణారవిందం 1-88

తృష్ణాతురే చేతసి జృంభమాణం 3-9

నృత్యంత మత్యంత విలోకనీయం 2-67

బాలోఽపి శైలోద్ధరణాగ్రపాణిః 2-73

బాలోయ మాలోల విలోచనేన 1-69

యస్యాత్మ భూతస్య గురోః ప్రసాదాత్ 2-111

రక్షంతు న శ్శిక్షిత పాశుపాల్యా 3-75

రత్నస్థలే జానుచరః కుమారః 2-53

రాగాంధ గోపీజన వందితాభ్యాం 3-72

లక్ష్మీ కళత్రం లలితాబ్జనేత్రం 2-91

లావణ్య వీచీ రచితాంగ భూషాం 3-18

లీలాయతాభ్యాం రసశీతలాభ్యాం 1-45

వందే మురారే శ్చరణారవింద 3-15

విక్రేతుకామా కిల గోపకన్యా 2-56

సారస్య సామగ్ర్య మివాననేన 3-70

సార్ధం సమృద్ధై రమృతాయమానైః 1-23

స్వాతీ సపత్నీ కిల తారకాణాం 2-66

ఉపేంద్రవజ్ర : జ-త-జ-గగ (7)

అఖండ నిర్వాణ రసప్రవాహైః 1-98

అధీర బింబాధర విభ్రమేణ 1-36

అపాంగరేఖాభి రభంగురాభిః 1-10

అమూ న్యధన్యాని దినాంతరాణి 1-41

ఉపాసతా మాత్మవిదః పురాణాః 2-55

ఉలూఖలం వా యమినాం మనో వా 2-57

కరారవిందేన పదారవిందం 2-58

కదాను కస్యాంను విపద్దశాయాం 1-63

జగత్త్రయైకాంత మనోజ్ఞభూమి 3-24

త దేత దాతామ్ర విలోచనశ్రీ 1-84

త్వయి ప్రసన్నే మమ కిం గుణేన 2-100

నిబద్ధ ముగ్ధాంజలి రేషయాచే 1-30

నిర్వాసనం హంత రసాంతరాణాం 3-78

మందార మూలే మదనాభిరామం 1-100

మయి ప్రసాదం మధురైః కటాక్షైః 1-29

మురారిణా వారి విహార కాలే 2-94

మృదుక్వణన్నూపుర మంథరేణ 1-77

విచిత్ర పత్రాంకుర శాలి బాలా 1-22

విదగ్ధ గోపాల విలాసినీనాం 2-51

విహాయ కోదండ శరౌ ముహూర్తం 3-94

కరిణి : స-న-జ-న-భ-స (6-11-16)

తరుణారుణ కరుణామయ విపులాయత నయనం 1-18

తోటక : స-స-స-స (7)

చికురం బహుళం విరళం భ్రమరం 1-61

మధురం మధురం వపురస్య విభోః 1-91

ద్రుతవిలంబిత : న-భ-భ-ర (7)

అధరబింబ విడంబిత విద్రుమం 2-13

చరణయో రరుణం కరుణార్ద్రయో 3-65

మద శిఖండి శిఖండ విభూషణం 1-8

మధుర మంద శుచిస్మిత మంజులం 3-55

నర్కుటి : న-జ-భ-జ-జ-లగ (11)

మధురతర స్మితామృత ముగ్ధ ముఖాంబురుహం 1-5

మృగమద పంక సంకర విశేషిత వన్యమహో 3-46

సుకృతిభి రాదృతే సరసవేణు నినాద సుధా 3-8

పథ్య : ర-య-జ-గ (6)

ప్రేమదంచమే కామదంచమే 1-104

పాలాశదళ : న-న-న-న-న-గగ (11)

అహిమకర కరనికర మృదుమృదిత లక్ష్మీ 1-51

కరకమల దరదళిత లలితతర వంశీ 1-52

కుసుమశర శరసమర కుపితమద గోపీ 1-53

పృథ్వి : జ-స-జ-స-య-లగ (9)

ఉదార మృదుల స్మిత వ్యతిక రాభిరామాననం 3-11

కరౌ శరదుదంచి తాంబుజ విలాస శిక్షాగురూ 1-85

కలక్వణిత కంకణం కరనిరుద్ధ పీతాంబరం 1-20

నిసర్గ సరసాధరం నిజ దయార్ద్ర దివ్యేక్షణం 3-35

సముచ్ఛ్వసిత యౌవనం తరళ శైశవాలంకృతం 1-87

స్మిత స్తబకితాధరం శిశిర వేణునాదా మృతం 3-76

స్మితస్నుత సుధాధరా మదశిఖండి బర్హాంకితా 3-58

ప్రమితాక్షర : స-జ-స-స (9)

నయనాంబుజే భజత కామదుఘం 3-77

ప్రహర్షిణి : మ-న-జ-ర-గ (8)

అశ్రాంత స్మిత మరుణారుణాధరోష్ఠం 1-44
అస్తోక స్మితభర మాయతాయతాక్షం 1-28
గోపీనా మభిమత గీతవేష హర్షా 3-79
విశ్వోపప్లవ శమనైక బద్ధదీక్షం 1-56

భుజంగప్రయాత : య-య-య-య (7)

జిహానం జిహానం సుజానేన మౌగ్ధ్యం 3-68

మంజుభాషిణి : స-జ-స-జ-గ (9)

అనుచుంబితా మవిచలేన చేతసా 3-41
అరుణాధరామృత విశేషితస్మితం 3-17
కరిణామలంఘ్యగతి వైభవం భజే 3-3
జననాంతరేఽపి జగదేకమండనే 3-39
పశుపాలబాల పరిషద్విభూషణం 1-71
మమ చేతసి స్ఫురతు వల్లవీ విభోః 1-17
ముకుళాయమాన నయనాంబుజం విభోః 1-6

మందాక్రాంత : మ-భ-న-త-త-గగ (5,11)

అంగుళ్యగ్రై రరుణకిరణై ర్ముక్త సంరుద్ధ రంధ్రం 2-5
ఓష్ఠం జిఘ్రన్ శిశురితి ధియా చుంబితో వల్లవీభిః 2-69
కృష్ణేనాత్తా సిచయనిచయం కూలకుంజాధిరూఢే 2-8
తే తే భావాస్సకలజగతీ లోభనీయప్రభావాః 3-7
దిష్ట్యా బృందావన మృగదృశాం విప్రయోగాకులానాం 3-53

దేవః పాయా త్త్వయసి విమలే యామునే మజ్జతీనాం 2-3

పాణౌవేణుః ప్రకృతి సుకుమారాకృతౌ బాల్యలక్ష్మీః 3-30

మందమందం మధురనినదై ర్వేణు మాపూరయంతం 2-6

మాత ర్నాతః పర మనుచితం యత్ఖలానాం పురస్తాత్ 2-4

మాధుర్యేణ ద్విగుణ శిశిరం వక్త్ర చంద్రం వహంతీ 1-74

★ ముగ్ధం స్నిగ్ధం మధుర మురళీ మాధురీ ధీరనాదైః 2-50

రక్షంతు త్వా మసితజలజై రంజలిః పాదమూలే 3-86

వేణీమూలే విరచిత ఘనశ్యామ పింఛావచూడో 2-7

మత్తకోకిల : ర-స-జ-జ-భ-ర (11)

పల్లవారుణ పాణిపంకజ సంగి వేణురవాకులం 1-9

మాలిని : న-న-మ-య-య (9)

అనుగత మమరీణా మంబరాలంబినీనాం 3-51

అపి జనుషి పరస్మి న్నాత్త పుణ్యోభవేయం 2-9

అభినవ నవనీత స్నిగ్ధ మాపీతదుగ్ధం 2-1

అయిపరచినుచేతః ప్రాతరంభోజనేత్రం 2-10

అయి మురళి ముకుంద స్మేర వక్త్రారవింద 2-11

తమసి రవిరివోద్యన్మజ్జతా మంబురాశౌ 3-97

త్రిభువన సరసాభ్యాం దీప్తభూషాపదాభ్యాం 1-80

దధిమథన నినాదై స్త్యక్త నిద్రః ప్రభాతే 3-87

నఖనియమిత కండూన్ పాండవ స్యందనాశ్వాన్ 2-47

నిఖిల భువన లక్ష్మీ నిత్యలీలాస్పదాభ్యాం 1-12

ప్రణయ పరిణతాభ్యాం ప్రాభవాలంబనాభ్యాం 1-13

బహుళ చికురభారం బద్ధ పింఛావతంసం 1-46

మధుర మధర బింబే మంజులం మందహాసే 1-64

మురళి నినద లోలం ముగ్ధ మాయూర చూడం 2-89

వ్రజజనమదయోషి ల్లోచనోచ్ఛిష్ట శేషీ 3-12

వ్రజయువతి సహాయే యౌవనోల్లాసి కాయే 2-48

శరణమశరణానాం శారదాంభోజ నేత్రం 3-49

సజల జలద నీలం దర్శితోదార లీలం 2-87

సజల జలద నీలం వల్లవీ కేళి లోలం 2-12

సరసగుణ నికాయం సచ్చి దానంద కాయం 2-90

స్మిత లలిత కపోలం స్నిగ్ధ సంగీత లోలం 2-88

రథోద్ధత : ర-న-ర-లగ (7)

కర్ణ లంబిత కదంబ మంజరీ 2-31

ఖేలతాం మనసి ఖేచరాంగనా 3-80

ఘోష యోషి దనుగీత యౌవనం 3-13

ధేనుపాల దయితా స్తన స్థలీ 1-76

పుల్లహల్లక వతంస కోల్లసత్ 3-89

భాసతాం భవభయైక భేషజం 2-30

మార మావస మదీయ మానసే 3-91

లీలయా లలితయావలంబితం 3-14

వత్స జాగృహి విభాత మాగతం 2-68

సాచి సంచలిత లోచనోత్పలం	2-32
స్యందనే గరుడ మండిత ధ్వజే	2-33
రుచిర : జ-భ-స-జ-గ (8)	
అతంత్రిత త్రిజగదపి వ్రజాంగనా	3-4
అనుగ్రహ ద్విగుణ విశాల లోచనైః	1-110
వంశస్థ : జ-త-జ-ర (8)	
అధీర మాలోకిత మార్ద్ర జల్పితం	1-27
కిశోర వేషేణ కృశోదరీ దృశాం	3-42
పురః ప్రసన్నేన ముఖేందు తేజసా	1-34
మయి ప్రయాణాభిముఖేచ వల్లవీ	3-37
వసంతతిలక : త-భ-జ-జ-గగ (8)	
అగ్రే సమగ్రయతి కామపి కేళి లక్ష్మీం	1-60
అత్యంతబాల మతసీకుసుమ ప్రకాశం	2-19
అవ్యాజ మంజుల ముఖాంబుజ ముగ్ధభావైః	1-15
ఆందోళితాగ్రభుజ మాకుల నేత్రలీలం	1-70
ఆతామ్ర పాణికమల ప్రణయ ప్రతోదం	2-46
ఆపాటలాధర మధీర విలోలనేత్రం	3-63
ఆముక్త మానుష మముక్త నిజానుభావ	3-6
ఆముగ్ధ మర్ధనయనాంబుజ చుంబ్యమాన	1-19
ఆమూల పల్లవిత లీల మపాంగ జాలైః	3-47
ఆరూఢ వేణు తరుణాధర విభ్రమేణ	3-31

ఆలోల లోచన విలోకిత కేళిధారా	1-39
ఆర్ద్రావలోకిత దయాపరిణద్ధ నేత్రం	1-67
ఈశానదేవ చరణాభరణేన నీవీ	1-112
కాంతా కచగ్రహణ విగ్రహబద్ధలక్ష్మీ	1-90
కారుణ్యకర్బుర కటాక్షనిరీక్షణేన	1-25
కోదండ మైక్షవ మఖండ విషుంచ పౌష్పం	3-104
గోధూళి ధూసరిత కోమల కుంతలాగ్రం	2-26
గోధూళి ధూసరిత కోమల గోపవేషం	2-44
ఘోష ప్రఘోష శమనాయ మధోగుణేన	2-23
చాపల్యసీమ చపలానుభవైక సీమ	1-73
చింతామణిర్జయతు సోమగిరి ర్గురుర్మే	1-1
జీయాదసౌ శిఖి శిఖండ కృతావతంసౌ	3-59
తత్త్వన్ముఖం కథమివాబ్జ సమాన కక్ష్యం	1-96
త్వచ్ఛైశవం త్రిభువనాద్భుత మిత్యవైమి	1-32
దూరా ద్విలోకయతి వారణ ఖేలగామీ	1-79
నాద్యాపి పశ్యతి కదాచన దర్శనేన	1-93
పర్యాకులేన నయనాంత విజృంభితేన	3-20
పర్యాచితామృత రసాని పదార్థభంగీ	1-33
పింఛావతంస రచనోచిత కేశపాశే	1-31
ప్రాతఃస్మరామి దధిఘోష వినీత నిద్రం	3-88
బాలాయ నీలవపుషే నవకింకిణీక	2-74

బృందావన ద్రుమ తలేషు గవాం గణేషు	2-21
భక్తిస్త్వయి స్థిరతరా భగవన్ యదిస్యాత్	1-107
భావేన ముగ్ధ చపలేన విలోకనేన	1-35
మాధుర్య వారిధి మదాంధ తరంగ భంగీ	1-14
మారః స్వయంను మధుర ద్యుతి మండనం ను	1-68
యద్రోమరంధ్ర పరిపూర్తి విధాన దక్షా	2-18
యా శేఖరే శ్రుతిగిరాం హృదియోగ భాజాం	2-27
యావన్నమే నరదశా దశమీదృశోఽపి	1-38
యావన్నమే నిఖిల మర్మదృఢాభిఘాత	1-37
రాధా పునాతు జగ దచ్యుత దత్త చిత్తా	2-25
లగ్నం ముహుర్మనసి లంపట సంప్రదాయ	1-50
లీలా ననాంబుజ మధీర ముదీక్షమాణం	1-49
వక్షః స్థలేచ విపులం నయనోత్పలేచ	1-66
వ్యత్యస్తపాద మవతంసిత బర్హిబర్హం	2-22
శుశ్రూషసే యది వచః శ్రుణుమామకీనం	1-97
శైవావయం నఖలు తత్ర విచారణీయం	2-24
సాష్టాంగపాత మభివంద్య సమస్తభావైః	3-33
సువ్యక్త కాంతిభర సౌరభ దివ్యగాత్రం	3-50
సోఽయం మునీంద్రజన మానస తాపహారీ	1-81
సోఽయం విలాస మురళీ నినదామృతేన	1-78
స్తేయం హరేర్హరతి యన్నవనీతచౌర్యం	3-90

హస్తాంఘ్రి నిక్వణిత కంకణ కింకిణీకం 2-20
హే దేవ హే దయిత హే జగదేక బంధో 1-40

శార్దూలవిక్రీడితం : మ-స-జ-స-త-త-గ (13)

అంసాలంబిత వామకుండలభరం మందోన్నతభ్రూలతం 2-102
అగ్రే దీర్ఘతరోఽయ మర్జున తరుః తస్యాగ్రతో వర్త్మనీ 2-43
అస్తి స్వస్తరుణీ కరాగ్ర విలస త్కల్ప ప్రసూనాప్లుతం 1-2
అస్తిస్వస్త్యయనం సమస్తజగతా మభ్యస్త లక్ష్మీ స్తనం 3-1
ఆకృష్టే వసవాంచలే కువలయశ్యామా త్రపాధఃకృతా 2-105
ఆచిన్వాన మహన్యహన్యహని సాకారాన్ వికారక్రమాన్ 1-86
ఆతామ్రాయత లోచనాంశు లహరీ లీలా సుధాప్యాయితైః 3-29
ఆనందేన యశోదయా సమదనం గోపాంగనాభి శ్చిరం 2-54
ఆనమ్రా మసితభ్రువో రుపచితా మక్షీణపక్ష్మాంకురే 1-54
ఆయామేన దృశో ర్విశాలతరయో రక్షయ్య మార్ద్రస్మితం 3-60
ఉత్తుంగ స్తనమండలోపరి లసత్ప్రాలంబ ముక్తామణే 2-64
ఉర్వ్యాం కోఽపి మహీధరో లఘుతరో దోర్భ్యాం ధృతోలీలయా 2-106
ఏణీశాబ విలోచనాభి రలసచ్ఛ్రోణీభర ప్రౌఢిభిః 3-81
ఏతే లక్ష్మణ జానకీ విరహితం మాం ఖేదయం త్యంబుదాః 2-70
ఓష్ఠం ముంచ హరే బిభేమి భవతా పానై ర్హతా పూతానా 2-71
కందర్ప ప్రతిమల్లకాంతి విభవం కాదంబినీ బాంధవం 3-5
కస్తూరీ తిలకం లలాటఫలకే వక్షఃస్థలే కౌస్తుభం 2-109
కస్త్వం బాల బలానుజః కిమిహాతే మన్మందిరా శంకయా 2-82

కామం సంతు సహస్రశః కతిపయే సారస్యధౌరేయకాః	1-99
కాళిందీ పులినే తమాల నిబిడచ్ఛాయే పురస్సంచరత్	3-82
కాళిందీ పులినోదరేషు ముసలీ యావద్గతః ఖేలియం	2-61
కించిత్కుంచిత లోచనస్య పిబతః పర్యాయ పీతస్తనం	2-63
కృష్ణే నాంబ! గతేన రంతు మధునా మృద్భక్షితా స్వేచ్ఛయా	2-65
కైలాసో నవనీతతి క్షితిరియం ప్రాగ్జగ్ధ మృల్లోష్టతి	2-62
కోదండం మసృణం సుగంధి విశిఖం చక్రాబ్జపాశాంకుశం	3-98
గాయంతి క్షణదావసాన సమయే సానంద మిందుప్రభాం	2-101
గోపాలాజిర కర్దమే విహరసే విప్రాధ్వరే లజ్జసే	2-83
చాతుర్యైక నిధానసీమ చపలాపాంగచ్ఛటామంథరం	1-3
తుభ్యం నిర్భర హర్షవర్ష వివశావేశస్ఫుటావిర్భవత్	1-109
దేవక్యా జఠరాకరే సముదితః క్రీతో గవాం పాలినా	2-97
★ ధన్యానాం సరసానులాప సరణీ సౌభాగ్య మభ్యస్యతాం	1-111
పాణౌ పాయసభక్త మాహితరసం బిభ్రన్ముదా దక్షిణే	2-75
పాదే పాద వినిర్జితాంబుజవనౌ పద్మాలయాలంకృతౌ	1-58
పీఠే పీఠ నిషణ్ణ బాలక గళే తిష్ఠన్ స గోపాలకో	2-98
ఫుల్లేందీవర కాంతి మిందువదనం బర్హావతంసప్రియం	3-84
బర్హంనామ విభూషణం బహుమతం వేషాయ శేషైరలం	1-59
బర్హోత్తంస విలాసి కుంతలభరం మాధుర్య మగ్నాననం	1-4
మధ్యే గోకులమండలం ప్రతిదిశం చాంభారవోజ్జృంభితే	2-86
మాతః కింయదునాథ దేహిచషకం కింతేన పాతుంపయః	2-60

మాలాబర్హమనోజ్ఞ కుంతలభరం వన్యప్రసూనోక్షితాం	3-66
★మౌళిశ్చంద్రక భూషణా మరకతస్తంభాభిరామం వపుః	1-57
యజ్ఞై రీజిమహే ధనం దదిమహే పాత్రేషు నూనం వయం	2-99
యద్గోపీవదనేందు మండనమభూ త్కస్తూరికాపత్రకం	3-83
యన్నాభీ సరసీరుహాంతరపుటే భృంగాయమాణోవిధిః	3-85
యస్మిన్నృత్యతి యస్యశేఖరభరైః క్రౌంచద్విష శ్చంద్రకీ	3-16
యాం దృష్ట్వా యమునాం పిపాసు రనిశం వ్యూహో గవాం గాహతే	2-2
యాని త్వచ్చరితామృతాని రసనా లేహ్యాని ధన్యాత్మనాం	1-106
యాప్రీతిర్విదురార్పితే మురరిపో కుంత్యర్పితే యాదృశీ	3-107
రాధా కేళికటాక్ష వీక్షిత మహావక్షఃస్థలీ మండనా	3-57
రాధా మోహనమందిరా దుపగత శ్చంద్రావళీ మూచివాన్	3-106
రాధారాధిత విభ్రమాద్భుతరసం లావణ్యరత్నాకరం	3-2
రామోనామబభూవ హుం తదబలాసీతేతి హుం తాంపితుర్	2-72
లీలాటోప కటాక్ష నిర్భర పరిష్వంగ ప్రసంగాధిక	3-22
లోకానున్మదయన్ శ్రుతీర్ముఖరయన్ క్రోణీరుహాన్హర్షయన్	2-110
శంభో స్వాగత మాస్యతా మిత ఇతో వామేన పద్మాసన	2-59
శ్రీమద్బర్హిశిఖండ మండన జుషే శ్యామాభిరామత్విషే	3-62
సంధ్యావందన భద్రమస్తు భవతే భోః స్నాన తుభ్యం నమో	2-107
సంవిష్టో మణివిష్టరేఽంకతల మధ్యాసీన లక్ష్మీముఖే	2-104
స్కంధావారసదో వ్రజః కతిపయే గోపా స్సహాయాదయః	3-61
స్తోక స్తోక నిరుద్ధ్యమాన మృదుల ప్రస్యంది మందస్మితం	1-21

హే గోపాలక హే కృపాజలనిధే హే సింధుకన్యాపతే 2-108

శాలిని : మ-త-త-గగ (5)

కేఽయంకాంతిః కేశవ త్వన్ముఖేందోః 1-94

తత్కైశోరం తచ్చ వక్త్రారవిందం 1-55

శిఖరిణి : య-మ-న-స-భ-లగ (7)

అయం క్షీరాంభోధేః పతిరితి గవాంపాలక ఇతి 3-95

అరణ్యానీ మార్ద్రస్మిత మధుర బింబాధర సుధా 2-49

కదానా కాళిందీ కువలయదళ శ్యామలతరాః 1-26

గళద్వ్రీడా లోలా మదనవనితా గోపవనితా 1-101

నిధిం లావణ్యానాం నిఖిల జగదాశ్చర్య నిలయం 2-45

పరామృశ్యం దూరే పరిషది మునీనాం వ్రజవధూ 1-48

మునిశ్రేణీ వంద్యం మదభర లసద్వల్లవ వధూ 3-40

లసద్బర్హాపీడం లలిత లలిత స్మేర వదనం 3-69

స్రగ్ధర : మ-ర-భ-న-య-య-య (8,16)

అంగుళ్యా కః కవాటంప్రహరతి, కుటిలే! మాధవః, కిం వసంతో 3-105

చక్రాంతధ్వస్తవైరివ్రజమజిత మపాస్తావనీభార మాద్యైః 3-103

బాలం నీలాంబుదాభం నవమణివిలసత్కింకిణీ జాలబద్ధ 3-101

మల్లైశ్శైలేంద్రకల్పః శిశు రితరజనైః పుష్పచాపోఽంగనాభిః 2-103

మౌళౌ మాయూరబర్హం మృగమదతిలకం చారులాలాటపట్టే 2-93

యద్వేణు శ్రేణిరూపస్థిత సుషిర ముఖోద్గీర్ణనాదప్రభిన్నాః 2-96

యాసాం గోపాంగనానాం లసదసితతరాలోలలీలా కటాక్షాః 2-95

వంద్యం దేవై ర్ముకుందం వికసిత కురువిందాభ మిందీవరాక్షం 3-102

సాయంకాలే వనాంతే కుసుమితసమయే సైకతే చంద్రికాయాం 3-99

స్రగ్విణి : ర-ర-ర-ర- (7)

అంగనా మంగనా మంతరే మాధవో 2-35

కేకి కేకా ధృతానేక పంకేరుహో 2-36

క్వాపి వీణాభిరారావిణా కంపిత: 2-37

చారు చంద్రావళీ లోచనై శ్చుంబితో 2-38

చారు చామీకరా భాస భామావిభు: 2-40

పారిజాతం సముద్ధృత్య రాధావరో 2-42

బాలికా తాళికా తాళ లీలాలయా 2-41

మౌళి మాలా మిళన్మత్త భృంగీలతా 2-39

స్వాగత : ర-న-భ-గగ (7)

దేవకీతనయ పూజనపూత: 2-29

హరిణి : న-స-మ-ర-స-లగ (7,13)

అలస విలసన్ముగ్ధస్నిగ్ధస్మితం వ్రజసుందరీ 3-56

కిమివ శృణుమ: కస్యబ్రూమ: కథం కృత మాశయా 1-42

గురుమృదుపదే గూఢం గుల్ఫే ఘనం జఘనస్థలే 3-67

బహుళ జలదచ్ఛాయాచోరం విలాసభరాలసం 1-47

☆ ☆ ☆

అర్ధసమ వృత్తాలు

లీలాశుక :

1,3=స-స-జ-గగ (7)

2,4=స-భ-ర-య (7)

అధరే వినివేశ్య వంశనాళం, వివరా ణ్యస్య సలీల మంగుళీభిః 2-14

అము నాఖిల గోపగోపనార్థం, యమునా రోధసి నందనందనేన 2-16

కమనీయ కిశోర ముగ్ధమూర్తేః, కలవేణు క్వణితాదృతాననేందోః 1-7

జగదాదరణీయ జారభావం, జలజాపత్య వచో విచారగమ్యం 2-17

భవనం భువనం విలాసినీశ్రీ, స్తనయ స్తామరసాసనః స్మరశ్చ 1-102

వదనే నవనీత గంధవాహం, వచనే తస్కర చాతురీ ధురీణం 2-15

హృదయే మమ హృద్యవిభ్రమాణాం, హృదయం హర్ష విశాలలోలనేత్రం 1-11

వాణి (ఉపజాతి) :

1,3=త-త-జ-గగ ఇంద్రవజ్ర (7)

2,4=జ-త-జ-గగ ఉపేంద్రవజ్ర (7)

అర్థానులాపాన్ వ్రజసుందరీణా, మకృత్రిమాణాంచ సరస్వతీనాం 3-73

వియోగిని :

1,3=స-స-జ-గ సుముఖి (7)

2,4=స-భ-ర-లగ వనమాలి (7)

అతిభూమి మభూమి మేవ వా, వచసాం వాసిత వల్లవీ స్తనం 3-38

పరిపాలయ నః కృపాలయే, త్యసకృ జ్జల్పిత మాత్మబాంధవః 1-62

మధురైకరసం వపుర్విభోః, మధురావీథిచరం భజామహే 3-19

వననేందు వినిర్జితశ్శశీ, దశధా దేవ పదం ప్రపద్యతే 1-95

విరణ న్మణినూపురం వ్రజే, చరణాంభోజ ముపాస్స్వశార్ఙ్గిణః 3-48

శరణాగత వజ్రపంజరే, శరణే శార్ఙ్గణధరస్య వైభవే 3-23

శిశిరీ కురుతే కదానునః, శిఖిపింఛాభరణ శ్శిశు ర్దృశోః 1-24

శుకలీల :

1,3=న-న-ర-య కామదత్త (8)

2,4=న-జ-జ-ర-గ ప్రభాత (8)

అపహసిత సుధామదావ లేపైః, అతిసుమనోహర మార్ద్రమందహాసైః 3-44

జయ జయ జయ దేవ దేవ దేవ, త్రిభువన మంగళ దివ్య నామధేయ 1-108

జయతి గుహశిఖీంద్రపింఛమౌళిః, సురగిరిగైరిక కల్పితాంగరాగః 3-54

త దిద ముపనతం తమాలనీలం, తరళ విలోచన తారకాభిరామం 1-72

ప్రకృతి రవతునో విలాస లక్ష్మ్యాః, ప్రకృతిజడం ప్రణతాపరాధవీథ్యాం 3-43

మధురిమ భరితే మనోభిరామే, మృదులతర స్మిత ముద్రితాననేందౌ 3-27

వర మిమ ముపదేశ మాద్రియధ్వం, నిగమ వనేషు నితాంత చారఖిన్నాః 2-28

హంసి (ఉపజాతి) :

1,3=జ-త-జ-గగ ఉపేంద్రవజ్ర (7)

2,4=త-త-జ-గగ ఇంద్రవజ్ర (7)

అనన్య సాధారణ కాంతి కాంత, మాక్రాంత గోపీ నయనారవిందం 3-32

ముఖారవిందే మకరంద బిందు, నిష్యంద లీలా మురళీ నినాదే 3-28

స కోఽపి బాల స్సరసీరుహాక్షః, సా చ వ్రజస్త్రీజన పాద ధూళిః 3-36

విషమ వృత్తాలు

వజ్రగతి:

1,3,4 పాదాలు త-త-జ-గగ (ఇంద్రవజ్ర)

2 పాదం జ-త-జ-గగ (ఉపేంద్రవజ్ర)

మాయాత పాంథా: పథి భీమరథ్యా:	అ.	
దిగంబర: కోఽపి తమాల నీల: ।	ఇ.	
విన్యస్త హస్తోఽపి నితంబ బింబే	అ.	
ధూర్త స్సమాకర్షతి చిత్తవిత్తం ॥	అ.	2-34
ఏషు ప్రవాహేషు సఏవ మన్యే	అ.	
క్షణోఽపి గణ్య: పురుషాయుషేషు ।	ఇ.	
ఆస్వాద్యతే యత్ర కయాపి భక్త్యా	అ.	
నీలస్య బాలస్య నిజం చరిత్రం ॥	అ.	3.34

సుపద :

1పా. స-స-జ-గ. (సుముఖి)

2,4 పా. న-జ-జ-ర (పదమాలి)

3 పా. న-న-ర-లగ (చంద్రిక)

నిఖిలాగమ మౌళి లాలితం	అ.	
పదకమలం పరమస్య తేజస:	ఇ.	
వ్రజభువి బహుమన్మహేతరాం	ఉ.	
సరస కరీష విశేష రూషితం	ఇ.	3-10

- కోవెల సంపత్కుమారాచార్య

అనుబంధము - 2

శ్రీకృష్ణుని జీవితము

కీ.శే. చర్ల గణపతి శాస్త్రిగారు

శ్రీకృష్ణుని జీవితము

పూర్వము యదువంశీయుఁడైన శూరసేనుఁడను రాజు మధురా పట్టణమును రాజధానిగాఁ జేసికొని శూరసేనములనెడి దేశములను పాలించుచుండెను. ఆ శూరసేనునకు వసుదేవుఁడను కుమారుఁడు గలఁడు. ఆ వసుదేవుఁడు యదుభోజాంధక దేశములకు అధిపతియయిన యుగ్రసేనునికిఁ గుమార్తెయయిన దేవకిని వివాహమాడెను. ఆ దేవకికిఁ గంసుఁడను పేరుగల యన్న గలఁడు. అతఁడు బలవంతుడు, బహు క్రూరుఁడు. అతఁడు తన చెల్లెలు దేవకిని సారె కానుకలతో అత్తవారింటికిఁ బంపుటకై తన చెల్లెలిని బావయగు వసుదేవుని రథముపైఁ గూర్చుండఁబెట్టుకొని స్వయముగా గుఱ్ఱముల పగ్గములు చేతఁబట్టుకొని రథమును నడుపుచుఁ బోవుచుండెను. మార్గమధ్యమునందు 'ఓరీ మూర్ఖుఁడా! నీవు ప్రేమతోఁ జెల్లెలిని సాగనంపుచు రథమును దోలుచుంటివేగాని యీమె యెనిమిదవ గర్భము నిన్నుఁ జంపునుజుమీ' అని యొక యశరీరవాణి వినఁబడెను. అది విని పాపియైన యా కంసుఁడు ఉలిక్కిపడి వెంటనే కత్తి పైకిఁదీసి దేవకి కొప్పుఁ బట్టుకొని చంపఁబూనుకొనెను.

అప్పుడు మెల్లన వసుదేవుఁడు తన బావమఱఁది చేయి పట్టుకొని శాంత వాక్యములతోఁ జల్లఁబఱచుచు నిట్లనియెను. 'నీవు అన్నవు. ఈమె నీ గారాబు చెల్లెలు. ఏదో ఆకాశమున ఏవో నమ్మరాని మాటలు వినఁబడినంత మాత్రమునఁ జెల్లెలిని జంపుట న్యాయమా? ఎప్పటికైనను మనము చనిపోవు వారమె. అందుకని చెల్లెలిని జంపి శాశ్వతముగఁ జెడ్డపేరు తెచ్చుకొందువా. కర్మను తప్పించుకొన నెవరి వశము. అందును ఈ నీ చెల్లెలు ఉత్తమురాలు. నీ యుగ్రరూపము చూచి యెట్లు వడఁకుచున్నదో చూడుము. పెండ్లిలోఁ గట్టిన యీ పసుపుఁబట్టలు ఇంకను విడువనైన లేదు. ఇట్టి నీ చెల్లెలిని జంపుట న్యాయముగాదు' అని.

ఇట్లు వసుదేవుఁ డెంత బ్రతిమాలినను ఆ క్రూరుఁడు మానక చంపఁదలఁచుటచూచి గతిలేక వసుదేవుఁడు "ఈమె యెనిమిదవ గర్భము నిన్నుఁ జంపుననిగదా యశరీరవాణి పలికెను. ఈమెకుఁ బుట్టిన కొడుకులను జంప నీ కప్పగింతును ఈమెను వదులుము" అని పలుక, విని సరెయని తల పంకించి యా కంసుఁడు చెల్లెలిని చంపక విడిచెను. అప్పుడు వసుదేవుఁడు దేవకితోఁ దన గృహమునకుఁబోయి సుఖముండెను.

కొంతకాలమునకు దేవకికి ఒక కుమారుఁడు గలిగెను. అపుడు వసుదేవుఁడు కంసునికి ఇచ్చిన మాట ప్రకారము ఆ కుమారుని దీసికొనివచ్చి కంసునికి అప్పగించెను.

తన బావ వసుదేవుఁడు తాను ఇచ్చిన మాట ప్రకారము కన్న కొడుకును అప్పగించుట చూచి సంతోషముతో "నాకు ఎనిమిదవ గర్భమువల్లఁ జావుగలుగునని గదా యశరీరవాణి పలికెను, వీనివల్ల నాకు భయములేదు. ఆ యెనిమిదవ వానినే చంపెదను? ఈ కొమారుని దీసికొనిపొమ్ము" అని చెప్పి యా కుమారుని వసుదేవుని కప్పగించెను. వసుదేవుఁడు ఆ కుమారుని సంతోషముతోఁ దనయింటికిఁ దీసికొనివచ్చెను. కాని కంసునికి ఎప్పుడేబుద్ధి పుట్టి చంపునో యని దేవకీ వసుదేవులును అక్కడి యాదవులును దలఁచి భయముతోనే యుండిరి.

శత్రు మిత్రులను సమానముగఁ జూచుచు ఎల్లపుడు సత్యమునె పలుకుచు వారి వారి నిజ స్థితులను వారి ముందరనె దెలిపి వారిని సన్మార్గమున నడిపి భగద్భక్తులనుగాఁ జేయుచు, భగవంతుఁడొక్కఁడే మనకు శరణము, అతనినె భజింపుఁడు అని నిర్భయముగఁ దెలుపు భాగవతోత్తముఁడైన నారదుఁడొకనాఁడు కంసుని దగ్గఱకు వచ్చెను. వచ్చి "గొల్ల పల్లెలోని నందుఁడు మొదలైన గొల్లవారును, వసుదేవుఁడు మొదలైన వృషులును, దేవకి మొదలైన యాదవ కాంతలును దేవతలు. ఓ కంసా! నీ జ్ఞాతులును బంధువులును స్నేహితులును దేవతలె. భూమికి బరువైన దైత్యులను జంపుటకే యీ ప్రయత్నము. కాన నీవు జాగరూకతతో, సన్మార్గమున నుండుము" అని నారదుఁడు కంసుని యోగక్షేమమునకై చెప్పి పోయెను. అప్పు డాకంసుఁ డామాటలు వినియు సద్బుద్ధిలేనివాడయి యదువులు దేవతలనియు దేవకి గర్భమున విష్ణువు తన్నుఁ జంపఁబుట్టుననియుఁ దలపోసి దేవకీ వసుదేవాదులను రోహిణిని జైలులో బంధించి, దేవకి కన్నకొడుకు లందఱను జంపసాగెను. పిదపఁ దనకు బుద్ధిచెప్పవచ్చిన తల్లిదండ్రులను సోదరులను బంధువులను బంధించి మహాబలుఁడును క్రూరుఁడునగు కంసుఁడు శూరసేన దేశములనుగూడఁ దానే పాలింపఁదొడఁగెను. పిదప ప్రలంబ చాణూరాది రాక్షసులతోడను, బాణ నరక జరాసంధాది భూపతుల తోడను గూడి కంసుఁడు యాదవులను బాధింపఁదొడఁగెను. యాదవులు కంసుని బాధలు పడలేక నిషధ కురు కోసల విదర్భ కేకయ పాంచాల సాళ్వ దేశంబులకుఁ బోయిరి. కొందఱు కంసునే యాశ్రయించి యుండిరి. కంసుఁడు క్రమక్రమముగ దేవకి కొడుకుల నారుగురను జంపెను. ఏడవసారి దేవకికి గర్భపాతమయ్యెను. ఆ కాలముననే వసుదేవుని భార్యయగు రోహిణికి బలరాముఁడను కుమారుడు గలిగెను. దేవకికి గర్భపాతమగుటయు రోహిణికిఁ గుమారుఁడు గలుగుటయుఁ జూచి దైవమాయ వలన

నట్లు దేవకి గర్భమె సంక్రమించెనని లోకులు చెప్పుకొనసాగిరి. అందుచే నా బాలుఁడు సంకర్షణుఁడని పిలువఁబడెను.

పిదపఁ గొంతకాలమునకు దేవకికి ఎనిమిదవసారి గర్భము నిలిచెను. కంసుఁడు ఎనిమిదవ గర్భము తన్నుఁ జంపుననెడి యాకాశవాణి మాటలు తలఁచుకొని భయపడుచుండెను. కుమారుఁడు గలుగకుండనె దేవకిని కంసుఁడు చంపదలఁచెను. కాని తన చెల్లిలిని జంపఁజేతులాడలేదు. మామూలుకంటె ఇప్పుడు దేవకి గర్భముతోఁ గూడి ప్రకాశించుటచేఁ గంసుని భయము ఇంకను ఎక్కువయ్యెను. అతఁడేవస్తువు చూచిన ఏ శబ్దము విన్న అది యెనిమిదవ గర్భముగాఁ దోఁచసాగెను. కుమారుఁడెప్పుడు పుట్టునా ఎప్పుడు చంపుదునా యని యెప్పటి కప్పుడే తెలిసికొనుచు జాగరూకుఁడై యుండెను. ఆకాశవాణి మాటలు తలఁచుకొని, ఆ మాటల సంగతి విన్న దేవకీ వసుదేవులును యాదవులును అందఱు దేవకి మొగమునందుఁగల దివ్యజ్యోతిని జూచి యా యెనిమిదవ గర్భమునఁ బరమేశ్వరాంశ యున్నదని తలఁచి దాని నెట్లయిన రక్షింపఁ దలపోయసాగిరి. కంసుని బాధలు పడలేక పాఱిపోయిన నందాదులు జైలు కాపలావాఁడు మొదలు మహాత్ముల వఱకుగా సకల లోకులు ఈ దేవకి యెనిమిదవ గర్భమును తమతమ మనస్సులలోఁ దలఁచుకొని స్తుతింపసాగిరి. కంసుఁడు చేయు దుష్టకృత్యములకు ఏవపడిన ఋషులు దేవకి కడుపున ఆధ్యాత్మరూపము భౌతిక రూపము దాల్చి లోకక్షేమము చేయఁదలఁచి యున్నదని సమాధి నిమగ్నులై సంతృప్తి పొందిరి.

శ్రావణ బహుళ అష్టమి శుభదినమున 5100 సం॥లకు పూర్వము అర్ధరాత్రివేళ దేవకికిఁ గుమారుఁడు గల్గెను. ఆ సమయమున సకలదిక్కులు ప్రసన్నములై యుండెను. మేఘములు మంగళ దుందుభులను మ్రోయించెను. కంసుని యాజ్ఞచే రేయింబవళ్ళు అప్రమత్తతోఁ గాచుచుండి నిద్రలేకయున్న ద్వారపాలురు ఆ కుమారుఁడు జనించిన సమయమున మాయానిద్రకు లోనై యొడలు తెలియక పడియుండిరి. దైవమాయచే జైలు తలుపులు తెఱవఁబడెను. అప్పుడు వసుదేవుఁడు ఆ యెనిమిదవ గర్భమును రక్షింప దలఁచి వెంటనే జైలునుండి వెలికివచ్చి యమునా నదిని దాటి గొల్లపల్లెకుఁ బోయెను. సరిగా ఆ సమయముననే నందుఁడను గొల్లవాని భార్య యశోద యనునామె యొక కుమార్తెను గనెను. తల్లి యశోద యొడలు మఱచియుండెను. దైవ విలాసమునకు సంతసించి వసుదేవుడుఁడు ఎవరికిని దెలియకుండ తన కుమారుని యశోద ప్రక్కలో నిశబ్దముగఁ

బరుండఁబెట్టి యా యశోద కుమార్తెను దీసికొని వెంటనే తిన్నగా జైలులోఁ బ్రవేశించి యేమియుఁ దెలియని వానివలె నుండెను.

కొంతసేపటికి ఆ యాడుశిశువు రోదనధ్వని యా ద్వారపాలుర నిద్రకు భంగము కలిగించెను. ద్వారపాలురు ఉలికిపడి లేచి వెంటనే యా సంగతి కంసునికి విన్నవించిరి. ఎనిమిదవ గర్భమును ఎప్పుడు చంపుదునాయని కనిపెట్టుకొనియున్న కంసుఁ డతివేగమునఁ గత్తి చేతఁబూని జైలు దగ్గఱకు వచ్చి వ్రాలెను. వెంటనే కంసుఁడు దేవకి చేతినుండి యా యాడుశిశువును లాగికొనెను. "అన్నా! యీమె యాడుది. నీ మేనకోడలు. నా ఎనిమిదవ పుత్రుఁడు నిన్నుఁ జంపునని గదా నీకు వినఁబడియె. ఈమె పుత్రిక కాని పుత్రుఁడు గాదు. ఈమెనైన దయయుంచి విడువుము'' అని దేవకి యెంత బ్రతిమాలినను వినక యా మూర్ఖుడు ఆ కుమార్తెను చంప ఎగురవైచెను. అంత "ఓరీ! దుర్మతీ! నీ చెల్లెలి పిల్లల నందఱను జంపి కులుకుచుంటివి. నిన్నుఁ జంపువాఁడు ఒకచోటఁ బెరుగుచున్నాఁడులే' ' అని యాకాశమున నామె పలుకుచు ఎగిరిపోయెను.

అప్పుడా పలుకువిని దుఃఖితుడై కంసుఁడు తన చెల్లెలి బావల కాళ్ళపైఁబడి "నేను మీకుఁ గష్టము గలిగించితిని. నా దుష్కార్యములను మన్నింపుఁడు'' అని వేడికొని వారిని జైలునుండి విడుదలగావించి, దేవకీ వసుదేవుల హితవాక్యంబులు విని యింటికిఁ జనియె. మఱునాఁడు తనస్నేహితుల కీ సంగతి తెలుప వారలిట్లనిరి. "నీవు మనదేశములఁగల శిశువులఁ జంపింపుము. అట్లయిన నీ శత్రువు మడసిపోవును. నీకింక భయంబు గ్లుగదు' ' అని. అపుడు ఆ పాపాత్ముడఁగు కంసుఁడు తన యనుచరులం బంపి వారు చెప్పినట్లు చేయింపనెంచెను.

నంద యశోదలును తమ కుమారుని యందచందముల కచ్చెరువుపడి బాలుఁడు తమపాలిటి దైవముగాఁ దలఁచి పెంచఁదొడంగిరి. గొల్లలలోఁ బెద్దయగు నందునికిఁ కుమారుఁడు గలుగుటవిని యా పల్లెలోని గొల్లలు గొల్లతలువచ్చి యా కుమారుని యందముచూచి ముగ్ధులైరి. ఎవరికివారే "మన యశోద చిన్ని మగవాని గనెనట. చూచివత్తము'' రండని రోజురోజు చూడరాఁ దొడఁగిరి. ఆ బాలుడు నల్లనివాఁడుగ నుండుటచే అందఱను ఆకర్షించుటచేఁ గృష్ణుఁడనియు, తామరపువ్వులవంటి కన్నులు గలవాడగుటచే పద్మాక్షుడనియు పిలువఁబడెను. ఒకనాఁడు నందుఁడును కంసునికి గప్పము గట్టఁబోయి యటనున్న మిత్రుఁడగు వసుదేవుని దర్శించి, కంసుడు వసుదేవుని

కొడుకులఁజంపుట యెఱింగినవాఁడు గాన అతని నోదార్చుచుఁ, దనకుఁ గొడుకుఁ గలుగుట నివేదించి "నా కుమారుని నీ కుమారునిగా భావింపుము" అనెను. అప్పుడు వసుదేవుండును "అంతయు భగవంతుని చిత్తము. నీకుఁ గొడుకున్నచో నాకు నున్నట్లే. కంసుఁడు క్రూరుఁడు. గోకులమున ఉత్పాతములు తోఁచుచున్నవి. కుమారుని జాగ్రత్తగఁ జూడుము" అని వలయు జాగ్రత్తలఁ జెప్పి తొందరపెట్టి గొల్లపల్లెకుం బంపెను.

అంత నందుఁడు గొల్లపల్లెకు జని లేకలేక కలిగిన కుమారునికి ఉత్పాతమువల్ల హాని కలుగకుండ జాగ్రత్త వహించెను.

క్రమముగా నందుని యింటఁ జిన్నికృష్ణుఁడు ఆనందముతోఁ జంద్రునికళవలె వర్ధిల్లుచుండెను. ఇట్లుండఁ బూతనయను రాక్షసకాంత కంసుని యాజ్ఞచేఁ బల్లెలవెంటఁ బోయి మాయోపాయములఁ జిన్నపిల్లల హింసించుచు నొకనాఁడు సుందర వేషము ధరించి నందుని యింటికిఁ జనెను. చిన్ని కృష్ణుఁడు ఉయ్యలలోఁ గిలకిల నవ్వుచు గేరింతలు కొట్టుచు ఆడుకొనుచుండెను. అపుడు ఎట్లయిన గృష్ణునిఁ జంపనెంచి పాలిచ్చుటకై తన యొడిలోనికిఁ దీసికొని పాలీయఁ బోయెను. దగ్గఱనున్న గోపకాంతలును యశోదయు "వలదు వలదు మా అబ్బాయికిఁ బాలీయవలదు" అని యా నూతన కాంతను వారించినను ఆమె మానదయ్యె. చిన్ని కృష్ణుడు ఆ పూతన రాక్షసియని గ్రహించి కాళ్ళు చేతులు గుంజుకొనుచు దాని పాలు త్రాగి చంపివైచెను.

చుట్టుప్రక్కల నున్న గొల్లలు నంద యశోదలుఁ బ్రోగయి యామె వికృతాకారమును జూచి ఆ రాక్షసిని పాఱవైచిరి. చిన్ని కృష్ణునకు ఏ యపాయము గలుగనందుకు వేయి దేవుళ్ళకు మ్రొక్కి దిష్టితీసి రక్షరేకులు గట్టించిరి. ఆధ్యాత్మిక తత్త్వవేత్తలు ఈ పూతననె మోహమనెడి విషము పూసికొని ఆనంద స్వరూపుఁడగు కృష్ణునిఁ బతితునిఁ జేయవచ్చిన మాయా దేవతగా వర్ణింతురు.

కొంతకాలమునకు గృష్ణుడు ఒదిగిలఁబడ నేర్చెను. అది జూచి నంద యశోదలు జన్మ నక్షత్రమునాఁడు గీత వాద్యముల తోడను ఇరుగు పొరుగు గొల్లవారితోడను బండియెక్కి యొక వనమున నుత్సవము చేయ బోయిరి. విప్రులు అక్కడ వేద మంత్రములతోఁ గృష్ణుని దీవించిరి. గొల్ల కాంతలు అక్షతలు చల్లిరి. పిదపఁ గృష్ణుని బండిపైని నిద్రపుచ్చి గోపులందరు విందులారగించు చుండిరి. అంతలో శకటాసురుఁడు

వచ్చి మీదపడగా కృష్ణుడు వానిని జంపివైచెను. ఇట్లే తృణావర్తుడు మహిషాసురుఁడు కంసునిచేఁ పంపఁబడి వచ్చి శ్రీకృష్ణునిచే హతులైరి. ఇది చూచి శ్రీకృష్ణుని తల్లిదండ్రులు భగవంతుని దయవల్ల శ్రీకృష్ణుడు సుఖముగా నుండెనని తలంచి సంతోషించిరి. ఆధ్యాత్మిక విదులు శకటాసురాదులను లోభమోహాదులనుగా నెంచిరి. ఆ చిన్నకృష్ణుని యాటలలో కేకలలో మునిగి పోయిరి. ఆ కృష్ణుడు నవ్వెనా, చూచెనా, ఆవులించినా, అప్పుడు ఆ నవ్వులో, ఆ చూపులో, ఆ యావులింతలో సర్వ ప్రపంచమును జూచుచు అంతయు మఱచిపోయి యశోద కనులుమోడ్చి నిశ్చేష్టురాలయ్యెను.

అంతట నొకనాఁడు వసుదేవుడు పంపఁగా యాదవ పురోహితుడైన గర్గమహాముని వచ్చి నందుని నాశీర్వదించి నందుని కుమారులిద్దఱిలో రోహిణి కుమారునికి బలరాముడనియు, యశోద కుమారునికిఁ గృష్ణుడనియు పేర్లుపెట్టి యా కుమారులు పరమాత్ముని యంశముచేఁ బుట్టిన మహానుభావులని తన జ్యోతిశ్శాస్త్ర పాండితినిబట్టి తెలియఁజేసి తన గృహంబునకుఁ బోయెను. నందుఁడిది విని యానందముతో మురియుచుండెను.

క్రమక్రమముగ బలరామకృష్ణులు మెలమెల్లన నడుగులు వేయుచుఁ దోడిబాలురతో నాడుచుఁ దల్లిదండ్రులగు యశోదానందులకేకాక నందునిగొల్లవల్లెలోని గోపగోపికాజనములకును ఆనందము గూర్చుచుండిరి. ఇరుగుపొరుగిండ్ల వారు ముద్దుముచ్చటలకై తీసికొనిపోవ గృష్ణుడు తానును బోవుచు గోపబాలురతోఁ గూడ గొంటె పనులుచేయుచుఁ దిరుగాడఁదొడగెను. "నేను గోపాలుఁడను - మీరు గోవులు" అని, "నేను రాజను - మీరు భటులు" అని, "నేను లోకనాటక సూత్రధారిని - మీరు నటకులు' ' అని పలుకుచు అనేకములైన యాటలు గోపబాలురలో ఆడనేర్చెను. క్రమముగ నాలుగైదేండ్ల ఆ చిన్ని కృష్ణుఁడు తనయాటపాటలచే గోపగోపికా హృదయములతో పాటు ఇంటింటఁదిరిగి వెన్ననుగూడ గ్రహింపసాగెను. ఇది నాయిల్లు అది వారియిల్లు అను భేదము లేకుండ గోపబాలురతో అన్ని యిండ్లకు బోయి తయయిచ్చు వచ్చిన రీతిని జరించదొడగెను. వీరు స్త్రీలు, వీరు పురుషులు అను తేడాగూడ ఆ చిన్నకృష్ణుని మనస్సులోఁ బొడగట్టదయ్యెను. సహజముగాఁ జిన్న పిల్లలలోఁ గలుగు ఋజుస్వభావము కృష్ణునిలో ఇంకను బ్రకాశించెను. ఈ విధముగ అందఱితోఁ గలసి సంచరించెడి యాచిన్న కృష్ణుని యమాయికమైన మృదులమైన నిర్మలాత్మను గ్రహింపఁజాలక 'నీవు వేరు, నేను వేరు' అను భిన్నమనసు గల

లాభనష్టములదృష్టిగల గోపకాంతలు శ్రీకృష్ణుడు చేయుపనులను గొంటెపనులుగా దలఁచి వాని నోర్వలేక యశోద దగ్గరకు వచ్చి యాచిన్న కృష్ణునిపై నేరములు చెప్పసాగిరి.

నోరువాయిగలిగి జ్ఞానముగల మనుష్యులు ఎట్లైనఁ దమబాలురను బోషించుకొనఁగలరుగదా పాపము ఈ లేగల నోరుకొట్టిన నెట్లు - అని తలఁచి దూడలను ఆవుదగ్గఱకు విడిచి పెట్టిన యానందుని పని దయార్ద్రభావము గ్రహింపఁజాలక "బాలులేవని బాలెంతలు మొఱలు పెట్టుచున్నను పకపక నవ్వుచు ఆవులదగ్గఱకు వాని దూడలను నీకృష్ణుఁడు విడిచెను జూచితివా యశోదా?" అని యొక గోపికవచ్చి యనెను.

బీదపడుచులకు వారి పిల్లలకుఁ గ్రాగినపాలు పోయక దాచుకొనుట మంచిదిగాదని దలఁచి యా దయాళువగు కృష్ణుడు కడవలలోని పాలు బీదపడుచుకుఁ బోయుచుండ నదియెరుంగక "ఓ యశోదా! నీబిడ్డ! మాకడవలలోని మంచి క్రాఁగిన పాలు పడుచులకుఁబోసి మిగిలిన కడవలను బగులఁగొట్టెను" అని మఱియొక గోపిక చెప్పెను.

అందఱును ఒకటే కుటుంబములోని వారిఁగాఁ దలఁచి తమతమ సంపదలను దానముచేయకున్నచో ఇట్లే ఏదో విధముగ సంపదలకు నాశముగలుగునవి తెలుపఁదలఁచి, ఎత్తుగానున్న యుట్టెలక్రింద ఱోళ్ళు పీటలు ఒకదానిపై నొకటి ప్రోగుగాఁబెట్టి, అప్పటికిని కుండలోని పాలు వెన్నయందకపోవుటచే కుండకుఁ గ్రిందఁ జిన్న రంధ్రముచేసి, మీగడ పాలు తాను త్రావి తోడిబాలురకుఁ బోయు భగవంతుఁడగు శ్రీకృష్ణుని యాశయము గ్రహింపనేరక "మా కడవలకుఁ జిల్లుచేసి మీఁగడ పాలు త్రాగివేయుచున్నాఁడు మీ కృష్ణుఁడు" అని వేఱొక గోపిక చెప్పెను.

"నేను ఆ బ్రహ్మము నొకటే" అను నద్వైత భావము తెలుపుటకై "నాకంటె నింక వేఱే దైవము లేఁడు" అని పలుకునది గ్రహింపలేక "చూడు యశోదా! నీకొడుకు తానే దేవుడననుచు మా దేవాలయముగోడ పైని ఎంగిలి రాసి మైలపఱచెను" అని యొక గోపాంగన పలికెను.

"నేనింటికిఁబోవుచున్నాను నాతో వచ్చెదవా" అని కృష్ణుఁడనఁగ "నాతో వచ్చెదవా" అని యనెననియు, కొడుకులు లేరని ఇరుగు పొరుగు స్త్రీలతో నొకస్త్రీ చెప్పుచుండ, "లోకములను భరించు దేవుని గొలువ కొడుకులు గలుగుదు"రను నర్థముతో గృష్ణుడు పలుకఁగా, "నన్ను భర్తగాఁగైకొనుము కొడుకులు గలిగెదరు" అని కృష్ణుఁడనెననియు,

ఈ విధముగా అయిదేండ్లు నిండని చిన్నికృష్ణునిమీఁద అనేక విధములైన నేరములు గోపికలువచ్చి యశోదతో జెప్పిరి.

"మీకు బాగుగా లక్ష్మియున్నచోఁ దినవచ్చును గట్టవచ్చును గాని నవ్వుచు మీకొడుకులను మావంటి బీదల యింటికి ఉసిగొలుపుటా, ఓయమ్మా! నీ కొడుకు మా యిండ్లలోని పాలు పెరుగు నుండనీయడమ్మా! ఈ యూరు విడచి ఎక్కడకైనను బోయెదము" అని యిట్లు ఆ గోపికలు పలుక విని యశోద "ఏమిటమ్మా ఇట్లు అనెదరు? చిన్నికృష్ణుడు ఎప్పుడు నా యొడివిడిచి యెక్కడకును వెళ్ళనే వెళ్ళఁడు. మీరు వానిని అట్లు తీసికొనిపోయి అల్లరి చేయించుచు వాఁడు దుడుకుపనులు చేయుచున్నాఁడని యనుచున్నారు. సరే ఇంక మా కృష్ణుని మీ యింటికి రానీయను లెండు" అని వారికి జెప్పి పంపివైచెను.

"కుఱ్ఱవానిని మందలించెదవని చెప్పితిమిగాని యీ మాత్రపు దానికే కోపపడి మా యిండ్లకు రాకుండ జేయుదురా యేమి! పోనీ మేమే సహించెదములే" అని మూతి ముక్కు త్రిప్పుకొనుచుఁ బలికి గోపికలు ఎవరిండ్లకువారు పోయిరి.

ఇంతలో బలరాముఁడును గొల్లబాలురును వచ్చి "కృష్ణుఁడు మన్నుతిన్నాఁడు" అని చెప్పిరి. అదివఱకే గోపికలు వచ్చి చెప్పిన మాటలు యశోదకుఁ జికాకుఁ గలిగించెను. పైఁగా గొల్లబాలురు వచ్చి కృష్ణుఁడు మన్ను తినెనని చెప్పుటతో ఇదివఱకటి చిరాకు కృష్ణునిమీఁద ప్రేమ, మన్ను తినిన కృష్ణునికేమి హానియగునో యను భయము ఇవియన్నియు ఆమె మనసును కలఁతపఱచెను. మెల్ల మెల్లగా గృష్ణుడు వారి వెనుక వచ్చుచుండెను. ఆ కృష్ణుని నడక వాని మొగము యశోద చూచినది. "ఏమిరా కృష్ణా! మన్ను తిన్నావటరా, తినుట కింకేమియు లేవా?" అను పలుకులు అప్రయత్నముగా ఆమె నోటనుండి వెలువడెను. "అమ్మా! నేను మన్ను ఎందుకు తిందునే చూడు ఇదిగో" అని కృష్ణుఁడు పలుకుచు నోరు తెరచెను. చిరునవ్వుతోఁ గూడిన యాయమాయికమగు కృష్ణుని మొగము చూచుటతో వెనుకటి చిరాకు భయము మఱచిపోయినది. కృష్ణుని చిన్ని మొగములోని తెల్లని పలువరుసకాంతులు నక్షత్రకాంతులయ్యెను. కృష్ణుని నోటిలోని చిన్ని యాకాశము విశాలప్రేమతో నిండిన యశోదకు సమస్త నదీపర్వత సముద్ర లోకములను దనలో నిముడ్చుకొనిన విశాలాకాశమయ్యెను. ఎఱ్ఱని చిరుపెదవులతో "ఇదిగో చూడు" అన్నప్పటి గుండ్రని యానోరు ఆమెకు బ్రహ్మాండభాండమయ్యెను. ఆ యశోదకు బాలుని నోటిలో సర్వప్రపంచము కనిపించెను. ప్రేమకు దోఁపని వస్తువేమున్నది? ప్రేమ ఎన్నిటిని భావింప

లేదు? ఏమి చేయలేదు? ప్రేమముందు ఈ సమస్త విశ్వము ఎంతటిది? ఆ కృష్ణుని యశోద సర్వాత్ముఁడగు విష్ణువుగా భావించినది. ప్రేమచేఁ గృష్ణుని విష్ణువుగా భావించి కృష్ణుఁడు సర్వవ్యాపియైన విష్ణువను యశస్సును గృష్ణునికి దానము చేసినందున జనని యశోదయయినది. అంత ఆ చిన్నికృష్ణుని నెత్తికొని అర్ధనిమీలిత నేత్రములతో ముద్దాడుచు తన యింటి లోనికిఁ దీసికొనిపోయెను.

శ్రీకృష్ణుఁడు తమ యింటిలోని వెన్నమీఁగడలను దల్లికిఁ దెలియకుండఁ దోడి బాలురకుఁ బెట్టుచుఁ దినుచున్నట్లుగనే యితరుల యిండ్లలోని వెన్నమీఁగడలను దెచ్చి తినుట సహింపలేక యిట్లు గోపికలు వచ్చి యశోదతోఁ జెప్పిరి. పెరుగు తఱచి వెన్నను గ్రహించునట్లు సంసారమును దఱచి దైవతత్త్వమును గ్రహింపవలయునని శ్రీకృష్ణుఁడు బోధించుచున్నట్లు ఆధ్యాత్మికవిదులు తలఁచిరి. ఆ చిన్ని బాలునికి ఇది తన యిల్లు ఇది ఇతరులయిల్లు అను భేదము తెలియదు. వసుధయంతయు ఏక కుటుంబముగాఁగల పరమాత్మ యాత్మ యతనిలో ప్రతిఫలించుచుండెను. వెన్న పాలు పెరుగులు అమ్ముకొని జీవించు గోపికలకు ఆ చిన్నికృష్ణునిమీఁద ఎంతటి ప్రేమయున్నను వెన్నమీఁగడలు అయిపోవుటజూచి సహింపలేకపోయిరి.

ఒకనాఁడు యశోద కుండలో మీఁగడ పెరుగుపోసి కవ్వముతోఁ దఱచసాగెను, అంతలోఁ జన్నికృష్ణుఁడు పాలిమ్మని తల్లి చేతిలోని కవ్వము పట్టుకొని వేధించఁదొడగెను. అప్పుడు యశోద కృష్ణునికిఁ బాలిచ్చుచు ఇంటిలోని పాలు పొంగి పొయ్యిలో పడిన వాసనవచ్చుట చూచి తటాలునఁ గృష్ణుని అక్కడ దిగవిడిచి పాలుదించ త్వరగా నింటిలోనికిఁ బోయెను. పాలు ఇచ్చుచు సగములో దిగవిడిచి పోవుట కృష్ణునికిఁ గోపకారణమయ్యెను. అపుడు కాళ్ళు చేతులు ఆడించుచు అక్కడనున్న ఱాతితో ఆ తఱచుచున్న కుండను బగులఁగొట్టి యందులోని వెన్నను తినుచు దల్లి వచ్చుచుండుట చూచి వట్టి బుడిబుడియేడ్పులు ఏడ్వసాగెను. తన యెదుట కుండ పగిలియుండుట పెరుగు ఒలికియుండుట యశోద చూచినది. అసలె యామె మనస్సు గోపికలు చెప్పిన నేరములచే జికాకుపడియుండెను. ఆమె యింక ఊరుకొనలేకపోయినది. దగ్గఱనె యొకటి పడియుండెను. అంత ఆ కవ్వపుత్రాడుతో "వీరెవ్వరు? శ్రీకృష్ణులుగారా? వెన్నయంటే యేమో తెలియదఁట! దొంగతనమంటే ఏమియు తెలియదట! ఇట్టి నియతులు జగతిలో గలరా?" అని పలుకుచు కృష్ణునిఁగట్ట యత్నించెను. ఒకమూల ప్రేమ, ఇంకొకప్రక్క

కోపము, ఇంకొకప్రక్క కృష్ణుని కొంటెతనము, ఇంకొకప్రక్క భగవత్తత్త్వము - ఇవన్నీ కలిసి ఆ త్రాడు కృష్ణుని నడుమునకు సరిపడకుండఁజేసెను. చివరకు యశోద ఆ కృష్ణుని రోలికి గట్టివైచి యింకెక్కడకుఁ గృష్ణుడు వెళ్ళలేఁడని తలచి యింటిలోనికి వెళ్ళెను. అంతట స్వేచ్ఛగా సంచరించు చిన్నికృష్ణుడు ఆ నిర్బంధమును ఎట్లు సైపగలడు? స్వేచ్ఛకుఁ గలిగిన నిర్బంధము ముందు రోలుబరువు బరువుగా దోఁపలేదు. తల్లి యింటిలోనికిఁ బోవుటజాచి యిదేసందని ఆ రోలును కృష్ణుడు ఈడ్చుకొనిపోయెను. చైతన్యశక్తిముందు జడమగు ప్రకృతిశక్తి యెంతటిది? శ్రీకృష్ణుడు ఆ రోలిని దారిలోనున్న రెండు చిన్న మద్దిచెట్లుగుండ ఈడ్చుకొనిపోయి, వాటిని గూల్చివైచి, వాటి జడత్వమును గంధర్వుల శాపమును బోఁగొట్టి, వాటి ఉత్తమగతికిఁ గారణమయ్యెను. ఆ చెట్లుపడిన ధ్వనికి నందుఁడు మొదలయినవారు వచ్చి, రోలుతోనున్న బాలుని సురక్షితుఁడై యుండుటచూచి సంతసించి, అది వసుదేవుఁడు చెప్పిన యుత్పాతముగా దలఁచి యా కృష్ణుని విడిపించి యెత్తుకొనిరి.

ఇట్టి యుత్పాతములనుండి తప్పించుకొనుటకు నందాదులు బృందావనమునకుఁ బ్రయాణమైపోయిరి. ఆ బృందావనములో రోహిణీయశోదల కుమారులు బలరామకృష్ణులు గోపకులతో ఆలమందలతోఁ దిరుగుచు దూడలను గాచుచుఁ బిల్లనఁగోవు లూదుచు వనములలో విహరింపఁదొడఁగిరి. బలరామకృష్ణులు చిన్నవారలయ్యు గోమాతలను బుజ్జగించుచుఁ గొడెలను సరిగ నాడించుచుఁ బొగరువృషభంబులను లొంగదీయుచు గోపబాలురకు నాయకులయి అందుఅనేక క్రీడల నాడఁదొడగిరి. ఇటులుండ నొకనాఁడు ఒక పొగరుకోడె బాలునిపైఁ బడెను. అది క్రూరుఁడయిన కంసుని మాయచే వచ్చిన వత్సాసురుఁడు. అపుడు వానిని జంపి లోక క్షేమము గూర్చెను.

ఇట్లు బకాసురుని అఘాసురిని ధేనుకాసురుని చంపెను. మహిమల ద్వారాగాని దైవతత్త్వమును దెలిసికొనలేని సామాన్య మానవులకై పౌరాణికులు పూతనాదులను రాక్షసులగను ఆధ్యాత్మికవిదులు ఉత్తమ పురుషునిఁ బాడుచేయు కామక్రోధాదులుగను వర్ణించిరి. అయిదారు ఏండ్ల వయసులోనె యిట్టి పనులు చేసిన కృష్ణుని గొల్లలు అందరు మెచ్చుకొనదొడగిరి. వనదేవతలు పుష్పవర్షములు కురిపించిరి.

ఇట్లు కృష్ణుడు గొల్లబాలురతో వనములందుఁ దిరుగుచుండెను. ఒక్కొక్కప్పుడు అందరుగలిసి చల్దులారగింతురు. ఒక్కొక్కప్పుడు జలములందేలియాడుదురు. ఒకరి కంచములో నొకరు దినుచు అభేదముగా నుందురు. గోవులతోను గోపబాలురతోను

సకలసృష్టితో దాను ఏకమై యానందములఁ దేలియాడుచు శ్రీకృష్ణుఁడిట్లు తనబాల్యమును గడుపుచుండెను. ఒకప్పుడు తాము ఆటలలో మునిగియుండ గోవులు మాయమై కనిపించకపోఁగా తాను మరల సృష్టించెను. అంతటికి బ్రహ్మదేవుడే కారణమని తలఁచు గొల్లలకు ఇది బ్రహ్మమాయగ దోచెను. గోవులను దమకు మరల దెచ్చినందుకు గోపబాలురు అతనిని మెచ్చుకొనిరి.

ఇట్లుండ నొకనాఁడు కృష్ణుఁడు గోపబాలురతోఁ గూడి కాళింది నది దగ్గఱకు ఆవులమందలను మేపఁబోయెను. అక్కడ కాళియసర్పమను పేర నొక పెద్ద సర్పము గలదని అది చాలమందిని చంపెనని వాడుకయుండుటచే గోపబాలురెవ్వరును అటువైపు పోయెడివారు గాదు. శ్రీకృష్ణుడు భయమనుమాట నెఱుఁగడు. భయమె బాధలకు మూలము, నిర్భయమె ఆనందములకు మూలముగదా! అంతట గోపబాలురు వారించినను మానక వారిని దీసికొని యటకుఁ బోయెను. అక్కడనున్న యొక కదంబవృక్షము నెక్కి గోపబాలురతో కృష్ణుడు ఆడుచుండెను. అంత నాకాళీయ సర్పము బయలువెడలెను. దానిని జూచి భయపడవలదని తోడి బాలురకుఁ జెప్పి దానిమదమడఁచి యా ప్రదేశము నిర్భయమొనరించెను. దీనినె యాధ్యాత్మికవిదులు సంసారమనెడి కాళీయహ్రదములో కామక్రోధాదులనెడి వేయితలల సర్పమును లొంగఁదీసికొన్న కృష్ణుని పరమాత్మునిగాఁ దలఁతురు. ఆ కామక్రోధాది సర్పముల విషమే సంపసార హ్రదములో వ్యాపించి అందుఁజొచ్చిన జనులందఱను జంపుచున్నది. కానఁ బరమాత్ముని శరణుఁజొచ్చినచో దాని బారి నుండి రక్షణదొరకునని జనులు గ్రహింపవలయును. ఒకసారి వనములో గోపబాలురతో శ్రీకృష్ణుడు గోవులను మేపుచు ఉండఁగా వనమును దావాగ్ని కాల్పదొడగెను. అప్పుడు శ్రీకృష్ణుడు గోపకులను గోవులను తనశక్తితో దావాగ్ని బారినుండి రక్షించెను. గోప వేషముతోనున్న ప్రలంబుఁడను రాక్షసుని బలరాముఁడు చంపెను. ఇట్లు బలరామకృష్ణులు అనేకమైన యుత్పాతములనుండి గోవులను రక్షించుచుండిరి. సకలప్రాణులను సమానముగఁ జూచి వారికి రక్షణ కల్పింపవలయునని తలఁచిన వారయ్యు దుష్టులు చేయు పనులకు తదితర ప్రాణులకుఁ గష్టంబులు గలుగుచుండగగని దుష్టులను జంపుటద్వారా తదితరులకు సుఖమును ఆ దుష్టులకు స్వర్గసౌఖ్యమును గూర్చుచు బలరామ కృష్ణులు క్రీడింపఁదొడగిరి.

ఆ చిన్న తనములో ప్రతిబాలునికి సహజమైన దైవతత్త్వము సర్వప్రాణ సమానత్వము ఆ చిన్ని కృష్ణునిలో మఱియు భాసిల్లియుండెను. ఇతరబాలురు తల్లి దండ్రులకు పెద్దలకుఁ

దమ ఇరుగుపొరుగువారికి లోఁబడి తాము సహజమైన దైవగుణములను బోఁగొట్టుకొనుచుందురు. శ్రీకృష్ణుడు దైవతత్త్వమునకుఁగాక మఱి దేనికి భయపడువాడుగాడు. అయిదారేండ్లు దాటి పదియేండ్లలోపు వాడుఁగా నున్నపుడు తల్లి కొడుకునకు మంచిమంచి దుస్తులు కట్టఁబెట్టుచుండెడిది. స్వేచ్ఛగా ఆడు చిన్నికృష్ణునికి అవి బంధముగా నుండెడివి. అవి విప్పి పాఱవేసెడివాఁడు. సమస్త సృష్టిలోను వేనికి దుస్తులు లేవే ఈ మనుష్యునికి ఒక్కనికి మాత్రము ఎందుకుండవలెనో కృష్ణునికి అర్థముగాలేదు. చిన్నప్పుడు తాను వివసనుఁడుగనే తిరిగెను. చిన్న పిల్లలు ఇప్పటికిని వివసనులుగనే యుండిరి. శ్రీకృష్ణుని నవ్వులు ఆటలు పాటలు మురళీగానము రుచిచూచిన గోపికలు శ్రీకృష్ణుని విడిచియుండలేకపోయెడివారు. చిన్నప్పుడు శ్రీకృష్ణుడు వెళ్ళనియిల్లుగాని ఎత్తికొని యాడించని గోపికగాని లేదు. స్త్రీలు వివసనలై స్నానముచేయునప్పుడు పనులు చేసికొనునపుడు ఎప్పుడైనను చిన్నికృష్ణునికి అడ్డు అనునది లేనేలేదు. శ్రీకృష్ణుడు పురుషులలో పురుషుడుగను స్త్రీలలో స్త్రీగను మెలగెడివాడు. ఆ చిన్నికృష్ణుని యభేదదృష్టి తెలిసికొనలేని గోపికలకు చిన్నికృష్ణుని పనులు కొంటెపనులుగ దోచెడిది. అయినను ఆ గోపికలు కృష్ణుని బ్రేమింపక పోలేదు. తనమీద తన తల్లి యశోదతో నాడు చెప్పిన నేరములకు శ్రీకృష్ణునికి గోపికలపై గోపము గలుగలేదు. పైగా వారి తెలివితక్కువకు ఇంకను నవ్వుకొనుచు ఆనందముతోఁ గేరింతలు గొట్టువాఁడు.

ఒకనాఁడు గోపికలు యమునానదికి బోయి విజన ప్రదేశమున వలువలు విడిచి జలంబులఁజొచ్చి క్రీడలం దేలుచుండిరి. అప్పుడు చిన్నకృష్ణుఁడు అక్కడికిఁబోయి "వలువల రంగులు వేఱైనను శరీరములొకటే యయినట్లు, శరీరములు వేఱైనను ఆత్మ యొక్కటే యనియు, ఈ వలువలు శరీరములకుఁ గృత్రిమములనియు, ఒకవేళ ధరించినను వాని విషయమై మోహపడరాదనియుఁ దెలుపుటకు వారి వలువలన్నియుఁ బ్రోగుజేసితీసికొనిపోయి చెట్టుమీదఁనెక్కి కూర్చుండెను. అపుడా గోపికలు తమవలువలు చిన్నికృష్ణుఁడు తీసికొనిపోయి చెట్టునెక్కి కూర్చుండుటచూచి "కృష్ణా! నీవు మా హృదయములనె దొంగిలించుకొనిపోతివి. ఇంక మా వలువలతోఁ బనేమి? మేము నీ వారము గదా?" అని పలుకుచు వలువలిమ్మని వేడికొనిరి. అప్పుడు చిన్నికృష్ణుఁడు నవ్వుచు "నేమి మీయిండ్లలోఁ దిరిగెడివాఁడనుగదా అప్పుడులేనిసిగ్గు మీకిప్పుడెందులకు? నేను మీలో నెప్పుడు నున్నవాఁడనేగదా! లోకములో నేను చూడని మర్మము గలదా? కృత్రిమ వేషములచే వ్యామోహము కలిగించుటెందులకు? ఈ మాయ వలువలతో మీకుఁబనేమి లెండు రండు.

అంతగా ఈ మాయవలువలె గావలసియున్నచో వచ్చి మీ మీ వలువలు తీసికొనుఁడు" అనిపలికి వారివలువలు వారికిచ్చివైచెను. పదేండ్లయిన నిండని ఇంత చిన్నతనములో శ్రీకృష్ణుడు చేసిన యాగోపికావస్త్రాపహరణములోని భావమును సరిగా అర్థము చేసికొనలేక లోకులు కాకులై యెవరిష్టము వచ్చినట్లు వారు చెప్పుకొనిరి. లోకులలోని మాయను ఇట్లే దేవుఁడు తొలఁగించునని యాధ్యాత్మికవిదులు తలఁతురు. క్రమముగాఁ గృష్ణుఁడు పదునాల్గేండ్ల వాఁడయ్యెను. నందాదులు మేఘాదిపతి యయిన యింద్రునికిష్టము గలుగుటకై ఇంద్రయాగము చేయునాచారము గలదు. కృష్ణుఁడు దానిని మానిపించి కర్మవశముననే యన్నియు జరుగుననిచెప్పి బ్రాహ్మణోత్తములకు అనాథులకు శునకాదులకు భోజనంబు పెట్టించి సకలప్రాణులను దృప్తిపఱచె. ఒకనాఁడు ఇంద్రునికి గోపము వచ్చెనేమోయన్నట్లు మేఘములు గ్రమ్మి బోరున పెనుగాలితో వర్షము గురియ దొడఁగెను. అంతట బృందావనములోని కుటీరము లన్నియుఁ బడిపోయెను. నిలువనీడలేక పసులు గోవులు నానాకష్టములకుఁ బాలయిరి. శ్రీకృష్ణుఁడు అంతట గోవులను వద్దిలఁజేయుచు ఆధారమైయుండు గోవర్ధన పర్వతమునెత్తి రక్షించెను.

ఒకనాఁడు వరుణుని భటుఁడు నందుని గొల్లపల్లెనుండి దొంగిలించుకొనిపోవ, వెదికి వరుణిని దగ్గరనుండి మరలఁ దీసికొనివచ్చెను. క్రమముగా శ్రీకృష్ణుఁడిట్లు అన్ని విధముల సహాయము చేయుచుండ అందరు అతని ప్రేమింపదొడగిరి. గోపికలు శ్రీకృష్ణుని జిన్నప్పటినుండి యెత్తుకొని యాడించిన వారగుచు అతనితో నాడుచు బాడుచు రాసక్రీడలాడుచు ఒడలు మరచి యానందవీచికలందేలుచు గాలక్షేపము చేయుచుండిరి. ఒకక్షణము కృష్ణునిఁ జూడనిచో వారు ప్రాణములు లేని శరీరములవలె నిలువలేక యుందురు. ఇట్లుండి శ్రీకృష్ణుఁడు సుదర్శనమను సర్పము నందుని బట్టుకోఁబోగాఁ జంపి నందుని గాచెను. శంఖచూడుఁడను గుహ్యకుని, వృషభాసురిని, కేసి వ్యోమాసురులను జంపి గోవులకు సుఖము గూర్చెను.

ఈ విధముగ అనేకరాక్షసులను జంపి గోపాలురను రక్షించు కృష్ణునిసంగతి అంతటను వ్యాపించెను. అసలే ఎక్కడో తన్నుఁజంప నొకబాలుడు పెరుగుచున్నాఁడని విన్న కంసునికి ఈ వార్త భయాందోళనలకుఁ గారణమయ్యెను. ఒకనాడు నారదుఁడు వచ్చి యతనికి బలరామకృష్ణుల సంగతి చెప్పిపోయెను. అపుడు కంసుఁడు "ధనుర్యాగము చడరం"డని చెప్పి 'బలరామకృష్ణులను గోడితె'మ్మని యక్రూరుని పంపెను. అక్రూరుఁడు

దైవభక్తుఁడు. కంసుని కెదురాడ వెఱచి రథమెక్కి బలరామకృష్ణులఁ దీసికొని వచ్చుటకు నందునిపల్లెకుఁ బోయెను. వసుదేవుఁడు దేవకి తన్ను మోసగించిరని భావించి కంసుఁడు మరల వారిని కారాగారము నందుంచెను.

అక్రూరుఁడు బలరామకృష్ణుల సంగతి విని వారిని జూడగల్గినందులకుఁ దన యదృష్టమును గొనియాడుకొనెను. బృందావనములో పదునారేండ్ల వయస్సులోనున్న బలరామకృష్ణులను జూచి యక్రూరుఁడు తన జన్మ ధన్యమైనదని తలఁచెను. నందుఁడు అక్రూరునికి సగౌరవముగా నాతిథ్యమిచ్చి వసుదేవాదుల క్షేమాదులనడిగి అతఁడు వచ్చినకారణమడిగెను. తానువచ్చిన కారణమును బలరామకృష్ణులతోడను నందునితోను నక్రూరుఁడు చెప్పెను. అదివిని కంసుని క్రూరకృత్యములను అదివఱకే విన్న బలరామకృష్ణులు అక్రూరునివల్ల తమ జన్మాదులనుగూడ నెఱిగి నెయ్యి పెరుగు మొదలగు కానుకలతో మఖముఁజూడ తమసమ్మతి దెలిపిరి. బలరామకృష్ణులమాటకు ప్రతిచెప్పక కంసుని క్రూరకృత్యములను దెలిసిన వారయ్యు నందాదులు తామును ముందుగనే బయలుదేరిరి. శ్రీకృష్ణునితో గలిసిమెలిసి యొక్కటిగా విహరించిన గోపగోపాంగనల గుండెలో రాయిపడెను. "అయ్యో! మన కృష్ణుఁడు మధురకుఁ బోవుచున్నాఁడు. ఇంక మనబ్రతుకెట్లు?" అని ప్రాణములన్నిటిని గళ్ళలోనికి తెచ్చుకొని కృష్ణునివైపు గోపికలు చూడసాగిరి. "ఇంతకాలము మనతో నుండి మధురనుండి యక్రూరుఁడనువాఁ డెవ్వఁడో వచ్చి పిలిచినంతనె కృష్ణుఁడు పోవుచున్నాడు. వీఁడు క్రూరుఁడుగాక అక్రూరుఁడా? అయ్యో మనకింకేమిగతి? మనమింక బ్రతుక గలమే?" అని గోపికలందఱువచ్చి కృష్ణునివైపు ప్రాణములు వీడిన దేహములవలెఁ జూచుచుండ "నేను త్వరలో వచ్చెదను. మిమ్ము విడిచి నేనుమాత్రము ఉండగఁలనా? నాలో మీరున్నారు. మీలో నేనున్నవాఁడనె" అని కృష్ణుఁడోదార్చి యక్రూరునితో రథమెక్కి మధురకు చనెను. గోపికలు బెంగతో దైన్యముతో రథము పోయినదిక్కే చూచుచు నిలఁబడిపోయిరి."

బలరామకృష్ణులు మధుర ప్రవేశించిరని విని పౌర సుందరులు తమకన్నుల కఱవుతీఱ చూడఁదొడగిరి. బలరామకృష్ణుల లీలలు చెప్పుకొనుచు ముత్యాలసేసలు చల్లిరి. కంసునికై రజకులు వస్త్రములను తీసికొని పోవుచుండ, వారిని అడిగిన వారీయక నిందింప, బలరామ కృష్ణులు వారిని జంపి వస్త్రములను గైకొనిరి. కొన్ని నెచ్చెలులకిడి తాము ధరించిరి. సుదామునడిగి మాలలుగైకొని, యొక కుబ్జ యిచ్చిన సుగంధముల నలందికొని కంసుని

దుర్గంబు ప్రవేశించిరి. మఱి యందుఁగల యాయుధాగారమునుండి యాయుధములు పూని కంసుడు పంపఁగా తమ్ముఁ జంపవచ్చిన కువలయాపీడనమను గజమును జంపి మల్లయుద్ధమునఁ జాణూరముష్టికులను వధించిరి. నిండు సభలోనికివచ్చు బలరామకృష్ణులను జూచి, వారిని జంప నాజ్ఞాపించు క్రూరుఁడైన కంసుని జంపి, కారాగారమునఁగల తమ తల్లిదండ్రులవిడిపించి నమస్కరించిరి. దుష్టశిక్షణము శిష్టరక్షణము తన కర్తవ్యముగానెంచు శ్రీకృష్ణుఁడు రాజ్యాధికారమును కోరక, యుగ్రసేనునికి బట్టాభిషేకము గట్టి, కంసుని భయముచే విదేశములకుఁబోయిన తమ బంధువులను రావించి, వారివారి నివాసంబులందుండ నియోగించె. "కన్న తల్లిదండ్రులను చూడక మీరేతల్లి దండ్రులని యుంటిమి. వీరిని సంతోషపఱచి వచ్చెద" మని యొడబఱచి, కనులనీరునించెడి నందుని గొల్లపల్లెకు గృష్ణుఁడు పంపెను.

దేవకీవసుదేవులు క్షత్రియకులోచితముగ బలరామ కృష్ణులకు ఉపయనము గావించి, వేద వేదాంగవిద్యలు నేర్వ సాందీపని యను గురువుదగ్గఱకు గురుకులమునకుఁ బంపిరి. అంత వారిరువురు సాందీపని యొద్ద సకలవిద్యలు నేర్చిరి. ఒకనాడు ప్రభాతస తీర్థమున స్నానముచేయుచు అందుఁబడిపోయి యమపురికిఁ పోయినట్టి గురుపుత్రుని రక్షించి, గురుకులమును వీడ దలచిన బలరామకృష్ణులు ఆ గురుపుత్రునినె గురుదక్షిణగా నర్పించిరి. పిదప గురువు సంతోషింపఁగా విద్యచాలించి వారిరువురు మధురకు వచ్చిరి.

మధురకు వచ్చిన పిదపఁ, దన్నుఁ గన్న తల్లిదండ్రుల వలెఁబెంచిన నందయశోదలను, తనతోపాటు ఆటపాటలలో మైమరచి తనకై బెంగగొన్న గోపగోపికలను ఓదార్ప నుద్ధవునిఁబంపెను. తిరుగ వారుపంపిన ప్రేమసందేశమును విని కానుకలను గ్రహించెను.

ఇంక అట తండ్రియైన పాండురాజు చనిపోఁగా హస్తినాపురము చేరిన యాత్మబంధువులైన పాండవుల యోగక్షేమము అక్రూరుని ద్వారా తెలిసికొనెను.

ఇంట్లుండ గంసునిభార్యలయిన అస్తిప్రాప్తియనువారిరువురితండ్రియైన జరాసంధుఁడు కృష్ణునిఁ జంప మధురమీఁదికి దండెత్తి వచ్చెను. కాని కృష్ణునితో యుద్ధముచేసి యోడిపోయెను. అట్లు యోడిపోయినను జరాసంధుడు సమయముచూచి రాజులను గూర్చికొని మాటిమాటికిఁ గృష్ణునిమీఁదకు యుద్ధమునకువచ్చి యోడిపోవుచుండెను. మాటిమాటికి జరాసంధుడు వచ్చుచుండుటచేఁ దనప్రజలకుఁ గష్టము గల్గునని తలఁచి

కృష్ణుడు సముద్రతీరమున ద్వారకయను పట్టణమును నిర్మింపంజేసి యందు దనబంధు పరివారముతో నివసింప సాగెను.

అంత విదర్భరాజయిన భీష్మని కుమార్తె రుక్మిణి యతిథి యభ్యాగతులవలన శ్రీకృష్ణుని గుణరూపముల విని యతనియందుఁ బ్రేమగలదయ్యెను. రుక్మిణి బంధువులకుఁ గృష్ణుఁడనిన ప్రీతి గలదు. కాని రుక్మిణియన్నయగు రుక్మికి మాత్రము చైద్యరాజగు శిశుపాలునికిచ్చి పెండ్లిచేయ నిష్టముండెను. బలుడగు రుక్మిమాట నెవరును గాదనలేక పోయిరి. . ఈ సంగతి రుక్మిణికిఁ దెలిసినది. అప్పుడు రుక్మిణి యొకబ్రాహ్మణునిఁ గృష్ణునిగడకుఁబంపి "కృష్ణా! నేను నిన్ను బ్రేమించితిని. నన్ను (జైద్యునికీయ మాయన్న దలపోసియుండెను. నేను వివాహసమయమున గ్రామము చివరనున్న కాళీదేవాలయమునకు గౌరిని మ్రొక్క వచ్చెదను. అప్పుడు నన్నుఁ దీసికొనిపోయి రక్షింపుము" అని కబురంపెను. అంత శ్రీకృష్ణుఁడు ఆ ముహూర్తసమయమునకుఁ గుండిన నగరముచేరి గౌరిని మ్రొక్కవచ్చిన రుక్మిణిని రథముపైఁ గూర్చుండఁబెట్టుకొనెను. అంత యుద్ధమునకు వచ్చిన రాజులను జయించి, రుక్మిని బరాభవించి విడిచిపుచ్చి, రుక్మిణిని ద్వారకకుఁ దీసికొనిపోయి యథావిధి వివాహమయ్యెను. అంతఁ గొంతకాలమునకుఁ గృష్ణునికి రుక్మిణి యందుఁ బ్రద్యుమ్నుఁడను కుమారుఁడు గలిగెను.

ఇట్లుండ ఆ యాదవకులమున సత్రాజిత్తు అనునతఁడు ఉండెను. అతనిదగ్గర శ్యమంతకమణి గలదు. ఒకసారి దానిని తమ్ముఁడగు ప్రసేనునకిచ్చెను. అతఁడు దానిని ధరించి వేఁటకు అడవికిఁ బోయెను కాని దిరిగిరాలేదు. అంత నదివఱకు అమణినిజూచి రాజున కిమ్మని యడుగ నీయలేదని కోపముతోఁ దనతమ్ముని వధించి మణిని గైకొనెనని సత్రాజిత్తు కృష్ణునిమీఁద నిందమోపెను. అ నిందను బాపు కొనుటకై శ్రీకృష్ణుడు ప్రసేనుఁడు పోయిన యడవికి పోయి సింహముచే జంపఁబడిన ప్రసేనుని జూచెను. మఱి కొంతదూరమున ఆ సింహముగూడ జంపఁబడి యుండెను. అంతఁ గృష్ణుఁడు ఆ నలుప్రక్కల వెదకుచు నొక కొండగుహ లోనికిఁజొచ్చి అట జాంబవంతుని తనయ దగ్గర వ్రేలాడఁగట్టిన యామణిని జూచెను. పిదప ఆ మణికై జాంబవంతునితో యుద్ధముచేసి యతనినోడించి యామణిని సత్రాజిత్తునకిచ్చెను. అప్పుడు జాంబవంతుఁడు తనకుమార్తెయగు జాంబవతిని, సత్రాజిత్తు ఆ మణితోపాటు తనకూతురైన సత్యభామను ఇచ్చి వివాహము గావించిరి.

పిదపఁ గృష్ణుఁడు కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్షణయను రాజపుత్రికలను వివాహమయ్యెను. ఆధ్యాత్మికవిదులు కృష్ణుని జీవాత్మగను, భార్యలెనమండుగురును ఆ

జీవాత్మయొక్క పంచేంద్రియములు మనస్సు చిత్తము అహంకారము అను నెనిమిది యింద్రియములుగను వర్ణింతురు.

మఱియు శ్రీకృష్ణుఁడు పదియాఱువేల స్త్రీలను వివాహమయ్యెనను పౌరాణికుల వర్ణన సామాన్య మానవులకు దైవతత్త్వమునందు విశ్వాసము గలుగుటకై చెప్పఁబడినెని గ్రహింపవలెను. కర్మేంద్రియములయిదు; జ్ఞానేంద్రియములయిదు; మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, స్థూలసూక్ష్మ శరీరములు మొత్తము ఈ పదియారింటి విషయములు వేలకొలఁదిగ నుండును. ఆత్మ ఈ పదియారువేల విషయములందుఁ గ్రీడించుచుండును. కాన ఆత్మస్వరూపుడైన కృష్ణుఁడు విషయములనెడి పదియాఱువేల గోపికలందు విహరించుచుండెనని రూపకముగా దీనిని ఆధ్యాత్మిక విదులు వర్ణింతురు.

కృష్ణుడు తానుగా రాజ్యపాలనాది కార్యముల భారము వహింపక కర్తవ్యమని తలంచినప్పుడు దుష్టులగువారిని చంపుచు శిష్టులగువారికి సాయపడుచు నుండెను. క్రూరుడగు నరకాసురుని జంపెను. బాణాసురుని గర్వమణగించెను. నృగమహారాజు నుద్ధరించెను. దుష్టులగు పౌండ్రక వాసుదేవాదులను జంపెను. కృష్ణుడు సామాన్య మానవులవలెనె విషయము లందుండినను అభిమానము లేక నిర్లిప్తుఁడై యుండెను.

పాండురాజ తనయులగు యుధిష్ఠిర భీమార్జున నకులసహదేవులు తనకు ఆత్మబంధువులు ధర్మాత్ములును. అందుచేఁగృష్ణునికిఁ బాండవులన్న ఎంతయో ప్రీతి. అందు అర్జునునకు శ్రీకృష్ణునికి ఎంతయోమైత్రి. శ్రీకృష్ణుడు తన చెల్లెలు సుభద్రను అర్జునునకిచ్చి వివాహము గావించెను. కౌరవులు పన్నిన కుట్రలచేఁ బాండవులనేక కష్టముల పాలగుచుండ మాటిమాటికిఁ గృష్ణుఁడు వారిని రక్షించుచుండువాఁడు. ఒకమాఱు ధర్మరాజు దిగ్విజయముచేసి రాజసూయమను యాగమును గావించెను. అందు భీష్ముని ప్రేరణచే ధర్మరాజు పురుషోత్తముఁడగు శ్రీకృష్ణుని బూజించెను. అందుకు సహింపలేక శిశుపాలుఁడు శ్రీకృష్ణుని నిందింపఁగా ఎంతయో యోర్పు వహించెను. కాని శిశుపాలుఁడు తన దౌష్ట్యమును మానకపోవుటచే శ్రీకృష్ణుఁడు శిశుపాలునిఁ జంపెను. మఱియు నిట్లే దుష్టులగు దంతవక్త్రాదులను సంహరించి లోకక్షేమము చేసెను. తనభక్తుఁడు బల్యస్నేహితుఁడునగు కుచేలుని నాదరించి సకలసంపదలిచ్చి యాతని దారిద్ర్యమును బాపెను.

ఇట్లుండఁ గౌరవులు ధర్మరాజును జూదమునకుఁ బిలిచిరి. పిలిచినప్పుడు వెళ్ళకపోవుట తప్పని తలఁచి ధర్మరాజు దుర్యోధనాదులతో ద్యూతమాడెను. అంత ధర్మరాజు కౌరవులు

చేసిన యన్యాయద్యూతములో తమతండ్రి భాగమగు రాజ్యమునె గాక తనసోదరులను, తన్నును, భార్య ద్రౌపదిని ఒడ్డి ఓడిపోయెను. అప్పుడు కౌరవులు నిండుసభలో ద్రౌపదిని జుట్టపట్టుకొని లాగి తీసికొనివచ్చి యవమానపఱచిరి. పిదపఁ పాండవుల పెదతండ్రి ధృతరాష్ట్రుడు వారిరాజ్యము వారికిచ్చివేయగా ఊరుకొనక కౌరవులు మరల జూదమునకుఁబిలిచి పాండవుల నోడించిరి. ఓడినచోఁ బండ్రెండు సంవత్సరములు అరణ్యవాసమును ఒకయేడు అజ్ఞాతవాసము చేయవలెనని షరతుపెట్టిరి. ఆ షరతు ప్రకారము పాండవులు అరణ్యవాసమును ఒకయేడు అజ్ఞాత వాసమును గడిపి తమరాజ్యమును తమకివ్వవలసినదిగా సంజయాదులచే రాయబారమంపిరి. దుర్యోధనుఁడు అందుకంగీకరింపలేదు. ధృతరాష్ట్రుడు తన పెద్దకొడుకుమాట నింక నతిక్రమింపలేకపోయెను. పాండవులు ఇక యుద్ధము తప్పదని నిశ్చయించుకొనిరి. ఇరుపక్షములవారు తమకిష్టమైన రాజుల సాయముకోరి సేనలను ప్రోగుచేయఁదొడఁగిరి. తనసాయము కోరవచ్చిన దుర్యోధనునికి శ్రీకృష్ణుఁడు అనేక వేలసైన్యమును అతని కోరినప్రకారమిచ్చెను. తాను యుద్ధముచేయనని శ్రీకృష్ణుడు చెప్పినను తమపక్షమునసుండి సలహాలుమాత్రము చెప్పిన చాలునని యర్జునుఁడు యుద్ధము చేయని శ్రీకృష్ణునిసే కోరుకొనెను. ఇతరమగు రాయబారములు విఫలమగుటచేఁ జివరకు శ్రీకృష్ణుని రాయబారమంపిరి. కౌరవులు సంధికి ఒప్పుకొనరని తలఁచియుఁ దన కర్తవ్యము నెఱపఁదలఁచి శ్రీకృష్ణుఁడు రాయబారమునకై కౌరవుల దగ్గఱకు వెళ్లెను.

శ్రీకృష్ణుఁడు హస్తినాపురమువెళ్లి తనయులు కోడలు పడు నిడుములకు దుఃఖించు కుంతినోదార్చి విదురుని యింటవిడిసెను. పిదప దుర్యోధనాదులతోడను ధృతరాష్ట్రునితోడను పాండవులకు వారి సగపాలు ఇమ్మని చెప్పెను. చివరకుఁబోని యైదుగ్రామములైనను ఇచ్చి రణమువలన గలుగు జననాశమును వారింపుఁడని నయముగ వారికిఁ జెప్పెను. సూదిమోపిన మేరయయిన నీయనని దుర్యోధనుఁడనెను. ధృతరాష్ట్రుఁడు తనకొడుకు మాటను గాదనలేక పోయెను. చివరకు రాయబారియై వచ్చిన శ్రీకృష్ణుని బంధించుటకు మూర్ఖులగు కౌరవులు సిద్ధమైరి. కాని శ్రీకృష్ణుని ముందు వారియాటలు సాగలేదు. అతడు అపుడు ధృతరాష్ట్రునికి తన విశ్వరూపము చూపెను. అంత శ్రీకృష్ణుఁడు "సరే కానిండు. నేనింక చేయునదిలేదు. కానున్నది కాకమానదు. నా కర్తవ్యమును నెఱవేర్చితిని" అని చివరసారిగ ధృతరాష్ట్రాదులతోఁ బలికి యటనుండి పాండవుల దగ్గరకు వచ్చి జరిగిన సంగతి చెప్పెను.

కౌరవులకుఁ బాండవులకు, సంసారమున దుర్గుణములకు సద్గుణములకువలె, యుద్ధము ప్రారంభమయ్యెను. పాండవుల పక్షమున ఏడు అక్షౌహిణులు, కౌరవులపక్షమున పదునొకండు అక్షౌహిణులును సైన్యము చేరెను. రెండు పక్షములవారును ధర్మక్షేత్రమయిన కురుక్షేత్రమున యుద్ధసన్నద్ధులై యుండిరి. శ్రీకృష్ణుఁడు తెల్లని గుఱ్ఱములు గట్టిన రథముపై ఇంద్రియములను చేతఁబట్టుకొన్న యాత్మవలె పగ్గములు పట్టుకొని కూర్చుండెను. అర్జునుఁడు తనరథమును ఇరుసైన్యములకు మధ్యను నడపమని బావయగు కృష్ణునితో ననెను. రథము రెండు సేనల మధ్యకు వచ్చెను.

అర్జునుఁడు రెండుసేనలను పరికించెను. తనయెదుట దమకు అన్యాయముచేసిన దుర్యోధనాదులేగాక తనకు అత్యంతాప్తులైన గురువులు, తాతలు, బంధువులు గనిపించిరి. అర్జునుఁడు అనేక యుద్ధములుచేసి యనేకులను చంపినవాఁడే! కౌరవులను జయించుటకుఁ దపస్సుచేసి అనేక శస్త్రాస్త్రములను సంపాదించినవాఁడే! ఎప్పుడు యుద్ధమువచ్చునా ఎప్పుడు దుర్యోధనాదులపైఁ బగదీర్చుకొందునా అని కాచిపెట్టుకొనియున్నవాఁడే! అయినను గురువులను, తాతలను, బంధువులను జూచుటతోడనే వారిని జంపినఁగాని శత్రువులపైఁ బగదీర్చుకొనుట సంభవింపదని తోఁచినది. తమపొట్టకూటికోసము ఇంతమంది యాప్తులను జంపవలయునే అని తట్టినది. తత్కాలమున విరాగముదయించినది. "ఈ రక్తపుఁగూడు నాకక్కరలేదు. ముష్టియైన నెత్తుకొందును కాని యుద్ధములో వీరిని జంపలేను. నాకీయుద్ధమువలదు" అని పలుకుచు ఆయుధములు క్రింద బాఱవైచి రథముపైఁ గూలఁబడెను. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుని తాత్కాలిక వైరాగ్యమునకు నవ్వుచు ఇట్లుపలికెను. "ఓయర్జునా! ఇన్ని ప్రయత్నములుచేసి తీరా సమయము వచ్చునప్పటికి నేను యుద్ధము చేయను అన్నచో నీ శత్రువులు నిన్నేమనుకొందురు? పిఱికిపందవని యనుకొనరా! నీవు క్షత్రియుఁడవు. క్షణిక వైరాగ్యము పొందకుము. బంధువులను జంపవలసి వచ్చునని కర్తవ్యమూఢుఁడవు గాకుము. శరీర మెప్పటికైనను నశించునదే. ఆత్మయే శాశ్వతమైనది. ప్రాతబట్టలు విడిచి క్రొత్తబట్టలు మనుష్యుఁడు ధరించినట్లు ఈ యాత్మ ప్రాత శరీరములను విడిచి క్రొత్తశరీరములను ధరించును. ఫలాశ లేకుండ నీకర్తవ్యము చేయుము. కర్మచేయుటే నీ కర్తవ్యము. ఫలము నీ యధీనములో లేదు. నన్ను నమ్ముము. అధర్మము చేయరాదు. ధర్మకార్యము చేయునపుడు వీరిని జంపవలయునేయని శోకము పొందకుము. నీ కర్తవ్యము నెఱవేర్చుము" అని యిట్లు శ్రీకృష్ణుఁడు-అర్జుననకు పదునెనిమిది యధ్యాయములు గల భగవద్గీతను ఉపదేశించెను. అర్జుననకు ధర్మోపదేశము చేయుటలో

శ్రీకృష్ణుఁడు తాను శరీరధారియనుమాటను మఱచిపోయెను. అతనిలో భగవత్తత్త్వము నిండియుండెను. నిండుటయేమి అతఁడు భగవంతుఁడే. ఆ ధర్మోపదేశము శ్రీకృష్ణగీతగాదు; భగవద్గీతయే! శ్రీకృష్ణుఁడు ఒక్కమాటు ప్రత్యక్షముగా విశ్వరూపమును (విశ్వముయొక్క రూపమును) జూపెను. "లోకములో ఎందఱుపుట్టి మరణించలేదు? ఇప్పుడు ఎందఱు పుట్టుచు మరణించుటలేదు? ఇంకముందు ఎందఱుపుట్టి మరణింపరు? ఇందులో నీవు నిమిత్తమాత్రము అగుదువు. అంతే! నీవు చంపకపోయినను వారెట్లును చచ్చువారె. చూడవలసినది యొక్కటే. తాము చేయునది ధర్మమా అధర్మమా అని మాత్రమె. తాను ధర్మము చేయుచున్నాఁడా, అందులో ఎన్ని ప్రాణులు నశించినను ఆ ప్రాణులు ఆత్మీయులయినను గాకపోయినను ఆ ధర్మకర్తవ్యమునుండి విముఖుఁడు గారాదు" అని కృష్ణుఁడు చెప్పెను. ఇంతతో అర్జుననకు జ్ఞానోపదేశమయ్యెను. అతనిలోనున్న పిఱికితనము పోయెను. ధర్మమగు తనకర్తవ్యమును జేయుటలో బద్ధదీక్షుఁడయ్యెను. భగవంతుని శరణుపొందెను. శ్రీకృష్ణుఁడు చెప్పినట్లు చేయనంగీకరించెను.

యుద్ధము పదునెనిమిది దినములు జరిగెను. దైవ స్వరూపుఁడగు శ్రీకృష్ణుఁడున్న పాండవపక్షము జయించెను. కృష్ణుఁడు బంధుమరణంబుచే దుఃఖించు ధర్మరాజాదులను గాంధారీ ధృతరాష్ట్రులను ఓదార్చి వారికిఁ దత్త్వజ్ఞానము నుపదేశించెను. జీవుఁడు ఆత్మయును గలిసి యేకమైనట్లు బావమఱఁది మిత్రుఁడు శిష్యుఁడునయిన అర్జునుఁడును శ్రీకృష్ణుఁడును గలిసి మెలిసి యేకమై యానందమునఁ దేలియాడిరి. ఇంక నిక్కడఁ దన కర్తవ్యము ముగియఁగా శ్రీకృష్ణుఁడు తన తల్లిదండ్రులను చూడ ద్వారకకుఁ బ్రయాణమయ్యెను. అందుఁ గొంతకాలముండి ధర్మరాజు చేయునశ్వమేధయాగంబునకు వచ్చెను. అంతతో పాండవులయెడఁ జేయవలసిన కర్తవ్యములు ముగియఁగా మరల ద్వారకకు వచ్చెను.

ఇట్లు శ్రీకృష్ణుడు తనకు రాజ్యాధిపత్యాదులు అక్కఱలేకపోయినను లోకసంగ్రహమునకై తగుకార్యములు చేయుచు రాజులచేత మహర్షులచేత పూజింపఁబడుచు భగవద్రూపుఁడై యుండెను. ఇట్లుండఁ గొంతకాలమునకు యాదవులలో అంతఃకలహములు బయలుదేఱెను. వారు మద్యపాన మత్తులై యొడలు తెలియక యొండొరులఁ జంపుకొనిరి. యాదవకులము అంతమయ్యెను. బలరాముడు తనశరీరమును జాలించెను. ఇదంతయు శ్రీకృష్ణుఁడు చూచుచు నిశ్చింతుఁడై యుండెను.

ఒకనాఁడు శ్రీకృష్ణుఁడు వనమధ్యమందు ధ్యాన నిమగ్నుఁడై పరుండి కాలిపై కాలుంచి కాలు ఆడించుచుండెను. అంతనొక వేఁటకాఁడు ఆ కాలును దూరమునుండిచూచి దానిని లేఁడిగాఁదలఁచి బాణమువదలెను. అది శ్రీకృష్ణుని కాలికిఁ దగిలెను. అప్పుడావేఁటకాఁడు దగ్గఱకువచ్చి యక్కడ శ్రీకృష్ణుని గాంచి నిర్ఘాంతపోయి తానుచేసిన పనికిఁ బశ్చాత్తాపపడుచుఁ గృష్ణునికాళ్ళమీఁద బడి విలపింపసాగెను. అంత శ్రీకృష్ణుఁడు అతనినోదార్చి "ఇది భగవదిచ్ఛ. దీనిని దప్పింపనెవరితరము? నేను దైవముతోఁ గలసిపోవ నీవు కారణమైతివి. విచారింపకుము" అని వానికిఁ దెలియఁజెప్పి ఇదివఱకే యాత్మతో నైక్యముపొందిన భగవంతుఁడే యయియున్న శ్రీకృష్ణుడు శరీరధారులందఱు ఇట్లేకావలయునని తెలుపుటకు భౌతికదేహముతోఁగూడ నాత్మతో నైక్యముపొందెను.

రుక్మిణి మొదలయిన వారందఱు అగ్నిప్రవేశముచేసిరి. శ్రీకృష్ణుఁడిట్లు లోకసంగ్రహమునకై శరీరమును ధరించి నిర్యాణముపొందునప్పటికి నూటయిరువదియైదు వత్సరముల వయస్సువాఁడయి యుండెను. ఆ కృష్ణపరమాత్మ బోధించిన భగవద్గీత నాఁటినుండి భారతీయులకు శిరోధార్యమైనది. భారతీయులకేగాదు శరీరధారులందఱకు శిరోధార్యము కావలసినదే! దాని ప్రకారము అందఱు నడచుకొని, యాత్మైక్యము పొంది, యానంద నిమగ్ను లగుదురుగాక!

అనుబంధము - 3

శ్రీహిమవద్-గోపాలస్వామి కొండ
(స్థలపురాణం)

కన్నడ మూలం

వై. సి. భానుమతి

అనువాదం

డా॥ దివాకర్ల రాజేశ్వరి

శ్రీహిమవద్-గోపాలస్వామి కొండ
(స్థల పురాణం)

గోపాలస్వామి కొండ మైసూరు జిల్లా గుండలుపేట తాలూకాలోని ఒక ప్రసిద్ధమైన కొండ. ఇది గుండలుపేటకు 15 కి.మీ దూరంలో ఉంది. జిల్లా కేంద్రమైన మైసూరునుండి 75 కి.మీటర్లు. ఈ కొండకు 'కమలాచలం', 'కంజగిరి', 'హిమవద్గోపాలస్వామి కొండ', 'గోవర్ధనగిరి' అనే పలురకాల పేర్లు ఉన్నాయి. పురాణాలలో 'కమలాచలం' అనే నామమే ఎక్కువ ప్రచారంలో ఉంది. దళాలవలె ఉండే ఎనిమిది పర్వతాలతో చుట్టుకుని కమలాకృతిలో కనబడుతూ ఉండడంవల్ల ఇది 'కమలాచలం' అని పిలువబడింది. కంజగిరి అన్నాకూడా ఇదే అర్థం. గోపాలస్వామి కొండ సంవత్సరంలో చాలా కాలం మంచుతో కప్పబడి ఉంటుంది. ఈ కారణం వల్ల ఇది 'హిమవద్గోపాలస్వామి కొండ' అని పిలువబడుతుంది. ఉత్తరం భారతంలో ఉన్న గోవర్ధనగిరి ప్రసిద్ధివల్ల గుండలుపేట గోపాలస్వామి కొండ కూడా ఈ పేరుతో ఖ్యాతిని పొందింది. ఇది దక్షిణం నుంచి ఉత్తరాభి ముఖంగా శిరసును కలిగి గోవు ఆకారంలో కూడా కనిపిస్తుంది. అందువల్ల గోవర్ధనగిరి అనే పేరు సార్థకమయ్యింది. ఇక్కడ మాదిగ వనిత ఒకతె ప్రతినిత్యం రాగులు విసురుతూ పాడుతూ ఉండేదట. ఆమె పాటను విని విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. మహావిష్ణువు వరాన్ని కోరుకొమ్మని అడిగినపుడు ఆమె - 'ఈకొండకు నాపేరు పెట్టాలి' అని వేడుకుంది. అనాటినుంచి గోపాలస్వామి కొండలో ఒక భాగం 'మాదగత్తి దుర్గం' (మాదిగస్త్రీ దుర్గం) అనే పేరు పొందింది. కొండపైన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం ఉంది. శ్రీకృష్ణుడు ఇక్కడ వెలిసినట్లుగా ప్రతీతి.

గోపాలస్వామి కొండ సముద్ర మట్టలనుంచి 4770 అడుగుల ఎత్తులో ఉంది. దీని వైశాల్యం సుమారు 25కిలోమీటర్లు. కిందనుంచి కొండ మీదికి సుమారు 5 కిలో మీటర్ల దూరం ఉంటుంది. కాలినడకన కొండపైకి ఎక్కడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి గోపాలపురం కుణగహళ్ళి దారి. ఇంకొకటి గుండ్లు విజయాపుర బయలుదారి. మొదటిది దగ్గర దారియైనప్పటికీ కొంచెం కఠినమైనదని చెప్పాలి. ఎందుకంటే ఇక్కడ ఇరుకుగా ఉన్న మొట్లను ఎక్కాలి. రెండవ మార్గం శ్రీకృష్ణరాజ ఒడయరు కాలంలో నిర్మాణమయింది. ఇది ఇసుక వేసి చేసిన చిన్నరోడ్డు. ఇక్కడనుంచి కొండ మీదికి 18 కిలో మీటర్లు. కొండను ఎక్కడానికి ఇప్పుడు వాహన సౌకర్యం ఉంది.

గోపాలస్వామి కొండ దట్టమైన అడవి మధ్యలో వుండి. ఇక్కడ పనస చెట్ల గుబురు. అరటి చెట్ల గుబురు. బిల్వపత్రాల గుబురు మొదలైన కొన్ని గుబుళ్ళున్నాయి. ప్రతి ఒక గుబురు ఒక కథను చెబుతుంది. అడవిలో పనస, మామిడి, 'తేగ', శ్రీగంధం మొదలైన పలు రకాల అమూల్యమైన వృక్షాలున్నాయి. అలాగే పళ్ళచెట్లకూ కొరతలేదు. నేరేడు, దానిమ్మ, పనస మొదలైన పళ్ళచెట్లు ప్రయాణికుల దాహాన్ని తీరుస్తాయి. గోపాలస్వామి కొండ నానా విధాలైన సుగంధాలతో కూడుకున్న పూవులతో సమృద్ధమైంది. పొగడ, సంపెంగ మొదలైన పూల చెట్లు ఆ పరిసర సౌందర్యాన్ని ఇనుమడింప జేస్తున్నాయి. ఇక్కడున్న మూలికలు, చెట్లు ఈ ప్రదేశపు వైశిష్ట్యాన్ని పెంచుతున్నాయి. గోపాలస్వామి కొండ అపూర్వమైన చెట్లకు మూలికలకు ఆకరం. కలకత్తాకు చెందిన వృక్షశాస్త్రవేత్త ఆర్.ఎల్ బద్వార్ గారు 1936లో ఇక్కడకు వచ్చి 120 రకాల చెట్లను మూలికలను సంగ్రహించారని చెప్పబడుతోంది.

గోపాలస్వామి కొండ చుట్టూ ఎక్కడ చూచినా గుట్టలూ, మిట్టలే. తూర్పున త్రియంబక పర్వతం, పశ్చిమాన నీలాద్రి, ఉత్తరంలో మంగళాద్రి, దక్షిణాన శంబరారి గిరి, ఆగ్నేయంలో హంసాద్రి, నైరుతిలో గరుడాద్రి, వాయవ్యంలో పల్లవ, ఈశాన్య దిక్కున మల్లికార్జున కొండలున్నాయి. వీటితోపాటు 'గద్దెహాళ్ళ గుట్ట', 'వడేరకల్లు గుట్ట', కెంపనాయకుడి దుర్గం', 'బండికల్ గుట్ట' మొదలైన చిన్న గుట్టలున్నాయి. ఈ చిన్న కొండలకు సంబంధించి కూడా కుతూహలకరమైన ఐతిహ్యాలున్నాయి.

గోపాలస్వామి కొండ పౌరాణికంగా, ఐతిహాసికంగా సాహిత్యపరంగా మహత్వపూర్ణమైంది. భవిష్యోత్తర పురాణంలో చెప్పబడిన పౌరాణిక నేపథ్యం ఇలా ఉంది - అగస్త్యుడు వింధ్యపర్వతం పెరుగుదలను ఆపి, దక్షిణ దేశాన్ని పవిత్రం చేయడానికి బయలుదేరాడు. అప్పుడు ఆయన గోపాలస్వామి కొండకు వచ్చి స్వామిని గూర్చి తపస్సు చేసాడు. గోపాలస్వామి ప్రత్యక్షమయ్యాడు. అగస్త్యుడు స్వామిని కమలాచలానికి వచ్చి నిలువవలసిందిగా కోరాడు. ఆ కోరిక ననుసరించి గోపాలస్వామి రుక్మిణీ సత్యభామలతో కలసివచ్చి ఇక్కడ ఉండిపోయాడు. అగస్త్యుడు ఉత్తరం వైపునుంచి వచ్చేటప్పుడు పుణ్యనది, పుణ్యవృక్షం, పుణ్యారణ్యం, పుణ్యాశ్రమం మొదలైన పుణ్యకరమైన వస్తువుల్ని కమలాచలానికి తీసికొని వచ్చాడు. శ్రేష్ఠులైన ఋషులందరూ ఇక్కడకు వచ్చారు. కమలాచలానికి ఆగ్నేయంలో కౌండిన్యఋషి నివసించాడు. దీనివల్ల ఆశ్రమంలో ఒక నది పుట్టింది. అది అటుతరువాత 'కౌండిన్య నది' అనే పేరుతో గుండలుపేట తాలూకాలోని కొంత భాగాన్ని సస్యశ్యామలం

చేసింది. ఈ కొండకు దక్షిణ దిక్కులో జమదగ్ని, నైరుతిలో భృగువు, పశ్చిమాన కపిలుడు, వాయవ్యంలో కణ్వుడు. ఉత్తరంలో విశ్వామిత్రుడు ఈశాన్యాన కశ్యపుడు, తూర్పున మాండవ్యఋషి, మొదలైన ఋషుల ఆశ్రమాలు ఉండేవని పురాణాల్లో చెప్పబడింది. హంసతీర్థంపైన వుండే గుహలో అగస్త్యుడు తపస్సు చేశాడనే నమ్మకం ఒకటుంది. ఇలాగే పురాణకర్తలు అగస్త్యుడు స్థాపించినట్టుగా చెప్పి గోపాలస్వామి కొండకు దివ్యత్వాన్ని కల్పించారు. కాని నిజానికి గోపాలస్వామి ప్రతిష్ఠాపన మాధవ దండనాయకుడు కావించాడు. ఇతడు క్రీ.శ. 1315లో గోపాలస్వామిని ప్రతిష్ఠించి ఆదేవుని "అంగరంగభోగానికి తిరువళి ఆటకు బల్లాళ దేవరాజు వద్దనుండి 'కుడుగణ' గ్రామంలోని 'కణ్ణవగాల' స్వీకరించాడని శాసనాలు నిరూపిస్తున్నాయి. గోపాలస్వామి దేవస్థానానికి చారిత్రకంగా 700 సంవత్సరాల ప్రాచీనత ఉంది.

గోపాలస్వామి దేవాలయం చుట్టూ అనేక తీర్థాలున్నాయి. వాటిలో హంసతీర్థం, బభ్రుతీర్థం, శంఖతీర్థం, చక్రతీర్థం, గదాతీర్థం, పద్మతీర్థం, శార్‌జ్ఞతీర్థం, వనమాలికా తీర్థం అనే అష్ట తీర్థాలు ప్రసిద్ధాలు. ప్రతి ఒకతీర్థానికి పురాణాలలో కథలున్నాయి. ఈ కథలు ఆయా తీర్థాల మహిమను తెలపడమే కాకుండా విష్ణు పారమ్యాన్ని కూడా వివరిస్తాయి. దేవాలయం యొక్క తూర్పున సుమారు అర్ధమైలు దూరంలో హంసతీర్థం ఉంది. దీంట్లో మునిగిన కాకులు హంసలై బయటకు రావడంవల్ల ఇది హంసతీర్థం అయింది. బభ్రువు అనే బ్రాహ్మణుడు తన కుష్ఠురోగాన్ని ఇక్కడ స్నానం చేసి పరిహరించుకున్న తీర్థమే బభ్రుతీర్థం. ఇది దేవాలయానికి ఆగ్నేయంలో ఉంది. గోపాలస్వామి తన శంఖాన్ని, గదనూ పెట్టిన ప్రదేశాలే శంఖతీర్థం, గదా తీర్థాలుగా మారాయి. శంఖతీర్థం దేవాలయానికి దక్షిణంగా ఉంది. ఇక్కడ స్నానం చేస్తే పిశాచత్వం తొలగిపోతుందనే నమ్మకం ఉంది. దేవాలయం పశ్చిమ భాగాన గదాతీర్థం ఉంది. కాంభోజరాయల కొడుకు ఇక్కడ స్నానం చేసి, పోగొట్టుకున్న తనరాజ్యాన్ని మళ్ళీ పొందాడని పురాణకథ ఒకటుంది, వాయవ్యదిశలో పద్మతీర్థం ఉంది. ఇందులో స్నానం చేసిన దరిద్ర బ్రాహ్మణుడికి ఐశ్వర్య ప్రాప్తి అయినట్టుగా కథలున్నాయి. దేవాలయానికి ఉత్తరాన శార్‌జ్ఞ తీర్థం ఉంది. శృంగారి అనే గంధర్వకన్య, పాతాళ లోకపు నాగరాజు దీనిలో మునిగి ఇష్టార్థాన్ని పొందారు. ఈశాన్య దిక్కున ఉన్న వనమాలికా తీర్థంలో స్నానంచేస్తే పాపం నాశనమవుతుందన్న వివరాలు ఉన్నాయి. ఈ అష్ట తీర్థాలే కాకుండా గోపాలస్వామి కొండపైన తొట్లుతీర్థం, పానకాల కొలను మొదలైన 77

తీర్థాలున్నాయి. సంతానం లేనివారు తొట్లు తీర్థంలో స్నానం చేస్తే సంతానాన్ని పొందుతారని ప్రతీతి. ఈ ఆధారాన్ని మూలంగా తీసుకుని గోపాలస్వామిని 'సంతాన గోపాలస్వామి' అనికూడా పిలుస్తారు. ఇలాగే ఇక్కడ వున్న తీర్థాలకు భావుకుల కొన్ని కథలను ఆరోపించారు. జనులలో భక్తిభావాన్ని కలిగించారు.

ఇక్కడున్న ముఖ్యదేవాలయం వేణుగోపాలస్వామిది. ఇది అష్టతీర్థాల మధ్య నిర్మాణం అయింది. శిల్ప రచనలో ఈ దేవాలయం ఆరంభాన హొయసల వాస్తు శిల్పాన్ని అనుకరించి అటు తరువాత విజయనగర వాస్తుశిల్ప ప్రభావానికి లోనయినట్లు కనబడుతుంది. అందువల్ల హొయసల, విజయనగర శిల్ప మాదిరులు రెంటిని ఇక్కడ గుర్తించవచ్చు. గోపాలస్వామి దేవాలయం భద్రమైన కట్టడాన్ని పొంది ఉంది, చుట్టూ ప్రాకారం ఉంది. దేవాలయం లోపలగర్భగుడి, "శుకనాసి" (గర్భగుడి ముందరిభాగం) 'నవరంగం' (దేవాలయ సభామంటపం) ఉన్నాయి. ఈ నవరంగానికి కుడివైపు ఏనుగు ఆకారంలో ఉన్న గూట్లో సుగ్రీవుడి మూర్తి ఉంది. దీని సమీపాన ఒక చిన్న గుడి ఉంది. గుడిలోపల రామానుజాచార్యుడు, అగస్త్యుల విగ్రహాలున్నాయి. ప్రాకారంలో చీకటి చుట్టిన మంటపం ఉంది. శుకనాసిని ప్రవేశించే ద్వారంలో జయవిజయుల విగ్రహాలున్నాయి. గర్భగుడి లోపల అష్టదళాల పీఠంపైన శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహం ఉంది. వేణుగోపాలుడు అనే పేరుకు అన్వర్థం అయేటట్లుగా ఆవిగ్రహ భంగిమ కనిపిస్తుంది. మురళిని పట్టుకుని నిలుచున్న గోపాలుని విగ్రహం చాలా సుందరంగా ఉంటుంది. ఈ విగ్రహం ఎత్తు ఆరు అడుగులు, వేణుగోపాలుని మూర్తికి ఎడమప్రక్క రుక్మిణి, సత్యభామ మరియు గోవుల విగ్రహాలున్నాయి. దేవాలయం ముందు భాగంలో రాతితో చెక్కిన బృందావనం, ధ్వజస్తంభం బలిపీఠం ఉన్నాయి. ధ్వజస్తంభంలో శంఖ - చక్రాలు, గరుడ - ఆంజనేయుల చిత్రాలు మలచబడ్డాయి. మొత్తానికి గోపాలస్వామి దేవాలయం వైష్ణవ సంప్రదాయానికి అనుగుణంగా కట్టబడింది.

గోపాలస్వామి కొండకు సంబంధించిన కొన్ని ఇతర చిన్న చిన్న దేవాలయాలు కూడా ఉన్నాయి. అవి వీరశైవ ధర్మ ప్రభావంతో నిర్మాణమైనట్లుగా తోస్తుంది. గదాతీర్థం సమీపాన 'కణివె (లోయ) మల్లేశ్వరు' ని గుడి ఉంది. ఇది గార ఇటుకల కట్టడాన్ని కలిగి ఉంది. చిన్నదైన గర్భగుడి లోపల కణివె మల్లేశ్వరుని లింగం ఉంది. ఈ లింగం దగ్గర మరొక చిన్నలింగం కనిపిస్తుంది. ఇది ఒక స్వామిదని స్థలకథ చెప్తోంది. గోపాలస్వామి కొండకు లోపలగా 'కుణగహళ్ళి' వద్ద 'కబ్బిన కోలయ్య'గారి మఠం ఉంది. మునుపు కబ్బిన కోలయ్య అనే

స్వామి, గోపాలస్వామి కొండకు వెళ్ళే యాత్రికులకు గంజికాచి పోసేవాడని స్థలీయమూలాలు నిరూపిస్తున్నాయి, మఠానికి సమీపంలో ఉన్న కొలనును 'గంజికొలను' అని పిలుస్తారు. కొండకువెళ్ళే మార్గంలో హనుమంతుండి గుడి ఉంది. కొంచెం ముందుకు అడుగువేస్తే నందికేశ్వరదేవాలయం కనిపిస్తుంది. కోటద్వారం దగ్గర భైరవుడి దేవాలయం ఉంది, ఈకొండకు వచ్చిన యాత్రికులు భైరవుడి దర్శనం చేయకపోతే యాత్రాఫలం దొరకదని ప్రతీతి.

గోపాలస్వామి కొండపైనున్న దేవాలయాలకు సంబంధించిన తేరు ఉత్సవాలు నడుస్తూ ఉంటాయి. వేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం అష్టతీర్థోత్సవం, దీపోత్సవం, ధనుర్మాస పూజ, మకరసంక్రమణ అభిషేకోత్సవాలు జరుగుతాయి. సంవత్సరానికి ఒకమారు ఫాల్గుణ బహుళ ఏకాదశినాడు, శ్రవణ నక్షత్ర దినాన వేణుగోపాలస్వామి రథోత్సవం గోపాలపురగ్రామస్థుల సహకారంతో నెరవేరుతుంది. ఈ సందర్భంలో ఈ కొండపై గల కోటలోని రాజవంశస్థులు ఇందులో పాల్గొంటారు. గోపాలస్వామి దేవాలయ పూజా పునస్కారాలు పాంచరాత్ర సంప్రదాయానికి అనుగుణంగా ఉంటాయి.

గోపాలస్వామి కొండ ఐతిహాసికంగా 'బెట్టదకోట' (కొండపైగల కోట)గా ప్రసిద్ధి చెందింది. ఒకానొక కాలంలో 'బెట్టదకోట' రాజ్యవైభంతో తులతూగింది. గత జీవన వైభవానికి సాక్షిగా ఇప్పటికి కూడా కోట అవశేషాలున్నాయి. 'బెట్టదకోట కైఫీయత్తు', 'బెట్టదకోట వంశావళుల' ద్వారా ఇక్కడి రాజకుటుంబాలను గురించిన కొన్ని విశేషాలు దొరికాయి. బెట్టదకోట రాజవంశపు మూల పురుషులు హొయసల డణాయకులు. బల్లాళ రాజుల ఆశ్రితులైన డణాయకులు హొయసలరాజుల ఆశ్రయంలో కొన్ని రాజ్యాలను పాలించేవారు. కేశవ డణాయకుడు నాగపురి (హెడతలె)ని రాజధానిగా చేసికొని సుమారు క్రీ.శ. 1270లో ఉన్నట్లు తెలియవస్తోంది. ఈతని తరువాత వచ్చినవాడు మాధవ డణాయకుడు. మాధవ డణాయకుని కొడుకు పెరుమాళు డణాయకుడు. ఇతడు స్త్రీలోలుడై రాజ్యాన్ని కోల్పోయి దక్షిణాభిముఖంగా వెళ్ళి గోపాలస్వామి కొండకు వచ్చాడు. ఆరోజు రాత్రి గోపాలస్వామి అతనికి కలలో కనిపించి ఈ కొండని ఈశాన్యదిక్కునుంచి ఆరోహణం చెయ్యమని చెప్పినట్లు స్థలకథలున్నాయి. అలాగే అతడు మరుసటిరోజు కొండను ఎక్కగా

శివయోగి ఒకడు కనబడి ఈ కొండ మహిమను చెప్పి అక్కడున్న తీర్థాలను, సిద్ధరస బావి మొదలైన వాటిని చూపించాడు. పెరుమాళ్ళ డణాయకుడు అక్కడే ఉండిపోయాడు. రససిద్ధితో ఇనుమును బంగారంగా చేసి, పొందిన ఐశ్వర్యంతో "ఏళుసుత్తినకోట" (ఏడు ప్రాకారాల కోట), అంతఃపురం మొదలైన వాటిని కట్టించాడు. ఇతడు ప్రజల వద్దనుండి పన్నులకు బదులు ఇనుప ముక్కలను సంగ్రహించి వాటిని బంగారంగా పరివర్తనం గావించేవాడని చెప్పే కథలున్నాయి. ఇప్పటికి కూడా గదాతీర్థం దగ్గర సిద్ధరసపుగని ఉందని నమ్మకమొకటి ఉంది. ఈ కథలోని సత్యాసత్యాలు ఎలా ఉన్నా డణాయకుని కాలంలో ఇక్కడి కోట, అంతఃపుర నిర్మాణ మయ్యాయని తెలియవస్తోంది. పెరుమాళు డణాయకుడు - గోవింద డణాయకుడు, మంచణ్ణ డణాయకుడు మొదలైన తొమ్మిదిమంది సహోదరులతో రాజ్యాన్ని నిర్విహించేవాడు. ఇది ఒకఘట్టం, అటుతరువాత ఈ రాజవంశం అంతరించింది. ఇంక రెండోఘట్టం ఇలా ఉంది - డణాయకుడి కూతురికీ శివన సముద్రపు రాజు కొడుక్కీ వివాహం ఏర్పాటయింది. శివన సముద్రపు రాజు భార్య డణాయకుడి సోదరి 'సుగ్గవ్వె'. ఇలా ఈ రెండు కుటుంబాల వారికీ బాంధవ్యం ఉన్నప్పటికీ రాజకీయ కారణంగా ఆ కుటుంబాల మధ్య వైషమ్యం ఉండేది. పెళ్ళి భోజనంలో వియ్యాలవారికి ఒడియాలు వడ్డించలేదన్న సంగతిని నెపంగా తీసుకుని శివన సముద్రపు రాజులు కయ్యానికి కాలుదువ్వారు. ఇది వారిద్దరి మధ్య యుద్ధానికి నాందిగా మారింది. ఈ యుద్ధంలో మంచణ్ణ డణాయకుడు ఒక కందకంలో పడి చనిపోయాడు. భండాగారం శత్రువశమయింది. దీనిని చూస్తూవున్న సుగ్గవ్వె తన తండ్రి ఇల్లు నాశనమయినందుకు దుఃఖించి, కొండ సమీపంలో ఉన్న కొలనులో స్నానం చేసి అగ్నికి ఆహుతి అయిపోయింది. అప్పటి యుద్ధానికి గుర్తుగా సుగ్గవ్వ కొలను, డణాయకుని కమరి (కందకం), హంజి ముదుకమ్మ గుడి, ఇప్పటికీ బెట్టదకోటలో ఉన్నాయి. పత్తి (ఏకులు) వడుకుతున్న ముసలమ్మ ఒకతె ఈ భయంకర యుద్ధాన్ని చూసి రాయిలా నిలబడిపోయిందట. ఆ చోటే ఇప్పుడు హంజి(పత్తి) ముసలమ్మ గుడిగా మారిందన్న నమ్మకం ప్రచలితమయింది. ఈ యుద్ధం అయిన తరువాత కొన్ని కారణాల వల్ల డణాయకుని కుటుంబంవారు నాగపుర (హెడతలె), సింగపట్టణ (పిరియపట్టణ), కెరగూడు, నీలగిరి మొదలైన దిక్కులకు చెదిరి పోయినట్లుగా అనిపిస్తుంది. బెట్టదకోట వంశావళిలో చెప్పబడిన దానికి శాసనాల్లో నిరూపితమైన డణాయకుని వంశావళికి కొన్ని వ్యత్యాసాలు కనిపిస్తాయి. శాసనాల ప్రకారం డణాయకుని వంశావళి ఈ ప్రకారంగా ఉంది.

పెరుమాళదేవ దండనాయకుడు

మాధవ దండనాయకుడు

కేతయ దండనాయకుడు   భరతజీయ దండనాయకుడు

కాలాంతరాన బెట్టదకోట మైసూరురాజుల ప్రాబల్యంతో మైసూరు దొరల నాయకత్వంలోనికి వచ్చిచేరింది. క్రీ.శ. 1504వ సంవత్సరానికి చెందిన నంజనగూడు శాసనంలో ఆకాలంలో బెట్టదకోటను పరిపాలించిన రాజులను గూర్చి ఉల్లేఖింపబడింది. దానిలో ఇమ్మడిరాజ ఒడయార్ - నంజరాజ ఒడయార్ (1489) - దేవరాజ ఒడయార్ (1503) - గోపణ్ణ ఒడయార్ (1504) - ఈ ప్రకారంగా వంశక్రమం కొనసాగింది. బెట్టదకోటకు - మైసూరు రాజకుటుంబల వారికి మధ్యగల మైత్రి మధురంగా ఉండేది. 'బెట్టదకోట' రాజవంశపు పెరుగుదల ఆ వంశలోని ఆడపిల్లల వల్లే ఎక్కువగా జరిగిందని చెప్పాలి. మైసూరు రాజవంశంలో కుమారులు కలుగకపోతే బెట్టదకోట కుటుంబంనుంచి దత్తును స్వీకరించేవారు. నవరాత్రుల్లో మైసూరు రాజప్రాసాదంలో ఆయుధ పూజను చేసి బెట్టదకోట రాజులు ఆయుధాలను వారికి ఇచ్చేవారు. అలాగే మైసూరు రాజు సింహాసనాన్ని అధిష్ఠించేటప్పుడు బెట్టదకోట రాజులు చేయూతనిచ్చేవారు. ఇలాగే బెట్టదకోట రాజులకు మైసూరు రాజప్రాసాదంలో గౌరవయుతమైన స్థానం ఉండేది.

బెట్టదకోట వంశంలో సాహసమయమైన వ్యక్తిత్వానికి కొరతలేదు. మైసూరు రాజ్యానికి అపాయకరమైన పరిస్థితులు ఎదురైనప్పుడల్లా బెట్టదకోట వంశంవారు వారికి అండగా నిలిచి వారిని ఆపదనుంచి కాపాడేవారు. మైసూరు రాజ్యాన్ని రక్షించిన వారిలో బెట్టదకోట కత్తి గోపాలరాజ అరసు ముఖ్యుడు. ఇతడు హైదర్, టిప్పుల చేసిన కుట్రను పసిగట్టి మైసూరురాజ్యాన్ని రక్షించడానికి ధైర్యంతో పోరాడాడు. కత్తిగోపాలరాజ అరసు భార్య కొత్తగాలద కృష్ణయ్య గారి కూతురైన చందాజమ్మణ్ణి, వీరి కుమార్తె ఒకటవ లక్ష్మణ్ణిని మైసూరు ఇమ్మడి కృష్ణరాజ ఒడయరి కిచ్చి వివాహం చేసారు. మైసూరు రాజ్యాన్ని రక్షించిన వారిలో ఈమెది కూడా ఒక ప్రముఖపాత్ర. మొత్తానికి మైసూరు రాజ్యపు రాజకీయ చరిత్రకు బెట్టదకోట రాజులు గమనార్హమైన కానుకను ఇచ్చారు.

గోపాలస్వామి కొండ భావుకులకు భక్తికి కేంద్రమైనట్టు, కవులకు స్ఫూర్తి నిచ్చే తావుగా సాహిత్యంలో కూడా ప్రసిద్ధిని పొందింది. సంస్కృతిలోని భవిష్యోత్తర పురాణం తీర్థకాండలో వచ్చే గోపాలస్వామిపర్వతమాహాత్మ్యాన్ని ఆధారంగా తీసుకుని "చికుపాధ్యాయుడు" కన్నడంలో చంపూ ఛందస్సులో "కమలాచల మాహాత్మ్యాన్ని" రచించాడు. ఇతడి కాలం క్రీ.శ. 1672. ఈ కృతిలో కమలాచల మహిమతో పాటు ఇతర విషయాలు కూడా నిరూపించబడ్డాయి. కృత్యారంభంలో "బెట్టద చామరాజ ఒడయరు" నుండి "చికదేవ భూపతి" వరకు గల రాజవంశావళి చెప్పబడింది. రెండవ ఆశ్వాసంతో రాజలక్షణాలు, రాజధర్మాలు, సప్తాంగ భేదాలు మొదలైన వివరాలున్నాయి. కమలాచలం యొక్క వర్ణన మూడవ ఆశ్వాసం నుంచి కనుపిస్తుంది. ఈ కొండకు సంబంధించిన వైష్ణవ సంప్రదాయ కథలు, కల్పనలు ఇందులో ఉన్నాయి. ఈ కావ్యం అష్టాదశ వర్ణనలతో కూడి సాంప్రదాయకంగా ఉంది.

చికుపాధ్యాయుని తరువాత బెట్టదకోట కత్తి గోపాలరాజుఅరసు కమలాచల మాహాత్మ్యాన్ని రచించాడు. సంస్కృత భవిష్యోత్తర పురాణాన్ని ఆధారంగా తీసికొని ఇది గద్యంలో రచింపబడింది. ఇందులో 10 అధ్యాయాలున్నాయి. అనావశ్యకమైన వర్ణనలు కనుపించవు. ఈ కొండ మాహాత్మ్యాన్ని చాటే అనేక కథలు ఇందులో చేరి ఉండడంవల్ల ఈ కృతి కథాకోశంగా కూడా రజింపచేయగలదు.

పండిత కె.సి నంజుండారాధ్యగారు 1946లో "శ్రీ కమలాచల నామక శ్రీ దక్షిణ గోవర్ధనగిరి అను శ్రీహివద్గోపాలస్వామి కొండమహిమ" అనే గద్య గ్రంథాన్ని రచించారు. ఈయన గోపాలస్వామి కొండకు సంబంధించిన పాత కన్నడ కావ్యాలు. ఐతిహాసిక మైన దాఖలాలు, స్థానిక గాథలు, జానపదాలు మొదలైన మూలలనుండి విషయాలను సేకరించి తన పుస్తకాన్ని సిద్ధంచేసాడు. కొండపైనున్న ఆశ్రమాలు, నదులు, అరణ్యాలు, దేవాలయాలు, అక్కడ జరిగే ఉత్సవాలు, పూజలు, దేవునియొక్క ఆభరణాలు, అర్చక వర్గం, వీటన్నిటి సమగ్రవివరణ ఇందులో ఇవ్వబడింది. ఈ కృతి గోపాలస్వామి కొండ గూర్చిన మంచి 'కైపిడి' (Hand Book) వలె ఉపయోగపడుతుంది.

ఈ వరకే చెప్పినట్లు గోపాలస్వామి కొండ నిసర్గ సౌందర్యానికి ప్రసిద్ధికెక్కింది. ఈ కొండను దూరంనుంచి చూస్తే అది ఆకాశాన్నంటుతున్నట్లుగా భాసిస్తుంది. ఈ కొండ మీద

కూర్చున్నవారికి మనోహరమైన దృశ్యాలు కన్నులముందు తిరుగాడుతాయి. మంచునుండి విడివడ్డ 'వైనాడు' 'మైసూరు' నగరాల సుందర దృశ్యాలు మన మనసును కట్టివేస్తాయి. వేసవి కాలంలో హితకరమైన గాలి వీస్తుంది. ప్రయాణికులు బస చేయడానికి వేణులాడ్జి ఉంది. గోపాలస్వామి కొండ నిసర్గ సౌందర్యానికి భక్తి భావానికి సంగమమైనప్పటికీ, యాత్రికులను అధిక సంఖ్యలో ఆకర్షించటంలేదు. అక్కడ ఉన్న అననుకూలతే ఇందుకు గల కారణమని చెప్పవచ్చు. ఈ ప్రదేశంలో ఉన్న క్రూరమృగాల నుంచి యాత్రికులకు రక్షణ కల్పించాలి. వసతి సౌకర్యాలను పెంచాలి. సంవత్సరంలో ఎప్పుడైనా సరే ఇక్కడకు వచ్చి పోవడానికి నిర్భయమైన వాతావరణం ఏర్పాడాలి. ఇలాంటి విషయాలపట్ల శ్రద్ధ వహిస్తే గోపాలస్వామికొండను చక్కని పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేయవచ్చు.

అనుబంధము - 4

కీ.శే. కౌతా సూర్యనారాయణరావుగారు
(1877-1964)

కీ.శే. కౌతా సూర్యనారయణరావుగారు

(1877-1964)

కౌతాసూర్యనారాయణరావుగారు పేరొందిన ఒక పారిశ్రామిక ప్రముఖుడు; 'స్వధర్మ స్వారాజ్య సంఘ' స్థాపకుడు.

గుంటూరుజిల్లా కొండవీడు గ్రామములో ఒక సామాన్య వైదిక బ్రాహ్మణ కుటుంబమున 1877లో కౌతా సూర్యనారాయణరావుగారు జన్మించెను. ఆయన విద్యాభ్యాసము నరసాపురములో సాగినది. అనంతరము విజయవాడలో మొదట అల్పారంభముగానే తన వాణిజ్య కార్యకలాపముల కంకురార్పణచేసి, అనతికాలములోనే ఆ రంగములో అత్యున్నత శిఖరమును అందుకొనెను. 1922లో మద్రాసులోని 'బీహైవ్ ఫౌండ్రి ఇంజనీరింగ్ వర్క్స్', 1935లో 'ఎక్సెల్సియర్ ఆయిల్ మిల్స్', 1945లో రామవరపుపాడులో 'కౌతా బిజినెస్ సిండికేట్ లిమిటెడ్', 1948లో చెన్నరాజధానిలోని మొట్టమొదటిసారిగా ఎలక్ట్రిక్ ఫర్నేస్‌ను వాడిన 'కౌతాస్టీల్ ప్రోడక్ట్స్' నెల కొల్పబడినవి. సికింద్రాబాద్‌లో కూడా ఒక 'స్వారాజ్య ప్రింటింగ్ వర్క్స్'ను, 'బీహైవ్ ఇంజనీరింగ్ అండ్ అలైడ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్' ను ఆయన స్థాపించెను.

'సౌత్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' లో అనేక సంవత్సరముల పాటు కౌతా సూర్యనారాయణరావుగారు సభ్యుడుగా ఉండెను. 'ఆంధ్రఛాంబర్ ఆఫ్ కామర్స్' ఉపాధ్యక్షుడుగాను, 'ఇండియన్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్'కు గవర్నింగ్ డైరెక్టరుగాను, 'హిందూస్థాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' వంటి పలు సంస్థలలో యావజ్జీవ సభ్యుడుగాను ఉండెను.

ధన సంపాదనకు ఒక వంక పారిశ్రామిక సంస్థలను స్థాపించుచునే మరొకవంక ఆర్జించిన ధనమును సత్కార్యములకై వెచ్చించుటకు పలు ధర్మసంస్థలనుకూడ ఆయన నెలకొల్పుచుండెను. భారతీయ ప్రాచీన

సంస్కృతి సర్వతోముఖ సంరక్షణము లక్ష్యముగా 'స్వధర్మ స్వారాజ్య సంఘము' ను ఆయన స్థాపించెను. విజయవాడలో బహిరంగ సభలను జరుపుకొనుటకు వీలుగా ఒక పబ్లిక్ హాలును కట్టించెను. ఏటేట దేవీ నవరాత్రములకు వేదవేత్తల సదస్సులను నిర్వహించి విద్వాంసులను సత్కరించుటకు ఆయన 1892లో ప్రారంభించిన ఆచారము ఈనాటికిని నిర్విఘ్నముగా కొనసాగుచున్నది. (వారి దౌహిత్రులైన శ్రీ బి.వి.యస్.యస్. మణిగారు నేటికిని దీనిని నిర్వహించుచున్నారు. 1992 అక్టోబరు 7వ తేదిని శ్రీదేవీ శరన్నవరాత్రి వేదశాస్త్రసభల శతవార్షికోత్సవములు కూడ వీరిచే అద్భుతముగా నిర్వహింపబడినవి).

స్వధర్మ స్వారాజ్య సంఘ యాజమాన్యములో ప్రస్తుతము వేదవేదాంగములలోను, ఆయుర్వేదము, సంగీతము, అర్థశాస్త్రములతో సహా 18 భారతీయ శాస్త్ర శాఖలలోను శిక్షణ ఇచ్చి, పట్టప్రదానముచేయు ఒక వేద విశ్వవిద్యాలయము సికింద్రాబాదులో నడుపబడుచున్నది. శ్రీ కొతావారు విజయవాడలో స్థాపించిన వేదశాస్త్రసభ ఇప్పటికి సుమారు 500 మంది వేదాధ్యేతలు తయారగుటకు దోహదము చేసినది.

తాను స్థాపించిన వివిధ ధర్మసంస్థలలో నేటికిని సజీవుడై ఉన్న ధన్యజీవి శ్రీకొతా 88 ఏళ్ల పూర్ణాయుర్దాయము జీవించి 1964లో ప్రశాంతముగ దేహయాత్ర చాలించెను.

- బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

(విజ్ఞాన సర్వస్వము, రెండవ సంపుటము
తెలుగు సంస్కృతి-2, పుటలు 829-830)

అనుబంధము - 5

స్వధర్మ స్వారాజ్య సంఘము

SWADHARMA SWAARAJYA SANGHA

Regd. Office: Beehive Buildings, 29 Broadway
Madras 600108

Founder
SRI KOWTHA SURYANARAYANA RAO

"Through the grace of Bhagavan Sri Krishna the business flourished and all the wealth I earned and accumulated from my business of half a century I have held and possessed as belonging to Bhagavan Sri Krishna to be disposed of as guided by him"

(-Excerpt from his Will)

SRI KOWTHA SURYANARAYANA RAO along with some of his business friends, Veda Sastra Scholars and Heads of Religious Mutts has started the **SWADHARMA SWAARAJYA SANGHA** in the year 1930. The basic idea was that any person belonging to any religion who carries out the ordained duties of such a religion will be able to attain eternal bliss and freedom from the shackles of the mundane affairs.

All the religious and philanthropic activities of Sri Kowtha Suryanarayana Rao were handed over to the Sangha in the year 1942, the year of the death of his wife. He wanted to institutionalise his activities to give them a permanent stature. While doing so, scope was given to his family members.

The Sangha was licensed by the Government of India and was recognised as on institution for the spread of Education, Religious practices, traditional Indian culture and to be of service to the community at large, the benefits accruing to those in need of Sangha's benevolence to all communities.

The Sangha has established Veda, Sastra and Smartha Pathasala of Secunderabad choosing senior learned pandits to administer. Sangha has given them all facilities so as to make them lead a comfortable and purposeful life.

The Sangha has libraries both at the Registered office at Madras and Secunderabad covering various subjects. A community hall and a Kalyana Mandapam to cater especially to the needs of the middle class are functioning at Secunderabad. Also there is a Printing Press to earn and supplement the income of Sangha for its activities.

The International Neo Platonic Conference in the year 1974 was organised and hosted by Sangha in addition to its five Annual Conferences.

The Darshana International with an editorial Board comprising Internationally reputed Scholars is also supported by the Sangha for the last thirty years.

Rare books as well as other works to improve and subscribe to the development of culture were also printed and published. Bodhayana Srouta Sutras, Istha Siddhi are rare and eminent titles brought out by the Sangha. In collaboration with the American Institute of Indian Studies a treatise on Poorva Meemamsa edited by eminent scholars is under print and is being published by the Oxford and Prinstene Universities. Sangha is a co-publisher with the American Institute of Indian Studies for the book 'Perceptions of India's Visual Past'.

A Sathari in Silver was presented to Sri Venkateswara Temp!e at Louis Vella in U.S.A.

For the last three years Sangha has been providing scholarships under the Telugu Language Programme Scheme wherein one American a year studies Telugu in India and carries the title Sri K.S.Rao Fellow. Michael Katten, Goldman and Andrey are the three Sri K.S. Rao Fellows.

More than one thousand five hundred Vedic and Sastra scholars have gone through the portals of the Sangha Sabhas after exhibiting their talents.

In the process of selecting the pandits for the Nitya Veda Parayana, the holders of the certificates issued by the Sangha were the first to be recognised and selected by the Tirumala Tirupathi Devasthanams.

The Sangha is financially self sufficient, courtesy to the rare and great munificence of Sri Kowtha Suryanarayana Rao

and some of his family members. The centenary year of the Sabha was celebrated in 1992 at vijayawada.

Sri Devi Sarannavaratri Veda Sastra Sabha was founded by Sri Kowtha Suryanarayana Rao in 1892. In order to encourage Vedic Studies he established the practice of honouring Vedic Scholars during the Nine Day Festival of Dasara. This tradition has been continuing unhindered for the last hundred years. About 1500 Vedic Scholars adopt in Vedas, Vedangas, Vedanta and other allied subjects have so far been honoured by the Sabha during the Dasara Festivals.

Sri Kowtha's thirst for promotion of the Bharatiya culture did not stop there. So, he founded the Swadharma Swaarajya Sangha to preserve, promote and propagate the ideals of our rich tradition and great culture. The Sangha started Institutions at Secunderabad to impart training in Vedas and allied subjects. Degrees in 18 branches of learning have been conferred by the Institute.

Among many of its activities in this direction, the Sangha provides financial assistance to publication of works of excellence reflecting the culture and heritage of our country. Scholarships to poor and deserving have also been given. The Sangha is also known internationally for its endeavour in promotion of arts and literature.

.....Sri Kowtha Suryanarayana Rao has institutionalised his business, Charitable interests and avocations, to give a permanency to them. Sri B.V.S.S. Mani, grandson (daughter's son) of Sri Kowtha, trained by him to run the institutions as per cherished ideals is now following the path laid down by Sri Kowtha.

అనుబంధము - 6

శ్రీ బి.వి.ఎస్.ఎస్. మణిగారి జీవనరేఖలు

శ్రీ బి.వి.ఎస్.ఎస్. మణి గారి జీవనరేఖలు

1. పూర్తిపేరు	:	శ్రీ బులుసు వెంకట సూర్య సుబ్రహ్మణ్యం
2. పుట్టినతేదీ-ఊరు	:	25-10-1927, బెజవాడ (విజయవాడ)
3. తల్లిదండ్రులు	:	శ్రీమతి ప్రేమేశ్వరి, శ్రీ బులుసు రామలింగేశ్వరుడు
4. స్వగ్రామం	:	గంగలకుఱ్ఱు, తూర్పుగోదావరి జిల్లా
5. విద్యాభ్యాసం	:	బెజవాడ, మద్రాసు
6. గురువులు	:	తండ్రి, మాతామహుడు (శ్రీ కౌతా సూర్యనారాయణరావు)
7. వృత్తి	:	వ్యాపారం
8. అభిరుచి	:	ప్రాచీన సాహిత్యాధ్యయనం
9. సంసారం	:	భార్య : శ్రీమతి లలితారత్నం (మేనరికం)

సంతానం :

(1) కూతురు : వెంకట సుబ్బలక్ష్మి

(2) కొడుకు : వెంకట సూర్యలలితాకృష్ణకిశోర్

(3) కూతురు : భువనేశ్వరి

(4) కొడుకు : వెంకట కోదండరామలింగేశ్వరుడు

(5) కూతురు : మాధవి

(6) కూతురు : త్రిపురసుందరి

BIO-DATA OF SRI B.V.S.S. MANI

Sri B.V.S.S. Mani was born in the year 1927 at Vijayawada, and was educated at Vijayawada and Madras. He had training in commercial subjects, Mechanical Engineering etc., after initial schooling. He joined the family business in 1948 by name M/S Indian Commerce & Industries Company (Pvt.) Ltd., Madras as an apprentice and in 1970 he became the Managing Director of M/s Indian Commerce & Industries Company (Pvt) Ltd., Madras which post he held until 1981. He is the promoter and Director of M/s Electro Photonics India (Pvt.) Ltd., Hyderabad which manufactures sophisticated equipment for Defence authorities, and overhead projectors. He was also a Director of M/s Madras Oxygen & Acetylene Ltd., a public limited company in Madras. He is the Director of M/s Swadharma Swaarajya Sangha (Orthodox National League) Madras, a charitable and educational Institution.

He is a Senior Rotarian of the Rotary Club of Madras and a Paul Harris Fellow. He is a member of Cosmopolitan Club, Madras; Hyderabad Race Club, Hyderabad; Fateh Maidan Club, Hyderabad; Indian Institute of Foundrymen, Madras; Madras Management Association, Madras; Madras Productivity Council, Madras; Andhra Pradesh Productivity Council, Waltair Club Vizag; and Kodaikanal Golf Club Kodaikanal. He is well versed in Sanskrit and Hindu religious scriptures.

He was the President of M/s Hindustan Chamber of Commerce, Madras for the years 1979 & 1980. He is a member of the Tamil Chamber of Commerce, Madras.

He is the Committee member of M/s Hindustan Chamber of Commerce, Madras; Andhra Chamber of Commerce, Madras;

and State Advisory Board of Commerce Education Madras and a Committee Member of Telephone Advisory Committee, Madras Telephones, Madras and of Madras Literary Society.

He has created an endowment for a chair in Vaishnavism in the University of Madras. Cottages for Pilgrims were built by him at Rameswaram, Varanasi and he created an endowment for an annual lecture on "Advaitha" in Sri Venkateswara University Tirupathi. He is responsible for the re-construction of the Gopuram of Sri Ramalingeswara Temple at Kuchipudi and also Sri Venkateswara Swamy Dwaaram at Amalapuram in East Godavari Dist., A.P.

SRI B.V.S.S. MANI IS AND WAS ALSO CONNECTED WITH THE FOLLOWING CULTURAL & EDUCATIONAL INSTITUTIONS.

President	:	Sri Krishna Gana Sabha, Madras. Sri Sankarabharanam, Madras. Chennapuri, Andhra Maha Sabha (Ex)
Vice-President	:	Chennapuri Andhra Maha Sabha (Ex) Kesari Education Society, Madras. Sanskrit Education Society, Madras. Kalabharathi, Madras. Association for Hindu Dharma, Madras. Kuchipudi Art Academy, Madras Red Cross Society of India, A.P.
Trustee	:	S.I.T.U. Council of Education & Research, Madras. Karpangadu Trust, Madras. Victoria Public Hall, Madras (Ex)

		Kesari Higher Secondary School, Mylapore, Madras.
Committee Member	:	Rasika Ranjani Sabha, Madras (Ex) World Telugu Federation.
Advisory Committee Member	:	Citizens Committee, Madras American Inst. of Indian Studies, Southern Region, Madras. Railway Equipment Advisory Committee. Small Scale Industries Advisory Board.
Life Member	:	Society for Prevention of Cruelty to Animals, Madras. Agri-Horticultural Society, Madras. International Society for Krishna Consciousness. Madras Science Association. Music Academy, Madras. Sri Krishna Gana Sabha, Madras. National Federation of Don Bosco Pupils. Bharatiya Vidya Bhavan. Gaythri Education Society, Madras. Sri Thiagaraja Kala Parshit, Vijayawada. Kuchipudi Art Academy, Vijayawada. Mylapore Academy, Madras.
Honorary Member	:	Kalasagar, Madras. International Society for Neo-Platonic Studies, Wisconsin University, U.S.A.
Patron Member	:	Sankara Bhakta Sabha, Secunderabad. Tamilnadu Acquatic Association, Madras.

		Telugu Brahmana Sabha.
Treasurer	:	Sri Ganapathi Sachidananda Gnana Bodha Sabha, Madras. (Ex)
Dharmadhikari	:	Sri Sringeri Mutt, George Town, Madras.
Managing Trustee	:	Sri Venkateswara Educational & Health Trust.
Ex-Director	:	Lakshmi Granites Ltd., Hyderabad.

* * *

జయ! జయ! జయ! దేవ! దేవ! దేవ!

త్రిభువన మంగళ దివ్య నామధేయ!

జయ! జయ! జయ! బాలకృష్ణ దేవ!

శ్రవణ మనో నయనామృతావ తార!!

* * *

YRKA106B162

శ్రీ కృష్ణ కర్ణామృతము

తెలుగు టీకా తాత్పర్య సహితము

తరుణారుణ కరుణామయ విపులాయత నయనం
కమలాకుచ కలశీభర విపులీకృత పులకమ్
మురళీరవ తరళీకృత మునిమానస నళినం
మమఖేలతి మదచేతసి మధురాధర మమృతమ్.

సంపాదకుడు

ఆచార్య తంగిరాల వేంకట సుబ్బారావు

సుజనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనపత్రిక

పుస్తకం సంఖ్య	YRKA106B162
పుస్తకం పేరు	శ్రీకృష్ణకర్ణామృతము
తారీఖు	13 December 2025
ముందు అట్ట	[illegible]
వెనుక అట్ట	[illegible]
మొత్తం పేజీలు	415
పెద్ద సైజు పేజీలు	[illegible]
ఖాళీ పేజీలు	[illegible]
లేని పేజీలు	[illegible]
తయారు చేసినది	[illegible]
పేజీలు సరిచేసినది	Lavanya
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	anusha
పేజీలు పరిచూసినది	
బైండింగ్ చేసినది	
ప్యాకింగ్ చేసినది	
సంస్థితి	[illegible]